# రెడ్డి వైభవం



సేకరణ
బి. హనుమారెడ్డి





ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒంగోలు జాతి వృషభరాజం

నిలుచుంటే శివుని వాహనం

కూర్చుంటే రెడ్డి లాంఛనం



# రెడ్డిరాజుల రాజలాంఛనం

(ఆధునీకరించబడినది)

**రాజు ఒడ్డోలగ ప్రవేశ ప్రభాసము**

**యుద్ధరంగంలో చెంగలించు సేనా ప్రవాహ ప్రారంభ చిహ్నము**

**రెడ్డిపాలనా శతాబ్దాలకానవాలుగా నాణేలపై మణిరేఖ**

# రెడ్డి వైభవం

సేకరణ : **బి. హనుమారెడ్డి**

ప్రథమ ముద్రణ : 2017

**వెల : రూ. 400/-**

లభించు చోటు :

**రెడ్డి జనాభ్యుదయ సంఘం** రి.నం. : 463/94
కొత్తమామిడి పాలెం
ఒంగోలు, ప్రకాశం జిల్లా - 523 002
సెల్ : 98484 37585

**బి. హనుమారెడ్డి**
అధ్యక్షులు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం
రాజా పానగల్ రోడ్, **ఒంగోలు - 523 002**
సెల్ : 94402 88080

ముఖచిత్రం :
**ఆధునీకరించబడిన రెడ్డి రాజుల రాజలాంఛనం**
**కొండవీటి కోట**

రాజ లాంఛనం ఆధునీకరణ :
కళారత్న **దేవీప్రసాద్**
ప్రజ్ఞా గ్రాఫిక్స్, గుంటూరు
సెల్ : 98664 86595

ముద్రణ :
**శ్రీలక్ష్మీ ప్రెస్**
14/2 అరండల్‌పేట
గుంటూరు - 522002
ఫోన్ : 0863-2230643

రెడ్డి జనాభ్యుదయ సంఘం - ఒంగోలు

# ఒక్కమాట

రెడ్డిజాతికి, రెడ్డికులానికి గల ఘనచరిత్ర చరిత్ర చదివిన వారికి విదితమే. కాని రాబోవు తరాల వారు రెడ్డిజాతి వైభవానిని గురించి సూక్ష్మంగానైనా తెలుసుకొనుటకు వీలుగా ఈ గ్రంథం నిర్మంచబడింది.

చరిత్ర ఎరిగిన కాలం నుండి రెడ్డిజాతి రాజ్యాలనేలింది. శౌర్యప్రతాపాలు చూపింది. ధర్మాన్ని రక్షించింది. కుల–మత సామరస్యంతో సంస్కృతిని – సంప్రదాయాలను కాపాడింది. ప్రజాసంక్షేమం ధ్యేయంగా వర్ధిల్లింది. రెడ్డిజాతి నరనరాన సర్వమానవ సౌభ్రాతృత్వం ప్రవహించింది. ఆ వారసత్వం నేటికినీ రెడ్డిజాతి–రెడ్డికులం కాపాడుకుంటూ వస్తుంది. ఈ వాస్తవానిని నిష్పక్షపాతంగా రాజ్యాల చరిత్రను, సామాజిక పరిణామాలను వీక్షించిన వారెవరైనా గ్రహించగలరు. ఇట్టి వైభవాన్ని నిక్షిప్తం చేసి రేపటి తరాలవారికి మార్గదర్శకత్వం అందించాలనే ఈ పుస్తక ప్రయత్నం.

క్రీ.శ. 13, 14, 15 శతాబ్దాలలో రెడ్డిజాతి రాజ్య పాలన చేసింది. కాలాను గతిలో ఇతర దేశాల వారి పరిపాలన వచ్చింది. ప్రజలే తమ ప్రతినిధుల ద్వారా తమను తాము పాలించిన శతాబ్దాలు గడిచాయి. అన్ని సందర్భాలలోనూ స్వర్ణయుగాలను నిర్మించింది రెడ్డిజాతి.

అంతములేని ఈ భువనమంత చరిత్ర అన్నట్లు ఇప్పటికే ఎందరో ప్రముఖ చరిత్రకారులు రెడ్డిరాజుల చరిత్రను గ్రంథస్తం చేశారు. కనుక అదే చర్విత చరణం కాకుండా అందలి కొంత సమాచారానికి పొడిగింపుగా తదుపరి కాలాల నాటి కొందరు రెడ్డి ప్రముఖుల జీవిత విశేషాలను, వారి త్యాగాలను కలిపి ఈ గ్రంథం ప్రచురించటానికి ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా, ఒంగోలులోని రెడ్డి జనాభ్యుదయ సంఘం తన సంతోష ప్రయత్నాన్ని వెలిబుచ్చి సభ్యులతో చర్చించి ముందుకు సాగింది. అయితే ఎందరు ప్రముఖుల, ఏయే కాలాల ప్రముఖుల జీవిత విశేషాలను పొందుపరచాలన్న ప్రశ్న వచ్చినపుడు స్వర్గస్తులైన రెడ్డి ప్రముఖుల జీవిత విశేషాలను అందునా ప్రజాజీవితం గడిపిన వారు మరియు వారివారి రంగాలలో గణనలోకి వచ్చిన కొందరి గురించి పేర్కొనుట వలన భిన్నాభిప్రాయాలు లేకుండా విషయ సేకరణలో

ఒక అంతు–పొంతు చేకూర్చవచ్చునన్న తలంపుకు సంఘం వచ్చింది. ఆ ప్రకారం ఒక పరిమితిని విధించుకొని సాధ్యమైన రీతిలో విషయ సేకరణలతో సమాచారం కూర్చుకొనటమైనది. కొందరు పెద్దల జీవితాలపై సమాచారం గ్రంథాలలో, పత్రికలలో అందనందున పొందుపరచ లేకపోయాము.

ఏదైనా ముఖ్యసమాచారం ముఖ్యుల సమాచారం పొందుపరచలేకపోయినందుకు అన్యథా భావించక, ఒక్కొక్కరి దృష్టికి ఒక్కొక్క సమాచారం వస్తుందని భావించి ఆయా సమాచారాలను మిత్రులు సహృదయంతో మా సంఘానికి అందించినట్లయితే, దానిని పరిశీలించుకొని మరొక ప్రయత్నం చేయు సమయంలో ఉపయోగించగలము. లేదా ఆ సమాచారంతో తమరే ఒక గ్రంథం వ్రాయించి ప్రచురించటం ఆహ్వానించ తగ్గది.

ఒక్క ప్రత్యేక విషయం పాఠకుల దృష్టికి తెస్తున్నాము. ప్రముఖ వ్యక్తుల జీవిత విశేషాలు ప్రచురించాలనుకున్నప్పుడు అందరూ కీర్తిశేషులైన వారి విశేషాలను మాత్రం సమకూరుద్దామని భావించాము. విషయ సేకరణ సమయాలలో జీవించివున్న తెలుగువారిలో దేశంలోనే ప్రత్యేక స్థానంలో ప్రముఖంగా ఉన్న జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డి గారిని వదలటం ఇష్టంలేక, అంతేకాక వసంతరాజీయం అనే నృత్యశాస్త్ర గ్రంథకర్త రెడ్డిప్రభువు కర్పూర వసంతరాయలు (కుమారగిరిరెడ్డి) చరిత్రను తన గేయకావ్యం "కర్పూర వసంతరాయలు" ద్వారా తెలుగు జనులకు సుపరిచితం చేసిన మహాకవిని ఆ కర్పూర వసంతరాయలు సరసనే ఈ గ్రంథంలో ఉంచాలనే కోరికతో ఆయన జీవిత విశేషాలను కూడ ఇందులో చేర్చడమైనది. ఇది నిరభ్యంతరమని సహృదయ మిత్రులూ అభిప్రాయపడ్డారు.

ఇది మా సంఘం తొలి ప్రచురణా ప్రయత్నం. మా సంఘం చేయు ఈ ప్రయాణంలో పరిస్థితుల ననుసరించి మున్ముందు ఇతర గ్రంథాల ప్రచురణ కూడ చేయు ఆలోచన మా సంఘానికున్నది.

ఆంధ్రులు, ప్రత్యేకించి రెడ్డిజాతీయులు ఈ ప్రయత్నానికి సంతోషం వెలిబుచ్చగలరని ఆశిస్తున్నాము.

నమస్తే

ఒంగోలు
**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

25–5–2017
రి.నం. : 463/94

# ప్రత్యేక కృతజ్ఞతలు

ఈ గ్రంథ ప్రచురణ అంశం చర్చలు ప్రారంభమైనపుడు సంఘ శ్రేయోభిలాషి, న్యాయ వాది, బహుగ్రంథకర్త, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌరవాధ్యక్షులైన శ్రీ బి. హనుమారెడ్డి గారిని ఈ బాధ్యతను స్వీకరించమని కోరగా మన రెడ్డి మహాజన సంఘం చేయు ఇంత మంచి ప్రయత్నానికి రెడ్డిగా పుట్టినందుకు ఈ పుస్తకం వ్రాసి రెడ్డి జన్మ ఋణం తీర్చుకుంటానని ఆనందంగా అంగీకరించి, తన వయోభారానిని, వృత్తిపరమైన వత్తిడులను ప్రక్కన పెట్టి డా॥ సి. నారాయణరెడ్డి గారితో సహా తన మిత్రులను స్వయంగా సంప్రదించి వేరు వేరు గ్రంథాలను, పత్రికలను, నెట్ వివరాలను అధ్యయనం చేసి, సేకరించి కొండవీడు, శ్రీశైలం, త్రిపురాంతకం, మోటుపల్లి వగైరా ప్రాంతాలను సందర్శించి చరిత్ర, ఫోటోలను సేకరించి ముద్రింపించు బాధ్యతలను కూడ స్వీకరించి, నిరాపేక్షగా ఈ గ్రంథాన్ని మా చేతుల్లోకి, మీ చేతుల్లోకి చేర్చిన శ్రీ బి. హనుమారెడ్డి గారికి రెడ్డిజాతి మా సంఘం ద్వారా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపటం మినహా ఏంచేసీ ఆయన ఋణం తీర్చలేము.

నమస్తే

ఒంగోలు
25-5-2017

**రెడ్డి జనాభ్యుదయ సంఘం - ఒంగోలు**
రి.నం. : 463/94

# కృతజ్ఞతలు

ఒంగోలు "రెడ్డి జనాభ్యుదయ సంఘం" అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు ఈ "రెడ్డి వైభవం" గ్రంథాన్ని ప్రచురించ తలపెట్టి ఆ బాధ్యతను నాపై గౌరవముంచి నాకప్పగించినందుకు, ఇది నా అదృష్టంగా భావిస్తూ "రెడ్డి జనాభ్యుదయ సంఘాని"కి నా హృదయపూర్వక ధన్యవాదములు, కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ప్రజలకోసం ఆస్తులను, ఆయుష్షును అర్పించిన త్యాగధనులైన రెడ్డి ప్రముఖుల వైభవ విశేషాలను తెలుసుకోవటం, వాటిని గుది గుచ్చి ఈ గ్రంథంలో నిక్షిప్తం చేసి ఆ చరిత్రను రెడ్డి మిత్రులకు, ముందు తరాల ప్రజలకు అందించటం సంతోషకరమైన విషయంగా భావించాను.

ఈ గ్రంథ నిర్మాణ విషయ సముపార్జనలో అధిక శ్రమ తీసుకొని చాల గ్రంథాలు, చాల పత్రికలు, వ్యాసాలు, పోస్టల్ స్టాంపులు సేకరించి నాకందించిన నా మంచి మిత్రుడు, రెడ్డిజన ప్రేమికుడు, మేము ప్రేమగా "ఉదయగిరి" అని పిలుచుకునే శ్రీ మామిళ్ళపల్లి శ్రీనివాసరెడ్డి గారికి,

ప్రఖ్యాత చరిత్రకారులు, రిటైర్డ్ లెక్చరరు "రెడ్డిరాజుల చరిత్ర" గ్రంథ రచయిత డా॥ వి.వి. సుబ్బారెడ్డిగారు చరిత్ర సంబంధిత విషయాలలో సంశయాలను పలుమార్లు స్వయంగా తీర్చి, తను సేకరించిన చరిత్ర సమాచారాన్ని, సామగ్రిని, ఎన్నో చరిత్ర ఫోటోలను నాకిచ్చి, స్వేచ్ఛగా ఉపయోగించుకోండని నా ఈ ప్రయత్నాన్ని మెచ్చుకొని, నేను సేకరించలేని ఎందరో ప్రముఖుల జీవిత విశేషాలను మీరు సేకరించారని అభినందించి వెన్నుతట్టారు. గ్రంథానికి ముందుమాట వ్రాసిచ్చారు. వారికి,

జగమెరిగిన పురావస్తు శాస్త్రజ్ఞులు, శాసన పరిశోధకులు, చరిత్రకారులు, "కొండవీటి రెడ్డిరాజులు" గ్రంథ రచయిత, వాస్తుశిల్పవాచస్పతి డా॥ ఈమని శివనాగిరెడ్డి – స్థపతిగారు, చర్చించి, ఈ గ్రంథానికి ముందుమాట కూడ వ్రాసి నాకందించిన ప్రోత్సాహానికి, వారికి,

ఈ గ్రంథాన్ని ఆమూలాగ్రంగా పరిశీలించి ముందుమాట వ్రాసిన మరొక (రిటైర్డ్) ప్రముఖ చరిత్ర శాఖాధ్యక్షులు శ్రీ మాజేటి సోమశేఖరరావు – గుంటూరు వారికి,

కొన్ని శాసనాల పాదాలను నాకందించిన పురావస్తు శాస్త్రజ్ఞులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళిగారికి మరియు నెట్ ద్వారా సహకరించిన శ్రీ పిడపర్తి శ్రీనివాసరెడ్డి, డా॥ యం. వెంకటేశ్వరరెడ్డి, నారపురెడ్డి బ్రహ్మారెడ్డి గార్లకు, ఈ గ్రంథంలోని కొందరి ప్రముఖుల జీవిత విశేషాలను అడిగిన వెంటనే నాకందించిన వారి కుటుంబ సభ్యులకు,

ఈ గ్రంథంలో ప్రత్యేక అంశమైన దేశంలో ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, రెడ్డికుల విశేషమణి పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డి గారు నేనడిగిన వెంటనే వారి "పరిణత వాణి" నిచ్చి నన్ను అభినందించారు, వారికి,

నా ప్రయత్నపు విలువను గుర్తించి అభినందించిన ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల యం.ఎల్.సి. శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గారికి మరియు ఒంగోలు పార్లమెంటు సభ్యులు శ్రీ వై.వి. సుబ్బారెడ్డి గారికి,

రెడ్డిరాజుల రాజలాంఛనం మూలరూపానికి భంగం లేకుండా పలు చర్చలు జరిపి ఆధునీకరించి యిచ్చిన ప్రముఖ చిత్రకారులు, గుంటూరు – ప్రజ్ఞా గ్రాఫిక్స్ అధినేత సుహృన్మిత్రులు కళారత్న దేవీప్రసాద్ గారికి,

అన్నింటినీ మించి ఈ గ్రంథానిని పలువురు మెచ్చునట్లుగా తన అనుభవంతో నాకు సూచనలిచ్చి, ప్రింటింగ్ ప్రెస్ అధినేతగా కాక స్నేహితుడుగా సలహాలనిచ్చి, చర్చించి, సర్వాంగ సుందరంగా ముద్రింపించి యిచ్చిన శ్రీలక్ష్మి ప్రెస్ – గుంటూరు అధినేత శ్రీ శ్యాంబాబుగారికి వారి సహాయకారులు సాంబశివరావుకి,

విషయ సేకరణలో, ముద్రింపించటంలో అనుక్షణం నాకు సహకరించిన న్యాయవాది అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ యత్తపు కొండారెడ్డి గారికి,

పేరుపేరున నా హృదయపూర్వక కృతజ్ఞతలు

నమస్తే

ఒంగోలు **బి. హనుమారెడ్డి,** న్యాయవాది

25-5-2017 అధ్యక్షుడు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
**డాక్టర్ సి. నారాయణరెడ్డి**
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
మాజీ పార్లమెంటు సభ్యులు
అధ్యక్షులు
తెలంగాణ సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్,
హైదరాబాదు - 500 001.
ఫోన్: (ఆఫీస్) 24753724

తేది : 15-04-2017



# అవతారిక

తెలుగు సీమ నేలిన రాజవంశాలో 'రెడ్డిరాజులు' ప్రముఖస్థానం సముపార్జించుకున్నారు. పాలనాదక్షులుగా, కళా సాహిత్య పోషకులుగా, కవులుగా, గ్రంథకర్తలుగా, వ్యాఖ్యానకర్తలుగా, ధర్మరక్షకులుగా, దుర్గనిర్మాతలుగా చిరస్మరణీయులు.

14వ శతాబ్ది ప్రథమ పాదంలో ప్రోలయ వేమారెడ్డి రెడ్డిరాజ్య స్థాపనకు శ్రీకారం చుట్టినట్లు కొందరు చరిత్రకారులు భావిస్తున్నారు. 'ధర్మప్రతిష్ఠాగురు' బిరుదాంకితుడాయన. ఆయన నిర్మించిన దుర్గాలలో కొండవీడు వైభవోన్నతికి మణిదర్పణంగా భాసించింది. కుమారగిరిరెడ్డి, రాజనర్తకి లకుమాదేవి మధ్య శోభితమైన ప్రణయోదంతం ఆధారంగా నేను మాత్రాచ్ఛందంలో 'కర్పూర వసంతరాయలు' దీర్ఘగేయ కావ్యాన్ని రచించినాను. ఈ కావ్యంలో -

**"కొండవీడు నాటి వెండి వెన్నెలలోన**
**కనిపించె నచ్చుమగు కైలాసగిరివోలె"** అని

అభివర్ణించినాను. కావ్యములోని అంతిమ పంక్తులు -

**"కొమరగిరి చరితమ్ము కొండవీడును**
**శిశిరమును సైతము వసంతముగా రూపు గట్టించు**

**కొండవీటను పాదుకున్నట్టి మట్టిలో**
**సైతమ్ము సౌరభమ్ములు వీచు"**

న్యాయవాద శాస్త్ర కోవిదులు, కవి, రచయిత, సాహిత్యాభిమాని శ్రీ బి. హనుమారెడ్డి ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా తెలుగు సాహిత్య వికాసానికి విశేష సేవలందిస్తున్నారు. అన్ని పార్శ్వాలలో రెడ్డి ప్రభావాన్ని గ్రంథస్థం చేయాలని ఒంగోలులోని రెడ్డిజనసంఘం నిర్ణయించడం అత్యంత వాంఛనీయం. వ్యాసాలను ఇతర రచనలను సేకరించి గ్రంథానికి రూపకల్పన చేసే బాధ్యతలను శ్రీ హనుమారెడ్డి స్వీకరించడం హర్షణీయం.

గ్రంథం ప్రణాళిక హేతుపూర్వకంగా వుంది. రెడ్డిరాజుల చరిత్ర, పాలనా విధానాలు, రెడ్డివంశ వివరాలు, వివిధ రంగాలలో రెడ్డి కులజుల వైశిష్ట్యం విపులీకరించి తెలియజెప్పినారు. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, శ్రీ బండారు తమ్మయ్య, డా॥ కట్టమంచి రామలింగారెడ్డి, శ్రీ దువ్వూరి రామిరెడ్డి వంటి సాహితీవేత్తల వ్యాసాలు గ్రంథ ప్రామాణ్యాన్ని ఇనుమడింపజేసినాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అసాధారణ కృషిచేసి ఖ్యాతిగాంచిన రెడ్డి ప్రముఖుల వివరాలు పదకొండు శీర్షికలలో పొందుపరిచినారు. ప్రత్యేకించి సాహితీరంగంలో సుప్రసిద్ధులైన వారి జీవిత, సాహితీ విశేషాలను విశ్లేషణాత్మకంగా తెలియపరచడం స్ఫూర్తిమంతంగా ఉపకరిస్తుంది.

ఈ గ్రంథాన్ని వెలుగులోకి తెచ్చిన శ్రీ బి. హనుమారెడ్డి గారికి, రెడ్డి జనాభ్యుదయ సంఘ కార్యకర్తలకు నా హార్ధికాభినందనలు.

(డా॥ సి. నారాయణ రెడ్డి)

**మాగుంట శ్రీనివాసులురెడ్డి**
శాసనమండలి సభ్యులు
ప్రకాశం జిల్లా స్థానిక సంస్థలు

MEMBER, ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL
सत्यमेव जयते

డోర్ నెం. 24-034-923, 2వ లైను,
రామ్‌నగర్, ఒంగోలు-523001,
ప్రకాశం జిల్లా
ఫోన్:08592-231234, 226999,
ఫ్యాక్స్ : 228999
Email :mlcprakasam@gmail.com



# అభినందన

అద్దంకి, కొండవీడు, రాజమహేంద్రవరం, కందుకూరు రాజ్యాలను పరిపాలించిన ప్రముఖ రెడ్డిరాజుల పరిపాలనను, వారి కాలంనాటి సాంఘిక చరిత్రను చెప్పటమేకాక, వారి పరిపాలనా దక్షతను, కళాభినివేశాలను, సౌమ్య స్వభావాలను, వారసత్వంగా పుణికిపుచ్చుకున్న 86 మంది రెడ్డియోధులు, స్వాతంత్రోద్యమకారులు, రాజకీయ ప్రముఖులు, సాహితీస్రష్టలు, దాతృత్వ గుణశేఖరులు, కళాకోవిదులు, ప్రజాసేవా ధురీణుల సంక్షిప్త జీవిత విశేషాలతో రెడ్డి వైభవ ప్రాభవాలను ఒకచోట కూర్చి ఈ “రెడ్డి వైభవం” గ్రంథం ప్రచురించి రాబోవు తరాల ప్రజలకు విలువైన సమాచారం అందించిన ఒంగోలు – రెడ్డి జనాభ్యుదయ సంఘం కార్యవర్గానిని, సభ్యులను, వయసు మీరినా, వృత్తి బాధ్యతలున్నా శ్రమకోర్చి విషయసేకరణ చేసిన ప్రముఖ న్యాయవాది, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌరవాధ్యక్షులు శ్రీ బి. హనుమారెడ్డి గారినీ మిక్కిలిగా అభినందిస్తున్నాను.

మాగుంట శ్రీనివాసులురెడ్డి
**(మాగుంట శ్రీనివాసులురెడ్డి)**
శాసనమండలి సభ్యులు
ప్రకాశం జిల్లా స్థానిక సంస్థలు

**వై.వి. సుబ్బారెడ్డి**
పార్లమెంటు సభ్యులు
(లోక్‌సభ)
ఒంగోలు-33

सत्यमेव जयते

☎ ఆఫీస్ : 08592-235666
040-23544012
ఫ్యాక్స్ : 08592-235666
సెల్ : 98490 00916
Email : yvsubbareddymp@gmail.com



# అభినందన

దేశంలో కుల ప్రాధాన్యతలు పెరిగిపోతున్న తరుణములో ఏ ఇతర కులాన్ని అగౌరపరచకుండా ఎవరి కులాన్ని వారు అభిమానించుకోవటం ఒక సామాజిక అవసరంగా భావించి రెడ్డికుల పూర్వీకులైన రెడ్డిరాజుల గొప్పదనాన్ని వారి పరిపాలన వైదుష్యాన్ని వారి వారసులు, విశేష కీర్తిమంతులైన యోధులు, రాజకీయ, సాహితీరంగ ప్రముఖులు, దానశీలురు, సామాజిక సేవ పరమావధిగా ఎంచి జీవితాలను వెచ్చించిన 86 మంది రెడ్డివరేణ్యుల జీవిత విశేషాలను, శ్రమతో సేకరించి "రెడ్డివైభవం" గ్రంథాన్ని ప్రచురించి రెడ్డికుల విశిష్టతను రాబోలు శతాబ్దాల ప్రజలకు మార్గదర్శకంగా ఉండునట్లు శ్రమ తీసుకున్న ఒంగోలు-రెడ్డి జనాభ్యుదయ సంఘం కార్యవర్గానికి, వయోభారమైనా తన సమయాన్ని వెచ్చించి సమాచారం సేకరించిన ప్రముఖ న్యాయవాది, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌరవాధ్యక్షులు శ్రీ బి. హనుమారెడ్డి గారికి నా ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నాను.

(వై.వి. సుబ్బారెడ్డి)

**ఈమని శివనాగిరెడ్డి - స్థపతి**
సి.ఇ.వో.

**ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ-అమరావతి**
4వ అంతస్తు,
మధుమాలక్ష్మి ఛాంబర్స్
మొగల్రాజపురం,
విజయవాడ-10



# చారిత్రక ఔన్నత్యం

క్రీ.శ. 8వ శతాబ్దికే గ్రామాధికారులుగా పాలనా దక్షతను నిరూపించుకొన్న రెడ్లు, క్రీ.శ. 10-11 శతాబ్దాలకు ఉన్నత ప్రభుత్వ పదవులను అలంకరించారు. 12వ శతాబ్ది నుంచి మాండలికులు, ముఖ్య మాండలికులు, సామంతుల స్థాయికి ఎదిగి కాకతీయుల కాలానికి నాయకులైనారు. కాకతీయ సామ్రాజ్య పతనం తరువాత ఏర్పడిన మూడు స్వతంత్ర తెలుగు రాజ్యాల్లో, తీరాంధ్రలో ఎక్కువ భూభాగాన్ని, మిగతా రెండు రాజ్యాల కంటే ఎక్కువ కాలం పాలించి, జనరంజక నేతలుగా తెలుగునేల సర్వతోముఖ ప్రగతి సాధించటానికి, పరాయివారిని తరిమి కొట్టటంలో దిట్టలుగానే కాక దాదాపు 125 సం॥లు సుస్థిర ప్రభుత్వాన్ని అందించింది కూడా రెడ్లే. ముందుగా అద్దంకి, తరువాత కొండవీడు రాజ్యంగా రూపుదిద్దుకొని, రాజమహేంద్రవరం, కందుకూరు శాఖలుగా వివిధ ప్రాంతాలకు ఆధిపత్యం వహించి, వ్యవసాయం, వర్తకం, వాణిజ్యం, సంగీతం, నృత్యం, సాహిత్య రంగాలకు ఎనలేని ప్రోత్సాహాన్నిచ్చిన పరిపాలనాదక్షులు రెడ్లు. విజయనగర కాలంలో సైతం మాండలిక పాలకులుగా ప్రజల మన్ననలందిన రెడ్లు, బ్రిటీషు పాలనలో వ్యవసాయాన్ని నమ్ముకొన్న పాలెగార్లు గానూ, వ్యాపారులుగానూ కొనసాగి జాతీయోద్యమంలో అందరికంటే ముందుండి దేశభక్తిని చాటుకొన్నారు. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రజాపాలనలో ప్రముఖ భూమికను పోషించి విద్య, వైద్యం, సాహిత్యం, సినిమా, పారిశ్రామిక రంగాలతో పాటు, సమాజ సంక్షేమం కోసం దాతలుగా దాతృత్వాన్ని చాటి, దేశంలోనే పేరుగాంచారు. దాదాపు వెయ్యేళ్ళకు పైగా రాజకీయ నైపుణ్యాన్ని పుణికి పుచ్చుకొన్న రెడ్లు, తరువాతి తరం వారికి ఆయా

రంగాలలో ఆదర్శవంతులైనారు. మునుపటి లక్షణాలను ఈ తరానికి అందించాల్సిన అవసరాన్ని గుర్తించిన ఒంగోలు రెడ్డి జనాభ్యుదయ సంఘం, మానవతామూర్తి, ఆదరణ, ఆప్యాయతలకు మారుపేరైన ప్రముఖ న్యాయవాది, సామాజిక స్పృహగల జాతీయ రచయిత శ్రీ బి. హనుమారెడ్డి గారు, 'రెడ్డి వైభవం' పుస్తకాన్ని తీసుకురావటానికి పూనుకోవటం యావత్ రెడ్డిజనులూ హర్షిస్తున్నారు.

1920వ దశకంలో మల్లిడి సత్తిరెడ్డి గారి 'రెడ్డిరాజు' పత్రిక నుంచి 1990వ దశకంలో యండపల్లె శ్రీనివాసరెడ్డి గారి 'రెడ్డినాడు' పత్రికదాకా, బుక్కపట్నం రాఘవాచార్యులు నుంచి మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ, వడ్డాది అప్పారావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, బి.ఎన్. శాస్త్రి, వి.వి. సుబ్బారెడ్డి, డా॥ ఈమని శివనాగిరెడ్డి, కొల్లి శివారెడ్డి దాకా, రెడ్డి రాజుల, రాజ్యాలపై అనేక గ్రంథాలొచ్చాయి. అవన్నీ చరిత్రకు సంబంధించిన విషయాలు. అయితే రెడ్డిపదం పుట్టినప్పట్నించి, రాజులై రాజ్యాలనేలి, అటు తరువాత కాలాల్లో పోషించిన పాత్ర గురించి, రెడ్డి ప్రముఖులు వివిధ రంగాలకు చేసిన కృషి, సేవల గురించి, అన్ని విషయాలను ఒక్కచోట ఏరికూర్చి ఆసాంతం ఒక్కసారే చదివేలా సులభమైన తెలుగులో సంకలనం చేసిన సాహితీమూర్తి, బి. హనుమారెడ్డి గారి కృషి ఫలితమే ఈ 'రెడ్డి వైభవ' గ్రంథం.

రెడ్ల గతకాలపు వైభవ ప్రాభవాలతో పాటు ఇప్పటి వరకూ వారు రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, పారిశ్రామిక, విద్యారంగాలలో రాణించిన తీరుకు ఈ గ్రంథం అద్దం పడుతుంది. ఇంతటి మహత్కార్యానికి పూనుకొన్న ఒంగోలు రెడ్డి జనసంఘాన్ని, శ్రీ బి. హనుమారెడ్డి గారినీ మనసారా అభినందిస్తూ, చిన్నవాణ్ణైనా, ఈ పుస్తకానికి ముందుమాట రాసే అవకాశాన్ని కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ పుస్తకం సర్వజనాదరణ పొందాలని ఆశిస్తున్నాను.

(ఈమని శివనాగిరెడ్డి)

**డా॥ వి.వి. సుబ్బారెడ్డి**
చరిత్ర శాఖాధ్యక్షులు (రిటైర్డ్)
జి.హెచ్.ఆర్. అండ్ ఎం.ఆర్. డిగ్రీ అండ్ పి.జి. కళాశాల
గుంటూరు

4-5-26/48
1/2 నవభారత్ నగర్
గుంటూరు - 6



# చరిత్రలో కొత్త ప్రయోగం

కాకతీయుల పతనం తరువాత ఒక క్లిష్ట చారిత్రక వాతావరణంలో రెడ్డిరాజులు ఆవిర్భవించారు. క్రీస్తుశకం 1325లో ప్రోలయ వేమారెడ్డి స్థాపించిన ఈ రాజ్యం 1448 వరకు అంటే శతాబ్దానికి పైగా తెలుగు ప్రాంత చరిత్రను ప్రభావితం చేసింది. ఉత్తరాది నుంచి ముస్లిం పాలకుల విస్తరణను చాలాకాలం నిరోధించిన ఘనత, సాహిత్య కళారంగాలను సేవించిన చరిత్ర రెడ్డిరాజులది. వీరికాలంలో సాహిత్య, సంగీత, నృత్యకళలు బాగా పెంపొంది రాణించాయి. సంస్కృతాంధ్రలు క్షుణ్ణంగా చదివి పాండిత్యం సంపాదించిన వారు రెడ్డిరాజులు. కవిసార్వభౌముడైన శ్రీనాధుని ఆస్థానకవిగా నిలుపుకున్న ఘనత కూడా రెడ్డిరాజులదే. ఆ చరిత్రను సుప్రసిద్ధ న్యాయవాది, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు అయిన బి. హనుమారెడ్డి గారు "రెడ్డి వైభవం" అనే పేరుతో వ్రాయగా, రెడ్డి జనాభ్యుదయ సంఘం, ఒంగోలు వారు ప్రచురించారు.

హనుమారెడ్డి గారు చరిత్రను మూస పద్ధతిలో చెప్పకుండా విభాగాలుగా చేసి సామాజిక, ఆర్థిక, రాజకీయ, పాలనా పద్ధతులను చక్కగా విశ్లేషించారు. వస్తుగత అంశాలకు భంగం కలగకుండా, నిజాల ఆధారంగా రెడ్డిగారు గ్రంథాన్ని వ్రాశారు. కొండవీడు, శ్రీశైలం, త్రిపురాంతకం, మోటుపల్లి తదితర ప్రాంతాల్లో క్షేత్రపరిశోధన (ఫీల్డ్ సర్వే) జరిపి ఆయా ప్రాంతాల్లో పడి ఉన్న శిల్పాలను

మిత్రుల, గ్రామస్తుల సహకారంతో అధ్యయనం చేయగలిగారు. మధ్యలో ఇచ్చిన 50 కలర్ ఫోటోలు పుస్తకానికి గొప్ప శోభను చేకూర్చాయి.

కేవలం రాజుల వివరాలకూ, సమకాలీన పరిస్థితులకు పరిమితం కాకుండా రెడ్డి యోధులు, సంఘసంస్కర్తలు, రాజకీయ, సేవారంగ, సాహిత్య, సినిమా రంగ మొదలైన ప్రముఖుల విశేషాలను చేర్చడం పుస్తకానికి నిండుతనం వచ్చినట్టయింది.

హనుమారెడ్డిగారు వృత్తిరీత్యా న్యాయవాది. కానీ, ఆయన ఈ రచన అధికారిక రికార్డులకే పరిమితం కాలేదు. శ్రీ కందుల ఓబులరెడ్డి, పులి వెంకటరెడ్డి మొదలైన ప్రముఖుల అట్టడుగున పడి కనిపించీ కనిపించని జీవిత చరిత్రలను లేదా కథనాన్ని ఆయన ఆసక్తికరంగా వెలుగులోకి తెచ్చారు. ఎప్పుడో 150 లేదా 200 సం॥ల క్రితం తమిళనాడు, కర్ణాటకలలో స్థిరపడిన రెడ్డి ప్రముఖుల మూలాల్ని వెతికి పట్టుకోవడం చిన్న విషయం కాదు. ఇది సంక్లిష్టమైన అంశమే అయినా, హనుమారెడ్డిగారి శైలి, ఈ రచనకి చదివించే గుణాన్నిచ్చింది.

కాసు బ్రహ్మానందరెడ్డి గారిని గురించి వ్రాస్తూ "తలపైని గాంధీ టోపి కదలికలతో తన మనోభావాలను తెలిపేవారని" చాలా ఆసక్తికరమైన విషయాన్ని హనుమారెడ్డి గారు వెలుగులోకి తెచ్చారు. ఎల్లప్పుడూ గాంధీ టోపి ధరించే శ్రీ బ్రహ్మానందరెడ్డి తాను చేయబోయే రాజకీయ ఎత్తుగడకు సూచనగా తలపై టోపిని అటునుంచి ఇటు త్రిప్పేవారని అప్పుడు ప్రతీతిగా ఉండేది. అంటే ఆయన బుర్రలో అమోఘమైన నూతన రాజకీయపుటెత్తు మెరుపులా మెరిసి ఉంటుందనే అభిప్రాయం ఉండేది. రాజకీయ చతురతకు ఆయన పెట్టింది పేరు. ఇటువంటి విషయాలెన్నో రెడ్డిగారు బాగా వివరించారు.

ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చరిత్రకారులు స్థానిక చరిత్రలపై అత్యంత ఆసక్తి కనబరుస్తున్నారు. స్థానిక చరిత్రల సమాహారమే సమగ్ర చరిత్ర

అవుతుంది తప్ప రాజుల, రాకుమార్తెల ప్రేమ పురాణాలు, దండయాత్రలు, ముట్టడికైన ఖర్చులు ..... ఇది చరిత్ర కానే కాదు. శాస్త్రీయ దృక్పథంతో ప్రజాజీవిత కోణం నుంచి వాస్తవ పరిస్థితులను వివరిస్తూ నిష్పాక్షికంగా వ్రాయాలి. మతం, తత్వం, శిల్పం, నృత్యం, సాహిత్యం, జీవన విధానం అన్నీ చరిత్రలో అంతర్భాగాలే. మానవజాతి సాధించిన విజయాలను, వైఫల్యాను ఎత్తిచూపేదే చరిత్ర. హనుమారెడ్డి గారు కొండవీటి రెడ్డిరాజుల చరిత్ర, ఇటీవల కాలంనాటి రెడ్డి ప్రముఖులను గురించి రికార్డు చేయడానికి ప్రయత్నించారు. మధ్యయుగం నుంచి అకస్మాత్తుగా ఆధునిక యుగంలో ప్రవేశించడం చరిత్రలో దీనిని ఒక కొత్త ప్రయోగంగా చెప్పొచ్చు. అయినా ఇదో మంచి ప్రయత్నమే. ఆయన ప్రయత్నం సర్వదా శ్లాఘనీయం.

అయితే శరీరం మీద ధ్యాసలేని వ్యక్తుల మాదిరిగా మన జాతికి, మన సామాజిక వర్గానికి తన చరిత్ర మీద స్పృహ లేదు. అటువంటి స్పృహ కల్పించడానికి రచయిత హనుమారెడ్డి గారు ప్రయత్నించారు. సరళమైన శైలిలో ఉన్న ఈ గ్రంథం హైస్కూలు స్థాయి విద్యార్థులకు సైతం అవగాహన అయ్యే రీతిలో ఉంది. ఇటువంటి పుస్తకాలు ప్రతి పాఠశాల, కళాశాల గ్రంథాలయాల్లో ఉంచి మానవ మహాప్రస్థానంలో రెడ్ల పాత్ర ఏమిటో తెలియచెప్పాలి. ఇలాగనే అన్ని సామాజిక వర్గాల చరిత్ర, ప్రముఖుల గురించి తెలియజెప్పే గ్రంథాలు వెలువడాలి. ప్రకాశం, గుంటూరు, గోదావరి జిల్లాలు అంతటా వ్యయ ప్రయాసలకు ఓర్చి రవాణా సౌకర్యం లేనిచోట కాలినడకన వెళ్ళి నేరుగా సమాచారం సేకరించి, చక్కని చారిత్రక ఫలాన్ని మనకు అందించిన హనుమారెడ్డి గారు నిజంగా అభినందనీయులు.

— వి.వి. సుబ్బారెడ్డి

(వి.వి. సుబ్బారెడ్డి)

## మాజేటి సోమశేఖరరావు

గుంటూరు
సెల్ : 98480 85592

పూర్వోక్త డైరెక్టర్,
హిందూ కళాశాల పి.జి. సెంటర్, గుంటూరు.
ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్




తేది : 28-04-2017

ఆంధ్రదేశ చరిత్రలో ఒక ప్రముఖ అధ్యాయాన్ని సృష్టించి, ఆంధ్రదేశ చరిత్రను ఎంతగానో ప్రభావితం చేసిన రెడ్డిరాజులు ఆంధ్రదేశ చరిత్రలో అత్యంత ఖ్యాతి గడించారు. తెలుగు రాజుల వెలుగు పాలనకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్న నేటి కొండవీడును రాజధానిగా చేసుకొని ఒక శతాబ్దకాలం అప్రతిహతంగా పరిపాలన సాగించిన రెడ్డిరాజులు పరాక్రమానికి ప్రతీక. తెలుగువారు నివశిస్తున్న ప్రాంతాలను ఒకే పాలన క్రిందకు తెచ్చిన కాకతీయుల పతానానంతరం స్వతంత్ర్య రాజ్యాన్ని స్థాపించి, ఒకవైపు విజయనగర రాజులను, మరొకవైపు ఢిల్లీ సుల్తానులను ఎదిరించి పోరాడి, తెలుగు సంస్కృతిని పరిరక్షించి, ప్రజలకు సుభిక్షమైన పాలన అందించిన ఘనమైన చరిత్ర కలవారు రెడ్డిరాజులు. వారి సంస్థానం కళలకు నిలయం. ఆస్థానం కవులకు నిలయం.

రాజ్యస్థాపనకు పూర్వ రెడ్డివీరులు రాజుసేవలోను, ఉద్యోగులుగను, సైనికులుగను, సామంతులుగను ఉండి చక్కటి పరిపాలనా అనుభవం గడించి యున్నారు. వీరు యుద్ధ విద్యలలో, పరిపాలనలో, సంగీత సాహిత్య కళా పోషణలో సాటిలేని మేటి అనిపించుకున్నారు. ఇంతటి ఘనత కలిగిన రెడ్లను గురించి సవిస్తారంగా భావి ప్రజలకు తెలియజేయడానికి చేసిన ప్రయత్న ఫలితమే శ్రీ హనుమారెడ్డి రచించిన "రెడ్డి వైభవం". శ్రీ హనుమారెడ్డి ఒక సామాజిక వర్గానికి చెందిన వారి ఘనతను, వైభవాన్ని ముందుతరాల వారికి తెలియజేసి వారిలో స్ఫూర్తిని కలిగించడానికి చేసిన ఒక మంచి ప్రయత్నం.

భారతదేశంలో సాగిన, సాగుతున్న చరిత్ర రచనా ప్రక్రియకు ఒక ప్రత్యేకత ఉంది. చరిత్రకారులు, పరిశోధకులు, రచయితలు మొదలగువారు చరిత్ర రచనను పలుకోణాలతో సాగించడం పరిపాటి అయింది. రాజకీయ, మత, ఆర్థిక జాతిపర, కులపర, ప్రాంతీయ, స్థానిక దృక్పథాలతో చరిత్ర రచనలను సాగిస్తున్నారు. ఇటీవలి కాలంలో అనేకమంది స్థానిక విషయాలకు, సామాజికవర్గాల వారికి ప్రాధాన్యతనిస్తూ రచనలు సాగించడం కూడ పరిపాటి అయింది. దేశీయ చరిత్రల్లో వీటికి ఎక్కువ స్థానం కల్పించకపోవడమే దీనికి గల కారణం. ఈ నేపథ్యంలో వెలువడుతున్న స్థానిక చరిత్రలు, వంశ చరిత్రలు, కుల చరిత్రలు మొదలగునవి వివిధ ప్రాంతాల, వంశాల, కులాల ప్రాధాన్యతను, గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రజల్లో చక్కటి స్ఫూర్తిని కలిగిస్తున్నాయి. కాని దృక్పథమేదైనా రచయిత నిష్పక్షపాతంగా, శాస్త్రీయంగా రచన సాగించినపుడు దేశ, ప్రాంత, స్థానిక ప్రయోజనాలకు ఎట్టి భంగం వాటిల్లదు. జాతి, కుల, మత, ప్రాంతీయ విద్వేషాలకు తావుండదు. ఏ దృక్పథంతో రచన సాగినా అది దేశ చరిత్రకు పరిపుష్టతను కలిగించేవిధంగా ఉండాలి గాని జాతి, కుల, మత, ప్రాంతీయతత్వాలను పెంపొందించేవిధంగా ఉండకూడదు.

ఈ కోవకు చెందిన "రెడ్డి వైభవం" ఒక ఘనమైన, సుదీర్ఘమైన చరిత్ర కలిగిన రెడ్ల కులానికి చెందినది. రెడ్లు ఒక కులంగా, ఒక తెగగా, జాతిగా ఆవిర్భవించిన నాటి నుండి ఆంధ్రదేశ చరిత్రలో ప్రసిద్ధి చెందిన వీరులుగ, రాజ్యపాలకులుగ, ఆధునిక కాలంలో గొప్ప సంఘసంస్కర్తలుగ, రాజకీయరంగ ప్రముఖులుగ, సేవారంగ ప్రముఖులుగ, సాహిత్యరంగ ప్రముఖులుగ, విద్య, సినీ, పత్రికా, కళా రంగ ప్రముఖులుగ దేదీప్యమానంగా ఎలా వెలుగొందారో భావితరాలవారికి తెలియజేసే ప్రయత్నమే ఈ గ్రంథం. శ్రీ హనుమారెడ్డి వృత్తిపరంగా న్యాయవాది అయినా ప్రవృత్తిపరంగా ఈ రచన ద్వారా తన సామాజికవర్గ బాధ్యతను నెరవేర్చారు.

రచయిత శ్రీ హనుమారెడ్డి ఈ గ్రంథ రచనలో విషయాలను ఆధార పూర్వకంగా చెప్పి, రచనలో శాస్త్రీయతను పాటించి రచనకు చారిత్రకతను చేకూర్చారు.

శ్రీ హనుమారెడ్డి తన రచన సాగించడంలో అనుషంగిక, శాసనాల, పరిశోధనా గ్రంథాల, శిధిలాల, కైఫియత్‌ల, నాటి సాహిత్య గ్రంథాల, అధికార పత్రాల నుండి విషయ సేకరణ చేసి, అధిక శ్రమకోర్చి రెడ్లకు సంబంధించిన అనేక ప్రాంతాలను సందర్శించి, చరిత్రకారులతో, పరిశోధకులతో, పండితులతో, సాహితీవేత్తలతో చర్చలు జరిపి ఈ గ్రంథాన్ని వెలువరించారు. రచన గ్రాంధిక భాషలో గాక సామాన్య ప్రజలకు అర్థమయే సరళమైన భాషలో సాగించడం అభిలషణీయమైనది. గ్రంథాన్ని రెండు భాగాలుగా విభజించడం, మొదటి భాగంలో రెడ్ల పూర్వాపరాలు, రాజ్యాల స్థాపన, నాటి సామాజిక, ఆర్థిక, మత పరిస్థితులు మొదలైనవి సవిస్తారంగా వివరించడం, రెండవ భాగంలో రెడ్డి ప్రముఖుల జీవిత విశేషాలు, వారు సాధించిన ఘనకార్యాలు సవివరంగా నిక్షిప్తం చేసి గ్రంథానికి పరిపూర్ణతను చేకూర్చారు. శ్రీ హనుమారెడ్డి విషయసేకరణకు పడ్డ శ్రమ, రచనకు అవలంభించిన పద్ధతులు, గ్రంథ సమగ్రతకు తీసుకొన్న జాగ్రత్తలు ముదావహమైనవి. “రెడ్డి వైభవం” రెడ్ల గురించి తెలియజేసే ఒక విజ్ఞాన సర్వస్వంగా భావించవచ్చు. శ్రీ హనుమారెడ్డి ఈ గ్రంథాన్ని రెడ్డి కుల గొప్పతనాన్ని వివరించి అది ఇతర సామాజిక వర్గాల భావోద్వేగాలకు గురిచేసేదిగా కాక కేవలం ఆంధ్రదేశంలో గల ఒక సామాజిక వర్గం చరిత్రలో పోషించిన పాత్రను, ఆంధ్రదేశ చరిత్ర గొప్పతనానికి తనవంతు నిర్వహించిన పాత్రను తెలియజేసేదిగా పాఠకులు భావించాలని ఆశిస్తూ, వారు చేసిన కృషిని ప్రశంసిస్తూ, తాను అనుకొన్నది, తాపత్రయపడుతున్నది నెరవేరాలని ఆశిస్తూ, ఆయన చేసిన ప్రయత్నానికి సార్థకత చేకూరుతుందని ఆకాంక్షిస్తూ

మీ
మాజేటి సోమశేఖరరావు

(మాజేటి సోమశేఖరరావు)



సాక్షి గణపతి, శ్రీశైలం, (ఆధునికం)

# విషయ సూచిక

## మొదటి భాగం


| | | |
|---|---|---|
| 1. | రెడ్డి కులాభిమానం | 1 |
| 2. | రెడ్డి వెలుగులు | 2 |
| 3. | రెడ్డి ఆధునిక కర్తవ్యం | 3 |
| 4. | రెడ్డి వైభవం | 4 |
| 5. | 14వ శతాబ్దికి పూర్వం రెడ్డిరాజుల యున్నతి | 9 |
| 6. | 14వ శతాబ్ది రెడ్డిరాజుల యున్నతి | 18 |
| 7. | రెడ్డి పదం | 21 |
| 8. | రెడ్డి వంశములు (కొన్ని) | 25 |
| 9. | రెడ్డి సంస్థానములు | 27 |
| 10. | రెడ్డి శాఖలు (కొన్ని) | 28 |
| 11. | రెడ్డి జనాభా అంచనా | 29 |
| 12. | అద్దంకి-కొండవీడు రెడ్డి రాజ్యాలు | 30 |
| 13. | ప్రోలయ వేమారెడ్డి | 33 |
| 14. | అనపోతారెడ్డి | 37 |
| 15. | అనవేమారెడ్డి | 42 |
| 16. | కుమారగిరిరెడ్డి | 47 |
| 17. | పెదకోమటి వేమారెడ్డి | 51 |
| 18. | రాచవేమారెడ్డి | 53 |
| 19. | కొండవీడు రెడ్డివంశం (వంశవృక్షం) | 54 |
| 20. | కొండవీటి రెడ్డివంశం (వంశవృక్షం) | 55 |
| 21. | రాజమహేంద్రవర రెడ్డి (కాటయ వేమారెడ్డి) రాజ్యం | 56 |
| 22. | రాజమహేంద్రవర రెడ్డివంశం (వంశవృక్షం) | 59 |

| | | |
|---|---|---|
| 23. | కందుకూరు రెడ్డి రాజ్యం | 60 |
| 24. | కందుకూరు రెడ్డి వంశం | 61 |
| 25. | రెడ్డిరాజుల కాలపు సమాజం | 62 |
| | పరిపాలనా వ్యవస్థ - విధానం | |
| | వ్యవసాయం | |
| | వ్యాపారం | |
| | మతము - ధార్మికత | |
| | న్యాయపాలన - శిక్షాస్మృతి | |
| | కులవ్యవస్థ | |
| | బ్రాహ్మణులు | |
| | వైశ్యులు | |
| | క్షత్రియులు | |
| | విద్య-సారస్వతం | |
| | ప్రజాజీవనం | |
| | బిరుదులు | |
| 31. | మోటుపల్లి రేవు పట్టణం | 87 |
| 32. | అవచి కుటుంబం | 97 |
| 33. | గృహరాజు మేడ | 101 |
| 34. | కొండవీడు నేటి చారిత్రక ఆనవాళ్ళు | 103 |
| 35. | 14వ శతాబ్ది తదుపరి చరిత్ర | 106 |
| 36. | రెడ్డి కులప్రబోధము | 107 |
| 37. | రెడ్డిప్రభ | 112 |
| 38. | రెడ్డిరాజ ప్రశస్తి | 114 |
| 39. | కొండవీడు కోటప్రదేశం - పటము | 115 |
| 40. | కొండవీటి రాజ్యాలు పటములు | 116 |
| 41. | శ్రీశైలం | 122 |

# రెండవ భాగం - రెడ్డి పరంపర

## యోధులు :


| | | |
|---|---|---|
| 1. | గోన బుద్దారెడ్డి | 127 |
| 2. | నాయకురాలు నాగమ్మ | 131 |
| 3. | ఉయ్యాలవాడ నారసింహారెడ్డి | 137 |
| 4. | గాదె చిన్నపరెడ్డి | 145 |
| 5. | పొణకా కనకమ్మ | 153 |


## సంఘ సంస్కర్త :


| | | |
|---|---|---|
| 6. | వేమన | 157 |


## రాజకీయరంగ ప్రముఖులు :


| | | |
|---|---|---|
| 7. | డా॥ నీలం సంజీవరెడ్డి | 179 |
| 8. | ఓమందూరు రామస్వామిరెడ్డి | 187 |
| 9. | కె.సి.రెడ్డి | 193 |
| 10. | వి. వెంకట సుబ్బారెడ్డియార్ | 197 |
| 11. | అగరం సుబ్బరాయలు రెడ్డి | 201 |
| 12. | డా॥ బెజవాడ గోపాలరెడ్డి | 205 |
| 13. | కాసు బ్రహ్మానందరెడ్డి | 211 |
| 14. | మర్రి చెన్నారెడ్డి | 217 |
| 15. | టంగుటూరు అంజయ్య | 223 |
| 16. | భవనం వెంకట్రామిరెడ్డి | 225 |
| 17. | కోట్ల విజయభాస్కరరెడ్డి | 227 |
| 18. | నేదురుమల్లి జనార్ధనరెడ్డి | 231 |
| 19. | డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి | 235 |
| 20. | కె.వి. రఘునాధరెడ్డి | 241 |

| | | |
|---|---|---|
| 21. | పులి వెంకటరెడ్డి | 245 |
| 22. | కడప కోటిరెడ్డి | 249 |
| 23. | కొండా వెంకట రంగారెడ్డి | 253 |
| 24. | బెజవాడ రామచంద్రారెడ్డి | 257 |
| 25. | తరిమెల నాగిరెడ్డి | 261 |
| 26. | పుచ్చలపల్లి సుందరయ్య | 267 |
| 27. | చంద్ర పుల్లారెడ్డి | 273 |
| 28. | రావి నారాయణరెడ్డి | 277 |
| 29. | బద్దం యల్లారెడ్డి | 281 |
| 30. | గుజ్జుల యల్లమందారెడ్డి | 285 |
| 31. | నర్రా రాఘవరెడ్డి | 287 |
| 32. | భీమిరెడ్డి నరసింహారెడ్డి | 291 |
| 33. | సూరా పాపిరెడ్డి | 295 |
| 34. | బి.వి. సుబ్బారెడ్డి | 299 |
| 35. | రేబాల దశరధరామిరెడ్డి | 303 |
| 36. | పిడతల రంగారెడ్డి | 305 |
| 37. | అగరాల ఈశ్వరరెడ్డి | 307 |
| 38. | కందుల ఓబులరెడ్డి | 309 |
| 39. | పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి | 313 |
| 40. | ఎ.సి. సుబ్బారెడ్డి | 317 |
| 41. | రొండా నారపరెడ్డి | 319 |
| 42. | ఏరాసు అయ్యపురెడ్డి | 323 |
| 43. | ఎలిమినేటి మాధవరెడ్డి | 327 |
| 44. | పి. ఇంద్రారెడ్డి | 329 |
| 45. | పి. జనార్ధనరెడ్డి | 331 |

46. దిరిశాల వెంకట రమణారెడ్డి 335
47. మాగుంట సుబ్బరామరెడ్డి 339
48. వెదిరె రామచంద్రారెడ్డి 343
49. మునిరెడ్డి హోసట్టి 347
50. కాసు వెంగళరెడ్డి 349
51. దొడ్లా రామచంద్రారెడ్డి 351
52. మద్దూరు సుబ్బారెడ్డి 355
53. బూతలపల్లి రామసుబ్బారెడ్డి 357
54. మానుగుంట ఆదినారాయణరెడ్డి 359
55. కందుల నాగార్జునరెడ్డి 363

**సేవారంగ ప్రముఖులు :**

56. రావుబహద్దర్ కొత్వాల్ వెంకట రామారెడ్డి 367
57. డా॥ పెరుగు శివారెడ్డి 377

**దాతృత్వ ప్రముఖులు :**

58. బుడ్డా వెంగళరెడ్డి 379
59. గుణంపల్లి పుల్లారెడ్డి 385
60. తిక్కవరపు రామిరెడ్డి 391

**సాహిత్యరంగ ప్రముఖులు :**

61. సురవరం ప్రతాపరెడ్డి 395
62. డా॥ కట్టమంచి రామలింగారెడ్డి 401
63. దువ్వూరు రామిరెడ్డి 407
64. డా॥ సి. నారాయణరెడ్డి 413
65. రాచమల్లు రామచంద్రారెడ్డి 425
66. తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి 431
67. కె.వి. రమణారెడ్డి 435

68. మరుపూరు కోదండరామిరెడ్డి 439
69. బండి గోపాలరెడ్డి 443
70. డా॥ ఎమ్.ఎస్. రెడ్డి (మల్లెమాల) 447
71. యెద్దుల బాలశౌరిరెడ్డి 453
72. డా॥ పాకాల యశోదారెడ్డి 459
73. జి. సుందరరెడ్డి 463
74. బద్దం భాస్కరరెడ్డి (చెరబండరాజు) 467

**విద్యారంగ ప్రముఖులు :**

75. ప్రొ. జి.ఎన్. రెడ్డి 473
76. జి. రాంరెడ్డి 477
77. దాచూరి రామిరెడ్డి 481

**సినిమారంగ ప్రముఖులు :**

78. హెచ్.యమ్. రెడ్డి 485
79. బి.ఎన్. రెడ్డి 489
80. బి. నాగిరెడ్డి 493
81. కె.వి. రెడ్డి 497
82. తిక్కవరపు వెంకట రమణారెడ్డి 501

**పత్రికారంగ ప్రముఖులు :**

83. జి.కె. రెడ్డి 503
84. గజ్జెల మల్లారెడ్డి 507

**కళారంగ ప్రముఖులు :**

85. పి.టి. రెడ్డి 511

**అవధూత :**

86. సద్గురు శ్రీ కాశినాయన 513

# మొదటి భాగము

# రెడ్డి కులాభిమానం

"తమ కులాభ్యున్నతి కయి యత్నంబు సలుప
అన్యకులముల ద్వేషించినట్లు గాదు
బలిసి సర్వాంగకంబులు పటువులైన
మహితమౌగాదె దేహ సమిష్టి బలము"

– కవికోకిల దువ్వూరు రామిరెడ్డి

# రెడ్డి వెలుగులు

“దుష్టుల శిక్షించి శిష్టుల రక్షించు
పరమార్థ ధర్మ నిర్వహణమందు
అరులను నిర్జించి యరులను నార్జించు
కలిత మహార్థ సంగ్రహణమందు
కవి పండితుల బ్రోచి కావ్య సత్కళలను
భరియించు కామతత్పరతయందు
షట్కాల శివపూజ సరవిమై జరగించు
మోక్ష సంపాదైక దీక్షయందు
బహుశాస్త్ర నిధులకు బలుసీమలం దగ్ర
హారంబులొసగు దోహలనందు
వాణిజ్య వృద్ధికై పరదేశముల తోడ
వ్యాపారముల్ సల్పు యత్నమందు
సాగరప్రతిమాన సరసుల నిర్మించి
భూత తృప్తిని గొల్పు పూన్కియందు
స్థిరతరంబుగ నిల్వ దేవాలయములకు
నిత్య వసతి గూర్చు నిష్ఠయందు

వ్యక్తమౌ రెడ్డిరాజుల పౌరుషంబు
తెల్గునాటను సతత ప్రదీప్తమగుచు
వెల్గుచున్నది సకల దిగ్వీథులందు
అదియ భజియింపు తరియింపు డాంధ్రులార”

*– బండారు తమ్మయ్య*

# రెడ్ల ఆధునిక కర్తవ్యం

"మన కులమందు బుట్టిన యమానుష శౌర్యులు మున్ను సంగరా
వని తమ కార్యసిద్ధిగని వన్నెయు వాసియు గాంచిరిప్పుడో
ఘనతర బాహు సంపదకు గాలముకాదు వచోమయంబులీ
దినములు, కత్తులేల యిక? తీటగ బూనుడు నాలుకల్ వడిన్"

– ***డాక్టర్ సర్ కట్టమంచి రామలింగారెడ్డి*** *ఎం.ఏ. (కాన్‌టాబ్)*
ఆంధ్రా యూనివర్సిటీ ప్రథమ వైస్ ఛాన్సలర్

# రెడ్డి వైభవం

ప్రజలే ఊపిరిగా, పరిపాలనే దక్షతగా రాజ్యాన్నేలిన జాతి రెడ్డిజాతి. రెడ్డితనం అసామాన్య సంపద. అట్టి సంపదను పేర్కొనటం, తెలుసుకోవటం, గౌరవించటం, పొందటం ప్రతి రెడ్డి సోదరీ సోదరుల విధి. ఈ సంపద వంశపారంపర్యంగా ప్రవహించే జన్యు నిధి. శౌర్యం, ప్రతాపం రెడ్డిజాతి స్వభావ గుణాలు. సర్వజన సంక్షేమం, అభ్యుదయం రెడ్డిజాతి మహాశయం. అట్టి జాతిలో జన్మించిన వారందరు ధన్యులే.

రెడ్డిజాతి ప్రజలను, దేశాన్ని పరిపాలించిన జాతి. పరిపాలనా దక్షత రెడ్డిజాతి వారసత్వం. సమర్థ నాయకత్వం రెడ్డిజాతి లక్షణం. సంస్కృతీ సదాచార రక్షణ రెడ్డిజాతి వైశిష్ట్యం. దయా, దాక్షిణ్యం, సోదరభావం, పరోపకారం రెడ్డిజాతి విశేషం. మహాభ్యుదయం రెడ్డిజాతి ప్రణాళిక. శాంతి, సుహృద్భావం రెడ్డిజాతి నినాదం. అందుకే రెడ్డిజాతి సుదీర్ఘ చరిత్ర తెలుసుకోవటం ఒక సామాజిక అవసరం.

రెడ్డిరాజులు ఆంధ్రదేశాన్ని క్రీ.శ. 1325 నుండి క్రీ.శ 1424 వరకు 100 సంవత్సరాలు పాలించారు. అదొక స్వర్ణయుగమని చరిత్రకారులు చరిత్రలో పేర్కొన్నారు. కాకతీయుల పతనానంతరం అటు సింహాచలం నుండి ఇటు కందుకూరు వరకు, అటు శ్రీశైలం నుండి ఇటు తీరం వరకు గల తెలుగు ప్రాంతాన్ని రెడ్డిరాజులు పరిపాలించారు. ఆనాటి ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, వ్యాపార విధానాలను తెలుసుకోవటం అందలి ప్రాభవ వైభవాలను స్వీకరించటం కోసమే.

### కుల ప్రాముఖ్యతలు

భారతదేశంలో నేడు కుల వ్యవస్థ మూడు పూవులారు కాయలై వర్ధిల్లుతున్నది. రాజ్యాంగంలో దేశవ్యవస్థను లౌకిక వ్యవస్థగా వ్రాసుకున్నాగాని అది మేడిపండే. అదే రాజ్యాంగం కులాన్ని నెత్తికెత్తుకున్నది. లౌకిక పవిత్రత నేడు ప్రశ్నార్థకమైంది. ప్రజల్లో కులమత భావనలు

ప్రకోపించి ఎవరి కులానికి వారు కోటలు కట్టుకుంటున్నారు. రాజకీయ పార్టీలకు కులం ప్రధానమైంది. కొన్ని రాజకీయ పార్టీలు వారి ప్రభుత్వాలను అడ్డం పెట్టుకొని రాజకీయలబ్ధి కొరకు, వ్యక్తిగత ప్రయోజనాలకు కులాన్ని బలంగా వాడుకుంటున్నారు. అందుకు కుల రిజర్వేషన్లు, కులకార్పొరేషన్లు, కులప్రాధాన్యతతో బడ్జెట్లు, ప్రత్యేక అర్హతలు, వెసులుబాట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆర్థిక సమానత, సామాజిక సమానత ఆలోచనలు లేవు. ఒక కులంపై మరొక కులం ఎగబడుతుంది.

జనాభాతో పాటు కులం మతం తన సమూహాలను పెంచుకుంటూ ఎవరి మతాన్ని వారు, ఎవరి కులాన్ని వారు రక్షించుకునే దారిలో వున్నారు. జనమంతా కలిసి నడిచే యోగం మనదేశంలో ఎప్పటికి చూస్తామో తెలియదు. చరిత్రలో లేని కులాలు కూడ పుట్టుకొచ్చాయి. చరిత్రలోని ఏదో ఒక రాజుని తమ కులానికి అతికించుకుంటున్నాయి.

కుల వ్యవస్థలు కార్పణ్యాలు పెంచుకొని యుద్ధవాతావరణం సృష్టిస్తున్నందున ఏ కులానికాకులం వ్యష్టిగా రక్షించబడాలంటే, ఆత్మరక్షణ పొందాలంటే ఎవరి కులాన్ని వారు ప్రేమించవలసిందే, గౌరవించాల్సిందే, కాపాడుకోవలసిందే. ఇది కాలానుగుణ్య అవసరం. లేకుంటే మానవ హక్కులు కాపాడబడలేవు.

రాజ్యాంగం కూడ, పుట్టిన 70 సంవత్సరాల నుండి కులవ్యవస్థను నెత్తికెక్కించు కుంటుందే తప్ప విడవటం లేదు. ప్రభుత్వాలు పేదరిక ప్రాధాన్యతతో కాకుండా కుల ప్రాధాన్యతలతో నడిచేటపుడు ఈ విధానాన్ని ఎదుర్కొనలేము. కాని దాని నుండి రక్షించుకోవటానికి కులాలు లేదా మతాలు సంఘటితం కావలసిన అవసరం ఏర్పడింది. ప్రభుత్వాలకూ కులరాజకీయమే ప్రధానమైన అంశంగా వుంది. దౌర్భాగ్యం.

ఈనాటి వ్యవస్థలోని సామాజిక పరిస్థితుల దృష్ట్యా రెడ్డికులం వెనుకబడి వున్నది. రెడ్డికులం ఐక్యంగా నిలబడి తనను తాను రక్షించుకోవలసిన అవసరం ఏర్పడింది. గతంలోని రెడ్డికులం యొక్క సమైక్యతా భావనలను ఘనతలను, శౌర్య ప్రతాపాలను తెలుసుకొని అర్థం చేసుకొని, అందరి మార్గదర్శకాలను ఆకళింపు చేసుకొని ఇతర కులాలపై ఘర్షణ భావనలు లేకుండా సర్వమానవ సమానత్వాన్ని సాధించటానికి, లౌకికతత్వానికి విఘాతం లేకుండా

ఐకమత్యతతో ముందుకు సాగటానికి, రెడ్డిరాజుల చరిత్రను, సంస్కృతీ–సంప్రదాయాలను, పరిపాలనా విధానాలను తదుపరి కాలంలోని రెడ్డి ప్రముఖుల త్యాగనిరతిని తెలుసుకోవటం రెడ్డిజాతికి మరొక సామాజిక అవసరం.

ఈ సందర్భంలో మన పూర్వ రెడ్డిపెద్దలు, ఇతర ప్రముఖులు రెడ్డిజాతిని గూర్చి చెప్పిన విషయాలను, రెడ్డిజాతికి చేసిన ప్రబోధాలను కొన్నింటిని తెలుసుకొనుట కూడ రెడ్డిజాతికి అవసరమే.

"సచ్చిదానంద దర్శనుడు వేమన యోగి
మనకులంబున బుట్టెననిన చాలు
షట్చక్రవర్తి సచ్చారిత్ర నిర్మాత
మనవాడెయన్న యాఘనత చాలు
ఆంధ్ర వీరాంగనయైన నాయకురాలు
మన కులస్త్రీయన్న మాట చాలు
ఔదార్య ధుర్యాత్ముడనవేమ భూపుడు
మావాడెయన్న సంబరము చాలు

నింక నెందఱెందఱనో యహీన యశుల
కాంచి లోకైక విఖ్యాతిగొన్నయట్టి
రెడ్డి కులపు చారిత్రంబు శ్రేష్టమనుట
కేమిలోపంబు గలదు? మీరెఱుగరయ్య"

"పోయిరేగాని, వారల భూతినుండి;
రేగుచున్నది వెండియు రెడ్డిశక్తి;
యింక నొకమారు లోకంబు నెల్ల నాత్మ
దివ్యతేజంబునన్ముంచి తేల్పగలదు"

"కొండవీటి దుర్గంబున క్రుంకినట్టి
రెడ్డి సూర్యుండు కాళరాత్రిని తరించి

యభినవాంశు ప్రసారంబు లలరు చుండ
తూర్పు దిక్కున నల్లదే తోచువాడు".

తగు జాగ్రత్తలు కూడ చెప్పారు.

"కాలాను సారంబుగా వచ్చు మార్పుల
నందుకోనున్న మున్ముందు జనుము
జగతి మీన న్యాయ సరణి విజృంభించు
వెనుకబడిక్కిన జాతి వీటిపోవు
సగము చచ్చిన పూర్వసంప్రదాయంబుల
విడలేక మిడుకుట వెఱ్ఱితనము
మన జీవితము యుద్ధమన జెల్లు, దానిలో
నగ్రగామియెపొందు నధిక ఫలము

ఇంక పరవృత్తియనియు, స్వవృత్తి యనుచు
దురభిమానంబున విభేద మరయువారు
జీవనస్పర్ధ సామాన్య చేష్టయైన
మనుజ సంఘంబునన్ నిల్చి మనుట యరుదు"

"మనపూర్వుల్ కడుగొప్పవారలను సమ్మానంబు నట్లుంచి, యీ
జనబాహుళ్యమునందు నేటి మనకున్ స్థానంబు నార్జింప చే
సిన యత్నంబులె లాభకారులగు: ప్రాచీనంపు రాజ్యప్రథన్
గొని తచ్ఛాయల దాగనెంతురె యుదగ్రుల్ నేటి రెడ్డ్యగ్రణుల్'

– కవికోకిల దువ్వూరు రామిరెడ్డి

అని రెడ్డిజాతి అందుకొనవలసిన మార్గదర్శకం సూచించాడు. రెడ్డిజాతి ఘనతను గూర్చి చెప్పటమే కాక కర్తవ్యాన్ని కూడ ఇలా ప్రబోధించాడు దువ్వూరు రామిరెడ్డి.

"నేడు పవిత్ర వాసరము నిర్మల చిత్తము తోడ నందఱుం
గూడి కులాభివృద్ధి కొఱకుం బనిసేయగ దీక్షపూని మీ
వాడల పల్లెలన్ నగరవాటికలందు ప్రబోధ గీతముల్
పాడుడు, కంకణాలు మణిబంధములన్ ధరియింపుడర్థిమై"

రెడ్డిరాజ ప్రశస్తిని గూర్చి మహాకవి **కాళ్ళకూరి హనుమంతరావు** పంతులుగారిలా అన్నారు.

"ధణధణంధణ ధణధణధణ మహోగ్ర
పటహనిస్వన నర్తిత ప్రధన విజయ
రెడ్డి ధాత్రీ తలేంద్ర భూరి ప్రతాప
బాహు ఖడ్గంబులకు జేతు బ్రసవపూజ"

"అగ్రహారములలో నాందోళికల నెక్కి
యెఱ్ఱన యెచ్చోట నీరువాఱె
గస్తూరిలో మున్గి కనకంబులో నాడి
శ్రీనాథుడెచ్చోట సిరుల దూగె
పాళెంబులం గాంచి పైడి యందలమెక్కి
సూరన యెచ్చోట సుఖము జెందె
పల్లెలు మాన్యము ల్బడసి భోగములతో
గౌరన యెచ్చోట గలిమి బొదలె
నెచట గవితా వధూటి యాడేరి నగల
కులుకుతో బ్రౌఢశృంగారముల నటించె
నట్టి రెడ్డినృపాల రాజ్యప్రశస్తి
దలప జలుజల్లుమని మేను పులకరించు"

ఇవన్నీ రాజ్యపాలనలో రెడ్డిరాజులు ప్రజలకు ఎంత చేరువైనారో, ఏమేమి చేశారో తెలుసుకొనవలసిన అంశాలలో కొన్ని అంశాలు. అంతేగాక నేటి రెడ్లు ఆ చరిత్రను అవగాహన చేసుకొని పూర్వవైభవాన్ని ప్రతిష్టించటానికి ఏయే పద్ధతులు అవలంభించవలెనో తెలిపే విషయాలు కనుక ఇచ్చటే ముచ్చటించవలసి వచ్చింది.

# 14వ శతాబ్దికి పూర్వం రెడ్డిరాజుల యున్నతి

14వ శతాబ్ది పూర్వపు రెడ్డిరాజుల యున్నతిగూర్చి **కొత్త బావయ్య చౌదరి**గారు ఇలా పేర్కొన్నారు.

వేంగీ దేశమున చాళుక్య సామ్రాజ్యమును, ఓరుగంటియందు కాకతీయ సామ్రాజ్యమును విజృంభించుచుండిన 11, 12, 13 శతాబ్దులలో రెడ్డికులజు లెచ్చటగాని ప్రత్యేక రాజ్యమును పాలించుచుండలేదు గాని చాళుక్య, కాకతీయ సామ్రాజ్యములలో నప్పటికి నివసించుచునే యచ్చటచ్చట కొందరు రెడ్డివీరులు రాజసేవలో నుండి, దేశపాలనలో పాల్గొనుచు వచ్చినట్లు యిప్పటికి దొరకిన శాసనములనుబట్టియు, మన యాంధ్రభాషా వాఙ్మయమువల్లను స్పష్టపడు చున్నది. రెడ్డికులజులు ప్రత్యేకమొక తెగగా నేర్పడిన పిమ్మట, అనగా దాదాపు 12వ శతాబ్దము నుండి వీరెచ్చటెచ్చట రాజసేవలో ప్రసిద్ధినందుచు వచ్చిరో యా విషయములను సంగ్రహముగ నీవ్యాసమున బేర్కొనెదను.

శా.శ. 1039 సం॥లో కమ్మనాటిలోని ప్రేంపల్లి(బాపట్ల) ప్రాంతమున మావుందల కొమ్మిరెడ్డి కొడుకు పోతిరెడ్డి యనునతుడును, శా.శ. 1085 సం॥ ప్రాంతమున తాడూరి పురపాలకుడగు మారసాని కేతిరెడ్డి చేజెర్లవద్దను, ప్రసిద్ధి చెందిన రెడ్డివీరులుగ గన్పడుచున్నారు. వీరి శాసనములు బాపట్లలోను, చేజెర్లయందును గన్పడుచున్నవి.

శా.శ. 1061 సం॥ ప్రాంతమున వెలనాటికులోత్తుంగ గొంకరాజువద్ద ముమ్మడి భీమవరం అయ్యపరెడ్డి కొడుకు నూంకారెడ్డియనునతడొక సెట్టిగానుండి ద్రాక్షారామమునందలి శ్రీ భీమేశ్వరస్వామి కఖండ దీప దానము గావించియుండెను.

శా.శ. 1080 సం॥ ప్రాంతమున కులోత్తుంగ రాజేంద్ర చోడరాజు వద్ద ఇలిందవాడ సూరపరెడ్డి యనునతడు ముదుసరియను నుద్యోగమునందుండెను. ఇతడు గూడ శ్రీ దాక్షారామ భీమేశ్వరాలయమునందలి ఆదివినాయక దేవునకు మధ్యాహ్న సంధ్యవేళల యారగింపునకై 1500 చెట్లుగల పోకతోటను దానమిచ్చి శాసనము వ్రాయించియుండెను.

తూర్పు చాళుక్య చక్రవర్తియగు కులోత్తుంగ చోడదేవుని విజయరాజ్యము 15 సం॥ నాటికి (క్రీ.శ. 1091 సం॥) ద్రాక్షారామ ప్రాంతమున తెప్పనవిట్టపరట్టడి, బోనిరట్టడి, నడకుదిరి సూరపరట్టడి, అండపురి అయితమరట్టడి, బెండనిపూడి కామిరట్టడి, పెంబల్లివాడ సోమురట్టడి యనువారలు ప్రసిద్ధిగానుండి శ్రీభీమేశ్వర సన్నిధానమున వెలనాటి గొంకనృపాలుని యానగా బ్రతిజ్ఞ జేయుచు వ్రాయబడిన యొక శాసనమున చేవ్రాళ్ళ నుంచినట్లు గన్పడుచున్నది. ఈ రట్టడి బిరుదాంకితు లందరును రెడ్డివీరులే యైయుందురని తలచుచున్నాను.

గుడిమెట్ట సీమను శా.శ. 1112 సం॥ ప్రాంతమున బాలించుచు వచ్చిన చాగిదోరయ రాజను మహామండలేశ్వరునివద్ద గంధసిరి సూరపరెడ్డి యనునతడొక యుద్యోగిగా నుండి బెజవాడలోని శ్రీమల్లేశ్వరస్వామి కఖండదీపదానము గావించి యుండెను.

శా.శ. 1065 సం॥ ప్రాంతమున కడలునాంటిలోని ముంజేటి గంగిరెడ్డి యనునతఁడుండి తనవృత్తియైన అలమును సకలసంపదలతో శ్రీభీమేశ్వరునకు ధారాపూర్వకమొనర్చియుండెను.

ధరణికోటను పాలించుచు వచ్చిన కోట బేతరాజువద్ద శా.శ. 1163 సం॥ ప్రాంతమున ముత్తసాని కాటమరెడ్డి యనునతఁడొక యుద్యోగిగానుండి తనతమ్ముడు బైర్రెడ్డితోను, చెల్లెలు దెన్నసాని కుమారుఁడు యెఱ్ఱం గొమ్మినాయఁడుతోను, మరదియగు సూరపనాయకునితోను కలిసి బేతరాజునకు ధర్మార్థముగా యనమదల గ్రామమందు (గుంటూరు తాలుకాలోనిది) వీరభద్రస్వామిని ప్రతిష్ఠించి యాదేవునికి పల్లపుభూమి మరుతును, మెట్టచేను ఖ3ను దానమిచ్చి శాసనముగా వ్రాయించెను. కమ్మరాష్ట్రము నందలి రెడ్డివీరు లీవిధమున బ్రసిద్ధిజెందుచుండు కాలముననే కాకతీయరాజులవద్ద గూడ కొందరు సేనాధిపతులుగ బ్రసిద్ధినందుచు వచ్చిరి. అట్టివారిలో మొదట బేర్కొనదగినవాఁడు రేచెర్ల బమ్మసేనాని అను బమ్మిరెడ్డి. ఇతఁడు కాకతీయ ప్రభువును క్రీ.శ. 1050–80 సం॥లకు మధ్య పాలించిన మొదటి ప్రోలరాజువద్ద సేనాధిపతై ఉండి, కాంచీపుర చోళరాజులతో జరగిన యుద్ధమున వారిని జయించి మిక్కిలి ప్రఖ్యాతి బడసెను. అతని తర్వాత నాతని వంశమున వరుసగా ముచ్చసేనాని, కాటచమూపతి, కామచమూపతి యను వీరులుద్భవించి కాకతిరాజుల కొలువులోనే యున్నట్లు కన్పడుచున్నది. కామచమూపతి క్రీ.శ. 1115–1158 సం॥ల మధ్య పాలించిన రెండవ ప్రోలరాజు కాలమున నుండి మంథన్యగుండాధిపుడను ప్రోలరాజు ప్రత్యర్థిని సంహరించి ఖ్యాతిగాంచెను. ఈ కామచమూపతి కుమారులగు రేచెర్ల బేతిరెడ్డి, నామిరెడ్డి యనువారలు వరుసగా కాకతి

రుద్రదేవుని వద్ద (క్రీ.శ. 1156–1195 సం॥ మధ్య పాలించినవాడు), గణపతిదేవ చక్రవర్తి వద్ద (క్రీ.శ. 1198–1261 సం॥) సేనానులుగ వ్యవహరించిరి.

ఈ యిర్వురును మిక్కిలి ప్రసిద్ధులుగా నుండినట్లు వీరికిగల బిరుదావళులే తెలుపుచున్నవి. సకలగుణగణాలంకార, పరనారీదూర, ఆమనికంటి పురవరేశ్వర, వీరలక్ష్మీ నిజేశ్వర, మార్బలభీమ, రణరంగరామ, వితరణకర్ణ, శౌర్యసౌపర్ణ, పతిహితాంజనేయ, శౌచగాంగేయ, సత్యరత్నాకర, దుష్టజనభీకర, స్వామిద్రోహరగండ, బేదనదండ, మనుమ కులాదిత్య, సుభటసంస్తుత్య నామాదిబిరుదములు బేతిరెడ్డియు, నాతని తర్వాత నామిరెడ్డియు వహించుచు వచ్చిరి.

బేతిరెడ్డి భార్యయగు యెఱ్ఱక్కసానియు, నామిరెడ్డియు పిల్లలమర్రియందు వరుసగా శా.శ. 1130, 1117, 1124 సం॥ల యందు శ్రీ ఎఱకేశ్వర, కాచేశ్వర, కామేశ్వర, నామేశ్వర దేవాలయములను గట్టించి వాని కనేక భూదానములను గావించియుండిరి. బేతిరెడ్డి కుమారుడగు మల్లారెడ్డి గూడ మిక్కిలి ప్రసిద్ధిగలవాఁడని యెఱ్ఱక్కసాని శాసనమున నభి వర్ణింపఁబడియున్నాఁడు.

ఈ నామిరెడ్డి, బేతిరెడ్లు నేటి వెంకటగిరి సంస్థానము వారికి మూలపురుషుఁడుగా వారి వంశావళియందుఁ బేర్కొనబడిన చెయ్యూరిపోలిరెడ్డికి మేనమామలుగాఁ గన్పడు చెవిరెడ్డి యను కుమారుని గాంచిన తరువాత చనిపోవుటవల్ల గాబోలప్పటికింకను జీవించియుండిన యాతనితల్లియగు వల్లాసాని యాతని పేరిట ప్రోలేశ్వరాలయ మొకటి గట్టించి నామిరెడ్డి యనుమతితో గొంతభూమి నాదేవళమున కోసంగినట్లు నామిరెడ్డి శాసనమువల్ల తెలియు చున్నది. ఈ శాసనమందు చెయ్యూరను యింటిపేరు కన్పడకున్నను, సందర్భముల నన్నిటిని యోచించిచూడగా, వల్లాసాని కుమారుఁడగు ప్రోలయయే దయ్యూరి పోలిరెడ్డి గాని యన్యుఁడుగాఁడని యూహించవలసి వచ్చుచున్నది. పిల్లలమర్రి రాజ్య మంతకుపూర్వము నుండి వెలుగోటివారి వంశీకులదని వారివంశ చరిత్రకారులు నిశ్చయించి నామిరెడ్డి సోదరుఁడగు బేతిరెడ్డిని, చెయ్యూరి పోలిరెడ్డి కుమారుఁడును భేతాళరెడ్డియను నామాంతరము గల చెవిరెడ్డిని యొకరిగనే తలంచిరి గాని వారిర్వురకుగల సంబంధమునుఁ గనిపెట్ట జాలకపోయిరి.

చరిత్రకారులలో కొందరిప్పటి వరకును లోగడ చెప్పబడిన రేచెర్ల రెడ్డివంశము నకును, వెంకటగిరి మూలపురుఁడగు బేతాళరెడ్డి వంశమునకు సంబంధములేదనియు రేచెర్ల రెడ్లపాలనము తర్వాత నీ వెలమకులజు లారాజ్యమును సంపాదించిరనియు తలంచియున్నారు. కాని యావంశీకులన్యోన్యసంబంధము గలవారేనని యూహింపరైరి.

నామిరెడ్డి యనంతర మాతని కుమారులగు కాట్రెడ్డియు, కామిరెడ్డియు మేనల్లుఁడగు చెవిరెడ్డియును బేతాళరెడ్డియు గణపతిదేవ చక్రవర్తి కడ సేనాధిపతులుగా మెలంగుచు వచ్చిరేగాని ఆమనగంటి లేక పిల్లలమర్రి రాజ్యము నామిరెడ్డి కుమాళ్ళే పాలించుచు వచ్చిరి. వారి శాసనములలో బేతిరెడ్డి, నామిరెడ్లు వహించిన బిరుదావళులే కన్పడుచున్నవి. అచట చెవిరెడ్డి పాలనము లేకుండుటవల్లనే యాతని శాసనము లేమియు నాప్రాంతమున గన్పడుటలేదు. గణపతిదేవ చక్రవర్తి (క్రీ.శ. 1261 సంాలో) చనిపోయిన పిమ్మట చెవిరెడ్డి కుమాళ్లు (దామ ప్రసాదిత్య, రుద్రనాయడులు) రుద్రమదేవి చక్రవర్తినికి బాసటగా నిల్చియుండిరి. అందు ప్రసాదిత్యనాయఁడామెకు బట్టముగట్టి కాకతిరాజ్యస్థాపనాచార్య బిరుదును వహించెను. మరియు రాయపితామహాంక బిరుదునుగూడ బొందెను.

చెవిరెడ్డి వంశీకులప్పటికి దేశమున విజృంభించిన వీరవైష్ణవమతమున బ్రవేశించి సంఘుసంస్కరణము నారంభించి, యితర హీనకులస్థులతో సమానముగ వ్యవహరించుట వల్ల నప్పటి నుండియు వెలమవారను పేరిట బ్రసిద్ధి నొందినట్లు గన్పడుచున్నది.

రుద్రమదేవి చక్రవర్తిని చెవిరెడ్డికుమాళ్ళ సమర్ధతను గుర్తించి పిల్లలమర్రి పాలనమును వారి పరము జేసినట్లు కన్పడును. గణపతిదేవ చక్రవర్తి చనిపోయిన పిమ్మట నాతనికిని, తమ తల్లిదండ్రులకును పుణ్యమునకై నామిరెడ్డి మనుమలగు గణపిరెడ్డి, మర్రెడ్డి నామయ, మల్లయలు వ్రాయించిన నాగులపాటి శాసనములలో వారేవిధమైన బిరుదములను ధరించినట్లు వ్రాయకపోవుటవల్ల నప్పటికి పిల్లలమర్రి రాజ్యమును, రుద్రమదేవి చక్రవర్తిని చెవిరెడ్డి కుమాళ్ళ పరమొనర్చియుండెనని తలంపవచ్చును. ఈ శాసనములలో నుదహరింపఁబడిన రక్తాక్షి, క్షయ సంవత్సరములు వరుసగా క్రీ.శ. 1264, 1266 సాల నాటివిగా గన్పడుచున్నవి. అప్పటి నుండియు నీ రేచెర్ల గృహనామస్థుల విషయము చరిత్ర ప్రసిద్ధిగాలేదు గాని, చెవిరెడ్డి

వంశీకుల ప్రతిభ క్రమముగా హెచ్చె, వారే వెలమ కులమను పేరిట ప్రత్యేక తెగవారై నాటినుండి నేటివరకు పారంపర్యముగ ననేక స్థలముల బాలించుచు వచ్చినట్లును, ఆ తెగలోని వారే నేటి వెంకటగిరి సంస్థానాధిపతులనియు వెలుగోటి వారి వంశావళి వలన స్పష్టపడుచున్నది.

రుద్రమదేవి చక్రవర్తి కాలముననే శా.శ. 1216 సం॥ నాటికి గోన గన్నారెడ్డియను వీరుఁడు మిక్కిలి ప్రసిద్ధి వహించి చక్రవర్తికి సామంతుఁడుగా వర్ధమానపురమును రాజధానిగా నాంధ్రరాజ్యములోని పడమటిభాగమున నధికారము వహించియున్నట్లు గన్పడును. ఈయన వద్ద విఠలనాధుఁడను సేనాని యుండెను. ఇతఁడుగూడ మిక్కిలి శూరాగ్రేసరుండై యుండెను. రాచూరిలోని యొక శాసనమునుబట్టి చూడగా సర్వత్రా మండలములోని దవాని, తుంబుళము, మానువ, హోలువ మున్నగు దుర్గములు సాధించినట్లు తెలిసెడిని. ఈ గోన గన్నారెడ్డి కనేక బిరుదావళులుండెను. సమస్త గుణగణాలంకార, సత్యరత్నాకర, సౌజన్యగౌరవ, అరిగండభైరవ, సాహసోత్తుంగ, కాకతీయకటకసన్నాహ, వీరవితరణోత్సాహ, కడుపులూరి పురవరాధీశ్వర, వీరలక్ష్మీ నిజేశ్వర, మనుకులమార్తాండ, మీసరగండ, ఉభయబలగండ, గండరగండ, అభంగ గండభేరుండ, హన్నిబ్బరగండ, హదిమువ్వరగండ, లాడకువరపెండార, చోళజగదాళ వీరకాంతికాక, గళమౌళి, దుష్టతురగరేఖా రేవంత, సమరసమయ, దుర్వారవీరావతార, కోసగిమైలితల గొండుగండ, ఉప్పులసోమనితలగొండుగండ, ఏందిభూపాలుని తలగొండుగండ, మేడిపలి కౌచయనాయకుని శిరసుండ, కందూరి కేశినాయని తలగొండుగండ, ఊపాక భీమ నిర్ధూమభామ, నిరుపమ సంగ్రామరామ, తెఱాల జాటదిశాపట్ట, ఎఱువతొండ ధూమ ఘట్టనఘకట్ట, బెడచెలుకినాయని నిస్సాణహరణ, సహజకార్యభరణ, కోటపెమ్మాడి రాయ వంశాభరణ చూఱకార, చోడోదయపట్ట సూత్రతురంగాపహార, రుద్రదేవ దక్షిణభుజదండ, నిజకీర్తిపూర్తి బ్రహ్మాండ కరండ, పరబలోద్దండ, శ్రీ సోమనాధదేవదివ్య శ్రీపాదపద్మారాధక, పరబలసాధక మున్నగు బిరుదములితఁడు ధరించినవి.

వీనిని బట్టి రుద్రమదేవి రాజ్యారంభమున ధిక్కరించిచ సామంతరాజు లనేకులతో నీ మహావీరాగ్రేసరుఁడు యుద్ధమాడి జయించినట్లు స్పష్టపడుచున్నది. వీనిని చర్వితచర్వణముగా జెప్పుటకన్న, పైబిరుదములవల్లనే సులభముగ గ్రహింపవచ్చును.

పైన నుడివిన రెడ్డివీరులందరివలెనే యీ గన్నారెడ్డియు శైవభక్తుఁడై యుండెను.

ఈ కాలముననే గోన విఠలరాజు కుమారుఁడు బుద్ధరాజనునతఁడు మిక్కిలి ప్రసిద్ధికి వచ్చి 'కవిలోకభోజుఁ'డను బిరుదును వహించి రంగనాథ రామాయణమను ద్విపద కావ్యమును రచించి తన తండ్రికి కృతి నొసంగెను. ఈతని తండ్రియగు విఠలరాజునకు "అరిగండభైరవ" బిరుదమున్నట్లా గ్రంథమున వ్రాయఁబడెను. అందుచే విఠలరాజుగూడ నొక సేనాధిపతిగనే యున్నట్లూహింప నగుచున్నది.

ఈ బుద్ధరాజు తన కుమార్తె కుప్పాంబను దుర్జయవంశీకుఁడును, రుద్రమదేవి చక్రవర్తిని కడ నొక సేనాధిపతియు నగు మల్యాలగుండ దండాధిపుని కిచ్చి వివాహమొనర్చెను. ఈ బుద్ధ రాజకుమారులలో 'మీసరగండ' బిరుదాంకితుఁడగు కాచవిభుఁడను నతఁడు ప్రసిద్ధికి వచ్చెను. ఈ బిదుదము వల్లనే యితఁడు గూడ నొక సేనానిగ గన్పట్టును. కాచవిభుఁడు వీరపురుషుఁడగుటయే గాక తన తండ్రివలెనే కవీశ్వరుఁడై ద్విపదకావ్యమును రచించి తమ తండ్రి కంకితమిచ్చిరి.

వీరప్రతాపరుద్రదేవ చక్రవర్తి పాలనము నాటికి (క్రీ.శ. 1296 సం॥) గోనబుద్ధ రాజునకు కాచమాంబయందు జనించిన మారయసాహిణి యనునతఁడు ప్రసిద్ధుఁడై, యా చక్రవర్తి వద్ద అశ్వసైన్యాధిపత్యమును వహించియుండెను. ఇతఁడు భాస్కర రామాయణమునకు కృతిభర్తయయ్యెను. భాస్కరరామాయణము కృతినొందిన మారయ సాహిణి నియోగి బ్రాహ్మణ మంత్రియని 32 మంత్రుల చాటుపద్యమున వ్రాయబడిన వ్రాత నిరాధారమైనదిగ గన్పడు చున్నది. పైన నుడివిన గోనవంశము వారందరును వరుసగా రామాయణములే వ్రాయించి యున్నట్లు కన్పడుటవల్ల నీయనగూడ నీవంశము లోనివాఁడేననియు, దన పూర్వీకులపోకడనే పోయెననియు గ్రహింపవచ్చును.

ఈతఁడు కృతినొందిన రామాయణమును మల్లికార్జునభట్టు, కుమారరుద్ర దేవుడు, భాస్కరుడు, అయ్యలార్యుఁడు నను నల్వురుకవులచే బూరింపఁబడినది. ఇందలి కొన్ని భాగములు శివునకంకితము చేయఁబడియున్నవి. ఈ మారయసాహిణి పుణ్యమునకై పల్నాటిసీమ కధికారిగా నుండిన మాచయసాహిణి క్రీ.శ. 1311 సం॥లో నొకధర్మముగావించి శాసనము వ్రాయించెను. వీరప్రతాపరుద్ర దేవునికడ నింకను గొందరు రెడ్డిప్రముఖులుద్యోగులుగా నున్నట్లు నిదర్శనములు గలవు. వేమారెడ్డి, బొబ్బారెడ్డి మున్నగు ప్రముఖులు సేనాధిపతులుగా

నున్నట్లును వారు రుద్రదేవుని పరిపాలనాకాలము చివర ననగా క్రీ.శ. 1323 సం॥లో జరిగిన మహమ్మదీయ దండయాత్రలలో బోరాడుచున్నట్లును స్థానిక చరిత్రల వల్ల దెలియుచున్నది.

పైన నుదహరించిన రెడ్డిప్రముఖులేగాక నాంధ్రదేశమున నున్నతస్థితికి వచ్చిన రెడ్డిజనులా కాలమున ననేకులుండెడి వారని యాంధ్రదేశమునగల వారిశాసనములను బట్టి నిశ్చయింప వచ్చును. ఇట్టి శాసనములు కొన్ని భీమేశ్వరాలయమునను, బెజవాడలోని మల్లేశ్వరాలయమునను మరికొన్ని చోట్లను గలవు. దిఙ్మాత్రముగ నుదహరించిన పై విషయములను బట్టి 12, 13 శతాబ్దములలో రెడ్డివీరులాంధ్రదేశమున క్రమముగా పలుకుబడి సంపాదించి, దేశపాలనలో బాల్గొనుచు, కాకతీయ చాళుక్య సామ్రాజ్య నివాసస్థులుగా నుండి క్రీ.శ. 1323 సం॥ ప్రాంతమున ప్రతాపరుద్రుని యోరుగంటి రాజ్యమును మహమ్మదీయులు భగ్నపరచిన పిమ్మట నద్దంకిలో వేమారెడ్డిచే స్వతంత్రరాజ్యమును స్థాపించుటకు దోహదమిచ్చిరని తలంపవలసియుండును.

కాకతీయుల పతనానంతరం ప్రముఖ రాజ్యమై, విజయనగర రాజులకు ఎదురు నిలిచి, సుల్తానులను ఓడించి దేదీప్యమానంగా శతాబ్దిపైకాలం వెలిగిన చరిత్ర రెడ్లది – రెడ్డిరాజులది. యుద్ధ విద్యలో, ప్రజా పరిపాలనలో, సంగీత సాహిత్యాది కళాపోషణలో, సంస్కృతి పరిరక్షణలో మేటిగా నిలిచిన రాజ్యం రెడ్డిరాజ్యం.

రెడ్డికులం చరిత్ర గలిగిన కులం అని చరిత్ర గ్రంధాలు చదివే వారికెవరికైనా తెలుస్తుంది. రెడ్డిరాజులు, రెడ్డి ఉద్యోగులు, రెడ్డి సైన్యం, రెడ్డి ప్రజలు స్వార్థంగా కుల ప్రాతిపదికపై కాకుండా నిస్వార్థంగా సర్వజన క్షేమాన్ని కోరేవారుగా, పరిపాలనా దక్షతతో ప్రజాశ్రేయస్సు కోరేవారుగా చరిత్ర చెబుతుంది. నేటి రెడ్డి కులస్తులు, ప్రజలు ఈ నిజాన్ని తెలుసుకొనటం అవసరం. ఒక కులం పేరుపై రాజ్యాన్ని స్థాపించినది రెడ్లేనని రెడ్డిజాతి సగర్వంగా చెప్పుకో గలుగుతుంది.

రెడ్ల చరిత్రను గూర్చి పూర్వకవుల, సాహిత్యం, రాజశాసనాలు, కైఫీయతులు (దండకవిలె) శిలలు – శిల్పాలు, కోటలు – గోడలు, దేవాలయాలు, అగ్రహారాలు వగైరాలన్నీ ప్రత్యక్ష సాక్ష్యాలే. తామ్రపత్ర శాసనాలు, శిలా శాసనాలు, పురావస్తు ఆధారాలు, చరిత్రకారుల యాత్రలు, సంస్కృత – తెలుగు సాహిత్యం, ముస్లిమ్ చరిత్రకారుల రచనలు, కాకతీయుల చరిత్ర, విజయనగర చరిత్ర, యూరప్ యాత్రికుల రచనలు, పరంపరాగత కథలు, బిరుదావళులు,

వగైరాల వలన రెడ్లచరిత్ర చాలవరకు తెలిసింది. సమాచారాలనన్నిటినీ గుదికూర్చి నిరాపేక్షగా రెడ్డిచరిత్రను ప్రజలకందించిన శ్రీ బుక్కపట్నం రాఘవాచార్యులు, శ్రీ మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ శ్రీ చిలుకూరి వీరభద్రరావు, డా॥ నేలటూరి వెంకట రమణయ్య, శ్రీ కె.వి. లక్ష్మణరావు, శ్రీ వడ్డాది అప్పారావు. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి, శ్రీ మానవల్లి రామకృష్ణ కవి, శ్రీ కుందూరి ఈశ్వరదత్తు, శ్రీ వేదం వెంకటరాయశాస్త్రి, శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ బి.ఎస్.ఎల్. హనుమంతరావు, శ్రీ బి.ఎన్. శాస్త్రి శ్రీ వి.వి. సుబ్బారెడ్డి, శ్రీ ఈమని శివనాగిరెడ్డి మరెందరో ప్రముఖులు రెడ్డిరాజుల, రెడ్ల చరిత్రను వెలికి తీశారు. సాహిత్యం ద్వారా తెలిసిన రెడ్ల చరిత్ర వందల గ్రంధాలలో నిక్షేపించబడింది. రెడ్డిరాజులే రచించిన కావ్యాలు దురదృష్టవశాత్తు లభ్యం కాలేదు.

రెడ్డికులస్తులు సచ్ఛీలురైయుండి పూర్వీకుల బాటలో నడుస్తూ పల్లెపల్లెలో, దేశదేశాలలో రెడ్డిజాతి ఘనచరిత్రను గూర్చి చెప్పవలసిందే. ఈ ప్రయత్నంలో ఇతర కులాల వారి చరిత్రకు, ఔన్నత్యానికి భంగం కలిగించరాదు. రెడ్డిరాజుల చరిత్రను ఆదర్శంగా పెట్టుకొని రెడ్డికులాభివృద్ధి కొరకు, ఇతర కులాల దాడినుండి రక్షణ కొరకు, దేశవిదేశాల్లోని రెడ్లు పాటుపడటం వివేకమైన పని కాగలదు. అందుకు వెనుకటి శతాబ్దాల, దశాబ్ధాలలోని రెడ్డిరాజుల చరిత్రను, రెడ్డి ప్రముఖుల సమాచారాన్ని రేఖామాత్రంగానైనా తెలుసుకొనవలసిన అవసరాన్ని రెడ్లు గుర్తించాలి.

చారిత్రకాధారాలను బట్టి సూక్ష్మంగా రెడ్డిరాజుల పాలనాక్రమం ఇలావుంది.

రెడ్లు రవికులోత్పన్నులని హంపిలో ప్రోలిరెడ్డి వేసిన శాసనాన్ని బట్టి మరియు వేమభూపాలుని శాసనాన్ని బట్టి తెలుస్తుంది. సోమనాధుడు వ్రాసిన అధ్యాత్మ రామాయణ మందూ అలానే వున్నది. కొత్త భావయ్య చౌదరి అలానే ధృవపరచాడు. రెడ్లు దేశ కాలానుగుణ్యంగా శాఖోపశాఖలైనారు. పంట, రేనాటి, మోటాటి, పాకనాటి, మొరస వగైరా వంశాలైనారు. 14వ శతాబ్దంలో తురుష్కులు ఆంధ్రదేశంపై దండెత్తారు. ఆ దండయాత్రలో ఏకశిలాపురము తురక ప్రభువుల కైవసమైంది. హిందువులంతా కాపయనాయకుని నాయకత్వం క్రింద తురకలతో పోరాడి ఓరుగల్లును రాజధానిగా రాజ్యం స్థాపించారు. అక్కడినుండి వెలమ వీరులు రాచకొండకు తరలారు. అప్పుడు పంటరెడ్డి కులీంద్రుడు, దేసటి వంశస్తుడు ప్రోలయ సైన్యాధిపతిగా సైన్యాన్ని నడిపి కృష్ణా నదిని దాటి పూంగినాడును

ఆక్రమించాడు. ప్రోలయ కుమారుడు వేమారెడ్డి. పూంగినాడుకు రాజధానిగా అద్దంకిని చేసుకొని దేసటి వేమారెడ్డి రాజ్యమేల ప్రారంభించాడు. తదుపరి ఆయన కుమారుడు అనపోతారెడ్డి సింహాసనాన్నధిష్టించాడు. రాజధానిని కొండవీడుకు మార్చాడు. ఆయన తదుపరి ఆయన సోదరుడు అనవేమారెడ్డి రాజ్యపాలన చేశాడు. ఆయన స్వర్గస్తులయ్యాక అనపోతారెడ్డి కుమారుడు కుమారగిరిరెడ్డి పరిపాలనకొచ్చాడు. ఈయనకు కర్పూర వసంతరాయలను బిరుదు నామం కలదు. ఆయన తన కుమారుడు వీరాన్నపోతారెడ్డిని రాజమహేంద్రవరములో నిలిపి రాజ్యం పరిపాలించారు. దురదృష్టవశాత్తు వీరాన్నపోతారెడ్డి అకాల మరణం చెందగా రాజ మహేంద్రవర రాజ్యానికి తన బావమరది కాటయ వేమారెడ్డిని అధిపతిని చేశాడు. కుమారగిరిరెడ్డి మరణానంతరం కొండవీటి రాజ్యానికి పెదకోమటి వేమారెడ్డి రాజయ్యాడు అంతర్యుర్ధా లొచ్చాయి. పెదకోమటి మరణించగా కుమారుడు రాచవేమారెడ్డి సింహాసనా న్నధిష్టించి దుర్మార్గపు పాలనజేసి హత్యగావించబడ్డాడు (రాచవేమారెడ్డి తమ్ముడే యోగి వేమన అనే వాదనొకటున్నది). ప్రోలయ వేమారెడ్డి సోదరుడు మల్లారెడ్డి వంశజులు శ్రీగిరిరెడ్డి అన్నారెడ్డి, మూడవ మల్లారెడ్డి తదితరులు క్రీ.శ. 1430 వరకు కందుకూరు రాజధానిగా పరిపాలించారు. కొండవీటి సామ్రాజ్యం విజయనగర రాజుల వశమైంది. తరువాత గజపతుల క్రిందకు పోయింది. గోల్కొండ ప్రభువులు ఫ్రెంచివారు, ఈస్ట్ ఇండియా కంపెనీవారు, బ్రిటిష్ పాలకులు పాలించారు.

రాజమహేంద్రవర రాజ్యమును కాపయ తన సోదరుని యల్లుడు కూనారెడ్డి కిచ్చి కోరుకొండ రాజధానిగా ఏలుకొమ్మన్నాడు. అతని తరువాత ముమ్మడి నాయకుడు కోరుకొండకు ఏలిక అయినాడు. తదుపరి తన తమ్ముడు సింగనకు ఆ రాజ్యమిచ్చాడు. సింగనకు ఐదుగురు కుమారులు. వారి తర్వాత ఆ రాజ్యం వెలమవీరుల క్రిందికి పోయింది. అదే సమయంలో కొండవీటి నేలుచున్న అనవేముడు కోరుకొండ నాక్రమించాడు. రాజమహేంద్రవర రాజ్యం కాటయవేముని పాలనలోనే 30 సంవత్సరాలు వున్నది. కాటయవేమునికి అల్లాడరెడ్డి సాయంగా ఉన్నాడు. అనితల్లికి ప్రతినిధియైనాడు. అనితల్లిని వీరభద్రారెడ్డి వివాహమాడాడు. వీరభద్రారెడ్డి వెలమ ప్రభువు లింగయ్య చేతిలో వీరస్వర్గం చేరాడు. అంతటితో రాజమహేంద్రవర రాజ్యం కూడ అంతరించింది.

# 14వ శతాబ్ది రెడ్డిరాజుల యున్నతి

కాకతీయుల పతనానంతరం ప్రముఖ రాజ్యమై, విజయనగర రాజులకు ఎదురు నిలిచి, సుల్తానులను ఓడించి దేదీప్యమానంగా శతాబ్దిపైకాలం వెలిగిన చరిత్ర రెడ్లది – రెడ్డి రాజులది. యుద్ధ విద్యలో, ప్రజా పరిపాలనలో, సంగీత సాహిత్యాది కళాపోషణలో, సంస్కృతి పరిరక్షణలో మేటిగా నిలిచిన రాజ్యం రెడ్డిరాజ్యం.

రెడ్డికులం చరిత్ర గలిగిన కులం అని చరిత్ర గ్రంథాలు చదివే వారికెవరికైనా తెలియును. రెడ్డిరాజులు, రెడ్డి ఉద్యోగులు, రెడ్డి సైన్యం, రెడ్డి ప్రజలు స్వార్థంగా కుల ప్రాతిపదికపై కాకుండా నిస్వార్థంగా సర్వజన క్షేమాన్ని కోరేవారుగా, పరిపాలనా దక్షతతో ప్రజాశ్రేయస్సు కోరేవారుగా చరిత్ర చెబుతుంది. నేటి రెడ్డి కులస్తులు, ప్రజలు ఈ నిజాన్ని తెలుసుకొనటం అవసరం. ఒక కులం పేరుపై రాజ్యాన్ని స్థాపించినది రెడ్లేనని రెడ్డిజాతి సగర్వంగా చెప్పుకోగలుగుతుంది.

రెడ్ల చరిత్రను గూర్చి పూర్వకవుల, సాహిత్యం, రాజశాసనాలు, కైఫీయతులు (దండకవిలే), శిలలు – శిల్పాలు, కోటలు – గోడలు, దేవాలయాలు, అగ్రహారాలు వగైరాలన్నీ ప్రత్యక్ష సాక్ష్యాలే. తామ్రపత్ర శాసనాలు, శిలా శాసనాలు, పురావస్తు ఆధారాలు, చరిత్రకారుల యాత్రలు, సంస్కృత – తెలుగు సాహిత్యం, ముస్లిమ్ చరిత్రకారుల రచనలు, కాకతీయుల చరిత్ర, విజయనగర చరిత్ర, యూరప్ యాత్రికుల రచనలు, పరంపరాగత కథలు, బిరుదావళులు, వగైరాల వలన రెడ్లచరిత్ర చాలవరకు తెలిసింది. సమాచారాలనన్నిటినీ గుదికూర్చి నిరాపేక్షగా రెడ్డిచరిత్రను ప్రజలకందించిన శ్రీ బుక్కపట్నం రాఘవాచార్యులు, శ్రీ మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ శ్రీ చిలుకూరి వీరభద్రరావు, డా॥ నేలటూరి వెంకట రమణయ్య, శ్రీ కె.వి. లక్ష్మణరావు, శ్రీ వద్దాది అప్పారావు. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి, శ్రీ మానవల్లి రామకృష్ణ కవి,

శ్రీ కుందూరి ఈశ్వరదత్తు, శ్రీ వేదం వెంకటరాయశాస్త్రి, శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ బి.ఎస్.ఎల్. హనుమంతరావు, శ్రీ బి.ఎన్. శాస్త్రి శ్రీ వి.వి. సుబ్బారెడ్డి, శ్రీ ఈమని శివనాగిరెడ్డి మరెందరో ప్రముఖులు రెడ్డిరాజుల, రెడ్ల చరిత్రను వెలికి తీశారు. సాహిత్యం ద్వారా తెలిసిన రెడ్ల చరిత్ర వందల గ్రంధాలలో నిక్షేపించబడింది. రెడ్డిరాజులే రచించిన కావ్యాలు దురదృష్టవశాత్తు లభ్యం కాలేదు.

రెడ్డికులస్తులు సచ్చీలురైయుండి పూర్వీకుల బాటలో నడుస్తూ, పల్లెపల్లెల్లో దేశదేశాలలో రెడ్డిజాతి ఘనచరిత్రను గూర్చి చెప్పవలసిందే. ఈ ప్రయత్నంలో ఇతర కులాల వారి చరిత్రకు, ఔన్నత్యానికి భంగం కలిగించరాదు. రెడ్డిరాజుల చరిత్రను ఆదర్శంగా పెట్టుకొని రెడ్డికులాభివృద్ధి కొరకు, ఇతర కులాల దాడినుండి రక్షణ కొరకు, దేశవిదేశాల్లోని రెడ్లు పాటుపడటం వివేకమైన పని కాగలదు. అందుకు వెనుకటి శతాబ్దాల, దశాబ్దాలలోని రెడ్డిరాజుల చరిత్రను, రెడ్డి ప్రముఖుల సమాచారాన్ని రేఖామాత్రంగానైనా తెలుసుకొనవలసిన అవసరాన్ని రెడ్లు గుర్తించాలి.

చారిత్రకాధారాలను బట్టి సూక్ష్మంగా రెడ్డిరాజుల పాలనాక్రమం ఇలావుంది.

రెడ్లు రవికులోత్పన్నులని హంపిలో ప్రోలిరెడ్డి వేసిన శాసనాన్ని బట్టి మరియు వేమ భూపాలుని శాసనాన్ని బట్టి తెలుస్తుంది. సోమనాధుడు వ్రాసిన అధ్యాత్మ రామాయణ మందూ అలానే వున్నది. కొత్త బావయ్య చౌదరి అలానే ధృవపరచాడు. రెడ్లు దేశ కాలానుగుణ్యంగా శాఖోపశాఖలైనారు. పంట, రేనాటి, మోటాటి, పాకనాటి, మొరస వగైరా వంశాలైనారు. 14వ శతాబ్దంలో తురుష్కులు ఆంధ్రదేశంపై దండెత్తారు. ఆ దండయాత్రలో ఏకశిలాపురము తురక ప్రభువుల కైవసమైంది. హిందువులంతా కాపయనాయకుని నాయకత్వం క్రింద తురకలతో పోరాడి ఓరుగల్లును రాజధానిగా రాజ్యం స్థాపించారు. అక్కడినుండి వెలమ వీరులు రాచకొండకు తరలారు. అప్పుడు పంటరెడ్డి కులీంద్రుడు, దేసటి వంశస్తుడు ప్రోలయ, సైన్యాధిపతిగా సైన్యాన్ని నడిపి కృష్ణా నదిని దాటి పూంగినాడును ఆక్రమించాడు. ప్రోలయ కుమారుడు **వేమారెడ్డి**. పూంగినాడుకు అద్దంకిని రాజధానిగా చేసుకొని దేసటి వేమారెడ్డి రాజ్యమేల ప్రారంభించాడు. తదుపరి ఆయన కుమారుడు **అనపోతారెడ్డి** సింహాసనాన్ని

అధిష్టించాడు. రాజధానిని కొండవీడుకు మార్చాడు. ఆయన తదుపరి ఆయన సోదరుడు **అనవేమారెడ్డి** రాజ్యపాలన చేశాడు. ఆయన స్వర్గస్తులయ్యాక అనపోతారెడ్డి కుమారుడు **కుమారగిరిరెడ్డి** పరిపాలనకొచ్చాడు. ఈయనకు కర్పూర వసంతరాయలను బిరుదు నామం కలదు. ఆయన తన కుమారుడు **వీరాన్నపోతారెడ్డిని** రాజమహేంద్రవరములో నిలిపి రాజ్యం పరిపాలించాడు. దురదృష్టవశాత్తు వీరాన్నపోతారెడ్డి అకాల మరణం చెందగా రాజమహేంద్రవర రాజ్యానికి తన బావమరది **కాటయ వేమారెడ్డిని** అధిపతిని చేశాడు. కుమారగిరిరెడ్డి మరణానంతరం కొండవీటి రాజ్యానికి **పెదకోమటి వేమారెడ్డి** రాజయ్యాడు. అంతర్యుద్ధాలొచ్చాయి. పెదకోమటి మరణించగా కుమారుడు **రాచవేమారెడ్డి** సింహాసనాన్నధిష్టించి దుర్మార్గపు పాలనజేసి హత్యగావించబడ్డాడు (రాచవేమారెడ్డి తమ్ముడే యోగి వేమన అనే వాదనొకటున్నది). ప్రోలయ వేమారెడ్డి సోదరుడు మల్లారెడ్డి వంశజులు **శ్రీగిరిరెడ్డి అన్నారెడ్డి, మూడవ మల్లారెడ్డి** తదితరులు క్రీ.శ. 1430 వరకు కందుకూరు రాజధానిగా పరిపాలించారు. కొండవీటి సామ్రాజ్యం విజయనగర రాజుల వశమైంది. తరువాత గజపతుల క్రిందకు పోయింది. గోల్కొండ ప్రభువులు, ఫ్రెంచివారు, ఈస్ట్ ఇండియా కంపెనీవారు, బ్రిటిష్ పాలకులు పాలించారు.

రాజమహేంద్రవర రాజ్యమును కాపయ తన సోదరుని యల్లుడు కూనారెడ్డి కిచ్చి కోరుకొండ రాజధానిగా ఏలుకొమ్మన్నాడు. అతని తరువాత ముమ్మడి నాయకుడు కోరుకొండకు ఏలిక అయినాడు. తదుపరి తన తమ్ముడు సింగనకు ఆ రాజ్యమిచ్చాడు. సింగనకు ఐదుగురు కుమారులు. వారి తర్వాత ఆ రాజ్యం వెలమవీరుల క్రిందికి పోయింది. అదే సమయంలో కొండవీటి నేలుచున్న అనవేముడు కోరుకొండ నాక్రమించాడు. రాజమహేంద్రవర రాజ్యం కాటయవేముని పాలనలోనే 30 సంవత్సరాలు వున్నది. కాటయవేమునికి అల్లాడరెడ్డి సాయంగా ఉన్నాడు. అనితల్లికి ప్రతినిధియైనాడు. అనితల్లిని వీరభద్రారెడ్డి వివాహమాడాడు. వీరభద్రారెడ్డి వెలమ ప్రభువు లింగయ్య చేతిలో వీరస్వర్గం చేరాడు. అంతటితో రాజమహేంద్రవర రాజ్యం కూడ అంతరించింది.

# "రెడ్డి" పదం

క్రీ.శ. 6వ శతాబ్దం నుండి "రట్టులు", "రాష్ట్రకూటులు" "రెడ్లు" ఉన్నారు. అంతకు పూర్వము "రట్టగుడ్లు" ఉన్నారు. 7వ శతాబ్దానికి కర్నాటకలోని గుల్బర్గా జిల్లా రాజధానిగా రాష్ట్రకూటులున్నారని, 7/8 శతాబ్దాలలో మన కడపజిల్లా శాసనాలలో "రట్టులు", "రట్టొడ్లు", "రెడ్లు" ఉన్నారని, క్రీ.శ. 973 నాటికి తెలంగాణాలో, రాయలసీమలో "రట్టడికం" ఉన్నదని శాసనాల ద్వారా తెలుస్తుంది. 'రట్ట' అనగా రాజ్యం అని, 'గుడి' అనగా వ్యవసాయమునకు గ్రామరక్షణకు భూమిని పొందినవారని అర్థంగా గతంలో చారిత్రకులు తెలిపారు. 'రట్టగుడి' క్రమంగా "రట్టఉడి", "రట్టాడి", "రెడ్డి"గా మరికొందరు చరిత్రకారులు భావించారు.

రట్టడికం వ్యవస్థను నిర్వహించిన వారిని రెడ్లు అని పిలిచారు. రట్టడికం అంటే గ్రామ సీమల్లో పన్నుల వసూళ్ళు, ప్రభుత్వానికి చెల్లింపులు, న్యాయపరమైన నిర్ణయాలు తీసుకోవడం మొదలైన గ్రామపాలనా నిర్ణయాలు, బాధ్యతలు నిర్వహించే వ్యవస్థ. రట్టడికం నిర్వహించే పెద్దను రట్టాడి అనేవారు. అదే పదం కాలక్రమంలో రడ్డి, రెడ్డి అయింది. రెడ్డి గ్రామ పరిపాలన, రక్షణ బాధ్యతలు నిర్వహించే అధికారి అయాడు. గ్రామ ప్రజల సంక్షేమానికి బాధ్యత వహిస్తాడు. శాంతి భద్రతలను కాపాడతాడు. రెడ్డిని కొన్ని ప్రాంతాలలో (నెల్లూరు వగైరా) కాపు అని కూడ అంటారు. కాపాడువారు అని అర్థం ద్యోతకమౌతుంది. క్రీ.శ.11వ శతాబ్దానికి కులాన్వయమైంది.

"ప్రాచీనాంధ్ర కావ్యాలలోని రెడ్డి పదం "రట్టడి", "రడ్డి", "రెడ్డి" అను రూపములను దాల్చియున్నది" (కుందూరి ఈశ్వరదత్తు – రెడ్డి సంచిక). మల్లికార్జున పండితారాధ్యుల వారి "శివతత్వసారములో "రట్టళ్ళు" అని, శ్రీకృష్ణదేవరాయ "ఆముక్తమాల్యద"లో "రడ్డు" అని తెనాలి రామకృష్ణ కవి "పాండురంగ మహాత్మ్యము"లో "రడ్డులు" అని, మల్లారెడ్డి "శివ ధర్మోత్తరము"లో "రడ్డి" అని, తంజావూరి "రఘునాధరాయల రామాయణం"లో "రెడ్డి" అని,

చేమకూర వేంకటకవి "సారంగధర చరిత్రము"లో "రడ్డి" అని పదాలు కనిపిస్తాయి అని సాహితీకారులు వెల్లడించారు. రట్టడి పదమే రాను రాను "రడ్డు" "రడ్డి" "రెడ్డి"యయి వుంటాయని చారిత్రకుల అభిప్రాయము. "రట్టడి" పదమే క్రీ.శ. ఏడెనిమిది శతాబ్దములలో తెలుగు చోళుల శాసనములలో 'రట్టగుట్టు', 'రట్టగుడి' అను రూపములు దాల్చాయి. రట్టగుట్టు, రట్టగుడి పదములె "రట్టడి" పదమునకు పూర్వరూపములని, ఈ రట్టగుడి పదమే వ్యవహారమున రట్ట+ఉడయై రానురాను రటొ్టడ, రట్టోడ, రట్టడ, రట్టడి, రడ్డి, రెడ్డియై చివరికి రెడ్డి పదమే స్థిరపడిందని దాదాపు అందరు చరిత్రకారులు అభిప్రాయపడ్డారు.

గుంటూరు జిల్లాలోని ఎర్రబాలెం శాసనంలో "రెడ్డి" "రట్టడి" పదాలున్నవి. "రెడ్డిక"మను పదము ఒక అధికార పదంగా సారస్వతంలో వ్రాయబడింది. "రాష్ట్రకూట" అను గీర్వాణ పదానికి "రట్టడము" అనే దేశ్యపదం చెప్పబడింది. ప్రాచీనాంధ్ర శాసనములలోని సంస్కృత భాగమునందలి "రాష్ట్రకూట" పదప్రయోగము తెలుగు భాగములలోని "రట్టడిక" మనే దేశ్యపదమునకు "సంస్కృతి"యని తెలుసుకొననగును. ఏడెనిమిది శతాబ్దములలో ఆంధ్ర దేశములో "రట్టగుడ్లు" లేక "రట్టగుట్లు" అను తెగవారున్నారు. వీరె "రట్టడు"లయ్యారు. వీరు రట్టములను చిన్న భూభాగములకు అధికారులై వాటిని గుత్తగా అనుభవిస్తుండిరి. ఆ కాలమున "రట్టడము"లనునవి ఒకవిధమైన ఆర్థిక సంస్థలు. ఆ రట్టడములు అష్టభోగ స్వామ్యములు గలిగి అనుభవించుచుండిరి. వీరి ముఖ్యవృత్తి మొదట వ్యవసాయము. రట్టడములకు అధికారులు రట్టడులు, రడ్డులు, రెడ్లు అయినారు. ఈ రట్టడ్ల, రెడ్ల సంతతి వారే బాహుబలశౌర్యముచే మాండలీకులై, స్వాతంత్ర్యమును వహించి, క్షత్రియోచితమైన ప్రజాపాలనము జనరంజకముగా సాగించి ఆంధ్ర భూమండలమునందు అఖండ యశముతో కీర్తిమంతులైరి. ఇందలి "రట్టడి" పదానికి ఒక గ్రామంపై గాని, గ్రామ కూటములపై గాని అధికారంతో అష్టభోగ సర్వసంపదలతో అనుభవించటం అని, అట్టివారు రట్టడులని ప్రస్ఫుట మగుచున్నదని రెడ్డిసంచికలోని ఈశ్వరదత్తుగారి వ్యాసం చెబుతుంది. ఆయష్ట భోగాలు:- నిధి, నిక్షేపము, జలము, పాషాణాలు, అక్షిణి(actual privileges), ఆగామి(Prospective rights) సిద్ధము (The land cultivated), సాధ్యము(The produce of such kind) అని

కూడ తెలుపబడింది. పూర్వపు నిఘంటువులలో "రట్ట" = (reign kingdom, empire, country) అని, గుట్టు, గుట్టెక = guardian, town watch man, chief constable అని, గుట్టు = lease or lessee, అని తెలియుచున్నది. రాష్ట్రకూట ప్రముఖులు అంటే the heads of provinces అనే అర్థంలో శాసనాలలో చెప్పబడింది. అయితే వేరు వేరు రాష్ట్రాలలో వేరు వేరు అర్థాలివ్వబడ్డాయి. శ్రీ సి.వి. వైద్యా పండితుడి ప్రకారం "రాష్ట్రకూట" పదము వృత్తి వాచకమును, అధికార సూచకమునై, రెండును మేళవించిన యొక స్వల్ప గ్రామాధిపత్యము అని క్రీ.శ. 12వ శతాబ్దం నాటికి శాసనములలో అధికారార్థములో చెప్పబడింది. ప్రముఖ చరిత్రకారులు కుందూరి ఈశ్వరదత్తుగారు ఈ చరిత్ర చర్చనంతయు ఈవిధంగా ముగించారు. "ఏడెనిమిది శతాబ్దములలో ఆంధ్రదేశంలో రట్టగుడ్లు లేక రట్టగుట్లు అను దెగవారుండిరి. వీరె రట్టడులైరి. వీరు రట్టకములను చిన్న భూభాగములకధికారులై వాటిని గుత్తగా ననుభవించుచుండిరి. ఆ కాలమునందు రట్టడములనునవి ఒకవిధమైన ఆర్థికసంస్థలు. ఆ రట్టకములను వీరు అష్టభోగస్వామ్యములు కలిగి అనుభవించుచుండిరి. వీరి ముఖ్యవృత్తి వ్యవసాయము. రట్టకముల కధికారులు రట్టడులు, రడ్డులు, రెడ్లు అయిరి".

## రెడ్డి పదోత్పత్తి పరిణామం

ఈశ్వరదత్తు గారి (రెడ్డి సంచికలోని) వ్యాసం ప్రకారం ఈ విధంగా ఉన్నది.

**రట్ట గుట్టు**

↓

**రట్ట గుడి**

↓

**రట్టడి**

↓

| రడి | రడ్డి | రెడి | రెడ్డి |
|---|---|---|---|

శ్రీ వైద్యా పండితుడిచ్చిన అర్థము కొంతవరకు సరిగా వున్నది రాష్ట్రకూట పదము వృత్తి వాచకము, అధికార సూచకమునై రెండునూ మేళవించిన యొక గ్రామాధి పత్యము నిర్దేశించుచున్నది. ఈ అర్థము 12వశతాబ్ద శాసనములలో కూడ కన్పడుచున్నదని చారిత్రకులు తేల్చారు. ఇప్పుడు రెడ్డి పదము వృత్తి వాచకముగా కాక జాతి కులద్యోతకమై ఆంధ్రదేశములో వ్యవహరింపబడుచున్నది.

**నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు**
**తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల**
**చదువ పద్య మరయ జాలదా యొకటైన**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**గంగిగోవుపాలు గంటెడైనను జాలు!**
**గడివెడైన నేల ఖరముపాలు?**
**భక్తిగల్గు కూడు పట్టెడైనను జాలు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**చిత్తశుద్ధిగల్గి చేసిన పుణ్యంబు**
**కొంచెమయిన నదియుఁ గొఱతగాదు**
**విత్తనంబు మఱ్ఱి వృక్షాన కెంతరా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# రెడ్డి వంశములు

రెడ్డి వంశములు కొన్ని చరిత్రలో తెలుస్తున్నై. పంటరెడ్డి వంశంలో, అద్దంకి కొండవీడు రాజులున్నట్లు, ప్రోలయ వేమారెడ్డి, అల్లయ వీరభద్రారెడ్డి, అల్లయ వేమారెడ్డి పంట వంశం వారని చరిత్రలో తెలుస్తుంది. అలానే కాటయ వేమారెడ్డి కూడాను. దేసటి వంశం అని సాహిత్యంలో చాలచోట్ల వచ్చింది. దేసటి అధికార ద్యోతకమైన శబ్దము. పంట, దేసటి రెండూ ఒకటేనని కొన్నిచోట్ల, రెండూ వేరువేరని కొన్ని చోట్ల తెలుపబడింది. ఎరపదేసటి, కొండదేసటి అనే విభాగం గూడ వచ్చినది. శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో "పంట దేసటి మహన్వయంబు" అని పలకరించబడింది. దేసటిని విడిగాకూడ అదే శ్రీనాథుడు వంశ, జాతి, గోత్రపరంగా కాశీఖండంలో వ్రాశారట. ఎర్రాప్రగడ హరివంశంలో "దేసటి వేమా" అని సంభోదించాడు. రాజమహేంద్రవరం వేమారెడ్డి వంశం వారు జ్ఞాతులని చెప్పబడింది. మరికొన్ని రెడ్డివంశములు చరిత్రలో గమనించవచ్చు. అవి రేచర్ల రెడ్డివంశము, చెఱకు రెడ్డివంశము, మల్యాల రెడ్డివంశము, విరియాల వంశము, గోన వంశము, వావిలాల వంశము, కొప్పుల రెడ్డివంశము , కోరుకొండ రెడ్డివంశము, కొన్ని సామంత మాండలిక వంశములు, చిన్న సామంత రెడ్డి రాజవంశములు పేర్కొనబడ్డవి. సాహిత్యంలో, శాసనాలలో మరికొన్ని వంశాలు చెప్పబడినవి. సాహిణి, దొంతి, వెల్లచేరి, రేచర్ల, చెరకురెడ్డి, గోన, వావిలాల, విట్టెకుల, పేరమరెడ్డి, కొలిపాక, కొప్పులరెడ్డి, కోరుకొండరెడ్డి, కొన్నాతాడి, దాడి, ఎరబోలు, సూరమరెడ్డి, భోగాది, మాదయరెడ్డి, మలిరెడ్డి, వగైరా ఆంధ్రదేశ మంతట చెప్పబడ్డాయి. ఇవి కాక మరికొన్ని శాఖలు చరిత్రలో కనిపిస్తున్నవి. నాడీ భేదమును బట్టి, నివాస గ్రామములను బట్టి వచ్చినవి.

పలు శాసనాలు, దేవాలయాలు, శిల్పములు, నాణెములు, కట్టడములు, సాహిత్యం, చారిత్రకాధారాలు, విదేశీయుల వ్రాతలు, చరిత్రకారుల విశిష్ట కృషి వలన రెడ్డి పాలకుల, పాలితుల పరిపాలనాంశములు, వంశములు పెక్కింటిని గుర్తించవచ్చు.

చారిత్రక పరిశోధనలో అవిశ్రాంత పథకుడనదగు శ్రీ బి.ఎన్. శాస్త్రి గారు తన ఉద్గ్రంథం "రెడ్డిరాజ్య సర్వస్వం"లో పలు రెడ్డివంశాలను గూర్చి పేర్కొన్నారు. అవి రేచర్ల రెడ్డివంశం, చెఱకురెడ్డి వంశం, మల్యాలరెడ్డి వంశం, విరియాల వంశం, గోనవంశం, వావిలాల వంశం, కొప్పులరెడ్డి వంశం, కోరుకొండ వంశం, కొండవీటి రాజ్యం, కోరుకొండ రాజ్యం, రాజమహేంద్రవర రాజ్యం, కందుకూరి రాజ్యం, చిన్నసామంతరెడ్డి వంశాలు, సంస్థానాలలో వంశాలు, దేసటి, దేసట పంటి, దొంతి, వెల్లచేరి, చందుఌ్ఱు, దాండి, భోగాది, మల్యాల వగైరా వంశాలున్నవని తేల్చారు.

**ఆత్మశుద్ధిలేని ఆచార మది యేల?**
**భాండశుద్ధి లేని పాకమేల?**
**చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**ప్రియములేని విందు పిండివంటలచేటు**
**భక్తిలేని పూజ పత్రి చేటు**
**పాత్ర మెఱుగని యీవి బంగారు చేటురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**మృగ మదంబుచూడ మీఁద నల్లగ నుండు**
**బరిఢవిల్లు దాని పరిమళంబు**
**గురువులైన వారి గుణము లీలాగురా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# రెడ్డి సంస్థానములు

రెడ్డి సంస్థానములకు దేనికదే సంస్థానాధీశులు కలిగి గొప్పచరిత్ర వున్నది. అవి

1. ఆలంపూర్ సంస్థానము
2. ఆత్మకూరు సంస్థానము
3. గద్వాల సంస్థానము
4. వనపర్తి సంస్థానము
5. దోమకొండ సంస్థానము
6. పాపన్నపేట సంస్థానము
7. మునగాల సంస్థానము
8. శిర్నపల్లి సంస్థానము
9. బోరవెల్లి సంస్థానము
10. గోపాలపేట సంస్థానము
11. బుచ్చిరెడ్డిపాలెం సంస్థానము
12. నొసము సంస్థానము
13. నారాయణపురం సంస్థానము
14. దొంతి సంస్థానము
15. కొండూరు సంస్థానము
16. కార్వేటి నగర సంస్థానము

# రెడ్డి శాఖలు (కొన్ని)

1. మోటాటి
2. వెలనాటి
3. మొరస
4. నేరేటి
5. అయోధ్య
6. పంట
7. పొంగలినాటి
8. పాకనాటి
9. భూమంచి
10. కురిచేటి
11. మున్నూటి
12. దేసటి
13. ఓరుగంటి
14. గండికోట
15. కమ్మపురి
16. గోన
17. చిట్టెపు
18. కుంచెదుగ
19. గాజులు
20. కొణిదె
21. పెడకంటి
22. గుడాటి
23. గొనుగంటి
24. దేసూరి
25. నానుగుండ
26. నెరకాటు
27. పల్లె
28. బలిజ
29. భూస
30. తొగర్చేడు
31. యడ్లను
32. రేనాటి
33. లాలిగుండ
34. సజ్జన
35. సాదర
36. అరిటాకు

ఈ శాఖలు శాఖోపశాఖలై వందలైనవి.

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

# 2010 నాటి రెడ్డి జనాభా అంచనా

| | |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో | 1,50,00,000 |
| కర్నాటక | 50,00,000 |
| కర్నాటక ఒక్కలింగ రెడ్లు | 70,00,000 |
| తమిళనాడులో | 56,00,000 |
| కేరళ, పాండిచ్చేరి, అండమాన్ | 5,00,000 |
| విదేశాలలో | 3,00,000 |
| మొత్తం | 3,34,00,000 |

**మిరెము గింజ చూడ మీఁద నల్లగనుండు**
**కొఱికి చూడ లోనఁ జుఱుకు మనును**
**సజ్జనులగు వారి సార మిట్లుండురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# అద్దంకి - కొండవీడు రెడ్డి రాజ్యాలు

కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో (క్రీ.శ.1291-1320) రెడ్లు సైనికులుగాను, నియోగాధిపతులుగాను ఉన్నారు. ప్రతాపరుద్రుని దండయాత్రలు, యుద్ధాలలో రెడ్లు (ప్రోలయరెడ్డి) ప్రముఖపాత్ర వహించి విజయాలు సాధించారు. క్రీ.శ. 1323లో ఢిల్లీసుల్తాన్ ఘియాజుద్దీన్ తుగ్లక్ కుమారుడు జూనాఖాన్ ఓరుగల్లు కోటను ఆక్రమించుకొని ప్రతాపరుద్ర చక్రవర్తిని బంధించి ఢిల్లీకి తీసుకొని పోతుండగా నర్మదానదీ తరంగాలలో కైవల్యం చెందాడని ఒక సమాచారం చరిత్రలో ఉంది. ఆ జూనాఖానే "మహమ్మద్ బీన్ తుగ్లక్" అనే బిరుదు పొందాడు. అప్పటినుండి క్రీ.శ. 1325 వరకు ముస్లిముల ఆధిపత్యంలో తెలుగునేల విలవిలలాడింది. సహించలేక మాతృభూమి రక్షణకై హిందూధర్మాన్ని, సంస్కృతిని నిలబెట్టేందుకు ప్రోలయనాయకుని (ప్రోలయ వేమారెడ్డి) నేతృత్వంలో తిరుగుబాటు ప్రారంభమైంది. యుద్ధం జరిగి మ్లేచ్ఛులను పారద్రోలి ప్రోలయ వేమారెడ్డి, తన కనిష్ట సోదరుడు మల్లారెడ్డి సహాయంతో క్రీ.శ. 1325లో గోదావరి పెన్న నదుల మధ్యగల దక్షిణ తీరాంధ్ర దేశానిని వశపరచుకొని రెడ్డి రాజ్యాన్ని స్థాపించి అద్దంకి రాజధానిగా పరిపాలన ప్రారంభించాడు. క్రీ.శ. 1325 నాటి మల్లవరం శాసనంలో (ప్రకాశం జిల్లాలోని మల్లవరం) ప్రోలయ వేమారెడ్డిని "మ్లేచ్ఛాబ్ధి కుంభోద్భవ" అని పేర్కొనబడింది. అయితే క్రీ.శ.1320లోనే వేమారెడ్డి ధరణికోటలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడని కొన్ని సాహిత్య చరిత్రలలో చెప్పబడింది.

రెడ్ల చరిత్ర ఉత్తరాన సింహాచలం నుండి దక్షిణాన కందుకూరు వరకున్న తీరస్థ ప్రాంత ప్రజల భవితను రూపొందించినట్లు చరిత్ర చెబుతుంది. ఇది మూడు రాజ్యాల చరిత్ర. క్రీ.శ. 1325 నుండి 1448 వరకు అద్దంకి - కొండవీడు, రాజమహేంద్రవరం, కందుకూరు రాజ్యాలను పరిపాలించిన రెడ్డిరాజుల చరిత్ర.

రెడ్డి చరిత్రకు సాహిత్యం, శాసనాలు, కట్టడాలు, దుర్గములు, ఆలయాలు, నాణేలు మొదలైనవి ముఖ్యాధారాలు. చరిత్ర పరిశోధన పరంగా బుక్కపట్నం రాఘవాచార్యులు, మద్దులపల్లి గురుబ్రహశర్మ, చిలుకూరి వీరభద్రరావు, నేలటూరి వెంకటరమణయ్య, కె.వి. లక్ష్మణరావు, వడ్డాది అప్పారావు, ఈశ్వర దత్తు, వేటూరి ప్రభాకరశాస్త్రి, మానేపల్లి రామకృష్ణకవి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, సురవరం ప్రతాపరెడ్డి, బి.యస్.యల్. హనుమంతరావు, వి.వి.సుబ్బారెడ్డి, బి.ఎన్. శాస్త్రి, ఈమని శివనాగిరెడ్డి, వై.వై. రెడ్డి యానాల వగైరాలు రెడ్ల చరిత్రను, సంస్కృతిని వెలుగులోనికి తెచ్చారు.

సాహిత్యపరంగా శ్రీనాథుడు, ఎర్రన, బాలసరస్వతి, వామనభట్ట బాణుడు కొమ్మన, ముస్లిం రచయితలు, విదేశీయాత్రికులు, వంశావళులు, చాటువులు, రెడ్డి సంచిక తదితర గ్రంధాలు రెడ్డిరాజుల చరిత్రను ప్రపంచానికందించాయి.

అయితే రెడ్డిరాజులే వ్రాసిన ప్రముఖ గ్రంధాలు కాలవాహినిలో కలిసిపోయి చరిత్ర కందలేదు. ఇది దురదృష్టం. అనవేమారెడ్డి రచించిన సాహిత్య చింతామణి, సంగీత చింతామణి, శృంగార దీపిక, సప్తశతీ సారటీక, అమరుకశతి, కుమారగిరి రెడ్డి రచించిన వసంత రాజీయము, కాటయ వేమారెడ్డి రచించిన కుమారగిరి రాజీయము మనకి అందుబాటులో లేవు. ప్రోలయ వేముని కుమారులు అనపోతారెడ్డి, అనవేముడు పండితులే. అల్లారెడ్డి మునిమనవడు శివలింగం తత్వప్రణాళికను రచించాడు. అందరు రెడ్డిరాజులు సంగీత, సాహిత్య, నాట్య, కళల పోషకులే. విద్వాంసులు గణితవేత్తలు వైయ్యాకరణులు, సాహిత్యవేత్తలు, తర్కవేత్తలు, వేదాంతులు, న్యాయకోవిదులు, ఖగోళ శాస్త్రవేత్తలు అనేకం. ఎందరో బ్రాహ్మణులను ఆదరించి అగ్రహారాలిచ్చి పోషించారు.

మల్లారెడ్డి అండదండలతో ప్రోలయ వేమారెడ్డి వద్ద ఎర్రన ఆస్థానకవి అయాడు. పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో శ్రీనాథుడు విద్యాధికారి.

## సులభగ్రాహ్యంగా వుండటానికి

# కొండవీటి రెడ్డిరాజుల పాలనా కాలపట్టిక

## ఇలా ఇవ్వబడింది

| | | | |
|---|---|---|---|
| 1. ప్రోలయవేమ | శక:1247-1275 | క్రీ.శ.1325-1353వరకు | 28 సం॥ |
| 2. అనవోత | శక:1275-1286 | క్రీ.శ.1353-1364 వరకు | 11 సం॥ |
| 3. అనవేమ | శక:1286-1308 | క్రీ.శ.1364-1386వరకు | 22 సం॥ |
| 4. కుమారగిరి | శక:1308-1324 | క్రీ.శ.1386-1402 | 16 సం॥ |
| 5. పెదకోమటి | శక:1324-1342 | క్రీ.శ.1402-1420వరకు | 18 సం॥ |
| 6. రాచవేమ | శక:1342-1346 | క్రీ.శ.1420-1424వరకు | 4 సం॥ |
| | | | **మొత్తం 99 సం॥** |

# ప్రోలయ వేమారెడ్డి

క్రీ.శ. 1325–1353

రెడ్డి రాజవంశమునకు మూలపురుషుడు దొంతి అల్లారెడ్డి అని దండకవిలెలో వ్రాయబడి వున్నది (క్రీ.శ. 1225 ప్రాంతంలో).

ప్రోలయ వేమారెడ్డి రెడ్డిరాజ్య సంస్థాపకుడు. అద్దంకి రాజధానిగా రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు. కొండవీటి కైఫీయతులో రెడ్డిరాజ్య స్థాపకులు "దొంతి" వంశస్తులని చెప్తుండగా, ఎర్రాప్రగడ, శ్రీనాథుడు "దేసటి" వంశస్తులని వ్రాశారు. ఎర్రాప్రగడ ప్రోలయ వేముని "దేసటి వేమా" అని సంబోధిస్తూ పద్యం వ్రాశాడు. వీరిది వెల్లశేరి గోత్రమని శ్రీశైలంలోని వీరశిరో మండపంలోని శాసనం ద్వారా తెలుస్తుంది.

రెడ్డిరాజుల పేర్లలో 'కోమటి' అని 'వేమ' అని ఎక్కువగా కనిపిస్తుంది. ఈ పదాలకు చరిత్ర వున్నది. ఇది స్థానిక గాథగా కూడ చెబుతారు. దొంతి అల్లారెడ్డి రెడ్డిరాజులకు పూర్వీకుడు. ఆ కాలంలో కోమటి వేముడుండేవాడు. అతని వద్ద పరుసవేది (స్పర్శవేది) వున్నది. దానిని ఆయన అరణ్యాలలో సిద్ధులు, యోగుల వద్దకు చేరి వారిని సేవించి పరుసవేదిని సంపాదించాడు. పరుసవేది అంటే దానిని దేనికి తాకిస్తే అది బంగారమౌతుంది. వేముడు దానినుపయోగించి ధనికుడైనాడు. అది గమనించిన అల్లారెడ్డి వేముడిని మోసంచేసి పరుసవేదిని కాజేశాడు. ఆ యింటిని తగులబెట్టాడు. వేముడు ఆ దిగులుతో ఆ మంటలలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తరువాత కొన్నాళ్ళకు అల్లారెడ్డికి కోమటి వేముడు కలలోకొచ్చి వేముడనే తన పేరును, కోమటి అనే తన కులం పేరును అల్లారెడ్డి వంశీకులకు పెట్టుకోకపోతే సర్వనాశనం చేస్తానని చెప్పినందున, ఆ పాపపరిహారానికి వంశీకులకు కోమటి, వేమ అని విడిగా గాని, కలిపి గాని పెట్టుకున్నట్లు స్థానిక చరిత్రలు చెబుతున్నవి.

ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ. 1325లో రెడ్డిరాజ్య పాలననారంభించి తమ్ముడు మల్లారెడ్డిని సైన్యాధ్యక్షుడుగా నియమించుకున్నాడు. రైతు రాజు కావటం వలన పాలన సుభిక్షాన్నిచ్చింది. వ్యవసాయం, వ్యాపారం అభివృద్ధి చెందాయి. మోటుపల్లి (ప్రస్తుత ప్రకాశం జిల్లా) రేవు ద్వారా దేశాంతర వ్యాపారం సాగింది. వజ్రాలు, నగలు, బట్టలు వగైరా ఎగుమతులు – దిగుమతులలో అవచి దేవయ, తిప్పయశెట్టి వగైరాలు సహకరించి సుంకంగా ప్రోలయ వేమారెడ్డి రాజభాండాగారానికి బాగా ఆదాయం చేకూర్చారు. అద్దంకి రాజధానిగా ప్రోలయ వేముడు రాజనీతి, యుద్ధనీతితో రాజ్యాన్ని విస్తరిస్తూ 84 కోటలు నిర్మించాడు. క్రీ.శ. 1352లో బహమనీ సుల్తానుల దండయాత్రను తిప్పికొట్టాడు. ఇందులో మల్లారెడ్డి పాత్ర గొప్పది. మల్లారెడ్డి మహావీరుడు. రాజనీతి విశారదుడు. విద్యావంతుడు. కవిత్వ ప్రియుడు. ఈయనను ప్రోలయ వేమారెడ్డి సర్వసైన్యాధ్యక్షునిగా నియమించాడు. మల్లారెడ్డి శత్రురాజులను తరిమికొట్టి మోటుపల్లిని స్వాధీనం చేసుకొని ప్రోలయ వేమారెడ్డికి విజయం చేకూర్చాడు. రెడ్డిరాజ్య కీర్తిని సంపదను పెంచాడు. మల్లారెడ్డి చదలవాడలో (ఇప్పటి ప్రకాశం జిల్లా) రామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించినాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. మల్లవరం శాసనం అలానే చెబుతుంది. అప్పటి నుండి చదలవాడకు రెడ్డిమల్లవరం అని పేరు కూడ వచ్చిందని, రెడ్డిమల్లవరం గ్రామాన్ని ఆ దేవాలయానికి దేవభోగంగా ఇచ్చాడని అంటారు (అయితే ప్రస్తుతం రెడ్డిమల్లవరం పేరుతో గ్రామం లేదు).

ప్రోలయ వేమారెడ్డి రాజ్యస్థాపన, విస్తరణ, ప్రజాపరిపాలనే గాక సంగీత సాహిత్యాది కళలపై దృష్టిసారించి ఎర్రాప్రగడను ఆస్థానకవిగా నియమించాడు. అర్ధాంతరంగా ఆగిపోయినట్లు లేదా చెదలుపట్టిపోయినట్లుగా చెప్పబడుతున్న నన్నయ భారతానువాదానిని ఎర్రనచే పూర్తిగావించి ఖ్యాతి చెందాడు. నేటి సంపూర్ణ తెలుగు భారతానికి కారకుడైనాడు. ఎర్రన హరివంశం కావ్యాన్ని వ్రాసి ప్రోలయ వేమారెడ్డికి అంకితమిచ్చాడు.

ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, శ్రీశైలం, అహోబిలం క్షేత్రాల వద్ద పాతాళగంగ నుండి స్వామివారి పాదాల చెంతకు మెట్లు కట్టించాడు. అవి ఈనాటికీ చెక్కు చెదరక వాడుకలో ఉన్నవి.

ప్రకాశం జిల్లా మణికేశ్వరం శాసనాన్ని బట్టి ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ.1353 వరకు పరిపాలించినట్లు అర్థమవుతున్నది. ఎర్రాప్రగడ (ఎఱ్ఱన) తన హరివంశం గ్రంథంలో ఈయనను వేమా, కోమటివేమా, ప్రోలయవేమా, అన్నమవేమా, దేసటివేమా అను పేర్లతో ప్రేమగా సంబోధించాడు. హరివంశంలో ఎఱ్ఱన చెప్పినట్లు ప్రోలయ వేమారెడ్డి ధనుర్విద్యాపారీణుడు, గొప్ప యోధుడు, వినమ్రుడు, దైవభక్తిపరుడు. తపోధనులను విద్వత్కవులను ఆదరించాడు. బ్రాహ్మణులకు అగ్రహారాలనిచ్చాడు.

ప్రోలయ వేమారెడ్డి రాజ్యం కృష్ణానది, శ్రీశైలం, ఆహోబిలం, కందుకూరు, తూర్పున తీరం వరకు వ్యాపించింది. 84 దుర్గాలు నిర్మించాడని మంచాళ్ళ శాసనం ద్వారా తెలుస్తుంది. వాటికి సైన్యాన్ని ఏర్పరచాడు. ఆ దుర్గాలలో ధరణికోట, చందోలు, వినుకొండ, బెల్లంకొండ, కొండవీడు, కందుకూరు, కొండపల్లి, దునుదుప్రోలు మొదలైనవి ముఖ్యమైనవి. అన్న మాచారెడ్డి చందోలు దుర్గానికి, తమ్ముడు మల్లారెడ్డి కందుకూరు దుర్గానికి అధిపతులైనారు. కొండవీడు, కొండపల్లి దుర్గాలను శత్రువులకభేద్యంగా నిర్మించాడు. ఈయనకు "ధర్మ ప్రతిష్ఠాగురు", "నిస్సీమ భూదాన పరశురామ", "అనవరత పురోహిత కృతసోమపాన" అను బిరుదు నామములు కలవు. మల్లవరం మొదలైన దేవాలయాలకు మాన్యాలిచ్చాడు. రామతీర్థంకు చీమకుర్తిలో అగ్రహారాలిచ్చాడు. చివరకు ఉబ్బసవ్యాధికి గురై దత్తుకుమారుడు అనపోతారెడ్డికి రాజ్యాన్నిచ్చి మరణించాడు. ఇట్టి ప్రోలయ వేమారెడ్డి రెడ్డిజాతికి పూర్వీకుడగుట రెడ్డిజాతికి, రెడ్డి రాజ్యాలకు, పాలనకు ఆద్యుడగుట, ఆరాధ్యుడగుట రెడ్లకు గర్వకారణం.

ప్రోలయ వేమారెడ్డికి ముగ్గురు దత్తు కుమాళ్ళు. వారు అనపోతారెడ్డి, అనమాచారెడ్డి, అనవేమారెడ్డి. ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె దొడ్డాంబ. రెండవ కుమార్తె పేరు తెలియరాలేదు.

క్లుప్తంగా చెప్పుకుందాం. ప్రోలయ వేమారెడ్డి రెడ్డిరాజ్య స్థాపకుడు. తరువాతి కొండవీటి రెడ్డిరాజులు ప్రోలయ వేమారెడ్డి సంతతివారు. ఆయన కొండవీటి రాజ్య సంస్థాపకుడు. ఆయనను "స్వర్ణకర ప్రసిద్ధం లబ్దవా" అని మంచెళ్ళ తామ్ర శాసనంలోను "మ్లేచ్ఛాబ్ధికుంభోద్భవ" అని మల్లవరం శాసనంలోను పేర్కొన్నారు. మరియు "పల్లవాదిత్య", "పల్లవ త్రినేత్ర", "జగనోబ్బగండ", "వీరనారాయణ", "అపరిమిత భూదాన పరశురామ", "శ్రీపర్వతాహోబల కళాదిరాయ",

"సంగ్రామ ధనుంజయ" అనే బిరుదు నామములున్నవి. కవిత్రయంలో చిన్నవాడైన (మధ్యవాడు) ఎర్రాప్రగడ ఆయన ఆస్థానకవి. ఎర్రాప్రగడ "హరివంశం" వ్రాసి ఈయన కంకితం ఇచ్చాడు.

## ప్రోలయ వేమారెడ్డి వేయించిన మణికేశ్వర శాసనం

మాండుకేశ్వరస్వామి వేంచేసియున్న గ్రామం మణికేశ్వరం. ఇది ప్రకాశం జిల్లా అద్దంకికి 6 కి.మీ. దక్షిణంగా గుండ్లకమ్మ నది దక్షిణపు ఒడ్డున ఉంటుంది. ఇది దక్షిణకాశి అని ప్రతీతి. ఇచట ప్రోలయ వేమారెడ్డి మాండుకేశ్వర దేవరకు పూజలు, కైంకర్యములకు దానము చేయుచూ సంస్కృత భాషలో శాసనము వేసినాడు.

**శాసన కాలము : శా॥శ 1275 = క్రీ॥శ॥ 1353**

శా॥శ॥ 1275 జయ సంవత్సర జ్యేష్ఠ బహుళ చతుర్దశినాడు మాండుకేశ్వర దేవరకు ప్రీతిపూర్వకముగా నవమంటపము చుట్టూ ప్రాకారములును, నవరత్నఖచిత విసనకర్రయు, పట్టుదోమతెరను మద్యాహ్న కాలమున పూజకు హారతి పళ్ళెములను దానము చేసిన శాసనము. అదే దినమున అద్దంకికి దగ్గరలోని రావినూత గ్రామములో శివలింగ ప్రతిష్ఠచేసినట్లుగా పేర్కొనబడినది. ఆ శాసనము ప్రోలయవేమారెడ్డి చివరి శాసనముగా చరిత్రకారులు పేర్కొంటారు.

**అల్పు డెపుడు బల్కు నాడంబరముగాను**
**సజ్జనుండు పల్కుఁ జల్లగాను**
**కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# అనవోతారెడ్డి @ అనపోతారెడ్డి

## క్రీ.శ. 1353 – 1364

ప్రోలయ వేమారెడ్డికి సంతానం లేదు. తమ్ముడు అన్నారెడ్డి కుమాళ్ళలో చురుకైన అనపోతారెడ్డిని ప్రోలయ వేమారెడ్డి దత్తు తీసుకున్నాడని అన్నవరం శాసనం చెబుతున్నది. అనపోతారెడ్డికి క్రీ.శ.1353లో రాజ్యభారం అప్పగించాడు. ఈయన అప్పటికే ప్రోలయ వేమారెడ్డికి సేనా నాయకుడు. క్రీ.శ.1353 నాటికి శత్రురాజుల దాడులు నలువైపుల నుండి అధికమైనాయి. ఉత్తరం నుండి కళింగాంగులు, వాయువ్యం నుండి రాచకొండ వెలమలు, బహుమనీలు, దక్షిణం నుండి విజయనగర రాజులు, క్షత్రియులు, వెలమలు ఒకరి తరువాత ఒకరు అద్దంకిపైకి యుద్ధానికి రాగా వారందరినీ సమర్ధవంతంగా తిప్పికొట్టాడు. ఆయన పినతండ్రి మల్లారెడ్డి, మేనమామ నాగారెడ్డి గార్లనుండి నేర్చిన యుద్ధవిద్య బాగా ఉపకరించింది. ప్రతి సంవత్సరం యుద్ధాలు, గెలుపులు సాధించాడు. శాసనములలో అనపోతారెడ్డికి “పటుఃపాలన కర్మణ” అని విశేషణముపయోగించబడినది. వినుకొండ, బెల్లంకొండ, కొండవీడు దుర్గములను శతృఅభేద్య దుర్గములుగా రచించెను. 1323 నాటి విప్లవంలో దేశంలో మహమ్మదీయుల చేతిలో వ్యవసాయము, వాణిజ్యము నశించెను. వాటిని మరల పునరుద్ధరించి అభయహస్తము నిచ్చాడు. వైదిక, స్మార్త, జ్యోతిష, ఆయుర్వేదాది విద్యలకు ప్రోత్సాహమిచ్చాడు. అందుచేత అనపోతారెడ్డి ప్రజారంజకుడైనాడు.

అనపోతారెడ్డికి మల్లన, సోమయ, కేతయమల్లీనాథవేమన మంత్రులుగా నుండిరి. మల్లన రామాప్రగడ వంశంలోనివాడు. సోమయ మంత్రి మోటుపల్లి రేవును అభివృద్ధిలోనికి తెచ్చి ఎగుమతి, దిగుమతుల సరళీకృతం చేసి ఒక శాసనస్తంభం వేయించాడు. కేతయమల్లీనాథ వేమన అనపోతారెడ్డి కులక్రమాగతమైన మంత్రి సేనాపతి. ఇది చాలముఖ్యమైన సరళి.

ఈయన అనపోతారెడ్డికి కుడిభుజము. అల్లాయుద్దీన్ బహమనీ దండయాత్రలో పాల్గొని వారిని ఓడించి తరిమికొట్టినాడు. ఈతడు ధరణికోట దుర్గమును పాలించుచుండెను. అమరేశ్వరుని పునఃప్రతిష్టాపన ఈతనిచే చేయబడెనని 1360నాటి అమరావతి శాసనం చెబుతుంది. క్షత్రియులు, వెలమలు ప్రతిఘటించగా వారిని జయించుటకు ఈయన ప్రతి సంవత్సరం ఏదో ఒక యుద్ధం చేయవలసి వచ్చింది. అన్నింటా గెలిచాడు.

మోటుపల్లి రేవు నుండి నౌకలపై వ్యాపారం బాగా సాగింది. మోటుపల్లి రేవుకు ముకుళపురం అని పేరుండేది. మోటుపల్లి రేవు నుండి విదేశాలతో వ్యాపారం ఎక్కువగా జరుగుతుండినది. శత్రురాజులు, సముద్రపు దొంగల బెడద ఎక్కువై వ్యాపారులకు ఎగుమతి, దిగుమతి వ్యాపారానికి వారి వ్యాపార వస్తువులు, ఆస్తులకు భయం గల పరిస్థితి వచ్చి వ్యాపారులకు అధిక రక్షణ కలిగించవలసి వచ్చింది. మోటుపల్లి ద్వారా విలువైన వజ్రాలు, వస్త్రాలు, ధాన్యం, సుగంధ ద్రవ్యాలు, నగలు, గుర్రాలు, ఏనుగులు వగైరా వ్యాపారం జరుగు తుండేది. అంతకు మునుపే మోటుపల్లి రేవు ద్వారా వ్యాపారం గణనీయంగా ఉండి క్రీ.శ. 1244లో కాకతీయ గణపతిదేవుడు వ్యాపారుల కోసం వ్యాపారం కోసం అభయశాసనాన్ని మోటుపల్లిలో వేశాడు. వారి పాలన అనంతరం తిరిగి అనపోతారెడ్డి తన పాలనలో క్రీ.శ. 1358లో అభయశాసనాన్ని పునరుద్ధరించి, సంస్కృతం, తెలుగు, తమిళం భాషలలో మరొక అభయ శాసనాన్ని వేయించాడు. వాటిని ఇప్పటికీ మోటుపల్లిలోని వీరభద్రాలయ మండపం రెండు స్తంభాలపై చూడవచ్చు. వ్యాపార సంబంధ విషయాలలో ఆరితేరిన సోమయ మంత్రి సలహాలు పాటించాడు అనపోతారెడ్డి. ఆ శాసనంలోని వివరాలను బట్టి మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఇలా తెలిపారు. **"మోటుపల్లి వచ్చి స్థిరపడి వ్యాపారం చేయాలనుకున్న వర్తకులకు సదుపాయాలను కల్పిస్తూ ప్రకటన జారీచేశాడు. అలాగే ఇతర రేవుల వర్తకులకీ, ద్వీపాంతర వర్తకులకీ వ్యాపార సౌకర్యాలు కల్పించాడు. ఎగుమతి దిగుమతులకు సుంకాన్ని నిర్దేశించాడు. శక సం. 1280లో అంటే క్రీ.శ. 1358లో విడుదలైన ఈ పత్రాన్ని మోటుపల్లి వీరభద్రస్వామి దేవాలయ మంటప స్తంభంమీద, తమిళ, తెలుగు భాషల్లో చెక్కించాడు"** అని తెలిపాడు.

అంతేకాక మోటుపల్లి రేవు వద్ద అనపోతారెడ్డి ఒక కస్టమ్స్ హౌస్‌ను, గోదాములను నిర్మించినట్లు శాసనాధారాలే కాక రెండు మూడు దశాబ్దాల క్రితం వరకు కూడ శిధిల కట్టడాలను చూడ గలిగాము. మల్లంపల్లి సోమశేఖర శర్మ, వి.వి. సుబ్బారెడ్డి మొదలైన చరిత్రకారులు వాటి చిత్రాలను తీయించి గ్రంధాలలో భద్రపరిచారు. అప్పటి పత్రాలన్నీ తెలుగు భాషలోనే ఉన్నాయని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు సాక్ష్యాధారాలను పరిశీలించి అభిప్రాయం ఖాయపరిచారు. వర్తక బిడారాలుండేవట. వ్యాపార స్వేచ్ఛను ఇచ్చాడు. కొన్ని పన్నులను రద్దు చేశాడు. దిగుమతి సుంకాలను తగ్గించాడు. అప్పటి వ్యాపార పత్రాలను చూస్తే మోటుపల్లి ద్వారా వ్యాపారం చేసేవాళ్ళలో ఎక్కువమంది తమిళులని తేలింది. (మోటుపల్లి శాసనం తదుపరి పేజీలలో ఇవ్వబడింది).

రెడ్డిరాజుల కాలంలో అవచిదేవయ, తిప్పయశెట్టి కుటుంబం గొప్ప నౌకా వాణిజ్యం జరిపిన కుటుంబం. చైనా, సింహళం, గోవా, పంజార, జలనోంగి మరితర దేశాలు, ద్వీపాలతో పట్టుబట్టలు, ఏనుగులు, మణులు, గుర్రాలు, కస్తూరి, కర్పూరం, చందనం, కుంకుమ రజం మొదలైన వాటిలో వ్యాపారం ఎక్కువగా జరిగింది. రెడ్డి రాజ్యం సిరిసంపదలతో తులతూగింది.

అనపోతారెడ్డి ఆస్థానంలో బాలసరస్వతి అనే కవీశ్వరుడున్నాడు. ఎర్రన ఈయన ఆస్థాన కవులలో ఒకరు.

అనపోతారెడ్డికి సైన్య సమీకరణ, దుర్గనిర్మాణం, రక్షణ వ్యూహాల్లో మంచి అనుభవం వుంది. యుద్ధాలలో విజయ పరంపరల వలన ఈయనకు “ద్వీపవిజేత” “వీరాన్నపోత” బిరుదనామాలొచ్చాయి. తలగడదీవిని జయించుటచే ద్వీపవిజేత అని బిరుదు వచ్చింది. తదుపరి త్రవ్వకాలలో చైనా నాణేలు, చోళుల నాణేలు అప్పటి పింగాణీ పాత్రలు కంచు విగ్రహాలు బయటపడ్డాయి.

క్రీ.శ. 1360లో బహమనీ సుల్తానులతో యుద్ధం చేసి, వారిని ఓడించి వరంగల్లును, అమరావతిని స్వాధీనం చేసుకున్నాడు. క్రీ.శ. 1361 నాటి అమరావతి శాసనం ప్రకారం

అనపోతారెడ్డి అభివృద్ధికి, శ్రీధాన్యవాటీపురం (అమరావతి)లోని అమరేశ్వరాలయానిని జీర్ణోద్ధరణ చేసి అమరేశ్వరుణ్ణి పునఃప్రతిష్ట చేయటం ఒక సాక్ష్యం.

ఆయన ఆస్థానంలో కవులు, గాయకులు, వేదాల ఘనాపాఠీలు ఎక్కువగా పోషింప బడ్డారు. జ్యోతిష, ఆయుర్వేద విద్యలను ప్రోత్సహించాడు. ఆస్థాన విద్వాంసులలో బాలసరస్వతి ముఖ్యులు. అనపోతారెడ్డి శాసనాలను ఈయనే రచించాడు. సత్రాలు కట్టించాడు. బ్రాహ్మణు లకు అగ్రహారాలిచ్చాడు. తండ్రివలెనే అనపోతారెడ్డి వైదిక ధర్మాభిమాని. శివభక్తి తత్పరుడు. దానధర్మాలు అపరిమితంగా చేశాడు. బ్రాహ్మణులకు అగ్రహారాలిచ్చాడు. పుణ్యక్షేత్రాలలో సత్రాలు కట్టించాడు. తురుష్కుల దండయాత్రలలో నష్టపడిన అగ్రహారాలను పునరుద్ధరించాడు. కొల్లూరు, ఈడ్పుగల్లు, నాగల్ల, పచ్చల తాడిపర్రు గ్రామాలను అగ్రహారాలుగా మార్చి బ్రాహ్మణు లకు దానం చేశాడు.

కూతురు అన్యమ @ దొడ్డాంబికను మేనల్లుడు కాటయ వేమారెడ్డికిచ్చి వివాహం చేశాడు. కాటయవేమారెడ్డి అరివీర భయంకరుడు.

అప్పటికి జరిగిన యుద్ధాల సందర్భాలలో అద్దంకిలోని కోట స్తలదుర్గమైనందున దాడులను తట్టుకోగల దుర్గం కాదని గ్రహించి రాజధానిని గిరిదుర్గమైన కొండవీడుకు మార్చాడని మన్యమాపుర శాసనం వల్ల తెలుస్తుంది. మన్యమాపుర శాసనం శ్లోకంగా సంస్కృత భాషలో నున్నది (దానిని ఈ దిగువ ఇవ్వడమైనది). కాని ఏ సంవత్సరంలోనైనదీ ఇదమిద్ధంగా ఆధారాలు చరిత్రకారులకు లభించలేదు. కుమారుడు కుమారగిరిరెడ్డి చిన్నవాడైనందున అనవేమారెడ్డిని సింహాసనాధీశుణ్ణి చేశాడు. అనవోతారెడ్డి ఎప్పుడు మరణించినదీ ఖచ్చితంగా తెలియుట లేదు.

అద్దంకి చిన్న నగరము. అందు బలమైన దుర్గము లేకుండెను. పరరాజులకు దుర్గమమగు గిరిదుర్గమొకటి రాజధానీ స్థానముగ నుండి, బలముగ రక్షింపబడవలసి యుండెను. అట్టి దుర్గము కొండవీడు. అనపోతారెడ్డి కొండవీటి దుర్గమును బలపరచి, కొత్త దుర్గముగ చేసి

రాజధానినక్కడకు మార్చివేసెను. మన్యమాపురపు శాసనములో ఈ విషయమిట్లు స్వాభావికముగా వర్ణింపబడినది.

**తతోన్న వేమ నృపతిః । పటుః సాలప కర్మణి ।**
**అపాలయత్త స్వపుత్రః । తదం తేంధ్ర వసుంధరామ్ ॥**
**కొండవీడుం రాజధానిం సచిత్రామకల్పమత్ ।**
**దృష్ట్వాత్వష్టాపి వైచిత్ర్యమభూద్యస్యోః స్వవిస్మయః ॥**
**ఉచ్ఛైశ్రవతుల్య బలైస్తురంగైః కల్పద్రుమాభైశ్చవ దాన్యవరైః ।**
**రంభోపమానై రమణీజనైశ్చ । సాభాతి భూమావమరాతీవ ॥**
**సోన్నపోత నపస్స్వేన నిర్మితాయాం పురిస్థితః ॥**
**కుర్వహే మాద్రిదానాని చిరంభువమ పాలయత్ ॥**

పై శ్లోకములలో "అన్న వేమనృపతిః" అనుచోట, అన్నపోతనృపతిః అని ఉండవలెను. తరువాత శోక్లములో అనపోత నృపతియనియే యున్నది,

**మేడిపండు చూడఁ మేలిమై యుండు**
**పొట్ట విచ్చి చూఁడ బురుగులుండుఁ**
**బిఱికివాని మదిని బింక మీలాగురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

## "వసంతరాయలు"

# అనవేమారెడ్డి

## క్రీ.శ. 1364 - 1386

అనపోతారెడ్డికి తమ్ముడు అనవేమారెడ్డి. ఈయన క్రీ.శ. 1364లో సింహాసన మధి ష్ఠించాడు. అప్పటికి అనపోతారెడ్డి కుమారుడు కుమారగిరిరెడ్డి మరీ చిన్న వయస్కుడగుటచే తమ్ముడు అనవేమారెడ్డిని సింహాసనమధిష్టింప చేశారు.

అనవేమారెడ్డి ధర్మప్రభువు. ప్రజారంజకంగా రాజ్యం పాలించాడు. ఆదర్శ పాలకుడైనాడు. కుమారగిరిరెడ్డిని ఆప్యాయంగా పెంచి పెద్దచేశాడు. విద్య నేర్పించాడు. యుద్ధనైపుణ్యాలు, రాజనీతి నేర్పాడు.

అనవేమారెడ్డి వచ్చునాటికి నైరుతీ దిశలో విజయనగర రాజ్యం, వాయువ్య దిశలో రేచర్ల రాజ్యం విస్తరించి వుండి రెడ్డిరాజ్యానికి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నై. క్లిష్ట పరిస్థితి నెలకొని వుంది.

సైన్యాన్ని సమీకరించుకొని, రాజనీతితో, రాజతంత్రంతో పలుయుద్ధాలు చేసి గతంలో పోగొట్టుకున్న రాజ్యాన్ని ప్రత్యేకించి రాజమహేంద్రవరాన్ని మరియు డెల్టా ప్రాంతాన్ని తిరిగి సంపాదించాడు. పడమర శ్రీశైలం వరకు జయించి శాసనం వేశాడు. వేంగిని జయించు కున్నాడు. దక్షిణాన కందుకూరు నుండి, ఉత్తరాన సింహాచలం వరకు పశ్చిమాన శ్రీశైలం నుండి తూర్పున తీరం వరకు రెడ్డి రాజ్యాన్ని విస్తరింప జేశాడు. ఈయనను "రాజశ్రీ రమణా స్వయంవరపతి" అని శాసనాలు పేర్కొన్నాయి.

మోటుపల్లి రేవునుండి సముద్రవ్యాపారం పెంపొందింపజేశాడు. విదేశాలనుండి కస్తూరి, కుంకుమ, ఘనసార, హిమాంబు, కాలాగరు, గంధం మొదలైన సుగంధ ద్రవ్యాలను సేకరించి గతంలో చేసిన వసంతోత్సవాలను మళ్ళీ మొదలుపెట్టి "వసంతరాయల"యాడు. ఆ

వసంతోత్సవాలలో రాజ్యంలోని ప్రతి పురుషుడు మన్మథుడే ప్రతి స్త్రీ రతిదేవియే; ప్రతి గ్రామం కొండవీడే.

సంస్కృతి, కళలను ఉద్ధరించాడు. శ్రీశైలంలో వీరశిరోమండపాన్ని నిర్మించారు. రెడ్డి రాజుల కులదేవత మూలగూరమ్మ. ఆమె పూజల కోసం గ్రామాలు గ్రామాలే దానం జేసి కులదేవతపై భక్తిని చాటుకున్నాడు. బ్రాహ్మణులకు ప్రియంగా అగ్రహారాలిచ్చి, దానాలు చేసి ద్విజులపై ప్రేమ గౌరవాలను వెలిబుచ్చాడు.

రాజ్యవిస్తరణ, సుపరిపాలన, ప్రజాసంక్షేమం, సంస్కృతి-సదాచార రక్షణ, వ్యాపారాభి వృద్ధి ఇత్యాది పలుపార్శ్వాలలో రాజ్యానిని సుభిక్షం చేశాడు. చోళ చాళుక్య రాజుల సహకారాన్ని పొందాడు.

కోనసీమ ప్రాంతంలో గల జల, వన, గిరి దుర్గాలను జయించి "సాగర గౌతమీ జల సంగమ జలదుర్గ సాధన రఘురామ" అని బిరుదు పొందాడు. రాజమహేంద్రవరాన్ని జయించి నపుడు వేసిన శ్రీశైలం శాసనంలో "రాజమహేంద్ర నిరవద్య నగరాది బహువిధ స్థలదుర్గ వర్గ విదళన బలరామ" అని కీర్తించబడ్డాడు. అనేక జలదుర్గాలను జయించాడు. కోరుకొండ, సింహాచలం జయించిన సందర్భంలో "సింహాచలాది వింధ్య పాద ప్రతిష్టాపిత కీర్తిసంభ" అని బిరుదు పొందాడు. విజయనగర రాజులు చొచ్చుకొని వస్తున్నారని తెలిసి వారిపై దండయాత్ర జేసి శ్రీశైలం వరకు ఆక్రమించుకొని 6-1-1378 తేదిన ఒక శాసనం వేశాడు. అందులో పూర్వ దిగ్విజయ యాత్రలన్నీ తెలుపబడ్డాయి.

ప్రజలతో చక్కని బాంధవ్యం నిర్వహించుకొని ప్రజల హృదయాలలో స్థానం సంపా దించాడు. శాంతి భద్రతలు కాపాడాడు. సమాజాన్ని నీతిమంతం చేయటానికి కృషిచేసి "ప్రజాపరిచిద చతుర్విధోపాయ" అని బిరుదు పొందాడు.

ఈయన పేరోలగమ వానపల్లి శాసనంలో ఇలా వర్ణించబడింది.

**"కేచిద్దేశాధిపత్యం కతిచనశిబికాచామ రచ్ఛత్ర శోభాం**
**కేచిద్రాజ్యం స్వకీయం కతిచన విభవై రగ్రహారాను**

**విదంతే లోకరక్షా విధిమహిప మహాభాగధేయేన్న వేమ**
**క్షోణీపావే సభాయాం సకల గుణ నిధౌ రత్న సింహాసనస్థే"**

మామిడి పెద్దనామాత్యుడు ఆయనకు సమర్థ మంత్రి. మరొక మంత్రి ఇమ్మడేంద్రుడు. అనవేముని పాలనాకాలం యావత్తు యుద్ధాలతోనే పోయింది. తనకు ముందు రెడ్డిరాజుల కాలంలో పోయిన ప్రాంతాలను జయించాడు. సాధ్యమైన మేర రాజ్యవిస్తరణ జరిగింది. యుద్ధనీతిలో ఆయన చతురుడు. ఏనుగులను లొంగదీసుకునే విద్యనేర్చి "పరిచితానేక గతి విశేష వారషణ మారణోపాయుడు" అని బిరుదు పొందాడు. కత్తిసాములో "కరవాల భైరవుడు", "క్షురికాసిఖాయ", "కరవాల వైనతేయ" బిరుదులు పొందాడు.

కొత్తగా స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను రెడ్డి రాజ్యానికి కలిపాడు. రెడ్డిరాజ్య పతాకను ఆకాశ వీధుల్లో ఎగరేసి "మహనీయాంధ్రదేశ పట్టాభిషేక సంవృత మహాభాగ్య" అని కీర్తించబడ్డాడు. దివిదుర్గం జయించి "దివిదుర్గనిభాళా" అని బిరుదు పొందాడు. సింహాచలంతో మొదలైన వింధ్యపర్వత పాదాల వద్ద స్తంభాలను ప్రతిష్టించి "సింహాచలాది వింధ్యపాద ప్రతిష్టిత కీర్తి స్తంభా" అని పేరొందాడు. అల్లాడరెడ్డి అనవేమారెడ్డి సేనాపతి. ఇతనిని అనవేముడు రాజమహేంద్రవర రాజ్యమును జయించుటకు, పాలించుటకు ఏర్పరచాడు. ఈతని శక్తి సామర్థ్యాల వలననే తూర్పునాటి దేశము రెడ్డిరాజ్యములో కలిసెను. సింహాచలంతో మొదలైన వింధ్యపర్వత పాదాల వద్ద స్తంభాలను ప్రతిష్టించి "సింహాచలాది వింధ్యపాద ప్రతిష్టిత కీర్తి స్తంభా" అని పేరొందాడు.

సాంప్రదాయికంగా వస్తున్న వసంతోత్సవాన్ని (చైత్రమాసంలో) పునరుద్ధరించాడు. ప్రతి సంవత్సరం తొమ్మిది రోజులు ఉత్సవాలు జరిగేవి. చైత్ర పూర్ణిమనాడు మదనోత్సవం జరిగేది. ఆ రోజున మనం ముందు అనుకున్నట్లు రాజ్యంలోని ప్రతి పురుషుడూ మన్మథుడే. ప్రతి స్త్రీ రతిదేవియే. ప్రతి గ్రామం కొండవీడే. చైత్ర పూర్ణిమ నాటికి మోటుపల్లి రేవునుండి కస్తూరి, కుంకుమ, ఘనసార మొదలైన సుగంధ ద్రవ్యాలను తెప్పించి కొండవీడు వీధుల్లో ప్రజలు, సందర్శకులందరిపై చల్లేవారు. ఆరోజు సర్వజనులూ బంధువులై గుబాళించేవారే. నాట్యం,

నృత్యం, కోలాటం, జానపదాలు ఆడ–మగ తేడా లేకుండా ఆడేవారు. అందుకే ఆయన "వసంతరాయలు". దృజ్జవరము శాసనంలో ఈ వసంతరాయనిని ఇలా వర్ణించినాడట ఒక కవి.

**"సప్రోలమంబా తనయః కృతార్థో వసంత కాలీం ప్రతివర్ష మూర్వ్యాం**
**కస్తూరికా కుంకుమ గంధసార హిమాంబు కర్పూరముఖైశ్చకార**
**వసంతరాయశ్చ వసంతకేళౌ కస్తూరికా రేణుచయాంబు వాహః**
**క్షిప్తం హిమాంభో ఘనవర్ష ధారాః కర్పూర ఖండాః కరకా వికీర్ణాః**

దానధర్మాలు విపరీతంగా చేసి "ధర్మాన వేముడు"గా ప్రసిద్ధి చెందాడు. బ్రహ్మాండ, కల్పతరు, కనకధార, గోసహస్ర, సువర్ణ దానాలను నిర్వహించినట్లు హేమాద్రి పండితుడు పేర్కొన్నాడు. కొండవీటి రెడ్డి రాజులందరిలో అనవేమారెడ్డి ధర్మాత్ముడని యావద్భారత దేశంలో ప్రతీతి. హేమాద్రి దానకాండయందు చెప్పిన ధర్మాలన్నీ చేశాడు. నిస్సీమ భూదానములను, అగ్రహార దానములను బ్రాహ్మణులకు చేసి విద్యలను పోషించాడు. తండ్రి తాతల వలెనే శైవాచారతత్పరుడు. శ్రీశైల, కుమారాచల పంచారామములందు తన పేరుతో నిత్య నైవేద్యములకు ఏర్పాట్లు చేశాడు. శ్రీకాశీవిశ్వేశ్వరునకు అనేక భోగములను దత్తము చేశాడు. ఈయన శైవాచారతత్పరుడేగాని వైష్ణవ ద్వేషం లేదు. శ్రీకూర్మము, సింహాచలములందు భూదానాదికములు చేశాడు. షట్కాలములందు శివపూజ చేసేవాడని చరిత్ర చెబుతుంది. ఈయన ధైర్యసాహసములు అనన్యములు. అందుచేత ఈయన "క్షురికాసహాయుడ"ని చెప్పబడ్డాడు.

సంగీత సాహిత్య రంగాలలో అనవేమారెడ్డికి అత్యున్నత స్థానం ఉన్నది. ఆయన "సాహిత్య చింతామణి", "సంగీత చింతామణి", "శృంగార దీపిక", "సప్తశతీ సారటీక", "అమరక శతి", "శృంగారదీపిక" అనే గ్రంథాల వ్రాశాడు. కవిపక్షపాతి అని భాసించబడి "బహు సహస్ర సువర్ణదాన సంతోషిత మహాకవీశ్వరుడు" అని బిరుదు పొందాడు. విష్ణుపురాణ కావ్యకర్త వెన్నెలకంటి సూరన ఈయన ఆస్థానకవి. ఇంకా బాలసరస్వతి, విద్యాధికారి. త్రిలోచనాచార్యుడు, ప్రకాశభారతి యోగి అనే కవులూ అనవేను సంస్థానంలో వున్నారు. కవుల పాండిత్యాన్ని మెచ్చి దానాలు చేశాడు. "బహుసహస్ర సువర్ణదాన సంతోషిత మహాకవీశ్వర" అన్న బిరుదు నామం పొందాడు.

కొండవీడును పరిపాలించిన రాజులలో అనవేమ భూపతే మహాశ్రేష్టుడని శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తన "రెడ్డిరాజ్యాల చరిత్ర" గ్రంధంలో పేర్కొన్నాడు. ఆదర్శ పాలకుడని మరికొందరు చరిత్రకారులన్నారు. అందుకే ఆయనను "ధర్మాన వేముడు" అని కీర్తించారు.

అనవేమారెడ్డి ఆగమ శైవాచారతత్పరుడు. ఈయన కులదైవము త్రిపురాంతక దేవుడు. రెడ్డిరాజ్యము "త్రిపురాంతక దేవేనదత్తము" అని ప్రతీతి.

అనవేముడు 1377లో శ్రీశైలయాత్రకు వెడలి అచ్చట వీరశిరోమంటపమును నిర్మించాడు. ఈ వీరశిరోమండపమునందు అనేక వీరులు వీరశివభక్తియుక్తులై తలలను, నాలుకలను గండకత్తెరతో నరికించుకొని, కత్తిరించుకొని కైలాసమును పొందుచుండిరని ప్రతీతి. ఈ వీరశిరోమండపమును అనవేమారెడ్డి తన తండ్రి అన్నయరెడ్డి పుణ్యార్ధము కట్టించినాడట. ప్రోలయవేముని కాలమున పాతాళగంగకు మెట్లు కట్టిన పంచభిక్షం రామలింగమే ఈ వీరశిరోమండపం కట్టినాడట. కాని అన్నయరెడ్డి అనవేముని తండ్రి కాడు. తండ్రి తమ్ముడు.

కొండవీటి రెడ్ల దేవత మూలగూరమ్మ. ఈమె దేవాలయము గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకాలోని అమీనాబాదు వద్ద కొండపై వున్నది. పంటదేసటి రెడ్లకు ఈమె యెడల భక్తి అధికం. తూర్పునాటి సీమలలో పొందిన జయమునకు అనవేముడు మూలగూరమ్మను 1377లో దర్శించి ఆమె అంగరంగ భోగములకు కోటభూమిలోని పడిదరము, మూలగూరు, అమ్మనవల్కలూరు అను మూడు గ్రామములను మూలగూరమ్మకు సమర్పించారు.

**పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు**
**మాఁటకన్న నెంచ మనసు దృఢము**
**కులముకన్న నెంచ గుణము ప్రధానంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

## "కర్పూర వసంతరాయలు"
# కుమారగిరి రెడ్డి
### క్రీ.శ. 1386 -1402

కుమారగిరిరెడ్డి అనపోతారెడ్డి కుమారుడు. త్రిపురాంతకం వద్దగల "కుమారాచలం" లేక "కుమారగిరి" పై వేంచేసి యుండే త్రిపురాంతకేశ్వరుని కృప వలన జన్మించాడనే నమ్మకంతో తండ్రి ఈయనకు కుమారగిరి రెడ్డి అని పేరు పెట్టుకున్నాడని కొందరు చరిత్రకారులు, స్థానికులు చెబుతున్నారు. ఈయననే కొమరగిరిరెడ్డి అని కూడ పిలుస్తారు.

పినతండ్రి అనవేమారెడ్డి మరణానంతరం కుమారగిరి రెడ్డిని పట్టాభిషిక్తుని చేశారు. అప్పటికే కుటుంబ తగాదాలున్నాయి. బావమరది కాటయ వేమారెడ్డిని ప్రధానమంత్రిగా, దండనాయకునిగా నియమించాడు. అయితే తరువాత వచ్చిన పెదకోమటి వేమారెడ్డితో ముందుగానే వారసత్వ యుద్ధం వచ్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

యుద్ధాలు ప్రారంభమైనాయి. కుమారగిరి రెడ్డి పాలకొల్లు, రాజమహేంద్రవరం, సింహాచలమే గాక కళింగలోని వీరకొట్టాన్ని, కటకంను జయించాడు. రాజమహేంద్రవరాన్ని కూడ రాజధానిగా చేసుకొని కాటయ వేమారెడ్డి మంత్రిత్వం కింద రాజ్యం పాలించాడు. గెలిచిన చోట్లల్లా శాసనాలు వేశాడు. దక్షిణాన కందుకూరు నుండి ఉత్తరాన కటకం వరకు, పడమర శ్రీశైలం నుండి తూర్పున తీరం వరకు రాజ్యం పాలించినట్లు చరిత్ర చెబుతుంది.

విజయనగరరాజు హరిహరరాయలు త్రిపురాంతకం, శ్రీశైలం ఆక్రమించుకుంటూ రాగా కాటయ వేమారెడ్డి సహకారంతో సమర్థవంతంగా తిప్పికొట్టి తిరిగి త్రిపురాంతకంను, శ్రీశైలంను స్వాధీనం చేసుకున్నాడు. అపుడు హరిహరరాయలు మైత్రికి వచ్చి తనకూతురు హరిహరాంబను కాటయ వేముని కుమారుని కిచ్చి వివాహం చేశాడు. కాని ఈ బంధం ఎన్నాళ్ళో నిలవలేదు. ఆ రోజుల్లో త్రిపురాంతకం పుణ్యక్షేత్రమే కాకుండా వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధికెక్కింది.

కాటయవేముడు సమర్ధుడైన పాలకుడు. యోధుడు. కుమారగిరి కంటె వయసులో పెద్ద. కాటయవేముడు మొదటగా రాజ్యంలోని తిరుగుబాటు సామంతులను, ఇతర శత్రువులను అణచివేశాడు. తరువాత కళింగ యాత్రకు పూనుకొని, రాజమహేంద్రవరం నుండి దండయాత్ర ప్రారంభించి, రాజ మహేంద్రవరపు రెడ్డిదొరలు అల్లాడరెడ్డి ఆయన కుమారులు వేమారెడ్డి వీరభద్రారెడ్డి దొడ్డారెడ్డి సహకారంతో రంప దుర్గం, మొల్లేటి దుర్గం, కిమ్మూరు దుర్గం, బెండపూడి దుర్గం, రామగిరి దుర్గం వగైరాలను విజయవంతంగా స్వాధీనం చేసుకొని కుమారగిరిరెడ్డికి విజయానిని సమర్పించినట్లు చరిత్ర, సాహిత్యం చెబుతుంది. ఈ ప్రాంతాలనన్నింటిని కలిపి రాజమహేంద్రవరరాజ్యంగా చేసి, కుమారగిరిరెడ్డి తన కుమారుడు అనవోతారెడ్డిని రాజప్రతినిధిగా నియమించాడు. అల్లాడరెడ్డి కుటుంబం అండగా వుంది. సింహాచలం, కటకం కూడ కుమారగిరి రాజ్యంలోకి చేరింది.

దానధర్మాలకు ఈయన రాజ్యం పెట్టింది పేరు. తనకొడుకు వీరాన్న పోతారెడ్డి, తాను దాక్షారామం సందర్శించిన సందర్భంలో ఆయనను తన తొడపై కూర్చుండ బెట్టుకొని వెండి బంగారం నాణేలతో తూలతూగి కుమారగిరి రెడ్డి వాటిని దానధర్మాలు చేశాడని సాహిత్యంలో, చరిత్రలో వ్రాసివుంది.

కొండవీటి నగరంలో తన నివాసం కొరకు కుమారగిరిరెడ్డి "గృహరాజుమేడ"ను నిర్మించాడు. ఈ మేడ హిందూ దివ్య వాస్తుశాస్త్రంలోని వైరాజ, పుష్పక, కైలాస, మలిక, త్రివిష్ట అనే ఐదురకాల భవనాలలో ఒకటి. ఇది ఒంటిస్తంభపు మేడ. దీని నిర్మాణ చాతుర్యం గొప్పది. దీనిని సందర్శించటానికి వివిధ దేశాలనుండి మేధావులు వచ్చేవారు. అయితే దీనిని పెదకోమటి వేమారెడ్డి నిర్మించాడని కొందరు వ్రాసిన చరిత్రలో ఉన్నదట. దీనికొక ప్రత్యేక చరిత్ర వున్నది. నవూలూరి పోతురాజు అను దేవర ఆలయం వుండేది కొండవీడులో. దీనిచెంత ఏడు తాటి చెట్ల ఎత్తు, ఏడు మోకులు చుట్టు కొలత కలిగిన తుమ్మ చెట్టును నరికించి తెప్పించి దానిని ఒకే స్తంభముగా చెక్కించి, నిలిపి కొండవీడులో ఒంటి స్తంభపు మేడను, పెదకోమటి వేమారెడ్డి నిర్మించాడని ఒక చరిత్రలో ఉన్నది. ఆ మేడలో ఆదిలక్ష్మి, కామేశ్వరి దేవతను ప్రతిష్టించినట్లు కొండవీటి కైఫీయత్ తెలుపుతున్నది. ఈ మేడను నిర్మించినది కుమారగిరి రెడ్డియని కాటయవేముని క్రీ.శ. 1395 నాటి గోపవరం, క్రీ.శ. 1408 నాటి

కుమారగిరిపురం శాసనాలు వెల్లడిస్తున్నాయి. చాటువులు కూడ గృహరాజు మేడను గూర్చి వర్ణిస్తున్నాయి. గృహరాజు మేడలో ఆదిలక్ష్మి పూజలందుకుంటుందని పెదకోమటి వేముని ఫిరంగిపురం శాసనం పేర్కొంటున్నది.

కుమారగిరిరెడ్డికి "కర్పూర వసంతరాయలు" అనే బిరుదునామం ఉన్నది. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ త్రయోదశినాడు వసంతోత్సవం చేసేవాడు. దీనిని వసంతో త్సవమని, చైత్రోత్సవమని, మదనోత్సవమని హోలికోత్సవమని పిలిచేవారు.

ఈ ఉత్సవానికి అవచి తిప్పయశెట్టి సహకారం ఎంతో వున్నది. సుగంధ ద్రవ్యాలను ఇతర దేశాలనుండి తన సొంత నౌకలలో తెచ్చి కుమారగిరి రెడ్డికి కానుకగా యిచ్చేవాడు. తిప్పయను సుగంధభాండాగార అధ్యక్షునిగా నియమించాడు. అవచి తిప్పయ ఎక్కడి నుండి ఏయే సుగంధద్రవ్యాలు తెచ్చేవారో ఆ తరువాత కాలం నాటి శ్రీనాథుడు తన హరవిలాస కావ్యాన్ని అవచి తిప్పయశెట్టికి అంకితమిస్తూ ఇలా రాశాడు.

**"పంజార కర్పూర పాదపంబులు తెచ్చె**
**జలనోంగి బంగారు మొలక దెచ్చె**
**సింహళంబున గంధ సింధురంబులు దెచ్చె**
**హరుమంజి బలుతేజి హరులుదెచ్చె**
**గోన సంశుద్ధ సంకుమద ద్రవము దెచ్చె**
**యాంప కట్టాణి ముత్యాలు దెచ్చె**
**భోట కస్తూరికాపుట కోసములు దెచ్చె**
**చీనీ చీనాంబర శ్రేణి దెచ్చె**
**జగద గోపాలరాయ వేశ్యా భుజంగ**
**పల్లవాదిత్య భూదాన పరశురామ**
**కొమరగిరి రాజ దేవేంద్రు కూర్మిహితుడు**
**జాణ జగజెట్టి దేవయ చామిశెట్టి"**

అని ప్రస్తుతించాడు. అట్టి దిగుమతి కాబడ్డ సుగంధ ద్రవ్యాలను కుమారగిరి రెడ్డికి కానుకగా ఇచ్చేవాడు. ఆ వసంతోత్సవం రోజు తన రాజ్యంలోని ప్రత్యేకించి కొండవీడులోని ప్రతి పురుషుడూ

మన్మథుడే, ప్రతి స్త్రీ రతీదేవియే. ఊళ్ళన్నీ పండగే. రాజు కొండవీటి చివరిలోని ఉద్యానవన ప్రాంగణానికి ఏనుగు అంబారీపై ఊరేగింపుగా వెళుతూ సుగంధద్రవ్యాలను ప్రజలపై చల్లుకుంటూ వెళ్ళేవాడట. దారిలో బృందగానాలు, పల్లెపదాలు, కోలాటాలు, చక్కభజనలు వగైరా జానపద ఉత్సాహాలుండేవి. ఆ వేడుక గొప్పదనాన్ని, కుమారగిరిరెడ్డి గొప్పదనాన్ని గూర్చి చెబుతూ జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, "కర్పూర వసంతరాయలు" కావ్య రచయిత డా॥ సి. నారాయణరెడ్డి గారు ఇలా ఘనంగా చెప్పాడు.

**"కొమరగిరి చరితమ్ము కొండవీటను శిశిరమును సైతము వసంతముగ రూపుగట్టు**
**కొండవీటను పాదుకొన్నట్టి మట్టిలోసైతమ్ము కర్పూర సౌరభమ్ములు వీచు"**

నేటికిని కర్పూర సౌరభమ్ములు వీచు అని వ్రాశాడు.

ఈయన కాలంలోనూ మోటుపల్లిరేవు తన ఘనతను చాటుకుంటూనే వుంది.

కుమారగిరి రెడ్డి స్వతహాగా కవి, నాట్యశాస్త్ర నిపుణుడు. "వసంతరాజీయం" అనే నాట్యశాస్త్ర గ్రంధాన్ని రాశాడు. భరతుడు తెలిపిన భంగిమలను పొందుపరచగా ససాక్ష్యంగా ఆస్థాన నర్తకి లకుమ ప్రదర్శించేది. ఆమె నాట్యంలోనూ కొన్ని కొత్త భంగిమలను స్వీకరించి గ్రంథంలో చేర్చాడు. కుమారగిరిరెడ్డి జీవితంలో లకుమ ముఖ్యపాత్ర వహించి, రాజ్యం కోసం తన ప్రాణత్యాగం చేసినట్లు కొంత సాహిత్యం తెలుపుతుంది.

రాజ్యపాలనలో కలకలం వచ్చింది. శత్రువులూ దాడిచేశారు. కుటుంబ సభ్యులూ దాడిచేశారు. కందుకూరు రెడ్డి శాఖకు ప్రాధాన్యం వహిస్తున్న మాచారెడ్డి కుమారుడు కుమార కోటమరెడ్డి, కుమారగిరి రెడ్డి పాలనలో వున్న కృష్ణాతీరం వరకు ఆక్రమించాడు. దుర్భర పరిస్థితిని తట్టుకోలేక కుమారగిరిరెడ్డి కాటయ వేమారెడ్డి రాజ్యమైన రాజమహేంద్రవరానికి వెళ్ళాడు. అప్పటికే చేతికి అందివచ్చిన కుమారుడు వీరాన్న పోతారెడ్డి చనిపోయాడు. మానసికంగా క్రుంగిపోయిన రాజు ఎంత వైద్యం చేసినా లాభంలేక క్రీ.శ. 1402 సం॥ కాటయ వేమారెడ్డి వద్ద కన్నుమూసి వుంటాడని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. కర్పూరకళిక ఆరిపోయింది. కొండవీడు బోసిపోయింది. సంగీత సరస్వతి మూగబోయింది. నటరాజ నర్తనం ఆగిపోయింది. ఒక శకం ముగిసింది.

# పెదకోమటి వేమారెడ్డి

## క్రీ.శ. 1402 - 1420

అనవేమభూపతి కొడుకు రాజ్యంలో అంతః కలహాలను, ఇతర రాజుల దాడుల్ని నిలుపుదల చేయటానికి పెదకోమటి వేమారెడ్డి కొండవీటి సింహాసనాన్ని అధిష్టించినట్లు చరిత్రకారులు భావించారు. అటు రాజమహేంద్రవర రాజ్యంలో కాటయవేమారెడ్డి బలంగా వున్నాడు. ఒకవైపు విజయనగర రాజులు దండయాత్రకు సిద్ధంగా వున్నారు. కాని వారిలోని అనైక్యత వారిని బలహీనులను చేసింది.

అదను గమనించిన పెదకోమటి వేమారెడ్డి విజయనగర రాజులపై యుద్ధం చేసి గతంలో పోయిన రాజ్యాన్ని కొంత తిరిగి పొందాడు. తూర్పుతీరంవైపు పోయిన రాజ్యాన్ని తిరిగి పొందాడు. కుమారగిరిరెడ్డి ఆఖరు రోజుల్లో పెదకోమటి వేమారెడ్డి కొండవీడు సింహాసనాన్ని ఆక్రమించాడు.

కాని రాజమహేంద్రవరం కాటయవేమునితో సఖ్యత లేనందువలన అన్నదేవచోడుడు దురాక్రమణకు ప్రయత్నించాడు. కాని అతనికి వెలమరాజుల పోరాటంలో పెదకోమటిసాయం కావలసివచ్చి సయోధ్య నెరిపాడు. అటు కాటయ వేమునికి ఇక్కట్లువచ్చి అక్కడ రెడ్డిరాజ్యం పతనావస్థలో ఉన్నప్పుడు కాటయవేముని కుమార్తె అనితల్లి రాజ్యానికి వారసురాలని ఆమెకు అల్లాడరెడ్డి పూర్తి సహకారమందించి అన్న దేవునితో యుద్ధంచేసి గెలిచి రాజమహేంద్రవరాన్ని అనితల్లికి కట్టబెట్టాడు. ఆ సమయంలో పెదకోమటి వేమారెడ్డి అటు విజయనగరాజులు, ఇటు అల్లాడరెడ్డి మధ్య ఇరుక్కున్నాడు. పెదకోమటి వేమారెడ్డి తనమంత్రి మామిడి సింగయ్య దౌత్యంతో బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షాతో చేతులు కలిపి రాజమహేంద్రవరంపై దాడిచేసి అల్లాడరెడ్డి చేతిలో ఓడిపోయాడు. తదుపరి దేవరాయని మోటుపల్లి శాసనం ప్రకారం కొండవీడు రాజ్యం విజయనగర రాజుల పాదాక్రాంతమైంది. మోటుపల్లి విజయనగర రాజుల చేజిక్కింది. ప్రక్కనేగల రేచర్ల రాజులతోనూ యుద్ధం చేయవలసి వచ్చింది.

పెదకోమటి వేమారెడ్డి కడపటి పత్రం తన రుద్రవరం దానశాసనం. అది శక సం: 1341 వికారినామ సంవత్సరం. పెదకోమటి వేమారెడ్డికి ఆస్థాన విద్యాధికారియైన శ్రీనాథుడు లిఖించిన ఆఖరి పత్రం ఇదే. చివరకు కృష్ణానది ఉత్తర భాగాన్ని తమ్ముడు మాచారెడ్డికి అప్పగించి తన పూర్వులు చేసిన తప్పునే ఈయనా చేశాడు.

పెదకోమటి వేముడు, మంచి పరిపాలనాదక్షుడని చరిత్ర చెబుతుంది. ఈయన శైవ మతాభిమాని. విద్య, వ్యవసాయం అభివృద్ధి చేశాడు. ఆయన భార్య “సంతాన సాగరం” అను చెరువు నిర్మించి రైతులకు అండగా నిలిచింది.

ఈయన స్వయంగా కవి. సంస్కృతంలో పండితుడు. గాథాసప్తశతిలోని నూరుగాథలకు వ్యాఖ్యానాలు రచించాడు. తెలుగుభాష కంటె దేవభాషకే ప్రాముఖ్యత నిచ్చాడు. మహాదాత. కవులకు విద్యాంసులకు దానాలు చేశాడు. వసంతోత్సవాలు చేశాడు. శైవమతాభిమాని. కాశీ–రామేశ్వర యాత్రలు చేశాడు. అమీనాబాదువద్ద మూలగూరమ్మ గుడిని పునర్నిర్మించాడు. శక్తి దేవతలకు గుళ్ళు కట్టించాడు. ఈయన ఆస్థానకవి వామనభట్ట బాణుడు. ఈయన “వేమభూపాలల చరిత్ర” వ్రాశాడు. పెదకోమటి వేమారెడ్డి కాలం కొండవీటికి సాంస్కృతిక స్వర్ణయుగమని చరిత్రకారులంటారు.

**కులములోన నొకcడు గుణవంతుc డుండిన**
**కులము వెలయు వాని గుణముచేత**
**వెలయు వనములోన మలయజంబున్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# రాచవేమారెడ్డి
క్రీ.శ. 1420 - 1424

పెదకోమటివేమారెడ్డి కుమారుడు రాచవేమారెడ్డి. తల్లి సూరాంబ. ఈమె ధాన్యకటకం ప్రభువు గన్నభూపాలుని కూతురు.

రాచవేమారెడ్డి కేవలం నాలుగు సంవత్సరాలే పరిపాలించాడని కైఫీయతులు చెబుతున్నవి. క్రీ.శ. 1420 నుండి 1424 వరకు పరిపాలించాడు. తండ్రి మరణంతో విజయనగర రాజులు విజృంభించారు. కొంత రాజ్యాన్ని ఆక్రమించారు. కళింగ గజపతి దురాక్రమణ ఉత్తరం నుండి మొదలైంది. రాచవేమారెడ్డి రాజ్యభారాన్ని మోయలేకపోయాడు. ఖజానా ఖాళీ అయింది. నింపటానికి అసంబద్ధమైన పన్నులు విధించాడు. పురిటి సుంకం విధించాడు. పొయ్యి పన్ను విధించాడు. ప్రజాకంటకుడై, సవరం ఎల్లయ్య అనే బలిజ నాయకుని చేతిలో (పురిటి పన్ను వేసినందుకు) హతమయ్యాడు. కాని ఇందుకు తగు ఆధారాలు దొరకలేదని మల్లంపల్లి వారన్నారు. కొండవీటి రెడ్డిరాజులలో చివరివాడు రాచవేమారెడ్డి.

ప్రోలయవేముడు కొండవీటి రాజ్యాన్ని స్థాపించాడు. ఎన్నో ఒడిదుడుకుల్నీ, శుక్లపక్షాన్ని, కృష్ణపక్షాన్ని చూసిన ఈ రాజ్యం మణిపూసల్లాంటి అనవేమ, కుమారగిరుల పాలనలో జ్వాజ్వల్యమానంగా ప్రకాశించి సమున్నత శిఖరాలని అధిరోహించింది. ఆ వైభవోపేత రాజులు ఎక్కువకాలం ఉండలేదు. పెదకోమటి వేముని చర్యలు, అతని అంతర్గత కుమ్ములాటలు దాన్ని శిఖరంపై నుంచి క్రిందికి తోశాయి. అయోగ్యుడైన అతని కొడుకు దాన్ని ముంచేశాడు. “మహత్తర రెడ్డివంశం చరిత్ర ఈ కాల మహాంబోధిలో ఒక బొట్టుగా వున్నది. వందయేళ్ళు మాత్రమే అయినా ఆ ఒక్క బొట్టూ ముత్యం లాంటిది” అన్నారు. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు.

# కొండవీడు రెడ్డివంశము

- కామ భూపాలుడు
  - వేమ భూపాలుడు
    - ప్రోలయరెడ్డి – భార్య అన్నమాంబ
      - మాచారెడ్డి
        - రెడ్డి పోత
        - పెదకోమటి
          - పెదకోమటి వేమ (1402–1420)
            - రాచవేమారెడ్డి (1420–1424)
          - మాచా
        - నాగ
      - ప్రోలయ వేమారెడ్డి (క్రీ.శ. 1325–1353)
        - అనపోతారెడ్డి (1353–1364)
          - కొమరగిరిరెడ్డి 1386–1402)
            - అనపోత
          - దొడ్డాంబిక యండి. కాటయరెడ్డి
        - అనవేమారెడ్డి (1364–1386)
        - దొడ్డాంబిక యండి. కాటయరెడ్డి
      - అన్నయ
      - దొడ్డ వేమసాని
      - మల్ల

# కొండవీటి రెడ్డివంశము

↓

కామ భూపాలుడు

↓

వేమ భూపాలుడు

↓

ప్రోలయ కోమటిరెడ్డి
(భార్య అన్నమాంబ - దొడ్డయరెడ్డి కుమార్తె)

↓

మాచారెడ్డి | ప్రోలయ వేమారెడ్డి | అన్నయరెడ్డి | వేమసాని (దొడ్డ వేమసాని) | మల్లారెడ్డి

అన్నయరెడ్డి కుమారులను (2), కుమార్తెలను (1) దత్తత తీసుకొన్నాడు

ప్రోలయ వేమారెడ్డి ↓

అనపోతారెడ్డి (భార్య మనుమాంబ) | అనవేమారెడ్డి | వేమాంబ (భర్త భీమలింగారెడ్డి)

అన్నయరెడ్డి ↓

దొడ్డాంబ (భర్త కాటయ వేమారరెడ్డి)

↓

కాటయ వేమారరెడ్డి 2

అనపోతారెడ్డి ↓

కుమారగిరి రెడ్డి (కర్పూర వసంతరాయలు) | అన్యమాంబ (మల్లమాంబ) (భర్త కాటయ వేమారెడ్డి 2)

కుమారగిరి రెడ్డి ↓

వీరాన్నపోతారెడ్డి
(అనపోతారెడ్డి 2)

మాచారెడ్డి ↓

రెడ్డిపోత | పెద కోమటిరెడ్డి | నాగారెడ్డి

పెద కోమటిరెడ్డి ↓

పెదకోమటి వేమారెడ్డి | అమరుకి కావ్య వ్యాఖ్యాత | మాచారెడ్డి

పెదకోమటి వేమారెడ్డి ↓

రాచ వేమారెడ్డి

# రాజమహేంద్రవర రెడ్డిరాజ్యం

## కాటయ వేమారెడ్డి

క్రీ.శ. 1395-1414

ఆంధ్రదేశమును పాలించిన కుమారగిరిరెడ్డికి ఇంద్రునికి బృహస్పతివలె, యుధిష్ఠిరునకు శ్రీకృష్ణునివలె మంత్రిత్వము నెఱపి తన సహాయశూరతచే సంగ్రా మార్జునుడను ఖ్యాతి బడసి ప్రభువై, పండితుడై, కవిపండిత పోషకుడై ఖ్యాతిగాంచిన ఉత్తమ పురుషుడు కాటయవేముడని ప్రముఖ చరిత్రకారులు విద్వాన్ చిలుకూరి పాపయ్యశాస్త్రి పేర్కొన్నారు. ఈతడు మారక్ష్మాపతి పౌత్రుడు. అనవేమ భూపాలుని దౌహిత్రుడు. ఈయన తల్లిదండ్రులు కాటక్షోణీపతి, దొడ్డాంబికలు. కుమారగిరి తోబుట్టువు మల్లాంబిక ఈయన సతీమణి.

కుమారగిరిరెడ్డి తన రాజ్యాన్ని విస్తరిస్తున్న కాలంలో రాజనీతిజ్ఞుడు, బలశాలి అయిన కాటయ వేమారెడ్డిని రాజమహేంద్రవరానికి తన ప్రతినిధిగా పంపి కొండవీడు రాజ్యాన్ని పాలించాడు. దురదృష్టవశాత్తు అనారోగ్యం, కుమారుని మరణం కారణాన కుమారగిరిరెడ్డి రాజమహేంద్రవరం చేరి కాటయవేమారెడ్డి వద్ద మరణించాడు. రాజమహేంద్రవర రెడ్డిరాజ్య చరిత్ర అంతా కాటయ వేమారెడ్డి, ఆయన వంశీకుల చరిత్రే.

పెదకోమటి వేమారెడ్డి కొండవీటికి ప్రభువై కాటయవేమునికి పక్కలో బల్లెమయాడు. అగ్నికి ఆజ్యం తోడైనట్లు అన్నెదేవ చోడుడు పెదకోమటి వేమునికి తోడైనాడు. విజయనగర రాజులు రెడ్డిరాజులపై యుద్ధం ప్రకటించారు. సామంతులైన కొప్పునూళ్ళ నాయకులు పెదకోమటి వేమారెడ్డికి సహకరించారు. ఈ యుద్ధాలతో కాటయవేముడు చితికిపోయాడు. రాజమహేంద్రవర రాజ్యం చేజారిపోయింది.

తరువాత వచ్చిన రెండవ కుమారగిరి రెడ్డి (క్రీ.శ. 1414-1416)గాని, (ఆయన పిన్నవయస్కుడైనందున కాటయవేమారెడ్డి వియ్యంకుడు అల్లాడరెడ్డి ఆ భారం మోశాడు)

మూడవ కుమారరెడ్డిగాని, అల్లాడరెడ్డిగాని, మూడో అనపోతారెడ్డిగాని, వీరభద్రారెడ్డిగాని రెడ్డి రాజ్యానికి పూర్వవైభవం తేలేకపోయారు. అల్లాడరెడ్డి మూడవ కుమారుడు దొడ్డారెడ్డి క్రీ.శ. 1416-1420 వరకు పాలించాడు. మూడో కుమారగిరిరెడ్డి, మూడో అనపోతారెడ్డి క్రీ.శ. 1420-1423 వరకు పాలించారు. వీరభద్రారెడ్డి క్రీ.శ. 1423 నుండి పాలించాడు. కడకు క్రీ.శ. 1424లో ప్రౌఢ దేవరాయలు కాలంలో విజయనగర రాజ్యంలో కలిసిపోయింది.

కాటయవేముని వ్యక్తిత్వం గొప్పది. బావమరిది కుమారగిరిరెడ్డి అంటే ఆయనకు ప్రాణం. తన కుమారునికి కుమారగిరిరెడ్డి అని పేరు పెట్టుకున్నాడు. అయన సంస్కృత విద్వాంసుడు. కాళిదాసుని మూడు నాటకాలైన అభిజ్ఞాన శాకుంతలము, మాళవికాగ్నిమిత్రము, విక్రమోర్వశీయములకు "కుమారగిరి విజయం" (కుమారగిరి రాజీయం) అను వ్యాఖ్యాన గ్రంథం రాశాడు. ఎన్నో గ్రామాలకు కుమారగిరిపురం అని పేర్లుపెట్టి దేవాలయాలకు, బ్రాహ్మణులకు దానాలు చేశాడు.

సమర్థుడైన రాజనీతివేత్త. మహాయోధుడు. యుద్ధాలలో విజయాలు సాధించి కొండవీటి వంశం వాళ్ళు ఎవళ్ళూ సాధించలేనంతగా రెడ్డిరాజ్యాన్ని తూర్పుదిశకు విస్తరింపజేశాడు. చిలక సరస్సు, కటకందాకా ఉత్తర దిశకు కొండవీటి రాజ్యాన్ని విస్తరింప జేశాడు. కుమారగిరి రెడ్డికి సైన్యాధిపతిగా, ప్రధానమంత్రిగా పనిచేశాడు.

కాటయ వేముడు వైష్ణవ భక్తుడు. కళింగ దండయాత్ర అనంతరం రాజమహేంద్రవరం లోని వేణుగోపాలస్వామికి మొక్కుబడి చెల్లించాడు. గోదావరి మండలంలో ఎక్కువగా విష్ణాలయములకు గ్రామాలను దానం చేశాడు. కాటయ వేముడు శైవాలయాలకు కూడ దానాలు చేసి శైవ వైష్ణవ శాఖల సామరస్యాన్ని కాపాడాడు.

కుమారగిరి రెడ్డి మరియు ఆయన భార్యపేరుతో వారికి పుణ్యప్రాప్తి కోసం అనేక గ్రామాల్ని బ్రాహ్మణులకు అగ్రహారాలుగా దానం చేశాడు. క్రీ.శ. 1414నాటి దాక్షారామం శాసనాలు, క్రీ.శ. 1416 నాటి శాసనాలు ఈ దాన విశేషాలను తెలుపుతున్నవి. ఎన్నో దేవా లయాలకు దానాలు చేశాడు. అహోబిలం శాసనం ఇందుకు సాక్ష్యం. కుమారుడు కుమారగిరి రెడ్డి పుట్టిన సందర్భంగా తొర్రేడు గ్రామాన్ని చివుకుల మాధవుడనే బ్రాహ్మణ విద్వాంసునికి

దానం చేసినట్లు తొర్రేడు శాసనం తెలుపుతుంది.

కాటయవేమారెడ్డికి అనితల్లి, హరిహరాంబలు కూతుళ్ళు. అనితల్లిని వీరభద్రారెడ్డికి, హరిహరాంబను వీరభద్రారెడ్డి జ్యేష్ఠ పుత్రుడు వేమారెడ్డికి యిచ్చి వివాహం చేశాడు.

కాటయవేముని ధీర సాంత్వనను కొండవీడు రాజ్యం, రాజమహేంద్రవర రాజ్యం ఎన్నటికీ మరవదు.

చివరకు క్రీ.శ. 1414లో జరిగిన కాకరపర్తి యుద్ధంలో గజరావు తిప్పన చేతిలో మరణించాడని చరిత్ర చెబుతుంది.

కాటయ వేముని మరణానంతరం అతని రెండవ కుమారుడు రెండవ కుమారగిరిరెడ్డి రాజయ్యాడు. చిన్నతనంలో రాజైనందున కాటయ వేముని వియ్యంకుడు అల్లాడరెడ్డి, రెండవ కుమారగిరికి సంరక్షకుడుగా వుంటూ రాజ్యవ్యవహారాలు నిర్వహించాడు. రాజమహేంద్రవర రాజ్యానికి పక్కలో బల్లెమైన అన్నెదేవుడిని అల్లాడరెడ్డి మట్టుబెట్టాడు. అల్లాడరెడ్డి ధారానగర సుల్తాన్‌పై యుద్ధంచేసి గెలిచాడు. అల్లాడరెడ్డి రాజనీతిజ్ఞుడు. స్వామిభక్తి పరాయణుడు. ఆయన జీవితమంతా యుద్ధాలతో సరిపోయింది. యుద్ధాలలో ఇతని కుమారులు వేమ, వీరభద్ర, దొడ్డ, అన్నారెడ్లు, మంత్రియైన అరియేటి లింగమంత్రి సహాయపడ్డాడు.

**కులములోన నొకఁడు గుణహీనుఁడున్నచో**
**కులము చెడును వాని గుణము వలన**
**వెలయు చెఱకునందు వెన్ను వెడలినట్లు!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# రాజమహేంద్రవర రెడ్డి వంశము

కాటయరెడ్డి I

మార

కాటయరెడ్డి II Md. దొడ్డాంబిక
(D/o ప్రోలయ వేమారెడ్డి)

కాటయ వేమారెడ్డి Md. దొడ్డాంబిక (అన్యమ)
D/o అనపోతారెడ్డి

కుమారగిరిరెడ్డి
(క్రీ.శ. 1414-1417)

అనితల్లి యం. వీరభద్రారెడ్డి
(క్రీ.శ. 1423-1448)

**పరనారీ సోదరుండై**
**పర ధనముల కాసపడక! పర హితచారై**
**పరులెన్నగ బ్రతుకువాడు! ప్రాజ్ఞుడు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# కందుకూరు రెడ్డి రాజ్యం

కందుకూరు రెడ్డి రాజ్య చరిత్రకు బహుకొద్ది ఆధారాలు కూడ చరిత్రకారులకు లభ్యం కాలేదు. కందుకూరు ప్రాంతాన్ని మల్లారెడ్డి సహాయంతో ప్రోలయ వేముడు జయించి ఆక్రమించాడు. మల్లారెడ్డి మహావీరుడు. అద్దంకి రాజ్యానికి సర్వసైన్యాధ్యక్షుడు. ఇతడిని బోయ విహార దేశమైన కందుకూరుకు ప్రతినిధిగా ప్రోలయవేముడు నియమించాడు. కందుకూరు రాజధానిగా మల్లారెడ్డి, అతని సంతతివారు స్వతంత్రులై ఒక శతాబ్దం పరిపాలించారు. మల్లారెడ్డి మనుమడు శ్రీగిరిరెడ్డి కాలంలో రాజ్యం విస్తరించింది. శ్రీగిరిరెడ్డి కొడుకు మూడో కోమటిరెడ్డి కాలంలో కందుకూరు రెడ్లు విజయనగర సామంతులైనారు.

మల్లారెడ్డి పేరు మోటుపల్లి రేవును జయించిన సందర్భంలో కనిపించింది. అపుడు బహమనీ సుల్తాన్ అల్లావుద్దీన్ హసన్‌ల బహమన్‌షాను ఎదిరించి రెడ్డిరాజ్యాన్ని ఆదుకున్నాడు. దానధర్మాలు చేశాడు. వాటిలో గుంటూరు జిల్లా పెదపూడి శాసనంలో శాండిల్య గోత్రజులు ఎల్లేపెద్ది లక్ష్మణ దీక్షితులకి, కౌశికస గోత్ర షడ్దశ్శనాల వలభయజ్వకి పెదపూడిని అగ్రహారంగా యిచ్చినట్లు శక సం॥ 1326 శాసనం ఉన్నది. మల్లారెడ్డి కొడుకు అన్నారెడ్డి టంగుటూరును దానం ఇచ్చినట్లు శక సం॥ 1328 శాసనంలో ఉన్నది. వీరి చరిత్ర చుండి, పెదపూడి, లేపాక, కందుకూరు, కొండముదుసుపాలెం, తమిళనాడులోని దామల్ శాసనాలలో కొంత కొంత తెలుస్తుంది.

మల్లారెడ్డి మనవడు శ్రీగిరిరెడ్డి స్వాతంత్రం ప్రకటించుకున్నాడు. ఈతడు మంచి సాహిత్యాభిరుచి గలవాడు. సంగీత, సాహిత్యాన్ని ఆస్వాదించే స్వభావి. అతన్ని "కళావాన్" అనేవారని పాతచుండి శాసనంలో ఉన్నది. పంటలకు నీరివ్వటానికి చెరువులు తవ్వించాడని శాసనాలు తెలుపుతున్నై.

కందుకూరు రెడ్లు ఉదయగిరి రాజ్యంపై దండయాత్ర చేశారు. ఈ దండయాత్రకు శ్రీగిరిరెడ్డి తమ్ముడు అన్నారెడ్డి నాయకత్వం వహించాడని లేపాక శాసనం చెబుతుంది. శ్రీగిరిరెడ్డి కొడుకులు చుండిని ముఖ్యపట్టణం చేసుకొని పాలించారు.

# కందుకూరు రెడ్డివంశము

- మల్లారెడ్డి
  - శ్రీగిరి
    - మూడవ కోమటిరెడ్డి
  - మాచారెడ్డి
    - రెండవ కోమటిరెడ్డి

వేఱుపురుఁగు చేరి వృక్షంబుఁ జెఱచును
జీడపురుఁగు చేరి చెట్టు జెఱచుఁ
కుత్సితుండు చేరి గుణవంతుఁ జెఱచురా
విశ్వదాభిరామ వినురవేమ.

హీనగుణమువాని నిలుసేరనిచ్చిన
ఎంతవానికైన నిడుము గలుగు!
ఈఁగ కడుపు జొచ్చి యిట్టట్టు చేయదా
విశ్వదాభిరామ వినురవేమ.

# రెడ్డిరాజుల కాలపు సమాజం

రెడ్డి రాజుల కాలంలో అన్నీ గ్రామాలే వుండేవని చెప్పవచ్చు. ఏవో కొన్ని మాత్రం మినహాయింపు. గ్రామాలు స్వయం పోషకంగా, స్వయం సమృద్ధిగా వుండేవని చరిత్ర కారులందరూ చెప్పిన సంగతే.

## పరిపాలనా వ్యవస్థ – విధానం

రెడ్డిరాజులు కాకతీయరాజులవలెనే సంప్రదాయ పాలనా విధానాన్ని అనుసరించారు. రాజ్యం సప్తాంగ సమన్వితమని చరిత్రకారులు భావించారు. అవి 1. రాజు, 2. మంత్రి, 3. రాజ్యం, 4. దుర్గం, 5. కోశం, 6. సైన్యం, 7. మిత్రం అనేవి.

రాజ్యానికి రాజు సర్వాధికారి. భూమియంతయు రాజుదే. అతడే ఉన్నత న్యాయాధీశుడు. కౌటిల్య రాజతంత్రం పాటిస్తుండేవారు. పరిపాలనలో రాజుకు మంత్రి, సేనాపతి, పురోహితుడు సహకారులు. ఎవరి విధులు వారివే. మంత్రినే ప్రధానమంత్రి, మహామంత్రి, మహాప్రధాని, అంటుండేవారు. కుమారగిరి రెడ్డి మాత్రం సంప్రదాయాన్ని విడనాడి కాటయ వేమారెడ్డినే ప్రధానమంత్రిగాను, సైన్యాధ్యక్షునిగానూ వినియోగించుకున్నాడు. కొందరు బ్రాహ్మణులనే ప్రధానమంత్రిగా వినియోగించారు. ప్రోలయ వేమారెడ్డి మంత్రులు రామాప్రెగడ, మల్లీనాథుడు. అనపోతారెడ్డి మంత్రులు సోమయ, మల్లీనాథుడు. పెదకోమటివేముని మంత్రి మామిడి సింగన. వీరంతా బ్రాహ్మణులే. మంత్రికి రాజుతో సమాన హోదా ఉండేది. రెడ్లకు బ్రాహ్మణులకు వున్న సాన్నిహిత్యం చరిత్ర చెప్పిందే. ఏది ఏమైనా రాజు నిర్ణయమే తుది నిర్ణయం. ప్రధానమంత్రి తరువాత అంతటి హోదా పురోహితునిదే.

పూర్వము పరిపాలనా వ్యవస్థను సౌలభ్యం కోసం భూములుగా, వాటిని సీమలుగా, వాటిని నాయంకరములుగా, వాటిని నాడులు, స్థలములు, గ్రామాలుగా విభజించారు. రెడ్డి రాజులు వారి సౌకర్యార్థం కొండవీడు, వినుకొండ బెల్లముకొండ, అద్దంకి, ఉదయగిరి,

కోట, నెల్లూరు, మారెళ్ళ, కందుకూరు, పొదిలి, అమ్మనబ్రోలు, చుండి, దూపాడు, నాగార్జునకొండ అను విభాగాలు చేశారని చిలుకూరి వీరభద్రరావు గారి ఆంధ్రుల చరిత్ర గ్రంథంలో ఉన్నదని సురవరం ప్రతాపరెడ్డిగారు ఆంధ్రుల సాంఘిక చరిత్రలో తెలిపారు. ప్రభుత్వానికి ముఖ్య ఆదాయం భూమి శిస్తు. దీనిని బద్దెన "కృషి మంజరి" అని, మల్లన "ఆరంబమునరి" అని అన్నారు. ముసునూరి నాయకులు పంటలో ఆరవ వంతు పన్నుగా వసూలు చేసినట్లు ప్రోలయ నాయకుని శాసనం చెబుతుంది. ఇదే పద్ధతిని రెడ్డిరాజులూ అనుసరించారు. నాయంకరులు, సామంతులు చెల్లించే కప్పం రాజ్యాదాయంలో ఒక భాగం. వారు సైన్యం కోసం వినియోగించినది పోను మిగతాది కప్పం కట్టేవారు. వ్యవసాయ పొలాలను వర్గీకరించి పన్నులు నిర్ధారణ చేసేవారు. ధాన్యరూపంలో వసూలు చేసిన పన్ను 'రాచగాదె'లలో వుండేవి. తోట పొలాల పన్ను ధనరూపంలో వసూలయేది. కార్తీక, వైశాఖ మాసాలలో పన్నుల వసూళ్ళుండేవి. ప్రోలయవేముని చీమకుర్తి శాసనం సువర్ణాదాయాన్ని పేర్కొన్నది. పుల్లరి (బీళ్ళపై పన్ను), ఇల్లరి (ఇంటి పన్ను), దండాదాయం (జరిమానాలు) అనే సుంకాలుండేవి. కాకతీయులు, రెడ్డిరాజుల కాలంలో పన్నుల బాధ ఎక్కువగా వుండేదట. కౌలు చెల్లించని రైతులకు శిక్ష కఠినంగా వుండేది. శ్రీనాథుడే దీనికుదాహరణ. తరువాతి నలగాముని కాలంలో రైతుల కాళ్ళకు చేతులకు బేడీలు వేసి కొట్టేవారు. సుంకాలు వసూలు చేసేవాళ్ళను 'సుంకరులు' లేదా 'సుంకర గుత్తకాండ్రు' అనేవాళ్ళు. సంతలలో, రేవు పట్టణాలలో వాణిజ్య పన్నులుండేవి. ఎగుబడి, దిగుబడి సుంకాలుండేవి. గానుగలపై, రాట్నాలపై, మగ్గాలపై వాణిజ్య పన్నులుండేవి.

పరిపాలనా వ్యవస్థలో చివరిది గ్రామం. గ్రామ పరిపాలనకు భటులుండేవారు. వారు రెడ్డి లేదా పెదకాపు, కరణం, తలారి, పురోహిత అనువారుండేవారు. గ్రామానికి కమ్మరి, కుమ్మరి, కంసాలి, వడ్రంగి, చాకలి, మంగలి, శెట్టి, చర్మకార అను మిరాసీదారులుండేవారు. జీతాలుండవు. మేరలుండేవి. కొందరికి భూములనిచ్చేవారు. పన్నులు లేకుండా దాన భూములననుభవించేవారు. ప్రతి గ్రామానికి గామసేవకులుండే వారు. వారికి మిరాసీలు, మేరలు, దానభూములుండేవి. వాటిని భట్టవృత్తి మాన్యాలనేవారు.

నాడు గ్రామాలు నాలుగు రకాలుగా వుండేవి. రాజుగారి అధీనంలో వుండేవి రాచవూళ్ళు. వీటిని రైతులకు కవుళ్ళకిస్తారు. సేనాపతులైన నాయంకరుల స్వాధీనంలో వుండేవి

నాయంకరపట్లు. అంటే జాగీర్దారి గ్రామాలు. వీటిని అమ్మే అధికారం లేదు. బ్రాహ్మణులు వంశపారంపర్య హక్కులతో అనుభవించేవి అగ్రహారాలు. ఇవిగాక దేవదానాలు.

గ్రామాలలో "రెడ్డి" ప్రభువు ప్రతినిధిగా వుండేవాడు. ఆయనే గ్రామానికి న్యాయాధికారి కూడ. భూమి రికార్డులు. పన్నులు నిర్వహించేది కరణం=గణకుడు సాగుబడి లెక్కలు తయారు చేస్తాడు. మొదటిలో పన్నులు వసూలు చేయువారు విశ్వబ్రాహ్మణులట. రాయని భాస్కర మంత్రి వారిని తొలగించి నియోగి బ్రాహ్మణులను ఏర్పాటు చేశాడట. అయితే కరణాలకు అంత మంచి పేరులేదు. వారు అసాధ్యులట, దుర్మార్గులట. భీమేశ్వర పురాణంలో వీరిని గురించి ఒకచోట

**"క : కరణము తనయేలిక కుప**
**కరణము, నిర్ణయ గుణాధికరణము, ప్రజకున్**
**శరణము, పగవారలకును**
**మరణము నాజెల్లు నీతిమంతుండైనన్"** అని చెప్పబడింది.

రెడ్డి, కరణం కలిసి ప్రభుత్వం. వారి ఆమోదం లేకుండా గ్రామంలో ఏమీ జరగదు. గ్రామంలో శాంతిభద్రతల బాధ్యత వారిదే. తలారి గ్రామ రక్షకభటుడు. రాత్రులందు గ్రామంలో గస్తీ తిరుగుతూ దొంగతనం వగైరా నేరాలను అరికట్టేవాడు. అతనితో బారికాపు మరొక రక్షక భటుడుండేవాడు.

పురోహితులు – బ్రాహ్మణులు ప్రజల్లో అత్యంత గౌరవం పొందేవారు. ప్రజలు తిథి. వార, నక్షత్ర, శుభదినాల విచారణ కోసం పురోహితుని వద్దకేగేవారు. ఏ పని మొదలుపెట్టాలన్నా పురోహితుడే సమయ నిర్ణయం చేయాలి. పురోహితుడు భూసురుడయ్యాడు. రెడ్డిరాజులు ప్రదర్శించిన బ్రాహ్మణభక్తి అంతలింతలని చెప్పనసాధ్యం. వారు భూమి పన్నులుగాని, ఇతర పన్నులుగాని ఏమీ చెల్లించాల్సిన పని లేదు. రాజుకు పురోహితుడు లేకుండా గడిచేది కాదు.

రాజుకు వ్రాయసకాండ్రు, రాయసకాండ్రు వుండేవారు.

రాజులు పెద్ద చెరువులు నిర్మించి వాటి మరమ్మత్తులకు (తటాక భూమి పరిమితిలో) కొంత భాగాన్ని మాన్యంగా ఇచ్చే పద్ధతిని "దశబంధ" పద్ధతియని, ఈమాన్యాన్ని "దశబంధ

మాన్యం" అనేవారని మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు, డా॥ బి.ఎస్.ఎల్. హనుమంతరావుగారు వారి చరిత్ర గ్రంథాలలో పేర్కొన్నారు. ఈ మాన్యాలననుభవించే వారు నీటి వనరులు, మరమ్మత్తుల కోసం పంటలో పదోవంతు వినియోగించేవారు / చెల్లించేవారు. ఈ మాన్యాలపై పన్ను లేదు.

కేంద్రప్రభుత్వంలో రాష్ట్రాధికారులు, సేనాధిపతులేకాక "కవిలె సంప్రతులు" అనే గణికులు (అకౌంటెంట్సు) అనేకమంది వుండేవారు. రాజ్యంలోని రాష్ట్రాలనుంచి, దుర్గాలనుంచి వచ్చే ఆదాయ వ్యయ వివరాలను పద్దులవారీగా లెక్కలు వ్రాసి ఎప్పటికప్పుడు చెప్పటం వారి విధి.

సంతలలో, రేవుపట్టణాలలో వాణిజ్య సుంకాలుండేవి. వాణిజ్యంపై ఎక్కుమడి(ఎగుమతి), దిగుమడి(దిగుమతి) పన్నులుండేవి. గనులపై, నూనె గానుగలపై, మగ్గాలపై, రాట్నాలపై పన్నులుండేవి. రెడ్డిరాజులలో ఆఖరివాడైన రాచవేమారెడ్డి పురిటి పన్ను, పొయ్యిపన్ను ఇంకా ఎన్నెన్నో పన్నులు విధించి ప్రజాగ్రహానికి గురై వారిచేతిలో ప్రాణాలు కోల్పోయాడట. ఇతడు పరమ నిరంకుశుడైనందున బలిజ తెగకు చెందిన సవివరం యెల్లప్ప అతన్ని హతం చేశాడని చరిత్రలో వ్రాయబడింది.

## వ్యవసాయం

రాజ్యంలో భూమి అంతారాజుదే. అనుభవదారులకు పట్టాలు లేవు. బ్రాహ్మణులకు అగ్రహారాలుండేవి. ఇతర గ్రామాలలో రైతులు సమిష్టి సేద్యం చేసి, సమిష్టిగా వ్యవసాయము చేసి ఖర్చులు భరించి ప్రభుత్వపు షడ్భాగము (కొన్నిచోట్ల పదవ వంతు) తీసియుంచి మిగతాది పశువుల లెక్క ప్రకారము (కాడిలెక్క) పంచుకొనెదరు. తూము పొలము, పుట్టి పొలము, కుంట, కుచ్చెల అనేవాళ్ళు. బంగారాన్ని మాడలనేవారు. కుంటలు, చెరువులు త్రవ్వి తరి సేద్యంచేసేవారు. ప్రజలకు ముఖ్యవృత్తి వ్యవసాయం. ప్రభుత్వానికి ముఖ్య ఆదాయ వనరు వ్యవసాయమే. వ్యవసాయం శూద్రులు చేసేవారు. చెరువులు, బావులు నీటి సౌకర్యాలు. ఏతాము, రాట్నాలు, కపిల ద్వారా పొలాలకు నీటిపారుదల జరిగేది.

పంటల్లో వరి, జొన్న, సజ్జ, చెరకు, నువ్వులు, పత్తి ముఖ్యమైనవి. జొన్నపంటే ముఖ్యం. "జొన్నకలి, జొన్నయంబలి, జొన్నన్నము, జొన్నపిసరు జొన్నలె తప్పన్" అని, "కుసుమాస్త్రుడైనా

జొన్నకూడే" తింటాడని, "మిరమిర రేనాటి జొన్న మెతుకులు తినుమీ" అన్న శ్రీనాథుని పద్యాలు మనకు ఆధారం. జొన్నకలి, జొన్నంబలి, జొన్నపిసరు ప్రజలెక్కువగా భుజించేవారు. సజ్జన్నం కూడ ముఖ్యాహారాలలో ఒకటి. పట్టణాలలో ధనికులు సన్నన్నము, అరిసెలు, బూరెలు, పాయసములు, వడలు భుజించేవారు. బియ్యము, తిలలు, పెసలు, బెల్లపు చెరకు, జొన్నలు, సజ్జలు, మినుములు మున్నగు పంటలు పండించేవారు.

బెల్లం, నూనె, చింతపండు, ఖండశర్కర, నెయ్యి మొదలగు ఇతర భోజ్యము లుండేవి. అరటిపండ్లు, తాంబూలాలు పట్టణాలలో వుండేవి. పల్లెటూళ్ళలో "అంగడి యూరలేదు, వరియన్నములేదు, శుచిత్వమేమిలేదంగనలింపుగారు, ప్రియమైన వనంబులు లేవు...... దాతలెన్నంగను సున్న" అని శ్రీనాథుడు వాపోయాడు. పల్లెలు అమాయకంగా, నిరాడంబరంగా వుండేవట. "రసికుడు పోవడు పల్నాడెసగంగా, రంభయైన నేకులు వడకున్, వసుధేశుడైన దున్నును, కుసుమాస్త్రుండైన జొన్నకూడె కుడుచున్." అని శ్రీనాథుడు పల్నాటి ప్రాంతాన్ని గూర్చి విశదంగా చెప్పాడు. ప్రజల వ్యవసాయ రీతి, పంటలు, ఆదాయ వనరులు, భోజనవసతులు అలావుండేవని అర్థమౌతుంది.

తూర్పుతీరమందలి లంకభూములలో ఏటి మడవలలో నానావిధములగు వరి ధాన్యములు పండేవి. వడ్లలో అనంతమగు జాతులున్నవి. గోదావరి లంకలో బహువిధ ఫలములు సమృద్ధిగా వుండేవి. ఆ కాలమున దేశమును చూచిన జోర్డానస్ (1327–30) అను పాశ్చాత్యుడిట్లు వ్రాసెను. "తెలుగుదేశపు రాజు బహుప్రతాపవంతుడు. అతని రాజ్యములో పుష్కలముగా జొన్న, వరి, చెరకు, తేనె, పప్పుధాన్యాలు, గ్రుడ్లు, గొర్లు, దున్నలు, పాడి, వివిధములగు నూనెలు శ్రేష్టములగు ఫలములు మరెందును లభ్యము కానట్టివి సమృద్ధిగా లభిస్తున్నవి" అని సురవరం ప్రతాపరెడ్డిగారు నమోదు చేశారు. భూములను రైతులు వారిలో వారు కవుళ్ళకు తీసుకొనెదరు. అందుకు శ్రీనాథుడే మనకుదాహరణ. రెడ్డిరాజులకు ప్రజావలంబన ఉన్నట్లు తెలియుచున్నది. వేశ్యలు కూడ తమకిచ్చిన భూములలో చెరువులు త్రవ్వించారు.

ప్రజలపై పన్నులద్వారా వచ్చే ఆదాయం ధాన్యాదాయము, సువర్ణాదాయమని రెండు విభాగాలు. ఈ ఆదాయాలను ఆయం (రెవిన్యూ) అనేవారు. ప్రభుత్వానికి (రాజుకు) ఆదాయ

వనరులు ఏడెనిమిది రకాలుగా వుండేవి. 1. వ్యవసాయం, 2. పరిశ్రమలు, 3. వాణిజ్యం, 4. సుంకం, 5. పచ్చిక బీళ్ళు - అడవులు (గోరక్ష), 6. సాంఘిక సౌకర్యాలు (నందన వనాలు), 7. నగదు రూపంలో అనూచానంగా చెల్లించేవి. (ప్రభుత్వానికి చెల్లించేవి బంగారం రూపంలో కూడ వుండేవి).

నేలని మెట్ట, తరి, తోట అని వర్గీకరించారు. ప్రభుత్వం (రాజు) చెరువులు కుంటలు, ఆనకట్టలు నిర్మించేది. ప్రజలు కూడ అవసరాన్ని బట్టి, వసతిని బట్టి చెరువులు త్రవ్వుకునేవారు. తరి సేద్యమునకు మోట, ఏతము ద్వారా నీరు తీసుకునేవారు.

ప్రభుత్వం ఇల్లరి (ఇంటి పన్ను), పుల్లరి (బీళ్ళ మీద పన్ను), పొయ్యి పన్ను, పురిటి పన్ను, ఉప్పు పన్ను, భూమిశిస్తు, కవుళ్ళు, అధికంగా వసూళ్ళు వుండేవని సాహిత్యం, శాసనాలు, తెలుపుతున్నవి. అవే వారి అంతాన్ని చూశాయని కూడ చరిత్ర చెబుతుంది.

ప్రభుత్వానికి ముఖ్య ఆదాయం భూమి శిస్తు. దీనిని 'కృషి ప్రపంచమరి', 'కృషి మంజరి', 'ఆరంబమునరి' అని అనేవారు. ముసునూరి నాయకులు పంటలో ఆరవ వంతు పన్నుగా వసూలు చేసినట్లు ప్రోలయ నాయకుని విలస శాసనం వలన తెలుస్తున్నది. నాయంకరులు, సామంతులు చెల్లించే కప్పం కూడ రాజ్యాదాయంలో ముఖ్యభాగమే. రాచవూళ్ళలోని భూములను రైతులకు కవుళ్ళకిచ్చేవారు. పన్నులను ధనరూపంలో వసూలు చేసేవారు. ధాన్యరూపంలో వసూలు చేసిన ధాన్యాన్ని "రాచగాదెలు"లో పోసి ప్రభుత్వోద్యోగులు కాపలా వుండేవారు. పన్నులు పుల్లరి (పచ్చిక బీళ్ళుపై) ఇల్లరి (ఇంటి పన్ను) దండాదాయం (జరిమానాలు) అను 3 విధాలుగా వున్నాయని ప్రోలయ వేముని చీమకుర్తి శాసనంలో తెలుస్తుంది. ప్రభుత్వానికి గనులపై ఆదాయం వచ్చేది. వజ్రాల గనులు, ఇనుప గనులు మీద పన్నులధికంగా వసూలయ్యేవి. మగ్గాల మీద, నూనె గానుగల మీద పన్నులుండేవి. వ్యాపార సుంకాలు, సంతలపై ఆదాయం ప్రభుత్వానికి చెందేది. పన్నులు వసూలుచేసే అధికార్లను సుంకాధికార్లు అనేవారు. ఇదేకాక ఓడరేవుల్లో విధించే సుంకాలుండేవని మోటుపల్లి శాసనం తెలుపుతుంది. సామంతులు చెల్లించే కప్పం మరొక ఆదాయం.

ఈ ఆదాయాలన్నీ పూర్వపు పరిపాలకుల కాలాలనుండీ ఉన్నవే. వాటినే రెడ్డిరాజులూ అనుసరించారు. ఎక్కువైన వాటిని ప్రజలు వ్యతిరేకించారు.

ప్రభుత్వం మూలధనాన్ని ఏర్పాటు చేసేది. దానిలో 3వ వంతుగాని, 4వ వంతుగాని ప్రజలపై ఖర్చు చేసేది. మిగిలిన మొత్తాన్ని సైన్య నిర్వహణకై ఖర్చు చేసేవారు.

భూములను కొలుచుటకు "గడి" అని నిర్ణీత పొడవుగల కట్టె/బద్ద ఉండేది. గడి కొలతను దేవాలయం మండపంలో చెక్కించి పెట్టేవారు. భూముల వివరాలను "క్షేత్ర గణితము"ను తాటాకులపై వ్రాసేవారు. కొలతలు జానలు, గడలుతో కొలిచేవారు. ఆకాలంలో తూమెడు పొలము, పుట్టెడు పొలము అనేవారు. తూమెడు అనగా తూమెడు విత్తనములు పట్టెడు భూమి అని అర్థము. అలానే కొలతలు 4 మూరలు=బార, 4 బారలు=గడ, 400 గడలు=కుంట, 100 కుంటలు=కుచ్చెల/ఖండిక/తూప అనేవారు. తూకములను మాడలతో పిలిచేవారు. మాడ అనగా అరవరహా. బంటు పనికి రోజుకు ఒక మాడ యిచ్చేవారు.

## వ్యాపారం

వ్యాపారం చేసేవారిలో బలిజలు, కోమట్లు ముఖ్యులు. బలిజలకే 'శెట్టి' అనే బిరుదం వుండేది. వీరికి ఆంధ్రదేశంలో, కన్నడ తమిళ దేశాలలో సంఘాలుండేవి. స్వదేశ వర్తక సంఘానికి "స్వదేశీ" అని, పరదేశాల్నుంచి వచ్చేవారికి "పరదేశీ" అను పేర్లుండేవి. వాణిజ్యానికి ప్రభుత్వాన్నుంచి అనుమతి పత్రాలు పొందాలి. దేశంలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి బండిదార్లుండేవి. మాచర్ల, వేల్పూరు, యనమదల, కొండవీడు, తంగెడ, అద్దంకి, త్రిపురాంతకం, కందుకూరు, వినుకొండ, కొండపల్లి, నెల్లూరు, పెదగంజాం, ఘంటసాల, ద్రాక్షారామం, పెనుగొండ, రాజమహేంద్రవరం ఆనాటి ముఖ్య వాణిజ్య కేంద్రాలు. వీటిని రేవు పట్టణాలైన మోటుపల్లి, మచిలీపట్నంలతో కలుపుతూ రహదారులుండేవి. మోటుపల్లి నుండి త్రిపురాంతకం మీదుగా బళ్ళారి మార్గం ఆంధ్ర కర్నాటకలను కలిపేది. ఒంటెలు, ఎద్దులు, దున్నపోతులు, గుర్రాలు, కంచరి గాడిదల వీపులపై కూడ సరుకులు వేసుకుని పోయేవారు. బండ్లమీద కూడ వెళ్ళేవి. దొంగల బారీ నుండి తప్పించు కోవటానికి ఆయుధాలు కూడ తీసుకుని పోయేవారు. నదులు దాటటానికి ప్రత్యేక పడవలుండేవి. పుట్లుండేవి. ముస్లిం సర్దారుల నుండి మోటుపల్లి రేవును ప్రోలయ వేమారెడ్డి తమ్ముడు మల్లారెడ్డి కైవసం జేసుకొని తర్వాత ఆ రేవు పట్టణాన్ని అభివృద్ధి చేశారు.

సంతలు జరిగేవి. వస్తు మార్పిడి పద్ధతులుండేవి.

దూరదేశాలైన బర్మా, మలయా, ఇండోనేషియా, చీనా, పంజాబు, సింహాళము, చొట్టంగి, పర్షియా, అరేబియా, గోవా వగైరా చోట్ల నుండి వివిధ వస్తు వ్యాపారం, చందనాగరు, కర్పూర, హిమాంబు, కుంకుమ, రజ, కస్తూరికాది సుగంధ ద్రవ్యాల దిగుమతి, చైనా వగైరా దేశాల నుండి చీనీ చీనాంబర శ్రేణులు, ఆణిముత్యాలు, సుగంధద్రవ్యాలు వగైరాల వ్యాపారం అవచి దేవయ, తిప్పయసెట్టి ద్వారా జరిగేవి. శ్రీనాథుని హరవిలాసం గ్రంథ సమాచారాన్ని బట్టి (ఇది అవచి తిప్పయసెట్టికి అంకితమిచ్చాడు) జాఫ్నా, సింహాళం, సుమత్రా, మలయా, ఇండోచైనా, బోటాలతో వ్యాపారం జరిగింది.

**"పంజార కర్పూర పాదపంబులు తెచ్చె**
**జలనోంగి బంగారు మొలకతెచ్చె**
**సింహాళంబున గంధ సింధురంబులు దెచ్చె**
**హురుముంజి బలుతేజి హరులు దెచ్చె**
**గోవసంశుద్ధ సంకుమద ద్రవము దెచ్చె**
**యాంపకట్టాణిముత్యాలు దెచ్చె**
**భోట కస్తూరికా పుటకోశములు దెచ్చె**
**చీని చీనాంబరశ్రేణి తెచ్చె**

**జగద గోపాలరాయ వేశ్యాభుజంగ**
**పల్లవాదిత్య భూదాన పరశురామ**
**కొమరగిరి రాజదేవేంద్రు కూర్మిహితుడు**
**జాణ జగజెట్టి దేవయ చామిసెట్టి"**

క్రీ.శ. 1358లో వ్యాపారాభివృద్ధి చేయగోరి మోటుపల్లి రేవును వృద్ధి గావించుటకు అనపోతారెడ్డి ముఖ్యనిర్ణయం తీసుకున్నాడు. మోటుపల్లి రేవు ద్వారా జరిగే వ్యాపారాలపై సుంకాన్ని రద్దు చేశాడు – నేటి "Free Trade Policy" వలె. ఇప్పటివలె పన్నుల విధానం, ఎక్సైజు డిపార్టుమెంటు ఉన్నాయని మల్లంపల్లి వారు పేర్కొన్నారు. రెడ్డిరాజుల (ఆంధ్రుల)

ఓడలను గూర్చి మార్కొపోలో అను వెనిస్ యాత్రికుడు ఇలా పేర్కొన్నాడు "ఆంధ్రుల యోడలు పెద్దవి. ఓడలో 150 నుండి 300 మంది కార్మికులుండిరి. ఓడలో 6000 మిరియపు బస్తాలు నిలుపుచుండిరి. పెద్ద ఓడలయందు మూడు చిన్న నావల నుంచెడివారు. అవసరమును బట్టి 10 చిన్న నావలుంచబడెడివి. వర్తకుల కనుకూలమగు 60 గదులు ఓడలో నుండెడివి."

## మతము - ధార్మికత

రెడ్డిరాజులు హైందవులు. హైందవ మతాన్ని ముస్లిమ్ పాలకుల వ్యధనుండి రక్షించటానికి కంకణం కట్టుకున్నారు. శైవులు, వైష్ణవులు అనే తేడా లేకుండా ఉభయులనూ హిందూ మతోద్ధారకులుగానే భావించి సామరస్యం పాటించి, అవలంభించారు, ఆదరించారు. హిందూ సంస్కృతిని, సంప్రదాయాలను రక్షించటానికి శైవమా, వైష్ణవమా అనేది చూడలేదు.

ప్రోలయ వేమారెడ్డి, అనపోతారెడ్డి, అనవేమారెడ్డి శివభక్తులు. కుమారగిరిరెడ్డి, కాటయవేమారెడ్డి విష్ణుభక్తులు. కొండవీటి రాజులకు ఘోడెరాయవంశం వారు గురువులు. వారు శైవులు. రెడ్డిరాజులకు కులదేవత మూలగూరమ్మ. మతపరమైన నమ్మకాలు, మూఢ విశ్వాసాలు ఎక్కువగానే వున్నవి.

రెడ్డిరాజులు, వారి ఉద్యోగులు, ప్రజల ఆదరణతో కొన్ని దేవాలయాలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. అట్టి వాటిలో శ్రీశైలం, త్రిపురాంతకం, అమరావతి, పాలకొల్లు, ద్రాక్షారామం ముఖ్యమైనవి. కొన్ని దేవాలయాలకు మాన్యాలిచ్చి మరమ్మత్తులు చేయించి పునరుద్ధరించారు. రెడ్డి ప్రభువులు రోజుకు ఆరుసార్లు శివపూజలు చేసేవారట; ప్రోలయ వేమారెడ్డి ధాన్యకటకం(అమరావతి) లోని అమరేశ్వరాలయ శిఖరానికి సువర్ణ కలశాలను, బంగారు పట్టికను సమకూర్చాడని దేవాలయంలోని శాసనం చెబుతుంది. మల్లారెడ్డి చదలవాడ (ప్రకాశం జిల్లా) దగ్గర ఆలయాన్ని నిర్మించి రామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించాడంటారు. అందుకని చదలవాడనే రెడ్డి మల్లవరం అని కూడ చరిత్ర చెబుతుందంటారు. ప్రోలయ వేమారెడ్డి యాత్రికుల సౌకర్యార్థం శ్రీశైలం కొండమీదికి, అహోబిలం క్షేత్రానికి మెట్లు కట్టించాడు. శ్రీశైలంలో దిగువ పాతాళ గంగకు మెట్లు కట్టించాడు. శైవం విస్తృతంగా వున్న కాకతీయ, రెడ్డి రాజుల కాలంలో ధర్మరక్షణ కోసం, దేశహితం కోసం, ప్రజాక్షేమం కోసం,

రాజశ్రేయస్సు కోసం వీరశైవులు ఆత్మబలిదానం చేసుకునేవారు. ఆత్మబలిదానం చేసుకునే గుడులను 'చంపుడు గుళ్ళు' అనేవాళ్ళు (కత్తితో గొంతుకను తామే కోసుకోవటం ఆత్మబలిదాన విధానం). ఆ వీరుల గౌరవార్ధం వారి ప్రతిమలు శిలలపై చెక్కించి ఆలయ ప్రాంగణాలలో పెట్టేవాళ్ళు. వీటిని 'వీరకల్లులు" అంటారు. త్రిపురాంతకం ఆలయ ప్రాగణంలో 70 వీరకల్లులను చూడవచ్చు. మతపరమైన విద్యావ్యాప్తికి దేవాలయాలలో మఠాలుండేవి. శ్రీశైలంలో గంటామఠం, విభూతిమఠం, కళుమఠం వగైరా వున్నవి. రెడ్లు వారి రాజ్యం త్రిపురాంతక దేవదత్తంగా భావించి, ఆ దేవుని కృప వలన కుమారగిరిరెడ్డి పుట్టినాడనే విశ్వాసంతో త్రిపురాంతకేశ్వరుని పీఠమైన కుమారాచలం=కుమారగిరి పేరును ఆ మగశిశువుకు "కుమారగిరి రెడ్డి" అని పెట్టుకున్నారని స్థలచరిత్రగా చెబుతారు. త్రిపురాంతకేశ్వరునికి భూదానాలు, గోదానాలు, గొర్రెల దానాలు విరివిగా చేశారట. శంకర విజయం గ్రంధాన్ని శంకరాచార్యులు శ్రీశైలంలో తపస్సులో వుండి వ్రాశాడని, ఆ స్తలాన్ని పాలదార, పంచదార అని అంటారని చరిత్ర చెబుతుంది.

అనవేమారెడ్డి కొన్ని సోఫానాలు కట్టించారు. శ్రీశైలం ఆలయశిఖరాలకు బంగారు కలశాలు సమకూర్చాడు. శ్రీమల్లికార్జునస్వామికి ఆతుకూరు గ్రామాన్ని ధర్మంగా యిచ్చాడు. కాటయవేముడు శ్రీమల్లికార్జున ఆలయం నుండి శిఖరేశ్వరం వరకు మెట్లు కట్టించాడని. క్రీ.శ. 1405 శాసనాన్ని బట్టి తెలుస్తుంది.

పంచారామాలుగా ప్రసిద్ధి చెందిన ఆలయాలలో అమరావతి ప్రసిద్ధమైనది. కుమార స్వామి తారకాసురునితో చేసిన యుద్ధంలో ఆ రాక్షసుని మెడలోని శివలింగాన్ని అయిదు ముక్కలుగా చేశాడు. ఆ ముక్కలు పడిన క్షేత్రాలే పంచారామాలు. అవి అమరావతి, ద్రాక్షారామం, కుమారారామం(చాళుక్య భీమవరం), క్షీరారామం (పాలకొల్లు), చాళక్యా రామం(గునుపూడి భీమవరం); తొలిముక్క అమరావతిలోనిదని పురాణ కథ.

ఆంధ్రదేశానికి త్రిలింగ దేశమని పేరు. ఒకటి శ్రీశైల మల్లికార్జునస్వామి. రెండవది ద్రాక్షారామ భీమేశ్వరస్వామి. మూడవది కాళేశ్వరస్వామి. అన్నింటిలో రెడ్డిరాజులు పూజలు చేశారు. భూరి విరాళాలు ఇచ్చారు. మండపాలు, గోపురాలు, ప్రాకారాలు, ఏర్పాట్లు చేశారు.

అనవేమారెడ్డి ద్రాక్షారామంలో భీమనాథనగరం నిర్మింపజేసి దానిలో నాట్య, కళ్యాణ, హోమ, శనివార, గయానక మండపాలు నిర్మించారు. రాజమహేంద్రవరంలోని మార్కండేయస్వామిని రెడ్డిరాజులు కులదైవంగా ఆరాధించి, నిర్మాణానికి, అభివృద్ధికి కృషిచేశారు. కాటయ వేమారెడ్డి భార్య మల్లాంబిక కోటికేసవరం అనే గ్రామాన్ని మార్కండేయస్వామి సేవా కైంకర్యాల కోసం దానమిచ్చింది. రాజమహేంద్రవరంలోని ప్రసిద్ధ వైష్ణవాలయంను రెడ్డిరాజులు పునర్నిర్మించారు.

రెడ్డిరాజులు ఆలయాలు పోషణపై శ్రద్ధవహించారు. శ్రీశైలం, త్రిపురాంతకం, అహోబిలం, ద్రాక్షారామం, అమరావతి, సింహాచలం, ఉండవల్లి గుహలు, కందుకూరు జనార్ధనాలయం, మొదలైన లెక్కలేనన్ని దేవాలయాలకు పోషణ, ఆదరణ ఏర్పాటుచేసి, బ్రాహ్మణులకు అగ్రహారాలనిచ్చి తమ దైవభక్తిని చాటుకున్నారు. శిల్పకళను ఆదరించారు. మూలగూరమ్మ గుడి, కొండవీడు దుర్గం, పుట్టకోట, వేల్పూరు, కంటెపూడి, కొండపల్లి, దీవులదిన్నె, శేకూరు, త్రిపురాంతకం, మోటుపల్లి, కోరుకొండ, దాక్షారామం, సర్పవరం వగైరా దేవాలయాలు, మండపాలపై చిత్రకళ ఉన్నతస్థాయి లోనిది.

రెడ్డి నారీమణులు నాగమ్మ, ఎరుకసానమ్మ, ఐతాంబిక, కుప్పాంబిక, మల్యాల మైలమ, సూరాంబిక, అనితల్లీదేవి (కాటయ వేమారెడ్డి కుమారై) (వీరభద్రారెడ్డి భార్య).

## న్యాయపాలన - శిక్షాస్మృతి

రెడ్డిరాజుల కాలంలో న్యాయపాలన, శిక్షల విధానం ఎలా వుండేదో అంతగా ఆధారాలు లేవు. కాని పూర్వపు హిందూ పురాణాలు, ధర్మశాస్త్రాలు, ఇతిహాసాలు, కౌటిల్యుని అర్ధశాస్త్రానికి కొంత దగ్గరగా ఉన్న శతాబ్దాలు కనుక వాటిలోని ధర్మసూత్రాలను ఆచార సంప్రదాయాలను ఎక్కువగా పాటించి వుండవచ్చు.

అప్పటి సాహిత్యంలో, అక్కడక్కడ కొన్ని వివరాలు అన్వయాలుగా దొరికేవి. రెడ్డిరాజులు వారికి ముందున్న కాకతీయులు, ప్రక్కనున్న విజయనగర రాజుల ధర్మసూత్రాలను, సంప్రదాయాలను పాటించినట్లు చరిత్రకారులు అభిప్రాయపడ్డారు.

మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు కొన్ని వివరాలను తన రెడ్డిరాజ్యాల చరిత్ర గ్రంథంలో వ్రాశారు. న్యాయవిధానం ధర్మశాస్త్ర గ్రంథాలమీద ఆధారపడి జరుగుతుండేదని వ్రాశారు. యాజ్ఞవల్క్యస్మృతి, నారదస్మృతి, పరాశర మాధవీయం, మరికొన్ని ధర్మశాస్త్రాలననుసరించి న్యాయవిధానం ఉండేదట.

రాజే న్యాయపరిపాలనలో పెద్ద. సలహామండలి సహకారం ఉండేది. వారిలో ముఖ్యుడు పురోహితుడు. న్యాయస్థానాన్ని ధర్మసభ అని, ధర్మాసనం అని అనేవాళ్ళు. నేరాన్ని విచారించే వారిని ధర్మసభాజనులనేవారు. న్యాయసభను ధర్మాసనం అనేవారు.

శిక్షలు చాల కఠినంగా వుండేవి. తిత్తి వలిపించటం, అంగచ్ఛేదం, గానుగలో పెట్టి తిప్పటం, ఒంటిపై వెంటి చుట్టి నిప్పంటించటం, వీపుపై గుండ్లెత్తించటం, ముక్కుకు నీరెత్తటం, కొరతవేయటం మొదలైనవి కొన్ని.

భూమి తగాదాలు, ఇళ్ళ తగాదాలు, అప్పులు, అమ్మకాలు, కొనుగోళ్ళు, వారసత్వం, ఒప్పందాలు, వాటి ఉల్లంఘన మొదలైన వ్యాజ్యాలుండేవి. సాక్షులను విచారించి తీర్పులు చెప్పేవారు.

ముందు అనుకున్నట్లు శాసనాలకంటే సాహిత్య గ్రంథాలే వీటికి ఎక్కువ ఆధారాలు.

పాతివ్రత్య ఆచారాన్ని మీరిపోవటం పెద్దనేరం. అలా పాతివ్రత్యం రుజువు చేసుకోవటానికి బాగా కాల్చిన ఇనుపగుండు చేత్తో పట్టుకోవటం ఆనాటి న్యాయం – ధర్మం. దీనిని “మద్దువట్టు” అనేవారు. అది కాలకుంటే పతివ్రతే. నేరం చేయనట్లే.

గోప్యంగా జరిగే నేరాలు కొన్ని పరీక్షల ద్వారా నిర్ధారించేవారు. న్యాయమూర్తి సమక్షంలో లేదా దేవాలయంలో దైవ విగ్రహాల ముందు ఈ పరీక్షలు జరిగేవి. ఈ కఠిన పరీక్షలు సర్వ సాధారణమని ముస్లిం రచయితలు కూడ తమ గ్రంథాలలో వ్రాశారు. నేరారోపణను దేవుని ఎదుట ప్రమాణం చేయించి చెప్పించటం ఒక పద్ధతి. నేరారోపణ నెదుర్కొనే వ్యక్తి రెండుచేతి వ్రేళ్ళను కాగే వెన్నలో పెట్టిస్తారు. కాలకుంటే నేరం చేయనట్లే.

నేర నివారణ, పరిశోధనలో గ్రామ రక్షక భటులదే బాధ్యత. గ్రామ నిఘా ఎక్కువ. రాత్రిళ్ళు గస్తీలుండేవి. గ్రామస్తుల సహాయం కూడ తీసుకునేవారు.

దొంగతనం మరొక పెద్దనేరం. ఈ నేరాన్ని శోధించటం తలవరి విధి. నేరాన్ని తలవరి శోధించలేకపోతే అతడే బాధితునికి నష్టపరిహారం చెల్లించాలి. అది సాధ్యం కాకపోతే రాజే నష్టపరిహారం చెల్లించే ఏర్పాటు చేయాలి.

శాంతి భద్రత, రక్షణ, నేరాల్ని నిరోధించటం, దొంగతనాలు నివారించటం తలారి విధి. ఇందుకు అచ్చు కావలి, వెలి కావలి అని రెండు విధానాల్లో విధులుండేవి.

దండనలు తీవ్రంగా వుండేవి. దేశద్రోహానికి మరణ దండన. కొన్ని నేరాలకు చెయ్యిగాని, కాలుగాని తొలగించటం లాంటి శిక్షలున్నాయని ముస్లిమ్ రచయితల గ్రంధాల్లో వ్రాయబడి వుంది.

రెడ్డి రాజుల కాలం ముగిసిన అనంతరం ఒంఢ్రు గజపతుల పాలనలో (వీరు తెలుగు వారు కారని ఒక అభిప్రాయం) పెదకోమటి వేమారెడ్డి ఆస్థానకవి శ్రీనాథుడు నిలువనాశ్రయము లేక క్రిష్ణానదీ తీరంలోని బొడ్డుపల్లెలో "యెడ్డెదొరల" వద్ద (వడ్డెరాజులని ఒక అభిప్రాయం) కొంత భూమిని గుత్తకు (కవులుకు) తీసుకొని దురదృష్టవశాత్తు సేద్యము అందిరాక పంటలు పండక పన్నును కౌలును చెల్లించలేనందున యెడ్డెదొరలు శిక్ష విధించారు. ఆయన అనుభవించిన శిక్షలు శ్రీనాథుని చాటు పద్యములలో ఒకటి ఇలా చెబుతున్నది.

సీ॥ కవిరాజు కంఠంబు కౌగలించెను గదా
పురమేగ నెదురెండ బొగడదండ
సార్వభౌముని భుజాస్తంభమెక్కెను గదా
నగరి వాకిటనుండు నల్లగుండు
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబున
దగిలియుండెను గదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్యమందెను గదా వెదురు గొడియ

గీ॥ కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు తినిపోయె దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి
నెట్లు చెల్లింతు దంకంబు లేదు నూర్లు"

"దివజ కవివరు గుండియల్ దిగ్గురనగ
నరుగుచున్నాడు శ్రీనాథు డమరపురికి"

ఈ పద్యములను చదివి "కంటఁదడివెట్టని కవితాభిమానులుండజాలరు" అని శ్రీనాథ కవిని గూర్చి బండారు తమ్మయ్య తన వ్యాసంలో తెలిపారు.

శ్రీనాథునకే అంత కష్టమైన శిక్షలు విధింపబడినవి. ఈ శిక్షలు రెడ్డిరాజుల పరిపాలన ముగిసిన వెంటనే విధించబడ్డవి. కాని శ్రీనాథునికి శిక్ష వేసిన రాజులు రెడ్డిరాజుల లేదా ముందటి కాకతీయుల పరిపాలనా విధానం తెలిసినవారు లేదా అవలంభించిన వారు కాదని భావించవచ్చు. పన్ను చెల్లించలేని అశక్త నేరానికి అంతటి శిక్షలు ప్రజలకుగాని, బ్రాహ్మణులకు గాని, కవిపండితులకుగాని రెడ్డిపాలన తెలిసిన చోట ఉండదు.

అయితే బ్రాహ్మణులకు తగ్గింపు శిక్షలు లేదా తప్పింపు శిక్షలు వుండేవి. బ్రాహ్మణుడు ఉరిశిక్ష విధించవలసిన నేరం చేస్తే వాని ముఖంపై కుక్కపాదం అచ్చోత్తి గాడిదమీద ఊరేగించి గ్రామం నుంచి బహిష్కరించేవారు. అది ద్విజులపై రెడ్డిజాతికి గల భక్తి, విశ్వాసం.

## కులవ్యవస్థ

సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థ ఉండినది. పంచములు = చండాలురు వున్నారు. ఈ వర్ణాలు పలు వృత్తులతో, కుటుంబాలతో చీలి కులాలేర్పడ్డాయి. ఇది పూర్వపు చరిత్రే. ఆటవిక జాతులుండేవి. బోయలు, ఎరుకలు ముఖ్యులు. బోయలు ప్రభుత్వాలు కూడ నెలకొల్పారు. వర్ణాలు, కులాలు, జాతులలో బ్రాహ్మణులు శిఖరాగ్రాన, చండాలురు అట్టడుగున వుండేవారు.

## బ్రాహ్మణులు

సమాజంలో బ్రాహ్మణులు అగ్రజాతి విద్యాధికులు. రాజులు గొప్పగౌరవం ఇచ్చి పూజించారు. ఇంక ప్రజల సంగతి చెప్పబని లేదు. తెలుగు వాఙ్మయంలో బ్రాహ్మణాధిక్యత ఉన్నది. రెడ్డిరాజుల కాలంలో వెలువడిన భోజరాజీయంలో బ్రాహ్మణ ప్రభావ కథలే ఎక్కువ. బ్రాహ్మణులందు వేదశాస్త్ర విద్యలు కేంద్రీకృతమైయున్నవి. షోడశ కర్మలకు, శుభాశుభములకు బ్రాహ్మణుడే అవసరం. శ్రుతి, స్మృతి, పురాణ శాస్త్రజ్ఞానం బ్రాహ్మణుల సొత్తు. పురాణ శ్రవణం చేయువారు బ్రాహ్మణులే. భారత రామాయణాలు ప్రవచించువారు బ్రాహ్మణులే. వినటానికి జనులు తండోప తండాలుగా వచ్చేవారు.

ఇట్టి విశిష్టతలచే బ్రాహ్మణులు రాజులకు మంత్రులై, సేనానులై, విద్యాధికారులై, దీక్షాగురువులై, బోధకులై, పురోహితులైనారు. "రెడ్ల చరిత్రలో బ్రాహ్మణ భక్తి ఒక అపూర్వ ఘట్టమని" "రెడ్డిరాజులకుండిన బ్రాహ్మణభక్తి భారతదేశ చరిత్రలో వేరుచోట కానవచ్చునో లేదో అత్యంత సంశయమే" నన్నారు సురవరం ప్రతాపరెడ్డి తన ఆంధ్రుల సాంఘిక చరిత్ర గ్రంథంలో.

బ్రాహ్మణులలో శైవులు, వైష్ణవులు, మాధ్వులు, స్మార్తులు, అని వుండేవారు. వైదికులు, నియోగులు మరొక విభాగం. వైదికులు వైదిక కర్మ పరాయణులుగాను, నియోగులు రాచకార్య ప్రవృత్తులలోనూ వున్నారు. ప్రోలయ వేమారెడ్డి యిచ్చిన 44 అగ్రహారములలో వేగినాటి వారికి, వెలనాటి వారికి, ద్రావిడ బ్రాహ్మణులకు యిచ్చినట్లు గ్రంథాలలో వ్రాయబడివుంది. కృష్ణ యజుర్వేద శాఖను అనుసరించే యజుశ్శాఖీయులు బ్రాహ్మణుల్లో ఎక్కువమంది వున్నారని రెడ్డిరాజుల శాసనాలను బట్టి తెలుస్తుందని చరిత్రకారులు వివరించారు. ఆత్రేయ, భారద్వాజ, శ్రీవత్స, పరాశర, శాండిన్య వగైరా పేర్లతో దాదాపు 30 గోత్రాల బ్రాహ్మణులున్నట్లు రెడ్డిరాజుల దానపత్రాల్లో దాన గ్రహీతల పేర్లున్నాయని, బ్రాహ్మణుల ఇళ్ళ పేర్లు ఊళ్ళ పేర్లని బట్టి వచ్చివుంటాయని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు పరిశోధనలో భావించారు. రెడ్డిరాజుల కాలంనాటి బ్రాహ్మణులు సాధారణంగా వేదశాస్త్ర ప్రవీణులే. పురాణాలు, ఇతిహాసాలు అధ్యయనం చేసిన వారే. తర్క, శబ్దశాస్త్ర, వ్యాకరణ, షోడ్దర్శన, జ్యోతిష, గణిత, ఆగమ

శాస్త్రాల్లో నిపుణులు. అగ్రహారం వేదవిద్వాంసుల నిలయం. విద్వాంసుల వద్దకు అన్ని దిశల నుండి విద్యార్థులు వచ్చి వారికిష్టమైన విద్యను ఆ గురువుల ఇండ్లలోనే ఏండ్ల తరబడి వుండి నేర్చుకునేవారు. వారిని ఆదరించటం బ్రాహ్మణులు పవిత్రకార్యంగా భావించేవారు. అగ్రహారాలు విద్యాపీఠాలుగా వుండేవి. శ్రీనాథుడు కూడ అగ్రహారాల వైభవాన్ని కాశీఖండంలో, భీమేశ్వర పురాణంలో వర్ణించాడట. ప్రభుత్వ సేవలో కొందరు బ్రాహ్మణులు, శాస్త్ర విధులలో కొందరు బ్రాహ్మణులు వుండేవారు. బ్రహ్మణులను ధార్మిక అగ్రగాములుగా భావించారు. ప్రెగడ, మంత్రి, రాజు అనే బ్రాహ్మణ పేర్లు రెడ్డిరాజుల కాలంలో వచ్చాయట. వారికి ప్రజలు కట్నకానుకలు అర్పించేవారు. వారి నుంచి ప్రజలు చదవటం, రాయటం, నాట్యం, సంగీతం లాంటి కళలను నేర్చుకునే వాళ్ళు. బ్రాహ్మణులతో గౌరవార్ధ సంబంధాలుండేవి.

బ్రాహ్మణులు వైభవోపేత జీవితాన్ని అనుభవించినట్లు శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో ఇలా చెప్పాడు.

**సీ॥ ధరియింపనేర్చిరి దర్భపెట్టెడుప్రేళ్ళ**
**లీలమాణిక్యాంగుళీయకములు**
**కల్పింపనేర్చిరి గంగమట్టియ మీద**
**కస్తూరికా పుండ్రకములనొసల**
**సవరింప నేర్చిరి జన్నిదంబుల ప్రోల**
**తారహారములు ముత్యాల సరులు**
**చేర్పంగ నేర్చిరి శిఖల నెన్నడొముల**
**కమ్మని క్రొత్త చెంగల్వ విరులు**

**ధామముల, వెండియును బైడి తడబడంగ**
**బ్రాహ్మణోత్తములగ్రహారముల లోన**
**వేమభూపాలు దనుజన్ము వీరభద్రు**
**ధాత్రి యేలింప గౌతమీ తటమునందు**

వ్రేళ్ళకు రత్నపుటుంగరాలు ధరిస్తారని, జందెంతో పాటు మెడలో ముత్యాల హారాలు వేసుకుంటారని, సిగలో పద్మాలు పెట్టుకుంటారని, పునుగు జవ్వాదులు పూసుకుంటారని, వారి ఇళ్ళలో వెండి బంగారాలు అమితంగా ఉంటాయని వ్రాశారు. (పల్నాడులో మాత్రం అలాకాదు).

రెడ్డిరాజులు బ్రాహ్మణులకు 49 గ్రామములను అగ్రహారములుగా యిచ్చినారని కొన్ని శాసనములలోను, సాహిత్యము వలన తెలియుచున్నది.

## వైశ్యులు

వైశ్యులు వ్యాపారము, సేద్యము, పశుపోషణ చేసేవారు. వైశ్యునికి శూద్ర జాతీయునికి పుట్టినవారు వైజాతీయులు. వైశ్యులకు యజన దానాధికారాలు కలవు. వైజాతీయులలో వణిజ, కోమటి, వాణి, వ్యాపారి, వాణిజ వైశ్యులు కలరు. ఉత్తరాది వైశ్యులు చేరారు. వైశ్యులకు అన్ని వ్యాపారాలున్నవి. కోమట్లకు వడ్ల వ్యాపారమే కలదు. మల్లీనాథసూరి అనునాయన ఈ విభేదాలకు స్వస్తి చెప్పవలసిందేనన్నాడు. ఆయన సంఘ సంస్కర్త అయివుండవచ్చు.

వైశ్యులు వ్యాపారంలో ఉన్నారు. వారిలో అవచి దేవయ, ఆయన కుమారుడు తిప్పయ పేరొందిన వైశ్య వ్యాపారులు. వారిలో సహస్ర గోత్రీకులున్నారట. వారిని శ్రేష్టి, శెట్టి, కోమటి అనేవారట. అవచి తిప్పయశెట్టికి శ్రీనాథుడు "హరవిలాసం" వ్రాసి అంకితమిచ్చాడు. ఆకాలంలో "వాసవ కన్యకా పురాణం", "వైశ్యవంశసుధాకరం" అనే గ్రంధాలు కూడ వెలువడ్డాయి. వీరు తొలుత భౌద్ధులని, తదుపరి జైనులని, తదుపరి హిందూమతం వైపుకు మొగ్గారని డా॥ బి.ఎస్.ఎల్. హనుమంతరావు తన పరిశోధనలో తేల్చారు.

వైశ్యులు శ్రేణులుగా ఏర్పడి దేశవిదేశాలతో వ్యాపార లావాదేవీలు సాగించి ధనవంతులై నలుదిశలా వ్యాపించి ప్రాపకం సంపాదించారు. రాజకుటుంబాలకు కూడ సన్నిహితులైనారు. పరిపాలకులకు ఆర్థిక మద్దతునిచ్చారు. పలు రాచమర్యాదల ననుభవించారు. వీరి వ్యాపారాలకు సొంత ఓడలు, నావలు, సైన్యం ఏర్పాటు చేసుకున్నారు. కొంత కాలానికి వారిలో సజాతి, విజాతి వైషమ్యాలు రాగా ఇది న్యాయసమ్మతం కాదని న్యాయమూర్తులు తీర్మానించారు.

వైశ్యులు నగరేశ్వరస్వామి భక్తులు. నగరాలలో నగరేశ్వరస్వామి దేవాలయాలు ఉండేవి. కాని వీరి కులదేవత వాసవీ కన్యకాపరమేశ్వరియేనట. "కన్యకా పురాణం" అని చారిత్రక పురాణంలో రాజమహేంద్రవర చాళుక్యరాజు విష్ణువర్ధనుడు పెనుగొండ మీద దాడి చేసినపుడు (బహుశా 7వ శతాబ్దంలో) వాసవీ కన్యకను మోహించి బలాత్కారం చేయబోగా ఆమే ప్రత్యేకంగా నిర్మించిన అగ్నిగుండంలో దూకి ఆత్మహత్య చేసుకున్నదని తెలుపబడివున్నది. అపుడు ఆమె జైనమత ఆచారం అనుసరించి ఆత్మహత్య చేసుకున్నదని, ఆమె జీవితానంతరం మరియు జైనమత పతనానంతరం కన్యక కథకు బ్రాహ్మణత్వ ఛాయ వచ్చిందని చారిత్రకులు భావించారు.

వైశ్యులకు విశాఖపట్నం, ఆచంట, చందవోలు, ఘంటసాల, పీఠికాపురం (పిఠాపురం), పెనుగొండ మొదలైన నగరాలలో వర్తక సంఘాలుండేవి. అన్నింటికి కలిపి కార్యనిర్వహక సంఘాలుండేవి. వాటిలో సమస్యలు చర్చించబడేవి.

వారి వ్యాపార రహస్యాలు ఇతరులకు తెలియకుండా కోడ్ భాష ఉండేదని గౌరన వ్రాసిన "నరనాథ చరిత్ర" అనే గ్రంథంలో వ్రాయబడిందట.

ఆ కాలంలో వ్యాపారం వైశ్యుల ద్వారా జరిగేది. మోటుపల్లి రేవు ద్వారా అధికంగా జరిగేది. అనపోతారెడ్డి విదేశీ వ్యాపారానికి అవసరమయే సహకారం అందించాడు. అవచి దేవయసెట్టి, ప్రోలయ వేమారెడ్డికి కుడిచేయిగా నుండగలిగిన సచివోత్తముడు. ఆయన కుమారుడు అవచి తిప్పయసెట్టి కుమారగిరిరెడ్డికి కూర్చుమిత్రుడు. అతని తమ్ముడు తిరుమలసెట్టి. అప్పటి వర్తకులు సకలవిధ వ్యాపారములు గావించి విరివిగా ధనమార్జించి ప్రభువులతో వలయు పలుకుబడి గలిగి శిల్ప, కవిత్వాది లలిత కళలకు తోడ్పడి ప్రఖ్యాతి గాంచారు.

హిందూ సామాజిక వ్యవస్థలో వైశ్యులు తృతీయ కులం. వ్యాపారం వారి ఏకైక వృత్తి. ధనికులు, కుబేర సంతతివారని చెప్పుకుంటారు. అవచి తిప్పయసెట్టిని "మంకన రుషి వంశాభరణం" అని శ్రీనాథుడు పేర్కొన్నాడు. వైశ్యులు పెనుగొండ (పశ్చిమగోదావరి జిల్లా)

అయోధ్యాపుర, అహిచ్ఛాత్రల ప్రభువులమని చెప్పుకుంటారు. “వైశ్యవంశ సుధాకరం” అన్న సంస్కృత గ్రంధం ప్రౌఢదేవరాయల కాలంలో వచ్చింది.

102 వైశ్యకుల గోత్రీకులున్నారు. వీరందరికీ భిన్నంగా అవచి కుటుంబం వారిది కౌండిన్య గోత్రం.

ఇలా వైశ్యులు ప్రజలతో సంబంధాలు కలిగి వున్నారు.

## క్షత్రియులు

సాధారణంగా క్షత్రియులను రాజులుగా చరిత్ర చెబుతుంది. అయినా కాకతీయుల నాటికే క్షత్రియుల సంఖ్య బాగా తగ్గిపోయింది. రెడ్డిరాజులు చతుర్ధవర్ణంలో వారైనా గాని క్షత్రియులతో వైవాహిక సంబంధాలున్నాయి. చంద్రవంశ క్షత్రియుడైన రెండవ హరిహరుడు తన కుమార్తెను కాటయ వేమారెడ్డి కుమారుడు కాటయకిచ్చి వివాహం చేశాడు. సూర్యవంశ క్షత్రియుడైన చోడభక్తిరాజు తన కుమారుడు భీమలింగ చోడునికి అనవేమారెడ్డి కుమార్తెను చేసుకున్నాడు. కాని ఈ కాలం నాటికి క్షత్రియులు రాజ్యాలు ఏలుతున్నట్లు లేదట.

వీరుకాక శూద్రులు, విశ్వకర్మలు, కుమ్మర్లు, గొల్లలు, కాపులు, ఈడిగలు, కురుమలు, పద్మసాలీలు, మేదర్లు, ఉప్పర్లు, బెస్తలు, బుక్కలు, రజకులు, వేశ్యలు, బలిజలు, పంచములు ఇతర కులాలవారు కలరు.

## విద్య - సారస్వతం

“కాకతీయానంతర కాలం తెలుగు సాహిత్యానికి, సంస్కృత సాహిత్యానికి వసంత రుతువు లాంటిదని చెప్పవచ్చు” అన్నారు మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు. ముస్లిములు ధ్వంసం చేసిన దాన్ని సవరించటానికి రెడ్డిరాజులు ప్రయత్నించారు. వైదిక విజ్ఞాన పరిరక్షకులైన బ్రాహ్మణులను గౌరవించి, అగ్రహారాలిచ్చి విద్య–సారస్వత పోషణకు వినియోగించుకున్నారు. అప్పటికి అన్నీ తాళపత్ర లిఖితాలే. అయితే శ్రీనాథుని చాటువుల్లో బ్రాహ్మణులు, వ్యాపారులు, కాగితం, కలం, సిరా వాడేవారని వున్నదట. కాగితం కూడ చేత్తో తయారు చేసిందే. ఎక్కువగా

ప్రజలు తాళపత్రాలను (చవక గనుక), ప్రభుత్వం కాగితానిని (ప్రియం గనుక) వాడేవారు. రాజులు బంగారు ఘంటం వాడేవారు.

విద్య మతప్రధానంగా వుండేది. రాజాదరణ, సంపన్నుల ఔదార్యం వలన విద్యావ్యాప్తి జరిగేది. వీధి బడులూ వుండేవి. వ్యక్తుల సహకారంతో బడులు నడిచేవి. అన్ని వర్ణాల వారు చదువుకు వచ్చేవారు. రోజువారీ పద్దులకు, విజ్ఞానానికి చదువుకునే వారు.

యువరాజులకు ప్రత్యేకంగా వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, ధర్మశాస్త్రాలు, ఆయుర్వేదం, భరతశాస్త్రం, రాజనీతి గ్రంధాలు, కావ్యాలు, నాటకాలు చెప్పేవారు. సంస్కృత గ్రంథాలు తెలుగులోకి అనువాదం అయేవి. మడికి సింగన వ్రాసిన "సకల నీతి సమ్మతం" రాచకుటుంబీకులకు అందుబాటులోకి తెచ్చారు. మల్లన వ్రాసిన రుక్మాంగద చరిత్రలో గజస్వారీ, అశ్వస్వారీ, ఆయుధాల సాములు చెప్పబడ్డాయి.

రెడ్డి రాజులు వేదాంగాలు, పురాణేతి హాసాలు, కావ్య నాటకాలంకార శాస్త్రాలు, రాజనీతి ధర్మశాస్త్రాలు, అశ్వశాస్త్రం, సామజశిక్ష, శస్త్రధారణాది విద్యలు, భరత సంగీత కామ శాస్త్రాలు అభ్యసించారు. లలిత కళలు, సంగీత నాట్యశాస్త్రాలలో పలు గ్రంథాలు వెలువడ్డాయి. భరతశాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించి లకుమాదేవి కుమారగిరి రెడ్డి మన్ననకు పాత్రురాలైంది. నాటకాలకు ప్రత్యేక శాలలుండేవి. సంస్కృత కవులు ఆస్థాన కవులుగా, విద్యాధికారి పదవుల్లో వున్నారు. ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో మహాదేవుడనే సంస్కృత విద్యాంసుడున్నాడు. ఆయన వేయించిన శాసనాలు సంస్కృతంలో ఉన్నవి. అనపోత, అనవేమారెడ్డి కాలంలో బాలసరస్వతి, త్రిలోచనాచార్యులనే పండితులున్నారు. అనపోతారెడ్డి గొప్పకవి, పండితుడు. అనేక వేల బంగారు నాణేలను కవిపండితులకు దానం చేసేవాడు. సంస్కృత భాషను ప్రోత్సహించాడు. అందుకని ఆయనకు "బహుసహస్ర సువర్ణదాన సంతోష మహాకవీశ్వర" అని బిరుదుండేది. బాలసరస్వతి అనపోతారెడ్డి ఆస్థానకవి. త్రిలోచనాచార్యుడు అనవేమారెడ్డి ఆస్థానకవి. అనవేమారెడ్డి కూడ శాసనాలను సంస్కృతంలో వేయించాడు. పెదకోమటి వేముని ఆస్థానకవి వామనభట్ట బాణుడు. ఈయన బహుగ్రంధకర్త. శబ్దరత్నాకరం, శబ్దచంద్రిక అనే నిఘంటువులను రచించాండు. ఈయనకు "సాహిత్య చూడామణి", "సాహిత్య

సామ్రాజ్య దురంధర", "కవిసార్వభౌమ" బిరుదులున్నవి. పెదకోమటి వేమారెడ్డి మంత్రి మామిడి సింగన. ఈయన జ్యోతిశ్శాస్త్రవేత. ఈయన సోమసిద్ధాంతానికి "గూడార్థ దీపిక" అనే వ్యాఖ్య రాశాడు. సింగభూపాలుడు, విశ్వేశ్వరుడు, అప్పయాచార్యుడు ఇంకా లెక్కకు మించిన కవులు పండితులెందరో గలరు. హిందూమత వైశిష్ట్యాన్ని బోధించటానికి పలువురు పలు గ్రంథాలు వెలువరించారు. ఈయుగంలోనే రంగనాథ రామాయణం, ద్విపద కావ్యం వచ్చింది. గోన బుద్దరాజు రచించాడని అందుకు రంగనాథుడు సహాయపడ్డాడని కొందరి పరిశోధన.

రాజకవులలో చెప్పుకోవలసింది కుమారగిరి రెడ్డి గురించి. ఈయన సంస్కృత విద్వాంసుడు. సంగీత, నృత్యాల్లో నిష్ణాతుడు. ఈయనను వసంతరాజు అనే వారట. ఆయన తన పేరు మీదనే "వసంతరాజీయం" అన్న నాట్యశాస్త్ర గ్రంథం రాశాడు. ఆయన బావమరిది కాటయ వేముడు కాళిదాసు నాటకాలైన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వ శీయంలకు వ్యాఖ్యానాలు వ్రాసి "కుమారగిరి రాజీయం" అని పేరు పెట్టారు.

పెదకోమటి వేమారెడ్డి మహాకవి. శ్రీనాథుడు ఆయన ఆస్థానకవి మరియు విద్యాధికారి. శ్రీనాథుడు వేమారెడ్డిని "సర్వజ్ఞ చక్రవర్తి" అన్నాడు. తెలుగు భాషా చరిత్రలో శ్రీనాథునిది ప్రత్యేక అధ్యాయం. వేమారెడ్డి సంస్కృతంలో "సాహిత్య చింతామణి'' అనే అలంకార శాస్త్ర గ్రంథం వ్రాశాడు. "సంగీత చింతామణి" కూడ రాశాడు. ఈ గ్రంథం తిరువనంతపురంలో ఉన్నదట. అంతేగాక "శృంగార దీపిక", "సప్తశతీసారటీక" వ్యాఖ్యానాలు రాశాడు. సాహిత్య పోషకులలో గణుతికెక్కిన రాజన్యులలో పెదకోమటి వేమారెడ్డి "సర్వజ్ఞక" అను బిరుదు పొందాడు. సంస్కృతాంధ్ర భాషలతోపాటే ఇతర భాషలను ఆదరించాడు. పెదకోమటి ఆస్థానమణులు ఇద్దరు. ఒకరు శ్రీనాథుడైతే, రెండవవారు వామనభట్ట బాణుడు.

మల్లంపల్లి వారు తమ రెడ్డి రాజ్యాల చరిత్ర పరిశోధనా గ్రంధంలో శ్రీనాథుడు మహా వేదవేత్త, అపర బృహస్పతి అన్నారు. ఆయన కృష్ణయజుస్, న్యాయ, వైశేషిక, దర్శన, సంఖ్యా సిద్ధాంత, యోగ, శైవాగమ, స్మృతి పురాణాలను ఔపాసన పట్టినవాడైతే, వామనభట్టు "కనకలేఖా

కల్యాణం", "ఉషాపరిణయం", "పార్వతీ పరిణయం" అనే నాటకాలు వ్రాసిన దిట్ట అని పేర్కొనారు. ఈయన నలాభ్యుదయం, రఘునాథాభ్యుదయం పద్యకావ్యాలు వ్రాశాడు. ఇతరంగా బహు గ్రంథాలను వ్రాసి "పద్య గద్య కవిసార్వభౌమ" అన్న బిరుదుకూడ పొందాడు.

ఆనాడు కోస్తాంధ్రలో వ్యాకరణ జ్యోతిష, గణిత, ఖగోళ శాస్త్రాల అధ్యయనం ఎక్కువగా వుండేదని అర్థమౌతుంది. పెదకోమటి వేమారెడ్డి ఆయుర్వేదాన్ని ప్రోత్సహించాడు.

శ్రీనాథుడు మొదట పెదకోమటి వేముని దగ్గర విద్యాధికారి అయినందున సంస్కృతం మీద తెలుగుభాష పైచెయ్యి సాధించినట్లైంది. తెలుగు సంస్కృత భాషలలో శ్రీనాథుడే సాటిలేని మహాకవి. శ్రీనాథుడు గౌడడిండిమభట్టును ఓడించి కనకాభిషేకం పొందారు. "కవిసార్వభౌముడై" నాడు. తెలుగుకు వైభవకీర్తి కలిగింది. తెలుగు కవిత్వభాషగా రూపొందింది. "హరవిలాసం" వ్రాసి అవచి తిప్పయసెట్టికి అంకితం చేశాడు. శ్రీనాథుడు మరుతరాట్చరిత్ర, పండితారాధ్య చరిత్ర, శృంగార నైషధం, కాశీఖండం, శివరాత్రి మహాత్యం, భీమేశ్వర పురాణం, పల్నాటి చరిత్ర వగైరా గ్రంథాలను రచించాడు. శాసనాలు కూడ కొన్నింటిని రాశాడు. రెడ్డిరాజుల ఆస్థాన కవిగా 34 సంవత్సరాలున్నాడు. అయితే రెడ్డిరాజ్య పతనానంతరం శ్రీనాథుని జీవితం విషాదంగా ముగిసింది. "దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ" పరమపదించాడు.

ఎర్రాప్రగడ పాకనాడు ప్రాంతీయుడు. ఆయన పూర్వులు నేటి ప్రకాశం జిల్లా గుడ్లూరులో స్థిరపడ్డారు. ప్రోలయ వేమారెడ్డి తమ్ముడు మల్లారెడ్డి అభిమానానికి చేరువై రెడ్డిరాజ్య స్థాపన జరిగాక అద్దంకి రెడ్డిరాజుల ఆస్థానకవి అయినాడు. కొండవీటి రెడ్డిరాజుల ఆస్థానాన్ని అలంకరించినట్లు మల్లంపల్లి వారి పరిశోధనలో చెప్పారు. ప్రోలయ వేముని ఆభ్యర్థన మేరకు ఎర్రాప్రగడ "ఉత్తరహరివంశం" వ్రాసి ప్రోలయ వేమునికి అంకితమిచ్చాడు. ఎర్రాప్రగడ అరణ్యపర్వశేషం, నృసింహపురాణం, రామాయణం, ఉత్తరహరివంశం వ్రాశాడు. ఎవరి ఆదరణలో అరణ్యపర్వశేషాన్ని ఆంధ్రీకరించాడో తెలియుట లేదని పరిశోధకులంటున్నారు. ఎర్రాప్రగడది ఆంధ్రభాషలో సంధియుగం. ఈయనకు "శంభుదాసుడు" "ప్రబంధ పరమేశ్వరుడు" అనే బిరుదులు కలవు.

వీరేకాక రెడ్డిరాజుల కాలంలో పోతన, వారి పాలనలో జక్కన, అన్నయ, త్రిపురాంతకుడు, వల్లభరాయలు, మడికి సింగన, అయ్యలార్య గౌరన, శివలెంక కొమ్మన, శ్రీగిరి, వామన భట్టబాణుడు, బాచమంత్రి, కొమ్మన, వెన్నెలకంటి ఉండేవారు.

శ్రీనాథుడు వ్యంగ్యంగా చాల చమత్కారించాడు. కొండవీడులో ఎక్కడ చూస్తే అక్కడ చిల్లర కవులుండేవారని, గాడిదలు కూడ కొండవీటి వీధుల్లో తిరుగుతుండేవని వాటిని చూచి "గాడిద! నీవునుం గవివి కాదు కదా! యనుమానమయ్యెడిన్" అని చమత్కరించాడు.

## ప్రజా జీవనం

ప్రజలలో గొల్లలు, పింజారులు, బొందిలీలు, భోగమువారు ఉండేవారు. వ్యవసాయము ముఖ్యవృత్తి. వస్త్రధారణకు ధోవతులు, చల్లాడములు, దుప్పట్లు, గుండురుమాలు, లపేటారుమాలు, అంగీలు, జడచుట్టవలె చుట్టు తలపాగ, మెడలో దేవుని(హనుమంతుని) విగ్రహ బిళ్ళలు, "కొల్లా యుంచితి, కోక చుట్టితి, మహా కూర్పాసమున్ దొడిగితిన్" అని శ్రీనాథుడు విజయనగర దర్బారులో అన్నాడు.

పాన గోష్టులుండేవి. ఇప్పసారాయి, ఐక్షవము, కాదంబము, క్షీరము, వార్షము, రతిఫలము, శార్కరము, సూనజము, నారికేళజము, మాద్వీకము, గౌడ, తాళమయము వగైరా పానీయములతో గోష్టులుండేవి. శాకాహారములు, మాంసాహారములుండేవి. రుచిర పదార్థాలిలా వుండేవి.

**"ద్రాక్షాపానక ఖండశర్కరలతో, రంభా ఫలశ్రేణితో**
**గోక్షీరంబులతోడ, మండెగలతో, క్రొన్నేతితో, పప్పుతో**
**నక్షయ్యంబుగ నేరు బ్రాల కలమాహారంబు నిశ్శంకతన్**
**కుక్షుల్ నిండగ నారగించితిమి యక్షుద్రక్షుధాశాంతికిన్"**

– ***శ్రీనాథుడు*** *(కాశీఖండము).*

వసంతోత్సవాలు, నాటకాలు, యక్షగానాలు, వెన్నెల పాటలు, గొండ్లి ఆటలు, చిందు, జక్కిణి, పురాణ శ్రవణం ప్రజల వినోదములలో కొన్ని.

ఇతర వినోదాలు, ఆటలు, పాటలు, గారడి, ఇంద్రజాలాలు, జూదం, లక్కిముష్టి, నక్కముష్టి, చతురంగము, పులిజూదంలో 4 పులులు x 16 మేకలు, 3 పులులు x 15 మేకలు, ఒకపులి x 3 మేకలు, మేకలాట, దాడి, దొంగాటలు, బొగ్గుల నిప్పులపై నడక, శూలాలపై నడక, పాచికలు, అచ్చన గండ్లు, ఓమన గుంటలు + గచ్చకాయలు, కందుక కేళి, భాండిక జనుల పరిహాసములు, బిందుమతీ విద్య, ప్రహేళిక, షర్తులు, ఎదురు షర్తులు, ఇలా పలు వినోదాలతో ఆనందించేవారు.

## బిరుదులు

రెడ్డిరాజులు నిర్వర్తించిన ఘనకార్యాలకు వారికి బిరుదులివ్వటం జరిగింది. ప్రోలయ వేమారెడ్డికి "విశ్వ విశ్వంభరా భరణ దక్షదక్షిణ భుజాదండ" అని బిరుదు యవనులను ఓడించి విజయం సాధించినపుడు ఇవ్వబడింది. ఆయన "ఆనయ మండలీకరగండ" బిరుదు ఆనెగొంది సంస్థానమును స్వాధీనం చేసుకున్నపుడివ్వబడింది. "ఆర్థిక ప్రత్యర్థిక హేమాద్రి దాన నిరత", "ప్రజా పరిపాలనా చతురత", " వీరనారాయణ" "భూదాన పరశురామ", "అనేక నగరోపకంఠ ప్రతిష్టాపిత బహువిధారామ", "జగరక్షపాల", "జగదగోపాల", "గుజ్జరి తట్టోవిభాళ", "రాచూరి దుగ్గన్‌విభాళ", శ్రీపవ్వన్ తాహోబిల నిర్మిత సోఫాన", "కుండీనదీ సహ్యాజా గౌతమీ జలక్రీడావినోదా" "బనువసంకర", "క(లి)కాలభంజిత థమ్మన్ వృషభా వికల సంచార కరుణ", "పాండ్యరాయ గజసింహ", "బ్రహ్మకుండీ, కృష్ణవేంణా గౌతమీ తీర దత్తావేగ్రహార", "అళియవరదశిరఃఖండన", "సంతత నిర్వన్‌చిత సవ్వన్ సంతాన" అను బిరుదులు కలవు.

అనవేమారెడ్డికి "పంచారామ ప్రతిష్ఠత గజఘంటా నినాద వధిన్‌త కీతిన్ ఘంటానాద", "కరవాళ వైనతేయ ఖండిత విమతవ్యాళ", "దివిజల దుగ్గన్ విభాళ", "విక్రమ పంజర నిగృహీత రిపురాజసింహ", "ప్రజాపరిచిత చతుర్విధోపాయ" "రాజ్యరమారమణీ స్వయంవర లబ్ధినాయక సౌభాగ్య", "మహానీయాంధ్రదేశ పట్టాభిషిక్త", "సింహచలాది వింధ్యపాద ప్రతిష్టాపిత కీతిన్‌స్తంభ", "విజయ రమాప(రి)రంభ", "సంగర గౌతమీ సవిల (సంగమ) సకల జలిదుగ్గన్

సాధన రఘురామ", "రాజమహేంద్ర నిరవధ్య నగరాది బహువిధ స్థల దుర్గన్ వర్గన్ విదళన బలరామ", "సంగ్రామ సత్ర సంతృప్తి భూత తాళ", ఉత్తుంగ చతుర గచ(రిపు) బలవైరి సేవాసాధక", "వేమభూపాల వంశాంబుధి సంపూర్నన్ చంద్ర" అనే బిరుదు లున్నవి. ఇవన్నీ వారు యుద్ధాలలో విజయం సాధించినపుడు, దానధర్మాలు చేసినపుడు, కావ్యాలు వ్రాసినపుడు/ వ్రాయించినపుడు ఇచ్చినవే. ఇవి వారి ప్రతాపాలు, దైవచింతన, ప్రజాబాధ్యతలు వగైరా సందర్భాలను సూచిస్తాయి.

హీనుఁడెన్ని విద్య లిలను నేర్చినఁ గాని
ఘనుఁడుగాఁడు హీనజనుఁడె గాని
పరిమళమును మోయ, గార్దభము గజమౌనె
విశ్వదాభిరామ వినురవేమ.

విద్యలేనివాఁడు విద్యాధికుల చెంత
నుండినంత బండితుండు కాడు
కొలని హంసలకడఁ గొక్కెర యున్నట్లు
విశ్వదాభిరామ వినురవేమ.


అల్పజాతి వాని కధికార మిచ్చిన
దొడ్డవారి నెల్ల దోలి తిరుగుఁ
జెప్పు దినెడి కుక్క చెఱకు తీపెఱుగునా
విశ్వదాభిరామ వినురవేమ.

# మోటుపల్లి రేవుపట్టణం

అప్పటి మోటుపల్లి రేవుపట్టణం నేటి ప్రకాశం జిల్లాలో తూర్పు తీరప్రాంతాన వున్నది. ఒంగోలు-చీరాలకు మధ్య తీరప్రాంతాన ఒంగోలుకు 40 కి.మీ. దూరంలో వున్నది. టోలమి, పెరిప్లస్ అను గ్రంథకర్తలు (ఆనాటి) గుంటూరు మండలంలో బాపట్ల సమీపాన గల "మోసలపురము" లేక "ముకుళపురము" అను పేర్లు గల రేవు పట్టణము మోటుపల్లియేయని నిర్ధారించారు. మోటుపల్లిని అనపోతారెడ్డి శాసనంలో "ముకుళపురమని", కాకతి గణపతిదేవుని కాలంలో (క్రీ.శ. 1244-45) దేస్యుయాక్కొండ పట్టణమని, మరొక శాసనంలో "వేలానగరమ"ని వ్యవహరించారు. మార్కోపోలో అను వెన్నిస్ యాత్రికుడు "ముటపిలి" అని అన్నాడు. ఈ రేవు పట్టణం ద్వారా కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర రాజులు వ్యాపారాలు చేశారు. చారిత్రకులు డా॥ వి.వి. సుబ్బారెడ్డి గారి పరిశోధన ప్రకారం మోటుపల్లిలో దొరికిన నొక్కులుతో చెక్కిన కుండ పెంకులను బట్టియు, అక్కడ భూమిలో పూడిపోయివున్న కస్టమ్స్ హౌస్ నేల భాగం లోపలి పొరలను బట్టియు, క్రీ.పూ. 2వ శతాబ్దం నుండి మోటుపల్లి రేవు ద్వారా ఐరోపా, మెడిటరేనియన్ ప్రాంతం, చైనా, ఆగ్నేయాసియా దేశాలతో వ్యాపారం జరిగినట్లు రూఢియగుచున్నది. తదుపరి, ఇతర రాజులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర రాజులు అభివృద్ధి చేసి వ్యాపారం మోటుపల్లి ద్వారా చేశారు. త్రవ్వకాలాలలో దొరికిన నాణేలు కూడ అదే రుజువు చేస్తున్నది. అయితే కొన్ని నాణాలు, మృణ్మయ పాత్రలు, గోడలు, ఇటుకలు, పునాదులను బట్టి, ఇతర అచట దొరికిన వాటిని బట్టి క్రీ.శ. 11, 12 శతాబ్దాలలో చోళరాజులు మోటుపల్లి నుపయోగించినట్లు రుజువుతున్నది.

కాకతీయుల కాలంలో మోటుపల్లి యావద్భారతదేశంలో ప్రఖ్యాత రేవు పట్టణం. క్రీ.శ. 1323లో ముస్లీమ్ దండయాత్రలలో వరంగల్ పతనమైంది. నౌకా వాణిజ్యానికి ఇబ్బందులేర్పడి వ్యాపారం మందగించింది. ప్రోలయ వేమారెడ్డి మల్లారెడ్డి తిరిగి మోటుపల్లిని స్వాధీనం

చేసుకున్నారు. ఆ తరువాత అనపోతారెడ్డి మోటుపల్లి రేవుకు పూర్వవైభవం తెచ్చాడు. ద్వీపాంతర వర్తకులకీ వ్యాపార సౌకర్యాలు కల్పించాడు. ఎగుమతి, దిగుమతి సుంకాలు నిర్దేశించి క్రీ.శ. 1358లో ఒక నిర్దేశన పత్రాన్ని (శాసనాన్ని) వేశాడు. వ్యాపారులు ఇతర దేశాలనుండి తెచ్చిన సరుకును వారిష్టానుసారంగా అమ్ముకొను వీలు కల్పించాడు. విదేశీ వర్తకుల వ్యాపారంపై పన్నులు రద్దుచేశాడు. బంగారం, వెండిపై సుంకం పూర్తిగా రద్దుచేశాడు. చందనంపై మూడోవంతు పన్ను తగ్గించాడు. మిగతా వాటిపై పన్ను యధావిధిగా వుండేది. తమిళుల వ్యాపారం ఎక్కువగా వుండేది. వ్యాపారస్తుల సరుకులకు గిడ్డంగులు కట్టించాడు అనపోతారెడ్డి. వర్తకులకు నష్టపరిహారం చెల్లించు విధానం వుండేది. వ్యాపారులు సుంకాలు చెల్లించి నిర్భయంగా వ్యాపారాలు చేసేకునేవారు. మోటుపల్లికి వచ్చు స్వదేశీ, విదేశీ వ్యాపారులకు వసతి సౌకర్యాలు కల్పించబడ్డాయి. తగువిధంగా పరిపాలన సాగుటకు ప్రభుత్వ అధికారులుండే వారు. క్రీ.శ. 14వ శతాబ్దిలోని కస్టమ్స్ హౌస్ అవశేషాలను మోటుపల్లిలో ఇప్పటికీ చూడవచ్చు. (అయితే ఇసుకదిబ్బను తొలగించుకొని చూడాలి). దీనిని మల్లంపల్లి వారు ఆయన వ్రాసిన రెడ్డిరాజ్యాల చరిత్రలో ఫోటోతో సహా వేశారు.



మోటుపల్లి ఓడరేవు వద్ద బయల్పడిన
రెడ్డి రాజుల కాలపు కస్టమ్స్ హౌస్ (క్రీ.శ. 14వ శతాబ్ది)

పెద్ద, చిన్న ఓడలపై, వానిలోని నావల ద్వారా వ్యాపారం జరిగేది. ఓడ మీద నాలుగు అంతస్తుల కట్టుబడి వుండేది. వాటిలో గదులు, మరుగుదొడ్లు, అరలు, వసారాలు వుండి ప్రయాణ వ్యాపారులు, వారి కుటుంబాలు, ఉంపుడుకత్తెలు ప్రయాణించేవారు. కళాసీలకు, వారి భార్యాపిల్లలకు ఓడలలో వసతి సౌకర్యాలుండేవి. గదులకు తాళాలుండేవి. దిక్సూచిలేని రోజులవి. నక్షత్రాలను బట్టి దిశలను పోల్చుకొని ఓడలను నడిపేవారు.

మోటుపల్లి నుండి ఇతర భూతల వ్యాపారకేంద్రాలకు రహదారి మార్గాలుండేవి. మోటుపల్లి నుండి త్రిపురాంతకం, బళ్ళారి మీదుగా ఆంధ్ర కర్నాటకలను కలుపుతూ రహదారి మార్గం వుండేది. అలానే మాచర్ల, వినుకొండ, కొండవీడు, కొండపల్లి, పెదగంజాం, కందుకూరు, నెల్లూరు, దాక్షారామం, పెనుగొండ, రాజమండ్రి వగైరా చోట్లకు రహదారి మార్గాలుండేవి.

అధిక పన్నులు, దొంగల బెడద, వసతులు లేమి కారణాల వలన కాకతీయుల కాలంలో వ్యాపారం కొంత దెబ్బతిన్నది. అది గమనించిన కాకతి గణపతిదేవుడు విదేశీ వర్తకుల వ్యాపారాలకు రక్షణ కల్పిస్తానని అభయహస్తం అందిస్తూ క్రీ.శ. 1245లో ఒక అభయ శాసనాన్ని వేశాడు.

క్రీ.శ. 1323లో కాకతీయ సామ్రాజ్య పతనానంతరం ముస్లిం పాలకుల వలన మళ్ళీ సముద్ర వ్యాపారానికి ప్రమాదం రాగా ప్రోలయ వేమారెడ్డి తమ్ముడు మల్లారెడ్డి ఆ ప్రాంతంలో ముస్లిం ఆధిపత్యాన్ని ఎదుర్కొని ఓడించి మోటుపల్లిని కైవసం చేసుకున్నాడు. తదుపరి వచ్చిన అనపోతారెడ్డి మంత్రి సోమయ మరొక అభయ శాసనాన్ని సంస్కృతం (తెలుగు లిపిలో), తెలుగు, తమిళ భాషల్లో వేశాడు. దానిని మోటుపల్లిలోని వీరభద్రాలయం మండప స్తంభంపై చెక్కించాడు. అది ఈనాడు కూడ మనం చూడొచ్చు. తమిళదేశ వ్యాపారస్తులకు సమాచారం తెలియటానికి తమిళ భాషలోనూ అభయ శాసన పాఠం చెక్కించాడు. ఆ శాసనాంశాలను శ్రీ వి.వి. సుబ్బారెడ్డి తన గ్రంథం "రెడ్డిరాజుల చరిత్ర"లో ఇలా వివరించాడు. **మోటుపల్లికి వచ్చి కాపురముండే అన్యదేశ, ద్వీపాంతర వర్తకులకు భూములిచ్చి వసతులు కల్పించి అన్ని విధాల వారి వ్యాపారాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తాము. వారివారి యిష్టానుసారం వారు మోటుపల్లికి ఎప్పుడైనా వచ్చి ఎంతకాలమైనా ఉండిపోవచ్చు. వారు ఎప్పుడైనా మోటుపల్లిని విడిచిపోవచ్చు. మేము వారిని గౌరవించి పంపిస్తామేకాని అడ్డుపెట్టం. ఏవూరి**

**సరుకులైనా, ఎవరైనా తెచ్చుకొని, ఎప్పుడైనా వారిష్ట ప్రకారం అమ్ముకోవటానికి, ఇతర దేశాలకు రవాణా చేయటానికి అనుమతిస్తామేకాని ఆటంకాలు కలిగించం. మోటుపల్లి వదలిపోయిన వారు తిరిగి వస్తే వారివారి భూముల కాగితాలు వారికిచ్చేస్తాం. గుర్రపు జీనులు ఆభరణాలు, ముత్యాలసరాలు, పగడాలు, ఇతర దేశాల నుండి దిగుమతి సందర్భంగా ఇకముందు అపుత్రిక సుంకం, కడాయం సుంకం వసూలు చేయం. బంగారం మీద సుంకం రద్దు చేస్తున్నాం. చందనం ఎగుమతి సుంకంలో ముడోవంతు రద్దు చేస్తున్నాం. వస్త్రాలను గోదాములలో తొక్కిపెట్టరాదు. స్వదేశీ వస్తువుల మీద సుంకాలను వెనుకటికన్నా ఎక్కువ వసూలు చేయం.** ఇలా అభయశాసనం వేయబడింది.

**అనవోతారెడ్డి మంత్రి సోమయద్వారా వేయించిన అభయశాసనం ఇలావుంది.**

## Face A

1. జయతి నయవి -
2. శాలః ప్రత్యహం దా-
3. నశీలః కృతబుధప-
4. రిపాలః సంగడీర
5. క్షపాలః అహితవ-
6. నక్రుశాను వేమభూ
7. పాలసూనుః ॥ సు[తి]-
8. శతమహీశః సో-
9. [న్న]వోతక్షితీశః । శాకా-
10. బ్దే గగనేభసూయ్యా
11. గణితే తీరే మహాం-
12. భోనిధేః ప్రఖ్యాతే ము-
13. కులాహ్వాఏ పురవరే
14. శ్రీసోమమంత్రీశ్వ-
15. రః । మయ్యాదా మక-
16. రోజ్జగజ్జననుతాం సా-
17. ంయాత్రికాణా మిమా-
18. ం కీర్త్యై వేమయ అన్నవో-
19. తనృపతే రాచంద్ర మా
20. తారకం ॥ అంనవోత-
21. మహీపాలశాసనా త్కీ -
22. త్తి భూషణం । స్తాపి-
23. త[ం]శ్యాసన స్తంభ స్సో-
24. మయామాత్య-
25. ధీమతా
26. అను .... తజయా-
27. న్వి .... అన్నవో
28. తమహీపతే[ః] ॥
29. అకరోదా ....
30. దిత్యా ....
31. ...త... ॥శ్రీ

## Face B

32. స్వస్తి శ్రీశకవర్షంబు
33. లు ౧౨౮౦ అగునేం-
34. టి విళంబి సంవత్సర-
35. శ్రావణశు ౮ వ । స్వస్తి శ్రీ[మ]-
36. తు అనవోతయరెడిం-
37. గ్గారు మొటుపల్లికిం గో-
38. ంపువచ్చు వ్యవహారులకును
39. వ్యవహా[రా]లవచ్చే కరవట్నాల
40. [ద్వీ]పాంతరాల వెవహా[ర్ల]-
41. కును యిచ్చిన . త. మ
42. . [స]నగంభము మోటుపల్లి[కి]
43. నెవ్వరు కోంపువచ్చినాను . .
44. . . దించిపెటికొని ఉండు-
45. వారము వారికిం బూవ్వా.......న-
46. ం[జెల్లె] తోంట ధరణి ఇచ్చువా-
47. రము వారు ఎప్పుడు వ్యవ-
48. హారామునకుం బోయి వున్నా-
49. ను కోంపున వెటక అనిపి వు-
50. చ్చువారము ఎవ్వరి [సరకు]
51. [వచ్చి]నాను తమ[వె]చ్చులకు
52. దీని యీవలశినట్లు స[ర్కు]
53. [గొ]నువారు గాని . . .
54. [కు]వలెనని సరకు అడ్డసె-
55. ట్టము . . . . . వె-
56. ట్టము పరదేసి వ్యవహారు-
57. లకును అపుత్రికమున్ను
58. [క]డ్డాయమున్ను మానితి-
59. మి బంగారు సుంఖము
60. మానితిమి గంధము వళు-
61. బడి సుంఖము పూవ్వ మరి-
62. యాదలోను మూంటను
63. ఒకటి మానితిమి త[క్కి]నసర-
64. కులకును మడిసుంఖ-
65. ములు పూర్వమర్యాదక్రమా-
66. ననె కొనువారము యీ-
67. క్రమాన[ను]సర్వమర్యా-
68. [ద]కును విశ్వశించ్చి వచ్చెడివెఱ-
69. [గు]వారికెల్లాను అభయ-
70. [ప్ర][ద]ముగా నిశ్తిమ[॥]

చూ : - రెడ్డి సంచిక *(పేజీలు 469-470లు)*

చూ : - రెడ్డి రాజ్యసర్వస్వము *(పేజీ 496)*

గణపతిదేవుని మోటుపల్లి శాసనంను బట్టి మోటుపల్లి నుండి ఏనుగులు, గుఱ్ఱాలు, రత్నాలు, పగడాలు, చందనం, జవ్వాది, కర్పూరం, పన్నీరు, దంతాలు, బంగారం, రాగి,

తగరం, సీసం, పాదరసం, పట్టు, సుగంధ ద్రవ్యాలు దిగుమతి అయేవి. పట్టువస్త్రాలు, పట్టు వస్తువులు, కర్పూరం, పన్నీరు వగైరాలు చైనా నుండి దిగుమతి అయేవి. మిరియాలు, యాలకులు, పసుపు, లవంగాలు, జాజికాయ, జాపత్రి కేరళ ప్రాంతం నుండి కూడ వచ్చేవి. అది మలబార్ ప్రాంతం. గణపతిదేవుడు వేసిన అభయశాసనం దరిమిలా అనపోతారెడ్డి వేసిన అభయశాసనం మనకు చాల వివరాలు అందిస్తాయి. తెలుగువారు, తమిళులు, చైనీయులు, ఆరబ్బులు ఈ రేవు పట్టణాన్ని వ్యాపారానికి విరివిగా వాడుకున్నారు.

రెడ్డిరాజుల కాలంలో వ్యాపారం మోటుపల్లి రేవు నుండి విస్తరించింది. కస్టమ్స్ హౌస్, గోదాములు త్రవ్వకాలలో బయటపడ్డవి. మరియు మోటుపల్లిలో కోదండరామాలయం, వీరభద్ర దేవాలయం, ఆంజనేయ దేవాలయం నిర్మించబడ్డాయి. ఇది ప్రజల నమ్మకాలు, మతసామరస్యం, సంప్రదాయాలు, వ్యాపారుల రాకపోకలు, వ్యాపారాభివృద్ధిని తెలుపుతుంది.

మోటుపల్లిని గురించి కొంత విపులంగా తెలుసుకుందాం. తూర్పుతీరంకు అతి దగ్గరలో (పడమరగా) మల్లంపల్లివారు ఫోటోలతో సహా తెలిపిన 14వ శతాబ్దం నాటి కస్టమ్స్ హౌస్ వున్నది. (ప్రస్తుతం రక్షణ లేక ఇసుకమేట వేసివుంది). దాని ప్రాంతంలో చెలియలి కట్టపై 1977 సంవత్సరం క్రితం వరకు ఇండ్ల పైకప్పుల కుపయోగించిన పెంకులు ముక్కలుండేవి. దివి ఉప్పెన సమయపు సముద్రపు కల్లోలానికి చాల చరిత్ర మేటవేసిపోయింది. ఒక మునిగిన ఓడ దాఖలాలు ఐదు కిలోమీటర్లు దూరంలో సముద్రంలో వున్నదని స్థానికుల సమాచారం. వజ్రాలు, మాణిక్యాలు బజార్లలో పోసి అమ్ముకునేవారని పెద్దలు చెబుతున్న వినికిడి వుంది.

ఆ ప్రాంతం నుండి పడమరకు దాదాపు ఒక కిలోమీటరు దూరంలో అప్పటి ఆంజనేయ స్వామి దేవాలయం వున్నది. దాని ముఖద్వారం దక్షిణం వైపుకు వుంది. ఇది ప్రజల నమ్మకాలను, దైవభక్తిని తెలుసుకునే అవకాశం. నేరుగా మరొక అరకిలో మీటరు పడమరన వీరభద్రస్వామి దేవాలయం వుంది. ఇది ఉత్తర ముఖంగా వున్నది. అక్కడినుండి నేరుగా మరొక అరకిలోమీటరు పడమరకు కోదండరామాలయం వున్నది. ఇది దక్షిణముఖంగా వున్నది. ఈ టౌన్ ప్లానింగు చూస్తే అక్కడ తూర్పు పడమరగా ఒక బజారులాగా త్రోవ వున్నట్లు, దానికి ఒకవైపున (ఉత్తరాన–దక్షిణం ముఖంగా) ఆంజనేయస్వామి దేవాలయం, కోదండ రామాలయం, రెండవ

వైపున (దక్షణాన–ఉత్తరముఖంగా) వీరభద్రస్వామి దేవాలయం వున్నది. ప్రజల నివాసాలను గురించి ఆధారాలు ప్రస్తుతం లేవు. కాని దేవాలయాల కట్టుబడి, కస్టమ్స్ హౌస్ కట్టుబడిని బట్టి ఆలోచిస్తే మంచి నిర్మాణ ప్రణాళికతో నివాస గృహాలున్నట్లు భావించవచ్చు.

వీరభద్ర దేవాలయానికి ఎదురుగా (ఉత్తరంగా బజారు కవతల) వున్న ఇసుక దిబ్బలలో ఒక గొప్ప విగ్రహమేదో (ధ్యానముద్రలో వున్న బుద్ధుని విగ్రహంవలె) విరిగిపోయి మూడు నాలుగు ముక్కలైవున్నది. ఆ ముక్కలలో ఒకటి ఒక వ్యక్తి లేదా బుద్ధుడు కూర్చొని ధ్యానం చేస్తున్నట్లుగా వున్న భాగం ముక్క కుడికాలు మడిచి పెట్టుకొని, కుడిచెయ్యి ధ్యాన ముద్రలో వున్నట్లు వున్నది. ఆ తొడ భాగంపై ముడుతలు పడ్డట్లు వస్త్రం చెక్కుడు ఉన్నది. ఎడమచేయి కూడ అక్కడకు చేర్చిన ధ్యానముద్రలో వున్నది. ఆ చేతుల ధ్యానముద్ర కలయికలోని అరచేతిలో ధర్మచక్రం చెక్కి వున్నది. ఇది అమరావతి పురావస్తుశాలలోని బౌద్ధ ధర్మచక్రం పోలికలతో వున్నది. రెండవరాతి ముక్క ఎడమచేతి భుజం భాగంగా వున్నది. మూడవ ముక్క ఆనవాలు ఏమిటో సాధారణ వ్యక్తికి తెలియదు. వీటిని డా. ఈమని శివనాగిరెడ్డి గారు 17–07–2016 తేదీన ఇసుకను త్రవ్వించి బైలు చేయించి చూశాదని నమోదు చేసుకున్నాడని తెలిసింది. అక్కడ విజిటర్స్ బుక్‌లో డా॥ శివనాగిరెడ్డి గారు వచ్చినట్లు, చూసినట్లు వ్రాసి వున్నది.

వీరభద్రస్వామి ఆలయంలో, వీరభద్రస్వామి, అమ్మవారు, శివలింగం, సుబ్రహ్మణ్యస్వామి, వినాయకుడు, నంది విగ్రహాలున్నవి. అయితే గుప్తనిధులకోసం దొంగలు వీరభద్రస్వామి విగ్రహం క్రింద త్రవ్వి ఏదో పెట్టెలాంటిది (అరాబును బట్టి) తీసుకొని పోయినారని స్థానికుల సమాచారం. ఆ వీరభద్రస్వామి విగ్రహం విరిగిపోగా పురావస్తుశాఖవారు దానిని విజయవాడ లోని వారి భవనానికి తరలించి జాగ్రత్త చేశారు. అది ప్రస్తుతం పురావస్తుశాఖవారి అధీనంలో వున్నది. దాని శిల్పలావణ్యం గొప్పగా వుంది. ఈ దేవాలయానికభిముఖంగా (ఆశీనమైయున్న) నంది విగ్రహ మండపం వున్నది. ఆ దేవాలయంలో అతిముఖ్యమైన ఆధారాలు రెండు రాతిస్తంభాల పైని అభయశాసనాలు. ఒక స్తంభానికి నాలుగువైపుల మరియొక స్తంభానికి (ఇది దేవాలయం గోడకు ఆనుకొని వున్నది) మూడువైపుల అభయ శాసనాలున్నవి. ఇవి ఒక స్తంభంపై నాలుగువైపుల కాకతీయులు, ఒక స్తంభంపై మూడువైపుల రెడ్డిరాజులు ఆ శాసనాలు చెక్కించారని చరిత్రకారులు నిర్ణయించారు. రెడ్డిరాజులు వేసిన అభయ శాసనం, తెలుగు,

సంస్కృతం, తమిళ భాషలలో వున్నవి. ఆ శాసనాల పటములను, పూర్తి పాఠములను తరువాతి పేజీలలో ఇవ్వబడినవి.

వీరభద్రాలయం ముందు నందీశ్వరుని మండపం ఉన్నది. ఆ మండపంలో నంది విగ్రహం వున్నది. ఒక దశాబ్దం క్రితం నంది విగ్రహం క్రింద గుప్తధనం వున్నదని దొంగలు త్రవ్వకాలు జరిపారు. కానీ ఏమీ దొరకనందున విడిచివెళ్ళారు. దానిని మరల ప్రభుత్వం వారు ఆ నంది విగ్రహాన్ని అక్కడే వుంచి మరమ్మత్తులు చేశారు. కాని 12-12-2016 అర్ధరాత్రి రాతివిగ్రహాల దొంగలు ఆ నంది విగ్రహానిని దొంగిలించారు. కేసు ప్రస్తుతం పోలీసు వారి విచారణలో వున్నది. విగ్రహం కూడ దొరికింది. చీరాల కోర్టు వారి అధీనంలో వున్నది (Ref. Cr. No. 100/2016 of China Ganjam Police Station). విగ్రహాల దొంగల ముఠా విగ్రహాలను ఇతర దేశాలకు చేరవేసి అమ్మే ప్రయత్నాలు సాగుతున్నాయని స్థానికుల సమాచారము. దురదృష్టమేమంటే గతంలో వీరభద్రుని విగ్రహం వద్ద కూడ ఇలాంటి ప్రయత్నమే జరిగినా, వీరభద్రుని విగ్రహం విరగగొట్టినా ప్రభుత్వం, పోలీసులు దాని ఆచూకీ తెలుసుకోలేకపోయారు. ప్రభుత్వ అనాసక్తత వలన ఇలా జరుగుతుందని చెప్పకతప్పదు.(12-12-2016 అర్ధరాత్రికి వారం ముందున ఈ గ్రంథ సమాచార సేకరణకర్త తీసిన నంది, నంది మండపం ఫోటోలను ఈ గ్రంథంలో ముద్రించడమైనది).

కోదండరామాలయం వద్ద 60/70 మీటర్ల దూరంలో బయట ఇసుక దిబ్బలపై రాముడు, సీత, లక్ష్మణుడు విగ్రహాలు ఆలనాపాలనా లేకుండా పెట్టివున్నవి. ఆ దేవాలయంలో ప్రస్తుతమున్న రాముడు, సీత, లక్ష్మణుల విగ్రహాలు కొత్తగా ఈ మధ్య గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్నారని, స్థానికుల సమాచారం. పాత విగ్రహాల సమాచారం లేదు. బహుశా బయట ఇసుక దిబ్బలపై పెట్టి వున్న రాముడు, సీత, లక్ష్మణుడు విగ్రహాలు కావచ్చునేమో. అవి అద్భుత శిల్పచాతుర్యంతో వున్నవి. స్వామివారి మండపం ఎదురుగా గరుడుని విగ్రహం ఉన్నది. ఇలాగుననే చదలవాడలోని రామాలయం ముందున కూడ ఉన్నది. ఈ రామాలయమూ దక్షిణముఖంగా ఉన్నది. మల్లవరంలో గల శాసనం పైభాగాన గరుడుని విగ్రహం చెక్కి వున్నది. మోటుపల్లిలో కోదండరామాలయం ముందున్న ప్రత్యేక మండపంలో, వినాయకుడు, హిరణ్యకశిపుని పొట్టచీల్చుతున్న నరసింహస్వామి (కొంత విరిగిపోయింది) విగ్రహాలున్నవి. ఒక కొద్దిపాటి

ఆంజనేయస్వామి విగ్రహం వున్నది. ఈ దేవాలయ మండపం అరుగు మీద వినోదాలకు పులి–మేక జూదపు ఆట గీతలు, దాడి ఆట గీతలు చెక్కబడివున్నవి. అవికూడ ఆ కాలానివే అయివుండవచ్చు. గత రెండు/మూడు శతాబ్దాలుగా అక్కడ గ్రామం, ప్రజలు లేరు. పశువుల కాపరులు రారు. ఇసుక దిబ్బలు ప్రక్కనే ఒక చిన్న మండపం ఒక స్తంభంపై నాగదేవత బొమ్మ చెక్కబడివుంది. మరొక శిలపై అందంగా నాగదేవుడు చెక్కబడివున్నాడు. రామాలయం వద్దనే రెండు నాగదేవతల శిల్పాలున్నవి. ఒక నలచదరపు చిన్నబావి వున్నది. దాని వయసు తెలుసుకునే ఆధారాలు లేవు. ఇలా నాగేంద్రుని శిల్పాలు చదలవాడలోనూ చాలవున్నవి.

మోటుపల్లిలోని అన్ని దేవాలయాల కట్టుబడులు దాదాపు ఒకేవిధంగా వున్నవి. దేవాలయాలు దాదాపు ఒకేచోట ఎదురెదురుగా వున్నవి. మధ్యలో త్రోవ–రహదారి కస్టమ్స్ హౌస్ వరకు వుండి వుండవచ్చు.

రాజులలోను, వర్తకులలోను, ప్రజలలోను శైవులు, వైష్ణవులు వుండి వుండవచ్చు. సయోధ్యలతో ప్రజలు జీవించారు. అప్పుడు విధ్వంస చర్యల ఆనవాళ్ళు లేవు. పాలకులు, పాలితులు హిందూ ధర్మసూత్రాలను, సాంప్రదాయాలను పాటించేవారని అర్ధమౌతుంది. ఇదేవిధమైన సయోధ్యల జీవితాలు రెడ్డిరాజ్యమంతటా వున్నవని, ఆనాటి సాహిత్యం, శాసనాలు, దేవాలయాలు, కట్టడాలు తెలుపుతున్నాయి.

అయితే వీరభద్రస్వామి ఆలయం ఎదురుగా వున్న ఇసుక దిబ్బలో విగ్రహం ముక్కలు బుద్ధునివైతే ఆ విగ్రహం అక్కడికెలా వచ్చింది? ఎవరైనా తెచ్చివేశారా? టన్నుల బరువుండే విగ్రహం ఎందుకు తెచ్చివేస్తారు? అది ప్రత్యేక నల్లరాయితో చెక్క బడ్డది. సంబంధిత విగ్రహాలు మోటుపల్లిలో లేవు. అయితే మోటుపల్లికి దగ్గర 10/15 కి.మీ.లో కనుపర్తి వున్నది. అది బౌద్ధ, శైవఘర్షణల ప్రదేశమంటారు. అక్కడి విగ్రహాల రాళ్ళు నల్లవే. ఏదైనా చరిత్ర చాలా వుంది. చరిత్రకారులు తేల్చాలి.

రెడ్డిరాజుల పరిపాలనా కాలంలోని వ్యాపారం గురించి మనకు సాహిత్యం ద్వారా ఎక్కువ సమాచారం తెలుస్తుంది. కాని వారి నాణేలు లభ్యం కాలేదు. రెడ్డిరాజుల కాలంలో అవచి కుటుంబం మోటుపల్లి నుండి పెద్దయెత్తున నౌకావాణిజ్యం చేసింది. శ్రీనాథుడు

“హరవిలాసం” కావ్యాన్ని రచించి అవచి తిప్పయ శెట్టికి అంకితమిచ్చాడు. ఆ గ్రంథంలో ఏయే దేశాల నుండి, ద్వీపాల నుండి ఏమేమి దిగుమతులు జరిగేది ఈ విధంగా వివరించాడు.

| ***దేశాలు, ద్వీపాలు*** | ***దిగుమతి వస్తువులు*** |
|---|---|
| చీనీ(చైనా) | పట్టు వస్త్రాలు |
| సింహళం | ఏనుగులు, మణులు |
| పంజర | కర్పూర పాదపములు |
| జలనోంగి | బంగారు మలోక(మొలక) |
| హురుముంజి | గుఱ్ఱాలు |
| గోవా | సంకుమద ద్రవం |
| యాంప | కట్టెని ముత్యాలు |
| భోట | కస్తూరి |
| తరుణసిరి, గోవా | చందనం, అగరు, కర్పూరం, కస్తూరి |
| వగైరా దేశాలు | కుంకుమ రజం, హిమాంబు (గులాబి పన్నీరు) |

**ఎలుకతోలు తెచ్చి ఏడాది యుతికిన**
**నలుపు నలుపెగాని తెలుపు రాదు**
**కొయ్యబొమ్మ దెచ్చి కొట్టిన బలుకదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# అవచి కుటుంబం

రెడ్డిరాజుల చరిత్రను తెలుసుకునే సందర్భంలో అవచి వారి కుటుంబాన్ని గూర్చి, వారు రెడ్డిరాజులతో మమేకమై హృదయపూర్వకంగా, బాధ్యతాపూర్వకంగా సహచరించిన వివరాలు, వారిద్వారా రెడ్డి రాజ్యానికి కలిగిన ఆర్థికాభివృద్ధిని మనం విస్మరించలేము.

అవచి కుటుంబం వైశ్య కులంలోనిది. వీరు కాంచీపుర వైశ్యవంశములలో పేరుగాంచి, కొండవీడు రెడ్డిరాజులకు ప్రాపై విలసిల్లిన వణిగ్వంశం. వీరిది కౌండిన్యస గోత్రం. వీరిలో చరిత్రకు తెలిసిన మూల పురుషుడు అవచి పావాణిసెట్టి. ఈతని కుమారుడు దేవయసెట్టి. ఈయన కుమారుడు తిప్పయసెట్టి. ప్రోలయ వేమారెడ్డికి దగ్గరగా మెలిగాడు. వీరు వీరశైవులు. దేవయ అన్నదానాది కార్యక్రమాలు చేసి సుప్రసిద్ధుడైనాడు. దేవయసెట్టి భార్య మాచాంబ. వారికి తిప్పయ, తిరుమలనాథుడు, చామిసెట్టి అను ముగ్గురు కుమాళ్ళు. తిప్పయను త్రిపురారి అని కూడ పిలిచేవాళ్ళు. దేవయసెట్టి నానాదేశాలతో వ్యాపారం చేసేవాడు. తిప్పయసెట్టి వ్యాపారంలో తండ్రికి సహకరించి, సత్సంబంధాలనేర్పరచుకొని వ్యాపార మెళుకువలతో ఆరితేరాడు. తిప్పయసెట్టి భార్య అన్నమదేవి. వారికి మాచన, విశ్వనాథుడు, చినమల్లుడు అను ముగ్గురు కుమాళ్ళు. వీరంతా రెడ్డిరాజుల ప్రాభవమునకు కారకులే. చాల సమయాలలో తమ వ్యాపార సంపదంతా రెడ్డిరాజులదేనన్న తెగువను కూడ చూపారు. రాజు, వ్యాపారి తేడా లేకుండా రెడ్డి రాజ్యసంక్షేమంలో అవచివారి పాత్ర ఎంతైనా వుంది.

వీరి వృత్తాంతము శ్రీనాథుని "హరవిలాసము" గ్రంథంలో వివరంగా చెప్పబడింది. తిప్పయసెట్టికి సాహిత్యంలో శ్రీనాథునిపై గురి కుదిరింది. శ్రీనాథుడు "హరవిలాసము" వ్రాసి తిప్పయసెట్టికి అంకితమిచ్చాడు. అవచి వారి కుటుంబం గుళ్ళు, గోపురాలు కట్టించి అన్నదానాలు చేసి, ఇతర ప్రజోపకార కార్యక్రమాలు చేసి ప్రజలలో మంచిపేరు తెచ్చుకోవటమే కాక రెడ్డిరాజ్యంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్న పరిస్థితిని కల్పించారు.

తిప్పయ కొమరగిరిరెడ్డికి బాగా దగ్గరైనాడు. కొమరగిరి సుగంధశాలకు అధ్యక్షుడైనాడు. కొమరగిరి బిరుదములన్నింటినీ ఈయన కూడ ధరించేవాడు. సుప్రసిద్ధ చారిత్రక వ్యక్తి కాగలిగాడు. రెడ్డిరాజ్యం ఆర్థికంగా సుస్థిరంగా ఉండటానికి గల కారణాలలో అవచి కుటుంబ సాన్నిహిత్యం ఒకటి. వసంతోత్సవముల కీర్తి అనవేమారెడ్డి, కొమరగిరిరెడ్డి గార్లతోపాటు తిప్పయకూ దక్కింది. తిప్పయకూ "వసంతరాయ" బిరుదమున్నట్టు శ్రీనాథుని "హరవిలాసం" వలన తెలుస్తుంది. కొమరగిరిరెడ్డి ప్రభువునకు ప్రతి సంవత్సరం వసంతోత్సవానికి వలసిన కస్తూరి, కుంకుమ, ఘనసార, సంకుమద, హిమాంబు, కాలాగరు, గంధసార మొదలైన సుగంధ ద్రవ్యాలు సమకూర్చేవాడు. చీనీ, సింహళ, తవాయి, హురుమంజి, జలనోగి, మొదలైన దేశాల నుండి ధన కనక వస్తు వాహన మాణిక్యాలను తెప్పించి యిస్తూ వసంతోత్సవముల వ్యయమంతయు భరించేవాడు. ఉత్సవాలకు వచ్చే దేశ విదేశీ పెద్దలకు, చక్రవర్తులకు, తిప్పయే సన్మానాలు చేసేవాడు. మీదుమిక్కిలి తిప్పయ అందగాడు. రసికజ్ఞాని. లలనాజన మన్మథుడట.

తిప్పయ చిన్నతనం నుండి నౌకా వ్యాపారంపై ధ్యాస కలవాడు. సొంత నౌకలను, సిబ్బందిని, రక్షక దళాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. తిప్పయ ధైర్యవంతుడు. సాము గరిడీలు నేర్చాడు. ఓడ దొంగలను కూడ స్వయంగా ఎదుర్కొనే ధైర్యసాహసాలు కలవాడు.

తిప్పయ కుటుంబీకులు రత్నాలు, సుగంధద్రవ్యాలు, కర్పూరం, పద్మ రాగాది మణులు, శాలిధాన్యాలు వ్యాపారంతో పాటు పారశీక దేశాల నుండి గుఱ్ఱాల దిగుమతి, సింహళం, చైనా, మంగోలియా, బర్మా, గోవా, సిరియా, జాంబియా వగైరా దేశాల నుండి ఇతర సంపదలు వస్తువుల ఎగుమతి దిగుమతి వ్యాపారం చేశారు. నౌకా వ్యాపారమేగాగ రహదారి వ్యాపారం కూడ జరిపారు. అవచి కుటుంబం ఏయే వస్తు వ్యాపారాలు చేశారో శ్రీనాథుని ఒక అందమైన పద్యంలో చూద్దాము.

**"పంజార కర్పూర పాదపంబులు తెచ్చె**
**జలనోంగి బంగారు మొలకదెచ్చె**
**సింహళంబున గంధ సింధురంబులు దెచ్చె**

**హురుమంజి బలుతేజి హరులు దెచ్చె**
**గోవసంశుద్ధ సంకుమద ద్రవము దెచ్చె**
**యాంపకట్టాణి ముత్యాలు దెచ్చె**
**భోట కస్తూరికాపుట కోసములు దెచ్చె**
**చీనిచీనాంబరశ్రేణి దెచ్చె**
**జగదగోపాలరాయ వేశ్యాభుజంగ**
**పల్లవాదిత్య భూదాన పరశురామ**
**కొమరగిరి రాజదేవేంద్రు కూర్మిహితుడు**
**జాణ జగజెట్టి దేవయ చామిసెట్టి"**

ఇందుమూలంగా, రెడ్డిరాజుల కాలంలో నౌకా వ్యాపారం ఇతరదేశాలు, దీవులతో జరిగిందని తెలుసుకోవచ్చు.

## పరిశ్రమలు

రెడ్డిరాజుల కాలంలో గ్రామ పరిశ్రమలు విరివిగానే సాగినవి. 1. నూనె పరిశ్రమ, 2. బెల్లం పరిశ్రమ, 3. పాత్రల పరిశ్రమ, 4. సుగంధ ద్రవ్య పరిశ్రమ, 5. ఏకులు వడుకుట, 6. ఆభరణాల పరిశ్రమ వగైరాలు ప్రజల వలన, ప్రజల చేత, ప్రజల కొరకు సాగుచుండినవి. వీటితోపాటు ఆయుధముల తయారీ వుండెడిది.

పరిశ్రమలలో వస్త్ర పరిశ్రమ అగ్రస్థానంలో ఉండినది. ముఖ్యంగా పలనాడు వినుకొండ సీమలు వస్త్ర పరిశ్రమకు పెట్టింది పేరు. ప్రతి ఇంటిలో రాట్నం వడికేవారు. "రంభయైన ఏకులె వడకున్" అని శ్రీనాథుడన్నాడు. వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా రంగుల పరిశ్రమ సాగింది. ప్రతిగ్రామంలో నీలిమందు, ఇతర రంగులు తయారయేవి. నేత పనివారలకు నిండుగా ఉపాధి వుండేది. కదురాడిన యింటికి, కవ్వమాడిన యింటికి దరిద్రముండదని వాడుక.

నూనె సంతలు జరిగేవి. ధాన్యమునకు, బియ్యమునకు నూనె కొనేవాళ్ళు. ఏడుమానికల బియ్యానికి మానెడు నూనె వచ్చేది.

నూలుతోపాటు పట్టు పరిశ్రమ కూడ ఎక్కువగా వుండేది. సన్నని నూలు బట్టలు, పట్టుబట్టలు రాజులకే తగినవి. పట్టులో వెలిపట్టు, హెూంబట్టు, పులిగోరుపట్టు, ఉదయరాగ పట్టు, నేత్రపట్టు, వజ్రపట్టు, అను రకాలుండేవి.

రంగుల వస్త్రముల కొరకు రంగుల ఉత్పత్తి వుండేది. కరక్కాయ, నీలిమందు= ఇండిగో, మంజిష్ఠ, లక్క, పసుపు రంగులు ఎక్కువ వాడుకలో వుండేవి.

కమ్మరులు కత్తులు చేసి డెమాస్కస్‌కు ఎగుమతి చేసేవారు.

పాముకన్న లేదు పాపిష్టి జీవంబు
అట్టి పాము జెప్పినట్టె వినును
ఖలుని గుణము మాన్ప ఘనులెవ్వరును లేరు
విశ్వదాభిరామ వినురవేమ.

వేము పాలువోసి ప్రేమతోఁ బెంచిన
జేఁదు విఱిగి తీపి చెందబోదు,
ఓగు నోగెఁగాక యుచితజ్ఞుఁడెటులౌను
విశ్వదాభిరామ వినురవేమ.

పాలు పంచదార పాపర పండ్లలో
జాలఁ బోసి వండఁ జవికిరాదు
కుటిల మానవులకు గుణమేల కల్గురా
విశ్వదాభిరామ వినురవేమ.

# గృహరాజు మేడ

కొండవీడు దండకవిలె, స్థానిక కైఫీయతులు గృహరాజుమేడ విషయమై శ్రీనాథకవి గాథను వివరిస్తున్నాయని మల్లంపల్లివారు పేర్కొన్నారు.

గృహరాజుమేడ (గృహరాజు సౌధం) చరిత్ర శ్రీనాథునితోను, కుమారగిరిరెడ్డి లేదా పెదకోమటి వేమారెడ్డితోను, విజయనగర రాజులలో రెండవ హరిహర రాయులుతోనూ ముడిపడి వున్న అద్భుతమైన కట్టడం. ఒకసారి శ్రీనాథుడు  విజయనగర చక్రవర్తి రెండవ హరిహరరాయలు ఆస్థానం దర్శించాడు. ఆ సందర్భంలో రాయలు ఎవళ్ళూ నిర్మించలేని ఒంటి స్తంభం మేడను నిర్మించాలని వుందని అన్నాడట. అందుకు శ్రీనాథుడు అలాంటిది కొండవీడులో అప్పటికే వున్నదని తన ప్రభువు గొప్పదనం చాటేందుకు చెప్పాడు. రాయలు ఆశ్చర్యపోయి చూసి రమ్మని వేగులను పంపాడు. ఈలోపునే శ్రీనాథుడు తన ప్రభువు పరువు, తన పరువు, పోకుండా వుండటానికి తన యిష్టదైవమును ప్రార్థించి కొండవీడుకు వచ్చి రెడ్డిరాజుకు చెప్పగా, వెన్వెంటనే తాటిచెట్టు కంటే యేడురెట్లు ఎత్తుగా, యేడు మోకుల వైశాల్యంలో వున్న తుమ్మచెట్టు (Mymiosa arabica జాతి) చెట్టును నవులూరు గ్రామం నుంచి తెచ్చి యీ ఒంటిస్తంభపు మేడ గృహరాజు మేడను నిర్మించారు. శ్రీనాథుడు చెప్పింది నిజమని నమ్మి ఆయనను కట్నకానుకలతో సత్కరించారు. ఈ కథకు చారిత్రకాధారం లేదని, కాని గృహరాజుమేడ వున్నదని మల్లంపల్లివారు నిర్ధారించారు. కుమారగిరిరెడ్డి ఎన్నోరకాల భవనాలను కట్టించాడని, వాటిలో ప్రఖ్యాతమైనది గృహరాజుమేడ అని నిర్ధారించారు.

అయితే ఒక చాటువు పద్యంలో గృహరాజుమేడ ప్రస్తావన వున్నది. అది

**"ఏలె కోమటివేమన యిరువదేండ్లు**
**రాచవేమన్న నాల్గు వర్షములనేలె**
**మించి కట్టిరి గృహరాజుమేడ, కొండ**
**వీట నూతేండ్లు రెడ్లు భూవిదిత యశులు"**

ఈ మేడ ప్రస్తావన పెదకోమటి వేమారెడ్డి ఫిరంగిపురం శాసనంలో లక్ష్మీదేవికి అంకితం అని వుంది. కొండవీడు కైఫీయతులో వుంది. గృహరాజుమేడ ఒక ప్రత్యేక తరహా కట్టడమట. దీనిని గురించి "శ్రీరంగ మహత్యం" అనే కావ్యంలో ఉన్నదట.

వి.వి. సుబ్బారెడ్డి అనే చరిత్రకారుడు కూడ శ్రీనాథుని కథను చెప్పాడు. అయితే అది విజయనగర ప్రౌఢదేవరాయలు కాలంగా చెప్పాడు. పెదకోమటి వేమారెడ్డి కాలానికి సంబంధం లేదన్నాడు. ఈ చరిత్రకారుని ప్రకారం గృహరాజు మేడను నిర్మించినది కుమారగిరి రెడ్డి అని, కాటయ వేమారెడ్డి వేయించిన క్రీ.శ. 1395 నాటి గోపవరం, క్రీ.శ. 1408 నాటి కుమారగిరిపురం శాసనాలు రుజువు చేస్తున్నాయని తేల్చారు. ఈ మేడ ఒక అద్భుతమైన కట్టడమని, విదేశీయులు కూడ గృహరాజుమేడను దర్శించటానికి వచ్చేవారని చరిత్ర చెబుతుంది. ఈనాటికీ "గుర్రాజుమేడ" అనే మట్టిదిబ్బను కొండవీడులో స్థానికులు చూపుతుంటారు. ఈ గృహరాజు మేడపై కొన్ని గ్రంథాలు కూడ వెలువడ్డాయి.

**ముష్టి వేపచెట్టు మొదలంట ప్రజలకు**
**బరగ మూలికలకుఁ బనికివచ్చు**
**నిర్దయాత్మకుండు నీచుఁడెందులకౌను**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**కానివానితోడ గలసి మెలఁగుచున్నఁ**
**గానివానిగానె కాంతురవని**
**దాటిక్రింద బాలుత్రాగిన చందమౌ**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# కొండవీడు - నేటి చారిత్రక అనవాళ్ళు

కొండవీడును గురించి ప్రత్యేకంగా చెప్పుకొనవలసియున్నది. చిరకాలము నుండి కొండవీడు మహానగరమై రాజ నివాసమై ప్రఖ్యాతి నొందినది. "దండకవిలె"లో చాల వివరాలు వ్రాయబడ్డవి. దండకవిలె అంటే పూర్వరాజులు, పరిపాలనా దినముల గురించి తదాశ్రిత బృందముచే వ్రాయబడిన చరిత్రము. 1810వ సంవత్సరములో మెకంజి కూడ దేశచరిత్రలను వ్రాయించారు. వారు దొరికిన శాసనములు కొన్నింటినీ చూచి వెలుగులోకి తెచ్చారు. గ్రామాధికారుల నుండి వాంగ్మూలములు (కైఫీయతులు) తీసుకున్నారు. సి.పి. బ్రౌన్ కూడ చాల శ్రమించి సమాచారం సేకరించారు.

## ఆనాటి కొండవీటి కొండ - కట్టడములు - పరిసరాలు

కొండవీటికొండ గుంటూరు జిల్లా నర్సరావుపేట తాలూకా యందలి గొప్ప పర్వతశ్రేణి. దీనిపై 50 బోళ్ళు (శిఖరాలు) కలవు. అందులో ముఖ్యమైనవి. 1. బొల్లుమూరి వెంకటేశ్వరుని బోడు. దీనిపై వెంకటేశ్వర స్వామి గుడి వున్నది. 2. ఆదం ఫషీ కొండ దీనికి రుద్రపాద శిఖరమని పేరు. దీనిపై మహమ్మదీయులు దర్గా నిర్మించారు. ఇది మిక్కిలి ఎత్తైనది. రెండున్నర మైళ్ళ ఎత్తు. 3. గురునాధుని బోడు.

ఈ పర్వత శిఖరాలపై మూడు చెరువులుండెడివి. 1. వెదుళ్ళమ్మ చెరువు, 2. ముత్యాలమ్మ చెరువు, 3. పుట్టలమ్మ చెరువు. శిధిలమైన రాజమందిరాలు కలవు. "నేతికొట్టు" కలదు (నేయి నిలువ కోసం).

కొండపైన కోటలు కట్టబడ్డాయి. పైకి వెళ్ళుటకు సోపాన మార్గం కలదు. ఈ మార్గం ప్రక్కన నృసింహాలయం, గంగాధర రామేశ్వరాలయం, విష్ణ్వాలయం కలవు. కొండపైన రెండు మసీదులున్నవి. పోతరాజు, నాగవరమ్మ గుళ్ళుండెడివి. కొండ దిగువ భాగంలో

గోపీనాథస్వామి గుడి, వేయికాళ్ళ మండపము ఉండెడివి. అది తరువాత మహమ్మదీయుల ప్రార్థనా మందిరమైనది. ఇచటనే "వసంత్‌ఘర్" కలదు.

కొండ ఉత్తరభాగాన "గృహరాజు" మేడ ఉండెడిది. ఇప్పుడది దిబ్బలుగా వున్నది. దీని సమీపాన రంగనాయకుల ఆలయం, జడ్డిగలబావి ఉండెడివి. ఈ బావిని గృహరాజు మేడ యందు ప్రతిష్ఠించబడ్డ శ్రీఆదిలక్ష్మి కామేశ్వరీదేవి జలక్రీడార్థమై నిర్మించబడింది.

కొండల క్రింది భాగాన తిరుమల లక్ష్మీనరసింహస్వామి గుడి, శ్రీరామేశ్వర స్వామిగుడి, శ్రీ వీరభద్రాలయం, పత్తేఖాన్ మసీదు, అత్తార్ చౌదరి మసీదు, నల్లమసీదు, గుమ్మల్ మసీదు, జామాత్కానా మసీదు, చిన్న మసీదు, దివాన్ వారి మసీదు, దర్గాలు ఉండెడివి. ఈ మసీదులు రెడ్డిరాజులు వచ్చుటకు ముందు కాలంలోని మహమ్మదీయుల కాలంలో ఏర్పడినట్లు భావించబడింది.

## కోటలు

కొండపై ఎటు చూసినా గొప్పకోటలు శిథిలమై ఉన్నవి. కొండపై ఉత్తర దిశన అరకోట, పిల్లకోట, పెదమాలెముకోట, చినమాలెముకోట, తట్టికోట అను ఐదుకోటలుండెడివి. కోటలచుట్టూ అగడ్తలుండెడివి.

కొండకుత్తర దిశన ప్రోలయ వేమారెడ్డి కట్టించిన పుట్టకోట ఉన్నది. కోటలకు మధ్య మధ్యన 21 బురుజులుండెడివి. ఈ బురుజులను పేర్లతో సహా చరిత్ర నమోదు చేసినది.

కొండవీటి పురము రమారమి 4–5 మైళ్ళ వైశ్యాల్యముతో ఏడు వాడలు (పేటలు)గా ఉండెడిది. కొండవీటిలో కడునేర్పుగా జనపనార, గుడ్డపేలికలతో కాగితములు చేయు చేతిపని ఉండెడిది. అవి చాల గట్టిగా వందల కొలది సంవత్సరములుండెడివి. కాగితములు చేయు స్తలము (చట్టు) కొండ మీద ఇప్పటికినీ ఉన్నది. కాగితములు చేయు స్థలము ఇదికాక వేరొకటి మనదేశంలోనే లేదని చరిత్ర చెబుతుంది.

కొండవీడు పేరు విషయములో దండకవిలెలో ఈవిధంగా చెప్పబడినది. ''పూర్వము నుండి ఇప్పటికిని కొండవీడు కుండిన నగరమనియు, విదర్భ దేశమునకు ముఖ్యపట్టణ మనియు, ఇచ్చట దమయంతి, రుక్మిణియు జన్మించిరనియు, ఇప్పటి అమీనాబాదు యొద్దగల కొండపైనున్న ముల్లగూరమ్మయే మున్ను రుక్మిణి పూజించిన పార్వతియని అచటివారు చెబుతున్నారు". ఇలా దండకవిలె యందు వ్రాయబడి వున్నదని శ్రీ మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ తన కొండవీటి సామ్రాజ్యము గ్రంథము నందు తెలిపారు. కాని దీనిపై సంశయమున్నది.

కొండవీడు రాజ్యవిస్తీర్ణము, కృష్ణా, గోదావరి, గుంటూరు, నెల్లూరు, కర్నూలు మండల ములకు వ్యాప్తమైయున్నది. శాసనములలోని బిరుదములను బట్టి కూడ తెలియుచున్నది. కాని సింహాచలం వరకు కూడ వ్యాపించినట్లు చరిత్ర చెబుతున్నది. ఇది పదునాలుగు సీమలును, 4 గిరి దుర్గములు కలిగి రెండువేల నలభైఎనిమిది (2048) గ్రామములకు, మరొక ఆధారంలో 2219 గ్రామములకు వ్యాపించి 22,500 చదరపు మైళ్ళు వైశాల్యమునకు వ్యాపించియున్నట్లు ఆ నాలుగు గిరి దుర్గములు కొండవీడు, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జున కొండ అనియు చరిత్ర తెలుపుతున్నది.

**పాల నీడిగింట గ్రోలుచు నుండెనా**
**మనుజుడెల్ల గూడి మద్యమండ్రు**
**నిలువఁ దగనిచోట నిలువ నిందలు వచ్చు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**తామసించి చేయఁదగ దెట్టి కార్యంబు**
**వేగిరింప నదియు విషమగును**
**బచ్చికాయఁ దెచ్చి పండింప ఫలమౌనె**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# 14వ శతాబ్ది తదుపరి చరిత్ర

కొండవీడును చివరకు విజయనగర రాజులు కైవసం చేసుకున్నారు. తరువాత గజపతుల క్రిందకు పోయింది. గోల్కొండ ప్రభువులు పాలించారు. వారి పాలనలోని అమీనులు పాలించారు. తర్వాత గోల్కొండ ప్రభువైన నాజర్‌జంగ్ బహదూర్ కాలంలో (క్రీ.శ. 1750) ఫ్రెంచివారు కొండవీడును బహుమతిగా పొందారు. ఫ్రెంచివారు పాతగుంటూరులో కోట కట్టుకొని కొండవీడు నుంచి రాజధానిని పాతగుంటూరుకు మార్చుకున్నారు.

మళ్ళీ క్రీ.శ. 1758లో కొండవీడు నిజాం వశమైంది. హైదరాబాద్ నవాబైన బసాలత్ ఖాన్ క్రీ.శ. 1788 సెప్టెంబరులో ఒక ఒప్పందంలో భాగంగా కొండవీటి సీమను ఈస్టిండియా కంపెనీ వారికి అప్పజెప్పాడు. ఇంగ్లీషువారు కొండవీడును ఒక జిల్లాగా ఏర్పరచి, తరువాత తాలూకాగా మార్చి, జిల్లా కేంద్రాన్ని గుంటూరుకు మార్చారు. కొండవీటి సీమ 1794లో గుంటూరు జిల్లాగా ఏర్పడింది. గుంటూరు జిల్లాను 1839లో పరిపాలనా సౌలభ్యం కోసం బ్రిటిషువారు కృష్ణాజిల్లాలో కలిపారు. తిరిగి 1904లో గుంటూరును ఒక జిల్లాగా ఏర్పాటు చేశారు. కొండవీడు నేడు గుంటూరు జిల్లాలో ఉన్నది. కాని కొండవీడు తన స్థాయిని కోల్పోయి గ్రామమైంది. మధ్యలో జమీందారీ వ్యవస్థ ఏర్పడి మానూరి నరసన్నారావు (నరసరావుపేట ఇతని పేరు మీద ఏర్పడింది) మరియు అతని తమ్ముడు శ్రీవేంకటకృష్ణుని పాలన క్రింద 1812 వరకు ఉన్నది.

ఇది కాలప్రభావంగా అర్థం చేసుకోవాలి.

తెలుగువైభవం, తెలుగు సంస్కృతీ వైభవం, రెడ్డి పరాక్రమం, రెడ్డి రాజసం కళలు, నాట్యం, అమరావతికి సైదోడు కొండవీడు అని శ్రీనాథుని కావ్యాలు, చరిత్ర వ్యాఖ్యానాలు చెబుతున్నాయి. నేటికీ కొండవీడు కోటలో జీర్ణావస్తలో ఉన్న ప్రధాన ముఖద్వారం రాజసం, దేవాలయాలు వాటి కట్టుబడిలోని ఇంజనీరింగును చూస్తే ఆ పరాక్రమ కేంద్రాన్ని చూస్తే తెలుగువాడికి, ప్రత్యేకించి రెడ్డిజాతికి ఒక బాధ కలుగుతుంది.

# రెడ్డి కుల ప్రబోధము

## కవికోకిల దువ్వూరు రామిరెడ్డి

కీ.శే. దువ్వూరు రామిరెడ్డిగారు రెడ్డికులం, రెడ్డిరాజులు, అద్దంకి, కొండవీడు, రాజమహేంద్రవరం రాజ్యాల ఘన చరిత్రను బంగారు తెరపై కనుల ముందు నిలిపి రెడ్డి సోదరులకందరికీ ప్రబోధం చేశాడు. పెద్దలు అనుభవజ్ఞానులై యిచ్చిన ప్రబోధానిని శిరసావహించటం, రెడ్డి కులస్తులు విధిగా పాటించటం ఈనాటి కులవ్యవస్థల రోజులలో అవసరం. వారి కొన్ని పద్యాలిలా ఉన్నవి.

రెడ్లుగాపుట్టిన ఋణముతీర్చికొనంగ
వీక్షించితిరె కొండవీటికోట?
తలచిన యంత చిత్తమున రోషము రేపు
కత్తుల కూపంబు కాంచినారె?
రెడ్డివీరకుమార హృదయ రక్తంబుల
తోగిన రణభూమి త్రొక్కినారె?
యాంధ్రశౌర్యేందిర కకలంక భూషణం
బౌ రెడ్ల చరిత విన్నారె? యన్న

లార, యూరకరెడ్డికులాన జన్మ
మెత్తితిమటన్న నాదాయ మేమిగలదు?
తల్లిమొగము నెఱుంగని తనయు లవత
రించియును లేనివారలే యెంచిచూడ!

సచ్చిదానంద దర్శనుడు వేమనయోగి
మనకులంబున పుట్టెననిన చాలు;

షట్చక్రవర్తి సచ్చారిత్ర నిర్మాత
        మనవాడెయన్న యాఘనతచాలు;
ఆంధ్ర వీరాంగన యైన నాయకురాలు
        మన కులస్త్రీ యన్నమాటచాలు;
ఔదార్య ధుర్యాత్ము డనవేమభూపుడు
        మావాడె యన్న సంబరముచాలు;

నింక నెందతెందఱనొ యహీనయశుల
కాంచి లోకైక విఖ్యాతి గన్నయట్టి
రెడ్డికులపు చారిత్రంబు శ్రేష్ఠమనుట
కేమి లోపంబుగలదు? మీరెఱుగరయ్య.

ఘనసైన్యంబులకూర్చి, బాహుబల విక్రాంతి న్విశేషించి ప
ద్మ నృపాలాళికి గుండెగాలముగ, విద్యానాథులై కొండవీ
టను నద్దంకిని రాణ్మహేంద్రపురి కోటల్గట్టి శౌర్యంబునన్
మును బాలించిన రెడ్డిరాజుల యశంబుల్ నేటికిం గ్రాలవే?

మార్తుర రాజ్యరమామణుల్ చెఱపడి
        గోదుగుడిచిన చోటు కొండవీడు;
ఆంధ్రదేశమతల్లి యలికంబునం దాల్చు
        మండన తిలకంబు కొండవీడు;
కవితారసాలోల కల్లోలినిం దోగు
        పండితాఢ్యుల నాడు కొండవీడు;
ఖండితారాతిరాణ్మండన మండితా
        ఖండలచాపంబు కొండవీడు;

అట్టివీటను బెన్గోట గట్టినట్టి
మేటిదిట్టలు మనతొంటి పోటరులెక!
నేటికిని రెడ్డి వీరుల నెత్తురచట
శౌర్యసౌరభ్యములు వెదజల్లుచుండు.

పోయిరేగాని, వారల భూతినుండి
రేగుచున్నది వెండియు రెడ్డిశక్తి;
యింక నొకమాఱులోకంబు నెల్ల నాత్మ
దివ్యతేజంబున న్ముంచి తేల్పగలదు.

కొండవీటి దుర్గంబున క్రుంకినట్టి
రెడ్డిసూర్యుండు కాళరాత్రిని తరించి
యభినవాంశు ప్రసారంబు లలరుచుండ
తూర్పుదిక్కున నల్లదే తోచువాడు!

వీడిపోయిన తంత్రులు బిగియగట్టి
హృదయమందు ప్రతిధ్వను లెసగునటుల
వీణసారించుచున్నాడు ప్రియసుతుండు
లెమ్మునిద్దుర, రెడ్డికులమ్మ, యింక.

నేడుపవిత్రవాసరము నిర్మల చిత్తముతోడ సందఱుం
గూడి కులాభివృద్ధికొఱకుం బనిసేయగదీక్షపూని మీ
వాడల పల్లెలన్ నగర వాటికలందు ప్రబోధగీతముల్
పాడుడు, కంకణాలు మణిబంధములన్ ధరింపుదర్థిమై.

తమకులాభ్యున్నతి కయి యత్నంబు సలుప
అన్యకులముల ద్వేషించి నట్లుగాదు;

బలిసి సర్వాంగకంబులు పటువులైన
మహిత మౌగాదె దేహసమష్టి బలము.

కత్తులు కలమును హలములు
ముత్తెఱగుల నడుపనేర్చి ముసు మనపూర్వుల్
పెత్తనము గాంచి బ్రతికిరి
ఇత్తఱి నది రిత్తవోక యెసగింపవలెన్.

మనపూర్వుల్ కడుగొప్పవారలను సమ్మానంబునట్లుంచి,యీ
జనబాహుళ్యమునందు నేటిమనకున్ స్థానంబు నార్జింప చే
సిన యత్నంబులె లాభకారులగు; ప్రాచీనంపు రాజ్యప్రథన్
గొని తచ్ఛాయల డాగనెంతురె యుదగ్రుల్ నేటి రెడ్యగ్రణుల్.

ఐనను పూర్వపూరుషుల యంచితకీర్తి సముద్ధరించు సం
తానములౌటకుందగు విధానము సల్పుడు; లేకయున్న, "మా
నానయు కోటికెక్కె, మఱినాదశయేమిటొ కూటికెక్కితిన్
పోని" యటన్న యల్పమతి పోడిమిమాలినరీతి చొప్పడున్.

శ్రీనాథ కవివర్య శేముషీవల్లికి
అల్లయ భద్రుండు నల్లువెట్టె;
ప్రాణవంతంబులై ప్రజల భావములంట
వెదచల్లె పద్యాలు వేమయోగి;
కాళిదాసుని నాటకత్రయి భావంబు
వివరించె కాటయవేమ విభుడు;
షట్చక్రవర్తుల చరితంబు రచియించె
మధుర వాక్ప్రౌఢిమ మల్లరెడ్డి;

గోనబుద్ధుండు జిగిబిగి కూర్పు సొంపు
మధువు చిప్పిలచెప్పె రామాయణంబు;
నాటివలె, దొడ్డరామాయణంబు నేడు
రసికత రచించె వేంకట రామిరెడ్డి.

కవులుగాణలు విద్వత్ప్రకాండ యశులు
లలిత సాహిత్య చక్రవర్తులను గన్న
రెడ్డికుల కామధేనువు గొడ్డువోక
పెంచు నేటికి ప్రతిభా నివేశమతుల.

వీరభద్ర మహీశు విద్వత్సభలలోన
నాట్యంబు సల్పిన నవ్యకవిత;
అద్దంకి నరపాలు నాస్థానమున శాస్త్ర
చర్చలం దలకొన్న శారదాంబ;
కాటయవేముని కనక లేఖిని నెక్కి
వ్యాఖ్యలు విప్పు విద్యావధూటి;
పండితుల్ కవులు నఖండ గౌరవమొంద
కారకురాలైన కావ్య లక్ష్మి;

ఆశ్రయచ్యుతి కొన్ని నాళ్ళనుభవించి
నేటికైన గద్వాల రాజ్ఞీమతల్లి
సభను విహరించు గ్రొంగొత్త సౌరభముల
దళుకు బెళ్కులు మిఱుమిట్లు గొలుపునట్లు.

"ధనధాన్యంబులు ప్రాజ్యభోగములు విద్యాబుద్ధులుం గీర్తియున్
ఘనశౌర్యంబు నుదారతాగరిమ చక్కంగల్గి, తంగేడు పూ
చిన చందాన సతంబు నూత్నరుచులం జెన్నారుతన్‌విశ్వమో
హనమై రెడ్డికులంబు సర్వజన నిత్యానంద సంధాయిగన్".

రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు

# రెడ్డి ప్రభ

## శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రి

మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారు "రెడ్డియనంగ నర్థ మది ఱేడని చెప్పగవచ్చు"నని గురువాక్యం పలికారు. వారివి కొన్ని పద్యాలు తెలిసికొందము.

ఉ॥ రెడ్డి యనంగ నర్థ మది ఱేఁ డని చెప్పఁగ వచ్చు నట్టి శ్రీ
రెడ్డివిభుప్రతాపమును రెడ్డిప్రభుత్వము రెడ్డిదానమున్
రెడ్డియశంబు చాటుచును రెడ్డిజయంతి వచించు, వేలుపుం
గిడ్డులు రెడ్డివా రనుచుఁ గేరుచుఁ బద్యము లే వచించెదెన్.

ఉ॥ ప్రోలయ వేమరెడ్డి మును భూపరిపాలన మాచరించునాఁ
డాలరిమూఁకలై తురక లాహవభూమి నెదుర్ప వారలన్
గాలునివీటి కంపియునిఁకం గలవారలఁ బాఱఁదోలి తా
నేలెఁ బ్రజన్ బ్రబంధపరమేశ్వరముఖ్యుల సత్కవీంద్రులన్.

తే॥ నూటయేఁబది వర్షముల్ మేటు లగుచు రాజ్యమేలిరి యారెడ్డిరాజవరులు
వారిసిరులెల్ల దేవళ్ళపాలు విప్రబృందములపాలయయ్యె నావేళయందు.

క॥ అనితల్లి రుద్రదేవియు – వనితామణులయ్యు రాజ్యపాలనవిధులన్
ఘనకీర్తిఁ గాంచి మించిరి – ఘనులగు పూరుషులకంటెఁ గడు నమ్రముగన్.

తే॥ వేమనయుఁ గోనబుద్ధఁడు వీరభద్ర కవి కుమారగిరియులోని ఘనచరితులు
రెడ్డివంశమునం బుట్టి ఱేఁడు లగుచుఁ గవులు నై చాల విఖ్యాతిఁ గాంచి రవుడు.

ఆ॥ కొండవీటిరెడ్డికుంజరంబులు బహు దేశసమరవిజయదీపితు లయి
కవుల నాదరించి కావ్యంబులం గాంచి రాజ్యమేలి రాదిరాజులట్లు.

వ॥ ఎప్పుడో రెడ్డిరాజులు రాజిల్లిరని చెప్పు టేమిటి కిప్పుడును.

సీ॥ హైదరాబాదున నధికారి కొత్వాలు ప్రథితుండు వేంకటరామరెడ్డి
యొడ్డేపలిన్ లక్ష లొప్పఁ బింగళికులప్రభువుఁడా వెంకటరామరెడ్డి
మునగాలపురి రాజపూజితుండును గుణరత్న నాయని రంగరావురెడ్డి
కడపపురంబున ఘనుఁడు మేధాశాలి మేటియౌ కోట్రెడ్డి కోటిరెడ్డి
మణికొండలో రాజమాన్యుఁడు ధన్యుఁడు వరతౌటిరెడ్డి గోపాలరెడ్డి
నెల్లూరుపురమున నెరదాత రేబాలరాయండు పట్టాభిరామరెడ్డి
అనపర్తి నౌదార్యఖనియు భూస్వామి ద్వారంపూడి వరవంశరామిరెడ్డి
బుచిరెడ్డిపాలెమన్పురిఁ గృష్ణరాయలన్ సౌజ్ఞనందిన రామచంద్రరెడ్డి
తిన్న వెల్లిన్ సుగుణోన్నతుండును బ్రభుసన్నుతుండు కొమారసామిరెడ్డి
రాయవరంబునఁ బ్రథితయశుం డయి జానొందు మల్లిడి సత్తిరెడ్డి
చిత్తూర సత్ప్రభుశ్రేష్ఠుఁడు వలివేడు ప్రభువై తలిర్చెదురాజురెడ్డి
ఆదోనిపురమున ననఘుండు ఘనుఁడు నై తళుకొత్తుచుండెడు తమ్మిరెడ్డి

తే॥ మఱియు దీపాలదిన్నెగ్రామమున రామిరెడ్డి కవికోకిలము, రామిరెడ్డి సుకవి
వరుఁడు, యానాదిరెడ్డి, గోపాలరెడ్డి మొదలయిన రెడ్డిదొర లిప్డు పొదలుచుండ్రు.

కోపముననను ఘనత కొంచెమైపోవును
గోపముననను మిగుల గోడు గలుగు
గోప మడఁచెనేని గోర్కెలు నీడేఱు
విశ్వదాభిరామ వినురవేమ.

# రెడ్డిరాజ ప్రశస్తి

### మహాకవి కాళ్ళకూరి హనుమంతరావు


ఉ॥ పండితులై, కవీంద్రులయి, బంధురసత్కృతు లంది, వంశరా
ణ్మండలితో సమర్థ్యమహిమ న్విలసిల్లిరి, భూనభోంతరా
ళాండము కీర్తినర్తకి కొసంగిరి, యర్థులు వేదకుండ
గొండని పిల్చుచుం బసిడికొండల నిచ్చిరి రడ్డిభూపతుల్॥

గీ॥ బహుకళాపోషకులు రెడ్డివంశనృపులు
పన్నుబందెలు లేకుండఁ బందునట్టి
యగ్రహారము ల్మాన్యంబు లడిగినన్ని
కోరుకొనునట్టి సీమల గూర్చుకతన॥


సీ॥ అగ్రహారములలో నాందోళికల నెక్కి యెట్టిన యెచ్చోట నీరువాటె
గస్తూరిలో మున్గి కనకంబులో నాడి శ్రీనాథుఁ డెచ్చోట సిరులఁ దూగె
పాళెంబులం గాంచి పైడియందలమెక్కి సూరన యెచ్చోట సుఖముఁ జెందె
పల్లెలు మాన్యము ల్బడసి భోగములతో గౌరన యెచ్చోటఁ గలిమిఁ బొదలె

గీ॥ నెచటఁ గవితావధూటి యాడేరి నగల కులుకుతోఁ బ్రౌఢశృంగారముల నటించె
నట్టి రెడ్డి నృపాలరాజ్యప్రశస్తిఁ దలఁప జలుజల్లుమని మేను పులకరించు


# కొండవీడు కోట ప్రదేశం


80°15'24"
80°15'31"
80°15'38"
80°15'45"
80°15'52"
80°15'59"
80°16'06"
16°15'10"
16°15'03"
16°14'56"
16°14'49"
16°14'42"
16°14'35"
1:7000
FORT AREA :75.48 Ha
CIRCUMFERENCE 4072.83 Rmt
VALLEY
BASTION
BASTION
LAKSHMI DEVI TEMPLE
BUNGLOW
MIRIYALA DOUTH
MANTAPAM
VARALAKOTTU
GURRAPU SALA
GURRAPU SALA
NETHIKOTTU
BASTION
BASTION


# కొండవీటి రెడ్డిరాజ్యాల పటములు




# కొండవీటి రెడ్డిరాజ్యం


కోస్తా ఆంధ్ర
కళింగ గాంగరాజ్యం
N
గోదావరి
వరంగల్లు
గోలకొండ
రాచకొండ
దేవరకొండ
రాజమహేంద్రవరం
గణపేశ్వరం
వేమవరం
కొండవీడు
కృష్ణానది
శ్రీశైలం
నకరికల్లు
అద్దంకి
మోటుపల్లి
పూర్వ సముద్రం
ప్రోలయ వేమారెడ్డి పాలించిన ప్రాంతము
(క్రీ.శ. 1325 - 1353)


# కొండవీటి రెడ్డిరాజ్యం


కోస్తా ఆంధ్ర
కళింగరాజ్యము
గోదావరి
ఇంద్రావతి
వరంగల్
శ్రీకాకుళం
సింహాచలం
గోల్కొండ
ద్రాక్షారామం
రాజమహేంద్రవరం
వెలమల రాజ్యం
దేవరకొండ
కొండవీడు
వేంగి
పాలకొలు
అమరావతి
మోటుపల్లి రేవు
పూర్వ సముద్రం
కందుకూరు
నెల్లూరు
విజయనగర సామ్రాజ్యం
N
అనపోతారెడ్డి పాలించిన ప్రాంతము
(క్రీ.శ.1353 – 1364)


# కొండవీటి రెడ్డిరాజ్యం


కోస్తా ఆంధ్ర
N
కళింగ గాంగరాజ్యం
గోదావరి
వరంగల్లు
గోలకొండ
రాచకొండ
వాడపల్లి
దేవరకొండ
కొండవీడు
కృష్ణ
ఎలమంచిలి
సింహాచలం
పిఠాపురం
కోరుకొండ
రాజమహేంద్రవరం
నిడదవోలు
ద్రాక్షారామం
వానపల్లి
శ్రీశైలం
అద్దంకి
దివి
మోటుపల్లి
కందుకూరు
పూర్వ సముద్రం
అనవేమారెడ్డి పాలించిన ప్రాంతము
(క్రీ.శ.1364 – 1386)
విజయనగర సామ్రాజ్యం

# కొండవీటి రెడ్డిరాజ్యం


కోస్తా ఆంధ్ర
కళింగము
బహమనీరాజ్యం
వెలమరాజ్యం
కొండవీడు
రాజమహేంద్రి
విజయనగరరాజ్యం
తూర్పు సముద్రం
N
కుమారగిరిరెడ్డి పాలించిన ప్రాంతం
(క్రీ.శ.1386 – 1402)

# కొండవీటి రెడ్డిరాజ్యాలు



# శ్రీశైలం

శ్రీశైలం గూర్చి చెప్పుకోకుండా రెడ్డిరాజ్యాల చరిత్ర తెలుసుకోవటం పూర్తికాదు. శ్రీశైలం కర్నూలు జిల్లా ఆత్మకూరు తాలూకాలోని నల్లమల కొండలలోంచి పారే కృష్ణానది ఒడ్డున ఉన్నది. ఇది సముద్రమట్టానికి 476 మీటర్ల ఎత్తున ఉన్నది. ఇది గొప్ప శివక్షేత్రం. ఈక్షేత్రంలో శ్రీమల్లికార్జునుడు – భ్రమరాంబాదేవి వేంచేసి ఉంటారు. ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక జ్యోతిర్లింగ క్షేత్రం ఇది. రాష్ట్రకూట, చాళుక్య హోయసాల, కాకతీయ, రెడ్డి, విజయనగర పాలనలో శ్రీశైలం స్వర్ణయుగాన్ని చూసిందటారు. అప్పట్లో శ్రీశైలాన్ని "శ్రీపర్వతం" అని పిలిచేవారంటారు. శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణ కాలం గురించి ఖచ్చితమైన సమాచారం లేదు. అయితే కాకతీయ సామ్రాజ్యం వెలసిన తర్వాత శ్రీశైలం ప్రవర్ధమానమైందట. శ్రీశైలంపై ఆధిపత్యం కోసం కొండవీటి రాజులు, రాచకొండ వెలమలు, విజయనగర రాజులు పోటీపడ్డారు. శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవాలయానికి గల నాలుగు గోపురాలలో తూర్పు గోపురం కృష్ణదేవరాయలు నిర్మించాడని ఉతరపు గోపురం శివాజి నిర్మించాడని, దక్షిణపు గోపురం హరిహరరాయలు కట్టించారని, పడమర గోపురం దేవస్థాన పరిపాలకులే కట్టించారని చరిత్ర చెబుతుంది. రెడ్డిరాజు అనవేమారెడ్డి కాలంలో అచట వీరశిరోమండపం క్రీ.శ. 1378లో నిర్మించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. ప్రోలయ వేమారెడ్డి శ్రీశైలం వద్ద కృష్ణ – పాతాళగంగ నుండి మల్లికార్జునుని పాదాల వరకు మెట్లు కట్టించాడు. అనపోతారెడ్డి శ్రీశైలంలో కొన్ని సోఫానాలు నిర్మించాడు. అనవేమారెడ్డి కొన్ని సోఫానాలు కట్టించినట్లు మన్యమాపుర శాసనం బట్టి తెలుస్తుంది. పెదకోమటి వేమారెడ్డి చుట్టూ ఉన్న కొండలలో యతులైన సన్యాసులకు మఠాలు ఏర్పరచాడని మెకంజీ శ్రీశైలం కైఫీయత్‌లో వుంది. మల్లికార్జున ఆలయ దక్షిణ ద్వారం నుండి శిఖరేశ్వరం వరకు కాటయ వేమారెడ్డి తనప్రభువు – బావ కుమారగిరిరెడ్డి పుణ్యార్థం మెట్లు నిర్మించాడని క్రీ.శ. 1405 శిలా శాసనం వలన తెలుస్తుంది.

శ్రీశైలంకు తూర్పు ద్వారం త్రిపురాంతకం. త్రిపురాంతకం చాల కీలకమైన స్థానమై ఉన్నది. వ్యాపార, రవాణా మార్గాలకు అనువైన ప్రదేశంగా భావించి ప్రోలయ వేమారెడ్డి తన పరిపాలన మొదటి రోజుల్లోనే సోదరుడు అన్నారెడ్డి, కుమారుడు అనపోతారెడ్డి సహకారంతో ఈ ప్రాంతాన్ని జయించారు. త్రిపురాంతకేశ్వరునికి దానాలనిచ్చాడని త్రిపురాంతకంలోని శాసనం తెలుపుతుంది. త్రిపురాంతకంలో త్రిపురాంతకేశ్వరుడు కుమారగిరిపై (కుమాచలంపై) వేంచేసి వున్నారు. అనపోతారెడ్డికి బహుకాలంగా సంతానం కలగలేదు. త్రిపురాంతకేశ్వరుని నమ్ముకుని పూజలు, ప్రార్థనలు చేయగా కుమారుడు కలిగాడు. కుమారగిరిపై వేంచేసి వున్న త్రిపురాంతకేశ్వరుని కరుణ వలన కుమారుడు కలిగినందుకు కుమారునికి కుమారగిరి రెడ్డి అని పేరు పెట్టుకున్నాడని కొందరు చరిత్రకారులు, స్థానికుల అభిప్రాయం.

శ్రీశైలం శాసనం అనవేమారెడ్డిని “రాజ్యశ్రీ రమణీ స్వయంవరపతి శ్రీయనవేమ ప్రభుః” అని కీర్తించింది. అంతేకాక “దీవి దుర్గ విభాళ”, “రాజమహేంద్ర నిరవద్య నగరాది బహువిధ స్థలదుర్గ విదళన బలరామ”, “సాగర గౌతమీ సలిల సంగమ సకల జలదుర్గ సాధన రఘురామ” అనికూడ ప్రస్తుతించింది. అనవేమారెడ్డి శ్రీశైల దేవస్థానంలో అయ్యవారికభిముఖంగా(శనగల) బసవన్న విగ్రహాన్ని స్థాపించారు.


శివరాత్రి ప్రాముఖ్యాన్ని తెలుపుతూ శ్రీనాథునిచే శివరాత్రి మహాత్మ్యంను రచింపజేశారు. మహాశివరాత్రికి శ్రీశైలంలో జరుగు వివిధ ప్రదర్శనలు, నృత్యాలు, సంగీత కార్యక్రమాలను పాల్కురికి సోమన తన పండితారాధ్య చరిత్రలో వివరించాడు. శ్రీనాథుని కాశీఖండంలో కూడ రెడ్డిరాజుల శివపూజలు, ఆ సమయంలోని నృత్యాలు వర్ణించబడ్డాయి. మల్లికార్జున పండితారాధ్యులు, నన్నెచోడుడు కూడ 12వ శతాబ్దంలో తమ రచనల్లో లోతుగా ప్రస్తావించారు.

ఈ ప్రకారం రెడ్డిరాజుల కాలంలోని శాసనాలు, సాహిత్యం రెడ్డిరాజులకు శ్రీశైలానికి గల సంబంధం బంధాలను వివరిస్తాయి. అంతేకాక స్కాంధ, వాయు, బ్రహ్మాండ, మత్స్య పురాణాలలోనూ శ్రీశైల ప్రస్తావన వున్నది. విదేశీయులైన కాంబోడియా, ఇండోచైనా వారల గ్రంధాలలోనూ ఉన్నది. క్రీ.శ. 4, 5 శతాబ్దాల పూర్వచరిత్ర శ్రీశైలంకు కలదు. భారత రామాయణాది ఇతిహాసాలలో శ్రీశైలం ప్రస్తావన ఉన్నది.

పురాణాలలో చెప్పబడ్డ 12 జ్యోతిర్లింగాలలో ఒకటి శ్రీశైలంలో గలదు. ఇది శ్రీమల్లికార్జున లింగం. 18 మహాశక్తులలో ఒకటి శ్రీభ్రమరాంబాదేవి శ్రీరాముడు సీతాదేవితో అరణ్యవాసం చేసేటపుడు సీతమ్మవారు ఒక సహస్రలింగాన్ని శ్రీశైలంలో ప్రతిష్టించినట్లు చరిత్ర చెబుతుంది. ఆలాగుననే పాండవులు వనవాస సందర్భంలో శ్రీశైలంలో సహస్రలింగాన్ని ప్రతిష్టించారని చరిత్ర చెబుతుంది. 18 పురాణాలలో, సంస్కృత తెలుగు సాహిత్యంలో శ్రీశైల ప్రాముఖ్యతలు వ్రాయబడ్డాయి. చరిత్రను పరిశీలిస్తే శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, విష్ణుకుండినులు, కదంబులు, చోళులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డి రాజులు శ్రీశైల ప్రాంతాన్ని పాలించి శ్రీశైల మల్లికార్జునుని, భ్రమరాంబాదేవిని సేవించినట్లు తెలుపబడింది. శంకరాచార్యులవారు ఇక్కడ తపస్సు చేసుకొని మల్లికార్జునుని సేవించాడని సాహిత్యం చెబుతుంది.

పాల నీడిగింట గ్రోలుచు నుండెనా
మనుజుడెల్ల గూడి మద్యమండ్రు
నిలువఁ దగనిచోట నిలువ నిందలు వచ్చు
విశ్వదాభిరామ వినురవేమ.

తామసించి చేయఁదగ దెట్టి కార్యంబు
వేగిరింప నదియు విషమగును
బచ్చికాయఁ దెచ్చి పండింప ఫలమౌనె
విశ్వదాభిరామ వినురవేమ.



మిరియాల చట్టు బురుజు,
కొండవీడు



నెమళ్ళ బురుజు,
కొండవీడు



పశ్చిమ ద్వారం
(కూలిపోక ముందు),
కొండవీడు



నేతి కొట్టు,
కొండవీడు



గుప్త నిధి వేటగాళ్ళ
దుశ్చర్యల వల్ల
కూలిపోయిన శివాలయం,
కొండవీడు




కొండవీడు గ్రామం
పొలాలకే అందం నంది
విగ్రహం
క్రీ.శ. 16వ శతాబ్ది



గోపీనాథ్ దేవాలయం,
కొండవీడు



యజ్ఞ మండపం
అమీనాబాద్



మిరియాల చట్టు బురుజు,
కొండవీడు



మూలగూరమ్మ గుడి, అమీనాబాద్



మూలగూరమ్మ గుడి మండప స్తంభం,
అమీనాబాద్



మూలగూరమ్మ అమ్మవారి విగ్రహం
అమీనాబాద్



వసంతరాయ మండపం,
సర్పవరం
క్రీ.శ. 14 – 15 వ శతాబ్ది

నాట్య మండపం
అవశేషాలు,
కొండపల్లి






కుమారాద్రి, త్రిపురాంతకం దూరం నుంచే యాత్రికులను ఆకర్షిస్తోంది



శివ ద్వారపాలకుడు, కొండపల్లి
14 – 15 వ శతాబ్ది



అయ్యవారికి అభిముఖంగా ఆసీన భంగిమలో కొలువుతీరిన శనగల బసవన్న
క్రీ.శ. 14వ శతాబ్ది (అనవేమారెడ్డి మలిపించినది)




గుర్రాల శాల, కొండవీడు



కుంభపంజర స్థంభాల గోపీనాథాలయం
కొండవీడు




గోపీనాథాలయ ముఖమండపం క్రీ.శ. 16వ శతాబ్ది






కత్తులబావిగా పేరుగాంచిన
గోపీనాథ దేవాలయం
కొండవీడు

కొండవీటి కోట
తూర్పు ద్వారం





శివాలయంలోని
ఏడుగురు
అక్కచెల్లెళ్ళు
అద్దంకి



శివాలయంలోని నంది

అద్దంకి



వేయి స్తంభాల గుడి
అద్దంకి



నిరాధార స్థూపము
కొండవీడు
(చరిత్ర లభ్యం కాలేదు)



కాకతీయుల గణపతి దేవుని మోటుపల్లి శాసనం స్తంభం పడమర వైపు



కాకతీయుల గణపతి దేవుని మోటుపల్లి శాసనం స్తంభం దక్షిణం వైపు



కాకతీయుల గణపతి దేవుని మోటుపల్లి శాసనం స్తంభం తూర్పు వైపు



కాకతీయుల గణపతి దేవుని మోటుపల్లి శాసనం స్తంభం ఉత్తరపు వైపు



అనపోతారెడ్డి మోటుపల్లి శాసనం
స్తంభం తూర్పు పలక



అనపోతారెడ్డి మోటుపల్లి శాసనం
– స్తంభం ఉత్తరపు పలక



అనపోతారెడ్డి మోటుపల్లి శాసనం
స్తంభం పడమర పలక



మల్లవరం శాసనం



మోటుపల్లి లోని ఉత్తరముఖంగా గల వీరభద్ర దేవాలయం



మోటుపల్లి వీరభద్రాలయం ముందు
నంది మండపం



మోటుపల్లి వీరభద్రాలయ గోడలపైని
శిల్పాలను పరిశీలస్తున్న సేకర్త



మోటుపల్లిలోని రామాలయం



మోటుపల్లిలోని రామాలయం
ముందున్న మండపం –
ఈశాన్య స్తంభంపై
నాగేంద్రునితో సహా



మోటుపల్లి రామాలయం
వద్ద ఇసుక తిన్నెలపై
పెట్టి వున్న రామ,
లక్ష్మణ, సీత విగ్రహాలు



మోటుపల్లిలోని రామాలయం అభిముఖంగా నమస్కరిస్తున్న గరుడుని విగ్రహం



గణపతిదేవుడు వేయించిన శిలాశాసనం, మోటుపల్లి పంక్తులు (149 నుంచి 173 వరకు)



మోటుపల్లి రామాలయం వద్ద ఇసుక దిబ్బలలోని నాగేంద్రుని శిలా విగ్రహం



మోటుపల్లి రామాలయం ముందు స్తంభాల మంటపానికి ఆనించి పెట్టిన చక్రాకారంలో చెక్కిన పద్మం




మోటుపల్లి కోదండ రామాలయం ముందున్న మండపం



మోటుపల్లి వీరభద్రాలయం ముందు
మండపంలోని నంది విగ్రహం.
దీనిని 12-12-16 అర్థరాత్రి విగ్రహం దొంగలు
తరలించుకు పోయినట్లు పోలీసు సమాచారం
(దొరికినది - చినగంజాం
పోలీస్ స్టేషన్లో ఉన్నది)




మోటుపల్లి రామాలయం ముందు స్తంభాల
మంటపంలో పెట్టి వున్న హిరణ్య కశిపుని పొట్ట
చీలుస్తున్న నరసింహస్వామి విగ్రహం



మోటుపల్లి రామాలయం వద్ద ముఖ మండపం అరుగుపై చెక్కబడిన పులి జూదం ఆట చెక్కుళ్ళు



మోటుపల్లి రామాలయం వద్ద ముఖ మండపం అరుగుపై చెక్కబడిన దాడి ఆట చెక్కుళ్ళు



మోటుపల్లి రామాలయం వద్ద నున్న 6/7 శతాబ్దాల నాటి బావి

# రెండవ భాగము

# గోన బుద్ధారెడ్డి

(గోన గన్నారెడ్డి)



అద్దంకి, కొండవీడు రాజుల కంటే సుమారు శతాబ్దం ముందు వారు గోన వంశజులు. కాకతి రాజుల సామంతులలో గోన వంశజులు సుప్రసిద్ధులు.

## గోన బుద్ధారెడ్డి

గోన వంశీయులు రెడ్డికుల సంజాతులు. బలపరాక్రమ సంపన్నులు. కాకతి రుద్రదేవుని సేనా నాయకులుగా వుండి అనేక యుద్ధాలలో కాకతి రుద్రదేవునికి విజయాలను చేకూర్చారు.

రుద్రదేవునకు బుద్ధరాజు @ బుద్ధారెడ్డి చాల విధేయుడు. ప్రియమైనవాడు. ఒనరించిన మేలునకు అభిమానంగా బుద్ధారెడ్డిని తన రాజ్యంలోని కందూరునాడునకు పాలకుడుగా నియమించాడు రుద్రదేవుడు. తత్పూర్వము కందూరు రాజ్యం భీమదేవ చోడుని క్రింద వుండెడిది. ఆతనిని జయించి రుద్రదేవుడు కందూరు రాజ్యానికి బుద్ధారెడ్డిని పాలకుని చేశాడు. ఆ యుద్ధంలో ఆ రాజ్య రాజధాని వర్ధమానపురము ధ్వంసమై పోయింది.

బుద్ధారెడ్డి కాకతి సామ్రాజ్యంలో మహాసామంతాధిపతి పదవిలో నియమించ బడ్డాడు. కాకతి సామ్రాజ్య పశ్చిమ సరిహద్దులను కాపాడు బాధ్యతలు కూడ బుద్ధారెడ్డి కప్పగించబడ్డాయి. తరువాత జరిగిన యుద్ధాలలో కూడ రుద్రదేవుని విజయాలకు కారకుడైన శూరాగ్రేసరుడైనాడు బుద్ధారెడ్డి. పరిపాలనలో, యుద్ధాలలో బుద్ధారెడ్డి ముఖ్యపాత్ర వహించాడు.

కాకతి రుద్రదేవుని దండయాత్రలో శిథిలమైన వర్ధమాన పురమును బుద్ధారెడ్డి పునర్నిర్మించాడు. అనేక భవనాలను, రాజాంతఃపురాలను, రాణివాసపు భవనాలను, మంత్రి, సామంత, దండనాయక, ప్రభుత్వాధికారుల, సైనికుల నివాస గృహాలను నిర్మించాడు. శిథిలమైన శివాలయాన్ని ఇతర దేవాలయాలను, బావులను, పునరుద్ధరించాడు.

బుద్ధారెడ్డి దైవభక్తిపరుడు. శ్రీరాముని ఆరాధిస్తాడు. స్వయంగా కవి, రచయిత. శ్రీరాముని కరుణ వలన ద్విపదలో రంగనాథ రామాయణమును వ్రాసి తెలుగు సాహిత్య చరిత్రలో సముచిత స్థానమాక్రమించి వున్నాడు. ఆ గ్రంథమిప్పటికీ ముద్రణలు, పునర్ముద్రణలు పొందుతున్నది. నేటి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి హైదరాబాదులో తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా వున్న 1989 సంవత్సరంలో తెలుగు విశ్వ విద్యాలయం ద్వారా రంగనాథ రామాయణం గ్రంథాన్ని పునఃప్రచురణ చేయిస్తూ "రంగనాథ రామాయణము తెలుగు సాహిత్యలో మణిపూసగా భాసించే కృతి. తెలుగులో వెలువడిన రామాయణాల్లో ప్రథమస్థానం వహించేది ఈ మహాగ్రంథమే" అని ప్రస్తుతించాడు. దీనికి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం పీఠిక వ్రాస్తూ "ఈ రామాయణమును రచించిన కవి గోన బుద్ధారెడ్డి. తన తండ్రి విట్ఠల ధరణీశుని పేర దీనిని వెలయించి రంగనాథ రామాయణమని పేరిడెను" అని చరిత్రను కూడ చెప్పాడు. ఈ గ్రంథంలో బాలకాండలో కథా ప్రారంభమునకు ముందే బుద్ధారెడ్డి ఇలా వ్రాశాడు. రుద్రదేవుడొకరోజు బుద్ధారెడ్డి తండ్రి విట్ఠల భూపతిని

పిలిచి "తెనుగున" రామాయణమును రచింపజేయుడని చెప్పగా ఎవరిచేత వ్రాయించెదమని ఆలోచన చేయునపుడు, రాజాస్థాన బుధులందరు కవిసార్వభౌముడు, కవికల్పతరువు, కవిలోకభోజుడు, కవిపురంధరుడు, ప్రత్యర్థి రాజన్య బలవజ్రపాణి, పురుష చింతామణి అగు బుద్ధభూవిభుడున్నాడు కదా, ఆయన రామాయణ మర్మ ధర్మజ్ఞుడు కదా ఆయనకాజ్ఞ ఇవ్వమని కోరారు. అపుడు తండ్రి విట్టల భూపతి, బుద్ధ భూపతిని పిల్చి "రామాయణంబు పురాణమార్గంబు తప్పక నాపేర తగ నాంధ్రభాష జెప్పి ప్రఖ్యాతము సేయింపు" మని కోరాడు. అంత తండ్రిపేర శ్రీరామ చరితను "రంగనాథ రామాయణమ"ను పేర పూర్వకాండలను బుద్ధ భూపతి ప్రత్యేక ద్విపద ఛందస్సులో వ్రాశాడు. అలానే ఉత్తరకాండను తన కుమారులు కాచ భూపతి, విట్ఠల భూపతి వ్రాశారు. ఈ కావ్యములోని ఉత్తరకాండను కుమారులు రచించినారని ఉత్తరకాండ ప్రారంభంలో చెప్పుకున్నారు. యీ సోదరులు కూడ తమ తండ్రి బుద్ధ భూవిభుని ఆజ్ఞానుసారము ఉత్తరకాండ రచించినట్లు చెప్పుకున్నారు. విట్ఠలునకు గన్నారెడ్డియని కూడ పేరుండవచ్చునని చరిత్రకారుల, సాహితీకారుల తీర్మానము. గోన బుద్దారెడ్డి సోదరుడు వరదారెడ్డి కూడ కొంతకాలము రాజ్యమేలెను.

ఈ రంగనాథుడు పండరిపురంలో వేంచేసియున్న "పాండురంగ విట్ఠ(ఠ)లనాధు"డేనని తీర్మానించారు చరిత్రకారులు, సాహితీకారులు.

తెనుగునగల రామాయణములన్నింటిలో రంగనాథ రామాయణము మొదటిది. ఇది ద్విపదలో వ్రాయబడ్డ రామాయణం. ఇది వాల్మీకి రామాయణము వలె "పాఠ్యే గేయ చ మధుర" మై పాటగా పాడుకొను సౌలభ్యం గలదిగా యున్నది. పశ్చిమాంధ్రులు సారస్వత మహోత్సవములలో బుద్దారెడ్డికే అగ్రతాంబూలమిచ్చారు. ఆ సీమలో రంగనాథ రామాయణము చదువని అక్షరాస్యుడు కాని, ఒరులు చదువగా వినని నిరక్షరాస్యుడుకాని లేరని ప్రతీతి. ఆ తరువాత వేమన ఒక చిలుకుపైగానే ప్రజాకవి అయాడు. ఇంతటి మహాపురుషులను గన్న రెడ్డికులము ప్రఖ్యాతకులమని చెప్పుటకేమీ కొదువ?

## గోన గన్నారెడ్డి

బుద్దారెడ్డి జ్యేష్ఠ కుమారుడు గన్నారెడ్డి. కనిష్ట కుమారుడు విఠల నరేంద్రుడు గన్నారెడ్డి ఓరుగల్లు కాకతి రుద్రమహారాజునకు అంగరక్షకుడుగా నుండి, వారి ఆజ్ఞానుసారము కందూరు

నాడు వెళ్ళి వర్ధమానపుర రాజ్యపాలనా భారము తీసుకున్నాడు. కాకతి సామ్రాజ్య పశ్చిమ భూభాగముల సంరక్షణ బాధ్యత తీసుకొని ప్రసిద్ధి గాంచాడు. గన్నారెడ్డి రుద్రమదేవి సహాధ్యాయుడై, ఆమెకు సోదరునిగ వ్యవహరించాడు. ఆమె స్త్రీయని, అబలయని సామంతులు, మాండలికులు, సేవుణ, పాండ్య, చోళరాజులు కాకతి రాజ్యమును చులకనగా చూసి రాజ్య భాగములను ఆక్రమించటం ప్రారంభించారు. గన్నారెడ్డి తన సైన్య బలముచే కాకతి రాజ్యమునకు ప్రమాదము లేకుండా కాపాడాడు. కాకతి రుద్రమ తన కుమార్తెను గన్నారెడ్డికిచ్చి వివాహం జరిపించిందని చరిత్ర చెబుతున్నది.

గోన గన్నారెడ్డి సోదరుడు విఠల నరేంద్రుడు. ఈ సోదరులిరువురూ కాకతీయ ప్రభువుకు బద్ధశత్రువులైన యాదవరాజులాక్రమించిన రాజ్యభాగమును తిరిగి సంపాదించి రాయచూరు దుర్గము నాక్రమించారు. వీరిద్దరు హోళువ, మాళువ రాజ్యాలను జయించి కృష్ణ, తుంగభద్ర నదుల నడిమి ప్రదేశమునాక్రమించి, కాకతి సామ్రాజ్యమునకు చేర్చారు. గన్నారెడ్డి పలుచోట్ల దేవాలయాలు నిర్మించాడు. దేవాలయాలకు ధూప దీప నైవేద్యములకు వలయు మాన్యాలను దానాలు చేశాడు.

క్రీ.శ. 1245 – 1246 నాటికి గన్నారెడ్డి పాలన ముగిసినది. యుద్ధములో మరణించినట్లు భావించారు.

ఆ తరువాత అతని బావ (కుప్పాంబిక భర్త) మల్యాల గుండ దండాధీశుడు వర్ధమానపుర రాజ్యపాలకుడుగా క్రీ.శ. 1276 వరకు పాలించి మరణించాడు. ఇంతటితో గోన వంశపాలన ముగిసినట్లు చరిత్ర చెబుతున్నది.

ఈ రెడ్డి రాజులు ఆదిలోనే రెడ్డి జాతికి శుభారంభం చేశారు. వీరు కాకతి రాజ్యము పశ్చిమ ప్రాంతంను ఒక కాపుకాయగా, అద్దంకికి వచ్చిన రెడ్డి రాజులు సామంతులుగా తూర్పు ప్రాంతమును కాపుకాసినారని చెప్పవచ్చును.

ఇట్టి రెడ్డిరాజులు నేటి రెడ్డి కులస్తులకు పూర్వీకులగుట, వారి వారసత్వమును తర్వాతివారు పొందుట గర్వించదగు అంశము.

# నాయకురాలు నాగమ్మ



నాయకురాలు నాగమ్మ తెలుగు గడ్డకు, రెడ్డి జాతికి కీర్తి తెచ్చిన వనిత. "నాయకురాలు" ఆమె బిరుదు. ఆమె చాణక్యుని వంటి ప్రజ్ఞాశాలి. తిమ్మరుసు వంటి ధీశాలి. ఆచంద్రతారార్కము ఆంధ్రులు గర్వించదగు ఆడపడుచు. ఇప్పటికి దొరికిన చారిత్రకాధారాలను బట్టి నాగమ్మ తొలి మహిళామంత్రిణి "మహా మంత్రిణి" అంటారు చరిత్రకారులు.

నాగమ్మ కరీంనగర్ జిల్లా గుచ్చి మండలం, ఆరవెల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి కుమార్తె. పెంపుడు కుమార్తె అని కొందరు చరిత్రకారులన్నారు. వీరజగ్గారెడ్డి కుమార్తె అని ఒకచోట తెలుపబడింది. మేనమామ మేకపోతు సింగారెడ్డికి భార్య. ఆరవెల్లి వారింటి కోడలు. జగ్గారెడ్డికీ మేనకోడలు మరియు వేడుక పుత్రిక అంటారు. మేకపోతుల మల్లారెడ్డి మేనకోడలని కూడ కొందరి రచనలలో ఉన్నది. ఆమెది పంటరెడ్డి వంశం.

ఆరవెల్లి గ్రామ ప్రాంతంలో కరువులు, మశూచి వ్యాధులు ప్రబలుతుండగా రామిరెడ్డి పల్నాడులోని జిట్టగామాలపాడు గ్రామానికి కుటుంబంతో సహా వలస వచ్చాడు. పెండ్లి జరిగిన మూడురోజులకే భర్తను కోల్పోయింది. పునర్వివాహం ఆలోచన చేయలేదు. ఒక చెరువు కోసం భూమినివ్వటానికి రామిరెడ్డి నిరాకరించాడని, బ్రహ్మనాయుడు రామిరెడ్డిని పొందుగల అడవులలోకి లాక్కెళ్ళి చెట్టుకు ఉరితీసి చంపాడని ఒక కథనం ప్రజల్లో వుంది.

ఒక సామాన్య వనిత తన అసామాన్య ప్రతిభతో పల్నాడుకు చెరిగిపోని గుర్తింపు తెచ్చింది. రాజకీయ కోణంలో చూస్తే బ్రహ్మనాయుడు కన్న గొప్పదని చాణక్యుడు చెప్పిన రాజ లక్షణాలన్నీ ఈమెలో మూర్తీభవించినవని చరిత్రకారులు చరిత్ర రాశారు. ఈమె నాయకురాలు, ప్రతి నాయకురాలు పాత్రలను విశిష్టంగా పోషించింది.

వేట ముగించి నల్లమల అడవుల నుండి తిరిగి వస్తున్న అనుగురాజుకు నాగమ్మ ఆతిథ్యమిచ్చి విందు చేసినందుకు మెచ్చి వాగ్దాన వరమీయగా ఏడుఘడియల కాలం మంత్రిపదవి వరం కోరింది. పొందింది. గురజాలలో అనుగురాజు అంతఃపురంతో స్నేహ సంబంధాలు అందిపుచ్చుకుంది. అనుగురాజు మంత్రి దొడ్డనాయుని కుమారుడు బ్రహ్మనాయునికిది ఇష్టంలేదు. సాము గరిడీలు, గుర్రపు స్వారీ, కత్తియుద్ధం నేర్చింది నాగమ్మ. 5 భాషలు నేర్చింది. శైవారాధకురాలు.

అనుగురాజు మరణానంతరం నలగామరాజు పాలనా సమయంలో అనుగు రాజిచ్చిన వరం (పత్రం)తో, నలగామ రాజు కొలువులో శాశ్వత మంత్రిణి అయింది. ప్రజారంజకమైన, శౌర్యవంతమైన పాలన చేసింది. తరువాత కుటుంబంలో వచ్చిన వైరములతో బ్రహ్మనాయుడు అనుగురాజు పట్టమహిషి విజ్జలదేవి మరియు కుమారుడు మలిదేవునితో మాచర్లకు తరలిపోయాడు. నలగామరాజు గురజాల నేలుతున్నాడు.

మాచర్ల x గురజాల కోడిపందెములలో నాగమ్మ "సివంగి డేగ" గెలిచి బ్రహ్మనాయుడు ఓడిపోగా నింద నాగమ్మపై బడింది. పందెం షరతుల ప్రకారం బ్రహ్మనాయుడు ఏడు సంవత్సరాలు మాచర్లను వదలి మండాదికి చేరాడు. షరతులు ముగిశాక మరల నలగామరాజుకు, మలిదేవునకు యుద్ధము రాగా, నాగమ్మ సంధికి ప్రయత్నించగా బ్రహ్మనాయుని కుమారుడు బాలచంద్రుని వలన సంధి చెడి కార్యంపూడిలో పల్నాటి యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో బ్రహ్మనాయుడు గెలిచాడని కొందరు చరిత్రకారులు, నాగమ్మ గెలిచిందని కొందరు చరిత్రకారులు తెలిపారు. ఆ పల్నాటి యుద్ధం క్రీ.శ. 1181-82లలో జరిగినదని చరిత్రకారులు నిర్ధారించారు. ఆ యుద్ధంలో నాగమ్మ గెలిచిందని తిరుపతి, మద్రాసు ప్రాచ్యలిఖిత వ్రాతప్రతుల్లోని అంశాలను బట్టి తెలుస్తుందని ససాక్ష్యంగా నిరూపించారు చరిత్రకారులు.

నాగమ్మ భారత భాగవతాలు చదివింది. నాగమ్మ హయాంలో పల్నాడు బాగా అభివృద్ధి చెందింది. గురజాల ప్రాంతంలో చెరువులను త్రవ్వించింది. గురజాల, అడిగొప్పుల, జూలకల్లు, గుండ్లపల్లి, మిరియాల, జంగమేశ్వరం చెరువు లిప్పటికీ కలవు. నాగులేటికి కారంపూడి వద్ద ఆనకట్ట కట్టించింది. జిట్టగామాలపాడులో చెన్నమల్లికార్జునస్వామి దేవాలయం, గురజాలలో పాతాళేశ్వరస్వామి గుడి, ఇష్ట కామేశ్వరాలయం కట్టించింది. గురజాలలో వీరభద్రాలయం నిర్మించింది. అన్నసత్రాలు, పేదలకు నిరతాన్నదానాలు చేసింది. ఆశ్రితులనాదుకునే సహజ రెడ్డి గుణం ఆమెది. ఆమె దానశీలి, మానవతావాది.

రాణి రుద్రమ్మ, ఝాన్సీ లక్ష్మీబాయి కంటే నాగమ్మ ముందుకాలపు వీరనారి. పల్నాటియుద్ధం తొలి తెలుగు వీరగాథ అని ప్రతీతి. ఎప్పుడు కాలం చేసిందో చారిత్రకాధారాలు లేవు. కాని చివరిలో విరాగియై తిరిగి ఆరవెల్లికి వెళుతూ తన ఆస్తులన్నింటినీ ప్రజలకు పంచిపెట్టిందని ఒక వాడుక ప్రజల్లో వుంది. చరిత్ర అంగీకరించింది. డా॥ మలయశ్రీగారూ తన ఆర్వెల్లి నాయకురాలు గ్రంథంలో అంగీకరించారు.

ఆరవెల్లిలో నాగమ్మ విగ్రహం, మందిరం వున్నది. 5 సంవత్సరాలకొకసారి కొలుపులు జరుగుతాయి. ఆ గుడిలో ఇచ్చే తీర్థాన్ని ప్రజలు వారి పొలాల్లో చల్లుకుంటారు. కార్తీక అమావాస్య రోజున పల్నాటియుద్ధం ప్రారంభమైంది. నేటికీ అదే సమయానికి ప్రారంభించి

5రోజులు వీరోత్సవం చేస్తారు. ఆ వీరోత్సవంలో కారంపూడిలో మరణించిన బ్రహ్మనాయుడి వర్గం వారి ఆయుధాలను పూజిస్తారు. దీనిని "కొణతముల" ఉత్సవం అంటారు. ఆ తరువాత వచ్చే మార్గశిర ఏకాదశి నుంచి బహుళ పాడ్యమి వరకు నాగమ్మ తరఫున పోరాడి మరణించిన వారి స్మృత్యర్థం గురజాలలో ఉత్సవాలు జరుగుతాయి.

నాగమ్మను గూర్చి విభిన్న అభిప్రాయాలతో పలు గ్రంథాలు వెలువడ్డాయి. ఆమె సుగుణవతియని, ధర్మనిరతిగల నాయకురాలని కొందరు గ్రంథాలలో పేర్కొంటే, కుట్రదారుగా, వంచకిగా, హంతకురాలిగా కొందరు చారిత్రకులన్నారు. కాని బెంగుళూరు వాస్తవ్యులు ప్రముఖ వీరగాథా చరిత్రకారులు డా॥ తంగిరాల వెంకట సుబ్బారావు గారు తన గ్రంథం "తెలుగు వీరగాథా కవిత్వము"లో పల్నాటి వీరకథా చక్రము అధ్యాయం-281 పుటలో "నాగమ్మ వీరగాథలలో చెప్పబడినట్లు దుష్టురాలును, నీచురాలును కాదు. ఆమె అనల్పమగు రాజకీయ ప్రజ్ఞ కలిగిన బుద్ధిశాలిని" అని నిర్ద్వంద్వంగా వ్రాశారు. పల్నాటిరాజుల హైహయ వంశం ఈ పల్నాటి యుద్ధంతో ముగిసిందట.

పల్నాటి యుద్ధము, పల్నాటి చరిత్రపై శ్రీనాథుడు, మల్లయ్య, కొండయ్య, పింగళి లక్ష్మీకాంతం, మల్లంపల్లి సోమశేఖరశర్మ, చిలుకూరి వీరభద్రరావు, అక్కిరాజు ఉమాకాంతం, గుర్రం చెన్నారెడ్డి, రాయప్రోలు, యల్.ఐ.యం. ఆచార్య, డా॥ కోడూరు ప్రభాకరరెడ్డి, ముదిగొండ వీరభద్రకవి, వై.హెచ్.కె. మోహన్‌రావు, రెంటాల గోపాలకృష్ణ, కపిలవాయి లింగమూర్తి, తిరుపతి వెంకటలక్ష్మి నరసింహారావు, రావి లక్ష్మీనారాయణ ప్రభృతులు పలు గ్రంథాలు వ్రాశారు.

చిలుకూరి వీరభద్రరావు గారి "నాయకురాలి దర్పము ప్రకారం" యుద్ధావసానం ఇలా జరిగింది.

"యుద్ధమున మలిదేవుని యోధులందరు వీరస్వర్గమును పొందిరి. బ్రహ్మన్న మాత్రము మిగిలి యుండెను. బ్రహ్మన్న నాయకురాలితో యుద్ధము చేయుచుండెను. మలిదేవుడు నాయునితో చేరి నాయకురాలిని ఎదిరించెను. నాయకురాలు ఒక వాడి బాణముచే మలిదేవుని శిరస్సును ఖండించెను. అప్పుడు నాయుడు నిశ్చేష్టుడయ్యెను. తన ఆయుధములన్నింటిని క్రింద పాఱవైచి నాయకురాలికి ఎదురుగా బోయి 'ఓ వీర నాయికాశిఖామణీ! విజయలక్ష్మీ!

లోకరూపిణీ! త్రిలోకసుందరీ! త్రిమూర్తి యాత్మిక వీవు. సంకల్ప సిద్ధురాలవు. మా సేన అంతయు అదరిపోయినది. నా శిరమును కూడా ఖండించుము' అని తలవంచి నిలబడెను. నాయకురాలు తెల్లబోయినది. విచార సూచక స్వరముతో 'బ్రహ్మనాయడా! నీవు ఈ వీరక్షేత్రమగు పల్నాటి పేరు నిలుపుటకై పుట్టిన మహా వీరశేఖరుల కీర్తివల్లికల నీజగంబున సుస్థిరంబులుగా ప్రతిష్ఠించుటకై విష్ణుదేవుని అంశంబున అవతరించిన మహానుభావుడవు. నీ ఎడల నాకు ద్వేషము లేదు. నిన్ను జయించుట నా తరము కాదు. ఇది అంతయు కాలవశమున జరిగినది. నేనే ఓడిపోయితిని. నన్ను క్షమింపుము. నా శిరము ఖండించి నలగామరాజుకు మహామంత్రివై కీర్తి గాంచుము అని నుడివినది. అప్పుడు బ్రహ్మనాయుడు 'నేను నిరాయుధురాలైన స్త్రీని నిర్జించెదనా? నీదే విజయము. పల్నాటిని పాలించగల సామర్థ్యము నీకే కలదు' అని బదులు చెప్పెను. ఇంతలో నలగామరాజు అచటికి వచ్చి పట్టపుటేనుగును దిగి పాదచారియై బ్రహ్మనాయనికి పాదాభివందనము గావించెను. నాయడు 'శుభమస్తు' అని దీవించెను. నాయకురాలిని, బ్రహ్మన్నను ఇరువురిని కూడా తన ఏనుగుపై ఇరువంకల కూర్చుండ జేసుకొని రణరంగము నుండి రాజధాని చేరెను. నిరాడంబరముగా, నిరుత్సాహముగా, నిశ్శబ్దముగా ఆ రాత్రి రెండు జాములకు వారు గురజాల ప్రవేశించిరి." (చూ: డా॥ కోడూరు ప్రభాకరరెడ్డి గారి "పల్నాటి భారతము" పుట 197).

నాగమ్మ శాంతిదూతయని వై. హెచ్.కె. మోహన్‌రావు తేల్చారు. ఈయన ప్రొ. తంగిరాల వెంకట సుబ్బారావు గారితో అంగీకరించారు. కొందరు రచయితలు బ్రహ్మనాయనికి, బాలచంద్రునికి దైవాంశను ఆపాదించినట్లు తమ శాంతిదూత నాయకురాలు గ్రంథంలో రాశారు.

రాయప్రోలు వారు "కాలమా! మాదు నాయకురాలి వంటి బిడ్డనేదేశమందైన బెంచినావె" అంటూ పొంగిపోయాడు.

ఇట్టి ఘనచరిత్రగల రెడ్డివనిత నాగమ్మ రెడ్డికులానికి చెందటం రెడ్డికులానికే వెలుగునిచ్చింది.

పెద్ద చదువు లేదు పేరు బొత్తిగ లేదు
బుధులు మెచ్చదగిన బుర్ర లేదు
కాని ... కలదు నాకు కనులున్న హృదయము
మహిత వినయశీల! మల్లెమాల!!

రేనాటి సూర్యుడు

# ఉయ్యాలవాడ నారసింహారెడ్డి

(స్వాతంత్ర్య యోధుడు)



మరణం : 22-2-1847

**నారసింహారెడ్డి 19వ శతాబ్ది పూర్వార్థంలో**
**రాయలసీమనేలిన మహావీరుడు - రాయలసీమ సింహము.**

రెడ్డి జనాభ్యుదయ సంఘం - ఒంగోలు

నారసింహారెడ్డి తండ్రి పెదమల్లారెడ్డి – ఉయ్యాలవాడ జాగీర్దారు. తాత చెంచుమల్ల జయరామిరెడ్డి – నొస్సంకోట జాగీరార్దు. నారసింహారెడ్డి తల్లి సీతమ్మ అని, భార్య సిద్దమ్మ అని ఆ జాగీర్లలో రెడ్డి కులాన్నాశ్రయించి జీవించే జానపద వృత్తి గాయకులైన పిచ్చిగుంట్ల వద్దగల వంశ వృక్షంలో వుంది. పేరా వారి వంశస్తులని వుంది. నారసింహారెడ్డి ఇంటిపేరు 'మద్దెల' వారని 'మజ్జారి' వారని, 'మద్దెల' వారి ఇంటినుండి పేరావారింటికి దత్తు వచ్చినాడని స్థానిక చరిత్రకారుల చరిత్ర శకలాల్లోవున్నదని బండి గోపాలరెడ్డి బ్రౌన్ జాబుల ఆధారంగా తెలిపారు.

నారసింహారెడ్డి రూపనగుడి గ్రామంలో పుట్టాడని, ఉయ్యాలవాడ గ్రామంలో పెరిగి పెద్దవాడయ్యాడని ఆ కారణం వలన ఉయ్యాలవాడ నారసింహారెడ్డి అని ఆయనకు పేరు స్థిరపడిందని గాథలు చెబుతున్నాయి. ఆయన మోటాటి శాఖకు చెందినవాడు. మోటాటి రెడ్లలో కూడ రాజవంశంలోని వాడు. ఆయనను దొరవారి నరసింహారెడ్డి, రాజా నరసింహారెడ్డి అని కూడ పిలిచేవారు. వీరు 66 గ్రామాలకధిపతులు. కోటలో నివాసం.

ఆంగ్లేయులు (దత్తమండలాల కలెక్టరు సర్. థామస్ మన్రో (1800–1807) వీరి భూములను, కోటలను, 66 గ్రామాలను వశం జేసుకుని, తండ్రి మల్లారెడ్డికి నెలకు డెబ్బై రూపాయలు తవర్జీ అంటే భరణం ఇచ్చేవారు. వీరి తాత జయరామిరెడ్డి జమేదారును వశం జేసుకొని నెలకు వెయ్యిరూపాయలు తవర్జీ ఇచ్చేవారు. జయరామిరెడ్డి కొడుకు నారసింహారెడ్డి మరణించాడు. తరువాత ఆయన ఉయ్యాలవాడ నారసింహారెడ్డిని దత్తు తీసుకున్నాడు. కాని బ్రిటీషువారు దత్తుకుమారునికి తవర్జీని ఇవ్వటానికి నిరాకరించారు.

ఉయ్యాలవాడ జాగీర్దారు అన్నదమ్ముల పంపకాలలో క్రమంగా తగ్గుతూ వచ్చి నారసింహారెడ్డి కాలానికి ఆయనకు తవర్జీ నెలకు 11 రూపాయల 10 అణాల 8 పైసలైంది. నారసింహారెడ్డి 1846 సంవత్సరం మే నెలకు రావలసిన 11 రూ.10 అ: 8 పై: తవర్జీని ఇవ్వవలసిందిగా జూన్ నెలలో ఒక మనిషిని లేఖ వ్రాసియిచ్చి కోవెలకుంట్ల తహశీల్దారు వద్దకు పంపాడు (తన కుమారుడైన పెదసుబ్బయ్యను పంపినాడని కొందరు చెపుతారు). తహశీల్దారు తవర్జీ ఇవ్వకపోవటమే కాకుండా నారసింహారెడ్డిని అవహేళన చేశాడు. "ఆ

నరసింహ దాసరి క్రింద ఇంకో దాసరా? ఆ నరసింహ దాసరినే రమ్మను పో" అన్నాడట. అంతేకాక తే.3-7-1846న పట్టుకు రమ్మని అరెస్టు వారంటిచ్చాడు. తహశీల్దారు మరొక 100మంది పాలెగాళ్ళకు కూడ వారంట్లు యిచ్చాడు. నొస్సం జమేదారుకివ్వవలసిన తవర్జీ తనకు ఇవ్వక నిరాకరించటం, తన తవర్జీ తాను వస్తేనే ఇస్తాననటం నారసింహారెడ్డికి కోప కారణాలై "రేపు మధ్యాహ్నం పన్నెండు గంటలకు నరసింహ దాసరే నీ దగ్గరకు వస్తాడు కాసుకో" అని అదే వ్యక్తి చేత తహశీల్దారుకి కబురు చేశాడు. అప్పటికే బ్రిటీషు వారిపై వ్యతిరేకతలు రూపుదిద్దుకుంటున్నాయి. ఇది బ్రిటీషు వారిపై ప్రధమ సాయుధ తిరుగుబాటు,

ఆ మర్నాడు అనగా 10-7-1846 తేదీన నారసింహారెడ్డి 700మంది బోయసైన్యాన్ని సమకూర్చుకొని పట్టపగలు కోయిలకుంట్ల పట్టణంపై దండెత్తాడు. ప్రసిద్ధ చరిత్రకారుడు బండి గోపాలరెడ్డి పరిశోధనల ప్రకారం నారసింహారెడ్డి , తన సైన్యం ట్రెజరీపై బడి కాపలా వున్న బొందెలవాడు వారసింగును చంపి, దానిని దోచుకొని, కచేరీ అంతా తగలబెట్టి, తహశీల్దారు శిరస్సును, వారసింగు శిరస్సును తీసుకొనిపోయి నొస్సం దగ్గరున్న నయనాలప్ప కొండమీద శివాలయంలో ఒక గుహలో దాచిపెట్టాడు. ఆ ముట్టడిలో ఆనాడు ట్రెజరీలోవున్న 805 రూపాయల 10 అణాల 4 పైసల డబ్బును ఊడ్చుకొని పోయాడు.


అయితే ప్రభుత్వ రికార్డులలో నారసింహారెడ్డి తహశీల్దారును చంపలేదని బందీగా మాత్రం తీసుకున్నాడని, ఆ తహశీల్దారు రాఘవాచార్యులనే బ్రాహ్మణుడని, డఫేదారుని, ఐదుగురు పోలీసు బంట్రోతుల్నీ చంపినాడని ఉన్నది.

అపుడు కాక్రేన్ అనునతను కడపకు ఆక్టింగ్ కలెక్టరు. ఈయనకు సమాచారం వచ్చింది పోలీసు బలగాల ద్వారా వెతుకులాట మొదలు పెట్టించాడు. చివరకు నయనాలప్ప కొండపై గుహలోని శిరస్సులను కనుగొన్నారు. నారసింహారెడ్డి కోసం పోలీసులను ఉయ్యాలవాడ పంపగా వారిని నారసింహారెడ్డి చితకబాది పంపాడు.

కొద్దిరోజులలోనే నారసింహారెడ్డికి 9000 సైన్యం తయారైంది. కోటలు అప్పటికే ఉన్నాయి. సైన్యంలో కట్టుబడివారు, చెంచులు, బోయలు, వడ్డెరలు, యానాదులు, బ్రాహ్మణులు ఉన్నారు. ఇతర జమీందారుల సైన్యం కూడ తోడై సహాయం ప్రకటించారు. ఈ తిరుగుబాటును

అణచి వేయటానికి బ్రిటిష ప్రభుత్వం కడప, కర్నూలు, బళ్ళారి, కంభం, సికింద్రాబాదు నుంచి సైన్యాన్ని పిలిపించారు.

23-7-1846 తేదీన బ్రిటీషు సైన్యానికి, నారసింహారెడ్డి సైన్యానికి గిద్దలూరు వద్ద ఘోరయుద్ధం జరిగి ఇరువైపుల సైన్యం నష్టమై చీకటి పడినందున బ్రిటీషు సైన్యాన్ని నడుపుతున్న లెఫ్టినెంటు వాట్సన్ తన సైన్యంతో సెట్టివీడుకు పోయాడు. నారసింహారెడ్డి సైన్యంతో ముండ్లపాడు పోయాడు.



మర్నాడు బ్రిటీషు సైన్యాలు ముండ్లపాడు వద్ద నారసింహారెడ్డి సైన్యంతో తలపడ్డాయి. భారీ సైన్యనష్టం ఇరువైపుల జరిగింది. నారసింహారెడ్డి కంభం తహశీల్దారు జంగంరెడ్డి శ్రీనివాసరావును చంపి సైన్యంతో కొత్తకోటకు చేరాడు. ఎవరికీ దొరకలేదు. ఆంగ్లేయులు నారసింహారెడ్డి కుటుంబ సభ్యులను బంధించి కడపకు చేర్చారు. పట్టుబడిన సైనికుల ద్వారా నారసింహారెడ్డి ఆచూకీ కూపీ తీశారు. ఆయన ఎర్రమల-నల్లమల కొండల మధ్య పేరుసోమల కొండలలో గల జగన్నాథ దేవాలయంలో ఉన్నాడని తెలుసుకున్నారు. ఆయన వంటమనిషి ఉంపుడు కత్తె జానకమ్మకు లంచమిచ్చినట్లు కూపీ లాగినట్లు ప్రాంతీయుల సమాచారం. కాని అది నిజం కాదని తేలింది. 6-10-1846 తేదీన కలెక్టరు కాక్రేన్

మిలిటరీని ఆ కొండ చుట్టూ పెట్టి కాల్పులు జరిపి, బోయసైన్యాన్ని చంపి నారసింహారెడ్డిని బంధించాడు. ఆ సమయంలో నరసింహారెడ్డి కుమారుడు మల్లారెడ్డి సమక్షంలో ఉన్నాడు.

నారసింహారెడ్డి మీద, మరి 900మంది మీద నేరం మోపి కోర్టులో విచారణ చేశారు. 9-1-1847న 112మందికి 5 ఏళ్ళ నుండి 14 ఏళ్ళదాకా ఫౌజుదారీ అదాలత్ - నం.11 కోర్టు కఠిన శిక్షలు వేసింది. కొందరికి ద్వీపాంతర శిక్ష వేశారు. విప్లవ నాయకుడు నారసింహారెడ్డికి 9-1-1847 తేదీన ఉరిశిక్ష విధించారు. తలను తూకువానుకు వ్రేలాడదీయమని తీర్పు చెప్పారు. 6-2-1847న గవర్నరు ఆమోదముద్ర వేశారు.




## నారసింహారెడ్డి ఉరిశిక్ష తీర్పు

O.R., Vol. 113

**Sentence of the Foujdaree Udalat No.11 on the Calendar of the Special Commissioner of Cuddapah for 1846.**

**9th January 1847**

Prosecutor Circar
Prisoner Majjaree Narasimha Reddy
(Seal of the Court)

The Court of Foujdaree Udalat on a deliberate consideration of all the circumstances of the case in evidence before them being of opinion that the

proof against the prisoner "MAJJARE NARASIMHA REDDY" is sufficient to convict him of the crime of Rebellion, Murder and Robbery, do convict him there of; and under the provisions of Sec.2 Regulation 1 of 1834, and section 10 of Regulation VIII of 1802, sentence him to suffer death by being hanged, so soon as conveniently as can be after the receipt of this warrant, at a spot to be selected by the authorities of the District **near the town of Koilkuntla** and his body to be subsequently suspended in chains on a high gibbet to be erected on the said sopt.

Adverting to para 12 of the Special Commissioner's letter, the Court of Foujdaree Udalat beg leave to recommend to Government that either the Magistrate of Cuddapah or one of his Assistants be instructed to select the spot on which the capital sentence (if sanctioned by Government) shall be carried into effect and likewise to be present at and superintend the execution. The Court of Foujdaree Udalat direct that their sentence in trial No.11 from the Special Commissioner together with the whole of the proceedings held in the case, be transmitted to the Officiating Secretary to Government in the Judicial Department, for the purpose of being laid before the Most Noble the Governor-in-Council, to the intent that the court may, in conformity with the provisions of Section 5 of Regulation XX of 1802, Regulation 1 of 1834, and Section 5 of Act V of 1841, receive the orders of Government before they direct their sentence to be carried into execution.

True Extract
Sd/- J.H.Davidson
Registrar
9th January 1847

*(డా॥ తంగిరాల వెంకట సుబ్బారావు గారి "రేనాటి సూర్య చంద్రులు" గ్రంథం నుండి)*

ఉరిశిక్ష అమలకు 22-2-1847 తేదీ నిర్ణయించారు. అమలు జైలులో కాదు. కోవెలకుంట సమీపంలో ఒకచోట. ఆ చోటుకు ప్రజలందరూ వచ్చి ఉరిశిక్షను చూడమని బ్రిటీషువారు ఊరూరా చాటింపు వేయించారు. 2000మంది ప్రజలు చేరారు. వారి సమక్షంలో 22-2-1847న ఉదయం 7 గంటలకు కలెక్టరు కాక్రేన్ నారసింహారెడ్డిని ఉరి తీయించాడు.

జానపద గేయాలను బట్టి ఉరితీత కొవెలకుంట్లలో జు(రేటి ఒడ్డున జరిగింది. తిరుగుబాటుదారుల్ని భయభ్రాంతులను చేయటానికి నారసింహారెడ్డి శిరసును 1877 సంవత్సరం దాక (30సం॥లు) అదే ఉరికొయ్యకు వ్రేలాడదీశారట. అపుడు తన తల్లి, కుమారుడు కాశీలో వుండగా వారికి తెలియపరచారని జానపద గాధలు చెబుతున్నాయి. స్వాతంత్ర వీరుడు నారసింహారెడ్డి అని, ప్రజలు మేధావులు కవులు పలు విధాలుగా ప్రస్తుతించారు. రూపనగుడి, ఉయ్యాలవాడ, ఉప్పులూరు, గుళ్ళదుర్తి, గిద్దలూరు మొదలైన చోట్ల ఈ సాహసికి చెందిన కోటలు, ఆయుధాలు (రూపనగుడి గ్రామంలో) ఇప్పటికీ ఉన్నవి.

1857 నాటి ప్రధమ స్వాతంత్ర సంగ్రామానికి 10 ఏళ్ళముందే తెల్లవారిపై తిరుగుబాటు జెండా ఎగరేసిన స్వాతంత్ర వీరుడు ఉయ్యాలవాడ నారసింహారెడ్డి. ఈయన తిరుగుబాటు వివరాలు కడపజిల్లా మాన్యువల్ 1857లోను, జానపద గేయాల్లో, కావ్యాలలో, నాటకాలలో ఇతర పలుగ్రంధాలలో కానబడును. The palegars of South India అనే బ్రిటీష్ రిపోర్టులో ఈ నిజాలన్నీ 1996లో ప్రకటించబడ్డవి. అలాగే The Manual of Kurnool district and Cuddapah district in the presidency of Madras 1857 and 1886, freedom struggle in Andhra Pradesh (1880-1905AD) Specific causes of the revolt of palegar Narasimha Reddy in 1846 (from the letters of British government i.e. East India Company in 1847 and 1848) లో ప్రకటించబడ్డవి.

ఆ యోధుని బలిదానాన్ని, పౌరుషాన్ని కొనియాడుతూ ప్రజలు

**"దొరవారి నరసింహారెడ్డీ**
**నీ దొరతనము కూలిపోయే రాజా నరసింహారెడ్డి**
**రేనాటి సీమలోన – రెడ్డోళ్ళ కులములోన**
**దొరవారి వమిశాన – ధీరుడే నరసింహారెడ్డి"**

అంటూ పోరాటగాథను, వీరగాథను ఇప్పుడూ పాడుకుంటారు. మనలో పారతంత్ర్యాన్ని పారద్రోలటానికి స్వాతంత్ర దీప్తిని రగిల్చిన ఆ విప్లవ వీరుడిని తలచుకొని మనం **ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22న రెడ్డివీరుల విప్లవదినం**గా జరుపుకుందాం.

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

# నారసింహారెడ్డి వంశవృక్షం

ఉయ్యాలవాడ నగరికాపులు (ఇంటిపేరు "మజ్జరి" వారు; "చెరుకునూళ్ళ" గోత్రం)

మజ్జరి బుచ్చిమల్లారెడ్డి

- పెద్దమల్లారెడ్డి(పెద్దిరెడ్డి) + ఇద్దరు భార్యలు
  - పెద్ద భార్య (పేరు తెలియదు) (నొస్సం జమేదారు చెంచుమల్ల జయరామిరెడ్డి పెద్దకూతురు)
    - కుమార మల్లారెడ్డి
    - వరదారెడ్డి
  - చిన్న భార్య "నీలమ్మ" (నొస్సం జమేదారు చెంచుమల్ల జయరామిరెడ్డి చిన్నకూతురు)
    - ఉయ్యాలవాడ నారసింహారెడ్డి (కథానాయకుడు) + ముగ్గురు భార్యలు
      - మొదటి భార్య "నాగమ్మ" (గుళ్ళదుర్తిలోని పేరా ఓబులరెడ్డి పెద్దకూతురు)
        - బుచ్చిమల్లయ్య
          - సీతారామయ్య (1932 వరకూ ప్రభుత్వం నుండి పెన్షన్ తీసుకున్నాడు)
            - సుంకిరెడ్డి (1969 వరకూ ప్రభుత్వం నుండి పెన్షన్ తీసుకున్నాడు)
      - రెండవ భార్య "పేరమ్మ" (పేరా ఓబులరెడ్డి చిన్నకూతురు)
        - కూతురు
      - మూడవ భార్య "ఓబులమ్మ" (నారాయణరెడ్డి కూతురు)
        - మల్లయ్య
        - సుబ్బయ్య లేక దొరసుబ్బయ్య
          - కూతురు : అక్కయ్య + భర్త బాలిరెడ్డి (కృష్ణారెడ్డి గుంపు)
            - పెద్దమల్లారెడ్డి + బాలమ్మ
              - సుబ్బారెడ్డి
              - బాలిరెడ్డి
            - చిన్నమల్లారెడ్డి + రామసుబ్బమ్మ
              - సుబ్బారెడ్డి
              - పెద్ద హుసేన్‌రెడ్డి
              - చిన్నహుసేన్‌రెడ్డి
              - బాలిరెడ్డి
              - గోపాలరెడ్డి
            - బొజ్జయ్య + వెంకటమ్మ
              - మల్లారెడ్డి
              - సుబ్బారెడ్డి
              - గోపాలరెడ్డి
    - బొజ్జయ్య (ఈయనకు సంతతి లేదు
- చిన్నమల్లారెడ్డి (భార్య : దొడ్డమ్మ)

*(డా॥ తంగిరాల వెంకట సుబ్బారావు గారి "రేనాటి సూర్య చంద్రుల" గ్రంథం నుండి)*

# గాదె చిన్నపరెడ్డి

## (సైరా చిన్నపరెడ్డి)



గాదె చిన్నపరెడ్డికి గల ధైర్యసాహసాల వలన

**సైరా... సైసైరా చిన్నపరెడ్డి**

అని ప్రజలచే కొనియాడబడ్డాడు.

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

చిన్నపరెడ్డి గుంటూరు జిల్లా తెనాలి పట్టణం చెంతనున్న చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెంలో రైతుకుటుంబంలో 1864లో జన్మించాడు. తండ్రి సుబ్బారెడ్డి. తల్లి లింగమ్మ. పెదరామిరెడ్డి, చినరామిరెడ్డి, రాఘవరెడ్డి, నరిసిరెడ్డిలు చిన్నపరెడ్డికి అన్నలు, ఒక చెల్లెలు పరాక్రమశాలి కలదు. రత్తమ్మ ఆయన భార్య. ముదినోళ్ళ గోత్రం.

చిన్నపరెడ్డి ధైర్య సాహసాలకు పెట్టింది పేరు. బ్రిటీషు వారి నెదిరించి గుఱ్ఱంపై తిరిగేవాడు. చుట్టూ 12 ఆమడల ప్రాంతంలో మహావీరుడుగా పేరు పొందాడు. ఆయనపై పల్లె పదాలు ఇలా వున్నాయి.

**ఎక్కేదిమరి ఎల్లగుఱ్ఱమూ – కట్టేదీ గోరంచుల పంచె**
**చుట్టేదీ చిలకల తలగుడ్డ – గోరంచులా పంచెను గట్టీ**
**చిలకలాను తలగుడ్డను చుట్టీ – రెడ్డిపాలెమూ బయలు దేరీ**
**చేబ్రోలైనా వెళ్ళుతవుంటే – చుట్టునొక్క పన్నెండామడ**
**నిప్పులేక మండిస్తివి రెడ్డీ! – చుట్టునొక్కా నాలుగామడ బందిపోటు కొట్టిస్తివి రెడ్డీ!"**

మరొక పల్లెపదం ఆయన చెల్లెలు సాహసంపై ఇలా వుంది. ఈమె వీరవనిత. అన్నతో సమానంగా శౌర్యం ప్రదర్శించి పోలీసు బలగాన్ని ఎదిర్చి గెలిచిందట.

**"చిన్నపరెడ్డీ చెల్లేలంటా – తురకపాలెమున ఉన్నాదంట**
**అయిదువందల జనాన్ని గొట్టీ – అన్నగారితో కలిసిందంటా**
**నాయనా! చిన్నాపరెడ్డీ! నీపేరే బంగార్ప కడ్డీ!"**

ఆ కుటుంబం అంతటి కుటుంబమట.

డా॥ తంగిరాల వెంకట సుబ్బారావు, డా॥బూదాటి వెంకటేశ్వర్లు గార్ల పరిశోధనల ప్రకారం ఈయనకు చేబ్రోలు కమ్మవారితో, ప్రత్తిపాటి కమ్మవారితో వైరం వుండేదట. తనను గుఱ్ఱము దిగమని అన్న కమ్మవారిని నేను దిగను చేతనైతే మీ గ్రామమంతా వచ్చి నన్ను గెలవండి అని సవాలు చేశాడట.

చేబ్రోలుకు 1/2 కి.మీ. దూరంలో పాతరెడ్డిపాలెం ఉండేదట. చేబ్రోలులో పెద్దకమ్మ వారున్నారట. పాతరెడ్డిపాలెంలో కేవలం రెడ్లు మాత్రమే ఉన్నారట. చేబ్రోలుకు కొత్తరెడ్డిపాలెంకు మధ్యలో కాలువే అడ్డం. ప్రజల్లో ఒక సమాచారం వాడుకలో వున్నది. చిన్నపరెడ్డి పూర్వులు ప్రకాశం జిల్లాలోని శింగరకొండ అని, రెడ్డిరాజ్యపు రాజధాని అద్దంకి నుండి కొండవీడుకు మారిన తరుణంలో ఈ కుటుంబం చేబ్రోలుకు వలస వచ్చి నివాసం ఏర్పరచుకున్నారని. పశువుల మేత, పొలాల శిస్తుకు సంబంధించి వీరి పూర్వీకులకు చేబ్రోలు గ్రామ రాజా వాసిరెడ్డి వారితో విభేదాలు వచ్చాయని, ధాతకరువు వచ్చినప్పుడు ఆనాటి పాలకుణ్ణి తిరస్కరించారని అంటారు. చిన్నపరెడ్డి తండ్రి కూడ గుర్రంపై తిరిగేవాడట. కొడుకు కంటే తండ్రి మరీ పందెగాడట.

వందేమాతరం నినాదాలతో దేశమంతా మారుమోగుతున్న రోజులవి. చిన్నపరెడ్డి బలగమంతా బ్రిటీషువారికి వ్యతిరకంగా శౌర్యప్రతాపాలను చూపేవారట.

చిన్నపరెడ్డి ఆజానుబాహుడు. బీద బిక్కిని ఆదుకునే రెడ్డితత్వం గలవాడు. మద్రాసు పట్టణంతో నీలిమందు వ్యాపారం చేసేవాడు. నాయకత్వ లక్షణాలుండి ఆ ప్రాంతానికి నాయకుడైనాడు. మద్రాసుకు వ్యాపారానికి వెళ్ళినపుడు టంగుటూరి ప్రకాశం పంతులు గారి బహిరంగ సభలు విని ఆకర్షితుడై "వందేమాతరం. మందేరాజ్యం. బ్రిటీషు వారిని పారద్రోలండి" అనే నినాదంతో ప్రజలను సంఘాలు సంఘాలుగా ఉద్యమంలోకి చేర్చాడు. చిన్నపరెడ్డి చేబ్రోలులో గుర్రంపై వెళుతుంటే అక్కడ మకాం వేసిన బ్రిటీషు సైన్యానికి ఒళ్ళు మండుతుండేది. వారి నెదిరించాడు.

గుంటూరు జిల్లా నరసరావుపేట సమీపంలో (11 కి.మీ) కోటప్పకొండ వద్ద ఏటా శివరాత్రికి త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో తిరునాళ్ళ జరుగుతుంది. విద్యుత్ ప్రభలు, వందలకొద్దీ సాధారణ ప్రభలు, ఎడ్లపందేలు, పొట్టేళ్ళ పందేలు, చక్కభజనలు, కోలాటం, వాద్యబృందాలు వగైరా గ్రామీణ ప్రదర్శనలు కోలాహలంగా అక్కడ జరుగుతాయి. చుట్టుప్రక్కల వందల గ్రామాల నుండి లక్షల కొలది ప్రజలు బండ్లపై కూడ వచ్చి తిరునాళ్ళలో వారివారి

ఉత్సవాలతో పాల్గొని త్రికోటేశ్వరస్వామిని దర్శించుకొని వెళ్ళేవారు. ఆ యానవాయితీ ఇప్పుడు కూడ ఉంది.

చిన్నపరెడ్డి కుటుంబం గొప్పది. అందరూ శౌర్యప్రతాపాలు చూపగలవారే. గుర్రాలను మేపేవారు. గుర్రపు స్వారీ ఆయన నిత్యవిద్య. చిన్నపరెడ్డి ఆజానుబాహుడు. మీసకట్టు, తలపాగ గంభీరంగా వుండేవాడు. బీద బిక్కికి పెద్ద అండగా వుండే రెడ్డితనం గల కుటుంబం. చెన్నపట్నం (మద్రాసు – నేటి చెన్నై)తో నీలిమందు వ్యాపారం చేసేవాడు. పేదల పాలిట ఆశాజ్యోతి. ఆకలి బాధలు తీర్చేవాడు. రైతులను దళారీల బాధనుండి రక్షించేవాడు. యువకులకు నాయకుడు. రెడ్డితనం ఆయన స్వరూప స్వభావాలలో చిందువేస్తుంది. నాయకత్వ లక్షణాలున్నందున ఆ ప్రాంతానికి నాయకుడైనాడు.

18–2–1909 తేదీ శివరాత్రి చిన్నపరెడ్డి తన పందెపు కోడెలతో తిరునాళ్ళకు వెళ్ళాడు. తన ప్రభ ముందు వరుసలో వున్నది. జనం పోటెత్తారు. తాళాలు మేళాలు, తప్పెటలు, దరువులు, చిందులు తిరునాళ్ళే తిరునాళ్ళ. పోలీసుల హడావిడీ ఎక్కువగా వున్నది. వారి వేధింపులు అధికంగా వున్నై. తగదంటూ పోలీసులను మందలించాడు. "వందేమాతరం. మందేరాజ్యం" అంటూ చేతిలో కాంగ్రెస్ జెండా పట్టుకొని తన ఎల్లగుర్రం పైనెక్కి తిరునాళ్ళంతా కలయతిరిగాడు. ప్రజలకు తానే నాయకు డన్నట్లున్నాడు. పోలీసువారితో చిన్నపరెడ్డికి ఘర్షణ వచ్చింది. జనసందోహం పెరిగింది. నినాదాలు పెరిగాయి. చిన్నపరెడ్డి నాయకుడైనాడు. పోలీసులపై తిరుగుబాటు జరిగింది. చిన్నపరెడ్డిని తనవూరిలో లొంగదీయలేమని ఇక్కడే అతణ్ణి పట్టాలని పోలీసుల పథకం. ఆ పథకం ప్రకారం "నీ ఎద్దులు బెదురుతున్నాయి. అవి చేసిన గందరగోళానికి జనం భయపడ్డారు. ఎద్దుల్ని నిలిపివెయ్య"మని పోలీసులు హుకుం జారిచేశారు. చిన్నపరెడ్డి తిరస్కరించాడు. తుపాకీచూపి బెదిరించారు. ముందు నన్ను చంపి ఆ తర్వాత ఎద్దుల సంగతి చూడండని ఎదిరించాడు. పోలీసులు ఉక్కిరి బిక్కిరౌతున్నారు. ఘర్షణలో ఒక పోలీసు గాయపడ్డాడు. పోలీసులు రెచ్చిపోయారు. ఒకగుంపు పోలీసులు చిన్నపరెడ్డిని అరెస్టు చేశారు. తాత్కాలికంగా పెట్టిన తాటాకుల పోలీసు స్టేషనులోకి బలవంతంగా

ఈడ్చుకుపోయారు. తిరగబడ్డ రెడ్డిని బంధించారు. కాని చిన్నపరెడ్డి తప్పించుకొని పారిపోయాడు. అది చూసిన ప్రజలు కేకలు ఈలలతో పోలీసులపై బడ్డారు. గమనించిన ఆయన కోడెలు ప్రభ నుండి తప్పించుకొని పోలీసుల వెంటబడ్డాయి. ఒక పోలీసును తొక్కేశాయి. తుపాకులతో వున్న పోలీసులు ఒక కోడెను కాల్చి చంపారు. తిరగబడ్డ ప్రజలు చిన్నపరెడ్డిని వదలండని నినాదాలు చేసి కేకలేశారు. వదలలేదు. వందేమాతరం అని నినాదాలిస్తూ పోలీసు స్టేషనుకు నిప్పు పెట్టారు. పోలీసు డి.యస్.పి. పై దాడి చేసి గాయపరిచారు. సబ్ కలెక్టరు వచ్చాడు. వందేమాతరం నినాదంతో చుట్టుముట్టారు. ఆయన పారిపోయి సత్రంలో దూరాడు. సత్రంకు ప్రజలు నిప్పుపెట్టారు. కొందరు ప్రజలు, పోలీసులు గాయపడ్డారు. మరణించారు. వందేమాతరం నినాదం మిన్నంటింది. అంతటికీ కారణం చిన్నపరెడ్డేనని చిన్నపరెడ్డి పైన మరికొంతమంది పైనా క్రిమినల్ కేసు నెం. 27/1909ను గుంటూరు అడిషనల్ కోర్టులో పెట్టారు. భారతీయ శిక్షాస్మృతి 147, 333, 135, 136, 307 మరియు 302 సెక్షన్‌ల క్రింద చిన్నపరెడ్డిపై నేరాలు మోపబడి చేబ్రోలులో అరెస్టు చేసినట్లు విచారణ జరిగింది. చిన్నపరెడ్డి మొదటి ముద్దాయి. 114మందికి పైగా సాక్షులను విచారించారు. ముద్దాయిల తరుపున 110మందికి పైగా సాక్షులు విచారించబడ్డారు. తిరుగుబాట్లు చేసి అల్లరి సృష్టించినందుకు, పోలీసులను కొట్టినందుకు శేషయ్య అను పోలీసును కాల్చి చంపినందుకు, ఆస్తులు, పోలీసు స్టేషను తగులబెట్టినందుకు 58మందిపై వేరు వేరు కేసులు పెట్టారు. విచారణానంతరం చిన్నపరెడ్డికి మరణశిక్ష విధించబడింది. నలుగురకు యావజ్జీవ కారాగార శిక్ష, 16మందికి సాధారణ శిక్షలు పడ్డవి. చిన్నపరెడ్డిపై తీర్పును మద్రాసు హైకోర్టుకు రెఫర్ చేశారు. సెషన్సు కోర్టు మరణ శిక్ష విధించితే చట్టప్రకారం ఆ తీర్పును హైకోర్టు ఖాయం చేయవలసివుంది. లేకుంటే మరణ దండన విధించను వీలులేదు. కనుక హైకోర్టుకు పంపబడ్డది. మిగతా ముద్దాయిలు మద్రాసు హైకోర్టులో వేరు వేరు అప్పీళ్ళు దాఖలు చేయగా, మద్రాసు హైకోర్టులో జడ్జీలైన జస్టిస్ మన్రో యఫ్ మరియు జస్టిస్ శంకరన్ నాయర్ అనువారు కేసు రికార్డును పరిశీలించి, వాదనలు విని 18-8-1910వ తేదీన చిన్నపరెడ్డికి మరణశిక్షను

ఖాయం చేయగా, తదుపరి చట్టప్రకారం ఉరితీశారు. (ఉరి తేదీ ఖచ్చితంగా తెలియుట లేదు). మిగతా కొందరికి కొన్ని ఇతర శిక్షలు వేశారు. ఆ తీర్పు ముఖ్యభాగాన్ని ఈ క్రింద ఇవ్వడమైనది.

## మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు

GADE CHENNAPAREDDI

V

EMPEROR

The Kottapakonda Riots Cases.

Referred Trial No.17 of 1910 and Criminal appeal Nos.137 to 15, of 1910 and Cr.I, Appeal Nos. 161 to 163 1910 and Crl. Appeal No.205 of 1910.

18th August, 1910.

GADE CHENNAPPAREDDI AND OTHERS

V

EMPEROR

Indian Penal Code-Act XLV of 1860-Sections 302 and 149-Murder-Common object of a mob-Liklihood of murder being committed.

At the annual Sivarathiri festival at Kottappa Konda which is attended by innumerable people, a constable S. and the 6th accused got drunk and grew disorderly. Both fell down unconscious. The Sub Inspector with other constables came to the spot and arrested the 6th accused as a murderer. A crowd collected round them. On the way a constable S. was struck with a stick who in return killed one of the crowd with a bayonet. This inflamed the crowd who arrived at the Police Station and demanded the release of the 6th accused which was refused. The 1st accused took a prominent part in the riot from the attack on the Police Station when he incited the crowd to throw stones and beat the police to the burning of the tents the final act in the riot-The constable

S. then got into the hands of mob and was murdered and burnt. It was held that the 1st accused was guilty under sections 302 and 149 of the I.P.C. because it was a common object of the mob to take vengeance on S. Who had bayonetted one of their number and the 1st accused should be taken to have known that S. was likely to be murdered if the mob caught him.

Trial referred by the Additional Court of Session of the Guntur Division for confirmation of the sentence of death passed upon the said 1st Prisoner in Case No.27 of the Calender for 1909 and appeals against the sentence of the Additional Court of Session of the Guntur Division in Case No.27 of the Calender for 1909.

S. Swaminathan for prisoners.

T. Richmond contra.

JUDGMENTS.

Munro, F. I think there are sufficient materials in the case of the 1st accused, especially considering the leading part which he undoubtedly took throughout, to warrant a conviction under the 7th Count. The result is that I confirm the conviction on all counts except the 2nd and also the sentence of death and other sentences passed except that the fine of Rs.500 imposed under section 436, Indian Penal Code is remitted.

Sankaran Nair - I concur.

చిన్నపరెడ్డి పోరాట గాథలు పెక్కు వచ్చాయి. “సైసైరా! చిన్నాపరెడ్డీ! నీపేరే బంగార్ప కడ్డీ!” అంటూ వూరు, వాడ ఆలపించి ప్రజలు స్వాతంత్రోద్యమాన్ని ఉధృతం చేశారు.

ఇది మరుగున పడిన స్వతంత్ర్యోద్యమ గాథ. తెల్లవారిని కలవరపెట్టిన ముఖ్యగాథలలో వొకటి. రెడ్డి పౌరుషానికి ప్రత్యక్షసాక్ష్యం.

*(ఈ గాథను చిన్నపరెడ్డి కథ (వీరగాథ) అనే గ్రంథాన్ని ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు, ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు గారలు ప్రచురించారు).*

**కజ్జికాయ కన్న ఖర్జూరమున కన్న**
**వెలది మోవి కన్న వెన్న కన్న**
**తేనె కన్న నాకు తెలుగు బాసే తీపి**
**మహిత వినయశీల! మల్లెమాల!!**

# పొణకా కనకమ్మ



జననం : 10-6-1892
మరణం : 12-9-1963

"ఊయలలూగించే కోమల కరాలే రాజ్యాలు శాసిస్తవి.
తూలికపట్టే మృదుహస్తాలే శతఘ్నులు విదిలిస్తవి.
జోలలు బుచ్చే సుకుమారపు చేతులే జయభేరులు మ్రోగిస్తవి"

రెడ్డి జనాభ్యుదయ సంఘం - ఒంగోలు

ఇవి పొణకా కనకమ్మ "గృహలక్ష్మి" స్వర్ణకంకణ సత్కారం సందర్భంలో పలికిన విశేష మహిళా సాధికారికతను, స్త్రీ శక్తిని ఎలుగెత్తిన మాటలు. ఆమె ఆదర్శ మహిళగా పేరుగాంచింది. భర్త సుబ్బరామిరెడ్డి, తండ్రి మరుపూరు కొండారెడ్డి. మరుపూరు కోదండ రామిరెడ్డికి అక్క.

కనకమ్మ నెల్లూరులో మహాత్మాగాంధీచే కస్తూరిబా మహిళా ఉన్నత పాఠశాలకు శంకుస్థాపన చేయించి నిర్మించింది. ఒంటిపైని 40 సవర్ల బంగారాన్ని స్వాతంత్ర్యోద్యమానికి గాంధీగారి భిక్షాపాత్రకిచ్చింది.

ఈమె కవయిత్రి. ఆంధ్రదేశంలో వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న కొద్దిమంది మహిళల్లో ఒకరు. 1923లో కాకినాడ కాంగ్రెస్ మహిళా మహాసభకు అధ్యక్షత వహించారు. నెల్లూరు కాంగ్రెస్ కమిటీకి ప్రధమ మహిళా అధ్యక్షురాలుగా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యురాలుగా, ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు.

ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమాలలో పాల్గొని 27-6-1930 నుండి ఆరునెలల జైలుశిక్షను నెల్లూరు మరియు రాయవెల్లూరు జైళ్ళలోను, 26-5-1932 నుండి 18 నెలలు జైలుశిక్షను రాయవెల్లూరు జైలులోను అనుభవించారు.

గ్రంధాలయోద్యమ వ్యాప్తికి, సాంఘిక సంస్కరణల కోసం, మహిళల ఉన్నతి కోసం విశేషంగా కృషిచేశారు.

కనకమ్మ అతిథులకు అన్నపూర్ణ. ఆశ్రితులకు కల్పతరువు. సంఘసేవా తత్పరురాలు. స్త్రీజనాభ్యుదయవాది. కట్టుబాట్లనే సంకెళ్ళను తెంచుకొని ప్రజల్లోకి, ప్రజాఉద్యమాల్లోకి పరుగెత్తింది. ఆకాలంలో కనకమ్మ ఇచ్చే ఆతిథ్యం స్వీకరించని కాంగ్రెస్ నాయకులు, కవులు, కార్యకర్తలు లేరంటే అతిశయోక్తి కాదు. భూస్వాముల ఇంట పుట్టినా, మెట్టినా స్వతంత్ర భావాలతో అభ్యుదయ దృక్పథంతో స్త్రీల సభలను నిర్వహించింది. అవిద్యే అతివల దుస్థితికి కారణమని ప్రభుత్వానికి, ప్రజలకు, నాయకులకు, స్త్రీజనానికి ఘంటాపథంగా తెలిపింది. స్త్రీ సమస్యలను స్త్రీల పత్రికలకు పద్యాలు, వ్యాసాల రూపంలో వ్రాసి, ప్రచురించి నారీశిరోమణి అయింది.

ఆమె రాష్ట్ర కాంగ్రెస్ సభల నిర్వహణ, నెల్లూరు జిల్లా స్త్రీల సంఘాల స్థాపన, కాకినాడ, మదనపల్లిలో కాంగ్రెస్ సభల నిర్వహణ, నెల్లూరు గాలివాన నష్ట సందర్భంగా ప్రజలకు ఆదరణ, రాయలసీమ కరువులో దీనజనరక్షణ, ప్రజలను అబ్బురపరచాయి.

ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మతో కలిసి భగవాన్ రమణమహర్షిపై కవితలు రాశారు. తెలుగులో తొలి జంట కవయిత్రులు వీరే. అంతేకాదు భగవద్గీతను తెలుగు చేసిన మహిళామణులూ వీరే.

ఈమె ప్రసిద్ధ దేశసేవిక. మహిళా సముద్ధరణకు జీవితాన్ని, ఆస్తిపాస్తులను త్యాగం చేసిన రెడ్డి మహిళ. ఈమె ఘనతను రెడ్డిజాతి ఘనంగా చెప్పుకోవలసిందే. ఈమె పరిమళమిచ్చిన కనకం. ఈమె నిక్కముగా "కనక పుష్యరాగం" అని ప్రజలు కొనియాడారు. ఆ పేరుతో డా॥ కాళిదాసు పురుషోత్తంగారు ఒక ఉద్గ్రంధం వెలువరించారు.

**కోపమునను ఘనత కొంచెమైపోవును**
**గోపమునను మిగుల గోడు గలుగు**
**గోప మడఁచెనేని గోర్కెలు నీడేఱు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నీళ్ళమీద నోడ నిగిడి తిన్నగ బ్రాకు
బైట మూరెఁడైనఁ బాఱలేదు
నెలవు తప్పుచోట నేర్పరి కొరగాఁడు
విశ్వదాభిరామ వినురవేమ.

# వేమన



"సచ్చిదానంద దర్శనుడు వేమనయోగి
మనకులంబున పుట్టెననిన చాలు"

– కవికోకిల దువ్వూరు రామిరెడ్డి

వేమన రెడ్డికుల సంపద. వ్యక్తులను కులాలపరంగా చెప్పుకునేటపుడు వేమనను రెడ్డికులం సగర్వంగా సొంతం చేసుకున్నది. రాజ్యాలను పరిపాలించిన రాజులకంటే మనోరాజ్యాలను ఏలిన రాజాధిరాజుగా వేమనను రెడ్డికులం చెప్పుకుంటుంది. కులాలకతీతుడైన గొప్ప వ్యక్తిగాకూడ ఎప్పుడూ మన మనసుల్లో ఉంటాడు వేమన.

వేమన కాల నిర్ణయం పలువురు సాహితీవేత్తలు, పరిశోధకులు, పలు విధాలుగా చెప్పారు. అందరికీ ఆధారాలు ఆయన నాలుకపై ఆశువుగా నర్తనమాడిన ఆటవెలది పద్యాలలోని అంశాలేకాక, లోక వృత్తాంతాలు. కాని ఇదమిద్ధంగా తేల్చలేకపోయారు.

క్రీ.శ. 1352 - 1430 అని చిలకల వెంకట సుబ్బారెడ్డి
క్రీ.శ. 1412 - 1480 అని వంగూరు సుబ్బారావు
క్రీ.శ. 1460 - 1600 అని శేషాద్రి రమణ కవులు
క్రీ.శ. 1565 - 1625 అని వేదం వెంకట కృష్ణశర్మ
క్రీ.శ. 1650 అని వేటూరి ప్రభాకరశాస్త్రి
క్రీ.శ. 1652 - 1725 బండారు తమ్మయ్య
క్రీ.శ. 1700 - అని రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ

ఇలా ఏమాత్రం అంగీకారం కుదరని విధంగా వేమనకాలం పరిశోధకులకు సవాలైంది.

ఏదో ఒక నందననామ సంవత్సరంలో పుట్టాడని ఒక వేమన పద్యం ఆధారంగా భావించారు. అవి క్రీ.శ. 1412, 1472, 1652, 1712, 1772 లలో ఏదో ఒకటి అయివుండవచ్చు. ఖచ్చితంగా తెలియదు. చదువుకు సంబంధించిన వివరాల్లేవు. కులం మాత్రం రెడ్డికులమని సాహితీకారులు, పరిశోధకులు అంగీకరించారు.

వేమన ప్రాచీనాంధ్ర కవులవలె రాజాస్థానాలలో వున్న కవి కాదు. ప్రజల నాల్కలపైనున్న ప్రజాకవి. సహజకవి. ఏదో ఒకచోట అధివసించి, కొందరిని ఆకర్షించి, కొందరి కోసం కవిత్వం చెప్పిన కవికాదు. కనుకనే ఆయనను గురించి కొన్ని విషయాలపై నిక్కచ్చి వివరాలు తెలుసుకోవటం పరిశోధకులకు కష్టమైంది. పద్యాలు కూడ వేలాదియగుట వలన, కల్పిత పద్యాలు కూడ వేలాదిగా కలిసినందున అవి సమాజపరంగా ఉండుట వలన, ఆయన

సొంత విషయాలు ఆయనే ఎక్కడా చెప్పుకోనందున, పరిశోధకులకు ఆయనను గురించి ఒక నిర్ణయానికి రావటం కష్టమైంది. వేమన ఏమీ వ్రాసింది లేదు. వేమన గురించి శాసనాల్లేవు.

వేమనను వెలుగులోనికి తెచ్చి ప్రపంచానికి చూపినవాడు సి.పి.బ్రౌన్. ఆయన వేమన సంచరించిన ప్రదేశాలలో విరివిగా సంచరించి, తాళపత్ర పద్యాలను సేకరించి ప్రజల నాల్కలపైని పద్యాలను సేకరించి, ఆంగ్లంలోనికి అనువదించి ఐరోపా ఖండమంతటా వేమనను వ్యాపింపజేశాడు. సి.పి. బ్రౌన్ లేకున్న వేమన మన తెలుగు ప్రాంతానికే తెలిసేవాడు కాదేమో. సి.పి. బ్రౌన్ సేకరించిన వేమన పద్యాలు, ఇంగ్లండులోని సి.పి. బ్రౌన్ గ్రంథాలయంలో భద్రపరచబడి వున్నవి. అవి ఆ ప్రభుత్వ అధీనంలో వున్నవి. బ్రౌన్ దాదాపు 1167 వేమన పద్యాలను సేకరించి తానే ముద్రించాడు. ఆంగ్లంలోకి కొన్ని అనువదించాడు. అలానే ఫ్రాన్స్‌లోని పారిస్‌లో కింగ్స్ లైబ్రరీలో కొన్ని ఉన్నవి. (లైబ్రరీ నంబర్. 589).

వేమన సూక్తి రత్నాకరంలో చెప్పబడ్డ చరిత్రలోని అభిప్రాయం ప్రకారం క్రీ.శ. 1328 నుండి 1428 వరకు కొండవీటిలో రాజ్యం చేసిన రెడ్డిరాజులలో కడపటివాడైన రాచవేమారెడ్డికి యోగివేమన తమ్ముడు, కొమరగిరి వేమారెడ్డికి కుమారుడు. వేమన తల్లి మల్లమ్మ. వదిన తల్లివంటిది నరసాంబ, నగరి కంసాలి అభిరామయ్య. అతడు లంబికా శివయోగిని సేవిస్తున్నాడు. ఒకనాడు ఆ యోగి అభిరామయ్యతో రేపుదయము వచ్చి ఉపదేశం పొందమని చెప్పిన మాటను వేమన విన్నాడు. మరునాడు తానే యోగివద్దకేగి అభిరామయ్య రాలేకపోయాడు, తనను పంపినాడని చెప్పగా యోగి వేమనకు ఉపదేశము చేసినాడట. వేమన జ్ఞానియై, విరక్తుడై దేశదేశాలు తిరిగి పద్యరూపముగా ప్రజలకు ఉపదేశములు చేసి చివరకు కటార్లపల్లెలో సమాధి పొందెను. కాని ఈ అభిప్రాయం సరైనదికాదని అనంత కృష్ణశర్మగారు అభిప్రాయపడ్డారు. నవయుగ కవిచక్రవర్తి, పద్మభూషణ్ జాషువా గారిలా అన్నారు.

**"విసిగి విరక్తిచే దెలుగు వీధులలో నొక పిచ్చివానిగా**
**మసలిన రెడ్డిరాజులు మునిమాన్యుడు వేమన ......"** అన్నాడు.

వేమన సహజ కవిత్వంలోని పదజాలాన్ని బట్టి, వస్తు సముదాయాన్ని బట్టి ఆయన రాజకుటుంబాలలోని వ్యక్తి కాదని అద్భుత ఆశువు సంపదగా కలిగిన సాధారణ పల్లెల్లోని

వ్యక్తి అని కనుకనే పల్లె ప్రజల అంశాలు, ఉదాహరణలు, భావం, భాష ఆలాగున వున్నదని అత్యధికులు తీర్మానించారు. ఆయన వంశము, కాలము, దేశములను గూర్చి ఫలితమునకు రాని చర్చ సాహితీకారులలో, చారిత్రకులలో జరిగినది.

వేమన పద్యాలపైన, పదజాలంపైన, మాండలికాలపైన ఆయన చరిత్రమును నిర్మించవలసి వచ్చినది. అందువలన చిక్కులెక్కువైనాయి. ప్రథమంగా సి.పి.బ్రౌన్ వేమనను వెలుగుకు తెచ్చినందున ఆయన చేసిన పరిశోధనా ఫలితమే ఇతరులకు మార్గదర్శకమైనది.

వేమన ఊరును గురించి పలువురు పలుదిశల ప్రస్తావించారు. వేమన పద్యాలలోని ఒక పద్యం.

**"ఊరు కొండవీడు, ఉనికి పశ్చిమ వీధి**
**మూగచింతపల్లి మొదటి వీడు"**

ఇది పరిశోధకులకు ఆచూకి దొరకక బాగా తికమకలు పెట్టింది. పద్యంలోనే కొండవీడుకు, మూగచింతపల్లెకు సంబంధం లేకుండా చెప్పబడింది. పైగా మూగచింతపల్లెలు నాలుగైదు జిల్లాలలో వున్నవి. ఈ మూగచింతపల్లె ప్రకాశం జిల్లా ఒంగోలు దగ్గరనున్నదని, కడప జిల్లాలోనిదని, నెల్లూరు జిల్లాలోనిదని, కొండవీటి సీమలోనిదని, చిత్తూరు జిల్లాలోనిదని పలువిధాలుగా అభిప్రాయపడ్డారు. కొండవీడుకు మూగచింతపల్లెకు ఎలా ముడిపెట్టబడిందో తెలియుట లేదు. మొత్తం మీద తమిళదేశం, మైసూరు రాష్ట్రంలో తిరిగిన ఆంధ్రుడని కొందరు కొంత నిర్ణయాని కొచ్చారు. ప్రొఫెసర్ ఎన్. గోపీ గారు మాత్రం తన పరిశోధనా గ్రంథం "ప్రజాకవి వేమన"లో ఏది ఏమైనా మొత్తం మీద వేమన తన పద్యాలలో వాడిన పదజాలం వల్ల, బసివిరాంధ్ర ప్రసక్తి వల్ల, స్థల నామాలవల్ల, రాయలసీమ వాడనే నిర్ణయం ప్రస్తుతానికి చెయ్యవచ్చు"నని ముగించారు.

వేమన కాపులలో రెడ్డిగారి బిడ్డ. మధ్యతరగతి రైతు కుటుంబం. పాకనాటింటి వాడని మహాకవి శ్రీనాథుడన్నారు. వేశ్యాలోలిత్వము మాని, సన్యాసాశ్రమం తీసుకొని యోగి అయాడు. శిష్యులు లేకుండా తానొక్కడే దేశసంచారం చేశాడు. రెడ్డిరాజ్యమగు రాజమహేంద్రవరం మొదలు విజయనగర రాజ్యం వరకు తిరిగాడు. తమిళదేశంలో కూడ సంచరించాడు. ఇప్పటికినీ తమిళనాడులో వేమన పీఠాలున్నవి. లంబికా శివయోగి నగరి కంసాలి అభిరామయ్య

అనువానికి తత్వోపదేశము పొందుటకు రావలసినదని చెప్పుమాటలు విని, ఆ సమయమునకు అభిరామయ్యను వేరుపనికి పంపి వేమన తాను తత్వోపదేశము స్వీకరించుటకు పోయి, స్వీకరించి జ్ఞానుడై, అభిరామయ్యకు క్షమాపణలు చెప్పి, విరక్తుడై పలు ప్రాంతాలు తిరిగి పద్యరూపమున ప్రజలకు తత్వోపదేశము చేయుచు తుదకు కటారుపల్లెలో సమాధి నిష్టుడైనాడని కొందరి అభిప్రాయము.

దీనజనోద్ధరణ, హరిజనోద్ధరణ ఆయన కార్యక్రమాలు. అగ్రవర్ణాల వారిని అధః కరించాడు. మూఢాచారాలను వ్యతిరేకించాడు. సర్వమానవ సమానత్వం ఆయన సిద్ధాంతం. కాబట్టే ఆయన అగ్రవర్ణాల వారికి, పురోహితులకు, ముఖ్యంగా బ్రాహ్మణ సాహితీకారులకు వ్యతిరేకుడై చాలాకాలం పాటు పేరే లేకుండా అణగదొక్కబడ్డాడు. ఇంగ్లండు దేశీయుడైన సి.పి. బ్రౌన్, శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి మరికొందరు సాహితీకారులు ఆయన పద్యాలను వెలికితెచ్చి ప్రజల చెంతకు చేర్చారని ఒక బలమైన అభిప్రాయం ఉన్నది.

వేమన లోకకవి, ప్రజాకవి. ప్రజలే ఆయన పద్యాలకు, ప్రబోధాలకు వస్తువు. ప్రజల కోసమే, సులువైన వ్యావహారిక భాషలో ఆశువుగా ఆటవెలది పద్యాలు లెక్కకు మించి చెప్పాడు. అవి కొన్ని తాళపత్రాలలోనికి, కొన్ని సి.పి. బ్రౌన్ ద్వారా కాగితముల పైకి, కొన్ని ప్రజల నాల్కలపైకి ఎక్కినవి. ఆయన పద్యాలు హితోపదేశాలు. కొన్ని తమిళం, మళయాళం, కన్నడ భాషలలోనికి అనువదించబడ్డాయి. ఇంగ్లీషులోనికి ఇంక చెప్పబనిలేదు. ఇంగ్లీషులోకి అనువదించటం వలన ముందుగా ఐరోపా ఖండానికి, క్రమేపి పశ్చిమ దేశాలకు వ్యాపించి ప్రపంచవ్యాప్తమైనాడు వేమన.

వేమనను "భారతీయ ప్లేటో" అన్నారు. మనదేశ "ప్రముఖ తత్వవేత్త" అన్నారు. వేమన హిందువు. హిందూమత ప్రాతిపదికలపై తన హితోపదేశం సాగింది. బ్రాహ్మణాధిక్యతా భావజాలాన్ని నిరసించాడు. ఏవో కొన్ని పద్యాలు తప్ప అన్నీ ఆటవెలది ఛందస్సులో, "విశ్వదాభిరామ వినురవేమ" మకుటంలో సాగాయి.

వేమన కవిగా అసామాన్యుడు. ఆయన మతం అద్వైతమని, వీరశైవుడని సిద్ధాంతీకరించారు పెద్దలు.

**"బ్రహ్మమనగ వేరె పరదేశమున లేదు**
**బ్రహ్మమనగ తానె బట్టబయలు**
**తన్ను తానెరిగిన తానెపో బ్రహ్మంబు"**
**"తన్ను వెదకిజూడ తానెపో జీవుండు"**
**"అంతరాత్మ నిలుప నతడెపో బ్రహ్మంబు"**
**"నీవు నిన్నెరుగంగ నీవెపో శివుడవు"**
**"యెరుకలోని యెరుక నెరుగుట తత్వంబు"**
**"ముక్తియనగ నేమి మూలంబు తానయా"**
**"సతులు సుతులు మాయ సంసారములు మాయ**
**ధనము ఘనము మాయ తనువు మాయ**
**మాయ గెల్చువాడు మర్మజ్ఞుడగు యోగి"**

అన్నవి ఉదాహరణకు వేమన అద్వైత వాక్యాలు. వేమన గొప్ప మానవతావాది సర్వమానవ సమానత్వం ఆయన సిద్ధాంతం. అస్పృశ్యతను, వర్ణవ్యవస్థను చీదరించు కున్నాడు. సమాజాన్ని సంస్కరణ దిశగా నడపటానికి నైతిక ప్రబోధం చేశాడు.


తన ప్రబోధమంతా ఆటవెలది పద్య ఛందస్సులో చేశాడు. ఆటవెలదులు కాని పద్యాలు వేమనవి కాదనే వాదన ఉన్నది. "విశ్వదాభిరామ వినురవేమ" అనే మకుటం ఎక్కువ పద్యాలకు వాడబడింది. దీనికి మన ప్రాంతీయులు, పాశ్చాత్యులు ఎవరికి వారే వేరు వేరు అర్ధాలు చెప్పారు.

కవిత్వాన్ని రాజాశ్రయం నుండి ప్రజలపరం చేయటం వేమన ప్రయత్నంగా గ్రహించ గలం. కవి వేమన్న ప్రజాకవి వేమనయాడు.

వేమన సహజకవి. సహజంగానే కవి. తిరుగుబాటు కవి. సంఘ సంస్కారి. వానకు తడియనివాడు, వేమన పద్యం వినని తెలుగువాడుండడని లోకోక్తి. ఆయన పద్యాలు అంతగా ప్రజల్లోకి పాకిపోయాయి. అవి నిత్యసత్యాలు. ఆయనకు అజ్ఞాత శిష్యులు కొల్లలు. వారిలో నిన్న–మొన్నటి డా॥ యం.యస్.రెడ్డి గారొకరు. వేమన మానవతావాది. దేశసంచారం చేస్తూ

ఆశువుగా పద్యాలను చెప్పుకుంటూ వెళ్ళాడని చెప్తారు. డా॥ సి. నారాయణరెడ్డి గారిలా అన్నారు. "సాంఘిక దురాచారాలను తుత్తునియలు చేయటానికి పద్యాన్ని వజ్రాయుధంగా ప్రయోగించి తెలుగు కవితను జానపదుల నాల్కలపై నర్తింపజేసిన నిక్కమైన ప్రజాకవి వేమన" అన్నాడు.

ద్రావిడ విశ్వవిద్యాలయం వారు వేమనపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఇంగ్లీషు, ఫ్రెంచ్, తమిళం, మళయాళం, కన్నడ భాషలలోనికి వేమన పద్యాలను అనువదింప జేశారు. కడపలో వేమన విశ్వవిద్యాలయం, వేమన పరిశోధనా కేంద్రం స్థాపించబడ్డాయి. ఐక్యరాజ్య సమితివారు ప్రపంచంలోని అన్ని భాషలలో ఒక్కొక్క భాషకు ఒక్కొక్క కవిని ఎంపికజేసి నిపుణులచే వారి జీవితం, సిద్ధాంతం, కవిత్వంపై గ్రంథాలు వ్రాయించారు. ఆ పరంపరలో తెలుగుభాషకు వేమనను ఎంపిక జేసి, ఆయనపై పరిశోధనాత్మక గ్రంథం వ్రాయించి ప్రపంచానికందించారు. ఇంకా వేమన పేరుపై సాహితీ సమితులు, సామాజిక సేవాసమితులు, విజ్ఞాన సేవాసమితులు, భక్తజన సమాజాలకు లెక్కలేదు. వేమన ఫౌండేషన్, వేమన విగ్రహాలు, వేమన దేవాలయాలు వెలిశాయి. తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రలలో వేమన జయంతి వేడుకలు జరుపుతున్నారు. చెన్నైలోని రెడ్డిజన సంఘంవారు జనవరి 19వ తేదీ వేమన జయంతి రోజు అని నిర్ధారించగా అదేరోజున బెంగుళూరు, మనరాష్ట్రంలో మన ప్రభుత్వం కూడ వేమన జయంతి ఉత్సవాలు జరుపుతున్నారు. మన కేంద్ర ప్రభుత్వం వేమన తపాలాబిళ్ళను విడుదల చేసింది. దానిని ఈ క్రింద ఇవ్వడమైనది.



వేమనలాగా ప్రజాకవిగా, లోకకవిగా పేరుపొందిన తెలుగు కవులు సుమతీ శతకర్త బద్దెన, వీరబ్రహ్మేంద్రస్వామి, పలువురు శతక కవులున్నారు.

వేమన దిగంబరంగా ఉన్నాడని, అలానే సంచరించాడని ఇప్పటికీ కొందరు నమ్ముతారు – వాదిస్తారు. చిత్రపటాలు కూడ అలాగే ప్రచురించారు. విగ్రహాలు కూడ అలాగే మలచారు. కడప మాన్యువల్‌ను సంకలనం చేస్తూ జె.డి.బి. గ్రెబిల్ 1857లో ఇలా వ్రాశాడట. ఒకనాటి మాపటి వేళ పొలాల నుండి పశువులు వస్తున్నప్పుడు ఊరి నడివీధిలో పోతరించిన రెండు కోడెలు బుసలు కొడుతూ పోరాడుతుండగా అందరూ చూస్తుండిపోయారేగాని వాటిని అదలించలేక పోయారట. అపుడు బలశాలి వేమన మగసిరిగా జనంలోంచి వచ్చి వాటి రెంటి కొమ్ములను రెండు చేతులతో వంచి నెట్టి వేయగా కోడెలు విడిపోయినవట. ఆ సందర్భంలో తన మొలపంచ ఊడిపోగా దానిని తీక్షణంగా చూసి తల ఊగించి "ఊ" అంటూ దిసమొలతోనే తనపాటికి తానుపోయి తదుపరి ఆ దిసమొలతోనే యోగియైనాడట. ఈ అంశంపై ఇపుడు చర్చించి ప్రయోజనం లేదు. ఆనాటి మాన్యువల్‌లో వ్రాసిన సమాచారం అది.

వేమనను గూర్చి ప్రముఖుల అభిప్రాయాలు ఇలా ఉన్నవి. వేమనను వెలుగుకు తెచ్చిన ఆంగ్లేయుడు **సి.పి. బ్రౌన్** 23–11–1824 తేదీన ఇలా అన్నాడు.

## సి.పి. బ్రౌన్

"This author has attained great celebrity in his own country and in the adjacent parts of India; some information regarding his country and language may however be acceptable to the reader.

Telugu is a principal language of the peninsula of India. It is ancient and has been highly cultivated. The nation of the telugus was in former times very powerful, and its princes gave considerable encouragement to literature. The works of its ancient poets are numerous and very voluminous. It possesses a very scientific grammar, and a system of prosody nearly as highly polished as that of the Greeks. In this and some other respects the language is acknowledged to be more difficult than Sanscrit.

It is peculiarly somooth and elegant in its sound, and the poets have cautiously preserved its euphony. Hence Europeans have called it the Italian of India. The student may at first think this remark, which is no new one, unfounded; as the pronunciation is strong and decided; and as the mixture of Sanscrit terms often gives it a degree of roughness. But the pure rustic dialect as well as that of the poets is altogether different from this colloquial language; in the pure dialect most of those Sanscrit words that had harsh sounds are softened till they are as smooth and melodious as pure Telugu.

With Sanscrit it is closely connected; as closely as English is with Latin. But at the same time it is as truly original and nearly as copious as English. Like English it has borrowed its scientific terms from another tongue; and these Sanscrit additions are daily increasing. Thus the language is becoming less pure.

During the eighteenth century, the incursions of the Mohamedans effectually crushed the literature of Telangana; it has fallen low; and the colloquial dialect has become equally corrupt-men are now rarely met with among them who can read or explain the classical authors of the language; a knowledge of prosody is yet more rare.

Twenty five years of peace in Telangana under the British government have now afforded opportunities for some revival of literature. The establishment of the Honourable Company's College at Madras, and the encouragement there held out to good scholars in the language may have effected some revival; but much remains yet to be done. No poem or classical composition in Telugu has hitherto been printed; and I believe no translation of a classic into English has been attempted.

It now remains to give some account of my author, VEMANA, whose writings are peculiarly useful to those who study the language, the style being simple, and the variety of topics very extensive. These adages exemplify

thousands of words inadmissible into more dignified poetry. The thought and connection are often abstruse while the terms used are quite familiar.

Of his history, little is known. He was not a Bramin but a *Capoo*, or farmer; a native of the Cuddapa district and born, I believe, in the neighbourhood of Gandicotta. He lived in the beginning of the eighteenth century. It is said that in verse 707 he has fixed the date of birth which is believed to have been his own. This date coincides with A.D. 1652. The date is given in the cycle of sixty years; but which cycle is intended is unknown. Many verses, however, prove satisfactorily that he wrote in the latter part of the seventeenth century when the Mohamedans were governers of that part of India. His family was powerful, but he renounced the world and became a *sanyasee* or ascetic. He calls himself a *Yogee*.

These verses communicate hardly any idea of his history or connections, and like all solitary ascetics (*sanyasees* or *yogee*) he has dropped his family name - calling himself simply Vema or Vemana at pleasure. This solitary life has led him to address all the verses to himself, which, if this be not recollected, certainly looks like the grossest egotism. This practice is far indeed from being peculiar to Vemana.

[The name Vema and Vemana do not appear to be used by the Telugus of the present day. Vema or Vemana in Sanscrit signify a loom. (see Wilson's Sanscrit Lexicon, page 854, and the Sabdartha Calpataru Vol. II, page 199). I believe these names to have been practical titles alone, without a definite meaning. Thus it is well known that the titles or names of Dante and hafiz were not the original names of those poets; the first of whom was named Durante or Durando (see preface to Cary's Dante) and the second Muhammed Shemsuddin].

These poems have attained very great popularity and parts are found translated into Tamil and Malayalam or Canarese. Their terse closencess of

expression sometimes renders them difficult to translate with elegance; but such passages exemplify the manly force of a language that in the common dialect is often weak and verbose.

Of his aphorisms many have become common proverbs. Parts of them are evidently close translations from sanscrit works, particularly the *Hitopadesa* and *Bhagavat Gita*. In a few of these every word is pure Sanscrit.

Vemana was evidently, in philosophy, of the Vedanta school, a disciple of Vyasa, whom Sir William Jones has (in the Asiatic Researches, Vol I, page 362) entitled the Plato of India. With the mystic tenets of Plato, those of Vemana closely correspond while his moral doctrines as closely answer to those of Democritus.

These verses are chiefly of three classes: moral, satirical and mystic. In the morals, many verses occur, breathing a spirit of devotion truly extraordinary in a Hindu. The satirical part is chiefly directed against the national religion and customs particularly against Bramins. None of it is personal. The mystic portion is chiefly of use as exexmplifying the powers of the language. The reveries contained in this chapter are of a strangely abstruse nature and furnish a remarkable instance of a powerful mind searching for the light of truth which is lost in the darkness of heathen ignorance. The style of this and some other parts renders it easier to translate the verses into Latin than into English. I have, however, left none in Latin (aliess) that appeard to deserve an English one. To the more difficult verses I have subjoined a Telugu interpretation For some parts of this comment written in Telugu, I am indebted to two very learned Bramins who taught me the language, its grammar and prosody. They are Tippabhotla Venkata Siva Sastri of Masulipatnam and Advyta Brahmia, the Pandit belonging to the court in which I have the honour of being assistant judge.

To the mystic portion I have appended such notes as appeared requisite. Further elucidations of the most ample nature will be found in the Bhagavat

Gita, with Dr. Wilkins's commentary and in Sir William Jones's essay on the Mystical poetry. Poetry of the East appears in the third volume of the Asiatic Researches; It would be easy to refer to many other authors; but to save the reader trouble in an enquiry that can gratify nothing but curiosity, I have subjoined a short explanation of the system.

Most of the Verses in Vemana are written in *ataveladi* metre which consists of four lines; but the fourth line, with some exceptions, is a mere refrain or chorus in these words- *Viswadabhirama Vinura Vema*.

It is perhaps impossible to meet with a complete copy of this poet in a manuscript of any antiquity. The principal sources from which this edition is complied are nine. These were collected from Bellary, Cuddapa Madras, Vijagpatnam, and the city in which I wrote. Few of these copies contain above five hundred verses, none came up to seven hundred. The number, how ever, that I have succeeded in collection is 2,100.

Of the state of the manuscripts, it is not easy to give a correct idea. Errors of the grossest nature in orthography, metre and rhyme deface every line; and erroneous words are substituted to elicit a sense that the transcribers thought proper to prefer. Thus they have eluded many of the difficulties in thought or expression; and the corruption is indescribable in verse.

Vemana having written the *tadbhava* word *guramu* (for gruhamu) a house, the copyists in defiance of metre and meaning have *gurramu*, a horse.

To remedy such errors I prepared a general index to my manuscripts, showing the place each verse occupies in each copy. For the verses in no two copies had the same arrangement. By this aid, the true reading has, I hope, seldom been lost, the correct metre I trust never - the mosn frequent corruptions were substitutions of Sanscrit terms in defiance of measure, for pure Telugu expressions.

To the remarks on mystic philosophy, I have subjoined a short explanation of Telugu prosody. The statements are taken from the Bheemana Chandassu,

but the arrangement and mode of explanation are my own. Sir William Jones has remarked (As. Res. I-XVII on Panini) that "since grammar is only an instrument, and not the end of true knowledge, there can be little occation to travel so rough and gloomy a path." To teach myself the science, I was obliged to reduce the rules given by Bheemana in a veryu fantastic from to their real import; and a mode then occured to me through which by degrees I learnt the whole with care. The original is so mysteriously complex that the failure of most aspirants even amont Bramins to a knowledge of prosody is not surprising.

## డా॥ కట్టమంచి రామలింగారెడ్డి

డా॥ కట్టమంచి రామలింగారెడ్డిగారు వేమనను గూర్తి సమాచారం బయటకు ఎలా తెచ్చారో, నార్ల వెంకటేశ్వరరావు గారు తన పరిశోధనా గ్రంథం "Works of Narla" లో ఇలా తెలిపారు.

Ordinarily, the Radio Talk of Dr. C.R.Reddy should not have found a place in this compilation. But two extraordinary considerations have induced me to include its text as Appendix II. The first reason is this: With one mighty blow Dr. Reddy broke the conspiracy of silence against Vemana. In a book of literary criticism, called **Kavithwa thatwa-vicharamu**, which he published in 1914, he spoke of Vemana as one of the best and most original of poets. For boldness of expression, for capacity to debunk superstitions and to expose pretensions, Vemana, he said, was without compeer among Telugu poets. Strange as it may sound, this was the very first occation when Vemana was recognized by any Telugu scholar and critic. Dr. Reddy continued to hold this high opinion of vemana till his very end, for he broadcast his talk on Vemana only a few months before his death. Now, the second reason for my decision is this: Dr.Reddy's Radio Talk is now available only in tape in the A. I. R. Stations in Madras and Vijayawada, and there is no knowing that the tape will be preserved.

What follows hereunder is the text of Dr. Reddy's broadcast made from A.I.R., Madras Station, in 1950.-Ed.

“Vemana is a poet of Western Andhra, the mountainous tract with being less accessible than the coastal to influences from the north, was less Aryanised, and retained to a greater degree its robust independence of thought and spirit. Sanskrit culture had not pervaded there to the same extent as in the Circars, and we had, therefore, fewer translations and more originations. Vemana was a villager by birth. And, if we could refer to the caste of a man who had discarded caste, a Reddy.

By no means a learned man, not at all a pundit, but a man of profound thought, of great reflective power and penetrating intuition into life and its secular and spiritual problems, his poetry is a spring, pure and undefiled, entirely spontaneous, and original in thought and in style. In three short lines he gives us a whole poem. If brevity is the soul of wit, there has been no greater wit in the world. All his similes and metaphors are drawn from woods and fields, and rural scenes and atmosphere. He is both a poet of nature and a natural poet. I said that his deep intuition penetrated into the problems of life, secular and spiritual. The two are one. It is the hypocrites whom he denounced that pretend spirituality while grovelling in sensuality. In common with the genius of Hinduism, Vemana holds that the supreme end to be pursued by man is, the liberation of the individual Soul from the cycle of births and deaths and its absorption into **Paramathma**, the Supreme Soul, which pervades the universe. **Moksham** or liberation, which is not different from salvation and absorption into the universal spirit, is the objective of every wise person. But this objective cannot be gained if you are worldly and attached to the world. That attachment has its root in sensuality and that sensuality shows itself not merely in lust and in greed but in all that produces or enhances **ahankara**, egotism. That is to say, the feeling of pride, and the placing of the self above others. Every idea or institution that differentiates man from man and makes him think himself to be different and

superior, is a form of **ahankara**, or egotism, of self-love and self-pride, which inhibits the possibility of your being absorbed and dissolved into the eternal bliss of the universal spirit. Accordingly, Vemana attacks with ruthless logic the different religions current in his time-Saivism, Vaishnavism, Lingayatism and Buddhism-since the followers of every one of these religions considered themselves to be separate from the rest, and superior. Further more, this superiority was not based on real virtue and merit, but on pretension, on externals, through appeal to superstition, though hypocrisy and deceit, through retuals and symbols that degrade the soul instead of exalting it.

Even the idea of an **avatar** of God cannot be regarded as true, since God is everywhere and always, and there is no sense in saying that He takes for us a special birth.

Vemana's style ranges from bitter and caustic to mild sarcasm, gentle irony and sweet humour. Humour is his characteristic. He does not argue philosophically, but hits hard so as to inflict a mortal wound, and makes these infamous pretensions ridiculous.

It was Voltaire who laid down the grand maxim that in dealing with superstition there is no use arguing, for superstition is not amenable to reason. Sneer, and make it ridiculous. That will have more effect. Here is an instance of the Voltairian humour of Vemana. In disproof of **avatars** he says:

**kanaka mrugamu bhuvini kaladu ledanakaye**
**Taruni vidichi poye Dasaradhiyu**
**Thelivi lenivadu devu detlayeraa**
**Viswadabhi raama! Vinura Vema!**

Note the irony of the term taruni which means youthful woman in the full flush of her beauty. If it had been an old strumptet it would not have mattered. But imagine a God leaving a young and beautiful women behind in pursuit, through greed of gold, a deer.

Many people impress the multitude by performin gsacrifices and claiming thereby a superior spiritual status. But as is well-known, before the performance of the sacrifice could be commenced, the yajaman must get shaved and bathed. And here Vemana's flashing wit strikes like a lightning.

**Sakala yajnmulaji sakala theerdhambula**
**Thalalu goruga kunna phalamu ledu**
**Manthrajalamu kante mangali jala mechchu.**

Evils like social inequalities, gradations and degrations based on birth, are, generally speaking, attacked on two grounds. Firstly, on ehical grounds as being wrongs; secondly, on utilitarian grounds as weakening society, and leading ultimately to its destruction or subjugation by a stronger power. Vemana adds yet another line of attack. Such distinctions produce pride in the superiors and abasement in the inferiors, both of which are inimical to the salvation of the soul. Usually in most religions the idea prevails that individual's salvation could be acquired irrespective of one's conduct as a member of society. It is to the immortal credit of Vemana that he propounded the view that if you want to get absorbed into the universal spirit after your death, you must first get absorbed in universal humanity while you were alive, and this sublime feeling he expresses in the following verse:

**Voori vaarikella okka kanchamu petti**
**Potthu kudipi kulamu poliya jesi**
**Thalanu cheyi petti thaganamma cheppara**

I wonder whether Vemana got this idea of eating fraternally from one plate, without distinction between man and man from Islam, for there is one reference in his works to Islam:

**Annita paripoornu dalla mahatmudu**

Even granting that this line is authentic, I do not think that Vemana derived anything from anybody from he derived everything from himself. He wonders

why people do not realise that in spite of their pretensions to be different from each other, and higher or lower, they are just humans of like nature, of like essence and, alas! destined to a like end:

**Baapa danaga nemi? Bhakthu danaga nemi?**
**Jogi yanaga nemi? Sompu leka**
**Yenni perulaina ninajudu pani deerchu**

There is not an aspect of Hindu religiosity in its externals which has not been the target of Vemana's satire. Can we get salvation by bathing frequently? Well, then, all the fishes must be saved. can we get salvationby smearing ourselves with **vibhooti?** Why, then, a donkey rolls frequently in ashes? Can we get salvation by eschewing eating of meat and taking to vegetarianism, as though that is a religion?

**Akulella thinna meka pothula kela**
**kaaka poyenayya kaaya siddhi?**
**Loku lella verri pokillu poduru.**

As Regards the superstitious, what can you do with them? They are perverse by nature. You can straighten the snake-gourd **(potla kaaya)** by tying a stone but how can you ever straighten a dog's tail?

**Potlakaaya raayi podugu thratanu gatta**
**Leela thoda vanka leka perugu,**
**Kukka thoka katta kudurunaa chakkagaa**

In point of fact, character and nature are superior to knowledge. You can read Vedas, recite mantrams. But your book knowledge many not leave any impression on you, unless you are of the right nature. This is like Christ's parable: The seed may be sown, but whether it will produce a good crop or no crop or a bad crop depends on varied factors. The superistitious man is like a donkey carrying load of sandal-wood. The donkey does not get perfumed thereby:

**Heenu denni vidya lila nabhyasinchina**
**Ghanudu gaadu moraku janude gaani,**
**Parimalamula gardabhamu moya ghanamoune?**

Preparation for **moksham**, or freedom from **samsara** consists in eschewing **ahankara** and avoiding the temptations that bind you to the world, namely, lust and greed. Bhagavan Ramakrishna's warning against **kamini** and **kanchan** are well-known. In addition, all forms of egotism and **ahankara** must be overcome and over-thrown. Bhagavan Ramakrishna claimed that he was lower than the lowest of castes and denounced caste system and caste feeling. Vemana is the poetic anticipation of Ramakrishna. If you want to be one with God, you must be one with man. Caste is not only a social curse, a political blunder, but one of the worst hindrances to moksham, an anti-religion, which hypocritically poses as religion. get rid of it".

## ఇతర దేశాల ప్రముఖుల అభిప్రాయాలు

### పాశ్చాత్యుల అభిప్రాయాలు కొన్ని

"The plato of India" - *సర్ విలియం జోన్స్*

"Vemana a Rebel poet" - *మేజర్ ఆర్.ఎమ్. మేక్డొనాల్డ్*

"Popular poet" - *సి.వి. గోవర్*

"Far in advance of his age - *హెన్రీ బవర్స్*

'The one great poet of the people" - *డబ్ల్యు. హెచ్. కామ్ప్బెల్*

Teacher and preacher" - *ఎల్.డి. బార్నెట్*

*"వేమన ఒక నూతన ప్రవక్త" – జె.డి.బి. గ్రిబెల్.*

### తెలుగు ప్రముఖుల అభిప్రాయాలు కొన్ని

"Vemana true and rare genious" - *నార్ల వెంకటేశ్వరరావు*

"Vemana poet of nature - Natural poet" - *డా॥ సి.ఆర్.రెడ్డి*

*"ప్రజాకవి వేమన" – మరుపూరు కోదండ రామిరెడ్డి*

"నిక్కమైన తెలుగులో మొట్టమొదట కవిత్వం చెప్పినవాడు వేమనయే" – చిత్తజల్లు వరహాలరావు
"ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక
యుగంలో గురజాడ, తెలుగు సాహిత్యంలో మహాకవులు – శ్రీశ్రీ
"వేమన రాజయోగి" – శేషాద్రి రమణ కవులు
"సామాజిక విప్లవకవి వేమన" – డా॥ కత్తి పద్మారావు
"తొలి తెలుగు అభ్యుదయ కవి" – శశిశ్రీ
"ధిక్కారకవి వేమన" – డా॥ యం.యం. వినోదిని
"వ్యక్తిత్వ వికాసంలో "ఒకడు" వేమన" – డా॥ ద్వా.నా.శాస్త్రి.

**వేమనపై వెలువడిన గ్రంథాలను కొన్నింటిని చెప్పుకుందాము.**

| | |
|---|---|
| My discovery of Vemana | - *C.P. Brown* |
| Verses of Vemana | - *C.P. Brown* |
| Hindu manners, customs and ceremonies | - *J.A. Dubois* |
| The Musings of Mystic | - *మీర్ అహమ్మద్ ఆలీఖాన్* |
| Vemana, A South Indian poet | - *విలియం కాంబెల్* |
| Vemana | - *R.M. Macdonald* |
| The folk songs of South India | - *Charles E Goves.* |
| Some mile stones in Telugu literaturre | - *జి.ఆర్. సుబ్బరామయ్య పంతులు* |
| Vemana, His poetry and philosophy | - *G.V. Krishna Rao* |
| The heart of India | - *L.D. Barnett* |
| Vemana, the Telugu poet and saint | - *C. Ramakrishna Rao* |
| Vemana | – నార్ల వెంకటేశ్వరరావు |
| వేమన | – రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ |
| ప్రజాకవి వేమన | – డా॥ యన్.గోపి |
| వేమన సంపూర్ణ జీవిత చరిత్రము – బోధనలు | – వంగూరి సుబ్బారావు పంతులు |
| Saint Vemana and his philosophy | – *Telugu Academy* |
| వేమన యోగి | – దివాకర్ల వెంకటావధాని |
| Vemana through Western eyes | - *V.R. Narla* |
| వేమన చరిత్ర | – బండారు తమ్మయ్య |

| | |
|---|---|
| ప్రజాకవి వేమనయోగి | – మరుపూరు కోదండరామిరెడ్డి |
| వేమన్న – సర్వజ్ఞులు | – *గంధం అప్పారావు* |
| కవిత్వ తత్త్వ విచారము | – *డా॥ సి.ఆర్.రెడ్డి* |
| శతకవాఙ్మయ సర్వస్వము | – *వేదం వెంకటకృష్ణ శర్మ* |
| పోతన–వేమన యోగము | – *దిగవల్లి వెంకటశివరావు* |
| వేమన చరిత్ర | – ద్విపద కావ్యం |
| వేమనయోగి జీవితము | – *పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి* |
| వేమనకవి | – *చిలకమర్తి లక్ష్మీనరసింహం* |
| మహాయోగి వేమన | – *నేదునూరి గంగాధరరావు* |
| వేమన | – నమ్మాళ్వార్ |
| వేమనరెడ్డి | – *యల్. రాఘవరెడ్డి* |
| వేమన వేమారెడ్డి | – కపిల కాశీపతి |
| వేమన కాల నిర్ణయము | – *బండారు తమ్మయ్య* |
| వేమన యోగి, తత్కవిత | – కొత్త సత్యనారాయణ చౌదరి |
| వేమన కాల నిర్ణయము | – *చిలకల వెంకట సుబ్బారెడ్డి* |
| వేమన పద్యాల పారిస్‌ప్రతి | – *డా॥ యన్. గోపి* |
| తెలుగు వైతాళికలు – వేమన | – *తెలుగు విశ్వవిద్యాలయం* |
| సమగ్రాంధ్ర సాహిత్యము | – ఆరుద్ర |
| వేమన్న విప్లవం | – రామకృష్ణ |
| వేమన భావన | – *డా॥ యస్. గంగప్ప* |
| స్వర్ణయోగి (వేమన) | – పులిచెర్ల సాంబశివరావు |
| వేమన యోగీంద్ర చరిత్రము | – పూర్ణయాచార్యులు |
| వేమన కబీరుల సామాజిక దృక్పథం | – *డా॥ యస్.వి. రాఘవేంద్రరావు* |
| వేయి వెలుగుల వేమన | – *డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి* |

ఇవికాక వందకు పైగా పద్యగ్రంథములు, వ్యాసములు, నాటకములు, విమర్శలు వచ్చినవి.

ఇంతమంది ప్రపంచ మేధావులు, తెలుగు మేధావులు తడివిన చరిత్ర వేమనది. ఇంత విస్తారంగా ఏ కవిపైన చర్చ జరగలేదు. కారణం ఆయన ప్రతిపద్యం సామాజిక పునాదులపై వచ్చినదే.

ఆధునికులలో డా॥ యన్. గోపిగారు వేమనపై పరిశోధన చేసి ప్రచురించిన "ప్రజాకవి వేమన" గ్రంథం ప్రామాణికతను సంతరించుకొని సమాచార విస్తృతి కలిగి వున్నది. దేశవిదేశాలలో విషయసేకరణ చేసి ప్రచురించిన గ్రంథం ఇది. అందులో శతాబ్దంపై కాలం నుండి ప్రచురణలో వున్న వేమన చిత్రాలను పొందుపరచారు. అయితే చరిత్రకారులకు వేమన జీవించివున్న నాటి చిత్రాలు లభించలేదు. కొన్ని కొన్ని గ్రంథాలలో వచ్చిన చిత్రాలను స్వీకరించారు. వేమన వర్చస్సు, వేషధారణపై కూడ ఏకాభిప్రాయం లేదు.






అనేకులు వేమన సామాజిక తాత్విక చింతనను గూర్చి ఆలోచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం “వేమనయోగి విజ్ఞాన కేంద్రం” కడపలో స్థాపించారు. త్రిపురనేని వెంకటేశ్వరరావు విజయవాడలో “వేమన వికాస కేంద్రం” స్థాపించారు. యునెస్కో వారికోసం కాలిఫోర్నియాలో నారాయణమూర్తి అనువాద బృహత్కార్యక్రమం చేపట్టారు. కర్నూలు జిల్లా వెలిగోటిలో గుజ్జం వెంకటరెడ్డి గ్రంథాలు ప్రచురించాడు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం “వేమన పీఠం” ఏర్పరచారు. బెంగుళూరు (బెళహాళ్ళ)లో గుల్జార్ ఆలీ వేమన ఆశ్రమం పెట్టాడు. రంగూన్‌లో వేమన సమాజాలున్నవి. వేమన ఫౌండేషన్‌వారు, ఆంధ్రవిశ్వవిద్యాలయంవారు, తెలుగు సాహిత్య అకాడమీవారు గ్రంథ ప్రచురణ చేస్తున్నారు. ఆంధ్రరాష్ట్రంలో ప్రతి గ్రంథాలయంలో వేమనపై సాహిత్యం వున్నది.

కదిరికి ఆరుమైళ్ళ దూరంలో కటారుపల్లెలో వేమన సమాధి వున్నది. దానికి ధర్మకర్తలున్నారు. ఆ ప్రాంతంలో చాలమంది ప్రజల పేర్లు వేమ పదంతో వున్నాయి. పరిశోధకులందరూ కటారుపల్లెకు పోయివచ్చినవారే. కటారుపల్లెలో ప్రతి చైత్ర శుక్లపక్షం మొదటి ఆదివారం నాడు వేమన బ్రహోత్సవాలు జరుగుతాయి. రెడ్డి మహాజన సభలు, రెడ్డివాణి సంచిక, మరితర సంచికలూ వచ్చాయి. రెడ్డి జనాభ్యుదయ సంఘాలు లెక్కకు మించి ఉన్నాయి. నల్లచెరువులో వేమన ఉత్సవాలు జరుగుతాయి.



వేమన సమాధి – ఆలయ దృశ్యం




వేమన సమాధి గర్భగుడి దృశ్యం

## రైతు రాష్ట్రపతి

# డా॥ నీలం సంజీవరెడ్డి

Peasant ....... The President



జననం : 19–5–1913

మరణం : 1–6–1996

నీలం సంజీవరెడ్డి మహత్తర చరిత్ర కలిగిన రాజకీయ దురంధరుడు. ఆంధ్రరాష్ట్ర చరిత్రతో, భారతదేశ చరిత్రతో సమాంతర చరిత్ర గలగిన రాజకీయ వేత్త. ఒడుదుడుకుల

జీవితంలో స్థితప్రజ్ఞతతో సాగిన యోధుడు. గొప్ప జాతీయవాది. రాజకీయాలలో ఒక్కొక్క మెట్టు పైకెక్కిన నాయకుడు. శిఖరాలనందుకున్న మహానాయకుడు.

సంజీవరెడ్డి అనంతపురం జిల్లాలో పెన్నానది ఒడ్డునున్న ఇల్లూరు అనే కుగ్రామంలో 19-5-1913న జన్మించాడు. తండ్రి చిన్నపరెడ్డి, తల్లి సుబ్బమ్మ, భార్య నాగరత్నమ్మ తాత సంజీవరెడ్డి, తండ్రి గ్రామ మునసుబు, ధర్మరాజు, గ్రామ పెద్ద. సోదరుడు రాజశేఖరరెడ్డి (సి.పి.ఐ).

తల్లి సుబ్బమ్మ తరిమెలవారి ఆడపడుచు. సుబ్బమ్మ అన్న తరిమెల సుబ్బారెడ్డి. సుబ్బారెడ్డి కొడుకు నాగిరెడ్డి- ప్రముఖ సి.పి.ఐ (మార్క్సిస్టు) నాయకుడు - యం.యల్.ఎ. గా చేశాడు.

కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర రాజుల కాలంలో గల రెడ్డిరాజుల వారసులుగా స్వతంత్రకాంక్ష వుండే కుటుంబంలోని వాడు సంజీవరెడ్డి. చిన్నతనం నుండి స్వాతంత్రోద్యమంలో సైనికుడు. 18 సంవత్సరాల వయసులో గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడైనాడు. తండ్రి చిన్నపరెడ్డి మద్యపాన నిషేధ ఉద్యమంలో పాల్గొన్నాడు.

సంజీవరెడ్డి ఇల్లూరులో ప్రైవేటుగా విద్య నేర్చాడు. 9వ తరగతి వరకు చదివి మద్రాసు థియొసాఫికల్ స్కూలులో చేరాడు. మద్రాసులో వి.కె. కృష్ణమీనన్‌కు విద్యార్థి. తిరిగి అనంతపూరుకు వచ్చి, అనంతపురం గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజిలో యస్.యస్. యల్.సి. చదివాడు. ఒకసారి ఒక విద్యార్థి ఖద్దరు టోపీ పెట్టుకొని కాలేజికి వస్తే ప్రిన్సిపాల్ అభ్యంతర పెట్టాడు. అది తెలిసి మర్నాడు సంజీవరెడ్డి 200మంది విద్యార్థులచే ఖద్దరు టోపీలు ధరింపజేసి కాలేజికి తెచ్చాడు.

1929 సంవత్సరంలో గాంధీ అనంతపూరు వచ్చినపుడు సంజీవరెడ్డి ఆకర్షించ బడ్డాడు. అపుడు 16సంవత్సరాల వయసు. హైస్కూలు విద్యార్థి. విద్యార్థులను జాతీయోద్యమంలోకి తెచ్చాడు. ఖద్దరు వాడకం ప్రారంభించాడు. దేశం బానిసతనంలో మగ్గుతున్నదని, కాలేజిలో క్లాసుల్లో కూర్చోలేక 1931లో చదువుమాని, యువజన సంఘం పెట్టి ఉద్యమంలో కొచ్చాడు. డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్యగారలు ఆంధ్ర ప్రోవిన్షియల్ కాంగ్రెస్ కమిటీకి కార్యదర్శిని చేశారు. 1940లో 1941లో అరెస్టు కాబడ్డాడు. 1942లో అమరావతి జైలుకు ఖైదీగా వెళ్ళాడు. ఆ జైలులో సత్యమూర్తి, నిజలింగప్ప, ప్రకాశం, కళా

వెంకటరావు, కామరాజు నాడార్, వి.వి.గిరి., యన్.జి.రంగా, తెన్నేటి, అనంతశయనం, అల్లూరి సత్యనారాయణ గార్లతో పరిచయం ఏర్పడింది. 1942లోనే విడుదలై మరల అనంతపురంలో అరెస్టై జైలులో వున్నపుడు ఆంధ్రా ప్రొవిన్షియల్ కాంగ్రెస్‌కు కార్యదర్శిగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీవారు నియమించారు. 1942లో నెల్లూరు జైలుకు తరలించారు. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం తరువాత విడుదలయాడు.

1946లో వచ్చిన ఎన్నికలలో అనంతపూరు నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా తన బావ కమ్యూనిస్టు అభ్యర్థి తరిమెల నాగిరెడ్డిపై పోటీ చేసి గెలిచాడు. రాజ్యాంగ రచనా శాసనసభ (Constituent Assembly)కి ఎన్నికైనాడు.

1949లో పి.యస్. కుమారస్వామి రాజాగారి మంత్రివర్గంలో మొదటిగా ప్రొహిబిషన్, అడవులు, హౌసింగ్ శాఖల మంత్రిగా పనిచేసి పేరు తెచ్చుకున్నాడు.

1950 ప్రొవిన్షియల్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఎన్.జి.రంగా పై ఓడి మరల 1951 ఎన్నికల్లో గెలిచాడు. రెడ్డి × కమ్మ ఫీలింగ్ వచ్చింది. రాయలసీమ × సర్కారు ఫీలింగ్ వచ్చింది. రంగా, ప్రకాశం రాజీనామాలిచ్చారు. 1952లో బావమరది తరిమెల నాగిరెడ్డిపై పోటీచేసి ఓడాడు.

1952 ఆంధ్రరాష్ట్ర (భాషా ప్రయుక్త రాష్ట్రాల) ఉద్యమం వచ్చింది. 19.10.1952 పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేపట్టి 57రోజులు దీక్ష చేసి ప్రాణం వదిలాడు. అపుడు సంజీవరెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు. ఆంధ్రరాష్ట్రం కోసం ప్రముఖులతో చర్చలు జరిపాడు. 2.10.1953న కర్నూలులో నెహ్రూ ఆంధ్రరాష్ట్రం ప్రకటించాడు. అపుడు సంజీవరెడ్డి ఆంధ్రాకు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడైనాడు. కాళహస్తి నుండి ఎన్నిక కాబడి వున్నాడు. కాంగ్రెస్ ఇబ్బందుల్లో వుంది. ఇబ్బందులు తొలగించుటకు వృద్ధ సింహం ప్రకాశంను తిరిగి కాంగ్రెస్‌లోకి తెచ్చి ముఖ్యమంత్రిని చేశాడు. తాను డిప్యూటీ ముఖ్యమంత్రిగా వున్నాడు.

1954లో ప్రకాశం మంత్రివర్గం అవిశ్వాసంపై కూలిపోయింది. రాష్ట్రపతి పాలన వచ్చింది. 1955లో మధ్యంతర ఎన్నికలొచ్చాయి. కమ్యూనిస్టు ప్రాబల్యం ఎక్కువగా వున్నది. బెజవాడ గోపాలరెడ్డిని ముఖ్యమంత్రిని చేయుటకు తాను పోటీనుంచి తప్పుకున్నాడు. గోపాలరెడ్డి ముఖ్యమంత్రి అయాడు. సంజీవరెడ్డి రెండవ దఫా ఉపముఖ్యమంత్రి అయాడు. నాగార్జున సాగర్‌కు నెహ్రూచే శంఖుస్థాపనకు ముఖ్యపాత్ర వహించాడు.

1956 ఆంధ్రప్రదేశ్ కోసం హైదరాబాదు ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తో చర్చలు జరిపి ఆంధ్రపద్రేశ్‌ను 1.11.1956న సాధించారు. అపుడు ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశాడు. 1958లో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చి గౌరవించింది.

1959కి నెహ్రూ దృష్టిలో బాగా పడ్డాడు. 1959లో అఖిల భారత కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడై జాతీయ నాయకుడైనాడు. అప్పటికి సంజీవరెడ్డి వయసు 47 సంవత్సరాలు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ముఖ్యనాయకులలో ఒకడైనాడు.

1962లో ద్రోణాచలం నుండి శాసనసభ్యుడై ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెసు పార్టీని ప్రమాదం నుండి తప్పించి రెండవసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయినాడు. విజయవాడ వద్ద కృష్ణానదిపై రెగ్యులేటర్–కమ్–రోడ్ బ్రిడ్జి కట్టించాడు. భద్రాచలం వద్ద గోదావరిపై రోడ్ బ్రిడ్జి నిర్మించాడు. క్రీ.శ. 14వ శతాబ్దంలో ప్రోలయ వేమారెడ్డి శ్రీశైలం వద్ద పాతాళగంగకు మెట్లు కడితే, సంజీవరెడ్డి శ్రీశైలంకు రోడ్డు నిర్మాణం చేశాడు. శ్రీశైలంకు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ తెచ్చాడు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం చేశాడు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయినపుడు శ్రీశైలం ప్రాజెక్టుకు నీలం సంజీవరెడ్డి సాగర్ అని పేరు పెట్టి గౌరవించారు. విద్యారంగంపై దృష్టి సారించి బాలికలకు ఉచితవిద్య, తిరుపతిలో విశ్వవిద్యాలయం, జిల్లాకొక పాలిటెక్నిక్ కాలేజి, మెడికల్ కాలేజీలు పెట్టించాడు.

1963లో డా॥ కె.యల్.రావు సహకారంతో సర్వే చేయించి, జూన్ నెలలో ప్రధానమంత్రి నెహ్రూగారిచే శ్రీశైలం ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేయించాడు. డా॥ కె.యల్. రావును రాజకీయాల్లోకి తెచ్చాడు.

బస్సు రూట్లు జాతీయం మొదలు పెట్టాడు. ఆర్.టి.సి. ఏర్పాటైంది. కృష్ణాజిల్లాతో మొదలైంది జాతీయం. ఇది 1966 దాకా కృష్ణాజిల్లాలో ఒక వర్గానికి కడుపులో మంటగా వుండి 1966లో సంజీవరెడ్డి విగ్రహాన్ని విరగ్గొట్టి కృష్ణ కాలువలో తోశారు. చలించలేదాయన. కర్నూలు జిల్లాలో జాతీయం చేసినప్పుడు వ్యాజ్యం హైకోర్టుకు పోయింది. తరువాత సుప్రీంకోర్టుకు పోయింది. సంజీవరెడ్డి రిట్‌లో పార్టీ కాకపోయినా ఆయనపై అభియోగం వచ్చింది. ఆయన సమాధానం అఫిడవిట్ కోర్టులో వేయలేదని సుప్రింకోర్టు కామెంట్ చేసింది.

వాస్తవానికి ఆయన రిట్‌లో పార్టీ కాదు కాబట్టి అఫిడవిట్ వేయబనిలేదు. కోర్టు కామెంటును గౌరవిస్తూ 26.2.1964న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశాడు.

రాష్ట్రంలో రైతులకు విరివిగా విద్యుచ్ఛక్తి సరఫరా చేయించాడు. వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు స్థాపన చేశాడు. హైదరాబాదులోని రాజేంద్రనగర్‌లో, వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపన చేశాడు. శ్రీశైలం, పోచంపాడు, వంశధార, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్మాణం సత్వర పూర్తికి చర్యలు చేపట్టాడు.

1964లో నెహ్రూ మరణించాడు. లాల్ బహదూర్ శాస్త్రి ప్రధానమంత్రయాడు. ఆయన కాబినెట్‌లో సంజీవరెడ్డి స్టీల్ మరియు గనుల మంత్రి అయాడు. 1965లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం వచ్చింది. అదే సంవత్సరం పాక్‌తో యుద్ధం కూడ వచ్చింది. జనవరి 1966లో లాల్‌బహదూర్ శాస్త్రి మరణించాడు. లాల్ బహదూర్ ప్రధానమంత్రిగా వున్నపుడు గోదావరిపై రాజమండ్రి వద్ద రోడ్–కమ్–రైలు బ్రిడ్జి నిర్మింపజేశాడు.

1966లో ఇందిరాగాంధీ కాబినెట్‌లో ట్రాన్స్‌పోర్టు, టూరిజం, సివిల్ ఏవియేషన్ మంత్రిగా చేశాడు. ఇందిరాగాంధీ స్టీల్ ప్లాంటుకు శంఖుస్థాపన చేసిందే కాని పని ప్రారంభం కాలేదు.

ఇందిరాగాంధి సంజీవరెడ్డిని మంత్రివర్గం నుంచి తప్పించి లోక్‌సభ స్పీకరుగా ప్రపోజ్ చేస్తానని చెప్పికూడ మాట తప్పింది. సంజీవరెడ్డిపై ఇండిపెండెంట్ అభ్యర్థి తెన్నేటి విశ్వనాథంను పోటీ పెట్టి ఓడింది. సంజీవరెడ్డి గెలిచాడు. దేశ నాల్గవ స్పీకరైనాడు. అద్భుతంగా లోక్‌సభను నడిపాడు. ఎవరి ఆటలు సాగలేదు. అత్యున్నత నైతికతను ప్రమాణాలను పాటిస్తూ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి రాజీనామా చేశాడు. కాంగ్రెస్ వాడని కాక అందరివాడయాడు. నేను "Watchman of parliament" అన్న నిజాయితీ పరుడు. ఇతర దేశాలకు డెలిగేట్లను తీసుకెళ్ళాడు.

17–5–1969న ఇందిరాగాంధీ సంజీవరెడ్డిని తన ఇంటికి పిలిచి రాష్ట్రపతిగా పోటీచేయమన్నది. దురుద్దేశం ఆమె కడుపులో వున్నదని కొందరు సంశయించారు. ఆమె పట్టుబట్టింది. బెంగుళూరు సమావేశంలో సంజీవరెడ్డిని ఖాయం చేశారు. స్పీకరు పదవికి రాజీనామా చేశాడు. రాష్ట్రపతిగా సంజీవరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఇందిరాగాంధీ ప్రపోజ్ చేసింది.

వి.వి.గిరి ఇండిపెండెంట్‌గా పోటీలో కొచ్చాడు. గాంధేయవాదులంతా సంజీవరెడ్డిని బల పరుస్తున్నారు. రాడికల్స్ వ్యతిరేకిస్తూ ఇందిరాగాంధీకి ఆమె నాయకత్వం ఇక వుండదని ఎక్కబొడిచారు. అసత్య సంగతులతో సంజీవరెడ్డిపై కరపత్రం వేశారు. వెన్నుపోటు ప్రారంభమైంది. డబ్బు, మద్యం పనిచేసింది. దుర్మార్గంగా ఇందిరాగాంధీ విప్ ఇవ్వలేదు. అంతరాత్మ ప్రభోదం నినాదం ఇచ్చింది. సంజీవరెడ్డి ఓడిపోయాడు. ఇందిరాగాంధి దుష్టురాలని ప్రపంచానికి అర్థమైంది.

1971 లోక్‌సభ ఎన్నికలలో సంజీవరెడ్డి ఓడిపోయాడు. 1972 ప్రత్యేక తెలంగాణా ఉద్యమం వచ్చింది. సంజీవరెడ్డి వ్యతిరేకించాడు.

1973లో వైద్య పరిక్షలకు ఢిల్లీ AIMS కు వెళ్ళాడు. ఇందిరాగాంధీ హాస్పిటలులో ఆయనను పరామర్శించింది. దేశ పరిస్థితులు అధ్వాన్నంగా వున్నై. జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమం ప్రారంభించాడు. దేశమంతా తిరిగాడు. సంజీవరెడ్డి, జె.పి. ఉద్యమంలో చేరాడు. తరిమెల నాగిరెడ్డితో కూడ కలిసి దేశమంతా లోక్ సంఘర్ష సమితి ద్వారా తిరిగాడు.

12-6-1975న ఎలెక్షన్ కేసులో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఆమె రాజీనామా చేయలేదు. ప్రధానిగానే సాగింది.

25-6-1975న ఇంటర్నల్ ఎమర్జన్సీ పెట్టింది. నాయకులనందరినీ అరెస్టులు చేయించింది. సంజీవరెడ్డిపై గృహ నిర్భంధము, నిత్య నిఘా విధించింది. సంజీవరెడ్డిని అరెస్టు చేస్తే దక్షిణ భారతదేశం తిరగబడుతుందని ఆమెకు నిఘా వర్గాలు సమాచార మిచ్చాయి.

1977 జనవరిలో లోక్‌సభను రద్దు చేయించి ఎన్నికలు పెట్టింది. అపుడు జనతాపార్టీ ఆవిర్భవించింది. సంజీవరెడ్డి జనతాపార్టీ ఆవిర్భావ సభ్యుడైనాడు. ఆంధ్రలో 42సీట్లకు జనతాపార్టీ అభ్యర్థులను పెడితే సంజీవరెడ్డి ఒక్కడే నంద్యాల నుండి గెలిచాడు. మొరార్జీ ప్రధానమంత్రి అయాడు.


26-3-1977న సంజీవరెడ్డిని మొరార్జిదేశాయ్ స్పీకరుగా నిలబెట్టి గెలిపించాడు. మొరార్జి పథకం ప్రకారం, 1977 జూలైలో సంజీవరెడ్డి ఏకగ్రీవంగా దేశానికి 6వ రాష్ట్రపతి అయాడు. అప్పటి వరకు ఆయనొక్కడే ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ రాష్ట్రపతి. 1982 వరకు రాష్ట్రపతిగా కొనసాగాడు. ఈలోపునే జనతా ప్రభుత్వం పడిపోయింది.

దేశాయ్ తర్వాత, రాష్ట్రపతి హోదాలో సంజీవరెడ్డి చరణ్‌సింగ్‌కు ప్రధానమంత్రి అయే అవకాశమిచ్చాడు. ఆగస్టు లోపల మెజారిటీ రుజువు చేసుకోమన్నాడు. కాని పార్లమెంటులో అడుగుపెట్టకుండానే చరణ్‌సింగ్ తొలిగిపోయాడు.

1980లో మళ్ళీ ఇందిరాగాంధీ గెలిచి వచ్చినప్పుడు ప్రధానమంత్రిగా ఆమెచే ప్రమాణం చేయించాడు.

రాష్ట్రపతి కాలపరిమితి దాటిన తరువాత రామక్రృష్ణ హెగ్డే తన రాష్ట్రం కర్నాటకలో నివసించమనగా అంగీకరించక అనంతపూరుకే వచ్చాడు. 1989లో రాష్ట్రపతిగా తన అనుభవాలను గ్రంథంగా రాశాడు. “నేను భారతీయుడను. ఏ ప్రాంతానికో, రాష్ట్రానికో చెందినవాడను కాను. అందుకే నా మరణానంతరం నేనెక్కడ వుంటే అక్కడే నా అంత్యక్రియలు జరపండి” అని చివరి రోజుల్లో కోరాడు. 1-6-1996 తేదీన న్యూమోనియా వలన బెంగుళూరులో స్వర్గస్తులైనారు. బెంగుళూరు దగ్గరలో కల్లహల్లి వద్ద సమాధి చేయబడ్డాడు.

తదుపరి కేంద్రప్రభుత్వం ఆయనపై గౌరవ సూచికంగా ఆయన ఫోటోతో పోస్టల్ స్టాంపును, పోస్టల్ కవరును విడుదల చేసింది.




హైదరాబాదులో ఆయన పేరును ఒక కాలేజికి పెట్టింది.

రాజ్యాంగ శాసనసభ సభ్యుడుగా, రెండుసార్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, రెండుసార్లు జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా, రెండుసార్లు లోక్‌సభ స్పీకరుగా, దేశానికి 6వ రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన నాయకుడుగా పలువురు దేశనాయకులచే ప్రస్తుతింపబడ్డ వ్యక్తి సంజీవరెడ్డి.

## కామరాజ్ నాడార్ ఇలా అన్నారు

"Neelam Sanjeeva Reddy, a strong force in the country. A force for peace, stability and progress".

## వాజ్‌పేయి ఇలా అన్నారు

"మంచి మనసు, వ్యక్తిత్వం కలిగిన సంజీవరెడ్డి ఆశయాలు సిద్ధాంతాలు కలిగిన వారందరితో సుహృద్భావ సంబంధాలు కలిగి విలక్షణ పంథాలో విధులు నిర్వహించాడు"

## పి.వి. నరసింహారావు ఇలా అన్నారు

"Neelam Sanjeeva Reddy is adequate, effective and eminently appropriate for the role he is called upon to play".

## అతుల్య ఘోష్ ఇలా అన్నారు


"A person of ability, capable of solving complicated issues of great importance".

## సాదిక్ ఆలి ఇలా అన్నారు

"Sanjeeva Reddy is a man of greate energy. He loves adventure. He has a restless curiosity".

సంజీవరెడ్డి ఏ పదవిలోవున్నా విద్యుత్తులా ప్రవహించాడు. ఏ డిగ్రీ లేకున్నా డిగ్నిటీతో పరిపాలించాడు దేశానిని. సంజీవరెడ్డిని మొనగాళ్ళకు మొనగాడిగా భావించారు. ఆయన ఒక విప్లవ కెరటం. కాకలు దీరిన రాజకీయవేత్త. ప్రముఖ రాజనీతిజ్ఞుడు. ఉన్నత ప్రమాణాలను నిర్మించిన ఉత్తమ వ్యక్తి. ఆయన హయాంలో ప్రతి రెడ్డీ, కాలరు ఎగరేసి జీవించారు. సంజీవరెడ్డి రాజకీయాలలో ఉన్నన్ని రోజుల్లో ఇటు ఆంధ్రరాష్ట్రంలోను, అటు దేశంలోను ఆయన లేకుండా ఏ రాజకీయ పరిణామం జరగలేదు. దాదాపు 1930 సంవత్సరం ప్రాంతాల నుండి సంజీవరెడ్డితోనే, సంజీవరెడ్డి చుట్టూనే రాజకీయం, ప్రభుత్వం నడిచింది. సంజీవరెడ్డి శకంగా గుర్తించబడింది. ఇంతటి బృహత్తర చరిత్ర గలిగిన ప్రముఖుడు, రెడ్డిజాతికి అనర్ఘమణియే; సదా స్మరణీయుడే.

# ఓమందూర్ రామస్వామి రెడ్డి



జననం : 1-2-1895
మరణం : 25-8-1970

మద్రాసు ప్రెసిడెన్సీ (Madras Presidency) అనగా తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ ప్రాంతాలు ఒకటిగా వున్న ప్రాంతానికి ప్రీమియర్ @ ముఖ్యమంత్రిగా పనిచేసిన తెలుగు మహితాత్ముడే ఓమందూర్ రామస్వామిరెడ్డి. క్రమశిక్షణ, చిత్తశుద్ధి, దేశభక్తి, దైవభక్తి, ఉదారస్వభావం, సౌశీల్యం, నిస్వార్ధపరాయణత్వం వంటి సుగుణాలు కలవ్యక్తి.

తమిళనాడులోని విల్లుపురం జిల్లా, దిండివనం పట్టణ సరిహద్దు గ్రామమైన ఓమందూరులో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. వీరిది తెలుగు రెడ్డి కుటుంబం. ఆయన 1-2-1895న జన్మించారు. వారు బాల్యంనుండే పువ్వుపుట్టగానే పరిమళిస్తుందన్నట్లు ఎదిగారు. సత్యప్రవర్తన, క్రమశిక్షణ, పౌరభావాలు కల్గినవారు. పేదరికం మూలంగా పెద్ద చదువులు చదివే అవకాశం కలుగలేదు. గ్రామంలోనే వాక్టర్ స్కడ్డర్ స్కూలులో ప్రాథమిక విద్య పొందారు. మాధ్యమిక పాఠశాలలో 8వ తరగతి వరకు చదివారు. విద్యార్థి దశ నుండి గురుభక్తి, దైవభక్తి కలిగియుండినారు.

చదువుకంటే ప్రపంచ జ్ఞానం మిన్న అన్నది వారు నమ్మిన సత్యం. ప్రజలతో ముఖ్యంగా రైతులతో గడిపిన కాలం అధికం. వారికి తమిళంలో అసాధారణ ప్రతిభ, ఆంగ్లంలో సాధారణ పరిజ్ఞానం ఉండేది. తెలుగు, హిందీ భాషలలో సరళంగా మాట్లాడేవారు. ఆత్మస్థైర్యం గల సిపాయి వంటివారు. మహాత్మాగాంధి గారి సందేశాలతో, అభిప్రాయాలతో ఉత్తేజితుడైనాడు. స్వాతంత్ర్య సంగ్రామంలో అనేక త్యాగాలు చేసి, కారాగారవాసం అనుభవించిన దేశభక్తుడు. వారికి దేశభక్తి, దైవభక్తి రెండు కళ్లలాంటివి. నిబద్ధతగల కొందఱు పెద్దలలో మాణిక్యంలాంటివారు. స్వయంకృషి వల్లనే మద్రాసు మాగాణానికి ముఖ్యమంత్రి కాగలిగిన దీర్ఘదర్శి.

ఓమందూర్ రామస్వామిరెడ్డిగారు తమ బాల్యం నుండే మహాత్మాగాంధి గారి అభిప్రాయాలకు ఆకర్షింపబడి, తెల్లదొరలకు, వారి పరిపాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. 1920లో నాగపూర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్నారు. తర్వాత దేశరాజకీయాలలో చురుకుగా పాల్గొన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, మంచి రాజకీయవేత్తగా పేరు పొందారు. 1932లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. 1940లో సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. 1942లో తెల్లదొరలను దేశాన్ని వదిలిపోండి (Quit India Movement) అనే ఉద్యమంలో పాల్గొని, కారాగార శిక్షను అనుభవించారు.

## ముఖ్యమంత్రి :

1947వ సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన మద్రాసు రాష్ట్ర శాసనసభ కాంగ్రెసు పార్టీ సమావేశమైనప్పుడు ముఖ్యమంత్రి పదవికి ఓమందూర్‌వారు, టంగుటూరు ప్రకాశం పంతులు

గారు పోటీపడ్డారు. ఈ పోటీలో కామరాజ్ నాదర్ మద్దతుతో ఓమందూర్‌వారు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. 23.03.1947 నుండి 06.04.1949 వరకు వారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. అపుడు ఎండోమెంట్స్ శాఖ, హరిజనోద్ధరణ శాఖలూ నిర్వహించారు. ఆయన మంత్రివర్గంలో భక్తవత్సలం, సుబ్బరాయన్, వేముల కూర్మయ్య, కల్లూరి చంద్రమౌళి, కళా వెంకటరావు వగైరాలు సభ్యులుగా వున్నారు. తదుపరి ఎన్నికలలో కాంగ్రెసు నాయకులు సి. రాజగోపాలాచారి, టంగుటూరి ప్రకాశం, పి. సుబ్బరాయన్ గారలు అనుకూలించినా కామరాజ్ నాదర్ వ్యతిరేకించారు. అపుడు కుమారస్వామిరాజా ముఖ్యమంత్రి అయారు. తదుపరి రాజ్యాంగ నిర్మాణ అసెంబ్లీ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు.

ఓమందూర్‌వారు ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన కొద్ది కాలానికే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1947 ఆగస్టు 15వ తేదీన వారు ముఖ్యమంత్రిగా ఉండి, ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. శాసనసభలో స్వాతంత్రపు వేడుకలను నిర్వహించే సమయంలో వారి ప్రసంగం చాలా విలువైనది.

ప్రజలందరు విద్యార్జనతో, ధనధాన్యాలతో సమృద్ధిగా జీవించాలి. ప్రజలకు నిత్య నైమిత్తికాలైన కూడు, గుడ్డ, నీడ సమకూరాలి. పేదరికం నిర్మూలింపబడాలి. పేదవాళ్లు, ధనవంతులనే తేడా లేని విధంగా శాసనాలు తయారు చేయబడాలి. దేశాభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు పాటుపడాలని వారు ఉద్ఘాటించారు. ఉద్యోగస్తులు నీతితో, బుద్ధిచాతుర్యంతో బాధ్యతాయుతంగా దేశాభివృద్ధికి కృషిచేయాలి. ప్రజలందరు ఐకమత్యంతో మెలిగి, మన మందరం భారతమాత ముద్దు బిడ్డలమనే భావనతో సమాజాభివృద్ధికి పాటుపడాలి.

వారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామాలకు ఆర్థిక స్తోమత కలిగే విధంగా ప్రభుత్వంలో రేయింబవళ్లు కృషి చేసారు. అందువలన వ్యవసాయ ముఖ్యమంత్రిగా ప్రజలచే పిలువబడినారు.

ముఖ్యమంత్రిగా పనిచేసింది రెండేళ్ల కాలం మాత్రమే అయినా, అనితర సాధ్యమయిన కార్యాలు చేయగలిగారు.

హిందూధర్మ సంస్థాపనరంగం శాసనరూపం దాల్చింది. దళితులకు, ఇతర హిందూ అస్పృశ్యులకు, ప్రజలందరకు దేవాలయాల ప్రవేశం కల్పిస్తూ శాసనం చేయబడింది. దేవదాసీత్వాన్ని రూపుమాపటానికి శాసనం చేశారు. సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలుపరచిన ఘనత వారికే చెల్లుతుంది. 25 జిల్లాల్లో ఒకే రోజున కల్లు దుకాణాలు మూతపడ్డాయి. ఆ కాలంలో మద్య నిషేధం వలన ప్రభుత్వపు ఖజానాకు 18కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతుందని అధికారులు చెప్పినప్పుడు ఓమందూర్ వారి మాటలివి: 'ఈ 18 కోట్ల రూపాయల ఆదాయం కోసం ప్రభుత్వం సారాయి దుకాణాలు నడిపితే, దీనివలన ప్రజలకు 81కోట్ల నష్టం ఏర్పడుతుం'దని బదులిచ్చారు. ఈ విధంగా వారికి సమాజం ఎడల గల దీర్ఘదృష్టి మనకు తెలుస్తుంది. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత హైదరాబాదు సంస్థానాన్ని భారతదేశంలో విలీనం గావించటానికి ప్రముఖ పాత్ర పోషించారు. జమీన్ ఇనాందారీ విధానాన్ని నిర్మూలిస్తూ శాసనం చేశారు.

## సాధనలు :

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా, రైతు సంక్షేమమే పరమావధిగా ఎంచి బావులు త్రవ్వటకు అప్పులు మంజూరు చేయు ప్రణాళికను రూపొందించి అమలు చేశారు. బావులు త్రవ్వటకు మాన్యం ప్రకటించారు. రైతుల వ్యవసాయానికి మెట్ట భూములపైర్లకు మాన్యం ప్రకటించి విప్లవాత్మకమైన మార్పు తెచ్చారు. 10,000 పాఠశాలల్లో కాయకూరల తోటలను పెంచే పథకాన్ని విజయవంతం గావించారు. చెఱువులు, గుంటలు పూడికతీసి నీటి సామర్థ్యాన్ని ఎక్కువ చేసేటట్లుగా విజయభేరి మ్రోగించారు. వరికి తక్కువగానున్న సేకరణ ధరను కేంద్రంతో పోరాడి పెంచుటలో సఫలీకృతులైనారు. రైతుల వ్యవసాయానికి నీరందే విధంగా భవానీసాగర్, విడూర్ ఆనకట్టలను కట్టుటకు శంకుస్థాపన చేశారు. పెరియార్ హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు ఓమందూర్‌వారి కాలంనందే ప్రారంభించబడింది. కరువు ఏర్పడినప్పుడు దక్షిణ తమిళనాడులోని ప్రజలను ధనసహాయంతో ఆదుకొన్నారు. తమిళ భాషాభివృద్ధికి పాఠశాలల్లో తగిన ఏర్పాట్లు గావించారు. దేవాలయాలలో తమిళంలో పేర్లు వ్రాయించారు. తమిళ ప్రభుత్వ చిహ్నం గోపురం క్రింద సత్యమేవ జయతే అన్న వాక్యాన్ని ఓమందూర్‌వారు చేర్పించారు. మద్రాసు ప్రభుత్వం తరపున మొదటిగా విమానం కొనిపించింది రెడ్డిగారే.

## పొగడ్తలు :

ఓమందూర్‌వారి దేశభక్తి, సేవాకార్యాలను చూచి ముగ్ధులైన ఆనాటి నాయకులు ఎన్నో రకాలుగా కీర్తించారు. ఆనాటి ప్రధానమంత్రి నెహ్రూగారు ఓమందుర్‌వారిని సాన పట్టిన వజ్రంగా కీర్తించారు. రాజాజిగారు పవిత్రమైన ఆత్మగా చిత్రీకరించారు. అణ్ణాదురైగారు ఓమందూర్ రామస్వామి కాదు, గాంధి రామస్వామి అని అభివర్ణించారు. ఎస్.ఎం.ఆర్. సుబ్బరాయన్‌గారు, తాను తప్పుచేయడు, ఇతరులు తప్పు చేయుటకు అనుమతించని ఉత్తముడు ఓమందూర్‌వారు అని శ్లాఘించారు. అవినాశలింగంవారు, పరిపాలనాక్రమంలో దయాదాక్షిణ్యాలు చూడక నీతితో పరిపాలించిన వ్యవసాయ ముఖ్యమంత్రి ఓమందూర్ అని పొగిడారు. కీ.శే. డా. జె. జయలలితగారు, "సాధారణ గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించి, చెన్నై నగరంలో విద్యనభ్యసించి, మహాత్మాగాంధిగారి నిజమైన శిష్యుడుగా నుండి, స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొని, ఖద్దరు దుస్తుల అమ్మకంలో ముఖ్యపాత్ర వహించి, యువకులను వెతికి వారికి జీవితంలో చదువుతో పాటు మంచి గుణగణాలు గల్గిన పౌరులుగా శిక్షణ చాతుర్యాలను ఒసగిన మహాపురుషుడు" అని కీర్తించారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి డా.ఎమ్. కరుణానిధిగారు, సాంఘిక నీతి ప్రాతిపదికగా రిజర్వేషన్లు కల్గించుటలో వెనుకబడిన జాతులను ఒకటిగా చేర్చిన ఘనత ఓమందూర్ గారికే దక్కుతుంది అని అన్నారు. గడ్డంలేని పెరియారుగా పొగడ్తలనందుకొన్న ఓమందూర్ వారికి జ్ఞాపక చిహ్నంగా చెన్నై ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి "ఓమందూరార్ అరసినర్ తోట్టమ్" అనే పేరు 1998 ఆగస్టు నెలలో తాము పెట్టినట్లుగా తెలియజేశారు. ఓమందూర్‌వారి శతాబ్ది సందర్భంగా వారి గ్రామంలో 40 లక్షల రూపాయల వ్యయంతో వారి విగ్రహాన్ని, మణిమండపాన్ని నిర్మించటానికి ఏర్పాట్లు గావించినట్లు తెలియజేశారు.

## పదవీ విరమణ :

నీతిమంతమైన పరిపాలన, తప్పులను ఖండించే గుణాలు కలిగిన ఓమందూర్ వారి నిజాయితీలను ఓర్వలేని నాటి కాంగ్రెసు నేతలు, వారిని ముఖ్యమంత్రి పదవినుండి తొలగించ ప్రయత్నించుచున్నారనే వార్తలు వెలువడగానే, తానే రాజీనామా ఇచ్చి ప్రభుత్వ సౌకర్యాలను కూడ వద్దని 06.04.1948 నుండి తమ గ్రామంలో వ్యవసాయ రంగానికి శేషజీవితాన్ని

అంకితం గావించారు. తదుపరి ఆయన గౌరవార్థం తమిళనాడు లెజిస్లేటివ్ అసెంబ్లీ భవనానికి ఆయన పేరు పెట్టారు. మద్రాసు ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా నియమించారు.


**దైవభక్తి :**

ముఖ్యమంత్రి పదవి వదిలిన తరువాత ఓమందూర్‌గారి మనస్సు దైవభక్తివైపు సాగింది. వల్లలార్ జీవించిన ప్రాంతంనందే జీవనం సాగించారు. వల్లలార్ భక్తుడు. రైతుగానే తిరిగి జీవితయాత్ర కొనసాగించారు. ఆయన కృషి వలన వడలూర్ ప్రాంతపు వ్యవసాయ భూములు అధిక సారవంతమైన భూములుగా మార్చబడ్డాయి.

"శుద్ధ సన్మార్గ నిలయం" స్థాపించి, దాని ద్వారా గురుకుల పాఠశాల, అప్పర్ ఆరాధనలు, పేద విద్యార్థులకు వసతి గృహాలు, దైవభక్త కూటమి, రామలింగ వల్లలార్ సేవాసంస్థలు ఏర్పడ్డాయి.

24.10.1947 విజయ దశమిరోజున స్వామి వివేకానంద విద్యావనాన్ని ప్రారంభించారు. అనారోగ్యానికి గురి అయిన ఓమందూరార్ వడలూరు – కడలూరు జిల్లాలో 25.8.1970న పరమపదం పొందారు. వారి సేవలు చిరస్మరణీయములు.

రెడ్డిగారి దేశసేవలను గుర్తించి భారత ప్రభుత్వం 25–8–2010 తేదీన ఆయన పేరుపై పోస్టల్ స్టాంపును ముద్రించి విడుదల చేశారు.




ఓమందూరార్ వారి జీవితం తెరచిన పుస్తకం. దాని నుండి నేటి తరాలవారే కాక, భావితరాల వారు గూడ నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. వారి వలన ప్రభావితులయిన వారే కాక, ప్రభావితులు కావలసిన వారెంతో మంది ఉన్నారు. రెడ్డిజాతికి కీర్తి తెచ్చిన రాజకీయ నాయకులలో రామస్వామి రెడ్డియార్‌ది ప్రత్యేక స్థానం. *(సౌజన్యం – తిరునగరి భాస్కర్, చెన్నై)*

# కె.సి.రెడ్డి



జననం : 4.5.1902
మరణం : 27.02.1976

కె.సి. రెడ్డిగారి పూర్తిపేరు క్యాసంబెళ్ళి చెంగలరాయ రెడ్డి. తండ్రి వెంకటరెడ్డి, తల్లి గంగోజమ్మ. వొక్కలిగ కుటుంబం. నేటి కర్నాటక రాష్ట్రం కోలారు జిల్లా బంగారుపేట తాలూకాలోని క్యాసంబెళ్ళి గ్రామం. అమ్మమ్మ గారిది చిత్తూరు జిల్లా కుప్పం తాలూకా రాజాపేట. అక్కడే అమ్మమ్మ గారింట్లో జన్మించాడు. పాఠశాల విద్య కె.జి.ఫ్‌లో చదివాడు. లండన్‌లో

ఉన్నత విద్య. 1920 సం॥లో మద్రాసులో బి.ఎ. చదివి బంగారు పతకం సాధించాడు. 1926లో మద్రాసులోనే లా చదివి లాయరు పట్టా పుచ్చుకున్నాడు. మంచివక్త.

1927లో రాజకీయాలవైపు మొగ్గాడు. ప్రజాపక్ష పార్టీని స్థాపించాడు. అది రైతుపార్టీ. ప్రజామిత్రమండలితో చేయికలిపాడు. పీపుల్స్ ఫెడరేషన్‌గా (ప్రజా సంయుక్త పక్షంగా) పేరు మార్చి 1935 నుండి 1937 వరకు అధ్యక్షుడుగా వున్నాడు. మహాత్మాగాంధీ కోలారు జిల్లా నందిగిరి వచ్చినప్పుడు ఆయనను కలిసి స్వాతంత్రోద్యమ ప్రేరేపితుడైనాడు. తన పార్టీని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశాడు. ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొని 1933లో కోలారు జిల్లా బోర్డు అధ్యక్షుడై గ్రామగ్రామాన బీద బిక్కి ప్రజలతో మమేకమై రైతు నాయకుడుగా, పేదల నాయకుడుగా పేరు తెచ్చుకున్నాడు. కాంగ్రెస్ పార్టీలో, స్వాతంత్రోద్యమంలో ముఖ్యపాత్ర వహిస్తూ మైసూరు రాష్ట్రంలో ముఖ్యవ్యక్తి అయినాడు. ఉద్యమంలో పోరాట పటిమతో బ్రిటీషు వారికి కొరకరాని కొయ్య అయినాడు. ఈయన చేసిన స్వాతంత్ర పోరాటం ఒక ఎత్తైతే, కార్మికులను కర్షకులను సమీకరించి చేసిన పోరాటాలు మరొక ఎత్తు. 1938లో సత్యాగ్రహ సమరంలో అరెస్టయినాడు. కె.జి.ఎఫ్. బంగారు గని కార్మికుల సత్యాగ్రహంలో పాల్గొని చరిత్ర సృష్టించాడు. 1940లో ప్రజా ప్రతినిధుల సభలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందాడు. 1942 గాంధీజీ పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ప్రాంతీయ నాయకత్వం వహించి 12.8.1942న అరెస్టు కాబడ్డాడు. 1944లో విడుదలైనాడు. 1944లో న్యాయ విధానసభలో పోటీచేసి గెలుపొందాడు. 1946లో మైసూరులో 6వ మైసూరు కాంగ్రెస్ పార్టీ మహాసభకు అధ్యక్షుడై పార్టీకి సమర్థ నాయకత్వం వహించి మైసూరు రాష్ట్రానికి ముఖ్య నాయకుడైనాడు. భారత రాజ్యాంగ (నిర్మాణ) శాసన సభకు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైనాడు. భారత రాజ్యాంగ నిర్మాతలలో ఒకరైనాడు.

స్వాతంత్ర్యానంతరం మైసూరు సంస్థానాధిపతి తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయటాన్ని వ్యతిరేకించగా మైసూరు సంస్థ దివాన్ రామస్వామి మొదలియార్‌తో చర్చలు జరిపి సామరస్యంగా మైసూరును భారతదేశ సార్వభౌమాధికారం క్రిందకు తెచ్చాడు. తదుపరి స్వతంత్రభారతదేశంలో మైసూరు రాష్ట్రానికి 24.10.1947న ప్రధమ ముఖ్యమంత్రి అయినాడు. 30.03.1952 వరకు పదవి దేదీప్యమానంగా నిర్వహించాడు. రాజధానిని మైసూరు నుండి

బెంగుళూరుకు మార్చాడు. 1952-57లో రాజ్యసభ సభ్యుడుగా రాణించాడు. కేంద్రంలో పారిశ్రామికశాఖా మంత్రిగా చేశాడు. ఎన్నో కర్మాగారాలు ఏర్పాటు చేయించాడు. 1957-62లో కోలారు లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎన్నికై కేంద్రమంత్రియై గృహనిర్మాణ శాఖను నిర్వహించాడు. 1961-63లో కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖను నిర్వహించారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ స్థాపింపజేశారు. 1963-64 లోక్‌సభలో కాంగ్రెస్‌పార్టీ నాయకుడిగా ఉన్నారు.

బెంగళూరులో విధానసౌధ నిర్మాణానికి నెహ్రూ గారిచే 13.07.1951న శంఖుస్థాపన చేయించారు.

తన హయాంలో బెంగుళూరులో హెచ్.యం.టి, బి.హెచ్.ఇ.ఎల్, రాంచి, భిలాయ్, దుర్గాపూర్ ఇనుము-ఉక్కు కర్మాగారాలు, తమిళనాడుకు నైవేలి లిగ్నైటు కర్మాగారాలు ఏర్పాటు చేయించాడు. కేంద్ర గృహనిర్మాణ శాఖామంత్రిగా, కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖామంత్రిగా పదవులు నిర్వహించి సమర్ధ ప్రజా నాయకుడుగా, పాలనాదక్షుడుగా, రాజతంత్రజ్ఞునిగా, కేంద్ర నాయకులలో పేరుగాంచాడు. తన శక్తి సామార్ధ్యాలను గుర్తించిన కేంద్రప్రభుత్వం ఆయనను 1964-1971 మధ్యప్రదేశ్ గవర్నరుగా నియమించారు. ఆయన 100వ జయంతి ఉత్సవాన్ని (ఆయన మరణానంతరం) 2002లో రాష్ట్రప్రభుత్వం నిర్వహించటం గర్వించదగ్గ విజయం.

కె.సి.రెడ్డి ఏ ప్రాంతం వాడైనా కర్ణాటక రాష్ట్రంలో, దేశంలో తెలుగు జెండా ఎగరేసిన రెడ్డి ప్రముఖుడై, రెడ్డి జాతికి కీర్తి తెచ్చాడు.

**నీళ్ళలోన మీను నిగిడి దూరముపారు**
**బైట మూరెడైన బారలేదు**
**స్థానబల్మిగాని తనబల్మికాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నీళ్ళలోన మీను నిగిడి దూరముపారు
బైట మూరెఁడైన బారలేదు
స్థానబల్మిగాని తనబల్మికాదయా
విశ్వదాభిరామ వినురవేమ.

# వి. వెంకట సుబ్బారెడ్డియార్



జననం : 18-12-1909
మరణం : 6-6-1982

వెంకట సుబ్బారెడ్డియార్ ధనిక వ్యావసాయిక కుటుంబంలో జన్మించాడు. వీరిది తెలుగు కుటుంబం. తెలుగు, వారి మాతృభాష. తండ్రి వైత్యలింగా రెడ్డియార్, తల్లి వేమలమ్మాల్.

పుదుచ్చేరి ఫ్రెంచ్ వారిక్రింద ఉన్నపుడు పుదుచ్చేరి స్వాతంత్ర్యం కొరకు స్వాతంత్ర్యోద్యమం జరిగింది.

1946లో నెట్టపక్కమ్‌కు మేయర్ ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వ పార్టీపై పోటీచేసి నెగ్గాడు. అంతకుముందు ఆయన తండ్రి కూడ మేయర్‌గా చేశాడు. ఆయన వలెనే పుదుచ్చేరి మేయర్‌గా కె. ముత్తుపిళ్ళై ఎన్నికైనాడు. ఇతర రాజకీయ నాయకులు, ప్రజలు ఫ్రెంచ్ ప్రభుత్వంపై పోరాటం చేశారు. పుదుచ్చేరి భారతదేశంలో భాగమని, భారతదేశంలో విలీనం కావాలని, భారత ప్రభుత్వం, రాజ్యాంగం క్రిందకు రావాలని వారు ఉద్యమించి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను సంప్రదించగా ఫ్రెంచ్ వారు వెళ్ళిపోయే వరకు మీరే సమాంతర ప్రభుత్వం నడుపుకొనవలసిందని, తిరుగుబాటు చేయమని సలహా యిచ్చాడు.

31-3-1954న వెంకట సుబ్బారెడ్డియార్ మరి 11 మంది నాయకులను కలుపుకొని సొంతంగా పుదుచ్చేరి సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యోద్యమం ఉధృతమైంది. చివరిగా ఫ్రాన్స్ ప్రధానమంత్రి, భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూతో సంప్రదింపులు జరిపాడు.

13-10-1954న ఫ్రాన్స్ ప్రభుత్వం పుదుచ్చేరి భారతదేశంలో కలియుటకు అంగీకారం తెలిపింది. 1-11-1954 పుదుచ్చేరికి స్వతంత్రం వచ్చింది. భారతదేశంలో విలీనమైంది.

1-7-1963న అసెంబ్లీ ఎన్నికలలో వెంకట సుబ్బయ్యరెడ్డియార్ @ వెంకట సుబ్బారెడ్డి గెలిచాడు. పబ్లిక్ వర్క్స్ మంత్రి అయినాడు.


తరువాత 1964లో జరిగిన ఎన్నికలలో మరల అసెంబ్లీకి శాసనసభ్యునిగా గెలిచి 11-9-64న పుదుచ్చేరి రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా ఎంపిక కాబడి 8-4-1967 వరకు పదవి నిర్వహించాడు. ఈయన పాండిచ్చేరికి భారతీయ ప్రథమ ముఖ్యమంత్రి. తదుపరి ఎన్నికలలో కూడ గెలిచి 6-3-68 నుండి 17-9-1968 వరకు రెండవసారి రాష్ట్ర నాల్గవ ముఖ్యమంత్రి పదవి నిర్వహించాడు. వెంకట సుబ్బారెడ్డి కుమారుడు వి. వైద్యలింగం రెడ్డి కూడా ముఖ్యమంత్రిగా చేశాడు.

వెంకట సుబ్బయ్య రెడ్డియార్ వివిధ పదవులలో పుదుచ్చేరికి సేవ చేశాడు. పాండిచ్చేరి రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షునిగా చేసి "పుదుచ్చేరి కో-ఆపరేటివ్ పిత"గా పేరొందాడు. పలు అభ్యుదయ కార్యక్రమాలను చేపట్టి పుదుచ్చేరిని సర్వతో ముఖాభివృద్ధి చేశాడు.

వెంకట సుబ్బయ్య రెడ్డియార్ 6-6-1982న స్వర్గస్తులైనాడు.

ఆయన జ్ఞాపకార్ధం భారత ప్రభుత్వం పోస్టల్ డిపార్ట్‌మెంటు వారు 5 రూ. పోస్టల్ స్టాంపును విడుదల చేసి గౌరవించుకున్నది.

మరియు ఆయన ఫోటోతో ప్రథమ పోస్టల్ కవరును విడుదల చేసింది.




ఫ్రాన్స్ దేశంపై స్వాతంత్ర్యోద్యమం నడిపిన ధైర్యశాలి, వెంకట సుబ్బారెడ్డియార్. పుదుచ్చేరిని భారతదేశంలో విలీనం చేయించిన రెడ్డియార్ అగ్రగణ్యుడు.

**నీళ్ళలోన మొసలి నిగిడి యేనుఁగుఁ దీయు**
**బైటఁ గుక్కచే భంగపడును**
**స్థానబల్మిగాని తనబల్మి కాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కులము లేనివాఁడు కలిమిచే వెలయును
గలిమి లేనివాఁడు కులము దిగును
గులముకన్న భువిని గలిమి ఎక్కువసుమీ
విశ్వదాభిరామ వినురవేమ.

మద్రాసు ప్రావిన్సు మొదటి ముఖ్యమంత్రి

రావు బహద్దూర్

# అగరం సుబ్బరాయలు రెడ్డి



జననం : 15-10-1856

మరణం : 25-11-1921

పాత దక్షిణ ఆర్కాడు జిల్లా కడలూరు తాలూకాలోని మారుమూల పల్లె మలయ పెరుమాళ అగరం గ్రామంలో జన్మించాడు సుబ్బరాయలురెడ్డి. తండ్రి రామరెడ్డి, తల్లి కామాక్షి

అమ్మ. భార్యలు అలివేలమ్మ, సుభద్ర. తండ్రి రామరెడ్డి గ్రామ మణీగార్. అచ్చమైన తెలుగు కుటుంబం. నెల్లూరు ప్రాంతం నుండి వారి కుటుంబం తమిళనాడుకు వలస వెళ్ళింది. ఈయన మద్రాసు రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి అయాడంటే తెలుగు వారంతా, రెడ్డివారంతా గర్వపడాల్సిందే.

ఈయనది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. కడలూరులో ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది. 1875లో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడైనాడు. బి.ఎల్. డిగ్రీ కూడ చదివి 1882లో కడలూరులో న్యాయవాద వృత్తి చేపట్టి అనతికాలంలో అగ్రశ్రేణి న్యాయవాదై ప్రజాసంబంధాలను పెంచుకొని ఆదాయాలను అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తూ ప్రజాభిమానాన్ని పొందాడు.

బాల్యంలోనే అలివేలమ్మతో వివాహం జరిగింది. కాని సంసారం సాగలేదు. సుభద్ర అనే అమ్మాయిని ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. కాని కుటుంబం ఒప్పుకోలేదు. బహిష్కరించారు. వృత్తిలో సంపాదించిన ధనంతో సెయింట్ డేవిడ్ ప్రదేశంలో సొంత భవనం నిర్మించుకొని జీవించాడు.

సేవానిరతితో సమాజసేవలో మునిగి తేలుతున్న సుబ్బరాయలురెడ్డికి కడలూరు ప్రజలు జైకొట్టారు. కడలూరు నగరసభ ఎన్నికలలో తిరుగులేని విజయం పొంది 1905లో కడలూరు నగరసభకు ఛైర్మన్ అయినాడు. ఆ పదవిలో 15 సంవత్సరాలు పనిచేశాడు. కడలూరు అభివృద్ధికి విశేషకృషి చేశాడు. అప్పటికి మద్రాసు రాష్ట్రం లేదు. కడలూరులో వైద్యశాల, పాఠశాల, రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేశాడు. నిజాయితీగా, నిక్కచ్చిగా పనిచేశాడు. ఆ సమయంలో ఒక న్యాయమూర్తి మునిసిపాలిటీకి చెల్లించవలసిన పన్ను చెల్లించనందున న్యాయమూర్తి అనికూడ చూడకుండా న్యాయమూర్తి వాహనాన్ని జప్తు చేయించాడు.

కడలూరులో రెడ్డి విద్యార్థి నిలయం, వృద్ధుల శరణాలయం త్రాగునీరు, మునిసిపల్ కార్యాలయం, మునిసిపల్ హైస్కూలు, మార్కెట్, ఆటస్థలం మొదలైనవి సుబ్బరాయలురెడ్డి కృషే. ఇవి ఆయన సేవాతత్పరతకు నిదర్శనాలు.

1911 సం॥లో బ్రిటీషు ప్రభుత్వం, తాలూకా బోర్డులను ఏర్పాటు చేసి కడలూరు తాలూకా బోర్డుకు తొలి అధ్యక్షునిగా సుబ్బరాయలురెడ్డిని నియమించింది.

1917 సం॥లో జిల్లా బోర్డులొచ్చాయి. అధికారేతరులను అధ్యక్షులుగా నియమించాలని బ్రిటీషు ప్రభుత్వం నిర్ణయించి దక్షిన ఆర్కాట్ జిల్లా బోర్డు తొలి అధ్యక్షునిగా సుబ్బరాయలురెడ్డిని నియమించింది.

సుబ్బరాయలురెడ్డి స్వగ్రామంలోని 30 ఎకరాల ఆస్తిని సమాజసేవకు, పేదప్రజల ఉపయోగం కొరకు రాసియిచ్చిన దానశీలి.

సుబ్బరాయలురెడ్డి రాజ్యాంగ నిర్మాణ శాసనసభకు ఎన్నికై రాజ్యాంగ నిర్మాణ విషయాల్లో చురుకుగా పాల్గొన్నారు. రాజ్యాంగం నిర్మించబడింది.

1919లో బ్రిటీష్ ప్రభుత్వం మాంటెగు - ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు వచ్చాయి. దీని ప్రకారం ద్వంద్వ ప్రభుత్వ విధానం అమలులోకి వచ్చింది. ఆ సమయంలో మద్రాసు రాష్ట్రంలో బాగా ఉన్నత చదువులు చదువుకున్నవారు బ్రాహ్మణ వ్యతిరేక సంఘాన్ని నడిపారు. బ్రాహ్మణేతరులకు అన్ని హక్కులు కావాలని వారి డిమాండ్. ఆ వర్గమే జస్టిస్ పార్టీగా మారింది. బ్రిటీషు వారి కనుసన్నల్లో కొచ్చింది. జస్టిస్ పార్టీని బ్రిటీషువారు గుర్తించారు. ద్వంద్వ పరిపాలనా విధానాన్ని మాంటెగు-ఛేమ్స్‌ఫర్డ్‌లు నిర్ధారణ చేసినందున బ్రిటీషు ప్రభుత్వం ఆ విధానాన్ని అంగీకరించి 1920లో మద్రాసు శాసనసభకు ఎన్నికలు జరిపారు. శాసనసభకు ఎన్నికలు జరిగిన 98 స్థానాలలో అధిక భాగం జస్టిస్ పార్టీ గెల్చుకోగా అప్పటి గవర్నర్ విల్లింగ్‌టన్ మరియు జస్టిస్ పార్టీ ముఖ్యుడైన త్యాగరాజసెట్టి గారలు ఆలోచించి సుబ్బరాయలురెడ్డిని మద్రాసు (ప్రధాన) ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆహ్వానించారు. అలా 17-12-1920 తేదీన సుబ్బరాయలు రెడ్డి మద్రాసు మొట్టమొదటి ప్రీమియర్‌గా (ముఖ్యమంత్రిగా) పదవిని స్వీకరించారు. ఈయన మంత్రివర్గంలో పానగల్ రాజా, కె.వి. రెబ్బాలను సహాయమంత్రులుగా నియమించుకున్నారు. కాని అనారోగ్యం వలన 11-7-1921 తేదీన రాజీనామా చేశాడు. దురదృష్టవశాత్తు 25-11-1921న మద్రాసు

ఆసుపత్రిలో స్వర్గస్తుడైనాడు. ఆయన జ్ఞాపకార్థం తెలుగువారు కడలూరు నగరం నడిబొడ్డులో ఆయన పేరు మీద కళ్యాణ మండపాన్ని నిర్మించారు.

ఆయన జీవితకాలంలో కడలూరు మునిసిపల్ ఛైర్మన్‌గా చేసిన సేవలకు గుర్తింపుగా **"రావుబహదూర్"** బిరుదునిచ్చి గౌరవించింది ప్రభుత్వం. జిల్లా బోర్డు అధ్యక్షునిగా సమర్ధవంతంగా చేసిన సేవలకు **"దివాన్ బహదూర్"** బిరుదునిచ్చి గౌరవించింది. ముఖ్యమంత్రిగా అందించిన సేవలకు "కైజరి హింది" బంగారు పతకాన్ని సుబ్బరాయలురెడ్డి కిచ్చి బ్రిటీషు ప్రభుత్వం గౌరవించింది.

1913లో కొందరు రెడ్డి ప్రముఖులు "దక్షిణదేశ రెడ్డి సంఘం" ప్రారంభించి సుబ్బరాయలురెడ్డిని అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

ఆయన మరణానంతరం తన స్థిరాస్తిలో కొంతభాగం కడలూరు రెడ్డి విద్యార్థుల సహాయార్ధానికి వినియోగించాలని సుబ్బరాయలరెడ్డి తన వీలునామాలో రాశారు.

ఇంతటి ఘనచరిత్రగల రెడ్డి రెడ్డిజాతికే తలమానికం.

**కులము గలుగువాఁడు గోత్రంబు గలవాఁడు**
**విద్యచేత విఱ్ఱవీగువాడు**
**పసిండిగల్గువాని వానిస కొడుకులు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# డా॥ బెజవాడ గోపాలరెడ్డి



జననం : 5-8-1907
మరణం : 9-3-1997

గోపాలరెడ్డిగారు నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో సంపన్న కుటుంబంలో జన్మించాడు. గోపాలరెడ్డి తండ్రి పట్టాభిరామిరెడ్డి, తల్లి సీతమ్మ. భార్య లక్ష్మీకాంతమ్మ, సంతానం కృష్ణమోహన్, రాధాకృష్ణారెడ్డి, అనూరాధారెడ్డి, రవీంద్ర, అనంతరెడ్డి.

బుచ్చిరెడ్డి పాలెం, నెల్లూరులలో ప్రాథమిక విద్య, బందరు జాతీయ విద్యాలయంలో కళాశాల విద్య, 1927లో శాంతినికేతన్‌లో యం.ఎ. చదివాడు. రవీంద్రునికి ప్రియశిష్యుడై కళారాధకుడైనాడు.

స్వాతంత్రోద్యమం ముమ్మరంగా జరిగే రోజుల్లో అన్న చంద్రశేఖరరెడ్డి మార్గంలో గాంధీ పిలుపు మేరకు 1921లో 9వ తరగతి చదువుతూ సహాయనిరాకరణోద్యమంలో పాల్గొనటంతో రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. చదువు పూర్తయాక 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. మోపాడు బీచ్‌లో ఉప్పు వండి జైలుకెళ్లాడు. 1931లో ఎఐసిసి సభ్యుడైనాడు. 1930కి ముందే ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రాజకీయంలో ముమ్మరంగా పాల్గొని 1937 జనవరిలో రాజాజి మంత్రివర్గంలో పరిపాలనా శాఖామంత్రిగా పనిచేసి ప్రజలకు దగ్గరైనాడు. 8-5-1938లో నెల్లూరు జిల్లాలో గొప్ప శ్రీమంతుడైన తిక్కవరపు రామిరెడ్డి కుమారై లక్ష్మీకాంతమ్మను మద్రాసు పచ్చియప్పన్ కళాశాల ప్రాంగణంలో వివాహమాడాడు. తిక్కవరపు రామిరెడ్డి గొప్ప కవిపోషకులు. లక్ష్మీకాంతమ్మ కూడ శాంతినికేతన్‌లో చదువుకున్నది. 1939 మొదటి ప్రపంచ యుద్ధం సందర్భంగా బ్రిటీషు ప్రభుత్వంతో విభేదించి మంత్రి పదవికి రాజీనామా చేశాడు. కాంగ్రెసు మంత్రులందరూ రాజీనామాలు చేశారు.

1940లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1930, '31, '32, '33, '40, '41, '42, '43 సంవత్సరాలలో 4 సంవత్సరాలు జైలు జీవితం అనుభవించాడు. ఎ, బి, సి క్లాసుల ఖైదీగా, డిటెన్యూగా ఉన్నాడు. తన భార్యకూడ జైలు జీవితం అనుభవించింది. ప్రముఖ గాంధేయవాదిగా పేరుగాంచాడు. 1947లో (ఉమ్మడి) మద్రాసు రాష్ట్రప్రభుత్వంలో ఆర్థిక శాఖామంత్రి అయాడు. ఒమండూరు రామస్వామిరెడ్డి, కుమారస్వామి రాజా మంత్రివర్గాలలో మంత్రిగా చేశాడు. 1948-49లలో రాష్ట్ర శాసన సభలో కాంగ్రెస్‌పార్టీ నాయకుడై 1952 ఫిబ్రవరి వరకు ఆ పదవిలో వుండి ప్రజలకు సేవ చేశాడు.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్నాడు. ఆంధ్రరాష్ట్రం వచ్చింది. కర్నూలు రాజధాని. టంగుటూరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రి అయ్యాడు. ఈయన మంత్రివర్గంలో ఆర్థికశాఖను నిర్వహించాడు. రాజకీయ కారణాల వలన మంత్రివర్గం పడిపోయింది. మొత్తం

మీద 1947 మార్చి నుండి 1952 ఫిబ్రవరి వరకు మద్రాసులో మంత్రిగా పనిచేశాడు. 1955-56 ఆంధ్రరాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. 1955లో నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ప్రధాని నెహ్రూచే శంఖుస్థాపన చేయించిన పెద్దలలో పెద్ద. హైద్రాబాద్ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుతో సంప్రదింపులు జరిపి 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికి ముఖ్యకారకుల్లో ఒకరు. అపుడు పెద్దమనుషుల ఒప్పందం జరిగింది. దానిలో సంతకాలు చేసిన ఏడుగురిలో ఒకరు. 1956లో సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయినప్పుడు, ఆ మంత్రివర్గంలో ఆర్థికశాఖ నిర్వహించాడు.

1957లో పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచాడు. 1958లో కేంద్రం పిలుపుపై కేంద్రంలో నెహ్రూ మంత్రివర్గంలో ఆర్థికశాఖ సహాయ మంత్రిగా పనిచేస్తూ, సివిల్ ఎక్స్‌పెండిచర్, రెవిన్యూశాఖల మంత్రిగా 3 సంవత్సరాలు పనిచేశాడు. అపుడు రాజ్యసభ సభ్యునిగా వున్నాడు. 1962 ఫిబ్రవరిలో లోక్‌సభకు పోటీచేసి జబ్బువల్ల ప్రచారానికి పోలేకపోయాడు. అయినా పార్టీ గెలిచింది. 1962 ఏప్రిల్‌లో నెహ్రూ మంత్రివర్గంలో కేంద్రంలో సమాచార, ప్రసారశాఖ కేబినెట్ మంత్రిగా పనిచేశాడు. 1963లో కామరాజ్ పథకం వచ్చింది. ఆ పథకం ప్రకారం పార్టీ నిర్ణయానిని అనుసరించి రాజీనామా చేసి సాధారణ పార్లమెంట్ సభ్యునిగా ఉన్నాడు.

1964లో నెహ్రూ మరణానంతరం లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానమంత్రి అయినప్పుడు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఉపనాయకుడుగా ఎన్నిక కాబడ్డాడు. అలాగే ఇందిరా గాంధీ నాయకురాలైనపుడు పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ఉపనాయకుడైనాడు. 1967లో ఇందిరాగాంధీ అభ్యర్ధనపై ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా నియమించబడి 62 మాసాలు గవర్నరుగా పనిచేశాడు. ఆ సమయంలో నలుగురు ముఖ్యమంత్రులు ప్రమాణం చేశారు. అందులో ఒక సంవత్సరం రాష్ట్రపతి పరిపాలన. అపుడు తానే గవర్నరు, తానే ముఖ్యమంత్రి, 1972 జూలై 1వ తేదీ పదవీ విరమణ చేసి నెల్లూరు చేరాడు.

స్వతంత్ర సమరంలో శిక్షలు, ప్రభుత్వంలో పదవులు, సాహిత్య జీవితంలో సేవలు, తన జీవితంలో (1907-1997) ముఖ్య ఘట్టాలుగా ఆయనే చెప్పుకున్నాడు. రాజకీయాలలో ఒకవైపు క్రిందుమీదవుతూ మరొకవైపు సాహిత్యం, చిత్రలేఖనం వంటి లలితకళల పట్ల

వ్యామోహాన్ని, ఆసక్తిని సమాంతరంగా పెంచుకుంటూ వచ్చాడు. 1946 నుంచి తెలుగు భాషా సమితి అధ్యక్షునిగా, 1951–57 ఆంధ్రా యూనివర్శిటీ ప్రో ఛాన్సలర్‌గా, 1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఏర్పడినప్పటి నుండి 1982 వరకు అధ్యక్షులుగా, 1978 నుండి కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వాహక సభ్యులుగా, 1963 నుంచి ఎనిమిదేళ్ళు జ్ఞానపీఠం కమిటీ అధ్యక్షులుగా వుండి అటు రాజకీయాలలో ఇటు తెలుగు సాహిత్యంలో సవ్యసాచి అయి సమున్నత గౌరవాలను పొందాడు.

గోపాలరెడ్డి రవీంద్రనాథ్ ఠాగూరుకు శిష్యులు. తన ఇంటికి శాంతినికేతన్ పేరు పెట్టుకున్నాడు. కుమారునికి రవీంద్ర పేరు పెట్టుకున్నాడు. రవీంద్రుని సాహిత్యం అనువదించాడు. సాహిత్య అకాడమీ అవార్డు అనువాద ప్రక్రియకు పొందారు. అంతేకాక వివాహ సమయంలో లగ్నాలతో పనిలేకుండా బ్రహ్మసమాజ పద్ధతిలో విశ్వకవి రవీంద్రుని జన్మదినమే లగ్నంగా ఉన్నవ లక్ష్మినారాయణ, అల్లూరి బాపినీడు గారి పౌరోహిత్యంలో, శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచారి సమక్షంలో లక్ష్మికాంతమ్మను వివాహమాడాడు. భార్య కూడ రవీంద్రనాథ్ ఠాగూరు సాహిత్యం పట్ల మక్కువ చూపింది. మరుసటి రోజు సంబరాలలో కవి సమ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, మల్లవరపు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

1936లో విదేశీ పర్యటనలలో ప్రముఖులను కలిశాడు. ఆయన బంధువులనూ కలిశాడు. ఆయన జీవితంలో ఒక చిలుకు భాగమైనా సాహిత్యం వైపే మొగ్గున్నది. ఆయన రచించిన గ్రంధాలలో కొన్ని: వేయి సోయగములు, శత కవితలు, ఆమె–(ఆమె పంచకములు – 5 కావ్యాలు), కాలవాహిని, సాహిత్య సుందరి, ప్రసూన మంజరి, పరిమళ తరంగాలు, సాగర సమీరాలు, మలయ మారుతాలు, స్వప్నమారం, సౌరభ నీరాజనాలు, వాన జల్లులు, స్ఫులింగాలు–తుషారాలు, దేవయాని–చిత్రాంగద, రవీంద్రుని ఆరు నాటికలు, విసర్జన, ఊర్వశి, కాళిదాసు – స్మరణ, రవీంద్రుని తాజమహల్, ఇక్బాల్ కవితలు వగైరాలు చెప్పుకోదగ్గవి. ఆంధ్ర, ఆంగ్ల, వంగ, ఉర్దూ భాషలలో ప్రవేశమే కాదు పాండిత్యం సంపాదించాడు. "నా సాహిత్య వ్యవసాయం రవీంద్ర సాహిత్యపు మాగాణిలోనే" అని తానే చెప్పుకున్నాడు. అయితే భవభూతి శ్లోకాలు, మనుచరిత్ర, భారతము బాగా చదివాడు.

1989 మద్రాసు రాజ్యలక్ష్మీ అవార్డును, 1990 డా॥ కె.వి. రావు, జ్యోతిరావు అవార్డు (న్యూయార్క్)ను, సాహిత్య అకాడమీ అనువాద అవార్డును పొందారు. నాలుగు విశ్వ విద్యాలయాలు ఆయనకు డాక్టరేట్లిచ్చి గౌరవించాయి. ఎక్కడ ఏ అవార్డుకు డబ్బు వచ్చినా, సాహితీకారులకు ఇచ్చేవారు. ఒక సాహిత్య నిధిని కూడా ఏర్పాటు చేశాడు. అభినవ భోజుడుగా పేరు పొందాడు. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ఉన్నత శిఖరాలనందుకున్నాడు. లలితకళల పట్ల శ్రద్ధ ఎక్కువ.

రాజ్యాంగ నిర్మాణ శాసన సభలో సభ్యుడుగా ఎన్నికై భారత రాజ్యాంగ రచనలో పాలుపంచుకున్నాడు.

గోపాలరెడ్డి రాజకీయాల్లోను, సాహిత్యంలోను అజాత శత్రువు. పదవులకే వన్నె తెచ్చాడు. తెలుగు భాషా వికాసానికి అజరామర కృషి చేశాడు. ఆయన శతజయంతి సందర్భంగా, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల రచయితల సంఘాలు “తెలుగు భాషా సంస్కృతీ చైతన్యయాత్ర”ను ఆయన చదివిన మచిలీపట్నం నుంచి నెల్లూరు వరకు నిర్వహించి నివాళు లర్పించారు.

ఆయన మచ్చలేని మహా మనీషి. మలినం అంటని మహోన్నత వ్యక్తి. అజాత శత్రువు, వివాదరహితుడు, ఆదర్శమూర్తి, సాహితీ పథికుడు, సాదు స్వభావి, సమున్నత సంస్కృతీ పరుడు.

గోపాలరెడ్డి జాతివజ్రం. తెలుగు పన్నీటి బుడ్డి. తన ఆత్మ కథలో పెక్కు వివరాలు గోపాలరెడ్డి గారే ఇచ్చారు.

రెడ్డి జాతికి, ఆంధ్రప్రజలకు చిరస్మరణీయుడు.

**కనియు గానలేఁడు కదలింప డా నోరు**
**వినియు వినంగలేడు విస్మయమున**
**సంపదగలవాని సన్నిపాతంబిది**
**విశ్వదాభిరామ వినురవేమ.**

గొడ్డుటావుఁ బిదుకఁ గుండ గొంపోయిన
బాలనిక తన్నుఁ బండ్లు రాల
లోభివాని నడుగ లాభంబు లేదయా
విశ్వదాభిరామ వినురవేమ.

# కాసు బ్రహ్మానందరెడ్డి



జననం : 28-7-1909
మరణం : 20-5-1994

బ్రహ్మానందరెడ్డి గుంటూరు జిల్లా చిరుమామిళ్ళలో 28-7-1909న జన్మించాడు. తండ్రి: వెంకటకృష్ణారెడ్డి, తల్లి: చా(శా)యమ్మ, భార్య: రాఘవమ్మ, అన్న వెంగళరెడ్డి. ఆయన గుంటూరు జిల్లా పరిషత్తు ఛైర్మన్‌గా చేశారు. వెంగళరెడ్డి మరొక అన్న వెంకటరెడ్డి. ఆయన

కొడుకు వెంకట కృష్ణారెడ్డి రాష్ట్రమంత్రిగా చేశారు. ఈ కుటుంబం మొదటిలో క్రైస్తవమతం పుచ్చుకున్నారు.

బ్రహ్మానందరెడ్డి నరసరావుపేటలో, మచిలీపట్నంలో హైస్కూల్ విద్య నభ్యసించారు. బి.ఎ. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో చదివాడు. కేరళలో కూడ చదివాడు. త్రివేంద్రంలో బి.ఎ., బి.ఎల్. చదివి లాయరుగా నర్సరావుపేటలో ప్రాక్టీసు పెట్టాడు. గాంధీగారి ఉద్యమం, టంగుటూరి ప్రకాశం గారి సాహచర్యంతో స్వాతంత్రోద్యమంలో చేరాడు. అదే రాజకీయ ప్రవేశం. 27 సంవత్సరాల వయసులో 1936లో ఒంగోలు జిల్లా బోర్డు ఛైర్మన్ అయినాడు. 25-5-1940నాడు రాఘవమ్మతో (చాయమ్మ మేనకోడలు) వివాహం జరిగింది. 1941లో స్వాతంత్రోద్యమంలో జైలు శిక్ష అనుభవించాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో మళ్ళీ అరెస్టు కాబడ్డాడు. వేలూరు జైలులో వున్నాడు. 1945 జనవరి వరకు జైలు జీవితం అనుభవించాడు.

1946లో మద్రాసు శాసనసభకు నరసరావుపేట నియోజకవర్గం నుండి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి పులుపుల శివయ్యపై గెలిచాడు. 1947లో ప్రకాశం పంతులు మంత్రివర్గం పడిపోయింది. ఓమండూరు రామస్వామి రెడ్డి ముఖ్యమంత్రి అయాడు. 1949లో పూసపాటి కుమారస్వామి రాజా ముఖ్యమంత్రి అయాడు. ఈ ముగ్గురు ముఖ్యమంత్రుల కాలంలో శాసన సభ్యుడుగా వున్నాడు బ్రహ్మానందరెడ్డి. అంచనాల కమిటీ, పబ్లిక్ అకౌంట్సు కమిటీ, భూ వ్యవహారాల కమిటీలలో సభ్యుడుగా వున్నాడు.

1952 శాసనసభ ఎన్నికల్లో బ్రహ్మానందరెడ్డి ఓడిపోయాడు. 1955 ఎన్నికల్లో ఫిరంగిపురం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి శాసనసభ్యుడైనాడు. అపుడే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి ప్రధాన కార్యదర్శి అయినాడు. అపుడు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరాజు. 1955లో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ రాజకీయ సభ గుంటూరులో జరిగింది. అపుడు నాగార్జున సాగర్ నిర్మాణానికి శంఖుస్థాపనకు నెహ్రూ వచ్చిన సందర్భం. ఆ సభలకు బ్రహ్మానందరెడ్డి ఆహ్వాన సంఘాధ్యక్షుడుగా వ్యవహరించాడు. సభల్లో నెహ్రూ దృష్టిలో పడ్డాడు. తరువాత ఆంధ్రప్రదేశ్ వచ్చింది.

1957లో సంజీవరెడ్డి మంత్రివర్గంలో స్థానిక పరిపాలనా శాఖామంత్రిగా పనిచేశాడు. అదే మంత్రివర్గంలో ఆర్థికశాఖను, ప్లానింగ్‌శాఖను కూడ నిర్వహించి సామర్థ్యాన్ని నిరూపించు కున్నాడు.

సంజీవయ్య మంత్రివర్గంలో ఆర్థికశాఖామంత్రిగా, న్యాయశాఖామంత్రిగా చేశాడు. తరువాత సంజీవరెడ్డి మంత్రివర్గంలో సహకారశాఖ నిర్వహించాడు.

1962 ఎన్నికల్లో ఫిరంగిపురం నియోజకవర్గం నుండి మరల గెలిచాడు. సంజీవరెడ్డి మంత్రివర్గంలో ఆర్థిక, సహకార శాఖలు నిర్వహించాడు.

సంజీవరెడ్డి బస్సు రూట్ల జాతీయం కేసులో రాజీనామా చేయగా 23-2-1964న రాష్ట్ర ముఖ్యమంత్రి అయినాడు. 30-9-1971 వరకు సమర్థవంతంగా పాలించాడు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపాడు. రైతాంగ శ్రేయస్సుకు, నాగార్జునసాగర్, పోచంపాడు, శ్రీశైలం డామ్‌లు, విశాఖ ఉక్కు కర్మాగారానికి రూపకల్పన చేయించాడు. తెలంగాణాలో లంబాడీలకు షెడ్యూల్డ్ జాతుల హోదా కల్పించాడు. తంతి, తపాలా శాఖలను వేరు చేశారు. స్పీడ్ పోస్ట్‌ను ప్రారంభించాడు. ఎస్.సి., ఎస్.టి., వర్గాల వారికి గృహాల నిర్మాణం చేశారు. ఎరువుల కర్మాగారాలను ప్రోత్సహించారు. మున్నూరు కాపులను బి.సి.లలో చేర్పించాడు. మూడు భాషల సూత్రాన్ని అమలుపరచాడు. రాష్ట్రంలో BHEL, HMT, IDPL, హిందూస్థాన్ కేబుల్స్, MIDHANI, భారత్ డైనమిక్స్ ఏర్పాటు చేయించాడు. గోదావరిపై రైలు రోడ్డు వంతెన నిర్మాణం, తుంగభద్ర డామ్ మరమ్మత్తులు, సిమెంటు ఫ్యాక్టరీల నిర్మాణం జరిగాయి. యల్.బి. స్టేడియం నిర్మాణం చేయించాడు. భారీగా ఉద్యోగాలు వచ్చాయి. శ్రీహరికోటలో అణుపరీక్షా కేంద్రం స్థాపింపజేశాడు. స్పోర్ట్స్ అభివృద్ధి చేశాడు.

నక్సల్స్ ఉద్యమం వచ్చింది. అపుడు జలగం వెంగళరావు హోంమంత్రిగా ఉన్నాడు. సమర్థవంతంగా అణచివేయగలిగారు. తెలంగాణా ఉద్యమంలో తెలంగాణా ప్రజాసమితి ఏర్పడి ఎన్నికల్లో మెజారిటీ సీట్లు గెలిచింది. తెలంగాణా ప్రజాసమితి కాంగ్రెస్‌లో విలీనం

చేయటానికి చెన్నారెడ్డిని ముఖ్యమంత్రిని చేయవలసి వచ్చింది. ఇందిరాగాంధీ చెన్నారెడ్డిని ముఖ్యమంత్రిగా చేసింది. ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని సమర్థవంతంగా భరించాడు. కష్టనష్టాలు అనుభవించాడు. కాని ముఖ్యమంత్రి పదవి వదలుకోవలసి వచ్చింది. కేంద్రానికి ఎగబ్రాకాడు.

బ్రహ్మానందరెడ్డి 3-6-1977న భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడైనాడు. ఇందిరాగాంధీ కాంగ్రెస్‌ను చీల్చి ఇందిరా కాంగ్రెస్ పెట్టింది. అపుడు ఇందిరాగాంధీని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసిన ధైర్యవంతుడు బ్రహ్మానందరెడ్డి. 1977లో రెడ్డి కాంగ్రెసుకు అధ్యక్షుడైనాడు.

ముఖ్యమంత్రిగా ఉన్నపుడు పి.వి. నరసింహారావుతో సత్సంబంధాలేర్పడ్డాయి. ఆయన బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో చాలాకాలం పనిచేశాడు. బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో పనిచేసిన పి.వి. నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, జలగం వెంగళరావు, కోట్ల విజయభాస్కరరెడ్డి తదుపరి రాష్ట్ర ముఖ్యమంత్రులైనారు.

1979లో కేంద్రంలో హోమ్, టెలికమ్యూనికేషన్స్, ఫైనాన్స్ శాఖలకు మంత్రిగా చేశాడు. 6వ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా నియమితుడైనాడు.

20-2-1988 నుండి 18-1-1990 వరకు మహారాష్ట్ర గవర్నరుగా చేశాడు.

పరిపాలనాదక్షుడుగా పేరు తెచ్చుకుని దేశనాయకులలో ఒకరైనాడు. అధికార వర్గంలో మంచిపేరు తెచుకున్నాడు. జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల మెప్పు పొందాడు. అసెంబ్లీలో ఆ తరువాత పార్లమెంటులో ఎంతటి వారికైనా సమాధానం సుళువుగా చెప్పేవాడు. బడుగు వర్గాలకు తగు ప్రాతినిధ్యం ఇచ్చి అభివృద్ధి చేశాడు.

తలపైని గాంధీ టోపీ కదిలికలతో తన మనోభావాలు తెలిపేవాడు.

అన్ని పార్టీలతో సత్సంబంధాలు నెరపి 60 సంవత్సరాల రాజకీయ జీవితాన్ని దేశానికి సమర్పించాడు.

కేంద్ర ప్రభుత్వం రెడ్డిగారిని స్మరించుకుంటూ తపాలా బిళ్ళ విడుదల చేసింది.




## మరొొక్కసారి బ్రహ్మానందరెడ్డి ప్రస్థానాన్ని తెలుసుకుందాం.

జన్మస్థలం : చిరుమామిళ్ళ, నాదెండ్ల మండలం, గుంటూరుజిల్లా.

స్వగ్రామం : తూబాడు, నాదెండ్ల మండలం.

చదువు : తూబాడు, గుంటూరు, నరసరావుపేట, మచిలీపట్నం, మద్రాసు, త్రివేంద్రం.

సోదరులు : వెంకటరెడ్డి, యం.ఎల్.ఎ., వెంగళరెడ్డి యం.ఎల్.ఎ., జిల్లా పరిషత్ ఛైర్మన్.

1931–33 : తాలూకా బోర్డు, జిల్లాబోర్డు సభ్యుడు.

1936 : ఒంగోలు జిల్లా బోర్డు అధ్యక్షుడు

1941 : ప్రొవిన్షియల్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి

1946 : యం.యల్.ఎ.

1956 : నాదెండ్ల సమితి అధ్యక్షుడు, నరసరావుపేట భూమి తనఖా బ్యాంక్ అధ్యక్షుడు.

1957 : సంజీవరెడ్డి మంత్రివర్గంలో చేరిక

1960 : దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో ఆర్థికశాఖామంత్రిగా చేరిక.

1962 : సంజీవరెడ్డి మంత్రివర్గంలో చేరిక

1964–71 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

1972– : ఆరవ ఆర్థిక సంఘం సభ్యుడు.

1974–77 : కేంద్ర హోం, కమ్యూనికేషన్ల శాఖామంత్రి.

1977 : ఎ.ఐ.సి.సి. అధ్యక్షుడు.

1979 : కేంద్ర పరిశ్రమల శాఖామంత్రి

1988–90 : మహరాష్ట్ర గవర్నరు.

ఒంగోలు జిల్లా చేసి ప్రకాశం పంతులుగారి పేరుపెట్టి ఈ ప్రాంత ప్రజలను తీర్చలేని ఋణగ్రస్తులను చేశాడు.

కుటుంబంలో, రాజకీయాలలో భార్య రాఘవమ్మ గారి సహకారం గొప్పది. అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేర్చగా అచట 20–5–1994న మరణించాడు. ప్రతి రెడ్డి ఎల్లప్పుడు గుర్తుంచుకోవలసిన నాయకుడుగా పేరు పొందాడు.

**మేఁక కుతికపట్టి మెడచన్ను గుడువఁగా**
**ఆక లేల మాను నాశగాక**
**లోభివాని నడుగ లాభంబు లేదయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# డా॥ మర్రి చెన్నారెడ్డి



జననం : 13-1-1919
మరణం :2-12-1996

చెన్నారెడ్డి తండ్రి: లక్ష్మారెడ్డి, తల్లి: బుచ్చమ్మ, భార్య: సావిత్రి, కుమారులు కృష్ణారెడ్డి, రవీంద్రరెడ్డి, శశిధరరెడ్డి, కుమార్తె: వసుధారెడ్డి.

తెలంగాణాలో సిరిపురం గ్రామంలో జన్మించాడు. మధ్యతరగతి రైతు కుటుంబం. కొండా వెంకట రంగారెడ్డికి మేనల్లుడు. ధైర్యశాలి. ప్రజాకర్షణ గలవాడు. పాఠశాల, కళాశాల,

విశ్వవిద్యాలయం చదువులలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. 1935లో ఖమ్మంలో "ఆంధ్రమహాసభ" సమావేశాల్లో పాల్గొన్నాడు. జాతీయ భావాలు గలవాడు. 1941లో యమ్.బి.బి.ఎస్. చదివి కొన్నాళ్ళు నిజాం ప్రభుత్వంలో ఉద్యోగం చేసి నచ్చక, నిజాం వ్యతిరేక ఉద్యమంలో చేరాడు. రెండు నర్సింగ్ హోమ్‌లు పెట్టి పేదరోగులకు ఉచిత సేవ చేశాడు. మొదటి నుంచీ ప్రత్యేక తెలంగాణా రాష్ట్రవాది. తన క్లినిక్‌కు కూడ "కాకతీయ క్లినిక్" అనిపేరు పెట్టుకున్నాడు.

ఆంధ్ర యువజన సమితి, యంగ్‌మెన్ డిబేటింగ్ సొసైటి, స్టూడెంట్ కాంగ్రెస్ స్థాపించాడు. పలు సాహిత్య, సాంస్కృతిక సంఘాలతో సంబంధాలున్నాయి. రాజకీయ వారపత్రికను నడిపాడు. డెమోక్రటిక్ పార్టీ స్థాపించాడు. సోషలిస్టులను కలుపుకున్నాడు.

రాజకీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. 1942లో ఆంధ్రమహాసభకు జనరల్ సెక్రెటరీగా పనిచేశాడు. 1946లో స్టేట్ కాంగ్రెస్ స్టాండింగ్ కమిటీ సభ్యుడైనాడు. హైదరాబాదు సిటీ కాంగ్రెస్‌కు జనరల్ సెక్రెటరీ అయాడు. కాంగ్రెస్‌లో కె.యమ్.పి. గ్రూపుకు ప్రారంభ సభ్యునిగా, జనరల్ సెక్రెటరీగా చేశాడు. ఆంధ్రా ప్రొవిన్షియల్ కాంగ్రెస్ కమిటీకి చాల సంవత్సరాలు జనరల్ సెక్రెటరీగా పనిచేశాడు. తదుపరి కాలంలో పి.సి.సి. వర్కింగ్ కమిటీ సభ్యుడుగా దాదాపు 30 సంవత్సరాలు చేశాడు.

1950లో తాత్కాలిక పార్లమెంట్‌లో సభ్యుడైనాడు. వెంటనే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి విప్ అయినాడు.

1952 తొలి సార్వత్రిక ఎన్నికలలో హైదరాబాదు లెజిస్లేటివ్ అసెంబ్లీకి సభ్యునిగా ఎన్నిక కాబడి, 1952–1956 కాలంలో హైద్రాబాద్ రాష్ట్రం బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో వ్యవసాయ, ప్లానింగ్ శాఖల మంత్రిగా చేశాడు. మంత్రి హోదాలో 1953లో రోమ్ నగరంలో వ్యావసాయిక చర్చలకు డెలిగేషన్ వెళ్ళాడు. తరువాత 1955లో రోమ్ నగరానికి యఫ్.ఎ.ఒ. కాన్ఫరెన్సుకు ఇండియన్ డెలిగేషన్ డిప్యూటి లీడరుగా వెళ్ళాడు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తదుపరి వికారాబాద్ నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా ఎన్నికై 1957–62 మధ్యకాలంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యునిగా, ఎస్టిమేట్స్ కమిటీ

ఛైర్మన్‌గా, ఆంధ్రప్రదేశ్–తెలంగాణా ప్రాంతీయ అభివృద్ధి కమిటి ఛైర్మన్‌గా ఎంపిక కాబడ్డాడు. అభివృద్ధి ప్రణాళికలకు నిధులను సేకరించాడు. పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణానికి విశేష కృషిచేసి ముఖ్యమంత్రి సంజీవరెడ్డిచే ఒప్పించాడు. 1953లో నెహ్రూచే పునాదిరాయి వేయించాడు.

1962లో తాండూరు నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా ఎన్నికై నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో ప్లానింగ్, పంచాయితీరాజ్ శాఖలమంత్రిగా కొన్నాళ్ళు 1964లో బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో ఆర్థిక, పరిశ్రమలు, కమర్షియల్ టాక్సెస్ శాఖల మంత్రిగా కొన్నాళ్ళు చేశారు.

1967లో మరల శాసనసభకు తాండూరు నుండే ఎన్నికై ఆర్థిక, విద్య, కమర్షియల్ టాక్సెస్ మంత్రిత్వ శాఖలు నిర్వహించారు.

1967లో కేంద్రంలో రాజ్యసభకు ఎన్నుకోబడ్డాడు. కేంద్రంలో ఇందిరాగాంధీ మంత్రివర్గంలో ఉక్కు గనుల శాఖామాత్యులుగా చేశారు. 3 ఉక్కు కర్మాగారాలు నిర్మించే నిర్ణయం తీసుకున్నాడు. ఇంగ్లండుకు భారత ప్రభుత్వ ప్రతినిధిగా వెళ్ళాడు. 1968లో కోర్టు తీర్పు వలన రాజీనామా చేయవలసి వచ్చింది.

1978లో మేడ్చల్ నుండి, 1989లో సనత్‌నగర్ నుంచి శాసనసభకు ఎన్నికైనారు.

ఎమర్జన్సీ కారణంగా కాంగ్రెస్ పార్టీ పూర్తిగా దెబ్బతిని, మరల జనతా ప్రభుత్వం పడిపోయాక 1978లో ఉవ్వెత్తున ఇందిరా కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చినపుడు చెన్నారెడ్డి 6–3–1978న ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి అయినాడు.

ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి సారధి అయినాడు. "తెలంగాణా ప్రజా సమితి" పార్టీ స్థాపించాడు. ఉద్యమం తీవ్రస్థాయికి చేరింది. ఎన్నికలొచ్చాయి. అరెస్టులు చేశారు. ఎన్నికల్లో 11 లోక్‌సభ స్థానాలు చెన్నారెడ్డి "ప్రజా సమితి" పార్టీ గెలుచుకున్నాడు. ఆరు సూత్రాల పథకం వచ్చింది.

చెన్నారెడ్డి ఉద్యమం వలననే కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గం తొలగిపోవలసి వచ్చింది. ఇందిరాగాంధీ మాటపై తెలంగాణా ఉద్యమం ముగించాడు.

ముఖ్యమంత్రిగా రెండు దశలలో చేశాడు. 6-3-1978 నుండి 11-10-1980 వరకు జలగం వెంగళరావు తరువాత మరియు టి. అంజయ్యకు ముందు ఒకసారి, 3-12-1989 నుండి 17-12-1990 వరకు యన్.టి. రామారావు తరువాత మరియు నేదురుమల్లి జనార్ధనరెడ్డికి ముందు ఒకసారి ముఖ్యమంత్రిగా చేశాడు. తన పదవీ కాలంలో విశాఖపట్నం బస్సు రూట్లు జాతీయం చేశాడు. జిల్లాను ఏర్పాటుచేసి తన మేనమామ కొండా వెంకట రంగారెడ్డి పేరుతో "రంగారెడ్డి జిల్లా" అని నామకరణం చేశాడు. పంచాయితీ ఎన్నికలు పార్టీ రహితంగా జరపాలని నిర్ణయం తీసుకున్నాడు. పంచాయితీ ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొనేవారి వయసు 21 నుండి 18సం॥లకు తగ్గించాడు. ఉద్యోగుల పదవీ విరమణ వయసు 55 సంవత్సరాల నుండి 58 సంవత్సరాలకు పెంచాడు. వారి జీతభత్యాలను కేంద్రప్రభుత్వ ఉద్యోగులతో సమం చేశాడు. కృష్ణాజలాలను మద్రాసుకివ్వటానికి 15-6-1978 ముఖ్యమంత్రి కరుణానిధితో ఒప్పందంపై సంతకాలు చేశాడు. రాష్ట్రంలో వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చెన్నారెడ్డి ప్రభుత్వం అంగీకరించింది. ఆర్థిక వనరుల విషయమై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పునర్నిర్వచించాలని పిలుపునిచ్చారు. చందాలరెడ్డి అని ప్రతిపక్షాలు చేసిన గోలను ససాక్ష్యంగా, సమర్ధవంతంగా తిప్పికొట్టగలిగాడు.

1974లో ఇందిరా గాంధీ కోరికపై ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా వెళ్ళాడు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమానిని ముగించినందుకు బహుమతిగా సొంత రాష్ట్రానికి గవర్నరుగా చేసుకున్నదని రాజకీయ నాయకుల్లో వాడుక వచ్చింది. రాజస్థాన్, పంజాబ్, తమిళనాడు, పాండిచ్చేరి గవర్నరుగా కూడ చేశాడు. ఐదు రాష్ట్రాలకు గవర్నరుగా చేసిన ఘనత చెన్నారెడ్డి గారిదే. పంజాబ్‌లో ప్రశాంతత నెలకొనటానికి చెన్నారెడ్డే కారణమని రాజకీయ వర్గాల భోగట్టా. కాని తనపట్ల ఇందిరాగాంధీ ప్రవర్తన సరిగా లేనందున 6-2-1983న రాజీనామా ఇచ్చాడు. 1984లో విజయవాడలో నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ పెట్టాడు. ఇందిరాగాంధీ మరణానంతరం, రాజీవ్‌గాంధీ, కాంగ్రెస్ నుండి వెళ్ళిపోయిన పెద్దలైన చెన్నారెడ్డి, శరద్ పవార్‌లను 1988లో తిరిగి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించి చెన్నారెడ్డిని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షునిగా నియమించారు. 1989 పార్లమెంట్ ఎన్నికల్లో చెన్నారెడ్డి సారధ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో 40స్థానాలు దక్కాయి. అది చెన్నారెడ్డి వల్లనేనని తేలింది. 1989 డిసెంబర్ 3వ తేదీన రెండవసారి

ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయినాడు. రాజీవ్‌గాంధీ హత్య తరువాత పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో మంత్రిమండలి సూచన మేరకు రాజస్థాన్ గవర్నరుగా నియమించ బడ్డారు. తనపై పెత్తనంచేయ తలపెట్టిన వారికి గుణపాఠం చెప్పాడు. 31-5-1992న తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల గవర్నరుగా పదవీ బాధ్యతలు స్వీకరించాడు. ముఖ్యమంత్రి జయలలితను ఎదుర్కొన్నందున ఆమె గవర్నరుపై యుద్ధం ప్రకటించగా, చెన్నారెడ్డి సి.ఆర్.పి.ఎఫ్. ను ఢిల్లీ నుంచి రావించి రాష్ట్ర పోలీసు బలగాన్ని అదుపులో పెట్టాడు. వెంటనే ఎన్నికలు రాగా జయలలిత ఓడి కరుణానిధి ముఖ్యమంత్రి అయాడు. గవర్నర్ పదవికి అత్యంత ప్రతిష్ట తెచ్చిన గవర్నర్ చెన్నారెడ్డి ఒక్కడేనని దేశం జైకొట్టింది.

2-12-1996 తేదీన స్వర్గస్తులైనాడు. 4వ తేదీన సర్వసైనిక లాంచనాలతో ఇందిరా పార్క్‌లో అంత్యక్రియలు జరిగాయి ఆయన కుమారుడు మర్రి శశిధరరెడ్డి ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్నారు.

చెన్నారెడ్డి ధైర్యసాహసాలున్న రాజకీయ నాయకుడు. ప్రభుత్వంలో కూడ రెడ్డి జాతికి అండగా ఉన్నాడు. దేశం మరువరాని రెడ్డి నాయకుడు చెన్నారెడ్డి.

**ఏమి గొంచువచ్చె నేమి తాఁగొనిపోవు**
**బుట్టువేళ నరుఁడు గిట్టువేళ**
**ధనము లెచట కేఁగు దానెచ్చటికి నేఁగు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తనువ దెవరిసొమ్ము తనదని పోషింప
ద్రవ్య మెవరిసొమ్ము దాచుకొనఁగ
బ్రాణ మెవరిసొమ్ము పారిపోకను నిల్వ
విశ్వదాభిరామ వినురవేమ.

# టంగుటూరు అంజయ్య

## (రామకృష్ణారెడ్డి)



జననం : 8.2.1929
మరణం : 1986

అంజయ్య తల్లిదండ్రులు తెలంగాణాలో మెదక్ జిల్లా భానూరుకు చెందినవారు. భార్య మణెమ్మ.

అంజయ్య హైదరాబాదు సుల్తాన్‌బజార్ రెడ్డి స్కూల్‌లో చదివాడు. చదువుకు డబ్బులేక హైదరాబాదు ఆల్విన్ కంపెనీలో రోజుకు ఆరణాల కూలీగా చేశాడు. జీవితంలో ఆటుపోట్లను భవించాడు. ట్రేడ్ యూనియన్ లీడరైనాడు.

11.10.1980న మర్రి చెన్నారెడ్డి స్థానంలో ముఖ్యమంత్రి అయినాడు. ఆ సమయంలో కేంద్రంలో లేబరు మంత్రిగా పనిచేస్తున్నాడు. దేశంలో ఎక్కడాలేనంత పెద్ద మంత్రి బృందాన్ని వేసుకొని తరువాత తగ్గించాడు. ఆయన హయంలోనే వై.యస్. రాజశేఖరరెడ్డి, చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో మంత్రులైనారు. 20.2.1982న ఇందిరాగాంధీ సూచనపై ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశాడు. భవనం వెంకట్రామిరెడ్డికి ఛార్జి ఇచ్చేశాడు.

1984లో సికింద్రాబాదు నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికైనాడు. ఈయన హయంలోనే సర్పంచ్‌కు ప్రత్యక్ష ఎన్నికలు ప్రథమంగా జరిగాయి. అదే హయాంలో ఓటు హక్కు వయసును 21సం॥ల నుండి 18సం॥లకు తగ్గించి అనుసరించారు.

ఈయన హయాంలోనే 1981లో హైద్రాబాదు హుస్సేన్ సాగర్‌లో బుద్ధ విగ్రహం ఏర్పాటుకు ఉత్తరువు లీయబడినవి.

2006లో సెక్రటేరియట్ ముందున్న పార్కుకు టి. అంజయ్య "లుంబినీ పార్కు" అని పేరు పెట్టాడు.

దురదృష్టవశాత్తు 1986లో అకాలమరణం చెందాడు.

ఆయన భార్య మణెమ్మ సికింద్రాబాదు నియోజకవర్గ పార్లమెంటు సభ్యురాలిగా ముషీరాబాద్ నియోజకవర్గ శాసన సభ్యురాలిగా పనిచేసింది.

ఈయన కుటుంబం రెడ్డి కులస్తులని తండ్రిపేరు వలన తెలియటమే కాని ఎక్కడా "రెడ్డి" కుల నామానిని ఉపయోగించినట్లు లేదు. రెడ్డి కులంను తానే గౌరవించ కోలేదు. కారణం తెలియదు. ఇపుడు ఆ కారణం కోసం వెతకలేము. తోటి రెడ్డి కులస్తులం కనుక ఈ గౌరవం ఇద్దాము.

# భవనం వెంకట రామిరెడ్డి

**(వెంకట్రామ్)**



జననం : 18-7-1931

మరణం : 5-4-2001

వెంకట్రామిరెడ్డి గుంటూరు జిల్లా ముప్పాళ్ళ గ్రామంలో జన్మించారు. భార్య జయప్రద, కమ్మ కులస్తురాలు. వారికి ఒక కుమారుడు ముగ్గురు కుమార్తెలు. ఆయన యం.ఎ., యల్.యల్.బి. చదివి గుంటూరులో లాయరు వృత్తి చేశాడు. ఈయనతో గాదె వెంకటరెడ్డి,

జయప్రదలు కూడ లాయర్లుగా ఒకే ఆఫీసులో పనిచేశారు. జయప్రద 1967లో, 1980లో వినుకొండ నుండి యమ్.యల్.ఎ. గా గెలుపొందింది. పి.వి. నరసింహారావు మంత్రివర్గ సభ్యురాలు.

వెంకటరామిరెడ్డి, చెన్నారెడ్డి, అంజయ్య మంత్రివర్గాలలో విద్యాశాఖామంత్రి. శాసన సభ్యుడు కాకపోయినా 24.2.1982న ముఖ్యమంత్రిని చేసింది ఇందిరాగాంధి. ముఖ్యమంత్రి అయినప్పటి నుండి "రెడ్డి" కులనామం తీసేసుకున్నాడు. కారణం ఆయనకే తెలియాలి. ఈయన మంత్రివర్గంలో వై.యస్. రాజశేఖరరెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, నేదురుమల్లి జనార్ధనరెడ్డి మంత్రులుగా చేశారు.

ఈయన కాలంలో ఈయన చేసిన మంచిపని ఓపెన్ యూనివర్సిటీని పెట్టటం. 20.9.1982న ముఖ్యమంత్రిగా రాజీనామా చేయవలసి వచ్చింది. 5.4.2001న కన్నుమూశాడు.

'రెడ్డి' కులాన్ని ఈయన త్యజించిన కారణం పెద్దలకూ తెలియదు. ముఖ్యమంత్రిగా పనిచేసినవాడు కనుక మనమిప్పుడు చెప్పుకుంటున్నాము. ఒకప్పుడు లెక్కలో మనిషి.

**పెట్టిపోయలేని వట్టి నరులు భూమి**
**బుట్టనేమి వారు గిట్టనేమి**
**పుట్టలోనఁ జెదలు పుట్టవా గిట్టవా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# కోట్ల విజయభాస్కరరెడ్డి



జననం : 16.8.1920
మరణం :27.9.2001

విజయభాస్కరరెడ్డి తండ్రి నాగిరెడ్డి, తల్లి: వెంకమ్మ, భార్య శ్యామలమ్మ, సంతానం: కుమారులు ముగ్గురు, కుమార్తెలు ముగ్గురు. పెద్ద కుమారుడు జయసూర్యప్రకాశరెడ్డి, యం.పి.

కర్నూలులో మున్సిపల్ హైస్కూలులో మరియు "కోల్స్ మెమోరియల్ పాఠశాల"లో చదివాడు. కోల్స్ పాఠశాల హాస్టలులో ఉన్నపుడు కందుల ఓబులరెడ్డి కూడ విజయ భాస్కరరెడ్డి

గదిలో వుండేవాడు. ఓబుల్‌రెడ్డి ఖద్దరు బట్టలు తెచ్చి విజయభాస్కరరెడ్డిని కట్టుకోమని ఇచ్చాడు. అదొక తీయని అనుభూతి విజయభాస్కరరెడ్డికి. కర్నూలు జిల్లా మదనపల్లిలో బి.ఎ. చదివి, మద్రాసులో బి.ఎల్. చదివి న్యాయవాద వృత్తికి వచ్చాడు. మద్రాసులో మొదట 1936లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్ కర్నూలులో చేసిన ప్రసంగం విజయ భాస్కరరెడ్డిని ఆకట్టుకున్నది. 1939-45లలో జిల్లా స్టూడెంటు కాంగ్రెస్ అధ్యక్షుడుగా వున్నాడు. 1939లో రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో బ్రిటీషు జెండాలను రెడ్డిగారి బృందం తగలబెట్టారు. భారత కాంగ్రెస్ పతాకాలను ధరించి ఊరేగింపులు చేశారు. మహాత్మాగాంధీకి జై అంటూ నినాదాలు చేస్తూ ఉద్యమాలు చేశాడు. క్విట్‌ఇండియా ఉద్యమంలో పోలీసుల చేతిలో దెబ్బలు తిని మూడు నెలలు ఆసుపత్రి పాలైనాడు.

1950లో గద్వాల్ రాజవంశానికి చెందిన కృష్ణారెడ్డి కుమార్తె శ్యామలతో వివాహం జరిగింది. గ్రామపంచాయితీ నుండి ఎదిగి ప్రజల్లో వున్న వ్యక్తి. జిల్లా పరిషత్తు ఛైర్మన్‌గా 1955 నుండి 1961 వరకు పనిచేశాడు. మరల 1964లో కూడ జిల్లా పరిషత్తు ఛైర్మన్‌గా ఎన్నిక కాబడ్డాడు.

1955లో ఎమ్మిగనూరు ద్విసభ్య నియోజకవర్గం నుండి పోటి చేసి, విజయ భాస్కరరెడ్డి, దామోదరం సంజీవయ్య శాసనసభకు గెలుపొందారు. ఈ ఎన్నికల్లో నాయకంటి శంకరరెడ్డిని విజయభాస్కరరెడ్డి ఓడించాడు. 1955-61 మధ్యకాలంలో పబ్లిక్ అకౌంట్సు కమిటీ సభ్యులుగా ఎన్నిక కాబడ్డాడు. 1961-62లో ఆ కమిటీ అధ్యక్షుడుగా పనిచేశాడు. 1958లో అఖిల భారత కాంగ్రెస్ సభ్యుడైనాడు. 1962లో పార్లమెంటు ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు కలిసివచ్చాయి. శాసనసభా స్థానానికి పోటీచేసి ఓడిపోయాడు. 1964లో "కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాల సమాఖ్య"కు అధ్యక్షుడుగా నియమించబడ్డాడు. ఆపదవిలోనే అమెరికా సందర్శించాడు. మరల 1983లో ఎమ్మిగనూరు నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా గెలుపొందాడు. లోక్‌సభకు ఆరుసార్లు అనగా 1977, 1984, 1989, 1991, 1996, 1998లలో ఎన్నిక కాబడ్డాడు. మొత్తంమీద శాసనసభకు 5సార్లు ఎన్నిక కాబడ్డాడు. నిజాయితీకి మారుపేరైన రాజకీయ నాయకుడు. మేరు పర్వతం వంటి వ్యక్తిత్వం.

1964లో బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో సభ్యుడు. 1968-70లలో ఆంధ్రప్రదేశ్ క్రీడామండలి అధ్యక్షుడైనాడు. 1971లో ఆర్థిక, సహకారశాఖల మంత్రిగా పనిచేశాడు. 1978-79లో కాంగ్రెస్ చీలినప్పుడు విజయ భాస్కరరెడ్డి "రెడ్డి కాంగ్రెస్" ఆంధ్రప్రదేశ్ కమిటికి అధ్యక్షుడైనాడు.

యన్.టి.రామారావు ప్రభంజనాన్ని భనవం వెంకట్రామ్ తట్టుకోలేదని, ఆయనను దించి విజయ భాస్కరరెడ్డిని 20-9-1982న ముఖ్యమంత్రిని చేశారు. కాంగ్రెసులో ముఠా తగాదాలు వచ్చాయి. యన్.టి.రామారావు కిలో బియ్యం రెండు రూపాయల కిస్తానని ఎన్నికల్లో చెప్పటంతో విజయ భాస్కరరెడ్డి రూ. 1-90 పైసలకే ఇచ్చాడు. కాని ప్రతీప శక్తుల వలన కాంగ్రెస్ ఓడింది.

తరువాత పి.వి. నరసింహారావు ప్రధానమంత్రిగా చేస్తున్న సమయంలో కేంద్రంలో లా, జస్టిస్, కంపెనీ అఫైర్స్ శాఖల మంత్రి పదవి నిర్వహించాడు.

మళ్ళీ 9-10-1992న రాష్ట్ర ముఖ్యమంత్రిగా పి.వి. నరసింహారావుగారు పంపారు. కాంగ్రెస్‌లో ముఠా తగాదాల వలన మరల 1994లో తెలుగుదేశంపై కాంగ్రెస్ ఓడిపోయింది. ముఖ్యమంత్రిగా దిగిపోవలసి వచ్చింది.

ఈయన ముఖ్యమంత్రి హయాంలో ఆడపిల్లలకు గ్రాడ్యుయేషన్ వరకు ఉచిత విద్య ప్రవేశపెట్టాడు. ఉద్యోగాలలో స్త్రీలకు 30 శాతం ఇవ్వాలని ఉత్తరువులిచ్చాడు. కొత్త బి.సి. కమిషన్‌లో 14 కులాల వారిని "వెనుకబడిన కులాల" వారుగా చేర్చారు. దేశంలో తొలిసారి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు, భూమిహక్కు పత్రాలు ఇచ్చారు.

నిజాయితీ, ముక్కుసూటి తనం రాజకీయాల్లో పనికిరాలేదు. రాజకీయాలకు నెమ్మదిగా దూరమై ప్రశాంత జీవనం గడుపతూ 27-9-2001న కన్నుమూశాడు.

కుమారుడు సూర్యప్రకాశరెడ్డి రెండు దఫాలు పార్లమెంటుకు ఎన్నిక కాబడ్డాడు. నీతి, నిజాయితీకి నిల్చిన రాజకీయ నాయకులలో ప్రధముడుగా చెప్పదగినవారు విజయ భాస్కరరెడ్డి. ఆయన ఒక ఆదర్శ నాయకుడు. అభ్యుదయవాది. జాతీయనేత. 1991లో ఇలస్ట్రేటెడ్ వీక్లీ సర్వేలో నెం.1గా వచ్చిన వ్యక్తి విజయ భాస్కరరెడ్డి. ఈయనను "పెద్దాయన"గా రాజకీయ నాయకులు గౌరవించారు. రెడ్లందరికీ పెద్దాయనే.

అన్ని దానములను అన్నదానమె గొప్ప
కన్నతల్లి కంటె ఘనము లేదు
ఎన్న గురునికన్న నెనక్కుడు లేదయా
విశ్వదాభిరామ వినురవేమ.

# డా॥ నేదురుమల్లి జనార్ధనరెడ్డి



జననం : 20.2.1935
మరణం : 9.5.2014.

జనార్ధనరెడ్డిది నెల్లూరుజిల్లా వాకాడు. రైతు కుటుంబం తండ్రి సుబ్బరామిరెడ్డి, తల్లి శేషమ్మ, భార్య రాజ్యలక్ష్మి, కుమారులు నలుగురు రామ్ కుమార్‌రెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి, గౌతమ్ కుమార్‌రెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డి,

వాకాడులో ప్రాథమిక విద్య చేశాడు. అది జనార్ధనరెడ్డి గారి చిన్నాన్న బాలకృష్ణారెడ్డి నడుపుతున్న విద్యా సంస్థ. రేణిగుంటలో పాఠశాల విద్య, నెల్లూరులో కళాశాల విద్య. వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ శిక్షణలో పట్టభద్రుడైనాడు. ఆయన వాకాడు విద్యాసంస్థల యాజమాన్యం చేయవలసి వచ్చింది. దానిని గ్రామీణ విశ్వవిద్యాలయంగా రూపొందించాడు.

జనార్ధనరెడ్డి సమాజసేవలో శ్రద్ధ చూపాడు. "హరిజన విద్యార్ధి ఉద్ధారక సంఘం" ద్వారా సామాజిక సేవలో పాల్గొని, ప్రభుత్వ అధికారం ద్వారా సహాయాలు ఎక్కువగా చేయవచ్చని రాజకీయం వైపుకు మళ్ళాడు.

1969 పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలికి పోటిచేసి ఓడిపోయాడు. పలాయనం చిత్తగించలేదు.

1972లో పి.వి.నరసింహారావు జనార్ధనరెడ్డిని రాజ్యసభ సభ్యుని చేశాడు. 1978 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నాడు.

1978లో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి తన మంత్రవర్గంలో రెవిన్యూ, పరిశ్రమల మంత్రిగా చోటిచ్చాడు. తర్వాత శాసనమండలి సభ్యుడుగా ఎన్నికైనాడు.

1982 వెంకటగిరి శాసన సభ్యుడుగా పోటీచేసి ఓడిపోయాడు.

1988లో పి.సి.సి. అధ్యక్షుడై 1989 మే నెల వరకు పనిచేశాడు. 1989 నవంబరులో వెంకటగిరి నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైనాడు. 1989-1990 రాష్ట్ర కేబినెట్ మంత్రిగా పనిచేశాడు.

1990 డిసెంబరులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయినాడు. 1992 అక్టోబరు వరకు ముఖ్యమంత్రిగా పనిచేశాడు.

అధికారం కోసం పార్టీలు మారే మనస్తత్వం కాదు. మొదటి నుంచి ఇందిరాగాంధీకే మద్దతుగా ఉన్నాడు. రాజకీయాల్లో విధేయతకు జనార్ధనరెడ్డిని ఉదాహరణగా చెప్పుకోవచ్చును.

రాజీవ్‌గాంధీ మరణం జనార్ధనరెడ్డిని కుంగతీసింది.

ఈయన విద్యావేత్త – దార్శనికుడు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడుగా కొంతకాలం పనిచేశాడు. పి.వి. నరసింహారావు జాతీయ విద్య సలహామండలి అధ్యక్షుడిగా నియమించాడు. ఈ కమిటీ సిఫార్సుల మేరకు దూరవిద్య ప్రవేశపెట్టబడింది. ఓపెన్ స్కూల్స్, ఓపెన్ యూనివర్సిటీలను ప్రవేశపెట్టారు.

రాష్ట్రంలో కొత్తగా మెడికల్, డెంటల్, ఇంజనీరింగ్ కళాశాలలకు అనుమతి నిచ్చాడు. కాని దీనిపై హైకోర్టువారు చేసిన వ్యాఖ్యకు స్పందించి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా యిచ్చాడు. కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ సభ్యులున్నా, రాజీనామా చేశాడు. అది ఆయన నైతికత.

1998లో గుంటూరుజిల్లా బాపట్ల లోక్‌సభ స్థానానికి పోటీచేసి గెలిచాడు. మధ్యంతర ఎన్నికలొచ్చాయి. 1999లో నర్సరావుపేట లోక్‌సభ స్థానానికి పోటీచేసి గెలిచాడు.

2004లో విశాఖపట్నం లోక్‌సభ స్థానానికి పోటీచేసి గెలిచాడు. నాయకుడి పట్ల ప్రజల్లో అభిమానం ఉండాలేగాని గెలవటానికి ప్రాంతీయ పరిధులుండవని తేలింది. ప్రభుత్వ పథకాలన్నింటిలో తన ప్రమేయం ఉన్నది.

తన కుమారులందరినీ రాజకీయాలకు దూరంగా పెట్టి 'సన్‌స్ట్రోక్' లేకుండా చేసుకున్నాడు. కొడుకు పేరుతో సాధారణంగా వచ్చిన మైనింగ్ లీజును రద్దు చేయించాడు.

రాజకీయాల్లో ఆటుపోట్లు అనుభవించాడే కాని వెన్నుపోట్లు లేవు.

పి.వి.నరసింహారావు ప్రధానమంత్రి కావటానికి కారకుడు జనార్ధనరెడ్డే.

దాతృత్వం గల వ్యక్తి. ఆరుద్ర, గజ్జల మల్లారెడ్డి గార్లకు వైద్య సహాయం తన ట్రస్టు ద్వారా చేశాడు. అలా ఎంతోమందికి ఆర్థిక సహకారం అందించాడు.

నాగార్జున విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇవ్వాలనుకున్నపుడు ముఖ్యమంత్రిగా వున్నందున సున్నితంగా తిరస్కరించాడు. తరువాత వెంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు నిచ్చింది.

జనార్ధన్ రెడ్డి భార్య రాజ్యలక్ష్మి 2004 నుండి మంత్రి పదవిలో వున్నారు. 2007లో నక్సలైట్లు జరిపిన దాడిలో జనార్ధనరెడ్డి, రాజ్యలక్ష్మి తృటిలో తప్పించుకున్నారు.

రెడ్డిజాతికి గర్వకారణమైన వ్యక్తి జనార్ధనరెడ్డి. 9–5–2014న పరమపదించారు.

ఆశచేత మనుజు లాయువు గలవాళ్ళు
తిరుగుచుందురు భ్రమ ద్రిప్పలేక
మురికిభాండమందు ముసురు నీఁగల భంగి
విశ్వదాభిరామ వినురవేమ.

# డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి

**(యెడుగూరి సందిటి రాజశేఖరరెడ్డి)**



జననం : 8.7.1949
మరణం : 2.9.2009.

రాజశేఖరరెడ్డి తండ్రి రాజారెడ్డి, తల్లి జయమ్మ. భార్య విజయలక్ష్మి, కొడుకు జగన్మోహన రెడ్డి, కూతురు షర్మిల.

రాజశేఖరరెడ్డి కడపజిల్లా పులివెందులలో జన్మించాడు. సంపన్న రైతు కుటుంబం. రాజారెడ్డి పేదప్రజల నాయకుడు.

కుటుంబంలో అందరిదీ క్రైస్తవమతం. మతసంస్కృతి, ఆచారాలు అన్నీ క్రైస్తవమే. అయినా కులం రెడ్డిగానే ఉండే నిర్ణయం ఆ కుటుంబం తీసుకున్నది. రెడ్డిరాజులందరూ హిందువులే. అయినా ఈ కుటుంబం తమ నమ్మికలతో క్రైస్తవమతం స్వీకరించింది. ఇందులో ఎవరికీ ఏ ఆక్షేపణలూ ఉండవలసిన అవసరం లేదు. అవి వ్యక్తిగత, కుటుంబపర నమ్మికలు. రాజశేఖరరెడ్డి బెత్లెహమ్‌కు, జెరూసెలెమ్‌కు వెళ్ళినా ప్రతి సంవత్సరం తిరుపతికి కూడ వెళతాడు. మతసామరస్యం పాటించాడు.

రాజశేఖరరెడ్డి గుల్బర్గా, తిరుపతిలలో వైద్య విద్య పూర్తి చేశాడు. జమ్మలమడుగులో క్యాంప్‌బెల్ ఆసుపత్రిలో వైద్యునిగా పనిచేశాడు. తరువాత పులివెందులలో సొంత ఆసుపత్రిని నిర్మించుకొని 20 పడకల ఆసుపత్రి, ల్యాబ్, ఎక్స్‌రే యూనిట్, ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసుకొని వైద్యసేవలు మొదలు పెట్టాడు. పేదలకు ఉచిత వైద్యసేవ చేశాడు. ఆయన హస్తవాసి మంచిదని కడప నుండి రోగులు వచ్చేవారు. పాలిటెక్నిక్ కాలేజి కూడా ప్రారంభించాడు. 9.2.1972 తేదీన విజయలక్ష్మితో వివాహం జరిగింది.

కాని రాజకీయాలవైపు ఆయన దృష్టి మరలింది. 1978లో, 1983లో, 1985లో శాసనసభ్యుడిగా పులివెందుల నుంచి ఎన్నికైనాడు. కడప పార్లమెంట్ నియోజకవర్గం నుండి 9వ, 10వ, 11వ, 12వ లోక్‌సభలకు ఎన్నికైనాడు.

శాసనసభ్యునిగా పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీళ్ళు రప్పించాడు. చిత్రావతి బ్యాలెన్సింగు రిజర్వాయరుకు పూర్తిస్థాయిలో నీళ్ళు తెప్పించాడు. పులివెందుల ప్రాంతంలో 176 గ్రామాలకు మంచినీటి పథకం సాధించాడు.

మొదటిసారిగా 1980–82లో టి. అంజయ్య మంత్రివర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పదవి చేపట్టారు. తరువాత అదే మంత్రివర్గంలో పట్టుపరిశ్రమ గ్రామీణ సంక్షేమశాఖలు నిర్వహించారు. తరువాత భవనం వెంకట్రామ్ మంత్రివర్గంలో 1982లో ఎక్సైజ్‌శాఖా మంత్రిగా చేశారు. విజయ భాస్కరరెడ్డి గారి మంత్రివర్గంలో 1982–83లో విద్యాశాఖామంత్రిగా చేశారు.

తెలుగుదేశం ప్రభుత్వంలో కాంగ్రెస్ అనాధగా ఉన్నపుడు 1983–85లలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా పనిచేసి కాంగ్రెస్‌కు ఏకైక దిక్కు అయినాడు. మరల 1998–2000లో రెండవసారి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడైనాడు. ప్రజా

ఉద్యమాలు నిర్వహించాడు. తెలుగుదేశం పాలనలో ప్రతిపక్షనాయక పాత్రను సమర్థవంతంగా నిర్వహించి వారి గుండెల్లో రైళ్ళు పరిగెత్తించి తెలుగుదేశం పాలనకు చుక్కపెట్టాడు.

ప్రజలకు చేరువయే ప్రయత్నంలో, ప్రజల బాధలు తెలుసుకునే ప్రయత్నంలో 2003 ఏప్రిల్‌లో మండుటెండలో ఆంధ్రరాష్ట్రం అంచులను తాకుతూ రాజశేఖరరెడ్డి చేసిన "ప్రజా ప్రస్థానం" పాదయాత్ర దేశంలోనే మరువలేని విజయం. చేవెళ్ళ నుండి ఇచ్చాపురం వరకు 1470 కి.మీ., 68 రోజుల పాదయాత్రలో ప్రజలు విశేషంగా స్పందించారు. కాంగ్రెస్ కార్యకర్తలలో ఉత్సాహం తెచ్చింది. నాయకులలో ఐకమత్యం తెచ్చింది. ఆయన కాంగ్రెస్‌ను ప్రజలకు చేరువలోకి తెచ్చాడు. ప్రజల బాధలు నేరుగా తెలుసుకుని భరోసా యిచ్చాడు. దేశనాయకులు రాజశేఖరరెడ్డిని అగ్రశ్రేణి నాయకుడిగా గౌరవించారు. అదొక సువర్ణాధ్యాయం. తత్ఫలితంగా 2004 ఎన్నికలలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. 175 స్థానాలను దక్కించుకున్నది. తెలుగుదేశం పార్టీకి 47 స్థానాలే వచ్చాయి.

14-5-2004న రాజశేఖరరెడ్డి మొదటిసారి ముఖ్యమంత్రి అయినాడు. తరువాత 2009 ఎన్నికలలో కూడ విజయం సాధించి రెండవసారి కూడ 20.5.2009న ముఖ్యమంత్రి అయినాడు.

మొదటి సారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన వెంటనే అదే యల్.బి. స్టేడియంలోనే ఎన్నికలలో వాగ్దానం చేసినట్లుగానే రైతులకు ఉచిత విద్యుత్తు ఫైలుపై మొదటి సంతకం చేయటమే కాక రైతుల విద్యుత్ బాకాయిలు 1192 కోట్లు మాఫీ చేశాడు.

తెల్లకార్డులున్న పేదవారి కోసం రాజీవ్ "ఆరోగ్యశ్రీ" పథకాన్ని ప్రవేశపెట్టి, ప్రతి పేదకు రెండు లక్షల రూపాయల ఖర్చు వరకు ప్రభుత్వమే భరించునట్లు ఇన్సూరెన్సు సదుపాయం కూడ కల్పించు ఉత్తరువులనిచ్చాడు. 3సంవత్సరాలలో 2 1/2లక్షల నిరుపేదలకు సహాయం అందించాడు. ఉచిత ఆంబులెన్సు సౌకర్యాన్ని ప్రజలకందించాడు. గ్రామంలో '104' సర్వీసు, పట్టణంలో '108' సర్వీసు రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిందే. తన సొంత భూమి 310 ఎకరాలను ప్రభుత్వానికి సరెండర్ చేశాడు. మరొక 1000 కూడ ఎకరాలు సిద్ధం చేశాడు.

చిరువ్యాపారులకు, మహిళలకు పావలా వడ్డీ పథకం ప్రవేశపెట్టాడు. వారికి జీవనభృతే కాకుండా రాష్ట్రప్రగతిని ఆలోచించాడు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు పథకం

ప్రవేశపెట్టి ప్రజలకు అధిక సబ్సిడీ ఆర్థిక సహాయంతో గృహాలు కట్టించాడు. భూస్వాధీన పట్టాలు మహిళలకే యిచ్చునట్లు ఉత్తరువులిచ్చాడు.

రెండు రూపాయలకు కిలో బియ్యం పథకంతో పేద గ్రామీణ, పట్టణ ప్రజల ఆకలిని తీర్చాడు. తెల్లకార్డుల వారికిచ్చే రేషన్ వగైరాలపై సంవత్సరానికి 2000కోట్ల రూపాయలు సబ్సిడీ ప్రభుత్వం భరించే పథకం తెచ్చాడు. పేదవారికి నెలవారీ సరుకులు కూడ యిచ్చాడు. విద్యార్థులకు పూర్తి ఫీజు రియింబర్సుమెంట్ పథకంతో విద్యార్థిలోకం ప్రయోజనాలు పొందింది. యస్.సి., యస్.టి., బి.సి. విద్యార్థులకు ఉపకార వేతనాలు ప్రభుత్వం భరించునట్లు ఉత్తరువులిచ్చారు.

మైనారిటీలకు రిజర్వేషన్ విధానం ప్రవేశపెట్టాడు. గిరిజనుల మైనారిటీ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాడు. కేంద్రప్రభుత్వం వారి NREGA ప్రోగ్రాం క్రింద ప్రజలకు ప్రయోజనాన్నందిం చటంలో దేశంలోనే మేటిగా మరియు తెలుగు ప్రజలు మరచిపోలేని విధంగా సహాయాన్నందించాడు.

2007 మే నెలలో చికాగోలో జరిగిన వరల్డ్ అగ్రికల్చరల్ ఫోరమ్‌లో ప్రసంగించి భారతదేశ ప్రాతినిధ్యానికి వన్నె తెచ్చాడు. అక్కడ గవర్నర్లను ఇతర ప్రముఖులను కలిశాడు. అమెరికాకు బుష్ అధ్యక్షుడుగా వున్నపుడు, ఆయనను ఆంధ్రరాష్ట్రానికి రప్పించి మన సాంస్కృతిక, విద్య, వ్యావసాయిక, పారిశ్రామిక వనరులను, అవకాశాలను ఆయన దృష్టికి చేర్చి మనరాష్ట్ర ఖ్యాతిని అమెరికా దృష్టిలో పెట్టాడు.

నక్సలైటు ఉద్యమం ఆంధ్రరాష్ట్రంలో నామరూపాల్లేకుండా చర్యలు తీసుకున్నాడు.

కోటి ఎకరాల భూమికి సాగునీరివ్వటానికి జలయజ్ఞం తలపెట్టి 70 దాకా మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను 46,000 వేల కోట్లరూపాయల ఖర్చుతో 5 సంవత్సరాలలో పూర్తిచేయు పథకానికి రూపకల్పన చేశాడు. అందులో 9, 10 పథకాలు పూర్తిచేశాడు. కొన్ని అవాంతరాలొచ్చాయి. పూర్తిగా జరిగివుంటే రాజశేఖరరెడ్డి అపర భగీరథుడయేవాడు.

2009 ఎన్నికలలో రాజశేఖరరెడ్డి ధాటిని తట్టుకోలేక అన్నిపార్టీలు అంటే తెలుగుదేశం, తెలంగాణా రాష్ట్రసమితి, కమ్యూనిష్టు పార్టీలు, ప్రజారాజ్యం పార్టీ కలిసి ఏకోన్ముఖంగా

రంగంలోకి దిగి ఓడిపోయాయి. కాంగ్రెసు పార్టీ తరపున 156 మంది శాసనసభ్యులు గెలిచారు. 33 మంది పార్లమెంటు సభ్యులు గెలిచారు. (మొత్తం 42 స్థానాలు). ఫలితంగా రాజశేఖరరెడ్డి రెండవసారి 20-5-2009న ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశాడు.


పేద, మధ్యతరగతి వర్గాలకు, బడుగు వర్గాలకు, రైతాంగానికి, వృత్తిదారులకు, ప్రత్యేకించి మహిళలకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అండగా నిలిచాడు. మహిళా సాధికారికత సాధించటానికి స్వయం సహాయక సంస్థలలో 1 కోటి 25 లక్షల మందికి పింఛను సౌకర్యం కల్పించాడు. 60 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ. 2,000/- దాకా పింఛను లిచ్చాడు. ఇందిరా క్రాంతి పథకం మంచి ఫలితాలను సాధించింది.

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ఎలా ప్రజల్లోకి పోతున్నాయో తెలుసు కోవటానికి "పల్లెబాట"ను పట్టి "రచ్చబండ"ను చేరాలనుకున్నాడు. ఇంతలో 2-9-2009 తేదీన అకస్మాత్తుగా మృత్యువు కబళించింది. ఆ రోజు బెల్-420 హెలికాప్టర్‌లో నల్లమల అడవుల పైగా ప్రయాణిస్తున్నప్పుడు ఇంజన్‌కేర్పడ్డ ప్రమాదమో, వాతావరణ ప్రాతికూల్యమో గాని హెలీకాప్టర్ అంతులేకుండా పోగా, ఆంధ్రప్రజానీకం దిక్కుతోచక అడుగో, ఇడుగో అని దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు. 3-9-2009 ఉదయాన బారత ప్రధానమంత్రి కార్యాలయం నుండి రాజశేఖరరెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఇంజన్ లోపం ప్రమాదంతో నల్లమల అడవులలో కర్నూలుకు 74 కి.మీ. దూరంలో పేలిపోయిందని దానిలో ప్రయాణిస్తున్న రాజశేఖరరెడ్డి, ఆయన స్పెషల్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం, ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వెస్లీ, గ్రూప్ కెప్టెన్ భాటియా, కెప్టెన్ యం.యస్. రెడ్డిల దేహాలు గూడ గుర్తించలేని స్థితిలో (కేవలం బట్టలు ఆధారంగా గుర్తించబడ్డాయని) ఉన్నాయని ప్రకటించింది.

ఒక సూర్యుడు అస్తమించాడు. తెలుగు ప్రజలకు రెడ్డికులానికి చీకట్లు కమ్ముకున్నాయి. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్షలు నిర్వహించారు. ఇడుపులపాయలో ప్రభుత్వ లాంఛనాలతో కుటుంబ ఆచారాల ప్రకారం ఖననం చేశారు. తరువాత కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రి అయినాడు.

"Y.S.R: A doctor with a finger on public pulse" అని వార్తా ప్రసార సంస్థలన్నీ కొనియాడాయి. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మన్‌మోహన్ సింగ్ తదితర దేశ నాయకులంతా, రాష్ట్ర నాయకులంతా ఘనంగా నివాళులర్పించారు.

కేంద్ర ప్రభుత్వం రెడ్డిగారిని స్మరించుకుంటూ తపాలా కవరు మరియు తపాలా బిళ్ళ విడుదల చేసింది.



రాజశేఖరరెడ్డి మరణవార్తతో వందల సంఖ్యలో వ్యక్తులు, ఆ షాక్ వలన గాని, ఆత్మహత్యల వలనగాని మరణించారు. వారి కుటుంబాల ఓదార్పుకు కుమారుడు జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రమంతా ఓదార్పు యాత్ర చేశాడు. జగన్మోహన్‌రెడ్డి 29-11-2010న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, 16-2-2011న Y.S.R. కాంగ్రెస్ పార్టీని స్థాపించాడు. కొత్తపార్టీ తరపున ఎన్నికల్లో తండ్రిని మించిన మెజారిటీతో గెలిచాడు. తల్లి విజయమ్మ కూడ గెలిచింది.

8-7-2010న రాజశేఖరరెడ్డిపై గౌరవంతో కడపజిల్లాకు వై.యస్.ఆర్. జిల్లా అని పేరు పెట్టింది ఆనాటి ప్రభుత్వం. ప్రజలు ఆయనపై ప్రేమతో ఆంధ్రదేశంలో ఊరూరా ఆయన విగ్రహ ప్రతిష్ఠలు చేసి ఏటా పండుగలు జరుపుకుంటున్నారు.

రాజశేఖరరెడ్డి చిన్నప్పటి నుండి యోగ, వ్యాయామం ఖచ్చితంగా చేసేవాడు. సమయ పాలన, నమ్ముకున్నవాని పాలన ముఖ్యాంశాలుగా పెట్టుకున్నాడు.

రాజకీయ జీవితం ప్రారంభం నుండి రాజశేఖరరెడ్డి, ఇందిరాగాంధి, రాజీవ్ గాంధి, సోనియాగాంధి కుటుంబాలకు విధేయుడుగా వున్నాడు. 1983లో ఇందిరా గాంధి, రాజీవ్‌గాంధి రాష్ట్రాన్ని సందర్శించినపుడు వారికి అనువాదకుడుగా పనిచేశాడు.

రాజశేఖరరెడ్డి, ఆహార్యంలో తెలుగుదనం, ఆచరణలో సేవాతత్పరత, మనసు ప్రణాళికాబద్ధం, మడమ తిప్పని నడత, మాట తప్పని నిబద్ధత, మెండైన ఆత్మీయత, ఆదరణ, పనిలో పట్టుదల - కార్యదీక్ష మొదలైన స్వతః స్వభావాలతో యువజన కాంగ్రెసు నుండి శాసనసభలు, లోక్‌సభలు నడిచివెళ్ళి మన రాష్ట్రముఖ్యమంత్రిగా రాణకెక్కాడు.

ఆయనది రాష్ట్రానికి గోల్డెన్ పీరియడ్. రెడ్డి శకంలో మరొక అధ్యాయం ముగిసింది.

# కె.వి. రఘునాథరెడ్డి



జననం : 4-9-1924
మరణం : 4-3-2002

రఘునాథరెడ్డి నెల్లూరు జిల్లా విరువూరు గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించాడు. బి.ఎ. డిగ్రీ అన్నామలై యూనివర్శిటీ నుండి తీసుకున్నాడు. ఆర్థికశాస్త్రం, సామాజికశాస్త్రాలలో ఎం.ఎ. డిగ్రీ లక్నో విశ్వవిద్యాలయం నుండి తీసుకున్నాడు. ఎల్.ఎల్.బి. కూడ చదివి లాయరు పట్టాను తీసుకున్నాడు.

అన్నామలై విశ్వవిద్యాలయం సెనేట్‌కు 1947లో ఎన్నికయారు. రెండవసారి కూడ ఎన్నికైనాడు. ఉపాధ్యాయుల నియోజకవర్గం ద్వారా అన్నామలై విశ్వవిద్యాలయం అధ్యయన కౌన్సిల్‌కు ఎన్నికైనాడు.

న్యాయవాదిగా చెన్నై, హైదరాబాదు హైకోర్టులలో పనిచేశాడు. క్రిమినల్ లా సబ్‌స్టాన్టేటివ్ ప్రొసీజర్ గ్రంధాన్ని రచించాడు. ఈ గ్రంధాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టువారు దిగువ కోర్టులకు ఉపయోగ గ్రంధంగా సిఫారసు చేశారు. ఆయన అదే అంశాన్ని ఉస్మానియా న్యాయకళాశాలలోనూ బోధించాడు.

1962లో తొలిసారి రాజ్యసభకు ఎన్నుకోబడ్డాడు. ఆ తరువాత మరో రెండుసార్లు కూడ ఎన్నుకోబడ్డాడు. 1966లో లండన్‌లో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాడు.

1977లో ఇందిరాగాంధీ మంత్రివర్గంలోకి తీసుకోబడ్డాడు. న్యాయ మరియు కంపెనీ వ్యవహారాలశాఖా మంత్రిగా పనిచేశాడు. ప్రాసెస్ పేటెంటింగ్ చట్టాన్ని తెచ్చాడు. స్త్రీ పురుషులకు వ్యవసాయ పనుల వేతనాలలో తేడా లేకుండా వుండుటకు చట్టానిని తెచ్చాడు.

కార్మికశాఖా మంత్రిగా నాలుగుసార్లు జెనీవాలో అంతర్జాతీయ కార్మిక సంఘంలో భారత ప్రతినిధివర్గ నాయకునిగా పాల్గొన్నాడు.

జపాన్, ఇరాన్, శ్రీలంక దేశాలలో జరిగిన ఆసియా కార్మిక మంత్రుల సమావేశాలకు భారత ప్రతినిధివర్గానికి నాయకత్వం వహించాడు.

కాంగ్రెస్ ఫోరం ఫర్ సోషలిస్టు కార్యాచరణ శిబిర నిర్మాణంలో యంగ్ టర్క్స్ చంద్రశేఖర్, మోహన్ ధారియా, కృష్ణకాంత్‌లతో ముఖ్యస్థానం నిర్వహించాడు. కాంగ్రెస్ ప్రగతిశీల సిద్ధాంతకర్తలలో ముఖ్యుడుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 1980లో క్రియాశీలక రాజకీయాల నుండి వైదొలిగాడు.

1990లో త్రిపుర గవర్నరుగా నియమించబడ్డాడు.

1993లో పశ్చిమ బెంగాల్ గవర్నరుగా నియమించబడి 1998 వరకు ఆ పదవి నిర్వహించాడు. అదే సమయంలో మణిపూర్, ఒరిస్సా, మిజోరం, సిక్కిం రాష్ట్రాల గవర్నరుగా అదనపు బాధ్యతలు నిర్వహించాడు.

నీతి నిజాయితీలకు పేరుగాంచిన రాజకీయ నాయకుడు. మితభాషి. మేధోసంపన్నుడు. స్నేహశీలి. సోషలిస్టు వ్యవస్థ స్థాపనకు, నిర్వహణకు పరితపించాడు.

సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాలలో ఎక్కువ పాల్గొనేవాడు. ఒంగోలు రొండా నారపరెడ్డిగారి పిలుపుపై నందినీ శత్పధితో కలిసి ఒంగోలు రచయితల సంఘం మహాసభలలో పాల్గొన్నాడు.

ఈయన భార్య డా॥ సరోజినీ రెడ్డి ప్రముఖ గర్భకోశ వ్యాధుల వైద్యులు.

**నీళ్ళలోను మీను నెతిమాంస మాశించి**
**గాలమందు జిక్కుకరిణి భువిని**
**ఆశ దగిలి నరుఁడు నాలాగె చెడిపోవు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆశ పాపజాతి అన్నింటికంటెను
ఆశచేత యతులు మోసపోరె
చూచి విడుచువారు శుద్ధాత్ములెందైన
విశ్వదాభిరామ వినురవేమ.

# పులి వెంకటరెడ్డి



జననం : 19-7-1933
మరణం 7-12-1999

వెంకటరెడ్డి కడపజిల్లా కాశినాయన మండలం నరసాపురం గ్రామంలో జన్మించారు. తండ్రి వెంకటరెడ్డి, తల్లి పుల్లమ్మ. భార్య వెంకటలక్షమ్మ. ఇద్దరు కుమారులు వెంకటరమణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి. ఇద్దరు కుమార్తెలు.

వెంకటరెడ్డి కడపజిల్లాలో జన్మించి, నెల్లూరుజిల్లాలో వుండి, నేటి ప్రకాశం జిల్లాలోని చంద్రశేఖరాపురం మండలంలోని రెడ్డిగారి కొత్తపల్లిలో స్థిరపడ్డాడు. రాజకీయంగా అంచ లంచలుగా ఎదిగి జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాడు.

ప్రాధమిక విద్య 5వ తరగతి వరకు కడప జిల్లా నరసాపురంలో అభ్యసించాడు. నెల్లూరు వి.ఆర్. కాలేజిలో ఇంటర్మీడియట్ చదివాడు. 1953లో బి.ఎ. చదివాడు.

కనిగిరి నెల్లూరు జిల్లాలో వుండగా 1959 నుండి 1964 వరకు వెలిగండ్ల సమతి అధ్యక్షుడుగా పనిచేశాడు.

1962లో జరిగిన శాసనసభ ఎన్నికలలో ఉదయగిరి శాసనసభ్యునిగా ఎన్నికయి 1967 వరకు పనిచేశాడు.

1967లో కనిగిరి శాసనసభ్యునిగా ఎన్నికై 1971 వరకు పనిచేశాడు. మొదటి నుండీ కాంగ్రెస్‌కు అండగా వున్నాడు.

1971లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో కావలి నియోజకవర్గ యం.పి.గా, తరువాత 1977లో జరిగిన లోకసభ ఎన్నికలలో ఒంగోలు నియోజకవర్గ యం.పి.గా వరుసగా మూడవసారి 1980లో జరిగిన ఎన్నికలలో ఒంగోలు నియోజకవర్గ యం.పి.గా ఎన్నికై 1984 వరకు పదవిలో వున్నాడు. ఇందిరాగాంధీకి ఇష్టమైన నాయకుడిగా ఎదిగాడు. 1962లో కేంద్ర ప్రభుత్వంలో కార్మికశాఖా సహాయమంత్రిగా పనిచేశాడు. 1984లో మరల యం.పి.గా పోటీచేసి అస్వస్థులై విజయం సాధించ లేకపోయారు. బెజవాడ పాపిరెడ్డి గెలిచాడు.

తన రాజకీయ జీవితమంతా కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి ఖర్చుచేశాడు. తన వ్యక్తిత్వంతోనే తాను అభివృద్ధి చెందాడు.

వెంకటగిరి, కనిగిరి ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషిచేశాడు. కనిగిరి ప్రాంతంలో కొందరు ప్రజలు వరి అన్నం తింటున్నారంటే అది పులి వెంకటరెడ్డి కృషివల్లనేనని ఆ ప్రాంత ప్రజలందరకు తెలుసు. 1968లో దొక్కలవాగుపై ఆనకట్ట నిర్మించి సి.యస్. పురం చెరువుకు

నీళ్ళు మళ్ళించాడు. సి.యస్. పురం మండలంలో పలు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కలిగించాడు. కనిగిరి ప్రాంతంలో విద్య, వైద్యసేవలు, రోడ్డు సౌకర్యాలు విరివిగా కల్పించాడు. అంబవరం, సి.యస్. పురం, పెదరాజుపాలెం, నల్లమడుగు ప్రాంతాలలో హైస్కూళ్ళను ఏర్పాటు చేయించాడు.

జై ఆంధ్రా ఉద్యమంలో ప్రత్యేకాంధ్రా ఉద్యమ నాయకునిగా పనిచేశాడు. వెంకటరెడ్డి అనారోగ్యానికి గురై సెరిబ్రల్ హెమరేజ్ మూలంగా గుంటూరులో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో 7-12-1999న తుదిశ్వాస విడిచాడు. అధికారలాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలోని కాంగ్రెస్ నాయకులు, ఇతర పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. తదుపరి ఆయన కుమారులు వెంకటరమణారెడ్డి జడ్.పి.టి.సి. సభ్యుడుగా ఎన్నికై తండ్రి పాత్రను నిర్వర్తించాడు.

పులి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం కనిగిరిలో 10 లక్షలపైగా ఖర్చుచేసి ఒక పార్కును తయారుచేసి ఆయన విగ్రహానిని పార్కులో స్థాపించారు.

పులి వెంకటరెడ్డి మరవటానికి వీల్లేని రెడ్డి.

**ఆశ కోసివేసి యనలంబు చల్లార్చి**
**గోఁచి బిగియగట్టి గుట్టు దెలిసి**
**నిలిచినట్టివాఁడె నెఱయాగి యెందైన**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చచ్చిపడిన పశువు చర్మంబు కండలు
పట్టి పెతికి తినును పరగ గ్రద్ద
గ్రద్దవంటివాఁడు గజపతి కాదొకో
విశ్వదాభిరామ వినురవేమ.

# కడప కోటిరెడ్డి



జననం : సెప్టెంబరు 1889
మరణం : 27-1-1981

కోటిరెడ్డి చిత్తూరు జిల్లా మదనపల్లి తాలూకా కోటిరెడ్డిగారిపల్లెలో జన్మించాడు. తండ్రి సిద్దారెడ్డి, తల్లి నాగమ్మ. భార్య రామసుబ్బమ్మ. కుమారులు : వెంకటరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, డా॥ జయచంద్రారెడ్డి, సుదర్శనరెడ్డి, గోపాలక్రిష్ణారెడ్డి, జయభారత్‌రెడ్డి (రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి), సురేంద్రనాథరెడ్డి, హర్షవర్ధనరెడ్డి. మొత్తం ఎనిమిది మంది.

చిత్తూరులో విద్యాభ్యాసం చేశాడు. 1911లో ఇంగ్లాండు వెళ్ళి బార్-ఎట్-లా చదివాడు. రెడ్డికులంలో అప్పటికి బార్-ఎట్-లా చదివిన వారు లేరనే చెప్పవచ్చు. కడపలో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించాడు. రాయలసీమలో శ్రీమంతులు ఉన్నత కుటుంబీకులైన సుద్దపల్లి గ్రామానికి చెందిన కొనుదుల రామచంద్రారెడ్డి కుమార్తె రామసుబ్బమ్మను 1917 సం॥లో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత కడప ఈయన స్థిరనివాసమైంది. 1914 సం॥లో మద్రాసు హైకోర్టు జడ్జీ పదవి అవకాశం రాగా తృణీకరించాడు.

జాతీయోద్యమంలో చేరి న్యాయవాద వృత్తిపై శ్రద్ధ చూపలేదు. గాడిచర్ల హరి సర్వోత్తమరావు, కల్లూరి సుబ్బారావు వగైరా నాయకులు, కార్యకర్తలతో కలిసి రాయలసీమ అభివృద్ధికి కృషిచేశాడు. శ్రీబాగ్ ఒడంబడికలో సంతకం చేసిన వారిలో కోటిరెడ్డి ఒకరు.

1922లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఎన్నిక కాబడి ప్రభుత్వంలో కడప జిల్లా ప్రతినిధియైనాడు. రాయలసీమ క్షామ నివారణకు ప్రభుత్వంలో కృషి చేశాడు. 1927 నుండి 29 వరకు మరల శాసనసభ్యుడైనాడు. తుంగభద్ర ప్రాజెక్టు నిర్మాణానికి ఉద్యమం నడిపాడు. స్వాంతంత్రోద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడు. 1929లో స్వతంత్ర సభ్యుడుగా మద్రాసు శాసనసభకు ఎన్నికైనాడు. 1929లో గాంధీ రాయలసీమ పర్యటన సందర్భంలో గాంధీజీ వెంటవుండి పర్యటనను జయప్రదం చేసి, విరాళాలు సేకరించి గాంధీజీకి సమర్పించాడు. 1931లో పోటీలేకుండా, 1937లో పోటీలో వుండి మద్రాసు శాసనసభకు ఎన్నికైనాడు. 1939లో కాంగ్రెసు ఆదేశానుసారం రాజీనామా చేశాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించిన స్వాతంత్రయోధుడు. పన్నుల నిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు.

భాషాప్రయుక్త రాష్ట్రాల ఉద్యమం, శ్రీబాగ్ ఒడంబడిక రూపకల్పనలో ప్రముఖపాత్ర ఈయనదే.

1946-47లలో మద్రాసు రాష్ట్రంలో టంగుటూరి ప్రకాశం గారి మంత్రివర్గంలో (30-4-1946న ప్రకాశంపంతులు గారు చెన్నరాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు)

దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రిగా పనిచేశాడు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక ప్రకాశం పంతులుగారి మంత్రివర్గంలో రెవిన్యూశాఖను నిర్వహించాడు. 1957 సం॥లో లక్కిరెడ్డిపల్లె నుండి శాసనసభకు ఎన్నికైనాడు.

1964 నుండి –1979 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగానున్నాడు.

కోటిరెడ్డి జిల్లా బోర్డు సభ్యునిగా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా, ప్రదేశ్ కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగా, అఖిల భారత కాంగ్రెస్ సభ్యునిగా, ఆంధ్ర మహాసభ అధ్యక్షులుగా, రాయలసీమ కరువు నివారణ సంఘాధ్యక్షునిగా అనేక పదవులనధిష్టించి క్రమాగతిన తన నాయకత్వ పటిమ నిరూపించుకున్నారు. వేంకటేశ్వర, ఆంధ్ర విశ్వవిద్యాలయాలు డాక్టరేట్ పట్టాలనిచ్చి గౌరవించాయి. శ్రీరంగం, మధుర, తిరునల్వేలి దేవాలయాలలో హరిజనుల ప్రవేశం చేయించినారు.

ఈ సందర్భంలో ఈయన కుటుంబం, భార్య రామసుబ్బమ్మ త్యాగాలను, అభివృద్ధి కార్యక్రమాలను కూడ చెప్పుకోవలసిందే. భర్త కోటిరెడ్డి విశాల హృదయానికి, త్యాగనిరతికి రామసుబ్బమ్మ కార్యక్రమాలు కూడా సాక్ష్యాలే. ఆమె జీవితం గూర్చి చెప్పుకోనిదే కోటిరెడ్డి జీవితాన్నిగూర్చి పరిపూర్ణంగా తెలుసుకున్నట్లు కాదు. ఇద్దరిలో ఏ ఒక్కరు ఏ కార్యక్రమం చేపట్టినా ఇద్దరి భాగస్వామ్యం వున్నది.

రామసుబ్బమ్మ 1928లో సైమన్ కమీషన్ రాకను నిరసించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 1930లో దువ్వూరు సుబ్బమ్మ, పొణకా కనకమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, గుమ్మడిదల దుర్గాబాయమ్మ, బులుసు సాంబమూర్తి, భోగరాజు పట్టాభిసీతారామయ్య, ప్రకాశంపంతులు వగైరా నాయకులతో కలిసి ఉద్యమంలో పాల్గొన్నారు. ఆమె 1938లో కడప జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఎన్నికై ఎనలేని సేవలందించారు. తరువాత గాంధీగారి పిలుపుపై పదవికి రాజీనామా యిచ్చారు. తదుపరి నాలుగు దశాబ్దాలు కడప పురపాలక సంఘానికి సభ్యురాలిగా పనిచేశారు. శ్రీ వెంకటేశ్వర, ఆంధ్ర విశ్వకళాపరిషత్తులలో సెనేట్ మెంబరుగా పనిచేశారు. ఆల్ ఇండియా సోషల్ వెల్ఫేర్ బోర్డు సభ్యులుగా, రాష్ట్ర

సంక్షేమ సంఘంలో సభ్యులుగా, గిల్డ్ ఆఫ్ సర్వీస్ అధ్యక్షులుగా అనితర సాధ్యమైన సేవలందించారు. కడపలో స్త్రీల కళాశాల ఏర్పటుకు ధనసహాయం చేసి, ప్రభుత్వంతో చర్చలు జరిపి సాధించారు. ఆ కళాశాలకు కడప రామసుబ్బమ్మ, కోటిరెడ్డి ప్రభుత్వ స్త్రీల కళాశాల అని ప్రభుత్వం నామకరణం చేసింది.

రాయలసీమ సర్వతోముఖాభివృద్ధికి ఆ కుటుంబం త్యాగం చేసింది. వారు నీతి నియమాలకు పెట్టింది పేరు. ఆ భార్యభర్తలను రాయలసీమ రత్నద్వయం అనేవారు. కోటిరెడ్డి 27-1-1981న మరణించగా, ఆమె 12-4-1982న కాలం చేశారు.

అలాంటి గొప్ప దంపతులు రెడ్డిజాతిలో వుండటం రెడ్డి జాతి గర్వించవలసిన విషయం.

ఎఱుకలేని దొర నెన్నాళ్ళు గొలిచిన
బ్రతుకలేదు వట్టి భ్రాంతికాని
గొడ్డుటావు పాలు గోరితే చేపునా
విశ్వదాభిరామ వినురవేమ.

# కొండా వెంకట రంగారెడ్డి



జననం : 12-12-1891
మరణం : 24-7-1970

వెంకట రంగారెడ్డి గారి తండ్రి చెన్నారెడ్డి, తల్లి బుచ్చమ్మ, భార్య తుంగభద్రమ్మ. వెంకట రంగారెడ్డికి ముగ్గురు సోదరీమణులు, ఒక సోదరుడు.

19వ శతాబ్దంలోని ఆత్రాసు బల్దా (ఇప్పుడు ఆయన పేరు మీదనే ఉన్న రంగారెడ్డి జిల్లా)లోని పెదమంగళారంలో జన్మించాడు. సాంప్రదాయ రైతు కుటుంబం. అప్పుడు పటేలుగిరీ

ఈ కుటుంబానిదే. అది సర్ఫెఖాసం ప్రాంతం. సర్ఫెఖాసం అంటే నిజాం నవాబు సొంత భూమి.

ఆ గ్రామంలో పాఠశాల లేనందున ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయుని ద్వారా ప్రాథమిక విద్య నేర్పించారు రంగారెడ్డికి. ఉన్నత విద్య హైదరాబాదులో నార్మల్ స్కూలులో చదివాడు. చిన్నప్పటి నుండి ఇంగ్లీషు, ఉరుదు, సంస్కృతం భాషలలో అభినివేశం ఉన్నది. తెలుగు ప్రత్యేకంగా నేర్చుకున్నాడు.

'లా' చదివాడు. ప్లీడరీ వృత్తి చేశాడు. పేదల తరఫున ఉచితంగా పనిచేశాడు. కేసులెక్కువ. ఆదాయం తక్కువ. వకీళ్ళను తయారుచేసే 'లా' క్లాసులు నడిపాడు. 1918లో వకీళ్ళ ప్రతినిధిగా "మజ్లీస్ ఎ– వజే కవానిస్" (అసెంబ్లీ)కి ఎన్నికై రైతాంగానికి సేవలు చేశాడు. క్రిమినల్ డైజెస్ట్ గ్రంధాన్ని ఉరుదూ భాషలో రాశాడు. సురవరం ప్రతాపరెడ్డి ప్రారంభించిన గోల్కొండ పత్రికకు ప్రోత్సాహమిచ్చాడు.

రాజబహద్దర్ కొత్వాల్ వెంకట రామారెడ్డికి న్యాయ సలహాదారుగా వుండేవాడు.

పూర్వపు హైదరాబాదు సంస్థాన రాజకీయాలలో కొండంత వ్యక్తి కొండా వెంకట రంగారెడ్డి. పట్టుదలెక్కువ. ఆంధ్రపితామహుడు మాడపాటి వారిపై గురుభావం. తెలంగాణాలో కాంగ్రెసుపార్టీకి ప్రాణదాత. తెలంగాణాలో పల్లెపల్లె తిరిగాడు.

సామాజిక కార్యక్రమాలకు ఆధారభూతుడు. స్త్రీలకు పౌరసత్వ హక్కులు వితంతు పునర్వివాహాలు, వితంతువులకు ఆస్తిహక్కు, దేవాలయాలలో హరిజనుల ప్రవేశం, బాల్యవివాహ నిరోధం, మూడ విశ్వాసాలపై వ్యతిరేకత ఇలా ప్రగతిశీల సంస్కరణలు చేపట్టాడు. అప్పుల వసూళ్ళలో దౌర్జన్య నివారణకు చట్టం తేవాలని ప్రయత్నించాడు.

1936లో శాసనమండలికి గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుండి ఎన్నుకోబడ్డాడు. మితవాదిగా పేరుబడ్డాడు. స్త్రీలకు పౌరసత్వ హక్కుల బిల్లు ప్రవేశపెట్టాడు. విద్యారంగంలో పలుసేవలు స్వయంగాను, ప్రజాప్రతినిధిగాను చేశాడు. 1940లో జాగీరు ప్రజాసంఘాన్ని స్థాపించి దాని ద్వారా రైతుల సంక్షేమానికి పాటుపడ్డాడు.

ఆంధ్రజనసంఘం, ఆంధ్రమహాసభలో ప్రముఖపాత్ర వహించాడు. రంగారెడ్డి వలననే ఆంధ్రమహాసభ రాజకీయాల్లోకి వచ్చింది. మహాసభకు 1943లో ఎన్నికలు వచ్చినపుడు, అధ్యక్ష పదవికి సంప్రదాయుల పక్షాన రంగారెడ్డి, యువకులు, వామపక్ష భావజాలం వారి పక్షాన బద్దం ఎల్లారెడ్డి పోటీ చేయగా రంగారెడ్డి గెలిచాడు.

రెడ్డి సంఘానికి అమూల్య సహకారం అందించాడు. సురవరం ప్రతాపరెడ్డి, రాజ బహద్దర్ కొత్వాల్ వెంకట రామారెడ్డిల ద్వారా రెడ్డి సంఘం బలోపేతానికి కృషి చేశాడు.

1946లో స్టేట్ కాంగ్రెస్ ఏర్పడగా మితవాద వర్గానికి రంగారెడ్డి నాయకుడైనాడు. "గాంధీజీ జన్మించిన భూమిలో మార్క్సును చూడలేను" అనే సూత్రంపై రాజకీయం నడిపాడు.

రాజ్యాంగ (నిర్మాణ) శాసనసభకు ఎన్నికైనాడు.

1952-56లలో బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో రెవిన్యూ, ఎక్సైజ్ శాఖల మంత్రిత్వం నిర్వహించాడు.

ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం సందర్భంలో చేసుకున్న "పెద్దమనుషుల'' ఒప్పందంలో సంతకాలు చేసిన పెద్దమనుషులలో ఒకరు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలిగా ఏర్పడ్డ మంత్రి వర్గంలో రంగారెడ్డి ఉపముఖ్యమంత్రి అయాడు. రాష్ట్రంలోని రాజకీయాలలో రంగారెడ్డి ప్రాముఖ్యతను గమనించవచ్చు.

1956 సంజీవరెడ్డి మంత్రివర్గంలో హోం, రెవిన్యూ, మద్య నిషేధ శాఖల మంత్రిగా పనిచేశాడు.

1960 సంజీవయ్య మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా పనిచేశాడు రంగారెడ్డి.

బూర్గులతో అభిప్రాయ భేదం వచ్చినపుడు జె.వి. నరసింగరావుకు మద్దతిచ్చాడు.

వెంకట రంగారెడ్డి అనేక సామాజిక కార్యక్రమాలను చేపట్టి, ప్రోత్సహించాడు, చేయూతనిచ్చాడు. చాల సాహితీ సాంస్కృతిక సంస్థలతో సంబంధాలున్నాయి. శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయంకు ఉపాధ్యక్షులుగా పనిచేశాడు. బాల సరస్వతి ఆంధ్రభాషా నిలయం, వేమన భాషా నిలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పాటులతో నిరంతర సంబంధాలున్నాయి. పేద విద్యార్థులకు విద్య, వసతి సౌకర్య కల్పనలో ఎక్కువగా కృషి చేశాడు. రెడ్డి హాస్టల్,

బాలుర పాఠశాల, ఆంధ్ర సరస్వతీ బాలికల పాఠశాల, రెడ్డి బాలికల హాస్టల్, ఆంధ్ర విద్యాలయం స్థాపన, రాజబహద్దర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల, వెంకట రంగారెడ్డి బాలికల హాస్టలు, ఇందిరా మహిళా సేవా సదన్ మొదలైన సామాజిక సేవా కార్యక్రమాలలో పూర్తిస్థాయిలో నిమగ్నమైనందున, అద్భుత సేవలు చేసినందున హైదరాబాదుకు చుట్టూ వున్న ప్రాంతాన్ని ఒక జిల్లా చేసి "రంగారెడ్డి జిల్లా" అని పేరుపెట్టి ప్రభుత్వం, ప్రజలు ఆయన సేవలను గుర్తించింది.

నిజాం కోర్టు భాషలైన ఉర్దూ, పార్శీ భాషలలో మంచి ప్రవేశం సంపాదించాడు. సెక్రెటేరియట్‌లో కూడ ఉర్దూనే వాడేవాడు. న్యాయశాస్త్ర ఆచార్యులుగా కూడ పనిచేశాడు.

తెలంగాణా ప్రాంత రాజకీయాలలో రావి నారాయణరెడ్డి, కె.వి. రంగారెడ్డి ఉత్తర దక్షిణ ధృవాలు.

కె.వి. రంగారెడ్డి సోదరి శంకరమ్మకు డా॥ మర్రి చెన్నారెడ్డి కుమారుడు.

రంగారెడ్డికి ఏడుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం. వారందరు, వారి సంతానం, వారి మనుమ సంతానం మంచి స్థాయిలలో వుండి పేరుగాంచారు.

రంగారెడ్డిని "తెలంగాణా పిత" అనేవారు. ఆయన తెలంగాణా చాణక్యానికి ప్రతీక. అలనాటి "రెడ్డి రాజుల చిటారు కొమ్మ" అని ప్రతీతి. నవాబుల పాలనలో తెలుగువారి, హిందువుల కష్టాల విముక్తికి బాధ్యత వహించాడు. ప్రగతిశీల భావాలకు దివ్వెలు పట్టి ప్రజలకు మార్గదర్శకుడైనాడు. డా॥ మర్రి చెన్నారెడ్డి వంటి రెడ్డినాయకులకు మార్గదర్శి. మరెందరో రాజకీయ నాయకులకు దిగ్దర్శి.

రెడ్డి మణిహారంలో అద్భుత మణి.

**అలను బుగ్గపుట్టి నప్పుఏడ క్షయమౌను**
**గలను గొంచు లక్ష్మిఁ గనుటలేదు**
**ఇలను భోగభాగ్య మీతీరు గాదొకో**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

# బెజవాడ రామచంద్రారెడ్డి



జననం : 24-11-1894
మరణం : 19-3-1973

రామచంద్రారెడ్డి నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జన్మించారు. తండ్రి సుబ్బారెడ్డి, తల్లి కమలమ్మ. భార్య కమలమ్మ. తండ్రి మరణించగా మేనమామ దొడ్లా వెంకటస్వామి రెడ్డి గారింట పెరిగాడు. కావలిలో పాఠశాల విద్య మొదలుపెట్టాడు. మద్రాసులోని పచియప్ప కాలేజీలో చదివి బి.ఎ. పట్టా పొందాడు. చిన్నవయసులోనే రాజకీయాలలో ప్రవేశించాడు.

అప్పటికే బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమ పార్టీగా జస్టిస్ పార్టీ ఆవిర్భవించి వున్నది. ఆ పార్టీ కార్యకర్తగా బ్రిటీషు వారికి చేరువైనాడు.

1919లో వల్వేరు గ్రామ మునసుబుగా పని ప్రారంభించాడు. తరువాత బుచ్చిరెడ్డి పాలెం గ్రామ మునసబుగా పని ప్రారంభించాడు. తరువాత బుచ్చిరెడ్డిపాలెం గ్రామ ప్రెసిడెంటుగా ఎన్నికైనాడు. తాలూకా బోర్డు మెంబరుగా పనిచేశాడు. 1929లో నెల్లూరు జిల్లా బోర్డు అధ్యక్షుడైనాడు. జిల్లా ఎడ్యుకేషన్ బోర్డు అధ్యక్షుడై చాలా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేశాడు. మద్రాసులో చదివే రోజులలో పెరియార్ రామస్వామి నాయకర్ ఉపన్యాసాలకు ఆకర్షితుడైనాడు. రామచంద్రారెడ్డి కాంగ్రెస్ కాకున్నా స్వరాజ్యవాది. కళలు, సంస్కృతి పరిరక్షణకు తన జీవితంలో ప్రాముఖ్యతనిచ్చాడు. ఆయన మానవతావాది, దేశభక్తుడు. అన్నింటినీ మించి దయాళువు. భావస్వేచ్ఛావాది. ప్రేమ, సత్యం, ఆయన ప్రాణవాయువులు.

1924లో జస్టిస్ పార్టీ తరఫున మద్రాసు శాసనసభకు ఎన్నికలలో పోటీచేసి గెలుపొందాడు. జస్టిస్‌పార్టీలో ముఖ్య నాయకుడిగా ఎదిగాడు. మద్రాసు ప్రెసిడెన్సీలో ముఖ్యవ్యక్తిగా ఎదిగాడు.

1930–37 మధ్యకాలంలో మద్రాసు రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిలుకు అధ్యక్షుడైనాడు. ఆయన నిష్పక్షపాతిగా వ్యవహరించి సభా సభ్యులందరి నుండి మన్ననలు పొందాడు. ప్రభుత్వంలో ముఖ్యవ్యక్తిగా విషయ నిర్ణయాలలో ప్రముఖ వ్యక్తియైనాడు. విద్యా సంబంధిత విషయాలలో చొరవ చూపించాడు. విశాఖపట్టణంలో ఆంధ్ర నాటక కళాపరిషత్తు స్థాపించి 10 సం॥లు అధ్యక్షునిగా చేసి నాటక కళారంగానికి సేవచేశాడు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్ మెంబరుగా వ్యవహరించాడు మరియు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మొదటి పరిపాలక సంఘ సభ్యుడుగా పనిచేశాడు.

1937లో ల్యాండ్ రెవిన్యూ కమిటీ మెంబరుగా నియమించబడి ప్రభుత్వ ల్యాండ్ రెవిన్యూ రికార్డుల నిర్మాణంలో కృషిచేశాడు. భూ యాజమాన్య రికార్డుల నిర్మాణంలో శ్రద్ధచూపి ప్రభుత్వ భూములు, వ్యక్తుల భూముల విభాగ వివరాలను నమోదు చేయించుటలో ప్రభుత్వానికి మార్గదర్శకమైనాడు. 1943లో మద్రాసు అగ్రికల్చరల్ అసోసియేషన్ అధ్యక్షునిగా చేస్తూ, సోమశిల, కావలి–కనువూరు కెనాల్ సాధనకు కృషిచేశాడు.

1952 నాటికి ఆచార్య రంగా రంగప్రవేశం, స్వతంత్ర పార్టీ ఆవిర్భావం జరిగింది. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్రోద్యమం నడపటంలో ముందుండగా రాజకీయ కారణాల వలన స్వతంత్రపార్టీ ఆవిర్భవించింది. సి. రాజగోపాలాచారి, యం.ఆర్. మసాని, ప్రొఫెసర్ యన్.జి. రంగా స్వతంత్ర పార్టీ ముఖ్యనాయకులు. ఈ పార్టీ రాష్ట్రశాఖకు అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డాడు రామచంద్రారెడ్డి.

మెట్టూరు ప్రాజెక్టు, నేత పరిశ్రమల కమిటీలలో సభ్యుడిగా వ్యవహరించారు. గోదావరి, కృష్ణా జిల్లాల్లోని ప్రజల ఆర్థిక విచారణ సంఘంలో సభ్యులుగా పనిచేశాడు.

1952లో నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి ఇండిపెండెంటుగా ఎన్నిక కాబడ్డాడు. పార్లమెంటులో నేషనల్ డెమోక్రాటిక్ పార్టీకి డిప్యూటీ లీడరైనాడు.

నెల్లూరు ప్రజల పక్షాన నాలుగుసార్లు శాసనసభకు ఎన్నుకోబడ్డారు. శాసన సభాధ్యక్షులుగా పనిచేసి పేరు ప్రఖ్యాతులు పొందారు. ప్రజలకు సేవ చేశాడు.

1969లో జపాన్‌కు వెళ్ళి అక్కడి వ్యావసాయిక విషయాలను అధ్యయనం చేశాడు.

రామచంద్రారెడ్డి లలిత కళాభిమాని. ఆంధ్ర నాటక కళాపరిషత్తుకు అధ్యక్షులుగా (విశాఖపట్టణం) కొంతకాలం పనిచేశాడు.

రామచంద్రారెడ్డి వ్యాపారరంగంలో కూడ ఉన్నాడు. ఆంధ్ర సైంటిఫిక్ కంపెనీ, నేషనల్ కెమికల్ ఇండస్ట్రీని మచిలీపట్నంలో స్థాపించాడు. ఇండియా సిమెంట్స్, మద్రాసు వనస్పతి స్థాపించాడు. మద్రాసులో మైకా అసోసియేట్స్ అధ్యక్షుడైనాడు.

రెడ్డి వారసత్వాన్ని వెలుగులతో నింపిన రామచంద్రారెడ్డిని రెడ్డి సమాజం మరవదు.

**కోతి నొనరదెచ్చి కొత్తపట్టముగట్టి**
**కొండముచ్చు లెల్ల గొలిచినట్లు**
**నీతిహీనునొద్ద నిర్భాగ్యులుండుట**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

కల్లలాడువాని గ్రామకర్త యెఱుంగు
సత్యమాడువాని స్వామి యెఱుంగు
బెక్కుతిండిబోతుఁ బెండ్లా మెఱుంగురా
విశ్వదాభిరామ వినురవేమ.

# తరిమెల నాగిరెడ్డి



జననం : 11-2-1917
మరణం : 28-7-1976

నాగిరెడ్డి గారి తండ్రి సుబ్బారెడ్డి, తల్లి ఆదిలక్ష్మమ్మ; భార్య లక్ష్మీకాంతమ్మ; తమ్ముళ్ళు: రంగారెడ్డి, కృష్ణారెడ్డి, రామదాసురెడ్డి; కుమార్తె: సుజాత; చెల్లెళ్ళు; రమాదేవి, ఉమాదేవి.

తరిమెల నాగిరెడ్డి గారిది అనంతపురం జిల్లా తరిమెల గ్రామం. భూస్వామ్య కుటుంబం. తండ్రి కాంగ్రెస్ పార్టీ. భారత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి మరియు నాగిరెడ్డి, బావాబావమరదులు. సంజీవరెడ్డి తల్లి తరిమెలవారి ఆడపడుచు.

నాగిరెడ్డి పాఠశాల విద్య గ్రామంలోనే జరిగింది. హైస్కూలు విద్య థియోసాఫికల్ హైస్కూలూ అడయార్‌లో. యస్.యస్.యల్.సి వరకు రిషివ్యాలీలో, కళాశాల విద్య మద్రాసు లయోలా కాలేజిలో, ఎం.ఎ. మరియు లా బెనారెస్ హిందూ విశ్వవిద్యాలయంలో చదివాడు. విశ్వవిద్యాలయంలో విద్యార్థి యూనియన్ అధ్యక్షుడైనాడు. ఈయనే తొలి ఆంధ్రదేశ యూనియన్ అధ్యక్షుడు. విద్యార్థి దశ నుండి సమానత్వంపై దృష్టి సారించాడు. లయోలా కాలేజి యాజమాన్యము, నాగిరెడ్డికి, జవహర్‌లాల్ నెహ్రూ బహిరంగ ఉపన్యాసాలకు హాజరైనందుకు, తదుపరి రామస్వామి ముదలియార్‌కు సత్యమూర్తికి మధ్య జరిగిన ఎన్నికల్లో ప్రచారానికెళ్ళినందుకు, వ్యాస రచనా పోటీల్లో మహమ్మద్‌బిన్ తుగ్లక్‌ను ప్రశంసించినందుకు చాలసార్లు జరిమానా విధించింది.

విశ్వవిద్యాలయంలోనే కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితుడై కమ్యూనిస్టు అయి బలగాన్ని కూడగట్టాడు. భారతదేశంలో మార్క్సిజాన్ని అమలు చేయవచ్చుని నమ్మాడు. విశ్వవిద్యాలయ ఉపకులపతిని నిలదీశాడు. మహాత్మాగాంధీకి అది తెలిసి క్షమాపణ చెప్పమని నాగిరెడ్డికి లేఖ రాశాడు. నాగిరెడ్డి ఒప్పుకోలేదు. తిరస్కరించాడు. చంద్ర పుల్లారెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి కూడ అక్కడే కమ్యూనిస్టులైనారు. నాగిరెడ్డి 1939లో బెనారెస్‌లో కమ్యూనిస్టు పార్టీ కార్డు హోల్డర్ అయినాడు. నాగిరెడ్డికి 20-10-1943న వివాహం జరిగింది.

తెలంగాణా రైతుల పోరాటానికి మద్దతు ప్రకటించి రాయలసీమలో ఉద్యమ నిర్మాణ బాధ్యతలు స్వీకరించి భూస్వాములపై పోరాటం చేశాడు. భూ పంపిణీ ఆయన ధ్యేయం. తన తండ్రిపై కూడ ఉద్యమించాడు. కుటుంబంలో తన భాగానికి వచ్చిన భూమిని పేదలకు పంచాడు. ఇంతటి ప్రజాస్వామిక విప్లవమార్గం అవలంభించాడు. 1940లో కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక ఏడాది జైలు శిక్ష అనుభవించాడు. చురుకైన జీవితం అనుభవిస్తూ జాతీయస్థాయి నాయకత్వ స్థాయికి ఎదిగాడు. పార్టీ వర్గాలలో ఆయన టి.ఎన్.గా సుపరిచితుడు.

ఆయన జీవితంలో జైలు జీవితం, అజ్ఞాతవాసం, శాసనసభ్యత్వం, లోక్‌సభ సభ్యత్వం, అసెంబ్లీ ప్రతిపక్ష నాయకత్వం, రాష్ట్రంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ లాంటివి కొన్ని భాగాలు.

1952 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా బావ నీలం సంజీవరెడ్డి పై పోటీచేసి, జైలులో ఉండీ కూడ గెలిచి మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఎన్నికై శాసనసభలో ప్రతిపక్ష నాయకుడై పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ అయి ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టించాడు.

1957 పార్లమెంటు ఎన్నికలలో అనంతపురం లోక్‌సభ నియోజకవర్గం నుండి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచాడు. పైడి లక్షయ్య ఓడిపోయాడు. 1962లో పుల్లూరు నుండి, 1967లో అనంతపురం నుండి ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు ఎన్నికైనాడు.

కేవలం ఎన్నికల ద్వారా, శాసనసభల ద్వారా విముక్తి సాధ్యం కాదని 1969లో శాసనసభ సభ్యత్వానికి రాజీనామా యిచ్చాడు. అప్పటికే కమ్యూనిస్టులలో భావ సారూప్యత తొలగి సి.పి.ఐ.గా కొందరు, సి.పి.ఐ.(యమ్)గా కొందరు చీలిపోయినప్పుడు నాగిరెడ్డి సి.పి.ఐ(యమ్)లో ఉన్నాడు. కాని కాలక్రమేణా సి.పి.ఐ.(యమ్) కూడ తన వేగాన్ని అందుకోలేక పోయింది. సి.పి.ఐ.(యమ్) నుంచి విడిపోయి ఆంధ్రప్రదేశ్ విప్లవకారుల సమన్వయ కమిటీని స్థాపించాడు. అపుడే నక్సలైటు ఉద్యమం, శ్రీకాకుళ సాయుధ తిరుగుబాటు వచ్చాయి. విప్లవోద్యమ నిర్మాణానికి అంకితమైనాడు. దేశం తాకట్టులో విలవిలలాడుతుందని భావించి దానిపై విప్లవోద్యమాలలో వున్నాడు. "తాకట్టులో భారతదేశం" గ్రంధం రాశాడు. ఫలితంగా ప్రభుత్వం కేసుపెట్టి జైలుకంపింది. సెషన్సు కోర్టులో కూడ తాను నమ్మిన తాకట్టులో భారతదేశం పరిస్థితినే విన్నవించాడు.

స్వేచ్ఛకి, నిజాయితీకి, విప్లవానికి నాగిరెడ్డి పర్యాయపదమై పోయాడు. ఇంతలో ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితిని విధించింది. అజ్ఞాతంలోకి వెళ్ళాడు. హైద్రాబాదు కుట్ర కేసు, పార్వతీపురం కుట్రకేసు నాగిరెడ్డిపై వచ్చాయి.

తన జీవితమంతా ప్రభుత్వాలతో, పోలీసులతో పోరాటాలతోనే పోయింది. ప్రజాసేవకే అంకితమయాడు. ఆదిలో బ్రిటీషు వలసవాదం – సామ్రాజ్యవాదానిని వ్యతిరేకించాడు. భూస్వాములపై ప్రత్యక్ష, పరోక్ష యుద్ధం చేశాడు. శాసనసభ్యుడుగా, పార్లమెంటు సభ్యుడుగా ప్రభుత్వంపై పోరాటం చేశాడు. తండ్రిని కూడ ఉపేక్షించలేదు.

1940లోనే రెండవ ప్రపంచయుద్ధంలో మనదేశం పాత్రకు వ్యతిరేకంగా “యుద్ధం – దాని ఆర్థిక ప్రభావం” పుస్తకం వ్రాసినందుకు అరెస్టు కాబడి జైలుకెళ్ళి 1 సంవత్సరం శిక్ష అనుభవించాడు. తిరుచిరాపల్లె జైలు నుండి విడుదలై జైలు వెలుపలి వాకిట్లోకి రాగానే భారత రక్షణ చట్టం క్రింద డిటెన్యూగా అరెస్టు చేసి తీసుకెళ్ళారు పోలీసువారు. విడుదలైనాక 1946లో “ప్రకాశం ఆర్డినెన్సు” క్రింద అరెస్టు చేశారు. ఒక సంవత్సరం జైలులో ఉన్నాడు. 1951లో మొదటి సాధారణ ఎన్నికల ముందు డిటెన్యూగా నిర్బంధించారు. జైలులో వుండే గెలిచాడు. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో అరెస్టు అయినాడు. 1962లో, 1964లో భారత రక్షణ నిబంధనల క్రింద అరెస్టు చేశారు. 1969లో ప్రివెంటివ్ డిటెన్షన్ ఆక్టు క్రింద అరెస్టు చేశారు. హైకోర్టు ఆర్డరుతో ఆ సంవత్సరం డిసెంబరు 1వ తేదీన విడుదల అయాడు. కాని అదే డిసెంబరు 19వ తేదీన భారతీయ శిక్షాస్మృతి 121ఏ సెక్షన్, మరికొన్ని సెక్షన్‌ల క్రింద (భారతదేశంపై యుద్ధానికి కుట్ర వగైరాలు) నేరం మోపి అరెస్టు చేయగా 1972లో విడుదలైనాడు.

చివరగా 25–6–1975న ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని విధించగా అజ్ఞాతంలోకి వెళ్ళాడు. అనారోగ్యుడైనాడు. వెంకట్రామయ్య అనే మారుపేరుతో హైదరాబాదూఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో చేరాడు. 28–7–1976న ఉదయం అసువులు బాశాడు. తన చెల్లెలు రమ పార్థివ దేహాన్ని ఇంటికి తరలిస్తుండగా దారిలో కల్లూరు వద్ద పోలీసులు కారునాపి భౌతికకాయాన్ని స్వాధీనం చేసుకుని ఆ రాత్రి అనంతపురం గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకెళ్ళారు. శవాలగదిలో శవాన్నుంచి బంధువులుకూడ చూడటానికి వీల్లేదని పోలీసులు నిరాకరించారు. తెలిసి చేరిన వేలాది జనం పట్టుబట్టారు. కడకు నీలం సంజీవరెడ్డి కూడ “ఏమయ్యా యింకా వాణ్ని చూస్తే భయమా జనాన్ని చూడనీయండి” అని వత్తిడి చేయగా వత్తిడికి తట్టుకోలేక హాస్పిటల్ వద్ద శవపరీక్ష జరిగే వరకు ప్రజల సందర్శనకు అవకాశమిచ్చారు.

తరువాత శవాన్ని నీలం థియేటర్ వరకు 30,000 మంది ప్రజలే తీసుకొని వెళ్ళారు. తరిమెలలో నాగిరెడ్డి స్మారక స్థూపం వేశారు.

టి.ఎన్. – తరిమెల నాగిరెడ్డి రాజీలేని పోరాట యోధుడు. పేదప్రజలకు భూ పంపిణీ ఆయన ఉద్యమం. విప్లవ రథసారథి. ఉభయ కమ్యూనిస్టుల వేగం చాలదని తీవ్రతను చూపిన వ్యక్తి. భూస్వాముల కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకి. త్యాగం, క్రమశిక్షణ, దీక్ష, శ్రమ, పోరాటతత్వం ఆయన సంపదలు. 30 సంవత్సరాలు పీడిత ప్రజలకోసం సాగించిన సాహసోపేత జీవితయాత్ర తన 60వ యేట ముగిసింది. పత్రికలు, నాయకులు, కవులు, ఘన నివాళులర్పించారు. " భారతదేశపు గొప్ప పోరాట యోధుడు టి.ఎన్. (తరిమెల నాగిరెడ్డి)" అన్నాడు కానూ సన్యాల్. "లోకోత్తరుడు మా తరిమెల నాగిరెడ్డి" అన్నాడు విద్వాన్ విశ్వం. "మన తరిమెల నాగిరెడ్డి అనంతపురం జిల్లాలో దొరికిన వజ్రకరూర్ వైఢూర్యం" అన్నాడు శ్రీశ్రీ.

ఇట్టి రెడ్డి యోధుడు మరల ఎప్పుడు జన్మించునోనని మనం వేచి చూడవలసిందే.

**కల్ల నిజములెల్లఁ గరకంఠుఁ డెఱుగును**
**నీరు పల్ల మెఱుఁగు నిజముగాను**
**తల్లి తానెరుఁగును దనయుని జన్మంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మైలకోకతోడ మాసిన తలతోడ
ఒడలు ముఱికితోడ నుండెనేని
అగ్రకులజుఁడైన నట్టిట్టు పిల్వరు
విశ్వదాభిరామ వినురవేమ.

# పుచ్చలపల్లి సుందరయ్య



జననం : 1-5-1913
మరణం : 19-5-1985

సుందరయ్యగారి తండ్రి వెంకట్రామిరెడ్డి, తల్లి శేషమ్మ; భార్య లైలా(మహారాష్ట్ర యువతి) @ లీలమ్మ.

సుందరయ్యది నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా అలగానిపాడు గ్రామం. సాంప్రదాయిక, భూస్వామ్య కుటుంబం. 50 ఎకరాల సేద్యం. ఆయనకు ఒక అన్న, ఒక తమ్ముడు, నలుగురు అక్కలు.

ప్రాథమిక విద్య ఊళ్ళోనే వీధిబడిలో. చురుకైనవాడు. వేమన, సుమతీ శతకాలు, లెక్కలు చెప్పారు ఆబడిలో. దళితులు తప్ప ఇతరులు చదువుకుంటారాబడిలో.

చిన్నతనంలోనే కుల వివక్షపై కష్టంగా వుండేవాడు. ఆ విషయంలో ఇంటా, బయటా వాదనలు చేసేవాడు. దళితులను ఇంట్లోకి రానివ్వాల్సిందేనని తల్లితో పోరు పెట్టుకునేవాడు. తన ఒక అక్కను 16 సంవత్సరముల వయస్సులో 42 సంవత్సరముల వయస్సు వానికివ్వటానిని ఇంట్లో వ్యతిరేకించాడు. కాని మాట సాగలేదు.

తిరువళ్ళూరులో అక్కవద్ద వుండి మూడు, నాలుగు, అయిదు తరగతులు ఆ వూళ్ళోనే చదివాడు. బావ బదిలీ కారణంగా వారితోనే వెళ్ళి ఏలూరు, రాజమండ్రిలో రెండేళ్ళు చదివాడు. గ్రంధాలయాలను బాగా ఉపయోగించుకొని కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహం గారలు వ్రాసిన సంఘసంస్కరణల గ్రంధాలు చదివాడు. జాతీయోద్యమాన్ని గూర్చి ఆలోచన మొదలైంది. గాంధీ సత్యసంధత నచ్చినా ఆయన సత్యాగ్రహ మార్గాన్ని అంగీకరించలేకపోయాడు. గాంధీ నిరాడంబరత, అస్పృశ్యతా నివారణ, సుందరయ్య పై ప్రభావం చూపాయి. అప్పటికి రాజమండ్రిలో చిన్న టెర్రరిస్టు బృందాన్ని తయారు చేసుకున్నాడు.

చదువు మద్రాసుకు మారింది. 1927, ‘28 సంవత్సరాలలో ట్రిప్లికేన్ హిందూ హైస్కూలులో 9, 10, 11 తరగతులు చదివాడు. గాంధీజీ పుస్తకాలు, యంగ్ ఇండియా పత్రిక, వివేకానంద, స్వామి రామతీర్థ, దయానంద సరస్వతి పుస్తకాలు చదివాడు. సామాజిక కార్యక్రమాలలో పాల్గొనేవాడు. ఇవన్నీ ఆయన స్వభావాలకు పునాదులు.

సైమన్ కమిషన్ బహిష్కరణోద్యమంలో పాల్గొన్నాడు.

ఇంటర్మీడియెట్ లయోలా కాలేజీలో చదివాడు. జీగ్ శాండల్స్ వ్రాసిన “రాజకీయ అర్థశాస్త్రం” గ్రంథం ఇతర రాజకీయ అర్థశాస్త్ర గ్రంధాలు, ఠాగూరు, నెహ్రూ గ్రంధాలు చదివాడు.

అంతలో లయోలా కాలేజికి బొంబాయి నుండి యువజన సంఘం ప్రతినిధిగా వచ్చిన హెచ్.డి. రాజా పరిచయం చేసిన "కమ్యూనిస్టు ప్రణాళిక" సుందరయ్యను ప్రభావితంచేసింది.

26-1-1930 భారత జాతీయ కాంగ్రెస్ వారు ఏర్పాటు చేసిన "ప్రధమ స్వాతంత్రదినం" ఊరేగింపులో విద్యార్థి నాయకుడిగా ప్రముఖస్థానంలో పాల్గొన్నాడు. గాంధీ టోపీలతో కాలేజికి ఎవ్వరూ రావలదని మేనేజిమెంట్‌వారు గాంధీటోపీని నిషేధించినపుడు 500మంది విద్యార్థులను గాంధీ టోపీలతో కాలేజికి తీసుకెళ్ళాడు. ఇవన్నీ నాయకత్వ లక్షణాలే.

తన స్వగ్రామంలో వేమన జయంతికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశాడు. కుటుంబీకులు, గ్రామస్తులు వ్యతిరేకించారు. నిరాహారదీక్ష మొదలు పెట్టాడు. సమానత్వం కోసం, దళితుల సంక్షేమం కోసం నిలబడతాడని దళితులకు, శ్రామిక జనానికి నమ్మకం కలిగించాడు. బ్రిటీషు వారికి వ్యతిరేకంగా తాటి చెట్లెక్కి జాతీయ జెండా (అప్పటికి కాంగ్రెసువారు తీర్మానించిన జెండా)లను కట్టాడు. శాసనోల్లంఘన చేసినందుకు బ్రిటీషువారు కేసు పెట్టారు. శిక్ష పడింది. 18 సంవత్సరాలలోపు వయసు వాడని బాల నేరస్తుల జైలుకు పంపారు. తరువాత రాజమండ్రి జైలుకు పంపారు. జైలులో కమ్యూనిస్టు ఖైదీలతో పరిచయం ఏర్పడింది. భగత్‌సింగ్ సహచరుడు శివవర్మను కలిశాడు. విడుదల తర్వాత బావ వద్దకు బెంగుళూరు వెళ్ళితే భారత కమ్యూనిస్టు ఉద్యమ ప్రారంభకుడైన అమీర్ హైదర్‌ఖాన్‌తో పరిచయమైంది. కమ్యూనిస్టు పార్టీలోకి ఆహ్వానించాడు. సుందరయ్య చేరాడు. కమ్యూనిస్టు పార్టీలో చేరి సొంత ఆస్తులుండటమేమిటని తన భాగం ఆస్తిని అన్నకు అమ్మి ఆయనిచ్చిన డబ్బును కమ్యూనిస్టు పార్టీ కిచ్చాడు.

1932లో కమ్యూనల్ అవార్డుకు వ్యతిరేకంగా గాంధీ చేస్తున్న ఉద్యమంలో శ్రామికులతో కలిసి తిరిగాడు.

1934లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా నియమించబడ్డాడు పార్టీ నిర్ణయం ప్రకారం ఆంధ్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యదర్శి అయాడు.

ఈయనపై 1937, 38లో నిరంతరం పోలీసు నిఘా వచ్చింది. రాజమండ్రిలో సోషలిస్టు పార్టీ సభలో చేసిన ప్రసంగానికి వచ్చిన కేసులో 2 సంవత్సరాలు శిక్ష పడింది. విడుదల

తర్వాత పోలీసు నిఘా వలన అజ్ఞాతంలో కెళ్ళాడు. 1941లో మార్మగోవా నుండి తప్పించుకొని ఆంధ్రకు వచ్చాడు.

1942–43లో బొంబాయిలో పార్టీ కేంద్రానికెళ్ళాడు. అక్కడ ఒక రహస్య కేంద్రంలో లైలాను కలిశాడు. ఆమెది బొంబాయి(మహారాష్ట్ర) ప్రావిన్స్. సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగి. కమ్యూనిస్టు పార్టీ కుటుంబం. ఇద్దరూ చర్చించుకొని, అంగీకరించుకొని పెండ్లి చేసుకున్నారు. ఉద్యమాలకు ఆటంకమని సంతానం వద్దని నిర్ణయించు కున్నారు. లైలా @ లీలమ్మ కమ్యూనిస్టు పార్టీ రహస్య కార్యక్రమాలలో చేరింది.

కరువు వచ్చింది. కరువు పనుల్లో చేరాడు. ప్రపంచ యుద్ధానంతరం ప్రజావెల్లువ కమ్యూనిస్టు పార్టీ వైపుకు మళ్ళింది.

1946–51లలో తెలంగాణాలో నిజాం వ్యతిరేకోద్యమంలో పాల్గొని రైతు ప్రతిఘటన నడిపాడు. సాయుధ పోరాటంలో చేరాడు; చేశాడు.

ఎన్నికల పర్వం మొదలైంది. ఆయన జీవితం మరొక పార్శ్వానికి పోయింది.

1952లో పార్లమెంటు ఎన్నికలొచ్చాయి. ఆంధ్ర నుంచి 18 మంది పార్లమెంటు సభ్యులు కమ్యూనిస్టు పార్టీ తరపున ఎన్నికైనారు. పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షం కమ్యూనిస్టు పార్టీయే. సుందరయ్యను రాజ్యసభకు (ఆంధ్ర నుండి) ఎన్నుకున్నారు. ప్రతిపక్ష నాయకునిగా కూడ ఎన్నుకున్నారు. లోక్‌సభలో ఎ.కె. గోపాలన్ ప్రతిపక్ష నాయకుడు. 19–5–1952న తొలి ప్రసంగం అద్భుతంగా చేశాడు. నెహ్రూ దృష్టిలో కెక్కాడు. 28–5–1952న పార్లమెంటులో బడ్జెట్‌పై ప్రసంగించాడు. 16–7–1952న భాషాప్రయుక్త రాష్ట్రాలు, ఆంధ్రరాష్ట్రం ఏర్పరచాలని అనధికార బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టాడు. 2–9–1953లో భాషా ప్రయుక్త రాష్ట్రాలను వ్యతిరేకించిన డా॥ బి.ఆర్. అంబేద్కర్‌ను వ్యతిరేకించాడు. సుదీర్ఘ ప్రసంగంలో అంబేద్కర్ వాదనలో వాస్తవాలు లేవని వ్యతిరేకించాడు. ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాదు రాజధాని కావాలని, హిందీ జాతీయ భాష కావాలని వాదించాడు. విదేశాంగ విధానంపై కాంగ్రెస్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డాడు. రైతుల మేలుకోసం వివిధ ప్రతిపాదనలు చేశాడు.

పార్లమెంటుకు సైకిలుపై పోయే ఆదర్శవాది. ఒక సంచి, అందులో రేడియో, ఒక పంచ + చొక్కా (ఖద్దరువి) ఆయన ఆస్థి. అందుకేనేమో ఆయనను "కమ్యూనిస్టు గాంధీ" అనేవారట.

1955 ఆంధ్రప్రదేశ్ శాసనసభకు మధ్యంతర ఎన్నికలొచ్చాయి. పోటీచేసి గెలిచాడు. 1955 నుండి 1967 వరకు ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీలో కమ్యూనిస్టు పార్టీ నాయకుడు. ప్రభుత్వాలకు చెమట్లు పట్టించాడు.

1953లో కమ్యూనిస్టుపార్టీ మధురై సభలో పార్టీ పొలిట్‌బ్యూరోకు ఎన్నిక కాబడ్డాడు.

1962లో చైనాతో యుద్ధ సమయంలో అరెస్టుకాబడ్డాడు.

1964లో పార్టీ విడిపోయినప్పుడు సి.పి.ఐ (మార్క్సిస్ట్)కు ప్రధాన కార్యదర్శి అయి 1975 వరకు పార్టీని నడిపాడు. సి.పి.ఐ.(మార్క్సిస్ట్)కు ప్రధాన కార్యదర్శి అయిన వెంటనే అరెస్టు కాబడ్డాడు. 1976లో విడుదలయాడు. ప్రజా ఉద్యమాలలో కఠోర దీక్షతో పనిచేశాడు.

1978లో చివరిసారిగా శాసనసభకు ఎన్నికై 1983 వరకు కొనసాగాడు. 1982లో పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖకు కార్యదర్శిగా పనిచేవాడు.

చైనా దేశంలో పార్టీ కమిటీ ఆహ్వానంపై సుందరయ్య, భార్య లైలా @ లీలమ్మతో కలిసి వెళ్ళాడు.

19-5-1985న అనారోగ్యంతో ఆసుపత్రిలో అసువులు బాశాడు.

సుందరయ్య భారతీయ ప్రజల మన్ననలు పొందాడు.

పాఠశాల విద్యార్థి దశనుండి వామపక్ష భావజాలం వైపునే ఉన్నాడు. అంటరానితనం, కులవివక్షలపై ఇంట్లో, వీధిలో పోరాటం చేసి బయటపడ్డాడు. సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశాడు. ఆదర్శ కమ్యూనిస్టు. కమ్యూనిస్టులలో కూడ అలాంటి వారుంటారని చెప్పలేము. పార్టీకి హోల్‌టైమర్. వామపక్షంలో వుండీ సభలో ఓర్మితో ప్రవర్తించిన వ్యక్తి. గాంధీలోని నిరాడంబరత, సత్యశోధన, సత్యసంధత బాగా నచ్చాయి సుందరయ్యకు. జీవితమంతా

అలానే గడిపాడు. నైతిక ప్రమాణాలకు ప్రధమ సాక్షి సుందరయ్య. పార్టీ భావజాలం అనుసరిస్తున్నందువల్ల రెడ్డి అనే కులనామాన్ని ఉపయోగించుకోలేదాయన. కాని రెడ్డిజాతి ఆయనలోని రెడ్డి తనాన్ని తమ సొంతంగానే భావిస్తున్నది.

**చెట్టుపాలు జనులు చేదందు రిలలోన**
**ఎనుపగొడ్డు పాలదెంత హితవు**
**పదుగురాడుమాట పాటింప నిజమయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# చంద్ర పుల్లారెడ్డి



జననం : 1-7-1917
మరణం : 9-11-1984

పుల్లారెడ్డి గారి భార్య జయలక్ష్మమ్మ, కుమారులు: రాజశేఖరరెడ్డి, విజయ మోహన్‌రెడ్డి, చంద్ర శేఖరరెడ్డి.

పుల్లారెడ్డి కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించాడు. 16 ఎకరాల మాగాణి భూమిగల కుటుంబం.

మద్రాసులో దిండి సి.పి. ఇంజనీరింగ్ కాలేజిలో చదివాడు. యుక్తవయసు నుండి పుచ్చలపల్లి సుందరయ్యతో సాన్నిహిత్యం. బెనారెస్ యూనివర్సిటిలో తరిమెల నాగిరెడ్డితో సాన్నిహిత్యం. ఇంజనీరింగ్ చదివేటపుడు ఈ విద్యార్థి, జాతీయ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నాడని కాలేజి మేనేజిమెంట్ వారు ఈయనను బహిష్కరించారు. చదువుకు స్వస్తి చెప్పి ప్రజాఉద్యమంలో చేరాడు.

1946-51లలో జరిగిన తెలంగాణా సాయుధ పోరాట సమయంలో ఇల్లు, ఆస్తి, తల్లిదండ్రులను వదలుకొని మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచెయ్యటానికి వెళ్తుండగా మార్గమధ్యంలో అరెస్టయి జైలు కెళ్ళాడు.

1952 సాధారణ ఎన్నికలలో మద్రాసు రాష్ట్ర శాసనసభకు నందికొట్కూరు నియోజకవర్గం నుండి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మద్దూరు సుబ్బారెడ్డిపై పోటీచేసి గెలిచాడు. 1955 ఎన్నికలలో ఇ. అయ్యపరెడ్డి పై పోటీచేసి ఓడిపోయాడు. 1958లోనూ అయ్యపరెడ్డి పైనే పోటీచేసి ఓడిపోయాడు.

తరిమెల నాగిరెడ్డితో కలిసి భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు చేశాడు.

1964లో దేశ రక్షణ చట్టం క్రింద అరెస్టు కాబడి రెండేళ్ళు శిక్ష విధించబడి హైదరాబాదు సెంట్రల్ జైలులో గడిపాడు. జైలును సద్వినియోగం చేసుకొని "ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం – దాని పరిణామం" గ్రంథం రాశాడు. 1967 అజ్ఞాతంలోకి వెళ్ళాడు.

1968లో తను నమ్మిన విప్లవ సిద్ధాంతానికి కట్టుబడి ఆచరణలో పెట్టేందుకు సి.పి.ఎమ్‌తో విభేదించి ములుగు అడవిబాట పట్టాడు. అపుడు తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, కొల్లా వెంకయ్య, పుల్లారెడ్డి ఏకాభిప్రాయంగా వెళ్ళారు. 1975 వరకు అడవుల్లోనే అజ్ఞాతంగా వుండి పోరాటం నడిపాడు. ఈయన పోరాటానికి పెట్టింది పేరు.

1975లో సి.పి.ఐ.(ఎం.ఎల్) కేంద్ర కమిటీ సభ్యుడై 1979లో జనరల్ సెక్రెటరీ అయాడు. 1980 ప్రత్యేక మహాసభలో ప్రధాన సెక్రెటరీ అయినాడు. తెలంగాణాలో విప్లవ కార్యకర్తలను తయారు చేశాడు. సాయుధ విప్లవానికి వరంగల్, ఖమ్మం ప్రాంత అడవులు

అనువైనవని అక్కడ సాయుధ బలగాల్ని తయారు చేశాడు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, తూర్పుగోదావరి జిల్లాలలో ఆదివాసీలను సమీకరించి వారి హక్కుల కోసం ఉద్యమం చేశాడు. భారత కమ్యూనిస్టు ఉద్యమం సృష్టించిన కొద్దిమంది మార్క్సిస్ట్ లెనినిస్టు సిద్ధాంతకర్తలలో పుల్లారెడ్డి ప్రముఖుడు – చిరస్మరణీయుడు.

కుటుంబ జీవితం సంతృప్తిగా అనుభవించలేదు. ఆయన జీవితం ఉద్యమానికే అంకితమైంది. జ్ఞాపకాలంటే స్థూపాలేనా కుటుంబాల్ని పట్టించుకోరా అని భార్య జయలక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. వారిద్దరు కలిసి కాపురం చేసింది 15 సంవత్సరాలే. ఆమెది అనంతపురం జిల్లా ఉరవకొండ తాలూకాలోని గడిపెద్ద హోతూరు. తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు. 30ఎకరాలకు వారసురాలు. ఆమెకు 17సంవత్సరాల వయసులో పుల్లారెడ్డితో పెండ్లయింది. శేరు బంగారంతో సహా కాపురానికి వచ్చింది. తరిమెల నాగిరెడ్డి ఈ సంబంధం కుదిర్చాడు. ఆమెకూడ భర్తతోనే ఉద్యమకారిణి. ప్రతిరోజూ వారింటికి 50మంది దాకా వచ్చేవారు. భోజనాలు అక్కడే. పెండ్లయిన సంవత్సరానికే తుపాకీ పట్టి తెలంగాణా ఉద్యమానికి వెళ్ళాడు. అజ్ఞాతం నుండి బయటకు వచ్చి రాజకీయం ద్వారా ప్రజలకు న్యాయం చేయగలనని ఎన్నికల్లో పాల్గొన్నాడు. చివరకు తన ఆస్తి, తన భార్య ఆస్తి, బంగారం అంతా ఉద్యమంలో కర్పూరంలా కరిగిపోయింది.

ఇద్దరు పిల్లలు చదువులో వెనకబడ్డారు. ఒకరు డిగ్రీ చదివాడు. రాజకీయ కక్షల్లో ఇరుక్కున్నారు. ఇద్దరు కొడుకులు గ్రామ కక్షలలో హత్య గావించబడ్డారని చెబుతారు.

అజ్ఞాతంలోనే వుండి 9-11-1984న కలకత్తాలో గుండెవ్యాధితో మరణించినట్లు రేడియోలో చెప్పిన వార్త ద్వారా భార్య ఆయన మరణాన్ని తెలుసుకున్నది. నెలరోజుల తర్వాత పార్టీ కార్యకర్తలు అస్తికలు పంపితే కర్మ చేశారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ అయినా కుటుంబ మరియు వారి బంధువర్గ సంప్రదాయం పాటించారు. ప్రస్తుతం వెలుగోడులో చంద్ర పుల్లారెడ్డి పేరిట "సి.పి. నగర్" ప్రక్కనున్న వేంపెంటలో ఒక స్థూపం వేసి ఆయనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

పుల్లారెడ్డి మరణంతో విప్లవోద్యమం వీరపుత్రుణ్ణి కోల్పోయింది. "ప్రజల పైనా, మార్క్సిస్ట్ లెనినిస్ట్ విప్లవ సిద్ధాంతపు అజేయశక్తిపైన అచంచల విశ్వాసంతో తానే ఒక యుద్ధనౌకగా నిలిచిన పుల్లారెడ్డికి బలమైన విప్లవపార్టీని నిర్మించటమే ధ్యేయం" ఇది రెడ్డి తనం రక్తంలో ప్రవహిస్తున్న రెడ్డిజాతి వారికే సాధ్యమని అందరూ నమ్మాల్సిందే. ప్రజా ఉద్యమంలో అస్తికలు మిగిలినా చాలుననుకొనే జాతికి చెందిన పుల్లారెడ్డి ధన్యుడు. ఆయనను కన్న రెడ్డిజాతి ధన్యురాలు.

**ఉప్పులేనికూర యానంబు రుచులకుఁ**
**బప్పులేని తిండి ఫలములేదు,**
**అప్పులేనివాఁడె యధిక సంపన్నుడు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

## పద్మవిభూషణ్

# రావి నారాయణరెడ్డి



జననం : 5-6-1908

మరణం : 7-9-1991

నారాయణరెడ్డి గారి భార్య సీతాదేవి (నరిసిరెడ్డి కూతురు). నారాయణరెడ్డి నల్లగొండ జిల్లా భువనగిరి సమీపంలోని బొల్లేపల్లిలో 500 ఎకరాల భూస్వామ్య కుటుంబంలో జన్మించాడు. ప్రాథమిక విద్య సొంత ఊళ్ళో, మాధ్యమిక విద్య భువనగిరిలో, ఇంటర్

హైదరాబాదు నిజాం కళాశాలలో చదివాడు. కళాశాల విద్యను మధ్యలో ఆపేసి సంఘసంస్కరణవైపు దృష్టి మరల్చాడు. 1928లో 'ఆంధ్రమహాసభ' వ్యవస్థాపకుల్లో ఒకరైనాడు.

23 సంవత్సరముల వయసులో (1931) "హరిజన సేవాసంఘా"న్ని స్థాపించాడు. ఈ సంస్థ ప్రధాన కార్యదర్శి హోదాలో నిజాం దేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 100 పాఠశాలలు, 2 విద్యార్థి వసతి గృహాలు స్థాపించి నడిపాడు. సామాజిక న్యాయం సాధించటానికి ప్రయత్నించాడు. ఎల్లప్పుడూ అట్టడుగు వర్గాలకు అండగా వున్నాడు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. వితంతు వివాహాలు, అక్షరాస్యత వంటి సామాజిక అంశాలపై నారాయణరెడ్డి పనిచేశాడు.

ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ నియంతృత్వ పాలన వ్యతిరేక ఉద్యమంలో జననేతగా ప్రసిద్ధుడైనాడు. ఈ ఆశయసాధనకు రాజకీయంగా వ్యతిరేకులైనా కాంగ్రెస్, ఆర్.ఎస్.ఎస్., హిందూ మహాసభల వారి సహకారం పొంది పోరాడాడు.

గాంధీ పిలుపుతో స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నాడు. 1930లోనే హైదరాబాదు సంస్థానంలో ఉద్యమం నిర్వహించాడు. 1934లో గాంధీని హైదరాబాదుకు ఆహ్వానించాడు.

రష్యన్ సోషలిస్టు విప్లవం, శ్రామికజన పోరాట చైతన్యం నారాయణరెడ్డిని ఆకర్షించాయి. యువకులను పోగుచేసుకోగలిగాడు. దేశీయ కమ్యూనిస్టుగా పేరొందాడు. ఆంధ్రమహాసభలో భాగంగానే కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు జరిగింది నిజాందేశంలో. కాంగ్రెస్ పార్టీ మెతక వైఖరి అవలంభించటం కూడ ఒక కారణమే.

1941, 1944 సంవత్సరాలలో జరిగిన నిజామాంధ్రమహాసభలకు అధ్యక్షత వహించాడు. 1944లో అతివాద – మితవాద శిబిరాలుగా పార్టీ చీలిపోయింది. సాయుధపోరాటం దేశానికి స్వాతంత్రం వచ్చేలోపే ప్రారంభం కావాలని ఉద్దేశపడ్డాడు నారాయణరెడ్డి. కాని మెజారిటీ సభ్యులు వ్యతిరేకించారు.

నారాయణరెడ్డి వీర తెలంగాణావాదిగానే ఉండటానికి ఇష్టపడ్డాడు. ఆ విధంగా తెలంగాణాకు ముద్దుబిడ్డ అయినాడు. వీర తెలంగాణా పోరుబిడ్డై "దొరా! కాల్మొక్తా గులాపోన్ని! బాంచెన్!" అనే వారిని ఉద్ధరించటానికే జన్మెత్తానన్నాడు.

ప్రజల కోసం, సమానత కోసం త్యాగాలు చేశాడు. దున్నేవాడిదే భూమి అనే సిద్ధాంతాన్ని నమ్మి కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం మేరకు తనకున్న 500 ఎకరాల భూమిలో 20 ఎకరాలు తానుంచుకొని మిగతాది పేదలకు పంపిణీ చేసిన ఆదర్శమూర్తి.

1947లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత హైదరాబాదు సంస్థానం ఒక స్వతంత్రదేశంగా కొనసాగుతుందని నిజాం నవాబు "ఆజాద్ హైదరాబాద్" అన్నప్పుడు ఆంధ్రమహాసభ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చింది. నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్లు పోరాట ప్రకటనపై సంతకాలు చేశారు. ఇదొక చారిత్రాత్మక ప్రతిఘటనోద్యమం. నిజాంతో పోరు హోరాహోరీ సాగింది. లక్షలాది ఎకరాలు పేద ప్రజలకు ఆంధ్రమహాసభే పంచి పెట్టింది. ఈ ఉద్యమానికి నారాయణరెడ్డి నాయకత్వం వహించాడు. అపుడు అరణ్యవాసానికి అజ్ఞాతవాసానికి వెళ్ళాడు. తదుపరి అరెస్టయాడు. 1951లో భారతప్రభుత్వ వత్తిడి వలన, సైనిక చర్య ప్రకటించినందున నిజాం లొంగిపోయినందున సాయుధపోరాటం ముగిసింది. నారాయణరెడ్డి పెరోల్‌పై విడుదలైనాడు.

దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు ప్రకటించబడ్డాయి. 1952 ప్రథమ సార్వత్రిక ఎన్నికల్లో నల్గొండ లోక్‌సభ నియోజకవర్గానికి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా కాంగ్రెసు అభ్యర్థిపై పోటీచేసి ఉత్తరప్రదేశ్‌లో నెహ్రూకు వచ్చిన మెజారిటీ కంటే ఎక్కువతో గెలిచాడు. ఆ ఎన్నికల్లో నల్గొండ జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు కమ్యూనిస్టులే గెల్చుకున్నారు. 1957లో రాష్ట్ర శాసనసభకు, 1962లో రెండవసారి లోక్‌సభకు ఎన్నికయాడు.

నారాయణరెడ్డి ఎప్పుడూ ఉన్నత పదవులకోసం ప్రయత్నించలేదు. తన స్వార్థం కోసం పనిచేయలేదు. తెలంగాణా అమరవీరుల స్మారక ట్రస్టు స్థాపించి తెలంగాణా ప్రజల విముక్తి కోసం పాటుపడ్డాడు. 1991 నుండి ఆయన పేరిట ఒక స్మారక జాతీయ బహుమతి ప్రతి ఏటా ఇస్తున్నారు.

1967లో స్వయంగా రాజకీయ విరామం ప్రకటించి కొత్తవారికి చోటునిచ్చాడు. 1968 తెలంగాణా సమరవీరుల సంస్థను స్థాపించి స్వాతంత్ర వీరులకు పెన్షన్‌ల కొరకు ప్రయత్నించి సఫలీకృతుడైనాడు.

1978లో ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు ఇవ్వటమేకాక "కళాప్రపూర్ణ" బిరుదునిచ్చి సత్కరించింది. 1991లో మరణించాడు. అప్పటికే నారాయణరెడ్డి ఒక వీలునామాను రాశాడు. దానిలో తాను మరణించినపుడు భార్య గాజుపూస తీయవలదని, నుదటి బొట్టు మానుకోవలదని తనకోరిక అని వ్రాస్తూ, అయినా ఎవరి స్వతంత్రత వారిది కనుక ఆమె ఇష్టప్రకారమే చేయవచ్చునని రాశాడు. మరియు తన అస్తికలు ఎక్కడో గంగలోనో లేదా ఏదైనా నదిలోనో కలపవలదని, తాను బూడిదైన వెనుక ఆ బూడిదను తన చేనులోనే చల్లమని, తన చేనిలోనే తనకు సమాధి కట్టమని వ్రాశాడు. నారాయణరెడ్డికి జవహర్‌లాల్ అంటే ఇష్టం. ఆయన ప్రభావం ఈయన మీద వుంది కాబోలు దాదాపు ఆయనకు వలెనే ఈయన వీలునామా వ్రాసుకున్నాడు.

1992లో కేంద్రప్రభుత్వం నారాయణరెడ్డి చేసిన సేవలను, త్యాగాలను గుర్తించి "పద్మవిభూషణ్" ఇచ్చి గౌరవించింది.

నారాయణరెడ్డి ఆదర్శం సోషలిస్టు సమాజసాధన. ఇపుడు ఆయన ఆదర్శాలు, అభీష్టాలు, మన ముందున్నాయి. ఆ రెడ్డి ఖ్యాతిని నిలపటం ఇప్పటి రెడ్డిజాతి బాధ్యత.

**పట్టు పట్టరాదు పట్టి విడువరాదు**
**పట్టెనేమి బిగియఁ బట్టవలయుఁ**
**బట్టి విడుటకన్నఁ బరగఁ జచ్చుటమేలు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# బద్దం ఎల్లారెడ్డి



జననం : 1905
మరణం : 27-12-1978

ఎల్లారెడ్డి గారు కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా గాలపల్లిలో జన్మించాడు. ఈయన తెలంగాణా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణా సాయుధ గెరిల్లా పోరాట ముఖ్యయోధుడు. ఎల్లారెడ్డి జవహర్‌లాల్ నెహ్రూ గారి సోషలిస్టు

భావాలకు ఆకర్షితుడైనాడు. 1930లో స్వాతంత్ర సమరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో కాకినాడ సత్యాగ్రహ శిబిరానికి వెళ్ళి, సత్యాగ్రహం చేసి ఆరు నెలలు శిక్ష అనుభవించాడు. కరీంనగర్ జిల్లా హరిజన సేవక సంఘానికి అధ్యక్షులుగా పనిచేశాడు. కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో మాడపాటి హనుమంతరావు పంతులుగారి అధ్యక్షతన 1941లో జరిగిన నాల్గవ నిజాం రాష్ట్ర ఆంధ్రమహాసభకు ఆహ్వాన సంఘ కార్యదర్శిగా పనిచేశాడు. తదుపరి అధ్యక్షుడైనాడు. రావి నారాయణరెడ్డి, డి.వి.రావు గారల సాహచర్యం, మార్గదర్శకత్వంలో నడిచాడు.

1938లో హైదరాబాదు సంస్థానంలో పౌరసత్వాల కోసం జరిగిన సత్యాగ్రహంలో పాల్గొని జైలుకెళ్ళాడు.

1939లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. తెలంగాణా కమ్యూనిస్టు పార్టీ కమిటీకి కార్యదర్శిగా పనిచేశాడు. నిజాం నిరంకుశ పాలనను కూలద్రోయడానికి ప్రజలు ఆయుధాలు చేపట్టి ప్రభుత్వ యంత్రాంగాన్ని ధ్వంసం చేయాలని ఇచ్చిన పిలుపుపై 11–9–1947 న సంతకాలు చేసిన ముగ్గురిలో ఈయనొకడు. మిగతావారు రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్. నాలుగేళ్ళకు పైగా అజ్ఞాతవాసంలో వుండి సాయుధ గెరిల్లా పోరాటం నడిపాడు. అందుకు మూడు సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించి 1951 డిసెంబరులో విడుదలైనాడు.

1951 సాధారణ ఎన్నికలలో కరీంనగర్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికైనాడు. అపుడు పీపుల్స్ డెమోక్రాటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా పి.వి. నరసింహారావుపై గెలిచాడు. 1956లో కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడైనాడు. విశాలాంధ్ర నిర్మాణానికి కృషిచేసిన వారిలో ఈయన ముఖ్యుడు.

1958 సాధారణ ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు బుగ్గారం నియోజకవర్గం నుండి ఎన్నికైనాడు.

1964 నుండి 1970 వరకు రాజ్యసభ సభ్యులుగా వున్నారు. ఈ మధ్య సి.పి.ఐ. నుండి సి.పి.ఐ.(ఎం) కు వెళ్ళి తిరిగి సి.పి.ఐ.కి వచ్చాడు.

1972లో కరీంనగర్ జిల్లా ఇందుర్తి నియోజకవర్గం నుండి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికైనాడు.

2006లో ఎల్లారెడ్డి జయంతి ఉత్సవాలలో ఎల్లారెడ్డి కంచు విగ్రహాన్ని కరీంనగర్‌లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారు.

శతజయంతి సందర్భంగా ఎల్లారెడ్డి కలగన్న కరీంనగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయుటకు అప్పటి ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకొని ఎల్లారెడ్డి సేవలను గౌరవించారు.

ఇట్లు ప్రాణాలకు తెగించి ప్రజా ఉద్యమంలో వుండి, ప్రజల్లో ప్రభుత్వంలో ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన పలువురు త్యాగమూర్తులు రెడ్డికులంలో వుండటం గర్వించదగిన విషయం.

**అనఁగ ననఁగ రాగ మతిశయిల్లుచునుండు**
**దినఁగ దినఁగ వేము దీపి గలుగు**
**సాధనమునఁ పనులు సమకూరు ధరలోన**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తప్పులెన్నువారు తండోపతండంబు
లుర్వి జనులకెల్ల నుండుఁ దప్పు
తప్పు లెన్నువారు తమ తప్పు లెఱుఁగరు
విశ్వదాభిరామ వినురవేమ.

# గుజ్జుల యల్లమందారెడ్డి



మరణం : 27-4-1997

యల్లమందారెడ్డి విద్యార్థి జీవితం నుండి కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై పార్టీ కార్యకర్తగా ప్రజల్లో ఉద్యమనాయకుడైనాడు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశాడు. భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో పీడిత ప్రజల విముక్తికై "కూలిదండు"ను

ప్రారంభించాడు. "కూలిదండు" పేరుతో ఒక మాసపత్రికను ప్రారంభించి నిర్వహించాడు. జె.ఎస్.ఆర్. శాస్త్రి గారి సహకారం పొందాడు.

అఖిల భారత ఖేత్ మజ్దూర్ సంఘ నాయకుడిగా యావద్భారతం పర్యటించి దేశంలో పలుచోట్ల మజ్దూర్ సంఘాలను స్థాపింపజేసి భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాన్ని నడిపాడు. సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం తెచ్చుటకు కృషిచేశాడు.

1962లో ఇప్పటి ప్రకాశం జిల్లా మార్కాపురం పార్లమెంటు నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికైనాడు. పార్లమెంటులో కార్మికవాణి వినిపించాడు.

1964లో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం, వ్యవసాయ కార్మికోద్యమం చీలింది. యల్లమందారెడ్డి వ్యవసాయ కార్మికోద్యమ పక్షాన వుండి గుంటూరు జిల్లా పెదవడ్లపూడి గ్రామంలో వ్యవసాయ కార్మిక మహాసభను నిర్వహించారు. "కొత్తబాట" అను వారపత్రికను ప్రారంభించి సంపాదకుడుగా పనిచేశాడు.

యల్లమందారెడ్డి కార్మికులలో వ్యవసాయ కార్మికుల పక్షాన నిలిచి వారి అభాగ్య జీవితాలను మెరుగుపరచే ప్రయత్నం, ఉద్యమం నడిపి కడకు కొన్ని కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను అనుసరించలేకపోయాడు.

అట్టి పేదల పక్షపాతి, రైతు రెడ్డి. తన జీవితానిని పేదల శ్రేయస్సుకు అంకితం చేశాడు. అట్టి రెడ్డి నాయకుని రెడ్డిజాతి ఎల్లపుడు గుర్తుంచుకోవలసిందే.

**తనకుఁగల్గు పెక్కు తప్పులు నుండఁగా**
**ఓగు నేరము లెంచు నొరులఁగాంచి**
**చక్కిలముంబుఁగాంచి జంతిక నగినట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# నర్రా రాఘవరెడ్డి



జననం : 1924
మరణం : 9-4-2015

నర్రా రాఘవరెడ్డి గారు చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా కమలమ్మ - రాంరెడ్డిలకు జన్మించాడు. పుట్టిన 11 రోజులకే తల్లి చనిపోయింది. వారి దూరపు బంధువు వరుసకు పెదనాన పెంచుకునేందుకు తీసుకెళ్ళారు. వారిది ఉన్నత కుటుంబం. చదువుకు ప్రత్యేక టీచరును కూడ పెట్టారు.

16 సంవత్సరాల వయసు వచ్చేటప్పటికి పెంచిన నాన, అమ్మ కూడ చనిపోయారు. తిరిగి తండ్రి వద్ద కొచ్చాడు. తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. సవతి తల్లి, తండ్రి పశువులు కాయటానికి పంపారు. మనసు కష్టపడింది. వాళ్ళ వూరివాళ్ళు చాలమంది బొంబాయి, సూరత్‌లలో పనుల్లో వున్నారు. ఒకరోజు సవతి తల్లి రూపాయిన్నరిచ్చి నూనె తెమ్మంది. అంతే ఆ రూపాయిన్నరతో హైదరాబాదు వెళ్ళి 'అబిడ్స్‌లో కుందన మహల్ హోటల్‌లో పనికి కుదిరాడు. ఎన్ని రోజులున్నా కప్పులు కడగటమే జీవితమా అని బయటకొచ్చి పస్తులుండి టిక్కెట్ లేకుండానే రైల్లో బొంబాయి వెళ్ళాడు. బొంబాయిలో తన వూరి కొంపెల్లి రమణయ్య మెస్‌లో పనికి కుదిరాడు. కాదని గైక్వాడ్ జౌళి మిల్లులో కార్మికునిగా నెలకు 13 రూపాయలు జీతంతో పనికి కుదిరాడు. అప్పుడు వయసు 18 సం॥లు. అప్పుడు లాల్‌బహుటా ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెకు దిగారు. అక్కడి నుండి అహమ్మదాబాదులో రక్వాత్ అరవింద్ మిల్లులో చేరాడు. ట్రేడ్ యూనియన్ ద్వారా కార్మిక సమస్యలపై ఉద్యమం వైపు నడిపాడు. స్వాతంత్ర్య పోరాటం, క్విట్ ఇండియా ఉద్యమం వచ్చాయి. వారంట్ జారీ అయింది. తిరిగి స్వగ్రామం వచ్చాడు. తండ్రి ఆదరణ కరువైంది.

అజ్ఞాతంలో వున్న కమ్యూనిస్ట్ నాయకులతో పరిచయమైంది. పార్టీద్వారా చౌటుప్పల్ ప్రాంతంలో ప్రజాసమస్యలపై పోరాటంలోకి దిగాడు.

1952లో తారకమ్మతో పెండ్లయింది. గ్రామ సమస్యలపై దృష్టి సారించాడు. యువకుల్ని కూడగట్టాడు. సంఘం పెట్టాడు. చెరువులో పూడిక తీశారు యువకులు. పొలాలకు తోలి దిగుబడులు సాధించారు.

రాజకీయాల్లో ప్రవేశించాడు. 1959 నుండి 1964 వరకు సర్పంచిగా (పట్టిమర్రికి) పనిచేశాడు. అదే కాలంలో నార్కెట్‌పల్లి నాన్‌బ్లాక్‌కు జిల్లా పరిషత్తు సభ్యుడుగా ఎన్నికైనాడు. 1964 నవంబరులో కమ్యూనిస్టు పార్టీ నుండి విడిబడి మార్క్సిస్ట్ పార్టీవైపుకెళ్ళాడు. సాయుధపోరాటం చేస్తున్నాడని ప్రభుత్వం అరెస్టు చేసింది. 1966 వరకు జైలు జీవితం గడిపాడు.

1967లో నకిరేకల్ స్థానం నుండి ఎమ్మెల్యేగా పోటీచేయమని పార్టీ ఆదేశించింది. పోటీలో నెగ్గాడు. ఆ సమయంలో గ్రామాలకు రోడ్లు, విద్యుత్ సౌకర్యాలపై దృష్టిపెట్టి సాధించాడు.

1972 ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయాడు. ఆ తరువాత 1978, 1983, 1984, 1989, 1994 ఎన్నికలలో నకిరేకల్ ఎమ్మెల్యేగా వరుస విజయాలు సాధించాడు. సి.పి.ఎమ్. శాసన సభాపక్ష నేతగా పలుమార్లు వ్యవహరించాడు. టి.డి.పి., కాంగ్రెస్ ప్రభుత్వాలకు కలలోకొచ్చేవాడు.

బాల్యం నుంచి ప్రజాసమస్యలపై పోరాటం చేశాడు. దోపిడీకి వ్యతిరేకంగా పనిచేశాడు.

రాఘవరెడ్డి తన ప్రజాజీవితంలో ప్రజలకు బహుముఖ సేవలందించాడు. 1950 నుంచి సి.పి.ఐ. పార్టీ సభ్యునిగా, కార్యకర్తగా, కళాకారునిగా అందరికీ సుపరిచితుడే. 1973లో బీబీనగర్ – నడికుడి రైలుమార్గ విస్తరణకు ఉద్యమం చేశాడు. ప్రజా సంఘాలు నిర్మించాడు. గీత కార్మిక సంఘం గౌరవాధ్యక్షునిగా ఎన్నికై ఎక్సైజ్ విధానానికి, కాంట్రాక్టు పద్ధతికి వ్యతిరేకంగా ఉద్యమం చేశాడు. జిల్లాలో గ్రామసేవకుల సంఘాన్ని ఏర్పాటు చేశాడు. చేనేత కార్మికుల సమస్యలపై పోరాడాడు. ప్రజల్లోకి సమస్యలను, పరిష్కారాలను సుళువుగా చేర్చటానికి కళాకారుడై నాటకాలు, జానపద పాటలతో ప్రదర్శనలిచ్చాడు.

ప్రభుత్వ కార్యకలాపాలన్నీ తెలుగులోనే జరగాలని ప్రభుత్వంపై పట్టుబట్టాడు. అసెంబ్లీలోని కాగితాలన్నీ తెలుగులోనే యివ్వండని ప్రభుత్వాన్ని నిలదీశాడు.


కొంతకాలంగా షుగర్ లెవెల్స్ పెరిగి నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు.

రాఘవరెడ్డి జీవితం సమాజాన్ని అధ్యయనం చేసేవారికి పాఠ్యగ్రంథం. ఆయన తన జీవితంలో ఒక్కరోజును కూడ వృధా పోనీయలేదు. ఆయన ఆశయాలు రాజకీయ రంగంలోని వారికి ఆదర్శనీయాలు.

**ఇనుము విఱిగెనేని యిరుమాఱు ముమ్మాఱు**
**కాచి యతుకవచ్చుఁ గ్రమముగాను**
**మనసు విఱిగెనేని మఱి చేర్చరాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఒకనిc జెఱిచెదమని యుల్లమందెంతరు
తమదు చేటెఱుcగరు ధరను నరులు
తమ్ము జెరుచువాcడు దైవంబుగాడొకో
విశ్వదాభిరామ వినురవేమ.

# భీమిరెడ్డి నరసింహారెడ్డి



జననం : 1922
మరణం : 9-5-2008

తెలంగాణాలో రజాకార్ల నెదిర్చి సాయుధ పోరాటం జరిపిన యోధుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి నల్లగొండ జిల్లా కర్విరాల కొత్తగూడెం గ్రామంలో 1922 సం॥లో జన్మించాడు. ఆయన తండ్రి రామిరెడ్డి, తల్లి చొక్కమ్మ.

నర్సింహారెడ్డి @ నరసింహారెడ్డి ధనిక భూస్వామ్య కుటుంబంలో జన్మించాడు. ప్రాథమిక విద్యాభ్యాసం తన స్వగ్రామంలోనే. నాల్గవ ఫారం నుండి సూర్యాపేటలో చదివాడు. 1938లో నల్గొండలో చదువుతూ వందేమాతర ఉద్యమంలో చేరి బంద్‌లు, హర్తాళ్‌లు చేశాడు. 10వ తరగతి హైదరాబాదులో చదివాడు. గ్రామాలలో భూస్వాములకు వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలను, పేద రైతాంగానిని కూడగడుతున్న రావి నారాయణరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు జరుపుతున్న కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల పట్ల ఆకర్షితుడైనాడు. 1942, 1943, 1944 సం॥లలో జరిగిన నిజాం రాష్ట్ర ఆంధ్రమహాసభలలో పాల్గొన్నాడు. ఆంధ్రమహాసభకు కార్యవర్గ కమిటీ సభ్యుడుగా ఎన్నికైనాడు. కమ్యూనిస్టు భావాలవైపు మొగ్గు చూపి పార్టీ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. తొలి తరం కమ్యూనిస్టు ముఖ్యనాయకులలో ఒకరైనాడు.

ఈయనను కమ్యూనిస్టు నాయకులంతా బి.ఎన్ అనేవారు. బి.ఎన్. దేవరుప్పల గ్రామంలో యువకులకు సాయుధ శిక్షణనివ్వటానికి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. భూస్వాములను, రజాకార్లను ఎదుర్కొవాలంటే సాయుధ విప్లవమే తగు మార్గమని నమ్మి దళాలను ఏర్పాటు చేసుకున్నాడు. బి.ఎన్. తెలంగాణా సాయుధ పోరాటంలో మొదటి తుపాకీ వ్యక్తి అని, ఆయనను తెలంగాణా కాస్ట్రోగా భావించారు. బి.ఎన్., ఆయన దళము అంటే రజాకార్లు పోలీసులు గడగడలాడేవారు. ఆయన సోదరి మల్లు స్వరాజ్యం ఆయనకు అండ. 1947లో కోటపాడు కోటపై దండయాత్ర బి.ఎన్.కు పెద్ద గుర్తింపు తెచ్చింది. రజాకార్లు శిబిరాలు ఏర్పాటు చేసుకుని రైతుల, పిల్లల, స్త్రీల ధన మాన ప్రాణాలను దోచుకుంటున్నారని తెలిసి 19–5–1948న వరంగల్ జిల్లా కొడకండ్లలో రజాకార్ల శిబిరంపై సాయుధ దాడిచేసి కొందరిని మట్టుబెట్టాడు.

పాలకుర్తిలో జరిగిన సభకు రజాకార్లు పోలీసుల నుండి గట్టి ప్రతిఘటన ఎదురైంది. చాకలి ఐలమ్మ ఇల్లు, పొలంపై బడి కుటుంబసభ్యులను రజాకార్లు, భూస్వాములు కొట్టి పంటను దోచుకొనిపోయి తప్పుడు కేసు పెట్టినపుడు బి.ఎన్., తన దళ సభ్యులు పాలకుర్తికి పోయి ఐలమ్మకు రక్షణగా నిలిచి ఆమె పొలంలోని పంటను తిరిగి ఆమెకు జేర్చారు. అపుడు పోలీసులు దేశముఖ్ గూండాలు బి.ఎన్.ను అరెస్టు చేసి చెప్పటానికి అలవిగాని అవమానం చేశారు.

1946లో బి.ఎన్. అజ్ఞాతంలోకి పోయి వెట్టిచాకిరికి వ్యతిరేకంగా నిర్బంధ ధాన్యం లెవీ వసూళ్ళను వ్యతిరేకిస్తూ అనేక గ్రామాలలో ఉద్యమాన్ని నిర్మిస్తూ, నిజాం సాయుధ గూండాల పోలీసు దాడులను వ్యతిరేకిస్తూ యువకులకు సాయుధ శిక్షణ నిచ్చాడు. తుంగతుర్తి, ఆలేరు, నోముల గ్రామాలలో రజాకార్లపై సాయుధ దాడులను చేశాడు. రజాకార్లపై దాడులకు గెరిల్లా దళాలను నిర్మించాడు. దున్నేవాడిదే భూమి కార్యక్రమాన్ని, భూమి పంపకం కార్యక్రమానిని బి.ఎన్. దేవులపల్లి వెంకటేశ్వరరావుతో కలిసి చేపట్టాడు. దాదాపు మూడువేల గ్రామాలలో పది లక్షల ఎకరాల భూమిని తెలంగాణా ప్రజలు గ్రామ కమిటీల నాయకత్వంలో స్వాధీనం చేసుకొని పంచుకున్నారు. దాదాపు మూడువేల గ్రామాలలో నిజాం ప్రభుత్వానిని స్తంభింపజేసి ప్రజారాజ్యాలను స్థాపించారు. నిజాం ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తూ ముందుకు సాగారు. చెరువుల్లో పూడికల తీస్తూ అధిక ఆహారోత్పత్తులను సాధించారు. యూనియన్ సైన్యాలు కూడ ప్రవేశించినందున బి.ఎన్. సైన్యం అజ్ఞాత ప్రాంతాలకు చేరుకున్నారు.

20-10-1951న పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్యగారలు బి.ఎన్.తో చర్చించకుండానే తెలంగాణా సాయుధ పోరాట విరమణ నిర్ణయం తీసుకున్నారు. దీనిని బి.ఎన్. వ్యతిరేకించాడు. చర్చలు జరిగాయి. కొంతకాలం సాయుధ పోరాట విరమణ తీసుకొని ఎన్నికలలోకి ప్రవేశించారు.

తెలంగాణా సాయుధ పోరాట విరమణానంతరం, బి.ఎన్. 1954 వరకు అజ్ఞాతంలో వుండి అరెస్టు కాబడి 1957 ఎన్నికలలో సూర్యాపేట శాసనసభకు ఎన్నికైనాడు. తరువాత 1967లో కూడ శాసనసభకు ఎన్నికైనాడు. ఆ తరువాత మూడుసార్లు మిర్యాలగూడ నియోజకవర్గం నుండి పార్లమెంటుకు కమ్యూనిస్టు పార్టీ తరఫునే ఎన్నికైనాడు. నల్లగొండ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా, రైతుసంఘం అధ్యక్షుడుగా, జాతీయ జలవనరుల స్థాయీసంఘం సభ్యునిగా ప్రజాసేవే పరమావధిగా భావించి జీవితాన్ని కర్పూరంగా కరిగించారు.

కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) దళితులకు న్యాయం జరగటం లేదని భావించి ఆ పార్టీ నుండి బయటకు వచ్చి సొంతంగా కమ్యూనిస్ట్ పార్టీని ఏర్పాటు చేసుకొని తిరిగి దానిని సి.పి.ఐ.(యం)లోనే విలీనం చేసి చివరి నిముషం వరకు కమ్యూనిస్టుగానే వున్నాడు.

బి.ఎన్. సంస్కరణవాదిగా కూడ ప్రసిద్ధుడు. వితంతువు సరోజినిని పెండ్లి చేసుకున్నాడు. తన సొంత భూమిని పేదలకు పంచాడు. తోబుట్టువులంతా పోరాటయోధులే. దాయం శశిరేఖ, మల్లు స్వరాజ్యం, సరస్వతి, కుశలవరెడ్డి ఉద్యమాలలో ఉన్నారు. శిక్షలు అనుభవించారు.

తెలంగాణా చరిత్రలో ఏడు దశాబ్దాలు బి.ఎన్. నిర్వహించిన పాత్ర అజరామరం. రైతులు, భూమి, వ్యవసాయ కూలీలు, బి.ఎన్.కు ప్రాణం. భూస్వాముల బానిసతనాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. నిజాం ప్రభుత్వాన్ని, రజాకార్లను, నిజాం పోలీసులను ఎప్పుడూ ఎదిరిస్తూనే జీవించాడు. భూమి, భుక్తి కోసం జరిగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచం గర్వించదగ్గ పెద్ద ప్రజాయుద్ధం.

రెండువందల ఎకరాల కామందుల ఇంట పుట్టినా భూస్వామిక వ్యవస్థ నుంచి, వెట్టినుంచి సమాజాన్ని విముక్తం చేయటానికి తుపాకీ పట్టి అగ్రభాగాన నిలిచిన బి.ఎన్. రాజకీయ స్ఫూర్తి, పోరాట స్ఫూర్తి, నిరాడంబరత, నిస్వార్థ జీవనం, అంకిత భావం నేటి తరానికి మార్గదర్శకం.

ఇట్టి రెడ్డియోధుని చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించవలసిందే.

**చంపఁదగినయట్టి శత్రువు తనచేతఁ**
**జిక్కెనేని కీడు సేయరాదు**
**పొసఁగ మేలుచేసి పొమ్మనుటే చాలు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# సూరా పాపిరెడ్డి



జననం : 10-9-1929

మరణం : 28-2-2007

సూరా పాపిరెడ్డి గారిది ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం, సూరావారిపాలెం గ్రామం. తండ్రి మాలకొండయ్య, తల్లి కొండమ్మ. భార్య సీతారావమ్మ. పాపిరెడ్డి తండ్రి వెలిగండ్లలో 1937లో "హిందూ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల" నెలకొల్పి అందులో హెడ్‌మాస్టరుగా

కొన్నాళ్ళు, ఆ గ్రామంలో పోస్ట్ మాస్టరుగా కొన్నాళ్ళు, గ్రామ మునసబుగా కొన్నాళ్ళు పనిచేశాడు. కనుక వెలిగండ్లలో స్థిరపడ్డారు. పాపిరెడ్డికి ఇద్దరు సోదరులు, ఇద్దరు సోదరీమణులున్నారు. అందరిలోకి పెద్దవాడు పాపిరెడ్డి.

పాపిరెడ్డి 1939లో ఎలిమెంటరీ స్కూలు విద్య, 1942 నుండి కనిగిరిలో హైస్కూలు విద్య, 1945లో ఎస్.ఎస్.ఎల్.సి. 1947లో నెల్లూరు వి.ఆర్. కాలేజిలో కాలేజి విద్య (యఫ్.ఎ.), ఆ తరువాత మద్రాసులో ఇంజనీరింగ్ చదివాడు.

చిన్నతనం నుండి వామపక్ష భావజాలంతో వుండి, విద్యార్థిగా వున్న రోజుల్లో కమ్యూనిస్టు నాయకులతో, సంఘాలతో పరిచయాలు కలిగి 1945లో కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకున్నాడు.

కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలే ఆయనకు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. గుజ్జుల యల్లమందా రెడ్డి, ఎ.కె. గోపాలన్, పుచ్చలపల్లి సుందరయ్య వగైరా పెద్దలతో పరిచయాలు కలిగాయి. ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకు ప్రచారం చేశాడు. యువకులతో, పేదప్రజలతో కలిసి ఉద్యమాలు చేశాడు. ఫ్యూడల్ వ్యవస్థపై పోరాటం చేశాడు.

కమ్యూనిస్ట్ పార్టీ చీలిన తర్వాత సి.పి.ఐ.(యమ్)కు చెంది ఉద్యమాలు చేశాడు. ప్రకాశం జిల్లా సి.పి.ఐ.(యమ్) సెక్రెటేరియట్ సభ్యుడైనాడు. కనిగిరి తాలుకా కమిటీ సభ్యుడైనాడు. ప్రతి సెకండను పార్టీ కోసం వెచ్చించాడు. గ్రామాలలో అన్ని వర్గాల ప్రజలతో సంచరించాడు. ముఖ్యంగా యువకులు, రైతులు. ఈ క్రమంలో పోలీసులు, అరెస్టులు, నిర్బంధాలు, జైలుజీవితం అనుభవించాడు. పార్టీకోసం పర్యటనలు, పోరాటాలు చేశాడు. ఆ పార్టీ సంప్రదాయాల ప్రకారమే 7-8-1952న వివాహం చేసుకున్నాడు.

1962లో ఉదయగిరి శాసనసభా నియోజకవర్గం నుండి, 1967లో కనిగిరి శాసనసభా నియోజకవర్గం నుండి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా అసెంబ్లీకి పోటీచేసి ఓడిపోయాడు. కాని అలుపెరుగక ప్రజల్లో మమేకమై వారి బాధలు పంచుకున్నాడు. 1972లో కనిగిరి శాసనసభా నియోజకవర్గం నుండి స్వతంత్రుడుగా పోటీచేసి గెలిచాడు. అప్పటి ప్రాంతీయ రాజకీయాలలో

ఆ చర్య అవసరమైంది. 1978 వరకు యం.ఎల్.ఎ.గా పనిచేశాడు. ఆయా ఎన్నికల సందర్భాలలో ఇల్లు తప్ప మిగతా ఆస్తి మొత్తం కరిగి పోయింది.

శాసనసభ్యుడు కాకముందున, ఆ తరువాత కూడ కృష్ణా జలాల కోసం, వెలుగొండ ప్రాజెక్టు కోసం, మార్కాపురం, కంభం, కనిగిరి, పొదిలి తదితర ప్రదేశాలకు త్రాగునీరు, సాగునీటికోసం ఉద్యమం చేశాడు. పత్తి, పొగాకు రైతుల బాధలపై ప్రభుత్వాలను ప్రశ్నించాడు.

యం.ఎల్.ఎ.గా తనకు సొంతపని ఏమీలేదు. ఆ సమయంలో కనిగిరికి ఆర్.టి.సి. బస్సు డిపో తెచ్చాడు. మోపాడు రిజర్వాయర్ క్రింద అనాయకట్టు భూములవారికి అపరాధం లేకుండా ఆయకట్టు భూములకు వలె సాగునీరిప్పించాడు. కావూరు రోడ్డు పనులు, మైనర్ ఇరిగేషన్ పనులు, దళితుల భూముల పట్టాల పనులు చేపట్టాడు. బి.సి. మరియు యస్.సి. సంక్షేమ కమిటీల సభ్యుడుగా చేశాడు. జిల్లా అభివృద్ధి సంస్థ సభ్యునిగా ప్రభుత్వంపై రైతులు, కూలీల సంక్షేమానికి వత్తిడి తెచ్చి సాధించాడు.

శాసనసభ్యునిగా తనకు వచ్చే పెన్షన్‌ను కూడ పార్టీకోసం త్యాగం చేశాడు. ఒంగోలులోని సుందరయ్య భవనం పైఅంతస్తు నిర్మాణానికి సొంతడబ్బు వినియోగించాడు.

పార్టీ ఏదైనా త్యాగం తన విధానం. ఆస్తి, డబ్బు, కాలం, ఆరోగ్యం అన్నింటినీ ప్రజలకోసం వినియోగించాడు. ఆ సంతృప్తే ఆయన ధనం. అందుకే ఆయన రెడ్డి తనం పుణికి పుచ్చుకున్న వ్యక్తిగా గౌరవ మర్యాదలు పొందాడు. ఆయన ప్రజల మనిషి. రెడ్డి మనిషి.

**మాటలాడ నేర్చి మనసు రాజిలఁజేసి**
**పరగఁ బ్రియము చెప్పి బడలకున్న**
**నొకరిచేతి సొమ్ములూరక వచ్చునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కానివానిచేతఁ గాసు వీసం బిచ్చి
వెంటఁదిరుగువాఁడె వెఱ్ఱివాడు
పిల్లి తిన్న కోడి పిలిచిన పలుకునా
విశ్వదాభిరామ వినురవేమ.

# బి.వి. సుబ్బారెడ్డి



జననం : 4-7-1903
మరణం : 7-6-1974

సుబ్బారెడ్డి గారి పూర్తిపేరు బొల్లవరపు వెంకట సుబ్బారెడ్డి. కర్నూలు జిల్లా కోయిలకుంట్ల లో రైతు కుటుంబంలో జన్మించాడు.

1926లో మచిలీపట్నం నోబుల్ కాలేజిలో బి.ఎ. చదివాడు. మద్రాసు విశ్వవిద్యాలయంలో బి.ఎల్. చదివి నంద్యాలలో న్యాయవాద వృత్తి ప్రారంభించాడు.

1938లో మొదటిసారి, 1949లో రెండవసారి కర్నూలు జిల్లా బోర్డు ఛైర్మన్‌గా చేసి ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నాడు. రైతు పక్షపాతిగా రైతుల అభ్యుదయానికి శ్రమించాడు.

1941లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని, ఆరునెలలు జైలు శిక్షననుభవించాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మూడు సంవత్సరాలు జైలు జీవితం తంజావూరు జైలులో అనుభవించాడు.

1955లో రాజకీయ కారణాలతో కాంగ్రెస్ నాయకులతో విభేదించి కాంగ్రెసు పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికలలో పోటీచేసి గెలిచాడు. తదుపరి కాంగ్రెసు సంస్థపై అభిమానం గానీండి, ఎన్నికల ఫలితాలు నిరూపించిన పలుకుబడి బలంవల్ల గానీండి మరల కాంగ్రెసులోకి వచ్చాడు.

1962లో కోయిలకుంట్ల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి స్పీకరుగా ఎన్నిక కాబడ్డాడు.

1967లో మరొకసారి కోయిలకుంట్ల నుండి శాసనసభకు ఎన్నికై మరల అసెంబ్లీ స్పీకరుగా ఎన్నిక కాబడ్డాడు. రెండవసారి స్పీకరుగా ఎన్నికకాబడ్డ వ్యక్తి సుబ్బారెడ్డిగారే.

శాసనసభను హుందాగా నడిపిన స్పీకరుగా పేరు తెచ్చుకున్నారు. శాసనసభలోని వారందరు సభా గౌరవ మర్యాదలను, విధులను గౌరవించాల్సిందేనంటాడు. 1970 జులైలో మంత్రులు శాసనసభకు సమాధానాలు సమర్పించటంలో జాప్యం చేస్తున్నందున నిరసనగా స్పీకరు పదవికి రాజీనామా చేశారు.

1965లో మరియు 1968లో పార్లమెంటరీ ప్రతినిధివర్గ సభ్యులుగా రష్యాకు వెళ్ళాడు. 1970లో లండన్‌లో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సభలో ప్రాతినిధ్యం వహించాడు.

1971లో పి.వి. నరసింహారావు ముఖ్యమంత్రిగానున్న కాలంలో ఉపముఖ్యమంత్రిగా పనిచేశాడు.

1972లో జై ఆంధ్ర ఉద్యమంలో ఆంధ్రరాష్ట్ర కార్యాచరణ సమితి అధ్యక్షునిగా ఉద్యమాన్ని నడిపాడు. ముల్కీ సమస్యపై ఉపముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశాడు.

1973లో జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా వున్న కాలంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. దురదృష్టవశాత్తు ఆ పదవీ నిర్వహణ కాలంలోనే పరమపదించాడు.

సుబ్బారెడ్డి వెనుకటితరం స్వాతంత్రయోధుడు. ఆత్మాభిమానం, అకుంఠిత దీక్ష ఆయన స్వార్జిత లక్షణాలు. నీతి నిజాయితీ ఆయనకు వన్నె తెచ్చిన లక్షణాలు.

నిష్కళంక రాజకీయనేతగా రెడ్డికులానికి కీర్తి తెచ్చిన రాజకీయ నాయకుడు. రాష్ట్ర నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కర్నూలు ప్రాంత ప్రజలు ఆయన కంచు విగ్రహానిని కోయిలకుంట్లలో స్థాపించి తమ ప్రేమను చాటుకున్నారు.

**వాన కురియకున్న వచ్చును క్షామంబు**
**వాన గురిసెనేని వఱద పాఱు**
**వఱద కఱవు రెండు వరుసతో నెఱుగుడి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పుట్టిన జనులెల్ల భూమిలో నుండిన
బట్టునా జగంబు పట్ట దెపుదు
యముని లెక్కరీతి నరుగుచు నుందురు
విశ్వదాభిరామ వినురవేమ.

# రేబాల దశరధరామిరెడ్డి



జననం : 30-11-1907
మరణం : 9-6-2005

ధశరధ రామిరెడ్డిది నెల్లూరు జిల్లా కావలి. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. డిగ్రీని, బెనారస్ విశ్వవిద్యాలయం నుండి ఎల్.ఎల్.బి. డిగ్రీని పొందాడు. కొంతకాలం లాయరుగా ప్రాక్టీసు చేశాడు. 1940లో స్వాతంత్ర్యోద్యమ సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష అనుభవించాడు. 1941-1951 కాలంలో పబ్లిక్ ప్రాసిక్యూటరుగా పనిచేశాడు.

ఈయన మొదటిసారిగా 1960లో నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం నుండి ఉపఎన్నికలో శాసనసభకు ఎన్నికయాడు.

1962లో నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం నుండి, 1972 నెల్లూరు జిల్లా అల్లూరు నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా ఎన్నికైనాడు.

1967-70సం॥లలో కావలి నియోజకవర్గం నుండి లోక్‌సభ సభ్యునిగా ఎన్నికై పనిచేశారు.

దశరథరామిరెడ్డి 28-1-1975న ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకరుగా ఏకగ్రీవంగా ఎన్నికై 14-3-1978 వరకు ఆ పదవిలో పనిచేసి సభ్యులకందరికీ రూల్స్ కరతలామలకం చేశాడు. ఈయన హయాంలో మొదటిసారిగా అనుసూచిత వర్గముల కమిటీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ, లైబ్రరీ కమిటీలను ఏర్పాటు చేశారు.

ఈయన అనేక పదవులను నిర్వహించాడు. రాష్ట్ర రోడ్ రవాణా అథారిటీలో అనధికార సభ్యునిగా ఐదు సంవత్సరాలు పనిచేశారు. ఆల్ ఇండియా కో-ఆపరేటివ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్సు కమిటీ ఉపాధ్యక్షునిగా, మద్రాసు స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులుగా, డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులుగా, ఆంధ్ర కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులుగా, కోస్టల్ ఆంధ్ర ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులుగా పనిచేశారు.

లెజిస్లేటరుగా, స్పీకరుగా, కో-ఆపరేటివ్ సొసైటీల మేనేజిమెంట్‌లోనూ పరిపూర్ణ జీవితాన్ని గడిపి 9-6-2005న స్వర్గస్తులైనారు.

రెడ్డిజాతికి మార్గదర్శకుడైన రెడ్డి గారిని ఎల్లపుడూ జ్ఞప్తిలో వుంచుకోవలసినదే.

**వాన రాకడయును బ్రాణంబు పోకడ**
**కానఁబడ దదెంత ఘనునికైన**
**గానఁబడిన మీఁద గలి యెట్లు నడచురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**రెడ్డి జనాభ్యుదయ సంఘం - ఒంగోలు**

# పిడతల రంగారెడ్డి



జననం : 9-11-1917
మరణం : 1-7-1991

రంగారెడ్డి ప్రకాశం జిల్లా రాచర్ల మండలం అనుమలవీడుకు చెందినవాడు. తండ్రి వెంగళరెడ్డి, తల్లి పిచ్చమ్మ, వ్యవసాయదారుల కుటుంబం.

1937లో కొత్తపట్నంలో కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు విభాగం నేతృత్వంలో జరిగిన రాజకీయ పాఠశాలలో శిక్షణ పొందాడు. 1939లో గిద్దలూరులో వ్యక్తి సత్యాగ్రహంలో

పాల్గొని ఆరు నెలలు జైలుశిక్ష అనుభవించాడు. 1940లో కర్నూలు జిల్లా కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శి అయాడు. 1941లో కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడైనాడు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడు.

1948లో మద్రాసు రాష్ట్ర శాసనసభ్యునిగా ఎన్నికయాడు.

1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు కంభం నియోజకవర్గం నుండి ఎన్నికయాడు. 1952-1955, 1955-1962 కాలంలో శాసనసభ్యునిగా ఎన్నిక కాబడ్డాడు.

విశాలాంధ్ర ఏర్పడినాక రంగారెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ తొలి అధ్యక్షుడైనాడు.

1960లో సంజీవయ్య మంత్రివర్గంలో సమాచార మరియు ప్రణాళికా శాఖామాత్యులుగా ఉన్నాడు.

1966 కర్నూలు జిల్లా స్థానిక సంస్థల తరుపున ఏకగ్రీవంగా యం.యల్.సి.గా ఎన్నుకోబడ్డాడు.

1968-1972 వరకు శాసనమండలి అధ్యక్షుడుగా పనిచేశాడు. 1972-1974 వరకు శాసనసభ స్పీకరుగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ రెండు సభలకు (శాసనసభ, శాసనమండలి) అధ్యక్షుడుగా పనిచేసిన ఏకైక వ్యక్తి. 1974-1978 రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రిగా పని చేశాడు.

1970 దశకం చివరిలో జనతాపార్టీ ఆవిర్భ వించినపుడు జనతాపార్టీలో చేరి 1978లో గిద్దలూరు నియోజకవర్గం నుండి జనతాపార్టీ తరఫున శాసనసభ్యుడుగా ఎన్నికైనాడు. 1983లో శాసనసభకు పోటీచేసి తెలుగుదేశం చేతిలో ఓడిపోయాడు.

1985లో శాసనసభకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలిచాడు. తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరాడు.

1-7-1991న స్వర్గస్తులైనాడు. తరువాత ఆయన కోడలు తెలుగుదేశం పార్టీలో శాసనసభ్యురాలైంది. పలు విద్యాసంస్థలు నిర్వహించి విద్యారంగానికి దోహదం చేశాడు. నిజాయితీకి, నిక్కచ్చితనానికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండుటకు నిలువెత్తు సాక్షి.

రెడ్డి దర్పం సాగించుకొనిన రెడ్డి.

# అగరాల ఈశ్వరరెడ్డి



జననం : 1.7.1934

ఈశ్వరరెడ్డి చిత్తూరు జిల్లా తిరుపతిలోని తుక్కివాకంలో జన్మించాడు. మద్రాసు క్రిష్టియన్ కాలేజి నుండి డిగ్రీ పొందాడు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజిలో డబుల్ యమ్.ఎ. చేశాడు. మద్రాసు లా కాలేజిలో యల్.యల్.బి., పిహెచ్.డి. చేశాడు.

1967లో, 1978లో చిత్తూరు జిల్లా తిరుపతి శాసనసభ నియోజకవర్గం నుండి యం.యల్.ఎ.గా ఎన్నికైనాడు.

1978–1983 శాసనసభా కాలంలో 7–9–1982న శాసనసభకు స్పీకరుగా ఎన్నికైనాడు. 16–1–1983 వరకు స్పీకరుగా పనిచేశాడు.

1980–1981 మధ్యకాలంలో ప్రభుత్వ సంస్థల కమిటీకి అధ్యక్షునిగా పనిచేశాడు. 1981–1982 మధ్యకాలంలో డిప్యూటీ స్పీకరు హోదాలో అర్జీల, విశేషాధికారాల కమిటీల అధ్యక్షునిగా పనిచేశాడు.

ఆలిండియా పొలిటికల్ సైన్సు అసోషియేషన్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా, ఐ.ఐ.పి.ఎ. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ సభ్యునిగా, మాడభూషి అనంతశయనం ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షులుగా పనిచేశారు. ఎస్.వి. యూనివర్సిటి సిండికేట్ సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ మేనేజిమెంట్ బోర్డు సభ్యునిగా పనిచేశారు.

యునైటెడ్ కింగ్‌డమ్, యూరప్, రష్యా, చైనా, అమెరికా దేశాలలో పర్యటించి పేరు గాంచాడు.

రెడ్డి జాతికి అలంకారప్రాయుడు గర్వకారకుడు.

**ఎన్ని చోట్లు తిరిగి యేపాట్లు పడినను**
**అంటనియ్యక శని వెంటఁ దిరుగు**
**భూమి క్రొత్తలైన భుక్తులు క్రొత్తలా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# కందుల ఓబుల రెడ్డి



జననం : 7-7-1910
మరణం :3-1-1993

ఓబులరెడ్డి గారి తండ్రి నాగిరెడ్డి, తల్లి చెన్నమ్మ, భార్య గజలక్ష్మి. కుమారులు నాగార్జునరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రభువర్ధన్‌రెడ్డి.

ఓబులరెడ్డి గారిది లింగాపురం గ్రామం ఒకప్పటి కంభం తాలూకా, కర్నూలుజిల్లా. తరువాత ప్రకాశం జిల్లాలో చేరింది. తండ్రి నాగిరెడ్డి హయాంలో 1200 ఎకరాల సేద్యం, 60 జతల ఎద్దులు, 3000 గొర్రెలు, 1000 ఆవులు కలిగిన మోతుబరి రైతు కుటుంబం. గ్రామాన్ని సంరక్షించిన కుటుంబం. నాగిరెడ్డి రాత్రి సమయంలో గ్రామమంతా తిరిగి అందరూ భోజనాలు చేశారని తృప్తిపడి తాను భోజనం చేసేవాడని ప్రతీతి. లింగాపురం గ్రామంలో కందుల వారి సత్రాన్ని నిర్మించాడు. అందులోకి వచ్చే అతిధి, అభ్యాగతులందరికీ భోజనం పెట్టేవారు. నాగిరెడ్డి 100 పెద్దపుట్ల గింజల రాశి నుండి ధాన్యం దానం చేసిన దొడ్డ రెడ్డి కుటుంబంగా పేరుగాంచాడు.

ఓబులరెడ్డి ప్రాధమిక విద్య బోగోలు, కంభంలలో జరిగింది. హైస్కూలు విద్యకు కోల్స్ హైస్కూలు-కర్నూలులో, కాలేజి విద్యకు లయోలా కాలేజిలో చేరాడు. కాని కాలేజి యాజమాన్యం వారు స్వాతంత్రోద్యమంలో సంబంధాలున్నాయని ఆయన్ను పంపించేశారు. ఆచార్య ఎన్.జి. రంగా సలహాపై మదనపల్లిలో బి.టి. కాలేజిలో బి.ఎ. చదివాడు.

1920 ప్రాంతంలోనే బాలగంగాధర తిలక్, తరువాత గాంధీ ఉపన్యాసాలకు ఆకర్షితుడైనాడు. ఆరోజుల్లోనే 1930-33లలో అసహాయోద్యమంలో పాల్గొని జైలుకెళ్ళాడు. స్వదేశీ ఉద్యమంలో పాల్గొని ఖద్దరు ప్రారంభించాడు. ఎన్.జి. రంగాకు అనుచరుడై 1934లో నిడుబ్రోలులో రంగా ప్రారంభించిన రైతాంగ విద్యాలయానికి ప్రిన్సిపాల్ అయాడు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డి, కడప రామసుబ్బమ్మ W/o కోటిరెడ్డి, కొణిజేటి రోశయ్య, గౌతు లచ్చన్న వగైరాలు ఓబులరెడ్డికి అనుచరులుగా వుండేవారు. బాపట్ల తాలూకా ఇడుపులపాడు వ్యవసాయ విద్యాలయంకు కర్త, కర్మ ఈయనే. రంగాగారి ఆధ్వర్యంలో రైతు రక్షణ యాత్ర చేపట్టాడు. 1936 రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడైనాడు. 1936-37లో రైతుల వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించాడు. 1940లో తిప్పాయపాలెం చెరువును నిర్మించాడు.

1939 కర్నూలు జిల్లా బోర్డు సభ్యుడైనాడు. 1939-41 కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడైనాడు. స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. 10-2-1943 నుండి 4-7-1945 వరకు వేలూరు, తంజావూరు జైళ్ళలో డిటెన్యూగా వున్నాడు.

1946–51లలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీగా సమర్ధవంతంగా పనిచేశాడు.

1948లో హైదరాబాదు సంస్థానం బారతదేశంలో విలీనం చేయటానికి వల్లభాయ్ పటేల్ వద్దకు తనతోపాటు మర్రి చెన్నారెడ్డి, కె.వి.రంగారెడ్డి గార్లను తీసుకొని డెలిగేషన్ వెళ్ళాడు. పటేల్‌కు సన్నిహితంగా వుండేవాడు.

అయితే 1951లో ఎన్.జి. రంగా స్థాపించిన కృషీకార్ లోక్‌పార్టీకి అధ్యక్షుడై 1953లో ఆపార్టీ కాంగ్రెస్‌లో విలీనమైనపుడు బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలో చేరి వ్యవసాయం, అడవులు, పశుసంపద శాఖల మంత్రిగా పనిచేసి రైతు సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపట్టి రైతుల నుండి పుల్లరి వసూలు చేయు పద్దతిని రద్దు చేశాడు. ఆ సమయంలో భవనం వెంకట్రామిరెడ్డి (తదుపరి ముఖ్యమంత్రి) ఓబులరెడ్డి గారి వద్ద పి.ఎ.గా పనిచేశాడు.

ఓబులరెడ్డి ఫ్రీడమ్ ఫైటర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడై ప్రభుత్వం నుండి స్వాతంత్ర యోధులకు రావలసిన గుర్తింపును, ప్రాముఖ్యతను సంపాదించాడు.

ఇంతలో ఎన్.జి. రంగా 1957లో స్వతంత్ర పార్టీని ప్రారంభించాడు. ఆది నుండి ఎన్.జి. రంగాకు అనుచరుడుగా ఉన్నందున ఆయన ఆధ్యక్షంలో ఆపార్టీకి కార్యదర్శి అయినాడు. మార్కాపురం నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైనాడు.

1962లో స్వతంత్ర పార్టీ కాంగ్రెసులో విలీనమైంది. కాంగ్రెసు పార్టీ తరఫున మార్కాపురం నియోజకవర్గం నుండి రెండవసారి శాసనసభ్యునిగా ఎన్నికయాడు. 1963–64లో ఎస్టిమేట్స్ కమిటీకి ఛైర్మన్‌గా నియమించబడ్డాడు.

1964–71 కాలంలో ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (రాజేంద్ర నగర్)కి వ్యవస్థాపక అధ్యక్షుడుగా పనిచేశాడు.

1972లో యర్రగొండపాలెం నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికైనాడు.

1978లో కంభం నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికై చెన్నారెడ్డి మంత్రివర్గంలో మధ్యతరహా నీటి పారుదల శాఖామంత్రిగా పని చేశాడు. తిరిగి మరల 1980లో టి. అంజయ్య మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు.

1982-83లో ఎ.పి.యస్.ఆర్.టి.సి ఛైర్మన్‌గా పనిచేసి 1983లో రాజకీయ జీవిత విరమణ చేశాడు.

ఆయన ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూ వుండేవాడు. స్వామి వివేకానంద, స్వామి రామతీర్థ, అరవిందుడు రచనలు, బైబులు బాగా చదివాడు.

ఏడు దశాబ్దాల కాలం నేటి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతానికి (అప్పటి కర్నూలు జిల్లాకు కూడ) ముఖ్యనాయక కుటుంబం ఓబులరెడ్డిగారిది.

3-1-1993 స్వర్గస్తులు కాగా ఆంధ్రరాష్ట్రమంతా ఘనంగా నివాళులర్పించింది.

గ్రామీణ భారతం ఓబులరెడ్డి చిరకాల వాంఛ. రైతువర్గం ఆయనకు ప్రాణం. రైతుసేవ ఆయన ఉద్యోగం. కందుల ఓబులరెడ్డి ప్రజల మనిషి. వారసుడు నాగార్జునరెడ్డి తండ్రి పేరును నిలబెట్టిన శాసనసభ్యుడు.

ఓబులరెడ్డి రైతుకు, వ్యవసాయ రంగానికి చేసిన సేవను ప్రభుత్వం గుర్తించి ప్రకాశంజిల్లా గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టును ఓబులరెడ్డి గారి కంకితం చేసి ఆయన పేరు పెట్టారు.

**ఇమ్ము దప్పువేళ నెమ్మె లెన్నియు మాని**
**కాల మొక్కరీతి కడపవలయు**
**విజయుఁ డిమ్ము దప్పి విరటుని కొల్వఁడా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి



జననం : 24-11-1914
మరణం : 12-1-1990

రైతుబాంధవుడు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూకా చీనెపల్లి గ్రామంలో మధ్యతరగతి రైతుకుటుంబంలో జన్మించాడు.

విద్యార్థి దశలో రాయలసీమ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నికై యువజన ఉద్యమాన్ని నిర్మించాడు. మదనపల్లి దివ్యజ్ఞాన కళాశాలలో చదివి, మద్రాసు విశ్వవిద్యాలయంలో పట్టభద్రుడయాడు.

1936 నుంచే క్రియాశీలక రాజకీయాలలో పాల్గొన్నాడు. 1940లో ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడైనాడు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో అరెస్టయి రెండేళ్ళు జైలు జీవితం అనుభవించాడు.

ఈయన ఆచార్య రంగాగారి అనుయాయుడు. వేసవి పాఠశాలలు నెలకొలిపి రైతులు, యువకులకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించాడు. 1938లో మదనపల్లిలోను, 1941లో చెన్నూరులోను, 1947లో చిత్తూరు జిల్లాలోను వేసవి పాఠశాలలు నిర్వహించి వందలాది యువకర్షకులకు రాజకీయ శిక్షణనిచ్చాడు. చిత్తూరు జిల్లా రైతు కూలీ సంఘాన్ని ఏర్పరచి వారి జీవన స్థితిగతులకు మార్గదర్శకాలు చూపాడు.

చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ సంఘానికి అధ్యక్షులుగా ఎన్నికై ఉపాధ్యాయ సమస్యలపై దృష్టిపెట్టాడు.

పత్రికా ప్రచురణ కూడ చేశాడు. "వాణి" తెలుగు వారపత్రిక ఈయన సంపాదకత్వంలో వెలువడింది. 1936లో 'రైతు జనావళి' పత్రికను స్థాపించాడు. 1930ల్లోనే "వాహిని" పత్రికా బాధ్యతను పండితారాధ్యుల నాగేశ్వరరావుతో కలిసి నిర్వహించాడు.

1952లో మద్రాసు శాసనసభ్యులుగా ఎన్నికైనాడు. 1953లో ఆంధ్రరాష్ట్ర నిర్మాణం తర్వాత టంగుటూరి ప్రకాశం పంతులుగారి మంత్రివర్గంలో వ్యవసాయశాఖా మంత్రిగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ నిర్మాణం తరువాత నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో పనిచేశాడు. 1961లో విదేశీ పర్యటన జరిపి పాశ్చాత్యదేశాలలో వ్యవసాయ పద్ధతులపై అధ్యయనం చేశాడు.

1962లో వాయల్పాడు నియోజకవర్గం నుండి అసెంబ్లీకి పోటీచేసి పరాజయం పొందాడు. 1967లో మరల అదే నియోజకవర్గం నుండి పోటీచేసి పెద్ద మెజారిటీతో గెలుపొందాడు.

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

1962 నుండి 1964 వరకు రాష్ట్ర ఖాదీ బోర్డు అధ్యక్షునిగా పనిచేశాడు.

1967 నుంచి కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో సభ్యుడుగా వున్నాడు. ఆ తరువాత పి.వి. నరసింహారావు మంత్రివర్గంలోనూ పనిచేశాడు.

1964లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడై కాంగ్రెస్ సంస్థను పటిష్టం చేయటానికి ప్రయత్నం చేశాడు.

భారత రైతు సమాఖ్యకు దీర్ఘకాలం ఉపాధ్యక్షులుగా వున్నాడు.

ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి అధ్యక్షుడుగా పనిచేశాడు.

తిమ్మారెడ్డి రైతుబాంధవుడు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ఈ ప్రాంతం నుండి ప్రధానపాత్ర వహించాడు. గాంధీ ఆశయాలు, సిద్ధాంతాలకు ప్రభావితులై జాతీయ ఉద్యమంలో పాల్గొన్నాడు. గాంధేయ నిర్మాణ కార్యక్రమాలలో పాల్గొని, గ్రామాభివృద్ధి, రైతు సంక్షేమం పరమావధిగా కృషిచేశాడు. “ఆవేదన గల హృది, ఆలోచన గల మనసు, ఆచరణకు తమకని కార్యదీక్ష, రైతు స్వామ్యానికి మించిన పార్టీ స్వామ్యం లేదని తేల్చుకున్న కృషీవలుడు” తిమ్మారెడ్డి. పారిశ్రామిక రంగంలోనివారు ఉచ్ఛదశలో వుండి, గ్రామీణ ప్రాంతాలవారు అధమస్థాయిలో వుండి దుర్భర జీవితం గడుపుట సోషలిజం అనిపించుకోదని తాను పనిచేసిన ముఖ్యమంత్రులందరికీ కరాఖండీగా చెప్పాడు. రైతు సహకారోద్యమంతో వృద్ధి చెందాలంటే వ్యాపార సరళితో కొనసాగాలని సిద్ధాంత నిరూపణ చేశాడు.

ఇట్టి రైతు రెడ్డి – రెడ్డి రైతు అందరి బాంధవుడని చెప్పుకోవలసిందే.

**కర్మ మధికమైన గడచి పోవగరాదు**
**ధర్మరాజు దెచ్చి తగనిచోట**
**గంకుభట్టుఁ జేసెఁ గటకటా దైవంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చిప్పబడ్డ స్వాతిచినుకు ముత్యంబాయె
నీటబడ్డ చినుకు నీటఁ గలిసెఁ
బ్రాప్తిగల్గుచోట ఫలమేల తప్పురా
విశ్వదాభిరామ వినురవేమ.

# ఎ.సి. సుబ్బారెడ్డి



జననం : 17-3-1906
మరణం : 20-9-1967

సుబ్బారెడ్డి గారి తండ్రి సుబ్బరామిరెడ్డి, తల్లి నారాయణమ్మ, భార్య అన్నపూర్ణ. సుబ్బారెడ్డి గారి కాలేజి చదువు మద్రాసు పచియప్ప కాలేజి. 1927లో విద్య వదలి రాజకీయ ప్రవేశం చేశాడు. స్వాతంత్రోద్యమం ముమ్మరంగా జరుగుతున్న రోజులు.

1936–60 నెల్లూరు మునిసిపల్ ఛైర్మన్‌గా పనిచేసి ప్రజల మెప్పును పొందాడు. 1934–40 కాలంలో నెల్లూరు కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టరుగా చేశాడు.

క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించాడు.

1955లో శాసనసభకు ఎన్నికైనాడు. 1957–60 తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఛైర్మన్‌గా పనిచేశాడు.

1960 సంజీవయ్య మంత్రివర్గంలో పరిశ్రమల శాఖామాత్యులుగా కొద్దికాలం చేసి రాజకీయ కారణాలపై రాజీనామా చేయవలసి వచ్చింది.

1962 రాపూరు నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైనాడు. సంజీవరెడ్డి మంత్రివర్గంలో పబ్లిక్‌వర్క్స్, విద్యుచ్ఛక్తి శాఖలను నిర్వహించాడు. తదుపరి బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో పనిచేశాడు.

ఒంగోలుకు గుండ్లకమ్మనది నుండి త్రాగునీరు తెప్పించాడు. నేటికీ అది పనిచేస్తూనే ఉన్నది.

పైనుంచి జార్చబడ్డ నాయకుడు కాదు. క్షేత్రస్థాయి నుండి సొంతబలంతో ఎదిగిన నాయకుడు. తనకు తానేసాటి. ఎవరికీ లొంగని వ్యక్తి. తిరుగుబాటు తత్వం గల వ్యక్తి. సింహపురి సింహం అని బ్రహ్మానందరెడ్డిచే కొనియాడబడ్డాడు.

చివరిగా హోంమంత్రిగా ప్రమాణం చేసినప్పటి నుండి క్యాన్సరు వ్యాధితో బాధపడుతూనే వున్నాడు. మద్రాసు ఆసుపత్రిలో చివరి శ్వాస విడిచాడు. నెల్లూరు ప్రజ కట్టలు తెంచుకుని ఎదురేగింది. మహోన్నతుడైన ఆప్తుని, ఆత్మీయుని, అగ్రనాయకుని అస్తమయానికి నెల్లూరు విలపించింది. అన్నాదురై, కామరాజ్ నాడార్, సంజీవరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, గొట్టిపాటి బ్రహ్మయ్య, కాకాని వెంకటరత్నం వగైరా పెద్దలందరూ ఘనంగా నివాళులర్పించారు.

ఎ.సి. గర్వమెరుగని వ్యక్తి. భేషజం లేదు. క్షమ, ఓర్పు, ఔదార్యం, ఉపకారతత్వం నిర్భయత్వం, నిర్మలత్వం, నిష్కల్మషం ఆయన ఆస్తులు. కనుకనే ఆయన వంశీకులు ఇప్పటికీ రాజకీయాల్లో ఉన్నారు.

రెడ్డి జాతి మరువరాని మనిషి ఎ.సి. సుబ్బారెడ్డి.

# రొండా నారపరెడ్డి



జననం : 29-8-1922
మరణం : 26-3-2009

నారపరెడ్డి గారి తండ్రి సుబ్బారెడ్డి, తల్లి ఆదెమ్మ; భార్య సీతారావమ్మ, కుమారులు వెంకటాద్రిరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, కుమార్తెలు విజయ, ప్రమీల, మంజుల.

నారపరెడ్డిది ప్రకాశం జిల్లా పందిళ్ళపల్లి గ్రామం. సంపన్న రైతు కుటుంబం. ఆదినుండీ రాజకీయ కుటుంబం కూడాను.

తండ్రి సుబ్బారెడ్డి ఒంగోలు జిల్లా బోర్డు మెంబరుగా ప్రజాసేవ చేశాడు.

నారపరెడ్డి ఎలిమెంటరీ విద్య బాపట్లలో, హైస్కూలు విద్య పెదనందిపాడు, చీరాలలో అభ్యసించాడు. హైస్కూలు విద్య దశలోనే వామపక్ష భావజాలానికి ఆకర్షితుడై తన తోటి వారిని కూడ ప్రభావితం చేసి రహస్య మీటింగులు వేసుకొని విప్లవ – కమ్యూనిస్టు భావాలను అలవరచుకున్నాడు. కులమతాలకు వ్యతిరేకంగా ఉండేవాడు.

1937లో పై చదువులకు స్వస్తి చెప్పి కమ్యూనిస్టు పార్టీ రహస్య మీటింగులకు వెళ్ళి ఇంటికి రాకపోవటం తల్లిదండ్రులను కలవరపెట్టింది. వారు స్నేహితుల ద్వారా, బంధువుల ద్వారా చదువుకు వెళ్ళమని చెప్పించారు. వినలేదు. ఇంటి నుండి భారీమొత్తాలను తీసుకొని వెళ్ళి విప్లవ సాహిత్యం ముద్రింపించి పంచి పెట్టేవాడు.

అవి స్వాతంత్రోద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులు. ప్రజలను ఆంగ్లేయ పోలీసుదళం చిత్రహింసలు పెడుతున్నారు. జైళ్ళలో పెడుతున్నారు. ఆ సందర్భాలు కమ్యూనిస్టులను కూడ కలవరపరచాయి. నారపరెడ్డిని కూడ కలవరపెట్టాయి.

తండ్రి సుబ్బారెడ్డి, నారపరెడ్డి విషయం ఆచార్య ఎన్.జి. రంగాతో చెప్పాడు. రంగాగారు స్వాతంత్రోద్యమ సందర్భంలో పందిళ్ళపల్లి వచ్చినపుడు, నారపరెడ్డిని పిలిపించుకొని తనతో తీసుకొనివెళ్ళి కమ్యూనిస్టు భావాల నుండి మార్చే ప్రయత్నం చేశాడు. సఫలీకృతమయాడు. కాంగ్రెసు నాయకులు నెహ్రూ, కామరాజ్ నాడార్, రాజేంద్రప్రసాద్ లాంటి మరెంతో మంది నాయకులతో కలిసి తిరిగే అవకాశం కల్పించాడు ఆచార్య రంగా. 1947 తరువాత ఆచార్య రంగా మంత్రిగా వున్నపుడు కొన్ని ప్రభుత్వ కార్యకలాపాల గూర్చి తెలుసుకున్నాడు.

14–6–1951 ఒంగోలుకు చేరువలోని చెరువు కొమ్ముపాలెం వాసి సీతారావమ్మను వివాహం చేసుకున్నాడు. రాజకీయాలలోనే వుంటూ ఆంధ్రరాష్ట్రోద్యమంలో పాల్గొన్నాడు.

1957 పార్లమెంటు సార్వత్రిక ఎన్నికలలో ఒంగోలు నియోజకవర్గం నుండి కమ్యూనిస్టు నాయకుడు మాదాల నారాయణస్వామిపై పార్లమెంటు సభ్యునిగా కాంగ్రెస్ పార్టీ తరపున

పోటీచేసి గెలిచాడు. అప్పటి నుండి ఆయనను యంగ్ టర్క్ అని అంటుండేవాళ్ళ నాయకులు. కాసు బ్రహ్మానందరెడ్డి గారికి సన్నిహితుడైనాడు. నాగార్జున సాగర్ నిర్మింపజేయు ప్రయత్నాలలో ముందుండి కాసు బ్రహ్మానందరెడ్డితో, ఇతర నాయకులతో మంతనాలు జరిపేవాడు. పార్లమెంటు సభ్యునిగా తన పాత్ర తాను నిర్వర్తించాడు.

తరువాత గుంటూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎంపికైనాడు. తన ఆధ్వర్యంలో ఎ.ఐ.సి.సి. మహాసభలు గుంటూరులో దిగ్విజయంగా జరిపించాడు.

1967లో కాసుబ్రహ్మానందరెడ్డి గారి మంత్రివర్గంలో మధ్యతరహా నీటిపారుదల మంత్రిగా చేశాడు.

జలగం వెంగళరావుగారి మంత్రివర్గంలో పంచాయితీరాజ్, గనుల శాఖామంత్రిగా పనిచేశాడు.

కాసు బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రిగానున్న సమయంలో కొత్త జిల్లాల ఏర్పాటు ప్రతిపాదన వచ్చినపుడు గుంటూరు – నెల్లూరు – కర్నూలు జిల్లాలలో వెనుకబడ్డ ప్రాంతాలను కలిపి ఏకఖండంగా వున్న ప్రాంతాన్ని 1970లో ఒంగోలు జిల్లాగా చేయుటకు, దానికి తరువాత 1972లో ప్రకాశం పంతులుగారి పేరు పెట్టుటకు కృషిచేసి నారపరెడ్డి గారే సాధించి జిల్లా ప్రదాత అయినాడు. అందుకు తనమంత్రి పదవిని సైతం ఫణంగా పెట్టాడు. 2–2–1970న ఒంగోలు కేంద్రంగా ప్రకాశం జిల్లా ఆవిర్భవించింది. ఒంగోలు పట్టణ అభివృద్ధికి, జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయించాడు. ప్రభుత్వం నుండి డబ్బును తెప్పించాడు.

నారపరెడ్డి గొప్ప సాహిత్యాభిలాషి. 1971లో ఒంగోలు జిల్లా రచయితల మహాసభలు గొప్పగా జరిపించాడు. ఇప్పటి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి గారికి గండపెండేరమును బహూకరించాడు. కేంద్రమంత్రి కె.వి. రఘునాధరెడ్డి, నందినీ శత్పధి తదితరులను కూడ ఆహ్వానించి సభలు దిగ్విజయం చేశాడు.

26–3–2009న పరమపదించాడు. ఈ ప్రాంతపు రెడ్డి ప్రజలకు తీరని లోటు.

ఎన్ని చోట్లు తిరిగి యేపాట్లు పడినను
అంటనియ్యక శని వెంటఁ దిరుగు
భూమి క్రొత్తలైన భుక్తులు క్రొత్తలా
విశ్వదాభిరామ వినురవేమ.

# ఏరాసు అయ్యపురెడ్డి



జననం : 1-1-1924

అయ్యపురెడ్డి గారు కర్నూలు జిల్లాలో గల దిగరేవుల అనే చిన్నగ్రామంలో ఏరాసు తిరుపంరెడ్డి గారికి జన్మించారు. భూస్వామ్య కుటుంబం. రాజకీయ కుటుంబం. చిన్నప్పటి నుండి తెలివిగలవాడు. చదువంటే ఇష్టం. అఖండమైన జ్ఞాపకశక్తిపరుడు.

కర్నూలు మునిసిపల్ హైస్కూలులో యస్.యస్.యల్.సి., వరకు చదివాడు. జిల్లా ఫస్టు వచ్చాడు. ఇంటర్మీడియెట్, బి.ఎ. అనంతపురంలో చదివాడు. క్లాసులో ఎప్పుడూ మొదటివాడే. లా కోర్సు మద్రాసులో చదివాడు. డిస్టింక్షన్‌లో పాసయాడు.

థర్డ్‌ఫారం నుంచి రాజకీయాలంటే ఆసక్తిగా వుండేవాడు. విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లో పాల్గొన్నాడు. గాంధీగారి ఉపన్యాసాలకు ఆకర్షితుడైనాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్ళాడు.

1946లో న్యాయవాది పట్టా పుచ్చుకొని కర్నూలు జిల్లా కోర్టులో ప్రాక్టీసు మొదలు పెట్టాడు.

1947లో కామాక్షమ్మతో వివాహమైంది. ఆమె అన్నివిధాల సహకారం అందించింది.

1955లో కాంగ్రెస్ తరపున సోషలిస్టు పార్టీ నిర్వహించాడు. ప్రకాశం మంత్రివర్గం పడిపోయింది. ఉపఎన్నికలొచ్చాయి. కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రముఖ కమ్యూనిస్ట్ నేత చంద్ర పుల్లారెడ్డిపై పోటీచేసి గెలిచాడు. అపుడు అయ్యపరెడ్డి వయసు 32 సంవత్సరాలు. బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, కళా వెంకట్రావు వగైరా హేమాహేమీలున్న సమయమది. గ్రామాలలో పర్యటించి ప్రజా సమస్యలపై ఎక్కువ శ్రద్ధ చూపాడు.

1-11-1956 మొదటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి. అయ్యదేవర కాళేశ్వరరావు స్పీకరు. అపుడు ప్రభుత్వం తరపున గవర్నర్‌కి "మోషన్ ఆఫ్ థాంక్స్" మూవ్ చేసేటంతటి గొప్ప అదృష్టం పొందాడు.

1962లో మళ్ళీ చంద్ర పుల్లారెడ్డిని ఓడించి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికైనాడు. తన నియోజకవర్గంలో విద్యుత్, రోడ్లు, స్కూళ్ళు, రవాణా సౌకర్యాలు తెచ్చాడు. అయ్యపురెడ్డి జవహర్‌లాల్ నెహ్రూకు ప్రీతిపాత్రుడు. 1956లో, 1962లో ఎన్నికల ప్రచారానికి నెహ్రూ తన నియోజకవర్గానికి వచ్చి ప్రచారం చేశాడు.

శ్రీశైలం ప్రాజెక్టు కోసం అహరహం పనిచేసి 1963లో నెహ్రూగారిని పిలిచి శంకుస్థాపన చేయించిన వారిలో ముఖ్యుడు.

1967 ఎన్నికలలో ఓడిపోయి 1972లో తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైనాడు. అపుడు పి.వి. నరసింహారావుగారు ముఖ్యమంత్రి. ప్రత్యేకాంధ్ర ఉద్యమం వచ్చింది. పి.వి. ప్రభుత్వాన్ని దించి రాష్ట్రపతి పాలన పెట్టారు. అపుడు అయ్యపురెడ్డి మరి పదిమంది నాయకులను కలుపుకొని ఢిల్లీకి పోయి ఆంధ్రను విడదీయొద్దని, ప్రధానమంత్రి ఇందిరాగాంధీని, రాష్ట్రపతి వి.వి.గిరిని, హోం మంత్రి దీక్షిత్‌గారిని కలిసి అనుకూలమైన మాట తీసుకున్నారు. తండ్రికి వలెనే ఇందిరాగాంధీకి కూడ అయ్యపురెడ్డి ఇష్టుడు.

జలగం వెంగళరావు హయాంలో రాయలసీమకు నీళ్ళకోసం ఆయన కాదన్నా మళ్ళీ ఇందిరాగాంధీ దగ్గరకెళ్ళి తెలుగుగంగ, శ్రీశైలం నీరు సాధించారు.

1978లో ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధించి లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణను అరెస్టు చేయటాన్ని సహించలేక కాంగ్రెసుకు రాజీనామా చేసి జనతా పార్టీలో చేరాడు.

1980లో మళ్ళీ కాంగ్రెస్ తరపున పోటీచేసి గెలిచాడు. అంజయ్య మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రి అయాడు. అపుడు లీగల్ ఎయిడ్, లోక్ అదాలత్, జ్యుడిషియల్ ఆకాడమీలను తొలిగా ఏర్పాటు చేశాడు. ప్రజలందరికీ న్యాయాన్ని చేరువచేయాలని ఆయన కోరిక. న్యాయపాలనలో మార్పులు తెచ్చి మన్ననలు పొందాడు.

తరువాత కాంగ్రెస్ పార్టీ పోకడలు విపరీతానికి చేరాయి. ఎన్.టి. రామారావుకు మెజారిటీ వున్నా అన్యాయంగా దింపేయటం చూసి మళ్ళీ కాంగ్రెసుకు రాజీనామా యిచ్చాడు.

1985లో ఎన్.టి.ఆర్. కోరికపై పార్లమెంటు ఎన్నికల్లో టి.డి.పి అభ్యర్థిగా పోటీచేసి గెలిచాడు. అఖిల భారత పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ అయాడు. అపుడు రాజీవ్‌గాంధీతో పరిచయమైంది.

కాగ్‌ను ఏవిధంగా సంస్కరించాలో నివేదిక ఇవ్వమని రాజీవ్‌గాంధీ కోరగా సంస్కరణలు తయారుచేసి యిచ్చాడు. కాని ఎన్.టి.ఆర్.కు దూరమయాడు.

1994 నుండి 2001 వరకు ఆర్.బి.ఐ. డైరెక్టరుగా ఉన్నాడు.

అయ్యపురెడ్డి పనితనమే ఆయనను రాజకీయాలలో క్లిక్ చేసింది. ఏ ప్రతిపక్ష నాయకుడూ ఆయనను ఎప్పుడూ విమర్శించని గొప్ప రాజకీయ జీవితం ఆయనది.

కాని రాజకీయాలు, సమాజం త్వరితగతిన చెడిపోయాయి. విసుగు చెందాడు.

అయ్యపరెడ్డికి సాహిత్యాభిలాష వున్నది. కొసరాజు రాఘవయ్య చౌదరి "కొండవీటి వైభవం" అనే పుస్తకాన్ని రాసి ఆయన కంకితమిచ్చాడు. లాయరుగా ఆయనకున్న అనుభవంతో లా గ్రంథాలు రాశాడు. వాటిలో ల్యాండు సీలింగు చట్టంపై వ్రాసిన పుస్తకం, న్యాయవాదులలో, న్యాయమూర్తులలో బహుళ ప్రచారం పొందింది. న్యాయవాదిగా, క్రిమినల్ న్యాయవాదిగా మంచిపేరు సంపాదించారు. ఆయన జ్ఞాపకశక్తి అద్భుతం. ఎంత పెద్ద మర్డరు కేసైనా కాగితంపై కలంపెట్టి ఒక్క అక్షరం కూడా రాయకుండా సాక్ష్యాలలో ప్రతివాక్యాన్ని గురించి ఆర్గ్యుమెంటు చెప్పగల దిట్ట. చివరి క్షణం వరకు లాయరుగా పనిచేసి పేదలకండగా వున్నాడు.

అయ్యపురెడ్డికి ముగ్గురబ్బాయిలు. ఒక్క అమ్మాయి. పెద్దబ్బాయి ప్రతాప్‌రెడ్డి ఎం.ఎల్.ఏ. గా ప్రజాసేవలో వున్నాడు.

ఇంతటి బహుముఖ ప్రజ్ఞాశాలి అయ్యపురెడ్డి కులానికొక సంపద.

**లక్ష్మి యేలినట్టి లంకాధిపతి పురి**
**పిల్లకోతి పొఁజు కొల్ల పెట్టెఁ**
**జేటుకాలమయినఁ జెఱుప నల్పులె జాలు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# ఎలిమినేటి మాధవరెడ్డి



జననం : 28-2-1949
మరణం : 7-3-2000

మాధవరెడ్డి గారు నల్గొండ జిల్లా వడపర్తి గ్రామంలో జన్మించాడు. వ్యవసాయదారుల కుటుంబం. తండ్రి నరసారెడ్డి, తల్లి లక్ష్మమ్మ. భార్య ఉమా మాధవరెడ్డి, కుమారుడు సందీప్, కుమార్తెలు సృజన, స్వేత.

1974లో ఉస్మానియా యూనివర్శిటీలో బి.ఇ. - ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివాడు.

1981 నుండి రాజకీయాల్లో ఉన్నాడు. వడపర్తి గ్రామ సర్పంచి పదవి నుండి రాజకీయ జీవితం ప్రారంభమై ప్రజలతో సంబంధ బాంధవ్యాలు పెంచుకున్నాడు. భువనగిరి నియోజకవర్గ ప్రజలకు చేరువయాడు. ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్.టి. రామారావు ప్రభం జనంలో 1985లో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికైనాడు. ఆ పరంపరలో భువనగిరి నియోజకవర్గం నుండి నాలుగుసార్లు శాసనసభ్యుడుగా ఎన్నికైనాడు. తన రాజకీయ జీవితమంతా తెలుగుదేశం పార్టీలోనే జరిగింది. తనవల్ల తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం పార్టీ వలన తాను బలపడ్డారు. యన్.టి. రామారావు, చంద్రబాబు ముఖ్యమంత్రులుగా ఉన్నపుడు పలుశాఖలలో మంత్రిగా పనిచేశాడు.

1994-1995లలో యన్.టి. రామారావు కాబినెట్‌లో హెల్త్ మరియు మెడికల్ ఎడ్యుకేషన్ శాఖకు మంత్రిగా పనిచేశాడు.

1995 -1999లో చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో నాలుగు సంవత్సరాలు హోమ్‌శాఖా మంత్రిగా చేశాడు. ఆ సమయంలో నక్సలైట్ పి.డబ్ల్యు.జి. గ్రూపును అణచివేసే ప్రయత్నం చేశాడు.

11-10-1999న చంద్రబాబు నాయుడు రెండవసారి ముఖ్యమంత్రి అయినప్పుడు పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్‌మెంటు శాఖలకు మంత్రిగా పనిచేశాడు.

చివరకు 7-3-2000 తేదీన ఘట్‌కేసర్ వద్ద నక్సలైట్ల ఘాతుక (ల్యాండ్‌మైన్) విస్ఫోటనలో మరణించాడు.

ఆయన సేవలను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నల్గొండ జిల్లా ద్వారా ప్రవహిస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ కాలువకు పేరుమార్చి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుగా నామకరణం చేసింది.

మాధవరెడ్డి మరణం రెడ్డి ప్రజకు పూడ్చలేని లోటేనని గుర్తించాలి.

# పి. ఇంద్రారెడ్డి



జననం : 4-10-1956
మరణం : 21-4-2000

ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లా కోరుట్ల గ్రామంలో సామాన్య కుటుంబంలో జన్మించాడు.

పాఠశాల విద్య స్వగ్రామంలో జరిగింది. కళాశాల విద్య హైదరాబాదులో జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. మరియు లా కోర్సు చదివాడు. విద్యార్థి దశ నుండి రాజకీయాలలో ప్రవేశించి ప్రజాహిత కార్యక్రమాలను నడిపేవాడు.

మొదటగా 1981లో కోరుట్ల గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ఇంట గెలిచాడు. అదే సంవత్సరం కోరుట్ల పంచాయతీ సమితికి అధ్యక్షుడుగా ఎన్నిక కాబడ్డాడు.

1983లో శాసనసభ ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయాడు.

1985లో రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ నుండి తెలుగుదేశం పార్టీ తరపున శాసనసభకు పోటీచేసి గెలుపొందాడు. తెలుగుదేశం ప్రభుత్వంలో హోం, కార్మిక, విద్యా శాఖల మంత్రిగా పనిచేశాడు. 1989లో కూడ అదే నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైనాడు.

ప్రాధమిక విద్య, ఉన్నత విద్య, గ్రంధాలయాలు, పురావస్తు శాఖలను ఒకే మంత్రిత్వశాఖ లోనికి తెచ్చాడు. ఎన్.టి.ఆర్. మరణించాక ఎన్.టి.ఆర్. తెలుగుదేశం పార్టీలో చేరాడు. కాని ప్రజలకు దూరమయే పరిస్థితి వచ్చింది. ప్రజలకు ఏ కార్యక్రమం చేయలేకపోయి ఇబ్బందులెదుర్కొన్నాడు.

1999లో కాంగ్రెస్‌లో చేరి చేవెళ్ళ నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైనాడు. కాంగ్రెస్ శాసనసభాపక్షం కార్యదర్శిగా పనిచేశాడు. ఒక కాంగ్రెస్ కార్యకర్త వివాహ విందుకు వెళ్ళి తిరిగివస్తూ పాలమాకుల వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఎగిసిన కెరటం కూలింది. కాని ఆయన భార్య సబితారెడ్డి అదే స్థానంలో పోటీకి అవకాశం పొంది కార్యకర్తల మద్దతుతో శాసనసభకు ఎన్నికై రాజశేఖరరెడ్డి గారి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు.

వీరిది రాజకీయ కుటుంబం. ప్రజాసేవలో అట్టడుగు నుండి అనుభవాలతో ప్రజా పరిచయాలతో రాజకీయాలలో చలామణి అయిన కుటుంబం. ఏ పార్టీలో వున్నా రెడ్డితనంతో ఆ కుటుంబం విజయకేతనం ఎగరేసింది.

**ఇచ్చువాని యొద్ద నీయని వాఁడున్న**
**జచ్చుగాని యీవి సాగనీఁడు**
**కల్పతరువు క్రింద గచ్చ పొదున్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

# పి. జనార్ధన రెడ్డి

**(పి.జె.ఆర్.)**



జననం : 12-1-1948
మరణం : 28-12-2007

జనార్ధనరెడ్డి గారు పి.జె.ఆర్.గా బాగా జనం వాడుకలో వున్నాడు. ఆయన హైదరాబాదులో దోమల్‌గూడాలో జన్మించాడు. తండ్రి పాపిరెడ్డి, తల్లి శివమ్మ. భార్య సులోచన,

కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి, కుమార్తెలు గాయత్రి రెడ్డి, అనురాగిణి రెడ్డి, విజయారెడ్డి, పావని రెడ్డి. హైదరాబాదులోనే విద్యాభ్యాసం. హైదరాబాదులో పాలిటెక్నిక్ కాలేజిలో ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేశాడు. హైదరాబాదులో సనత్‌నగర్‌లో ఎ.పి. స్టేట్ ఎక్విప్‌మెంట్ కార్పోరేషన్‌లో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేశాడు.

అతి చిన్నవయసు నుండి ట్రేడ్ యూనియన్ లీడరుగా కార్మికుల సమస్యలపై, హక్కులపై యాజమాన్యాలతో ప్రభుత్వాలతో, అధికారులతో పోరాడాడు.

ఆల్విన్, కేశోరాం సిమెంట్స్, ఎన్.టి.పి.సి., వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలలోని కార్మికుల హక్కుల కోసం పోరాడాడు. కార్మిక సంఘాలకు అధ్యక్షుడుగా తన జీవితాన్ని ఖర్చుచేశాడు. అసోసియేటెడ్ గ్లాస్ ఇండస్ట్రీస్ వర్కర్స్ యూనియన్, ఎ.పి. ఎలెక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ కార్పోరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, ఎ.పి. ఆగ్రో ఇండస్ట్రీస్ ఎంప్లాయీస్ యూనియన్, కృషి ఇంజన్స్ వగైరా పరిశ్రమల కార్మిక సంఘాలకు నాయకత్వం వహించాడు. పేరుకు పైన కొన్ని సంఘాలు చెప్పటం జరిగింది కాని, హైదరాబాదులో ఆయన నడపని కార్మిక సంఘం లేదంటే ఆశ్చర్యం లేదు. రిక్షా కార్మికులు, ఆటో రిక్షాల కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు వగైరా అన్నిరంగాల కార్మికులకు ఆపద్బంధువై పగలు, రాత్రి తేడా లేకుండా కార్మిక సంక్షేమానికి పనిచేసి సామాన్యులలో సామాన్యుడుగా, కార్మికులలో కార్మికుడుగా నిత్యం కార్మిక సంక్షేమం కోసం మంతనాలు, ధర్నాలు, సమ్మెలు, ఉద్యమాలు నడిపి పేద, కష్టజీవులకు బంధువైనాడు. వారికి తలలో నాల్కగా పేరుపొందాడు.

రాజకీయంగా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీతో వున్నాడు.

మొదటిగా 1978 సంవత్సరంలో హైదరాబాదులోని ఖైరతాబాదు నియోజకవర్గం నుండి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికై ప్రజలే తన ఊపిరిగా పనిచేశాడు. 1985, 1989, 1994, 2004 సంవత్సరాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి గెలిచాడు. 1999లో మాత్రం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చేతిలో ఓటమి చవిచూశాడు. 1985–1990 సంవత్సరాల కాలంలో అసెంబ్లీలో కేవలం 20/25 మంది మాత్రమే కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులున్నపుడు కూడ పార్టీ కోసం రాష్ట్రమంతా తిరిగి, అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ

గొంతుకను బలంగా వినిపించి కాంగ్రెస్ పార్టీ మరల అధికారంలోకి రావటానికి పి.జె.ఆర్. చేసిన కృషి అసాధారణమైనది. 1994-1999లలో అసెంబ్లీలో లెజిస్లేటివ్ పార్టీ లీడరుగా కాంగ్రెస్ పార్టీ రక్షకుడుగా పనిచేశాడు. యన్.టి. రామారావు, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రులుగా వున్నపుడు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకుడుగా అసెంబ్లీలో సమర్ధవంతంగా కాంగ్రెస్ పార్టీ వాణి వినిపించి ప్రభుత్వ పార్టీకి ఎప్పుడూ చెక్‌గా పనిచేశాడు. తెలంగాణావాదిగా, తెలంగాణాకు అన్యాయం జరగకుండా వారికి చెందవలసిన బడ్జెట్ భాగాన్ని చెందునట్లు పనిచేశాడు. ఆరోగ్యం సహకరించకపోయినా ప్రాణాలను ఫణంగా పెట్టి కాంగ్రెస్ పార్టీ విజయం కొరకు శ్రమించాడు. అవసరం వచ్చినపుడు తనపార్టీ ప్రభుత్వానినైనా ప్రశ్నించి సక్రమమార్గానికి తెచ్చాడు.

1980లో మంత్రిగా సహకారశాఖను, యూత్ సర్వీసెస్ శాఖను నిర్వహించాడు. 1982 నుండి ఆర్కీవ్స్ శాఖామాత్యులుగా, 1990 నుండి లేబర్, ఎంప్లాయ్‌మెంటు, హౌసింగ్ శాఖల మంత్రిగా పనిచేశాడు. 1993 నుండి సివిల్ సప్లైస్ శాఖామంత్రిగా పనిచేశాడు.

దురదృష్టవశాత్తు వై.యస్. రాజశేఖరరెడ్డి గారి మంత్రివర్గంలో చోటు దక్కలేదు. రెడ్డిజనం బాధ చెందింది. రాజకీయాలిలానే వుంటాయని అర్ధం చేసుకోలేదు జనం. అయినా పార్టీలో, ప్రభుత్వంతో కలిసి పనిచేశాడు.

పి.జె.ఆర్. పేదల పెన్నిధిగా, అసెంబ్లీ టైగర్‌గా పేరుగాంచాడు. అనుచరులు ఆయనను "సర్కార్" అని సంభావించేవారు. ఆయన రాష్ట్రంలో ఎక్కడికెళ్ళినా జనం, జనం, జనమే.

28-12-2007 తేదీన హైదరాబాదులో గాంధీభవన్‌కు పార్టీ మీటింగుకు హాజరై గుండెపోటుకు గురై ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళేలోపలే ప్రాణాలు విడిచాడు. మరణవార్త విన్న ప్రజలు, పార్టీ నాయకులు తట్టుకోలేకపోయారు. లక్షలమంది ప్రజలు కన్నీటి నివాళు లర్పించారు. ప్రభుత్వ గౌరవాలతో అంత్యక్రియలు జరిగాయి.

ఆయన గౌరవార్ధం మొదటి వర్ధంతినాడు ఖైరతాబాద్ రోడ్ల కూడలిలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రజలు నివాళులర్పించారు. 2011లో ఆయన కుమార్తె విజయారెడ్డి పేద ప్రజలకు సహాయం చేయు తలంపుతో పి.జె.ఆర్. ఫౌండేషన్‌ను స్థాపించింది.

పి.జె.ఆర్. అనంతరం కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కుమార్తె విజయారెడ్డి రాజకీయాల్లోకి ప్రవేశించారు. విష్ణువర్ధన్‌రెడ్డి ఖైరతాబాద్ స్థానం నుండి శాసనసభకు కాం‌గ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలిచాడు. విజయారెడ్డి 2012 సం॥లో వై.యస్.ఆర్. పార్టీలో చేరి తరువాత 2014లో టి.ఆర్.యస్. పార్టీలో చేరింది.

పి.జె.ఆర్. రెడ్డి జాతికి కలికితురాయి అనటంలో సందేహం లేదు.

**అరయ నాస్తి యనక యడ్డు మాటాడక**
**తట్టు పడక మదిని దన్నుకోక**
**తనది గాదనుకొని తా బెట్టునదె పెట్టు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# దిరిశాల వెంకట రమణారెడ్డి



జననం : 1916
మరణం : 15-3-1975

వెంకటరమణారెడ్డి గారు దర్శి తాలూకా (ప్రస్తుతం ప్రకాశం జిల్లా) మారెళ్ళ గ్రామంలో జన్మించాడు. తండ్రి యల్లమందారెడ్డి, తల్లి వెంకటలక్ష్మమ్మ. ప్రాథమిక విద్య మారెళ్ళలో పూర్తిచేసి ఉన్నతవిద్య యస్.యస్.ఎల్.సి. అద్దంకిలో ముగించాడు. 1937లో వివాహం

జరిగింది. భార్య రామసీతమ్మ, కుమారుడు రాజగోపాలరెడ్డి (మాజీ ఎమ్. ఎల్. ఎ.), కుమార్తెలు దేవకీ దేవి, రమాదేవి.

1939 నుండి ఆయన దృష్టి రాజకీయాలవైపు మళ్ళింది. మద్రాసు రాష్ట్రంలో ముఖ్య నాయకుడు నెల్లూరు వాస్తవ్యులు బెజవాడ రామచంద్రారెడ్డి గారితో పరిచయం ఏర్పడి, ఆయన నాయకత్వం క్రింద జస్టిస్ పార్టీలో చేరాడు.

1940 సం॥లో మారెళ్ళ గ్రామ మునసబుగా సర్వీసులో చేరాడు.

అదే 1940లో గ్రామపంచాయతీ ప్రెసిడెంటుగా ఎన్నిక కాబడి గ్రామ మునసబు ఉద్యోగానికి రాజీనామా చేశాడు.

1945లో దర్శి తాలూకా బోర్డు వైస్ ప్రెసిడెంటుగా ఎన్నికయాడు.

తదుపరి నెల్లూరు జిల్లా బోర్డు సభ్యునిగా ఎన్నికైనాడు.

1955లో మొదటిసారి దర్శి శాసనసభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరఫున శాసనసభ్యునిగా ఎన్నికైనాడు.

1962 శాసనసభ ఎన్నికలలో రెండవసారి దర్శి నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా ఎన్నికైనాడు.

1967 నుండి 1972 వరకు నెల్లూరు జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబరుగా పనిచేశాడు.

1971లో ప్రకాశం జిల్లాకు ప్రథమ జిల్లా పరిషత్తు ఛైర్మన్‌గా ఎన్నికైనాడు. కాసు బ్రహ్మానందరెడ్డి, రొండా నారపరెడ్డి గారి నాయకత్వం క్రింద జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు విరివిగా చేపట్టాడు.

ఆయన చేసిన సేవాకార్యక్రమాలు లెక్కకు మించి వుంటవి. ప్రభుత్వం ద్వారానే కాక స్వయంగా సొంతధనంతో సేవాకార్యక్రమాలు చేశాడు.

1959–60లలో తాళ్ళూరు సమితిని చేయుటకు ప్రభుత్వంతో పోరాడి సాధించాడు.

1961లో మారెళ్ళలో జిల్లా పరిషత్తు హైస్కూలు నిర్మాణానికి అవసరమైనంత స్థలాన్ని రమణారెడ్డి దానం చేశాడు. అంతేగాక షేర్ కాపిటల్ ధనాన్ని కూడ ఆయనే చెల్లించాడు.

1962-63లో మారెళ్ళలో ఎస్.సి. బాయిస్ హాస్టల్‌ను నిర్మింపజేశాడు.

వేముల పంచాయతీ ఏరియాలో హరిజనులకు గృహాలు నిర్మింపజేశాడు. లబ్దిదారులైన హరిజనులు ఆ కాలనీకి "రమణారెడ్డిపాలెం" అని పేరు పెట్టాలని ఉద్యమం చేసి ప్రభుత్వంచే ఒప్పించుకున్నారు.

1963-64లలో గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా కోసం ప్రభుత్వంతో పోరాడి తన పలుకుబడి నుపయోగించి 60 గ్రామాలకు క్లస్టరు స్కీమ్ క్రింద విద్యుత్ సరఫరా సౌకర్యం కల్పించాడు.

రెండవసారి ఎం.ఎల్.ఏ.గా వున్నప్పుడు ఫ్లోరిన్ బాధిత గ్రామాలకు నెదర్లాండ్ నిధుల సహాయంతో రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాడు.

దర్శి తాలూకా క్లబ్ సభ్యుడుగా వుండి క్లబ్ బిల్డింగ్, డైనింగ్ హాలు వగైరాలు సొంత నిధులు, దాతల సహాయంతో కట్టించాడు.

మారెళ్ళ గ్రామంలో ఆసుపత్రి నిర్మించుటకు స్థలదానం చేశాడు.

ఇవన్నీ ఒకపక్షమైతే ఆయనకు సాహిత్య తృష్ణ కూడ ఉండటం విశేషం. భారత రామాయణాలు, ప్రాచీన కావ్యాలు విశేషంగా చదువుతాడు. అంతేకాక కోరిన సందర్భంపై పద్యరచన చేయటం ఒక అలవాటు. అలా దాదాపు నాలుగు వేలకుపైగా పద్యాలు రచించాడు. కొన్ని సందర్భాలలో ఆశువుగా పద్యాలు చెప్పేవాడు.

రమణారెడ్డి ప్రభుత్వంలో, ప్రజల్లో కీర్తిగాంచి రెడ్డికులానికి విశిష్టత తెచ్చాడు.

**తవిటి కరయబోవ దండులంబుల గంప**
**శ్వాస మాక్రమించు సామ్యముగను**
**వైశ్యవరుని సొమ్ము వసుధ నీచుల కబ్బు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అనువుగానిచోట నధికుల మనరాదు
కొంచెమైన నదియు గొదువగాదు
కొండ యద్దమందు గొంచెమై యుండదా
విశ్వదాభిరామ వినురవేమ.

# మాగుంట సుబ్బరామరెడ్డి



జననం : 26-11-1947
మరణం : 1-12-1995

సుబ్బరామరెడ్డి జననం నెల్లూరుజిల్లా తోటపల్లి గూడూరు మండలం పేడూరు. తండ్రి: రాఘవరెడ్డి, తల్లి: కౌశల్యమ్మ, తమ్ములు: సుధాకరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చెల్లెలు: సుహాసిని, భార్య: పార్వతమ్మ (బెజవాడ గోపాలరెడ్డి తమ్ముని కుమార్తె). కుమారుడు: విజయ కుమార్‌రెడ్డి, కుమార్తె: సుమాలిని.

వీరిది మొదటిలో వ్యవసాయ కుటుంబం. వ్యాపారాలు కూడ ఉన్నవి.

సుబ్బరామరెడ్డి ప్రాథమిక విద్య పేడూరులో. ఇంటర్మీడియెట్ నెల్లూరులో. ఇంజనీరింగుకు కర్నాటకలోని తుంకూరు వెళ్ళి కాలేజిలో చేరాడు.

కాని 18 సంవత్సరాల వయసులో వుండగా తండ్రి అస్వస్తులు కాగా కుటుంబ భారం నెత్తిన పడినందున విద్య మధ్యలోనే ఆపివేయవలసి వచ్చింది. వ్యాపారాభివృద్ధికి నిర్విరామ కృషిచేసి తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, గోవా, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లలో డిస్టిలరీ ఫ్యాక్టరీలు, విక్రయ కేంద్రాలు స్థాపించి లెక్కలేనంత మందికి ఉపాధి కల్పించాడు. వ్యాపారం అభివృద్ధి చెందింది. నెల్లూరు, విశాఖపట్టణం, గుమ్మిడిపూండిలలో స్టీలు ఫ్యాక్టరీలు స్థాపించాడు. సినిమా హాళ్ళు, స్టార్ హోటళ్ళు నిర్మించాడు. ట్రాన్స్‌పోర్టు నౌకల నిర్వహణ సాగించాడు. వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ కల్పన చేశాడు. కార్యదీక్ష, సమర్థతగల పారిశ్రామికవేత్తగా, అటు ప్రభుత్వ వర్గాలు, ఇటు రాజకీయ నాయకులు, ప్రజల దృష్టిలో కొచ్చారు. సేవా కార్యక్రమాలు, పేదల వైద్య సహాయ కార్యక్రమాలు వివాహాది సహకార కార్యక్రమాలు, విరివిగా చేపట్టేవాడు. విద్యారంగంలో పెక్కుమంది పేద విద్యార్థులకు చేయూతనిచ్చాడు.

అనూహ్యంగా 1991లో రాజీవ్‌గాంధీ పిలుపు మేరకు రాజకీయాల్లో ప్రవేశించాడు. రాష్ట్ర, స్థానిక రాజకీయ నాయకులు కూడ ఆయననే సూచించారు. 26-4-1991న ఒంగోలు లోక్‌సభ సీటుకు కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేశాడు. కొత్తైనా రాత్రనక, పగలనక, శ్రమించి గెలిచాడు. రాజకీయ అవకాశాలను సేవా కార్యక్రమంగా తలంచాడు.

అనతికాలంలో ప్రభుత్వంలో, కాంగ్రెస్ పార్టీలో, రాజకీయ నాయకులలో, ప్రజలలో ప్రాపకం పొందాడు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటికి కోశాధికారి అయాడు.

1992లో తిరుపతిలో అఖిల భారత కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలు నిర్వహణ బాధ్యతను ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు గారు, సుబ్బరామరెడ్డికి అప్పగించగా కూలీలలో కూలీగా పనిచేసి "నభూతో నభవిష్యతి" అన్నట్లు నిర్వహించి ప్రధానమంత్రి, ఎ.ఐ.సి.సి. అధ్యక్షుడు పి.వి.నరసింహారావు గారిచే కితాబు పొందాడు.

పార్లమెంటు సభ్యునిగా ప్రజలతో మమేకమై ప్రఖ్యాతి చెందాడు. రాష్ట్రప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ పెద్దలలో చొచ్చుకు పోయాడు. పార్లమెంటు సభ్యుడు పార్లమెంటులోనే కాదు ప్రజల్లో కూడ ఉంటాడని ఆయనను నుండే ప్రజలకు అర్థమైంది.

సుబ్బరామరెడ్డి రాజకీయం కంటె సేవాభావంతోనే ప్రజలతో మమేకమైనాడు. పార్టీ భేదం లేకుండా అందరినీ సమభావంతో ఆదరించే వ్యక్తిత్వం గలవాడు.

విద్యాభివృద్ధికి అద్భుత కృషి చేశాడు. విద్యార్థులకు సహాయం ఒక పక్షమైతే సొంత ధనంతో పాఠశాలలు, విద్యార్థుల వసతి గృహాలు నిర్మించడమే కాక 16 జూనియర్ కాలేజీలు, 3 డిగ్రీ కాలేజీలను స్థాపించి గ్రామీణ విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడ్డాడు. శాస్త్రసాంకేతిక విజ్ఞానాన్ని గ్రామీణ ప్రజలకందించటానికి ఉలవపాడులో "కృషి విజ్ఞాన కేంద్రం"ను స్థాపింప జేశాడు. వ్యవసాయ రంగాన్ని యాంత్రీకరణ చేయు పథకాలు ప్రవేశపెట్టాడు. వారి తండ్రిగారి పేరుపైనున్న ట్రస్టు ద్వారా చేతివృత్తుల వారికి పనిముట్లను సరఫరా చేయించాడు.

ప్రకాశం జిల్లాలో ఫ్లోరిన్ పీడిత ప్రాంతాలైన పొదిలి, కనిగిరి, కందుకూరు, కొండపి, ఉదయగిరి ప్రాంతాలకు రక్షిత మంచినీటి పథకాల ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాడు.

1970 సంవత్సర ప్రాంతం నుండి నిరంతరంగా సొంత ట్యాంకర్ల ద్వారా పదికిపైగా అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాంతాలలో మంచినీటి సరఫరా చేశారు. ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సౌకర్యం కల్పించారు. ఆయన స్వర్గస్తులైన దరిమిలా కూడ ఈ పథకాన్ని ఆ కుటుంబం నిర్విరామంగా జరుపుతూనే వున్నది.

రోడ్డు, రవాణా సౌకర్యాలపై ఈయన కుటుంబం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఉపాధి పనులు గణనీయంగా కల్పించాడు.

సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకు తోడ్పాటు ఎనలేని విధంగా చేశాడు.

కుడిచేయి చేయు దానం ఎడమచేతికి తెలియని రీతిలో దానధర్మాలు చేశాడు. బుడ్డా వెంగళరెడ్డిని గుర్తు చేస్తున్న వ్యక్తి. ఇందు ఆయన ధర్మభాగిని పార్వతమ్మ, తమ్ముడు శ్రీనివాసులు

రెడ్డి సహకారం అంతులేనిది. "చేతికెముకలేని దాతగా లోకాన విఖ్యాతి గాంచిన విమల గుణుడు" అని డా॥ యం.యస్. రెడ్డి స్మృత్యంజలి తెలిపారు.

దురదృష్టవశాత్తు 1-12-1995న మధ్యాహ్నం షుమారు 1-45 ని॥లకు సుబ్బరామరెడ్డి తన ఇంటిలోని గదినుండి పార్లమెంటు సభ్యుని విధులపై బయటకు వెళ్ళుటకు వాకిలి నుండి బయటకు వస్తుండగానే ఎదురుగా గణేష్ అనే నక్సలైట్ తన వద్దనున్న AK 47 పిస్టల్‌తో బహు చేరువ నుండి కాల్పులు జరుపగా సుబ్బరామరెడ్డి వెనువెంటనే ఆసుపత్రిలో ప్రాణాలు విడిచాడు. ఆయన గన్‌మాన్ రత్నం కూడ కాల్పుల్లో చనిపోయాడు. ఆయనతో పాటు గాయాలైన మరిద్దరు ప్రముఖులు కోలుకున్నారు. నక్సలైట్లు ఒక బృందంగా వచ్చి ఒక నెల కాలం రెక్కీ వేసుకొని కాల్చారు. గణేష్‌ను అదేరోజు పోలీసులు అరెస్టు చేశారు. సి.బి.ఐ. పోలీసు వారు దర్యాప్తు చేసి ఛార్జిషీటు పెట్టగా విచారణ జరిగి జీవితకాలం శిక్ష పడింది. హైకోర్టులో కూడ జీవితకాలం శిక్ష గణేష్‌కు ఖాయమైంది.

పార్లమెంటులోని అన్ని పార్టీల సీనియర్ నాయకులందరూ ఘనంగా నివాళులర్పించారు. ప్రజలు, నాయకులు అశ్రుతాంజలి సమర్పించారు.

తదుపరి ఆయన వారసత్వాన్ని, సేవాధర్మాలను భార్య పార్వతమ్మ, తమ్ముడు శ్రీనివాసులు రెడ్డి స్వీకరించారు. వారిద్దరూ పార్లమెంటు సభ్యులుగా, శాసనసభ్యులుగా ప్రజల్లోనే ఉన్నారు.

సుబ్బరామరెడ్డి గారి ప్రతి జయంతిని, వర్ధంతిని, పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలతో అటు కుటుంబీకులు, ఇటు ప్రజా నాయకులు, ప్రకాశం జిల్లా యావత్తు ప్రజలు జరుపుకుంటూ అమృతమూర్తికి నివాళులర్పిస్తున్నారు. కాల్పులలో అశువులు కోల్పోయిన గన్‌మన్ రత్నానికి కూడ సహ వర్ధంతి జరుపుతూ నివాళులర్పిస్తున్నారు.

ప్రజలు ఆయనపై గౌరవంతో ఒంగోలులో, నెల్లూరులో కంచు విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రస్తుతిస్తున్నారు.

సుబ్బరామరెడ్డి రెడ్డిజాతికి గర్వకారణమైన వ్యక్తి.

## మొదటి భూదానోద్యమ పథికుడు

# వెదిరె రామచంద్రారెడ్డి



జననం : 7-7-1905
మరణం : 9-12-1987

రామచంద్రారెడ్డి నల్లగొండ జిల్లా భువనగిరి తాలూకా పోచంపల్లిలో జన్మించాడు. తండ్రి నరసింహారెడ్డి.

తండ్రి పెద్ద భూస్వామి. అభ్యుదయవాది. కర్షక పక్షపాతి.

రామచంద్రారెడ్డి పూనాలో ఫెర్గూసన్ కాలేజిలో లా డిగ్రీ చదివి, పట్టా పొంది ప్లీడరీ వృత్తిలో రాణించాడు. పబ్లిక్ ప్రాసిక్యూటరుగా కూడ పనిచేశాడు. రైతు పక్షపాతి.

తెలంగాణా ప్రాంతంలో విప్లవజ్వాలలు రగులుకున్నాయి. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో రైతుల తిరుగుబాటు మొదలైంది.

వినోభాభావే భూదానోద్యమానికి అంకురార్పణ జరిగింది రామచంద్రారెడ్డితోనే.

1961లో గాంధేయవాది వినోభా భావే ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చాడు. రామచంద్రా రెడ్డి గ్రామమైన పోచంపల్లిలో ఒక సమావేశంలో హరిజనుల నుద్దేశించి “మీలో అశాంతికి కారణమేమిటి” అనడిగాడు. మాక్వెరికీ ఒక్క ఎకరం భూమి కూడ లేదు, ఇతర జీవనాధారం లేదని దీనంగా పలికారు. అంతట వినోబా వేదిక మీదున్న ప్రముఖులు, సభలోనున్న ప్రముఖలతో “మీరు వీరికి 80 ఎకరాల భూమి ఇవ్వలేరా” అని అడుగగా, వెంటనే రామచంద్రా రెడ్డి లేచి తాను 100 ఎకరాల భూమిని ఇస్తున్నట్లు ప్రకటించి, ఇచ్చారు. భారతదేశంలో “భూదానోద్యమం”కు రామచంద్రారెడ్డితో అంకు రార్పణ జరిగింది. రామచంద్రారెడ్డి ఆంధ్రుడు కావటం, రెడ్డి కావటం, దేశచరిత్రలోనే కాక రెడ్డి చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన విషయం. వెనువెంటనే భూదాన పత్రాలను తయారు చేయించి రిజిష్టరు చేయించి చట్ట ప్రకారంగా హరిజనులకు ఆ భూమిపై హక్కులను కల్పించాడు. దేవునికి ఆ భూమిని సమర్పిస్తున్న ఆనందానిని రామచంద్రారెడ్డి పొందాడు.

అంతటితో ఆగక తదుపరి 8 దఫాలుగా 351 ఎకరాల భూమిని భూములు లేని పేదలకు దానం చేశాడు. భూములు దానం తీసుకున్న వారికి సేద్యం వగైరా వ్యవసాయ అవసరాలకు ఆర్థిక సహాయం కూడ అందించాడు. అంతటితో కూడ ఆగక భూములు పొందిన వారికి సహకారంగా వుండుటకు పోచంపల్లిలో వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేశాడు.

భూదానోద్యమ తత్వానిని ప్రచారం చేస్తూ గ్రంధాలను వెలువరించి పలు గ్రామాలలో ప్రచారం చేశాడు.

రామచంద్రారెడ్డి, అరవిందయోగి తత్వాభిమాని. పలుసార్లు అరవిందాశ్రమానిని దర్శించుకున్నాడు. అంతేకాక అరవింద మహర్షి మరియు అరవిందాశ్రమ మాతృశ్రీ (మదర్) రచించిన గ్రంధాలను ఉర్దూలోకి అనువదించాడు.

స్థానిక పిన్న, పెద్దలెల్లరకు, రామచంద్రారెడ్డి "అన్న"గా భాసించాడు.

వినోభా దేశవ్యాప్త భూదాన ఉద్యమానికే మూలపురుషుడైతే, నాంది ప్రస్తావన చేసిన పురుషుడు రెడ్డియైన రామచంద్రారెడ్డి. సంస్కారం, సభ్యత, ప్రజాశ్రేయస్సు, త్యాగం మూర్తీభవించిన రామచంద్రారెడ్డిని, రెడ్డి కులానికి ఘనకీర్తిని తెచ్చిన రామచంద్రారెడ్డిని మరవటానికి వీల్లేని మనిషిగా అంగీకరించాల్సిందే.

**దాత కాని వాని దఱుచుగా వేఁడిన**
**వాఁడు దాత యౌనె వసుధలోన**
**ఆవురు దర్భౌనె యబ్ధిలో ముంచిన**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఇమ్ము దప్పువేళ నెమ్మె లెన్నియు మాని
కాల మొక్కరీతి కడపవలయు
విజయుఁ డిమ్ము దప్పి విరటుని కొల్వఁడా
విశ్వదాభిరామ వినురవేమ.

# మునిరెడ్డి హోసట్టి

జననం : 1924
మరణం :1985

మునిరెడ్డి ఇప్పటి తమిళనాడులోని హోసూరు తాలూకా హోసట్టు గ్రామంలో 1924లో జన్మించాడు. ఈయన గొప్ప విద్యావేత్త, రాజకీయ నాయకుడు, ప్రజాసేవకుడు.

స్థానికంగా వున్న ప్రాధమిక పాఠశాలలో చదివి, మైసూరు కళాశాలలో డిగ్రీ పట్టా పొందాడు. లక్నో విశ్వవిద్యాలయంలో న్యాయవాద డిగ్రీ పొందాడు.

విద్యార్థి దశలోనే భారత స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నాడు. విద్యార్థి నాయకుడుగా పోరాటాలు చేశాడు. ఆచార్య రంగా ప్రారంభించిన నిడుబ్రోలు రాజకీయ పాఠశాలలో చేరి

రంగాగారి శిష్యులలో ప్రముఖంగా వున్నాడు. పలు గ్రంథాలను చదివాడు. తన అనుభవాలతో "స్టూడెంట్ మూమెంట్ ఇన్ ఇండియా" అనే గ్రంథం వ్రాసి దానిని లక్నో విశ్వవిద్యాలయ న్యాయశాఖ డీన్‌కు అంకితమిచ్చాడు. ఈ గ్రంథాన్ని ఆచార్య రంగా గారు చదివి పరిచయ వాక్యాలు రాస్తూ ఈయన సామర్థ్యాన్ని మెచ్చుకుంటూ ఈ పుస్తకానికి "విథర్ స్టూడెంట్స్" అని పేరు మార్చాడు. ఈ పుస్తకాన్ని మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, భోగరాజు పట్టాభి సీతారామయ్య, నేతాజీ లాంటి దేశనాయకులు చదివి మెచ్చుకొని పలుచోట్ల ఉదహరించారు.

విద్యార్థి నాయకుడుగా అనేకసార్లు జైలుకెళ్ళాడు. తీవ్రవాద నాయకుడైన అజాద్ వంటివారితో పరిచయం గలిగి బ్రిటీషు గవర్నరుపైని బాంబుదాడి ఉద్యమంలో ఒక సభ్యుడైనాడు

1952లో మద్రాసు శాసనసభకు ఎన్నిక కాబడ్డ మొట్టమొదటి హోసూరు నాయకుడు. శాసనసభలో అనేక ముఖ్యవిషయాలపై చర్చలో పాల్గొన్నారు.

1957లో రెండవసారి హోసూరు నుండి మద్రాసు శాసనసభకు ఎన్నికై హోసూరును ఆంధ్రరాష్ట్రంలో విలీనం చేయాలా, వద్దా అనే విషయం తేల్చవలసింది హోసూరు తాలూకా ప్రజలేనని శాసనసభలో వాదించి, హోసూరు తాలూకాలోని 40 గ్రామాల పంచాయితీలచే హోసూరు తాలూకాను ఆంధ్రరాష్ట్రంలో చేర్చాల్సిందేనని తీర్మానాలు చేయించి ప్రభుత్వాలకు పంపాడు.

ఈయన కృషి ఫలితంగా కృష్ణగిరిలోని డిస్ట్రిక్టు మునసబు కోర్టు హోసూరుకు మార్చబడింది.

నీలం సంజీవరెడ్డి, సంజీవయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, చెంగల్రాయ నాయుడు వగైరా నాయకులతో చొరవ సంపాదించి ప్రజాసంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనేవాడు.

ఈయన రాష్ట్ర రాజకీయాలలో ఒక ముఖ్యవ్యక్తి అయి, మైసూరు, మద్రాసు రాష్ట్రాలలో రెడ్డి ఖ్యాతి నిలిపాడు.

# కాసు వెంగళరెడ్డి



జననం : 21-7-1907

మరణం : 1-5-1980

వెంగళరెడ్డి గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం చిరుమామిళ్ళ గ్రామంలో జన్మించాడు. తండ్రి వెంకటకృష్ణారెడ్డి, తల్లి శాయమ్మ. సోదరుడు కాసు బ్రహ్మానందరెడ్డి.

గుంటూరు, మచిలీపట్నం, చెన్నైలలో విద్యాభ్యాసం చేశాడు. లక్నోలో లా చదువుతూ మధ్యలో మానేసి తిరిగివచ్చి నరసరావుపేటలో స్థిరపడ్డాడు. క్రమంగా రాజకీయాల్లో కొచ్చాడు.

ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా చేసిన కాసు బ్రహ్మానందరెడ్డి వెంగళరెడ్డికి తమ్ముడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కాసు వెంకట కృష్ణారెడ్డి వెంగళరెడ్డి కుమారుడు. ఆ కుటుంబమే రాజకీయ కుటుంబం. కాంగ్రెసు పార్టీకి ఆ కుటుంబం వెన్నుదన్నుగా వున్నది.

వెంగళరెడ్డి 1956లో నాదెండ్ల పంచాయతీ సమితి అధ్యక్షులుగా తొలిగా రాజకీయ పదవికి ఎన్నుకోబడ్డాడు.

1962లో మొదటి దఫా గుంటూరు జిల్లా పరిషత్తు అధ్యక్షునిగా ఎన్నికైనాడు. ఆ పదవిలో మూడేళ్ళు కొనసాగాడు. మరల 1971లో ఆ పదవికి ఎన్నికై పూర్తి అయిదేళ్ళు పరిపాలనలో వున్నాడు. ఆయన జిల్లా పరిషత్తు అధ్యక్షునిగా పనిచేసిన రోజులలో జిల్లా సర్వతోముఖాభివృద్ధి చెందింది.

1962–68 మధ్యకాలంలో రాజ్యసభకు ఎన్నిక కాబడ్డాడు.

1968–1974 కాలంలో ఆంధ్రప్రదేశ్ విధానమండలి సభ్యులుగా వున్నాడు.

నరసారావుపేట భూమి తనఖా బ్యాంకు అధ్యక్షునిగా విశిష్టసేవలందించాడు.

దాదాపు మూడు దశాబ్దాలపాటు గుంటూరు జిల్లా రాజకీయాన్ని శాసించాడు. తమ్ముడు బ్రహ్మానందరెడ్డికి రాజకీయ జీవితంలో వెన్నుదన్నుగా వున్నాడు.

ఈయన కాంస్య విగ్రహాన్ని గుంటూరులో జిల్లా పరిషత్తు కార్యాలయానికి చేరువలో ప్రతిష్టించి ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. గౌరవించారు.

వెంగళరెడ్డి రాజకీయాలలో రెడ్డిజాతికి కలికితురాయి.

**వంపుకఱ్ఱ కాల్చి వంపు దీర్పఁగవచ్చు**
**కొండలన్ని బిండి గొట్టవచ్చు**
**కఠినచిత్తు మనసు కరిగింపఁగారాదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

# దొడ్ల రామచంద్రారెడ్డి (డి.ఆర్)



జననం : 4-7-1929
మరణం :15-1-2010

రామచంద్రారెడ్డి గారి తండ్రి వెంకట్రామిరెడ్డి, తల్లి ఆదిలక్ష్మమ్మ, భార్య: సరళాదేవి, కుమారులు : వినయ్ కుమార్‌రెడ్డి; విద్యాధర కుమార్‌రెడ్డి, కుమార్తెలు: శరత్‌కళ, శ్రీకళ.

రామచంద్రారెడ్డి నెల్లూరు జిల్లా కావలిలో సంపన్న కుటుంబంలో జన్మించాడు. ఆయన డి.ఆర్.గా తెలుగుదేశమంతా సుపరిచితులు. డి.ఆర్. పేరు చెప్పగానే కావలి విశ్వోదయ సంస్థ, కావలి జవహర్ భారతి గుర్తుకొస్తుంది. ఆయన విద్యాదాత. ఎందరికో స్ఫూర్తి ప్రదాత.

తండ్రి వెంకట్రామిరెడ్డి వెంకటగిరి రాజాగారి కళ్యాణ్‌రామ్ మైన్స్ బాధ్యతలు చూసేవాడు. నిర్మాణదక్షుడు. సాహితీవేత్త. తెలుగులో దొడ్ల రామాయణం, దొడ్ల భాగవతం, శ్రీకృష్ణ జననం, గీతాహృదయం, నారదభక్తి సూత్రాలు, కళావతి వగైరా రచనలు చేశాడు. ఆ కుటుంబం సాహిత్యం, సంస్కృతి, విద్యతో సంబంధమున్న కుటుంబం.

డి.ఆర్. 1949లో మద్రాసు పచయప్ప కళాశాలలో బి.ఎ. చదివాడు. డిగ్రీలో ఆంగ్లంలో గోల్డ్ మెడల్ సాధించాడు. భుజంగరాయ శర్మగారి విద్యార్థి. విశ్వవిఖ్యాతి చెందిన కవులు, రచయితల రచనలు చదివాడు.

డిగ్రీ చేసేటపుడు నిరుపేదలు అన్నార్తులు తారసపడేవారు. సమాజంలో ఏదో వెలితి వున్నదని వ్యధపడేవాడు. విద్య పేదరికానికి ఓ పరిష్కారం చూపుతుందనే ఆలోచనకు వచ్చాడు. డిగ్రీ పూర్తి చేసే నాటికి ఒక ఆదర్శప్రాయమైన విద్యాలయానికి గట్టి పునాది వేయాలనే నిర్ణయానికి వచ్చాడు. డిగ్రీ పూర్తి చేసి కావలికి రాగానే విద్యాలయ ఏర్పాటు మొదలైంది. తండ్రి రూ. 25,000/–లు ఇచ్చాడు. 16–3–1950న "విశ్వోదయ" సంస్థ ఏర్పాటు చేశాడు. తండ్రి వెంకట్రామిరెడ్డి, పి.వి.రాజమన్నార్, బెజవాడ రామచంద్రారెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, ఎస్.వి.భుజంగరాయశర్మ మరికొందరు విశ్వోదయ స్థాపక సభ్యులు. 1952లో విశ్వోదయ ఎడ్యుకేషనల్ సొసైటి స్థాపించారు. 1953లో మూడవ అక్క కూతురు సరళతో వివాహం జరిగింది. 1951లో కావలి కళాశాల 92మంది విద్యార్థులతో ఆవిర్భవించింది. అది నెహ్రూ మరణం తరువాత 14–11–1965న "జవహర్ భారతి"గా పేరు మార్చారు. దీనిని 100 ఎకరాల స్థలంలో స్థాపించారు. భారత ఉపరాష్ట్రపతి జాకీర్ హుసేన్, కాసు బ్రహ్మానందరెడ్డి, పి.వి. నరసింహారావు, కామరాజ్ నాడార్, బెజవాడ గోపాలరెడ్డి వగైరాలు ఆసందర్భంలో వచ్చారు.

ఆయన ఆశయంలో కాసులకు స్థానం లేదు. రేపటి పౌరులలో సమగ్ర వ్యక్తిత్వం నింపటం ఆయన ఆలోచన. జవహర్ భారతి విద్యార్థినని – గ్రాడ్యుయేట్‌నని చెప్పుకోవటమే ఒక గొప్ప సర్టిఫికెట్.

1967లో ఉన్నత విద్య కొరకు చెన్నైకి వెళ్ళి క్రిస్టియన్ కాలేజిలో చేరి ఎం.ఎ. ఫిలాసఫీ చేసి డిగ్రీ తీసుకున్నాడు.

1969లో 8 నెలలు జవహర్ భారతికి ప్రిన్సిపాల్‌గా చేశాడు. సంస్థ విస్తరించింది. 14-11-1975న రజతోత్సవం జరుపుకున్నది. 25-8-2001న స్వర్ణోత్సవం జరుపుకున్నది.

కార్పొరేట్ రంగం వల్ల పేద విద్యార్థులకు విద్యగగన కుసుమమైందని డి.ఆర్. గారికి బాధ. అనారోగ్యకరమైన పోటీ విద్యార్థులకు చేటు. విద్య పేదరికాన్ని పరిష్కరిస్తుందని పూర్తిగా నమ్మి ఆ దారిలో నడిచాడు డి.ఆర్. ప్రతిష్టాకరంగా విశ్వోదయ సంస్థను, కావలి జవహర్ కాలేజిని స్థాపించి నడపటం విద్యార్థి లోకానికి చేసిన గొప్ప సేవగా భావించగలం. విద్యాసేవ ఆది నుండి రెడ్డితనంలో ఒక భాగంగా ఉన్న వైనాన్ని అందరూ గుర్తించాలి.

**విత్తముగలవాని వీఁపు పుండైనను**
**వసుధలోనఁ జాల వార్తకెక్కు**
**పేదవాని యింట బెండ్లయిన నెఱుఁగరు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కర్మ మధికమైన గడచి పోవగరాదు
ధర్మరాజు దెచ్చి తగనిచోట
గంకుభట్టుఁ జేసెఁ గటకటా దైవంబు
విశ్వదాభిరామ వినురవేమ.

# మద్దూరు సుబ్బారెడ్డి

సుబ్బారెడ్డి గారు కర్నూలు జిల్లా నందికొట్కూరు తాలూకా బ్రాహ్మణకొట్కూరులో సంపన్న భూస్వామ్య కుటుంబంలో జన్మించాడు. తండ్రి నరసింహారెడ్డి, తల్లి ఈరమ్మ.

1946లో పంచాయతీ అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాడు. గ్రామాన్ని సర్వతో ముఖాభివృద్ధి చేశాడు. బ్రాహ్మణకొట్కూరుకు, నందికొట్కూరుకు సౌకర్యాలను కలుగజేశాడు. ఉన్నత పాఠశాల, పశువుల ఆస్పత్రి, విద్యుత్ సబ్‌స్టేషన్, జూనియర్ కాలేజి, బాలికల ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశాడు. బ్రాహ్మణకొట్కూరుకు పట్టణాలకు సైతం అందుబాటులో లేని డ్రైనేజి

సౌకర్యం ఏర్పాటు చేశారు. రైతుల సౌకర్యార్థం ఇండియన్ బ్యాంకు శాఖను సైతం ఆ గ్రామంలో ప్రారంభింపజేశాడు. సొంత ధనంతో గ్రామంలో శివాలయం నిర్మింపజేశాడు. ఎప్పుడూ ప్రజాహిత కార్యక్రమాలకే తన డబ్బును, సమయాన్ని వినియోగించాడు.

నందికొట్కూరు గాంధీ స్మారకోన్నత సంఘం అధ్యక్షులుగా పనిచేసి గ్రామంలో గాంధీ సిద్ధాంత ప్రచారానికి కృషిచేశాడు. కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా, కర్నూలు జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులుగా, అధ్యక్షులుగా పనిచేశాడు. జిల్లాలో 125 ప్రభుత్వ పాఠశాలలను నిర్మింపజేశాడు.

శాసనమండలి సభ్యునిగా, శాసనసభ సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రిగా, ఎన్.జి. రంగా వ్యవసాయ విద్యాలయం సెనెట్ మెంబరుగా పనిచేసి ప్రజల్లో తన స్థానాన్ని స్థిరపరచుకున్నాడు.

1972లో నందికొట్కూరు నియోజకవర్గం నుండి శాసనసభకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నుకోబడ్డాడు.

1980లో సమితి అధ్యక్షులుగా పనిచేస్తూ జిల్లా పరిషత్తు అధ్యక్షులుగా ఎన్నిక కాబడి ఉర్దూ పాఠశాలను, బి.సి.లకు గృహనిర్మాణ సౌకర్యాలు కల్పించాడు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు ఛానల్‌ను ప్రారంభించాడు.

1984లో నంద్యాల నియోజకవర్గం నుంచి పార్లమెంటుకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలుపొందాడు.

గొప్ప గొప్ప కవులను ఆహ్వానించి సన్మానించాడు. ఆయన ఇల్లు ఎప్పుడూ సాహితీ కారులతో కళకళలాడుతుండేది.

ఆయన స్వయంగా రంగస్థల కళాకారుడు. ద్రౌపదీ వస్త్రాపహరణం నాటకంలో ద్రోణాచార్యుడు పాత్ర ధరించి మెప్పించుచూ నాటక కళాకారులకు సన్మానాలు చేశాడు.

అభివృద్ధి రంగాలలో, సాహిత్యం మరితర కళారంగాలలో ప్రజలతో మమేకమై ప్రజాసేవ చేసిన గొప్ప రెడ్డిగా ఆయనకు పేరుంది.

# బూతలపల్లి రామసుబ్బారెడ్డి



జననం : 4-7-1926
మరణం : 18-12-2006

రామసుబ్బారెడ్డిది ప్రకాశం జిల్లా కనిగిరి. వ్యవసాయ కుటుంబం. పూర్వం నుండి గ్రామ మునసబుల కుటుంబం. ఆయన తండ్రి మరియు అన్న మరియు తాను గ్రామ మునసబులుగా పనిచేశారు. ఆయన ఫిర్కా రెవిన్యూ ఇన్స్పెక్టరుగా పనిచేశాడు. తండ్రి మాలకొండారెడ్డి, తల్లి సుబ్బమ్మ. భార్య కామాక్షమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు.

చిన్నతనం నుండి రాజకీయాలలో స్వాతంత్ర్యోద్యమంలో పనిచేశాడు. విదేశీ వస్త్ర బహిష్కరణలో పాల్గొని తన జీవితాన్ని ఖద్దరుకు అంకితం చేసుకున్నాడు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమైన కార్యకర్తగా పనిచేసి నాయకుడైనాడు.

నెల్లూరు జిల్లా బోర్డు మెంబరుగా పనిచేశాడు. ఎ.సి. సుబ్బారెడ్డికి అనుయాయుడుగా ఎదిగాడు.

1959-70 నెల్లూరు జిల్లా పరిషత్తు కో-ఆప్షన్ మెంబరుగా పనిచేశాడు.

కనిగిరి కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడుగా పనిచేశాడు.

1964-1970లలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మెంబరుగా రాష్ట్రస్థాయికి చేరాడు.

1964-1978 కాలంలో కనిగిరి భూమి తనఖా బ్యాంకు అధ్యక్షుడుగా పనిచేశాడు.

1972-78 ఒంగోలు జిల్లా పరిషత్తు కో-ఆప్షన్ సభ్యునిగా పనిచేశాడు.

1978-83 కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యునిగా ఎన్నికై ప్రజలకు బాగా చేరువైనాడు.

1980-82 కాలంలో ఆంధ్రప్రదేశ్ ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల బోర్డు అధ్యక్షునిగా పనిచేశాడు.

1983లో మరల ఎమ్.ఎల్.ఎ. గా పోటీచేసి ఓడిపోయాడు.

1992 దరిమిలా ప్రకాశం జిల్లా కిసాన్ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడై రైతు సమస్యలను పెద్దల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి చేర్చాడు.

రాజకీయాలే కాక, ఇతర సాంస్కృతిక ప్రజాహిత కార్యక్రమాలలో పాల్గొంటూ 1960లో సొంత ధనంతో కనిగిరిలో సాయిబాబా దేవాలయం కట్టించాడు. సాంప్రదాయిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో చొరవ చూపించాడు.

ఇలా కనిగిరి, నెల్లూరు ప్రాంత ప్రజలకు నాయకత్వం వహించి, కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు సేవచేసి తరించిన రామసుబ్బారెడ్డిని గుర్తుంచుకొందాము.

# మానుగుంట ఆదినారాయణరెడ్డి



జననం : 1932
మరణం :13-12-1988

ఆదినారాయణరెడ్డి గారు ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకా మాచవరం గ్రామంలో సంపన్న రైతు కుటుంబంలో జన్మించాడు. తండ్రి శంకరరెడ్డి, తల్లి చెంచమ్మ. భార్య లలితమ్మ, కుమారులు ముగ్గురు, కుమార్తెలు ఇద్దరు.

**రెడ్డి జనాభ్యుదయ సంఘం - ఒంగోలు**

240 ఎకరాల సేద్యం. మాగాణం కొంత, మెట్ట కొంత. 12 జతల ఎద్దులు. 90–100 ఆవులు. 50–60 గేదెలు. మేకల గుంపు వుండేవి.

వారిది గ్రామ మునసబుల కుటుంబం. తండ్రి జీవించి వున్నంత కాలం ఆయన గ్రామ మునసబు. ఆ తరువాత ఆదినారాయణ రెడ్డి 1972 వరకు గ్రామ మునసబు.

ఆదినారాయణరెడ్డి పాఠశాల విద్య కందుకూరులో చేశాడు. తరువాత నెల్లూరులో మేనమామ దొడ్ల సుబ్బారెడ్డి – కౌశల్యమ్మ గార్ల వద్ద వుండి యఫ్.ఎ. దాకా చదివి మానేసి తిరిగి మాచవరం వచ్చాడు. గ్రామాధికారిగా తండ్రి నుండి దస్త్రం తీసుకున్నాడు. గ్రామంలో అన్ని కులాల వారికి అండగా వున్నాడు. కందుకూరు ప్రాంతానికి ముఖ్యవ్యక్తిగా ఎదిగాడు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు, ముఖ్యంగా ఇరిగేషన్, రోడ్లుపై శ్రద్ధ చూపాడు. అధికారగణంకు, ప్రజలకు మధ్యవారధి అయాడు. ప్రత్యేక విషయం ఏమంటే తగాదాలతో తన దగ్గరకు వచ్చిన వారినెవ్వరినీ పోలీసు స్టేషనుకుగాని, కోర్టులకు గాని పోనీయకుండా సర్దుబాట్లు చేశాడు. గ్రామాలలో ఆయా కులాల పెద్దలను కూర్చి సర్దుబాట్లు చేశాడు. రాజకీయాల్లో ప్రవేశించమని కందుకూరు నియోజకవర్గ ప్రాంత ప్రజలు వత్తిడి తెచ్చారు. పి.వి. నరసింహారావు గారి హయాంలో 1972లో ఇండిపెండెంటుగా కాంగ్రెస్ అభ్యర్ధి నలమోతు చెంచు రామానాయుడుపై శాసనసభ్యుడుగా గెలిచాడు. 1978 వరకు శాసనసభ్యునిగా కొనసాగాడు. ఆ ప్రాంతానికి ఇరిగేషన్ సౌకర్యాలు, రహదారి సౌకర్యాల కోసం కృషిచేసి, సాధించాడు.

1978లో జనతా పార్టీలో చేరి కందుకూరు నియోజకవర్గం నుండి దివికొండయ్య చౌదరి గారిపై పోటీచేసి ఓడిపోయాడు.

తిరిగి 1983లో కందుకూరు నియోజకవర్గం నుండి దివికొండయ్య చౌదరి (కాంగ్రెస్) గుత్తా వెంకటసుబ్బయ్య (టి.డి.పి.) గార్లపై ఇండిపెండెంటుగా పోటీచేసి గెలిచాడు. అపుడు యన్.టి. రామారావు ముఖ్యమంత్రి అయినాడు.

1985 ఎన్నికలలో అదే కందుకూరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున టి.డి.పి. అభ్యర్ధి గుత్తా వెంకటసుబ్బయ్యపై పోటీచేసి గెలిచాడు. యన్.టి. రామారావు ముఖ్యమంత్రి అయినాడు.

తన హయాంలో ఎప్పుడూ అధికార పార్టీలో లేదు. అయినా స్వగ్రామంలో హైస్కూలుకు స్థలం ఇచ్చి కట్టించాడు. నియోజకవర్గంలో సాగునీరు, విద్యుచ్ఛక్తి, రోడ్లుకు అధిక ప్రాముఖ్య మిచ్చి, తన స్వగ్రామం నుండి, 300-400 మంది కూలీలను పంపి పనులు చేయించాడు. నియోజకవర్గంలో యస్.సి.లకు, యస్.టి.లకు కాలనీలు ఏర్పాటు చేశాడు.

శాసనసభ్యుడుగా పనిచేసిన రోజుల్లో ఒక స్టెనోగ్రాఫర్‌ను టైపిస్టుగా నియమించుకొని, ఒక కార్యాలయం ఏర్పాటు చేసుకొని రికార్డు క్షుణ్ణంగా చదివి అసెంబ్లీకి వెళ్ళేవాడు. అందరు అధికారులతో సయోధ్యగా వుంటూ నియోజకవర్గ ప్రజలకు సౌకర్యాలనందించి సేవచేశాడు.

తన రాజకీయ జీవితం ఒక బలమైన సామాజికవర్గ కుటుంబంపై పోటీలు జరిగాయి. తన రెడ్డితనం, ప్రజలకు చేసిన సేవ, నిజాయితీల వలన అదే సామాజికవర్గ మద్దతుతో పై ఎన్నికలలో గెలుపును సాధించాడు.

ఆదినారాయణరెడ్డి తన రాజకీయ జీవితం ముగించే నాటికి తన 240 ఎకరాల ఆస్తిలో 50 ఎకరాలు మిగిలింది. హైదరాబాదులో ప్రభుత్వం వారిచ్చిన స్థలం పోయింది. అంతా ప్రజాసేవకే వినియోగించాడు. తనను మించిన ప్రజానాయకుడు, సేవకుడు లేడని నిర్ధారించి 13-12-1988 నాడు తన వారసునిగా నియోజకవర్గానికి తన చిన్న కుమారుడు మహీధరరెడ్డి గారిని అప్పగించి, స్వర్గస్తుడైనాడు.

వారసుడైన మహీధరరెడ్డి బి.కాం., ఎల్.ఎల్.బి. చదివాడు.

ఆయన శాసనసభ్యునిగా కొన్ని సంవత్సరాలు, మునిసిపల్ మరితర శాఖల మంత్రిగా కొన్నేళ్ళు పనిచేసి ప్రజాసేవలో రాష్ట్రంలో గుర్తింపు పొందిన నాయకుడైనాడు.

ఈ రెడ్డి కుటుంబం రెడ్డిజాతికి ఒక సంపద.

**ఆలి మాటలు విని అన్నదమ్ములఁ బాసి**
**వేఱె పోవువాఁడు వెఱ్ఱివాఁడు**
**కుక్క తోకఁబట్టి గోదావరీదునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లక్ష్మి యేలినట్టి లంకాధిపతి పురి
పిల్లకోతి పొంజు కొల్ల పెట్టెఁ
జేటుకాలమయినఁ జెఱుప నల్పులె జాలు
విశ్వదాభిరామ వినురవేమ.

# కందుల నాగార్జునరెడ్డి



జననం : 14-12-1948
మరణం : 9-3-2006

నాగార్జునరెడ్డి గారి తండ్రి ఓబులరెడ్డి, తల్లి గజలక్ష్మీదేవి, సోదరులు హర్షవర్ధన్‌రెడ్డి, ప్రభువర్ధన్‌రెడ్డి. నాగార్జునరెడ్డి భార్య ప్రమీలాదేవి, కుమారుడు గౌతమ్ నాగిరెడ్డి, కుమార్తె హరిణిరెడ్డి.

నాగార్జునరెడ్డి ముప్పాళ్ళలో అమ్మమ్మ ఇంటిలో జన్మించాడు. ప్రాథమిక విద్య కూడ అక్కడే. 6, 7 తరగతులు హైదరాబాదు కేశవ మెమోరియల్ స్కూలులో చదివాడు. 8, 9 తరగతులు హైదరాబాదు మెథాడిస్ట్ స్కూలులో చదివాడు. 9, 10, 11 తరగతులు కోరుకొండ సైనిక్ స్కూలులో చదివాడు. బి.ఎస్‌సి. హైదరాబాదు న్యూసైన్సు కాలేజిలో చదివాడు. ఆ సమయంలోనే స్టూడెంటు లీడరుగా పనిచేశాడు. మంచి క్రీడాకారుడు.

తండ్రి ఓబులరెడ్డి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా పలుశాఖలలో పనిచేసినందున రాష్ట్రంలోని ముఖ్యమంత్రులందరితో ఆ కుటుంబానికి పరిచయాలున్నవి. ఆ పరిచయాలతోనే పెరిగాడు నాగార్జునరెడ్డి. తండ్రి ఓబులరెడ్డికి రాజకీయ వారసుడైనాడు. కాంగ్రెస్ పార్టీకి, కుటుంబం రాజకీయ పాత్రకు అండగా వున్నాడు.

1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కంభం నియోజకవర్గం నుండి తండ్రి ఓబులరెడ్డికి అండగా కృషిచేశాడు. 1978–83లలో ఓబులరెడ్డి, చెన్నారెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు.

నాగార్జునరెడ్డి 1981లో బేస్తవారిపేట నుండి పంచాయతీ సమితి ప్రెసిడెంటుగా చప్పిడి వెంగయ్యపై పోటీచేసి ఓడిపోయాడు. 1983లో కంభం అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున శాసనసభకు పోటీచేసి ఎన్.టి.ఆర్. ప్రభంజనంలో గూడ గెలిచాడు. 1985లో మరల కంభం నియోజకవర్గం నుండి ఉడుముల వెంకటరెడ్డిపై పోటీచేసి ఓడిపోయాడు.

1986–87 సం॥లో గిద్దలూరు, కంభం, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి, కందుకూరు, దర్శి నియోజకవర్గాల ప్రాంతాలలో వై.యస్. రాజశేఖరరెడ్డి, మైసూరారెడ్డి, గంగుల ప్రతాపరెడ్డి, డి.ఎల్. రవీంద్రారెడ్డి వగైరాలతో కలిసి కరువుయాత్ర చేశాడు. వెలుగొండ ప్రాజెక్టు కొరకు పాదయాత్ర, ప్రజా ఉద్యమం చేశాడు.

1989లో మరల కంభం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా శాసనసభకు పోటీచేసి 28,000 మెజారిటీతో గెలిచాడు. గ్రామీణ ప్రాంతాల ప్రజలతో మమేకమై విస్తృతంగా నాలుగు పశ్చిమప్రాంత అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటించి రైతుల నాదుకున్నాడు. ప్రభుత్వ కమిటీలలో, సలహామండళ్ళలో సభ్యుడిగా పనిచేశాడు.

1994లో మరల అసెంబ్లీ ఎన్నికలలో కంభం నియోజకవర్గం నుండి చప్పిడి వెంగయ్యపై పోటీచేసి ఓడాడు.

1999 అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసి చప్పిడి వెంగయ్యపై 20,000 మెజారిటీతో గెలిచాడు. ఈయన మెజారిటీ వలననే నేదురుమల్లి జనార్ధనరెడ్డి పార్లమెంటుకు నరసారావుపేట నుండి గెలవగలిగాడు.

కంభం పాలశీతల కేంద్రం కందులవారి వలననే వచ్చింది. రాజకీయాలలో ఎప్పుడూ ప్రజలపక్షంలో వుండి అభివద్ధికై కృషి చేశాడు నాగార్జునరెడ్డి. వ్యవసాయం, పాడి, పరిశ్రమలు, వైద్య, విద్యారంగాలలో విశేషకృషి చేశాడు. అయితే రాజకీయాలలో చాలమంది నాయకులకు సంభవించినట్లు నాగార్జునరెడ్డిని కూడ కాంగ్రెస్ నాయకులు చిన్నచూపు చూసినట్లు భావించి, ఆయన తెలుగుదేశం పార్టీలోకి పోగా అక్కడ జిల్లా ఉపాధ్యక్ష పదవిలో కొంతకాలం పనిచేశాడు. దురదృష్టవశాత్తు తక్కువ వయసులోనే స్వర్గస్తులైనాడు. నాయకులు, ప్రజలు ఘనంగా నివాళి తెలిపారు.

నాగార్జునరెడ్డి తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ రైతు పక్షపాతిగానే పనిచేశాడు. ట్రాన్స్‌ఫార్మర్‌లను రైతులకు ఇప్పించగలిగాడు. నాగార్జునరెడ్డి స్నేహానికి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. మనసున్న మానవతావాది. ప్రజలతో మమేకంగా వైషమ్యాలకు దూరంగా పనిచేశాడు. రాజకీయాలలో అందరివాడుగా ఉండటం కష్టమైనా సాధ్యం చేసుకున్నాడు. ధైర్యం నాగార్జునరెడ్డికి ఆస్తి.

అట్టి వ్యక్తిని రెడ్డికులం ఎన్నటికీ మరవదు. కంభం, బేస్తవారిపేట, కలుజువ్వలపాడు గ్రామాలలో ఆయన విగ్రహాలను నెలకొల్పి గౌరవించారు.

**మగని కాలమందు మగువ కష్టించిన**
**సుతుల కాలమందు సుఖము నందు**
**కలిమి లేమి రెండు గల వెంతవారికి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చిక్కియున్నవేళ సింహంబునైనను
బక్కకుక్క కఱచి బాధ చేయు
బలిమి లేనివేళఁ బంతంబు చెల్లదు
విశ్వదాభిరామ వినురవేమ.

### రాజా బహద్ద(ద్దు)ర్

# కొత్వాల్ (పాశము) వెంకట రామారెడ్డి, ఓ.బి.ఇ.



జననం : 22-8-1869
మరణం : 2-5-1953

వెంకట రామారెడ్డి తండ్రి కేశవరెడ్డి, తల్లి బారమ్మ, భార్య రంగమ్మ, కుమారులు వెంకట రంగారెడ్డి, లక్ష్మారెడ్డి.

వెంకట రామారెడ్డి గారిది ఒకప్పటి హైదరాబాదు రాజ్యంలోని పాలమూర్ జిల్లా (నేటి మహబూబ్ నగర్ జిల్లా) వనపర్తి తాలూకా, రాయనపేట గ్రామం.

వెంకట రామారెడ్డి పుట్టిన మూడవ రోజునే దురదృష్టవశాత్తు తల్లి చనిపోగా, గద్వాల్ నగర ఇలాకా రాయణిపేట గ్రామంలో అమ్మమ్మ బాయమ్మ, తాత కేశవరెడ్డి గారింట్లో పెరిగాడు. తాత గద్వాల్ నగర పటేల్‌గా పనిచేస్తున్నాడు. ధనిక కుటుంబం. మరింత దురదృష్టం ఏమంటే ఈయన 10వ సంవత్సరం వయసులో వున్నపుడు తండ్రి కూడ మరణించాడు.

మేనమామ శాయిరెడ్డి. రెడ్డి అయినా గాని వెంకట రామారెడ్డికి ఒక బ్రిటిష్ గురువు విలియమ్ వాహెబ్ అని పేరు పెట్టి స్కూలు రిజిష్టర్లలో చేర్చాడు. ఆయన వద్ద రాయచూరులో చదువుతున్నాడు. దురదృష్టం వెంటాడుతూనే వుంది. వాహెబ్ కూడ హటాత్తుగా చనిపోయాడు. అప్పటికి వెంకటరామారెడ్డికి 16 ఏళ్ళ వయస్సు. తాత (తండ్రి తండ్రి) రామన్న వాళ్ళ స్వగ్రామానికి తీసుకెళ్ళాడు. పటేల్‌ను చేయాలనుకున్నాడు. అయితే అదృష్టం కలిసి వచ్చింది. వాహెబ్ స్థానంలో వచ్చిన నజర్ మహమ్మద్‌ఖాన్ అనే రాయచూరు జిల్లా పోలీసు అధికారి వెంకట రామారెడ్డిని తన దగ్గర ఉంచుకొని విద్యాబుద్ధులు చెప్పించాడు. పదహేడవయేట నాల్గవ గ్రేడ్ "అమీను" పదవిలో నియామకం ఇప్పించాడు. ముద్గల్ ఠానా అమీనుగా నియమించారు. (నాల్గవ గ్రేడు సబ్‌ఇన్‌స్పెక్టరు) నెల జీతం రూ.60/-. గుర్రపు వ్యయం నెలకు రూ.20/-. తరువాత, పలుచోట్ల పోలీసు డిపార్టుమెంటులో ఉద్యోగం చేసి సమర్థుడైన అధికారిగా మంచిపేరు తెచ్చుకున్నాడు. మతకలహాలను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. స్వాతంత్రోద్యమ కాలంలో అటు నిజాం రాజుకు ఇటు ప్రజలకు చేరువై ప్రశంసలు పొంది ఈయన తప్పితే మరెవ్వరూ అంత మంచిపాలన చేయలేరు అని పేరు వచ్చింది. శాంతి భద్రతలు బాగున్నాయి. ఉద్యోగంలో రాణించి అంచెలంచలుగా ఎదిగి హైదరాబాదు మొత్తానికి 1329 ఫసలీలో కొత్వాల్‌గా నియమించబడ్డాడు. హైదరాబాదుకు తొలి హిందూ కొత్వాల్ ఈయనే. ఇప్పటి మన యస్.పి. కంటె పెద్ద ఉద్యోగం. కొత్వాల్ క్రింద 3000 మంది పోలీసులే కాక ఇతర ఉద్యోగులుందురు. నిజాం రాజుకు బాగా చేరువైనందున ఇతర సంస్థానాల రాజులు, జాగీర్దారులు వెంకట రామారెడ్డికి సన్నిహితులైనారు. ఈయన సేవలను

గుర్తించి నిజాం నవాబు వెంకట రామారెడ్డికి ఆయన జన్మదినోత్సవ సందర్భంలో (27 బహమాన్ 1339 ఫసలీ నాడు) **"రాజా బహద్దర్"** బిరుదునిచ్చాడు. తర్వాత నాలుగేండ్లకు 25 అమర్దాద్ 1343 ఫసలీనాడు పదవీ విరమణ చేశాడు.

6-5-1935న బ్రిటిష్ చక్రవర్తి ఐదవ జార్జి **"ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్"** (ఓ.బి.ఇ) పురస్కారాన్ని దానికి సంబంధించిన ఇతర గౌరవాలను ఇచ్చారు. లార్డ్ ఇర్విన్ వైస్రాయ్ బంగారు గుండీలను బహుకరించారు. బీరారు యువరాజు వజ్రాల గుండీలు బహుకరించారు. 1918-1919లలో ఇన్‌ఫ్లూయింజా జ్వరాల ఆపత్తులో ప్రశంసనీయ సేవచేసినందుకు నిజాం ప్రభుత్వము బంగారు పతకాన్నిచ్చి గౌరవించింది. లార్డ్ వెల్లింగ్టన్ వైస్రాయి వెండి కాలెండరు బహుమతినిచ్చాడు. బీరారు యువరాజు బంగారు గడియారం బహుమతినిచ్చాడు. ఇంకా ఎందరో ఆయన సేవలను గుర్తించి బహుమతులనిచ్చి సన్మానించారు.

1329 ఫసలీలో పురపాలక సంఘంలో సభ్యత్వం పొందాడు. 1336 ఫసలీ నుంచి 1339 ఫసలీ వరకు పురపాలక సంఘ ఉపాధ్యక్ష పదవి నిర్వహించాడు. హైదరాబాదు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడుగా 1934 సంవత్సరం నుండి 1940 సంవత్సరం వరకు చేశాడు.

వెంకట రామారెడ్డి పేదల పక్షపాతి. వారి కష్టనష్టాలను ఎప్పుడూ విచారించే వ్యక్తి. రోజుకు 19 గంటలు ప్రజాసేవ. పోలీసైనా విశాల దృక్పథం గల వ్యక్తి. విద్య, సమాజసేవ, సంస్కరణాభిలాష, స్త్రీవిద్య, అంటరానితనం నిర్మూలన, బాల్యవివాహాల వ్యతిరేకత, వితంతు వివాహ ప్రోత్సాహం ఆయన సంఘ సంస్కరణోద్యమాలలో భాగాలు. కమ్యూనిస్టైన రావి నారాయణరెడ్డి చేపట్టిన అస్పృశ్యతా వ్యతిరేకోద్యమం "హరిజన సేవక్ సంఘ్"ను సమర్థించాడు.

ఇదంతా ఒక ఎత్తైతే వెంకట రామారెడ్డి తాను విద్యార్థి దశలో అనుభవించిన కష్టాలను తలచుకొని గ్రామీణ విద్యార్థులకు రెడ్డి హాస్టలు నిర్మించాలనే తలంపు వచ్చింది. బాలికల పాఠశాలలు స్థాపించాడు. మాతృభాష తెలుగుపై మక్కువతో సురవరం ప్రతాపరెడ్డి గారికి బాగా సన్నిహితుడై గోలకొండ పత్రికతో సంబంధాలు పెంచుకొని, సురవరం ప్రతాపరెడ్డి కార్యదర్శిగా "ఆంధ్రవిద్యాలయం" స్థాపించాడు.

కొత్వాల్ ఉద్యోగం కన్నా, రాజా బహద్దర్ బిరుదు కన్నా, ఓ.బి.ఇ. గౌరవ పురస్కారం కన్నా ఆయన జీవితంలోని మరొక పార్శ్వం సంఘసేవ గొప్పది. గ్రామీణ విద్యార్థి, విద్యార్థినుల పురోభివృద్ధికి బృహత్తర కార్యక్రమాలను చేపట్టాడు.

ఒకరోజు వనపర్తి రాజాగారి కుమార్తె పెండ్లి జరుగుతున్న సందర్భంలో గొప్ప రెడ్లందరు చేరారు. విద్యార్థులు, వారికి విద్య, వసతి సౌకర్యాలను గురించి చర్చ వచ్చింది. ఇంతమంది రెడ్డిరాజులు, జమీందారులు, ధనికులు ఉండికూడ, రెడ్డి విద్యార్థులకే విద్యా సౌకర్యాలు చేకూర్చలేక పోయినామని, వెంకట రామారెడ్డి చర్చ మొదలుపెట్టగా నిర్వహించే వారుంటే మేమంతా సహాయం చేస్తామని అక్కడ చేరిన పెద్దలందరు అన్నారు. “నేను సర్వదా ఈ వ్యవస్థను నిర్వహించుటకు బాధ్యత వహింతు”నని వెంకట రామారెడ్డి ముందుకురాగా, వెంటనే పింగళి వెంకట రామారెడ్డి రూ. 10,000/-, గద్వాల్ మహారాజు రూ. 30,000/-, వనపర్తి మహారాజు రూ. 25,000/- ఇంకా చాలామంది అక్కడికక్కడే వేలకు వేలు చందాలు ప్రకటించారు. వెంటనే కాళయుక్తి నామ సంవత్సరం జ్యేష్టశుద్ధ ఐదు గురువారం (1327 ఫసలీ) ఒక అద్దె ఇంటిలో “రెడ్డి హాస్టలు”ను వెంకట రామారెడ్డి ప్రారంభం చేశాడు. కమిటి ఏర్పడింది. వెంకట రామారెడ్డి కమిటీకి ప్రధాన కార్యదర్శి. అప్పటి నుండి పెద్దలు జరుపు వివాహ సందర్భములలో విధిగా రెడ్డిహాస్టలుకు చందాలు రాజొచ్చాయి. 1333 ఫసలీలో రూ. 52,000/- లకు 9000 చ.గ. స్థలాన్ని అందులో భవనాన్ని రెడ్డి హాస్టల్ కోసం కొన్నాడు. 1334 ఫసలీలో రూ. 28000/- ఖర్చుచేసి భోజనశాల, వంటశాల కట్టించాడు. 1335 ఫసలీలో రూ. 48,000/- ఖర్చు చేసి గ్రంథాలయం నిర్మించాడు. ఇప్పటికీ అంత పెద్ద గ్రంథాలయం హైదరాబాదులో లేదని చెబుతారు. ప్రక్కనే గల మరొక బంగ్లాను 7-6-1927న రూ. 20,000/-లకు కొని కలుపుకున్నారు. 1346 ఫసలీలో వైద్యశాల, అతిథిగృహం కట్టించాడు. ఈ ప్రకారం రెడ్డిహాస్టలు వెంకట రామారెడ్డి ఆధ్వర్యంలో దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. చేరే విద్యార్థులు పెరిగిపోతున్నారు. పాయిఖానాలు, స్నానపు గదులు, కొట్టుడీలు విరివిగా నిర్మించాడు. కసరత్తులకు, ఆటలకు, వ్యాయామాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. రెడ్డిహాస్టలుకు కూరగాయలు కోసం హుస్సేన్ సాగర్ క్రింద 5

ఎకరాల తోటను, దానిలోని బంగ్లాను రూ. 6,000/-లకు కొని దానికి "రెడ్డి బాగ్" అని పేరు పెట్టారు.

ఈ రెడ్డి హాస్టలులో వందలకొలది బీద విద్యార్థులకు ఉచితముగా భోజనము, వసతి లభిస్తుంది. "పేరుకు రెడ్డి హాస్టలే కాని ఇందు రెడ్డి బాలురేకాక వెలమ, కమ్మ, నాయుడు, మొదలియార్ పిళ్ళై, ముసల్మాను మున్నగు వర్గముల వారును చేరినారు". సౌకర్యములు పొందినారు.

వైద్యశాలకు ప్రత్యేకంగా వైద్యులు (కొంతకాలం డా॥ రంగారెడ్డి అనే పూర్వ విద్యార్థి), వక్తృత్వ ధోరణి, చర్చా సామర్థ్యము పెంచుటకు విద్యార్థులలో యువజన సంఘంను స్థాపించి వారం వారం వెంకట రామారెడ్డి డిబేట్స్ వగైరా నిర్వహించేవాడు.

మాడపాటి హనుమంతరావు గారి సూచన మేరకు హైదరాబాదులో బాలికల ఉన్నత పాఠశాలను ప్రారంభించాడు. 1349 ఫసలీలో రెడ్డి బాలికల వసతి మందిరం ఏర్పాటు చేశాడు. ఆయన కట్టుబడి ప్రారంభించిన బాలికల కళాశాల ఆయన స్వర్గస్తులైనాక పూర్తి కాబడి "రాజా బహద్దర్ వెంకట రామారెడ్డి మహిళా కళాశాల"గా 1-6-1945 తేదీన ప్రారంభించబడి నడుపబడుచున్నది. ప్రముఖమైన ఆంధ్ర విద్యాలయమును సురవరం ప్రతాపరెడ్డి గారి ప్రేరణతో స్థాపించాడు. ఇందు మాతృభాష తెలుగులో విద్యాబోధన ప్రత్యేకము. హైదరాబాదులోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయానికి వెంకట రామారెడ్డిగారే పట్టుగొమ్మ, ఆంధ్రసారస్వత పరిషత్తుతో, గోల్కొండ పత్రికతో సంబంధాలున్నాయి.

1953లో "రాజా బహద్దుర్ ట్రస్టు"నొక దానినేర్పరచి రిజష్టరు చేసి తన కుటుంబంలో తన భాగమునకు వచ్చిన సొంత భవనమును ట్రస్టుకిచ్చాడు. ఈ ట్రస్టు కార్యదర్శి పి. రామచంద్రారెడ్డి. సభ్యులుగా జస్టిస్ లక్ష్మారెడ్డి, ఓబుల్‌రెడ్డి, కె.వి. రంగారెడ్డి, మాడపాటి హనుమంతరావు, మెహదీ నవాబ్‌జంగ్ ఉన్నారు. ఈ ట్రస్టు ద్వారా వచ్చిన ధనాన్ని రెడ్డి విద్యార్థి వసతి గృహము, రెడ్డి బాలికల వసతి గృహము, ఆంధ్రవిద్యాలయ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలకు వినియోగించునట్లు ట్రస్టు డీడ్‌లో వ్రాశారు.

వెంకట రామారెడ్డి ప్రతినెల సొంతంగా చందాలను ఇచ్చి సర్వవిధాల సహాయము గావించిన హైదరాబాదులోని సంస్థల పట్టికను చూస్తే ఎవరైనా ఆశ్చర్యచకితులు కావలసిందే. అవి:

1. రెడ్డి విద్యార్థి వసతి గృహము (సుల్తాన్ బజార్)
2. రెడ్డి అనాధాలయము (సుల్తాన్ బజార్)
3. రెడ్డి బాలికల వసతి గృహము
4. బాలికల ఉన్నత పాఠశాల (నారాయణగూడ)
5. మిస్ మానింగ్ బాలికా పాఠశాల (బొగ్గులకుంట)
6. బాలికల పాఠశాల (ఖైరతాబాదు)
7. వివేకవర్ధనీ ఉన్నత పాఠశాల (గౌలిగూడ)
8. హిందూ అనాధాలయము
9. హరిజన హాస్టల్
10. అనాధ విద్యార్థి గృహము
11. పరోపకారిణి బాలికా పాఠశాల (గౌలీగూడ)
12. అంజుమన్ ఖాది ముల్కు సల్మాన్
13. పరోపకారిణి బాలికా పాఠశాల (సికింద్రాబాదు)
14. అనీసుల్గుర్బా, నాంపల్లి
15. ఆంధ్ర విద్యాలయము.


ఈ సంస్థలలోని విద్యార్థులందరు ఆయనను పితృతుల్యులుగా భావిస్తారు. వెంకట రామారెడ్డి రెడ్డి సోదరులకు నిరుపమాన సహాయం చేశాడు. రెడ్డికులోద్ధరణే ఆయన జీవితాదర్శం అయింది.

2-5-1953న హైదరాబాదు ప్రాంత ప్రజలనొంటరులను జేసి స్వర్గస్తులైనారు. హైదరాబాదు దుఃఖించింది. ఇది రెడ్డిజాతికి తీరని లోటు. ఆయన పార్థివ దేహాన్ని "రెడ్డి బాగ్" వద్ద సమాధి చేశారు. పత్రికలు, ప్రముఖులు, వేనోళ్ళ నివాళులర్పించారు.

వెంకట రామారెడ్డి నిలువెత్తు కాంశ్య విగ్రహాన్ని హైదరాబాదు నారాయణ్‌గూడ వై.యం.సి.ఎ. వద్ద స్థాపించి నివాళులర్పించారు.

హైదరాబాదు చరిత్రనెవరు వ్రాసినా, రెడ్డి ప్రముఖుల చరిత్రనెవరు వ్రాసినా రాజా బహద్దర్ వెంకట రామారెడ్డి చరిత్ర తప్పక ఉండవలసిందే. రెడ్డిజాతికి వన్నె తెచ్చిన ప్రముఖుడు రాజాబహద్దర్ పాశము వెంకట రామారెడ్డి.

వెంకటరామారెడ్డి స్వహస్తముతో ఆంధ్రులకు మహత్తర సందేశాన్నిచ్చాడు. అది ఈ దిగువ ఇవ్వటమైనది.


ఆంధ్రులకు సందేశము

రాజబహద్దరు వెంకటరామారెడ్డి

రాజబహద్దర్ వేంకటరామారెడ్డిగారి స్వహస్తాక్షరములు

## ఆయన గురించి ప్రముఖులైన సి.ఆర్.రెడ్డి గారి అభిప్రాయం

This life of Raja Bahadur Venkata Rama Reddy form one of the most interesting and instructive biographies published in Telugu. It is a lucid exposition written in attractive style, of one of the worthiest citizens of Hyderabad, who is also held in high esteem throughout the entire Andhra country and more especially by the extensive and important community of Reddies. There is no need to review the excellent narrative presented by an accomplished writer of Telugu prose. On the contrary, the only work that I should undertake is to supplement it by a brief account of my personal relations with the distinguished Raja Bahadur and the impression he made on me.

It is however, a quater of a country since I first met him at Hyderabad. He was then holding a very important post in the Police Department, a post which gave him frequent access to His exalted Hihgness the Nizam and for which utmost delicacy of thought and feeling and the coolest judgment were indispensable qualifications. The Raja Bahadur, a strongman, silent but observant, modest in manner and moderate in speech, cool, calm, unruffled and sympathetic and charitable in his construtions and inferences, was, I was proud to note, regarded by Muslims as well as Hindu as an ideal officer. No wonder he rose to the Headship of the department and was awareed, for his signal and faithful services by His Exalted Highness the title of Raja Bahadur.

Mr. Venkata Rama Reddy is not merely a man of broad shoulders but one of a broad mind also. The perfect affection with which he greeted his English daughter-in-law has always remained in my memory as the best and most conclusive evidence of the great and noble spirit of the Raja Bahadur.

He was not content with being a mere official, though excellence in the very difficult position he occupied would have by itself constituted merit of no ordinary degree. In his own quiet way he was the friend and adviser of every one in distress. He promoted organisations intended for the uplift of the Reddy community and may be regarded as one of the founders of the noble Reddy

Residential school and Library, which is a big factor in the cultural and social life of the Reddy community in Hyderabad. The education of Telugu girls has received powerful impetus from his sympathy and organising capacity. Outside Hyderabad too, his silent influence has not been ineffective. The most astonishing features in the Raja Bahadur's life is the range of his beneficient activities and the perfect mystery in which they are shrouded. The fast is, he is not secretive but modest-modest by nature, preferring to be the power behind the throne instead of the occupant thereof. Th hasty judment he might look as a man of cold and reserved temperament. Reserved he is, but not cold. I have not come across a warmer heart or more generous impulses than the Raja Bahadur's. A true friend in private life, he is just as true a comrade in public.

He is popular with the Muslims as with the Hindus. In fact genuine Hindu-Muslim unity can be promoted only by people of the type of the Raja Bahadur who do not suffer from the inhibition of racial or religious animosities. He is a synthetic genius-a synthesis that is produced by mutual affection, and reconciliation, and not through attempts at absorption of one into the other by force or policy. He is the friend of the Muslims no less than of the Hindus or the Reddies for the simple reason that he places his loyalty and duty to His Exalted Highness and the Doninion above all other considerations.

I trust, that this fine life of the illustrious Raja Bahadur will find a wide and enthusiastic audience and that this silent heo of the Reddy race will continue to be, for generations to come, the healthy influence that he has been in the grateful appreciation of us all these many years.

May he enjoy many, many more years of nobel service to his state, country and community.

*(Sd) C.R. Reddy,*

ఈ సమాచారం సురవరం ప్రతాపరెడ్డి రచించిన రాజా బహద్దుర్ వేంకట రామారెడ్డి, ఓ.బి.ఇ. జీవిత చరిత్ర నుండి గ్రహించబడినది.

అనువుగానిచోట నధికుల మనరాదు
కొంచెమైన నదియు గొదువగాదు
కొండ యద్దమందు గొంచెమై యుండదా
విశ్వదాభిరామ వినురవేమ.

# డా॥ పెరుగు శివారెడ్డి



జననం : 1-1-1924

శివారెడ్డి గారు 1946లో మద్రాసు యూనివర్సిటీ నుండి యం.బి.బి.యస్. డిగ్రీ తీసుకున్నాడు. 1952లో కంటి వ్యాధి చికిత్సల విభాగంలో ఆంధ్రా యూనివర్సిటీలో యం.యస్. చేశాడు. హైదరాబాదు ఉస్మానియా మెడికల్ కాలేజిలో ఉద్యోగంలో చేరాడు.

1964లో టి.యల్. కపాడియా ఐబ్యాంకును స్థాపించాడు. ఇది దేశంలోనే ప్రథమం. స్వదేశ, విదేశ కాన్ఫరెన్సులలో దాదాపు 200 దాకా పత్ర సమర్పణ చేశాడు గ్రామీణ పేదలకు ఉచిత సహాయం చేయటానికి 500 ఐ క్యాంపులను చేశాడు. మొత్తంగా 2,50,000 కేటరాక్టు ఆపరేషన్లు చేసి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు.

1971లో 'పద్మశ్రీ' అవార్డును 1977లో "పద్మభూషణ్" బిరుదును, 1982లో ప్రతిష్టాత్మక డా॥ బి.సి. రాయ్ అవార్డును పొందాడు. కర్నూలులో 1990లో శివారెడ్డి పేరుపై ప్రభుత్వ కంటి ఆసుపత్రి నిర్మించబడింది. "చిరంజీవి ఐ బ్యాంకు" స్థాపించి నడుపుటకు సినిమా నటులు, పార్లమెంటు సభ్యులు శివారెడ్డి సలహా, సహకారం తీసుకున్నారు.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కంటి డాక్టరు రెడ్డికులం వారై వుండటం రెడ్డిజాతికే గర్వకారణం.

**ఇంటి ఆలువిడిచి ఇల జాఱకాంతల**
**వెంట తిరుగువాడు వెట్టివాడు**
**పంటచేను విడచి పఱిగ యేఱినయట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

## రేనాటి చంద్రుడు, రాయలసీమ దానకర్ణుడు


# బుడ్డా వెంగళరెడ్డి



బుడ్డా వెంగళరెడ్డి రేనాటి దానకర్ణుడు. రెడ్డిజాతికి మణిపూస. రేనాటి సీమకు ఉయ్యాలవాడ నారసింహారెడ్డి "సూర్యుడు"కాగా, బుడ్డా వెంగళరెడ్డి "చంద్రుడు". ఈయన కూడ ఉయ్యాలవాడకు చెందినవాడే. ఈయన 1822లో జన్మించి 1900లో స్వర్గస్తుడైనాడు.

బుడ్డా వెంగళరెడ్డి తండ్రి నల్లపరెడ్డి. తల్లి అక్కమ్మ (అంకమ్మ) వారికి ఈయన జ్యేష్టపుత్రుడు. వెంగళరెడ్డికి ఇరువురు భార్యలు. వారు వెంకటమ్మ, నాగమ్మ. నాగమ్మ చనిపోగా చెన్నమ్మను పెండ్లి చేసుకున్నాడు. దురదృష్టం వీరి ద్వారా సంతానం కలగలేదు. తనకున్న ఆస్తినీ, ఆస్తిపై ఆదాయాన్నంతా దానధర్మాలకే వినియోగించాడు.

క్రీ.శ. 1866 సంవత్సరం రాయలసీమలో ప్రత్యేకించి అనంతపురం జిల్లాలో పెద్దకరువు వచ్చింది. అది "ధాత" తెలుగు సంవత్సరం. ఈ ధాత కరువును రాయలసీమ ప్రజలు ఇప్పటికినీ మరచిపోలేదు. అపుడు మన మిగత జిల్లాలలో కూడ కరువు ఏర్పడింది. ప్రజలు వేలాదిగా వలసపోయారు. రోజూ వందలకొలది ప్రజలు ఉయ్యాలవాడకు వచ్చారు. వచ్చిన వారందరికి లేదనకుండా భోజనాలు వండించి పెట్టాడు వెంగళరెడ్డి. అపుడు ఆయన వద్ద 12 పాతరల ధాన్యమున్నది. ఒక్కొక్క పాతరలో 120 బస్తాలు. మొత్తం 1440 బస్తాలు ధాన్యమున్నది. ఆ ధాన్యం మొత్తానిని ఈ క్షామకాలంలో ఆరు నెలలు ప్రజల అన్నార్తికి వినియోగించాడు. ఆ వార్త బనగాన పల్లెకు వచ్చిన గవర్నరుకు తెలుపబడింది. ఆయన ఆశ్చర్యపడి ఉయ్యాలవాడకు వచ్చి అన్నదాన విశేషమును చూచి ఢిల్లీలోని వైస్రాయికి, ఇంగ్లండులోని మహారాణికి తెలియజేశాడట. ఆమెకూడ అబ్బురపడి ప్రభుత్వం తరపున ఈ క్రింది పటములోని "స్వర్ణ పతకానిని" వెంగళరెడ్డికి బహుకరించింది. దానికి ఒకవైపున ఇంగ్లీషులోను, రెండవ వైపున తెలుగులోను ఈ విధంగా పోతపోసి వున్నది. ఇంగ్లీషులో "Presented to Budda Vengala Reddy as a token of the high appreciation of Her Majesty's government of his munificent liberality to his destitute Country men in the famine of 1866" తెలుగులో రెండవ వైపున "1866 సంవత్సరములో సంభవించిన క్షామకాలమందు నిరాధారముగా వుండిన తన స్వదేశస్థులపట్ల జరిగించిన వుత్కృష్ట మయిన ఔదార్యమునకుగాను, హర్ మెజస్టీ రాణి గారి వల్ల, చేయబడిన శ్రేష్టమయిన గణ్యతకు ఆనవాలుగా బుడ్డా వెంగళరెడ్డి గారికి బహుమానము యివ్వబడ్డది". అది 20 తులముల బంగారమట. దానిని ఆయన తన దండచేతికి అలంకరించుకునేవాడట. అయితే దురదృష్ట వశాత్తు దానిని దొంగలు దొంగిలిచారట. కాని ఆయన ఆ విషయం ఎవరికీ చెప్పుకోలేదు.



**బుడ్డా వేంగళరెడ్డి గారికి విక్టోరియా మహారాణి బహుకరించిన బంగారు పతకం**

ఒకప్పుడు బనగానిపల్లెలోని కలెక్టరు ఆయనను చూడవచ్చి, ఎప్పుడూ తన దండచేతికి వుండే పతకము లేకపోవుటను గమనించి వత్తిడి చేసి అడుగగా దొంగిలించబడినదని చెప్పాడు. ఆ కలెక్టరు వెంటనే మద్రాసు గవర్నరుకు వ్రాసి వేరొక పతకమును తెప్పించి యిచ్చెను. ఇప్పుడు అది ఉయ్యాలవాడలో వారి వంశస్తుల వద్ద ఉన్నది. అది 10 తులముల బంగారముతో చేయబడింది. ఈ పతకంలో నాయకమణి వలె మధ్యనొక గుండ్రని బిళ్ళ, ఆ బిళ్ళ పైభాగాన విక్టోరియా మహారాణి కిరీటము, ముందు భాగాన ఇంగ్లీషులోను వెనుక భాగాన తెలుగులోను వెంగళరెడ్డి దాతృత్వమును ప్రశంసించు వాక్యములు ఉన్నవి. మధ్యనున్న గుండ్రని బిళ్ళకు రెండు వైపుల ఆరేసి చిన్న బిళ్ళలు అతుకబడి వున్నవి. ఇది ఇపుడు ఒక సంవత్సరం బుడ్డా శివారెడ్డి ఇంటిలో మరొక సంవత్సరము బుడ్డా దస్తగిరి ఇంటిలోను వుండునట. దీనిని 17-4-1966నాడు డా॥ తంగిరాల వెంకట సుబ్బారావుగారు (వీరగాధల పరిశోధకులు-బెంగుళూరు) తన "రేనాటి సూర్యచంద్రులు" గ్రంథం కోసం ఆ గ్రామానికి వెళ్ళి ఫోటోను కూడా తీసుకొని తన గ్రంథంలో 260వ పేజీ తరువాత ప్రచురించారు.

వెంగళరెడ్డి ఒక్కడుగా ఎప్పుడూ భోజనం చేయడు. ఆయనను చూచుటకు వచ్చు తండోపతండలతో కూడి భోజనం చేసేవాడు.

ఆయన పేదలకు అన్నదానము చేసేవాడు. కాని ధనముగా ఎవ్వరికీ ఇవ్వడు. ఒకవేళ ఇచ్చినా ఒక దమ్మిడీ ఇచ్చేవాడు. మానవుని ప్రాణములను నిలుపునది పరబ్రహ్మ స్వరూపమగు అన్నమేనని ఆయన భావన. అయితే బ్రాహ్మణులకు మాత్రం భక్తితో, గౌరవంతో ధనం కూడ

ఇచ్చేవాడట. ధనం కోసం వచ్చే బిచ్చగాండ్రు మాత్రం "బుడ్డా యెంగల్‌రెడ్డి దమ్డీ దమ్డీ, యెన్నాళ్ళు బతికినా దమ్డీ దమ్డీ" అని పాట పాడి దమ్మిడీలు తీసుకునేవారట.

ఆయన కిచ్చిన బంగారు పతకాన్ని బిచ్చగాళ్ళైనా గాని, భోజనము చేయువారైనా గాని కళ్ళకద్దుకునేవారట. చూపులేనివారు దానిని స్పృశించి ప్రార్థించుకునేవారట.

కొన్ని దానధర్మ వివరాలు తెలుసుకొందము. ఒక బ్రాహ్మణుడు వచ్చి మజ్జిగ నడిగాడట. వెంగళరెడ్డి భార్య లేవన్నదట. ఆయన విని ఇంటిలోనికి వెళ్ళి చూడగా మజ్జిగ వున్నవి. మరల ఆ బ్రాహ్మణుని పిలిచి పంచభక్ష్యపరమాన్నాలు పెట్టి, మజ్జిగ లేనిచో మనకు ఆవులెందుకని ఒక పాడియావును బ్రాహ్మణునికి దానం చేశాడట.

భిక్షమునకు వచ్చిన ఒక పకీరు స్త్రీకి వెంగళరెడ్డి పట్టుచీర యిచ్చాడట. దానిని దొడ్డిదారిన వచ్చిన ఆయన భార్య తీసుకొని నూలు చీర యిచ్చిందట. తెలిసి బాధపడి మరొక పట్టుచీరను నేయించి ఆమెకు యిచ్చి సకల మర్యాదలు చేసి పంపాడట.

రెడ్డి ఒకసారి మద్రాసుకు వచ్చిన బ్రిటిషురాణి దగ్గరకు గుర్రంపై వెళ్ళాడు. ఆమె ఏడువేల రూపాయలిచ్చింది. వాటిని సభాప్రాంగణం దాటి వచ్చేలోపలే దానం చేశాడట.

ఇదే విధమైన దాన ధర్మాల కధలు వేనకువేలుండేవట. ఈరోజుకూ గ్రామాలలో వెంగళరెడ్డిని గురించి పాడుకునే జానపదం ఒకటి ఇలావుంది.

**"హరినారాయణ అన్న వారికీ – అన్నవస్తరము లిప్పించెనయా**
**గోయిందాయని పాడే జనులకు – గోవుదానమే చేసెనయా**
**పాలులేని పసిబాలురకెల్లా – పాల సలేంద్రలు పెట్టెనయా**
**పెళ్ళిళ్ళు కాని బీద జనులకు – పెళ్ళిళ్ళు సేయించెనయా**
**కాలులేని కరమొండివాళ్ళకు – ఒంటెద్దు బళ్ళు సేయించెనయా**
**కుంటివాళ్లకూ గుడ్డివాళ్ళకు – ఈడూ జోడు మనుములు సూసీ**
**పెళ్ళిళ్ళూ సేయించెనయా – పెళ్ళిళ్ళే సేయించెనయా**

**పుణ్యం సేసిన యెంగళరెడ్డికి – పూలపానుపే వచ్చునయా**
**మాటా సొచ్చం తెలిసిన ప్రెబువని – మల్లెపూల పాన్పేతురయా"**

ఆయన అదృష్టం ఏమంటే వృద్ధాప్యబాధలు ఏమాత్రం లేకుండా, ఒకరోజు క్షురకర్మ చేయించుకొని, కుర్చీమీద కూర్చుండి చమురు పెట్టించుకొని స్నానము చేయబోయి, నీళ్ళు తోడమని భార్యకు చెప్పి కుర్చీలో కూర్చుండి ఆమె నీళ్ళుతోడి వచ్చేసరికే కుర్చీమీదనే ప్రాణం వదిలాడు. అంతటి దివ్యమరణం ఆయనకు సంభవించింది.

ఉయ్యాలవాడలోని వెంగళరెడ్డిగారి వంశీకుల వారి కడ నేటికీ ఈ దాతృత్వమున్నది. ప్రతి సంవత్సరం ఉగాది పండుగనాడు వెంగళరెడ్డి సమాధి దగ్గర కుంటి, గ్రుడ్డి వారికి పంచభక్ష్యపరమాన్నములతో గొప్ప అన్నదానం జరుగుతుంది. బస్తాలు బస్తాలు బియ్యం వండి ప్రజలకందరికి అన్నదానం చేస్తారు.

**పలు తొడవులు వేరు బంగార మొకటి**
**బరగ ఘటములు వేరు ప్రాణ మొకటి**
**అరయ తిండ్లు వేరు యాకలి ఒకటి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చిక్కియున్నవేళ సింహంబునైనను
బక్కకుక్క కఱచి బాధ చేయు
బలిమి లేనివేళఁ బంతంబు చెల్లదు
విశ్వదాభిరామ వినురవేమ.

# గుణంపల్లి పుల్లారెడ్డి

**(నేతి మిఠాయి పుల్లారెడ్డి)**



జననం : 10-1-1920

మరణం : 9-5-2007

పేరు పుల్లన - మనసు తీయన.

మిఠాయిలు చేసేది నేతితో - వ్యాపారం చేసేది నీతితో. ఇది గుణంపల్లి పుల్లారెడ్డిని గురించి వాడుక మాట.

పుల్లారెడ్డి కర్నూలు జిల్లా గోకవరం గ్రామస్తుడు. గోకవరం కర్నూలుకు 61 కి.మీ. దూరం. దిగువ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. తండ్రి హుసేన్‌రెడ్డి, తల్లి పుల్లమ్మ @ లక్ష్మమ్మ. భార్య నారాయణమ్మ, సంతానం ఈశ్వరరెడ్డి, వరలక్షమ్మ, రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏకాంబరేశ్వరరెడ్డి, అన్నపూర్ణ. ఆయనకు ఐదుగురు తోబుట్టువులు. వారు నాగిరెడ్డి, పెదపుల్లారెడ్డి, నాగమ్మ, నారాయణరెడ్డి, రత్నమ్మ.

1వ తరగతి గోకవరంలో చదివాడు. ఆ తరువాత మంచి చదువు కోసం చిన్నాయన కసిరెడ్డి వెంకటరెడ్డి, చిన్నమ్మ శాలమ్మ గారల వద్దకు కర్నూలుకు పంపారు. అక్కడ అల్లరి చిల్లరగా తిరిగాడు. అయిదు బడులలో 5వ తరగతి వరకు చదివాడు. తిరిగి గోకవరం వచ్చాడు. తండ్రి వ్యవసాయం పనులు చెప్పాడని చెప్పకుండా 61 కి.మీ. నడుచుకుంటూ కర్నూలు చేరాడు. తరువాత చదువు లేదు. చిన్నాయన బంగారు కొట్లో నెలకు రూ. 8/- జీతంతో పనికి కుదిరాడు.

అక్క కూతురు నారాయణమ్మతో పెండ్లి జరిగింది. పోషణ లేదు. ఓలి కట్టలేనంటే సగానికి తగ్గించి ఇల్లరికం ఉంటాడని అపద్ధర్మ అబద్ధంతో పెండ్లి జరిగింది. సాయం చిన్నాయనే. బ్రతుకు హీనమైంది. అవమానాలు పడ్డాడు. సొంతంగా కష్టపడి బ్రతకదలిచాడు.

చిన్నాన్న గుమస్తా వద్ద రు. 25లు అప్పుచేసి, వస్తువులు కొని ఒకచేతిలో టీ కెటిల్ ఒకచేతిలో కప్పులు నీళ్ళ బక్కెట్ పట్టుకొని వీధులలో టీ అమ్మాడు. 60 కప్పులు టీ అమ్మితే రూపాయి మిగిలేది. ఒక కొట్టు అద్దెకు తీసుకున్నాడు. అద్దె నెలకు రు. 7/- టీతో పాన్, బీడీ, సిగిరెట్ అమ్మాడు. ఎండలకాలం మజ్జిగ అమ్మాడు. వ్యాపారం సాగుతుంది. కొంతకాలానికి రూ. 240/-లు మిగిలాయి.

ఒక భాగస్తుణ్ణి కలుపుకొని బట్టల వ్యాపారం చేశాడు. ఎద్దులబండి (బాడుగకు) పై బట్టల మూటలు వేసుకొని ఊరూర తిరిగాడు. భాగస్తుడి చేతిలో మోసపోయాడు. మళ్ళీ కష్టాలు.

1947లో చిన్నమ్మ కాలం చేసింది. చిన్నాన చేరదీసి వెయ్యి రూపాయలిచ్చి కర్నూలులో 1948లో నేతి మిఠాయి అంగడి పెట్టించాడు. రోజూ పగలు మిఠాయి తయారుచేసి సాయంత్రం

6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు భార్యాభర్తలిద్దరూ మిఠాయిలు అమ్ముకునే వాళ్ళ. 100 కేజీల చక్కెర బస్తా తానే మోసి అర్ధరూపాయి కూలీ మిగిల్చిన జాగ్రత్త ఆయనది. వ్యాపారం బాగసాగుతుంది.

ఆంధ్రరాష్ట్రం వచ్చింది. కర్నూలు తాత్కాలిక రాజధాని అయింది. బంగళాల్లో, విందుల్లో, మీటింగుల్లో నేతి మిఠాయి సరఫరా పెరిగింది. ఆర్డర్లొచ్చాయి. 5 సంవత్సరాలలో వ్యాపారంలో పట్టు దొరికింది. తిరుపతిలో స్వామివారి లడ్డూలు తయారీకి పుల్లారెడ్డి సలహాతో పాకం మారింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వచ్చింది. హైదరాబాదు రాజధాని అయింది. 15.8.1957న హైదరాబాదులో అబిడ్స్ సెంటరులో ఒక అంగడి (అద్దెకు) తెరిచాడు. స్వచ్ఛమైన తన నేతిమిఠాయికి హైదరాబాదులో పేరొచ్చింది. రాష్ట్ర సరిహద్దులు కూడా దాటింది. జాతీయ స్థాయికి పాకింది. యూరప్, మలేసియా, నేపాల్ వగైరా దేశాలకూ పోయింది. ఎక్కడ ఏ దేశంలో హిందువులుంటే అక్కడ పుల్లారెడ్డి నేతిమిఠాయి వుండేది. ప్రతి సత్కార్యంలో, రాజభవన్‌లో, నాయకుల మీటింగులలో, పెళ్ళిళ్ళు, డిన్నర్లు, విదేశీ అతిథులు, విదేశీ ప్రయాణాలలో, విదేశాలలో విందుల్లో పుల్లారెడ్డి మిఠాయి తప్పకుండా ఉండేది. కోట్లు సంపాదన. పెండ్లినాడు మామను (బావను) కోటు అడిగితే ఇల్లే లేదు కోటెక్కడ తగిలిస్తావు అన్న బావ ఈ కోట్లు చూసే వుంటాడు. అయినా పుల్లారెడ్డి తన ప్రథమ జీవితంలోని పేదరికం, శ్రమకున్న విలువ, మజ్జిగ, టీ అమ్మకం మరచిపోనేలేదు.

60 సంవత్సరాలకు పైగా మిఠాయిల వ్యాపారం అద్భుతంగా జరిగింది. అందుకు తనకు స్వయంకృషి మీద నమ్మకమే కాక, తన నిరాడంబరతే కాక, తన నిర్దిష్టతే కాక చిన్నాయన వెంకటరెడ్డి చెప్పిన ఆరు సూత్రాల అనుసరణ ఈ అద్భుతానికి తెచ్చింది. ఒకటి : తాను తినేదే పనివాళ్ళకు పెట్టాలి. రెండు : ముడి సరుకు స్వయంగా కొనాలి. మూడు : తన మిఠాయిని తాను ముందు రుచిచూసి బాగుంటేనే అమ్మాలి. నాలుగు పరిశుద్ధి – వాక్శుద్ధీ ఉండాలి. ఐదు : అందరికీ ఒకే ధరకమ్మాలి. ఆరు : తూకంలో తప్పుండ రాదు. ఇవి చివరంటా పాటించాడు. పెద్దవాడయాడు. కార్ఖానాలు కూడి వచ్చాయి. గోడౌన్లొచ్చాయి. మోటారు వాహనాలొచ్చాయి.

పుల్లారెడ్డి నిరాడంబరుడు. పిసినారి కాదు. ఎప్పుడూ ఖద్దరే వాడతాడు. ఇల్లు రెండు గదులుది. పిల్లలు వేరిళ్ళలో వుంటారు. ఎ.సి. వుండదు. ఇంటిగేటుపై కుడివైపు "మధురము" అని, ఎడమవైపు పుల్లారెడ్డి అని నామ ఫలకాలుంటవి. కేవలం జీవించటానికే ఇల్లు. దానిలో ఆయనే స్వయంసేవకుడు. అన్నింటిలో ఆయన భార్య మనసే ఆయనకు సంపద. Wife is wealth అంటుంటాడు. హైదరాబాదులో నాలుగు, కర్నూలులో మూడు మిఠాయి కొట్లు. ఒక్క హైదరాబాదులోనే రోజుకు రెండు టన్నుల మిఠాయి అమ్మకం. ఒకప్పుడు సైకిలు లేని పుల్లారెడ్డికి తన చివరి రోజులకు 10 కార్లు 20కి పైగా బస్సులున్నవి. వ్యాపారానికి అంతుండాలని చుక్క పెట్టాడు. "నా స్వయం పర్యవేక్షణ లేనంత వ్యాపారం నేను చేయను" అన్నాడు. నాణ్యత కోసం చేస్తానంటాడు. సంతృప్తి పడ్డాడు.

ఆయన చరిత్ర ఇంతవరకే అయితే మనం చెప్పుకునేది ఏమీలేదు. శ్రమించాడు – సంపాదించాడు. ఎవరేం చెప్పుకోవసిందేమీ లేదు. పుల్లారెడ్డి జీవితం అలాంటిది కాదు.

తన మొదటి రోజుల జీవితం తన రక్తంలో ప్రసరిస్తూనే వుంది.

కోటీశ్వరులు, చదువులు బాగా చదివినవారు కోట్లలో వుండవచ్చు.

కేవలం స్వయంశక్తిపై ఆధారపడి కోటీశ్వరుడై సంపాదించిన సొమ్మును నలుగురి అభ్యుదయానికి, సామాజిక సేవకు వెచ్చించినవారు కొందరే వుంటారు. "చెలమలో నీరు తోడితేనే కొత్తనీరు వచ్చేది" అంటాడు పుల్లారెడ్డి. ధర్మం చేసినకొద్దీ సలక్షణంగా ఉంటామనే నమ్మకం ఆయనది. మన చేతులతో మనమే చేసుకుందాం, మనకాళ్ళపై మనం నడుద్దాం, మంచి పనికి మన మనసును ఉపయోగపెడదాం అంటాడు. నిజాయితీగా బ్రతుకుదాం అంటాడు. పుల్లారెడ్డి గారికి, సారధి, సచివుడు, బంధువు, గురువు ఆయన చిన్నాన్న వెంకటరెడ్డి. ఆయన పుల్లారెడ్డికి వెలుగుబాట.

పుల్లారెడ్డికి నిర్విరామకృషి, నీతి – నిజాయితీ, సమాజ పరమేశ్వరసేవ, ప్రాథమిక సూత్రాలు. ఆయన అభివృద్ధికి ముగ్గురు మూలకారకులు. కసిరెడ్డి వెంకటరెడ్డి (చిన్నాన్న). నారాయణమ్మ (భార్య), ఆర్.వి. శేషాచార్యులు (స్నేహితుడు).

పుల్లారెడ్డి పుణ్యపురుషుడు తెలుగు గడ్డ మణికిరీటం, అభినవ కర్ణుడు, కర్మయోగి, "దానగుణభూషణ" బిరుదాంకితుడు. My donation is my investment అని "ఈ డబ్బు సమాజానిది – నాకు అవసరమైనంత నాది". "చెలమలోకి నీళ్ళు తోడుతుంటేనే ఊరుతుంటాయి" అనేవి ఆయన నమ్మిన విశ్వాసాలు, విధానాలు. డబ్బు కూడబెట్టడం, షేర్లు, బంగారం కొనటంపై ధ్యాసపెట్టలేదు. ఆయన సనాతన ధర్మపరిరక్షణ, విద్యాసేవ, వైద్యసేవ, దరిద్ర నారాయణ సేవ తన కర్తవ్యాలుగా భావించాడు. ధార్మిక భావనలెక్కువ. ఒక ధార్మిక సంస్థనేర్పాటు చేశాడు. విశ్వహిందూ పరిషత్ పశ్చిమాంధ్ర ప్రాంత అధ్యక్షునిగా, పరిషత్తు అఖిల భారత స్థాయి కోశాధికారిగా పనిచేశాడు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా 23 సం॥లు పనిచేశాడు. రాష్ట్రీయ స్వయంసేవక్ సమాజ్, విశ్వహిందూ పరిషత్తు, భారత వికాస పరిషత్తు, సరస్వతీ విద్యా పీఠము, సంస్కృత భాషా ప్రచార సమితి వగైరాలు ఆయన చలవ చేతితో నడిచేవే.

ఇదంతా ఒక ఎత్తైతే ఆయన సేవాకార్యక్రమాలు మరొక ఎత్తు. కోట్లరూపాయలు విరాళాలకు పోతాయి. అడగనివాడు దురదృష్టవంతుడు. శుభకార్యాలు, ఉత్సవాలు, పుస్తక ప్రచురణలు లెక్కేలేదు. ఏవిధమైన గుర్తింపుగాని, పేరుగాని ఆయన కోరుకోలేదు. నేరుగా ప్రజల్లోకే పోయాడు.

అనాధ పిల్లల సేవార్ధం కర్నూలులో విజ్ఞానపీఠం స్థాపించాడు. వారికి ఉచిత ఆశ్రయం, ఉచిత చదువు ఇచ్చాడు. 100/200 మంది పిల్లలుంటారు ఏటా ఆ పీఠంలో.

తన క్రింద పనిచేసే 100 కుటుంబాలకు ఉచిత గృహవసతులు, వారి పిల్లల ఉచిత చదువులు ఆయనే చూస్తాడు. ఇదెవ్వరికైనా సాధ్యమా! ఎంత గొప్ప హృదయము!.

న్యూసిల్వేనియా ఉన్నత పాఠశాల, జి. పుల్లారెడ్డి జూనియర్ కళాశాల, జి. పుల్లారెడ్డి డిగ్రీ కళాశాల, జి. పుల్లారెడ్డి పార్మశీ కాలేజి, డెంటల్ కళాశాల, జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, భార్య నారాయణమ్మ పేరుతో బాలికల జూనియర్ కళాశాల సంస్కృత భాషా సమితి, కర్నూలు వద్ద అనాధాశ్రమం, విశ్వహిందూ పరిషత్తు విజ్ఞాన పీఠం, వివేకానంద బాలవిద్యామందిరం, పుల్లారెడ్డి హైస్కూలు. వీటన్నిటికీ బస్సులు, హాస్టళ్ళు, హాస్పిటలు వీటన్నింటి

ఖర్చు పుల్లారెడ్డే భరిస్తాడు. 70 కోట్లు విలువజేసే అబిడ్స్‌లోని తన మిఠాయి షాపు ఎదురుగా వున్న 1200 చ.గజాల స్థలాన్ని హరేరామ హరేకృష్ణ మందిర నిర్మాణానికి ఇస్కాన్ వారికి ఉచితంగా ఇచ్చాడు. గుప్తదానాలు లెక్కేలేదు. ఎక్కడికి పోయినా ఎడమజేబులో దానధర్మాలకు నోట్లకట్టలతో వెళతాడు. కుడిజేబులో వాటి రబ్బరు బ్యాండ్లు ఉంటాయి. ఇంత కంటె గొప్పగా ప్రజాసేవా కార్యక్రమాలు ఎందరు చేయగలరు?

పుల్లారెడ్డి నిజాయితీపరుడు, నిగర్వి, దానశీలి, మానవతావాది, సామాజిక సేవా పరాయణుడు, ఆదర్శప్రాయుడు. కృషితో నాస్తి దుర్భిక్షం ఆయన నమ్మిన సత్యం.

అందుకే ఆయనకు పుట్టపర్తి సత్యసాయిబాబా, విశ్వహిందూ పరిషత్తు ప్రపంచ స్థాయి నాయకులు, దేశనాయకులైన ఎల్.కె. అద్వానీ, అశోక్ సింఘాల్, వి.వి. గిరి, జ్ఞాని జైల్‌సింగ్, వాజ్‌పేయి, త్రివేది, నీలం సంజీవరెడ్డి, సంజీవయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి, అంజయ్య, ఎన్.టి. రామారావు వగైరా పెద్దలందరితో పరిచయాలున్నవి.

రేనాటి చంద్రుడుగా పేరొందిన బుడ్డా వెంగళరెడ్డికి, ఈయనకు ఇద్దరికీ ఎముకలు లేని చేతులే. ఒక చేయి చేసిన దానం మరొక చేతికి తెలియదు. ఒక్కటే తేడా వుంది. వెంగళరెడ్డి పెద్దలిచ్చిన ఆస్తులను, వాటిపై ఆదాయాలను పేదలకు దానాలు చేస్తే పుల్లారెడ్డి తాను సంపాదించుకున్న కోట్లు ప్రజానీకానికి సేవా కార్యక్రమాలకు, ధార్మిక కార్యక్రమాలకు వినియోగించాడు.

పుల్లారెడ్డిది మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోదగిన తియ్యందనము; అదే రెడ్డి తనము.

**తనువు ఎవరిసొమ్ము తనదని పోషింప**
**ధనము ఎవరిసొమ్ము దాచికొనగ**
**ప్రాణము ఎవరిసొమ్ము పాయకుండగ నిల్ప**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# తిక్కవరపు రామిరెడ్డి



జననం : 16-3-1891
మరణం : 9-12-1973

రామిరెడ్డి గారిది నెల్లూరు. ధనిక కుటుంబం. తండ్రి లక్ష్మినారాయణరెడ్డి, తల్లి మీనమ్మ. భార్య సుదర్శనమ్మ. ఒక పండితుని వద్ద సాంప్రదాయ విద్యనభ్యసించాడు. సాహిత్యంపై అభిరుచి కలిగింది.

1921లో గాంధీ ఆధ్వర్యంలో సాగిన సహాయనిరాకరణోద్యమంలో పాల్గొని, అరెస్టు కాబడి ఏడాది కఠిన కారాగారశిక్ష అనుభవించాడు. తదుపరి కాంగ్రెస్ పార్టీ నిర్మాణ కార్యక్రమాలలో పాల్గొని ఇతోధిక సహాయం చేసేవాడు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీకి ప్రధమ కార్యదర్శిగా పనిచేశాడు.

1929 మార్చి నుండి 1930 జూలై వరకు నెల్లూరు పురపాలక సంఘాధ్యక్షుడుగా వ్యవహరించాడు. అపుడు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న సత్యాగ్రహుల పట్ల బ్రిటీషు ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి నిరసనగా ఆ పదవికి రాజీనామా చేశాడు.

రామిరెడ్డి వ్యాపారదక్షులు. మైకా వ్యాపారంలో దిట్ట. లక్షలు సంపాదించాడు. లాభాల సద్వినియోగంలో నేర్పరి. భార్య సుదర్శనమ్మ పేరుతో కుష్టురోగ నివారణ కేంద్రాన్ని నెలకొలిపి లక్షా పదివేలు ధర్మంగా ఇచ్చాడు. ఆయాసుపత్రిలో 40 పడకలకయే ఖర్చును ఆయనే భరించాడు.

పశువైద్యశాలలో పరిశోధనాగారాన్ని నిర్మింపజేశాడు.

కావలిలోని జవహర్ భారతి, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, కస్తూరిదేవి విద్యాలయం, వేద సంస్కృత పాఠశాల, చిన చెరుకూరులో పాఠశాల మరికొన్ని విద్యాసంస్థలకు ప్రాణవాయువులను సంతరించిపెట్టాడు. కందుకూరులో ప్రభుత్వ కళాశాలకు లక్షల విరాళాన్నిచ్చాడు. మద్రాసులోని త్యాగరాయనగర్‌లో విద్యోదయ పాఠశాలకు భవన నిర్మాణం చేయించాడు.

1935లో నెల్లూరులో కవిత్రయ జయంతిని ప్రారంభించాడు. ప్రతి ఏడాది ఆ జయంతులు నిర్వహించాడు. ఆ ఉత్సవాలలో ఒక్కో ఏడాది ఒక్కొక్క పండితునికి సత్కారం చేసే సంప్రదాయాన్ని ఏర్పాటు చేశాడు. ఇది నిరంతరం కొనసాగటానికి మూలధనం ఏర్పరచాడు. కవిత్రయ జయంతులలో పండితులు చేసిన ప్రసంగాలను "కవిత్రయ కవితా వైజయంతి"గా ప్రచురణ చేయించాడు.

ప్రముఖ పండితులు తమ గ్రంధాలను ప్రచురించుటకు దాతృత్వం చూపేవాడు. గడియారం వెంకట శేషశాస్త్రి, గుఱ్ఱం జాషువా, ఉడాలి సుబ్బరాయశాస్త్రి ఇలా ఒకరేమిటి లెక్కకు మించి చిన్న, పెద్ద రచయితలు పూర్తి ఆర్ధిక సహకారాలను, సన్మానాలను పొందారు.

రామిరెడ్డిగారిది ఎముకలేని చేయి. వితరణశీలి. గొప్ప సాహితీ పోషకులు.

ఇట్టి రెడ్డిగారు సాహిత్య పోషకులవటం రెడ్డిజాతికి సాహిత్యంపైగల ప్రేమ గౌరవాలను చాటుతుంది. రెడ్డిరాజుల వారసత్వాన్ని చాటుతుంది.

**స్త్రీలు గల్గుచోట చెర్లాటముగల్గు**
**స్త్రీలు లేనిచోట చిన్నబోవు**
**స్త్రీల చేత నరులు చిక్కుచున్నారయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కొంకణంబు పోవ గుక్క సింహముకాదు
కాశికరుగ బంది గజముకాదు
వేఱుజాతి వాఁడు విప్రుఁడు కాలేఁడు
విశ్వదాభిరామ వినురవేమ.

# సురవరం ప్రతాపరెడ్డి



జననం : 28-05-1896
మరణం : 25-08-1953

ప్రతాపరెడ్డిగారి తండ్రి నారాయణరెడ్డి, తల్లి రంగమ్మ, భార్య పద్మావతమ్మ.

రెడ్డిగారు మహబూబ్ నగర్ జిల్లా దక్షిణకాశి అనబడు ఆలంపూర్ శివారు ఇటికలపాడులో నారాయణరెడ్డి, రంగమ్మ గార్లకు తేది 28.05.1896న అమ్మమ్మగారి వూరు బోరవల్లిలో

జన్మించాడు. ఆలంపూర్ 18 శక్తిపీఠాలలో ఒకటిగా పేరొందింది. తనపేరు మొదట్లో పాపిరెడ్డి అని తరువాత బాల్యంలోనే ప్రతాపరెడ్డిగా పిలవబడ్డాడని కొన్నిచోట్ల చెప్పబడింది. పద్మావతమ్మతో వివాహం 1916లో జరిగింది. 1904లో కర్నూలులో AB మిషనరీ స్కూలులో చేర్చబడ్డాడు. తరువాత కోల్స్ మెమోరియల్ స్కూలులో చదివాడు.

మెట్రిక్యులేషన్ చదివి పైచదువులకు 1921లో హైదరాబాదుకు, మద్రాసుకు వెళ్ళి మద్రాసులో ప్రెసిడెన్సీ కాలేజిలో 1921లో బి.ఎ. చదివాడు. 1924లో బి.ఎల్. చదివాడు. కొంతకాలం అయిష్టంగానే లాయరుగా పనిచేశాడు.

"సురవరం" పేరు వారి పూర్వీకుల గ్రామమైన షోరాపూర్ నుండి వచ్చిందంటారు. వారి వంశవృక్షం ఇలావుంది. అచ్చన్నకు మనవడు ఎల్లారెడ్డి. ఎల్లారెడ్డికి మనవడు పాపిరెడ్డి. పాపిరెడ్డికి నలుగురు కొడుకులు. వారు వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, వెంగళరెడ్డి, రామకృష్ణారెడ్డి. నారాయణరెడ్డి కుమారుడు ప్రతాపరెడ్డి. తండ్రి నారాయణరెడ్డి సంస్కృతం బాగా చదివాడు. పినతండ్రి రామకృష్ణారెడ్డి కర్నూలులో సంస్కృత పాఠశాలను ప్రారంభించాడు. విద్యార్థులకు స్వంతంగా ఉచిత భోజన సౌకర్యాలు కల్పించాడు. స్వాతంత్రోద్యమంలో రామకృష్ణారెడ్డి గాంధీ గారిని కలిసినప్పుడు వెండి రాట్నాన్ని గాంధీకి బహుకరించాడు. తెలుగు, సంస్కృత పండితులతో సాహచర్యం చేశాడు. అదే దారిలో ప్రతాపరెడ్డి పయనించాడు.

1904 సంవత్సరంలో కర్నూలులో AB మిషనరీ ఎలిమెంటరీ స్కూలులో చేర్చబడ్డాడు. తరువాత కోల్స్ మెమోరియల్ స్కూలులో చేర్చబడ్డాడు. సంస్కృతం రెండవభాషగా చదివాడు. సంస్కృత గ్రంథాలు బాగా చదివాడు. మానపల్లి రామకృష్ణ కవి సలహా మేరకు సంస్కృత కావ్యాలైన ఉత్తర హరివంశం, దశకుమార చరిత్ర, భోజరాజీయము, రఘువంశము, కుమార సంభవము, కిరాతార్జునీయము, శుకసప్తతి, శృంగార శాకుంతలము, మార్కండేయ పురాణము, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, భారత ధర్మశాస్త్రాలు చదివాడు. వ్యాకరణం అభ్యసించాడు. చిలకమర్తి లక్ష్మీనరసింహం, కందుకూరి వీరేశలింగం గ్రంథాలను బాగా చదివాడు. కాని చిన్నప్పటి నుండి ప్రతి క్లాసులోను మొదటిసారి ఉత్తీర్ణుడు కాలేక రెండవసారి ఉత్తీర్ణుడయేవాడు.

హైదరాబాదులో చదవటానికి వెళ్ళినప్పుడు తెలుగుభాషకు పట్టిన దుర్గతికి చాలా చింతించాడు. అలానే మద్రాసులో చదివినప్పుడు తెలుగుభాషకు వచ్చిన ఇక్కట్లకు వగచాడు.

రెడ్డిరాణి వగైరా పత్రికలకు తెలుగులో వ్యాసాలు రాసి పంపాడు. తెలుగు భాషా వికాసానికి శ్రమించాడు.

పినతండ్రి పనుపున హైదరాబాదుకు చదువుకు వెళ్ళినప్పుడు నైజాం సిటీ పోలీసు కమీషనర్ (కొత్వాల్) రాజబహదూర్ వెంకటరామిరెడ్డి, పింగళి వెంకటరామిరెడ్డి గార్లతో పరిచయం ఏర్పడింది. రాజబహదూర్ వెంకటరామిరెడ్డి ద్వారా హైదరాబాదులో రెడ్డి హాస్టల్‌కు గౌరవ వార్డెన్‌గా పనిచేశాడు. అప్పుడు అది నైజాం రాజ్యం. నిరాపేక్షగా 8సంవత్సరాలు పనిచేశాడు. హాస్టల్ గ్రంథాలయానికి 12,000 పుస్తకాలు సమకూర్చాడు. గాంధీ సత్యాగ్రహంలో తాను పాల్గొన్నందున, సవార్కర్ వ్రాసిన వార్ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్సు పుస్తకం తాను పనిచేస్తున్న గ్రంథాలయానికి తెప్పించినందున కాంగ్రెస్ వ్యక్తిగా ముద్రపడి నైజాం ప్రభుత్వం వ్యతిరేకించినందున హాస్టల్ మేనేజిమెంట్ కమిటివారు ఆయనను వార్డెన్ పదవి నుండి తొలగించారు. స్వగ్రామం చేరి హిందువుల పండుగలు అనే పరిశోధనా గ్రంథం రాశాడు. తరువాత రాజబహదూర్ వెంకటరామిరెడ్డిగారి కోరికపై హైద్రాబాదులో లాయరుగా ప్రాక్టీసు పెట్టి ఆ వృత్తికి తాను జతపడక విరమించాడు.

సంఘ సంస్కరణోద్దేశంతో 1926లో రాజబహదూర్ వెంకటరామిరెడ్డి ప్రోద్బలం, సహకారంతో గోల్కొండ పక్షపత్రికను స్థాపించాడు. తెలుగువారు కూడ తెలుగు చదవని రోజులవి. తెలుగు భాష కోసం శ్రమించాడు. ఈ పత్రిక స్వాతంత్రోద్యమానికి మార్గదర్శకత్వం వహించింది మరియు తెలుగు భాషకు వెన్నుదన్నుగా నిలిచింది. ప్రతాపరెడ్డి తెలుగు యువ రచయితలను ప్రోత్సహించాడు. మహిళాభ్యుదయం కొరకు ప్రత్యేక శీర్షిక పెట్టాడు. 1947లో పత్రికకు సంపాదకత్వం స్వీకరించాడు. అప్పటినుండి అది దినపత్రికగా నడిపాడు. కాని తెలంగాణా నిజాం రాష్ట్రంలోని మేనేజిమెంటు వారు పెట్టిన షరతులకు లొంగక తప్పుకున్నాడు. అప్పటి వరకు తెలుగును ఆదుకోగలిగి నందుకు సంతోషించాడు. తెలుగు భాషకు, సాహిత్యానికి, సంస్కృతికి కాపలాదారుగా కాపుకాశాడు.

1929 నుండి ఆంధ్రమహాసభతో చేతులు కలిపి ముందుకు సాగాడు. మాడపాటి హనుమంతరావు, స్వామి రామానందతీర్థ, బూర్గుల రామకృష్ణారావు, కె.వి. రంగారెడ్డి వగైరా మేథావులతో కలిసి, వారి సహకారం తీసుకొని, సాంస్కృతికోద్యమం సాగించాడు.

1931–34లలో ఆంధ్రమహాసభకు కార్యదర్శియై నిజాం పాలనను వ్యతిరేకించాడు. నిజాం పాలనలోని తెలంగాణాలో తెలుగు భాష, సంస్కృతికి రెడ్డిగారు కాపలాదారు.

1941లో "విజ్ఞాన వర్ధిని పరిషత్"ను స్థాపించి దానికి కార్యదర్శిగా కొన్నాళ్ళు, అధ్యక్షునిగా కొన్నాళ్ళు పనిచేశాడు. అపుడు "రామాయణ విశేషములు" అనే గ్రంథం వ్రాయగా దానిని పరిషత్తు ప్రచురించింది.

26.05.1943న దేవులపల్లి రామానుజరావు, బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు గార్లతో కలసి తెలుగు భాషా పరిరక్షణ కోసం "ఆంధ్ర సారస్వత పరిషత్తు"ను స్థాపించారు. ఆ సమయంలో ఈనాటికి గొప్ప చరిత్ర గ్రంథమైన "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" వ్రాయగా దానిని ఆంధ్ర సారస్వత పరిషత్తు వారు 1949లో ప్రచురించారు. ఆ గ్రంధానికి 1955లో కేంద్ర సాహిత్య అకాడమీ జాతీయ బహుమతినిచ్చి గౌరవించింది. అదే సంవత్సరం మల్లంపల్లివారి "రెడ్డి రాజ్యాల చరిత్ర" కూడ ప్రచురించబడింది. రెడ్డిరాజుల కాలంలో సాంఘిక జీవనమును గూర్చి అపుడు వచ్చిన ముఖ్యగ్రంథాలలో ఈ "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" మేలుగా నున్నదని పెద్దలనెదరు. ఈ గ్రంధంలో తూర్పు చాళుక్య యుగము, కాకతీయుల యుగము, రెడ్డిరాజుల కాలము, విజయనగర సామ్రాజ్య కాలము ఇంకా 1907 వరకు గల ఆంధ్రుల సాంఘిక చరిత్ర గొప్పగా నిక్షేపించబడింది. ఇలానే గోల్కొండ కవుల సంచిక కూడ మరొక ఉత్తమ చరిత్ర గ్రంథమే.

గ్రంథాలయోద్యమంలో చురుకుగా పాల్గొని ఆంధ్ర లైబ్రరీ సోసైటికి వైస్– ప్రెసిడెంటు అయినాడు. పలు గ్రంథాలయాల వార్షికోత్సవాలలో పాల్గొని తెలుగుభాషకై పలు ఉపన్యాసాలు చేశాడు.

తెలుగు మాధ్యమంలో బోధనకు ఒక ఆంధ్ర పాఠశాల స్థాపింపజేసి 12 సంవత్సరాలు కార్యదర్శిగా పనిచేశాడు. 1944లో "ఆంధ్ర విద్యాలయం"ను స్థాపించి కార్యదర్శిగా దీర్ఘకాలం పనిచేయగా తరువాత అది కాలేజిగా వృద్ధిచెందింది. హైదరాబాదులో ఆంధ్ర బాలికల పాఠశాలను కూడ ప్రారంభించాడు.

రాజకీయాలలో ప్రవేశించి 1952లో కాంగ్రెస్‌పార్టీ శాసనసభ్యులుగా మహబూబ్ నగర్ జిల్లా వనపర్తి నియోజకవర్గం నుండి ఎన్నిక కాబడ్డాడు. తెలుగు భాష మాట్లాడే

వారందరి కోసం విశాలాంధ్ర కావాలని వాదించాడు. అది ఆయన మరణానంతరం 1956లో నిజమైంది.

శ్రీరెడ్డిగారు గొప్ప సాహితీకారుడు. ఆంధ్రుల సాంఘిక చరిత్రేకాక భ్రమర విషాదము, హరిశర్మ ఉపాఖ్యానము, ప్రేమార్పణము, హంవీర సంభవము మొదలైన దీర్ఘకవితా కావ్యాలే కాక ఉచ్ఛల విషాదము, భక్తతుకారాం నాటకాలు రాశారు. వందల కొలది వ్యాసాలు, నవలలు, కథానికలు వ్రాసి తెలుగు భాషను సంరక్షించాడు. హైందవ ధర్మవీరులు, సంఘోద్ధరణము, గ్రామజన దర్పణము, హిందువుల పండుగలు, రామాయణ విశేషములు మొదలైన గ్రంధాలు సామాజిక దర్పణాలే.

నిఘంటు నిర్మాణమునకు కృషి చేశారు. శబ్దరత్నాకరము, ఆంధ్రవాచస్పత్యము, ఇతర నిఘంటువులలో లేని కొన్ని పదములకు తనకు తోచినయర్థాలను వ్రాశాడు. సూర్యరాయాంధ్ర నిఘంటువునకు పొడిగింపును తయారు చేశాడు.

మహాకవి డా॥ సి. నారాయణరెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి గారిని గురించి ఇలా సంభావించారు. **"అతడు ప్రతాపరెడ్డి; యిరులై పడియున్న తెలుగువారి గుండె తెరల దుల్పి వెల్గులను నిల్పిన మిత్రుడు! మూర్ఛవోయినట్టి తెలుగుజాతి సంస్కృతికి టీకలు దీసిన మల్లినాథుడెన్ని తరములైన ప్రాతవడ నేరని సృష్టికి నాద్యుదాతడే".**

తెలుగు భాషకోసం, తెలుగు జాతికోసం, సర్వస్వం అర్పించిన త్యాగి. రెడ్డితనం కలిగిన కులశ్రేష్టి. ఎన్నటికీ మరువ సాధ్యంకాని మహామనీషి.

**ఆ.** **జనన మరణములకు సరి స్వతంత్రుఁడుగాడు**
**మొదలు కర్తగాడు తుదనుగాడు**
**నడుమ కర్త ననుట నగుబాటు కాదొకో**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పరగ ఱాతిగుండె పగులగొట్టవచ్చు
గొండలన్ని పిండి గొట్టవచ్చు
కఠినచిత్తు మనసు కరిగింపరాదు
విశ్వదాభిరామ వినురవేమ.

# డా॥ సర్ కట్టమంచి రామలింగారెడ్డి



జననం : 10-12-1880
మరణం : 24-02-1951

రామలింగారెడ్డి గారిది చిత్తూరు జిల్లాలోని (ఇపుడు చిత్తూరులో అంతర్భాగమైన) కట్టమంచి గ్రామం. వ్యవసాయ కుటుంబం తండ్రి సుబ్రహ్మణ్యరెడ్డి ప్రముఖ న్యాయవాది. ఆయనకు కవిగా, పండితునిగా ఎక్కువకీర్తి. వారి కుటుంబంలోని ప్రతివ్యక్తీ రామాయణ

భారతాలు చదివిన వారే. రామలింగారెడ్డిని చిన్నప్పటి నుండి మహాభారతం ఎక్కువగా ఆకర్షించి దానిలోని పద్యాలకు వ్యాఖ్యలు చెప్పేవాడు.

స్వగ్రామంలో ప్రాథమిక విద్య. చిత్తూరులో ఉన్నత పాఠశాల విద్య, (1896-యస్.యస్.ఎల్.సి) మద్రాసు క్రైస్తవ కళాశాలలో చరిత్ర తత్వశాస్త్రంలో బి.ఎ. (1902లో) చదివాడు. భారతప్రభుత్వ ఉపకార వేతనంతో ఇంగ్లండులో ఉన్నత విద్య కోసం వెళ్ళాడు. కేంబ్రిడ్జిలో సెయింట్ జాన్స్ కళాశాలలో చేరి తన ప్రతిభను చూపి ఎగ్జిబిషన్, రైట్ బహుమతులను గెల్చుకున్నాడు. కళాశాల ధర్మాదాయాన్ని పొందే విద్యార్థిగా అర్హతను పొందాడు. అచట చరిత్రలో బి.ఎ. (ఆనర్సు) చదివాడు. అర్థ, తత్వశాస్త్రాలలో కూడ ప్రవేశం సంపాదించుకున్నాడు.

1905లో రామలింగారెడ్డి కేంబ్రిడ్జ్ లిబరల్ క్లబ్ కార్యదర్శిగా ఎన్నికైనాడు. తర్వాత కేంబ్రిడ్జ్ యూనియన్‌కు ఉపాధ్యక్షుడైనాడు. అదొక గొప్ప గౌరవం. ఆ గౌరవానికి ఎంపికైన ప్రథమ భారతీయుడు కూడ ఆయనే. ఆ తరువాత కొన్ని దశాబ్దాలకు కుమారమంగళం (భారతీయుడు) ఆ యూనియన్‌కు అధ్యక్షుడైనాడు. మేథావులతో పరిచయం పెంచుకున్నాడు. అసలే సంభాషణా చతురుడు.

రామలింగారెడ్డి 1908లో భారతదేశానికి తిరిగివచ్చి బరోడా కళాశాలలో అధ్యాపకునిగా చేరాడు. ఆయనకున్న వాక్చాతుర్యము, ఉపన్యాసకేసరీయత వలన అధ్యాపకునిగా ఆహ్వానింప బడ్డాడు. లాయరు కావాలనుకుని కొంత ఆలోచించి అధ్యాపక వృత్తి స్వీకరించాడు. తరువాత కలకత్తాలో జాతీయ కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్ అయాడు. ఆచార్యులుగానూ చేశాడు. ఆయనకున్న మాతృభాష, ఇంగ్లీషుభాషా ప్రావీణ్యాల వలన పలుచోట్ల అవకాశాలొచ్చాయి. రామలింగారెడ్డి ఉపన్యాసాల మాయాజాలానికి ఆకర్షితులైన వారిలో కె.ఎమ్.మున్షీ గారొకరు.

1909లో విశ్వవిద్యాలయాల సంస్కరణలపై ప్రసంగిచటానికి మైసూరు సంస్థానపు దివాన్ సర్ వి.పి.మాధవరావు ఆహ్వానించారు. ఆయన ఉపన్యాసం విన్నంత మైసూరు సంస్థానం ప్రభావితమై మైసూరు సంస్థాన సర్వీసులో చేర్చుకున్నారు. ఆ సమయంలోనే మైసూరు యువరాజాతో పాటు ఐరోపాలో వివిధ విశ్వవిద్యాలయాల పనితీరు తెలుసు కునేందుకు వెళ్ళి అవకాశం సద్వినియోగం చేసుకున్నాడు. విశ్వవిద్యాలయ ప్రణాళిక

రాజాగారికిచ్చాడు. 1915లో ఆ ప్రణాళికతో మైసూరు విశ్వవిద్యాలయం స్థాపించగా 1916లో మైసూరు విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ అయ్యాడు. ఆ విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖను ప్రారంభించి శ్రీ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారిని తెలుగు పండితునిగా నియమించాడు. 1918 నాటికి రాష్ట్రేతర వ్యక్తి అయినా గాని మైసూరు రాష్ట్రానికి ఇన్‌స్పెక్టరు జనరల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా రాజాగారు నియమించారు. పాఠశాలలు లేని గ్రామాలన్నింటిలో పాఠశాలలు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. పాఠశాలల్లో హరిజనులకు ప్రవేశాలు కల్పించాడు. అది ఒక అభ్యుదయ చర్య. అంతేగాక ఆసమయంలో భారత అర్ధశాస్త్రం గ్రంథం వ్రాయగా దానిని మద్రాసులోని విజ్ఞాన చంద్రికామండలి 1914లో ప్రచురించింది. స్వంత రాష్ట్రానికి వచ్చే తలంపుతో 1921లో ఆశ్చర్యకరంగా అచట రాజీనామా చేశారు. వారు హతాశులైనారు.

1921లో దేశమంతా స్వాతంత్ర్యోద్యమంలో చేరివుంది. పొరపాటుగా జస్టిస్ పార్టీలో చేరి, తెలుసుకుని వైదొలిగాడు. తరువాత యునైటెడ్ నేషనల్ పార్టీ స్థాపించి రాజాపానగల్ మంత్రివర్గంపై విమర్శల వర్షం కురిపిస్తూ ప్రజల్లోకొచ్చాడు. విద్యకు తక్కువ నిధులను కేటాయించటంపై విమర్శలెక్కువ చేశాడు. ముఖ్యమంత్రి పానగల్ రాజాపై విరుచుకుపడ్డాడు. ఆంధ్రవిశ్వవిద్యాలయం స్థాపనకు వత్తిడి చేశాడు.

1925లో ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపించబడింది. దానికి రెడ్డిగారినే ప్రధమ ఉపాధ్యక్షుని చేశారు.

ఉపాధ్యక్షునిగా ప్రథమంలో బెజవాడ నుండి విధులను నిర్వర్తించేవాడు. బెజవాడను బ్లేజ్‌వాడ అనేవాడు. ఆంధ్రవిశ్వవిద్యాలయంకు అన్నీ తానే అయినాడు. విశ్వవిద్యాలయానికి వాల్తేరు అప్‌ల్యాండ్స్ అనువైనదిగా నిర్ణయించాడు. నిబంధనలు మొదలు చిహ్నాన్ని, ధ్యేయాన్ని తానే రచించాడు. చిహ్నంలో "తేజస్వినా వధీతమస్తు" అని చేర్చి విద్యపై తనకున్న గౌరవాన్ని వెల్లడించాడు.

ఉపాధ్యక్షుడుగా ఉంటూనే సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని అతివాదాన్ని వ్యతిరేకించి జాతీయవాది అయినాడు. సోదర సోదరీమణులు చేస్తున్న త్యాగాలు, పడుతున్న

బాధలు చూసి ప్రస్తుత పదవిలో ఉండలేనని ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు. తరువాత సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని ఉపాధ్యక్షునిగా నియమించారు.

రాజకీయాల్లో పూర్తిగా మునిగాడు. 1935లో చిత్తూరు జిల్లా బోర్డు అధ్యక్షునిగా ఎన్నికైనాడు. తరువాత శాసన మండలికీ ఎన్నికైనాడు. 1936లో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపాధ్యక్ష పదవి ఖాళీ అయినందున తిరిగి రామలింగారెడ్డినే ఉపాధ్యక్షుడుగా ప్రభుత్వం కోరింది. ఆయన అంగీకరించాడు. 1949 వరకూ ఉపాధ్యక్షుడుగా పనిచేసి మైసూరు విశ్వవిద్యాలయం ప్రోఛాన్సలర్‌గా వెళ్ళాడు. తరువాత ఆంధ్రవిశ్వవిద్యాలయం "డాక్టర్ ఆఫ్ లెటర్సు" ఇచ్చి గౌరవించింది. తరువాత అనారోగ్యంతో రాజీనామా చేశారు.

రామలింగారెడ్డి గొప్పకవి. ఆయన వ్రాసిన "ముసలమ్మ మరణం" ఇప్పటికీ గొప్ప కథా కావ్యమే. దానికి పింగళి లక్ష్మీకాంతం అంతటివారు సుదీర్ఘ పీఠిక వ్రాశారు. కవిత్వం సంప్రదాయ పద్ధతిలో వున్నా భావం ఆధునికం. రెండు పదుల వయసు కూడ నిండని విద్యార్థి వయసులో (19సం॥లు) వ్రాసిన ఈ కావ్యంలో "ముసలమ్మ" అనే మహిళ చేసిన త్యాగం వాస్తవ కథ చెప్పబడింది. ఇదొక సాహిత్య చరిత్ర.

"కవిత్వ తత్వ విచారము" గ్రంథం ఇప్పటికీ ఎప్పటికీ గొప్ప తెలుగు సాహిత్య విమర్శనా గ్రంథమే. దీనిని ఆంధ్ర విశ్వవిద్యాలయం 1941లో ప్రచురించింది. తెలుగు సాహిత్య విమర్శ అంశాన్ని ఎవరు ప్రస్తావించినా కవిత్వ తత్వ విచారము గ్రంథాన్ని పేర్కొనవలసిందే. ఇదొక మైలురాయి. ఇంకా "అర్థశాస్త్రాని"ని అంకితం చేస్తూ వ్రాసిన "అంపకాలు" పద్యాలు, ఇతర ఖండికలు ఆయన కవిత్వానికి అద్దం పడతాయి.

1936లో వ్రాసిన "నవయామిని", సంస్కృత కావ్యం బిల్హణీయం, ఆంగ్లకవి బెర్నార్డ్‌షా గ్రంథాలను గుర్తు చేస్తాయి.

ఆయన "పంచమి" వ్యాస సంపుటి, దానిలో సీత, ద్రౌపది పాత్రల ఔచిత్యం నేటి స్త్రీవాద కవులకు బుద్ధిపాఠాలు చెప్పేవిగా ఉన్నాయి.

"రంగనాథ రామాయణము" కాకతీయ పాలకుల సామంతరాజు (13వ శతాబ్దం నాటి) గోన బుద్ధారెడ్డి రాసినదేనని నిర్ధారించాడు.

రామలింగారెడ్డి గొప్ప వ్యాసకర్త. ఆయన రాసిన వ్యాసాలు "వ్యాసమంజరి"లో దొరుకుతాయి. ఇవిగాక ఆయన వ్రాసినవిగాని, ఆయనపై వ్రాసినవి గాని దాదాపు 35 గ్రంథాలున్నవి.

రెడ్డిగారు సునిశ్చిత బ్రహ్మచారి అయినా వివాహ వ్యవస్థను గురించి 8 విధాలైన వివాహాల గురించి ప్రాచీన సాహిత్యంలోనూ, ఆధునిక సాహిత్యంలోనూ తనకాలపు సమాజంలోను ఉన్న వాస్తవికతను గొప్పగా స్పష్టం చేశాడు తన వ్యాసాలలో.

రెడ్డిగారు గొప్ప సామాజిక శాస్త్రవేత్త. ఆయన వ్రాసిన "భారత అర్థశాస్త్రము", ప్రజల, మేధావుల, ప్రభుత్వాల దృష్టి నాకర్షించింది. కౌటిల్యుడు తనకాలం నాటి అర్ధశాస్త్రం వ్రాస్తే, రామలింగారెడ్డి వ్రాసిన అర్థశాస్త్రం తన కాలంనాటి అర్థశాస్త్రంగా, సామాజిక శాస్త్రంగా, వనరుల వినియోగ శాస్త్రంగా పలువురి ప్రశంసల నందుకుంది. దీనిలో దేశ వనరులు, పెట్టుబడులు, శారీరక శ్రమ, వుత్పత్తి, విలువలు, వ్యక్తి ప్రాధాన్యతలు చెప్పబడ్డాయి. ఇందులో అర్థసాధన లేకుండా ధర్మపోషణ సాధ్యం కాదనే సూత్రాన్ని బలంగా చెప్పారు. కాని భారతదేశం అప్పటికే అస్తవ్యస్తంగా ఉండినది. నివారణోపాయాలను కూడ చెప్పాడు.

పైన చెప్పుకున్నట్లు అసాధారణ కవిగానే కాక అసాధారణ వ్యక్తిగా కూడ పేరు పొందాడు. ఆయన జీవితంలో ముఖ్యమైన ఘట్టాలు చాలవున్నై. కవిగా ముసలమ్మ మరణము, భారత అర్థశాస్త్రము, కవిత్వ తత్వ విచారము వగైరాలే కాక, వేమనను ఆయన కవిత్వానిని, సి.పి.బ్రౌన్ తరువాత కవులలోకి, ప్రజలలోకి తెచ్చింది రామలింగారెడ్డిగారే. లేకుంటే వేమన కవిత్వానికి ఇంత ప్రాపకం వచ్చి వుండేది కాదేమో. మొదట వేమన పద్యాల విషయం ఆకాశవాణి ద్వారా వెలుగులోనికి తెచ్చి, వ్యాసాల ద్వారా, సమావేశాల ద్వారా కవులు, రచయితలలోనికి తెచ్చి వేమన కవిత్వానికి ప్రాపకం తెచ్చాడు. ఇదొక గొప్ప విషయం.

అంతేకాక భారత ప్రభుత్వ ఉపకార వేతనంతో కేంబ్రిడ్జ్‌కి వెళ్ళి తరువాత కేంబ్రిడ్జ్ యూనియన్ ఉపాధ్యక్షుడైనాడు. ఒక భారతీయునికి, అదీ ఒక విద్యార్థికి ఎనలేని గౌరవం. తిరిగి వచ్చిన తరువాత బరోడా మహారాజా కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా చేసి మైసూరు యువరాజుతో కలిసి యూరప్ సందర్శన కెళ్ళాడు. మైసూరు మహారాజా కళాశాలకు ప్రిన్సిపాల్

అయినాడు. మద్రాసు శాసన మండలి సభ్యునిగా రెండు దఫాలు ఎన్నిక కాబడ్డాడు (1922–26 మరియు 1935). ఆంధ్రమహాసభకు అధ్యక్షుడైనాడు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఏర్పడటానికి, వాల్తేరులో స్థాపించుటకు ముఖ్యకారకుడైనాడు. దానిని సాధించుటకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి మొదటి ఉపాధ్యక్షుడైనాడు (1926). తిరిగి మరల ఎన్నుకోబడ్డాడు.

చిత్తురు జిల్లా బోర్డు అధ్యక్షుడైనాడు (1935–36). అంతర్విశ్వవిద్యాలయాల బోర్డు ఛైర్మన్‌గా ఎన్నుకోబడ్డాడు (1937). బ్రిటీషు ప్రభుత్వంవారు, ఆయన సేవలను గుర్తించి “సర్” బిరుదునిచ్చి గౌరవించారు (1942). మైసూరు విశ్వవిద్యాలయం ప్రో ఛాన్సలర్‌గా పదవి నలంకరించారు. విద్య, రాజకీయ రంగాలలో నిండు జీవితం అనుభవించాడు. కాని అవివాహితుడే.

రామలింగారెడ్డి పండితుడు, గ్రంథకర్త. ముఖ్యంగా సాహితీ విమర్శకుడు, వక్త, రాజకీయవేత్త, పరిపాలకుడు, వ్యవహర్త, సంస్కారి, స్నేహపాత్రుడు, మార్గదర్శి విద్యావిధాన సంస్కరణాభిలాషి. ఏ రంగంలో తీసుకున్నా అగ్రస్థానమే. ఎవరి పొగడ్తలు ఆయనకక్కరలేదు. ఎవరి విమర్శలకు ఆయన చలించలేదు. శతాబ్దాల తరబడి గుర్తుంచుకోవలసిన ప్రతిభాశాలి.

రెడ్డిజాతికి ఘనకీర్తి తెచ్చిన మహావ్యక్తి.

**అనుపమ కవితా శిల్పము**
**పొనరి కవిబ్రహ్మ యనగ పూజ్యుండయి తె**
**ల్గున భారతమ్మొనర్చిన**
**యనఘుని వినుతింతు తిక్కనార్యుని మిత్రా.**

# దువ్వూరు రామిరెడ్డి



జననం : 09.11.1895
మరణం : 11.09.1947

దువ్వూరు రామిరెడ్డి 1895లో గూడూరులో సుబ్బారెడ్డి, లక్ష్మీదేవమ్మ గార్లకు జన్మించాడు. భార్య శేషమ్మ 1925లో స్వర్గస్తురాలు కాగా తాను, తన కుటుంబ అవసరాలను దృష్టిలో వుంచుకొని 1929లో అన్నపూర్ణమ్మను వివాహం చేసుకున్నాడు. వారికి వేణుగోపాలరెడ్డి,

జనార్ధనరెడ్డి కుమారులు కలిగారు. రుక్మిణమ్మ ఆయన సోదరి. బాలకృష్ణారెడ్డి సోదరుడు. మధ్య తరగతి రైతు కుటుంబం. 30 ఎకరాల సేద్యం.

రామిరెడ్డి గూడూరులో వీధిబడిలో చదివాడు. పెమ్మారెడ్డి పాలెంలో సీతయ్య అనే సాతాని అయ్యగారి వద్ద 5వ తరగతి వరకు చదివాడు. పై చదువులకని తల్లి కోరిక మీద నెల్లూరు వెళ్ళాడు. హార్వీ దొర వద్ద 8వ తరగతి దాకా చదివాడు. అంతలో తండ్రి మరణించగా చదువుకు స్వస్తి చెప్పి ఇంటికొచ్చాడు.

తల్లి లక్ష్మిదేవమ్మకు దైవభక్తి ఎక్కువ. దానాలు, ధర్మాలు, తీర్ధయాత్రలపై ధ్యాస ఎక్కువ.

రామిరెడ్డి మానవతావాది. కళాశీలి. చిత్రలేఖనము, శిల్పము, ఫోటోగ్రఫీ, రేడియో ఇంజనీరింగ్ ఆయనకు ప్రత్యేక అభిలాషలు. తను 8వ తరగతి చదివే రోజులలోనే విదేశీ కెమెరాలకు పోటీగా కెమేరాలు తయారు చేశాడు.

స్వయంకృషితో ఇంగ్లీషు, ఫ్రెంచి, ల్యాటిన్, జర్మన్, బెంగాలీ, పర్షియన్, ఉరుదు, తమిళము, సంస్కృతము, ఆంధ్ర భాషలలో (ప్రవేశమే కాదు) పాండిత్యం సంపాదించాడు. "ప్రియా వియోగ దుఃఖసమ్మూర్చితమున కాళిదాసుని మేఘ సందేశము, ఖయ్యాము రుబాయతులు సంజీవ ఔషధముల వలె పునరుజ్జీవింప జేసినవి" అని ఆయనే పానశాలకు ఉపోద్ఘాతంలో చెప్పుకున్నాడు. కట్టమంచి రామలింగారెడ్డి గారి ముసలమ్మ మరణం చదివి ఆకర్షింపబడ్డాడు. ఆయనే తనను గూర్చి పాఠశాలలో "నేను నేర్చిన విద్య చాలకొద్ది. నన్ను గృహవిద్యాలయ శిక్షితుడనుట యొప్పగును (ఎ ప్రొడక్ట్ ఆఫ్ మై హోమ్ యూనివర్సిటి). నా వృత్తి వ్యవసాయము. ఇష్ట విషయములు విజ్ఞాన శాస్త్రములును, మెకానికల్ ఇంజనీరింగ్ యును. కవిత్వ రచన కుపక్రమించుటకు ముందు కొన్నినాళ్ళు నేను చిత్రలేఖనము, మృత్తి విగ్రహనిర్మాణమును చేయుచుంటిని" అని చెప్పుకున్నాడు.

కెమేరా నిర్మాణం, రేడియో తయారి, జ్యోతిషశాస్త్రం, చిత్రలేఖనం, రామిరెడ్డి జీవితంలో ముఖ్య విశేషాలు. ఆ తరువాతనే కవిత్వంలో కొచ్చాడు.

వీధిబడిలో గజేంద్రమోక్షము, రుక్మిణీ కళ్యాణం చదువుకున్నాడు. ఆ పద్యాలు గుణించు కుంటూ వుండేవాడు. ఒకరోజు ఎవరో ఒకాయన ఒక కాగితమిచ్చి ఏదైనా వ్రాయమంటే

అప్పుడు "దండము శాస్త్రి ధీమణికి దండము కావ్య కళావిభూతికిన్" అని వ్రాశాడు. ఆ శాస్త్రిగారు నీకు కవిత్వం వస్తుందోయ్ వ్రాయమన్నాడు. అలా ప్రారంభమైంది కవిత్వ ప్రవేశం. తర్వాత మద్రాసు పోయి వావిళ్ళవారి అంగడిలో ఛందస్సు పుస్తకాలిమ్మంటే వారు 'సులక్షణ సారం' 'అప్పకవీయం' ఇచ్చారు. ఛందోనిర్మాణం ఆరంభమైంది.

అక్కడి నుండి (1915 నుండి) చదవటం, వ్రాయటం ప్రారంభమై 'రసిక జనానందము', 'స్వప్నాశ్లేషము', 'అహల్యానురాగము', 'కృష్ణ రాయబారము', 'నలజారమ్మ', 'కర్షక విలాసము', 'మాతృశతకము', 'సింహ ప్రబోధము' అనే గ్రంధాలు వ్రాశాడు. 1917లో రెడ్డి జనసంఘం సువర్ణ పతకాన్నిచ్చింది. సి.ఆర్. రెడ్డి గారి మెప్పు ద్వారా సన్మానించింది. 1918లో 'వనకుమారి' కావ్యానికి విజయ నగర మహారాజా ఆస్థానం నిర్వహించిన పోటీలలో ప్రధమ బహుమతి వచ్చింది.

రామిరెడ్డి గారికి కులాభిమానం ఎక్కువ. బ్రాహ్మణేతరుల ప్రయోజనాల కొరకు ప్రారంభించిన ఉద్యమంలో పత్రికా ప్రచురణకు "మీరే మొదటి సంపాదకుల"ని సి.ఆర్. రెడ్డిగారు ఆహ్వానించాడు. 'సమదర్శిని', 'న్యాయదీపిక' పత్రికలకు ఉపసంపాదకుడైనాడు. అది కొంత కాలమే.

కొంతకాలం జస్టిస్ పార్టీకి అనుకూలంగా వుండి గాంధీ అవతరించటంతో జాతీయత వైపు మొగ్గు చూపాడు. ఆ సందర్భంలో 'మేలు కొలుపు', 'నైవేద్యము', 'ప్రబోధ శంఖము' వంటి ఖండికలు వెలువరించాడు.

1919లో 'కృషీవలుడు', 1920లో 'జలదాంగన' రాశాడు. 1923లో 'యువక స్వప్నము', 1924లో 'కుంభరాణా" రాశాడు. కుంభరాణా నాటకం పలు ప్రదర్శన లిచ్చింది.

1926లో హైదరాబాదుకు వచ్చినప్పుడు సురవరం ప్రతాపరెడ్డి, కొత్వాల్ వెంకట రామిరెడ్డి, బారిష్టర్లు గోపాలరెడ్డి, సత్యనారాయణరెడ్డి, పింగళి వెంకట్రామిరెడ్డి, కొండారెడ్డి వగైరా రెడ్డి పెద్దలు రామిరెడ్డిని ఆప్యాయంగా ఆదరించారు.

1925లో రామిరెడ్డికి జీవితంలో పెద్దదెబ్బ తగిలింది. భార్య శేషమ్మ బిడ్డను ప్రసవించి 9-7-1925న మరణించింది. పెద్దలు ఆలోచించి 16-6-1929న అన్నపూర్ణమ్మతో పెండ్లి జరిపించారు.

4-11-1929న కడప కోటిరెడ్డి అధ్యక్షతన బెజవాడలో ఆంధ్ర మహాసభ వారు రామిరెడ్డికి 'కవి కోకిల' బిరుదునిచ్చారు. తర్వాత ఆ బిరుదును సగర్వంగా వాడుకున్నాడు.

1935లో 'పానశాల' గ్రంథ రూపం దాల్చింది.

1936లో చలన చిత్రరంగంలో అడుగుపెట్టాడు. "సతీ తులసి" లేక "జలంధర" సినిమాకు కథ, సినేరియో, మాటలు, పాటలు రాశాడు. 'చిత్రనళీయం' సినిమా బాగా పేరు గాంచేటట్లు తీశాడు. 'పార్వతీ పరిణయము', 'సీతారామ జననము' సినిమాలకు పాటలు, పద్యాలు, సంభాషణలు రాశాడు. వాహినీవారి సినీ ప్రముఖుడు బి.ఎన్. రెడ్డి గారితో పరిచయం ఏర్పడింది.

సాంసారిక జీవితం వచ్చాక పానశాల, పలితకేశము, మిత్రార్ధశతకం వ్రాశాడు. (మిత్రా మకుటంతో వ్రాసున్న శతకం సగంలోనే ఆగినందున మిత్రార్ధ శతకం అనే పేరుతో ప్రచురించారు).

రామిరెడ్డికి 1945లో తోటకు పోయినపుడు పక్షవాతం వచ్చింది. తీవ్రమైంది. ట్రస్టు ఏర్పాటు చేయాలని తద్వారా కవులను సన్మానించాలని భావించి వీలునామా వ్రాశాడు. ఆ వీలునామా అమలుకు రాలేదు. 11/12-9-1947 'కంజెస్టివ్ ఫైయిల్యూర్'తో ప్రాణం పోయింది.

రామిరెడ్డి నిరాడంబర జీవితం గడిపాడు. ప్రచారం ఇష్టంలేదు. పేరు కోసం ప్రాకులాడ లేదు. కేవలం 8వ తరగతి చదువుతో పలు భాషలలో స్వయంగా పాండిత్యం సంపాదించి సాహితీలోకంలో మణిపూసై భాసిల్లాడు. పి.వి. రాజమన్నార్ గారన్నట్లు "ఆంధ్రభాష ప్రపంచంలో ఉన్నంత వరకు రామిరెడ్డి గారికి మృతి లేదు". కృషీవలుడును కవితా సింహాసనం మీద కూర్చుండ బెట్టిన రైతుకవి - కవిరైతు రామిరెడ్డి.

ఆయన వ్రాసిన రెడ్డి ప్రబోధం ఖండికలు భూమి, సూర్యుడు వున్నంత వరకు రెడ్డి కులస్తులకు ప్రాణమిత్రులు.

**రెడ్డి జనాభ్యుదయ సంఘం - ఒంగోలు**

## రామిరెడ్డి గారి కావ్యాలు :

నలజారమ్మ(1917), వనకుమారి(1918), కృషీవలుడు(1919), జలదాంగన (1920), యువక స్వప్నము(1922–23), కడపటి వీడుకోలు(1924), పలితకేశము(1942), కవి–రవి(1943) సాహితీ జగత్తులో ఈనాటికీ వెలుగు దివ్వెలే.

## రామిరెడ్డి గారి ఖండ కావ్యాలు :

నక్షత్రమాల(1918–21), నైవేద్యము(1921–25), భగ్నహృదయము (1925–30), మాతృశతకం (1917).

## రామిరెడ్డి గారి అనువాదాలు :

పానశాల(1935), గులాబితోట(1944), పండ్లతోట.

## రామిరెడ్డి గారి నాటకాలు :

కర్షక విలాసము(1917), సీతావనవాసము(1921), కుంభరాణా (మీరాబాయా 1924), మాధవ విజయము (1925), కాంగ్రెస్‌వాలా (1935).

సాహితీ విమర్శకునిగా సాహితీ లోకంలో పేరొందాడు.

ఆయన డైరీ అన్నిటికీ ఆధారం. సాహిత్యలోకం ఎన్నటికీ మరువలేని ధ్రువతార. రెడ్డికులస్తుడే అయినందుకు రెడ్డిజాతి ఆయనకు మణికిరీటం పెడుతుంది.


**అమరం బై జనహృదయం**
**గమమై తగు తేట తెల్గు కవనంబున నా**
**సుమతి శతకంబు చెప్పిన**
**మలుని నజ్ఞాతకవిని వేడెద మిత్రా.**

ఆపద గలవేళ నరసి బంధువులఁజూడు
భయమువేళ జూడు బంటుతనము
పేదవేళ జూడు పెండ్లాము గుణమును
విశ్వదాభిరామ వినురవేమ.

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత
పద్మభూషణ్

# డా॥ సి. నారాయణ రెడ్డి

(సి.నా.రె.)



నారాయణరెడ్డి తండ్రి మల్లారెడ్డి, తల్లి బుచ్చమ్మ, భార్య సుశీల. కుమార్తెలు గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి.

**"పుట్టితిని తెలంగాణ నట్ట నడిగడ్డలో**
**మేడిపట్టిన రైతు వంగడమందు"**

**"నా కవితకు నా తల్లి ప్రేరణ - నా పల్లె ప్రేరణ"**

అని చెప్పుకున్న

**మట్టిలో పుట్టిన మాణిక్యం పల్లెలో పుట్టిన పారిజాతం** జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ మన డా॥ సి. నారాయణరెడ్డి. అత్యున్నతులు కనుకనే ఈ పుస్తకంలో పేర్కొన్నబడ్డ ప్రముఖులందరూ స్వర్గస్తులైనవారే అయినా ఇపుడు మన మధ్య వున్న చైతన్యమూర్తులలో ఒక్క సి. నారాయణరెడ్డి గారిని గురించి మాత్రమే ఇచట మనం చెప్పుకుంటున్నాం.

జ్ఞానపీఠ్ అవార్డు అంటే సామాన్యమైంది కాదు. భారతదేశంలో ఇప్పటి వరకు ఈ అవార్డు పొందిన ప్రముఖులలో సి. నారాయణరెడ్డి ఒక్కడే రెడ్డి.

ఆనాడు 14వ శతాబ్దం చివరిలోని రెడ్డి ప్రభువు "కర్పూర వసంతరాయలు" కుమారగిరి రెడ్డిపై "కర్పూర వసంతరాయలు" అనే అద్భుత కావ్యం రాసి తెలుగు సాహితీ ప్రపంచంలో మేటిగా పేరుగాంచి దేశంలోనే అత్యంత ప్రతిష్టాకరమైన జ్ఞానపీఠ్ అవార్డు పొంది మహాకవిగా మనమధ్య విరాజిల్లుతున్న సి. నారాయణరెడ్డి గారిని రెడ్డిప్రభువు కుమారగిరిరెడ్డి సరసన ఈ విభుని కూడ ఈ పుస్తకంలో చేర్చి గౌరవించటమే ఈ సమాచారం ఇక్కడ ఉంచటంలోని ఉద్దేశం. ఇలా ఇందరి రెడ్డి రాజులు, ప్రముఖుల మధ్య సి. నారాయణరెడ్డి గారి వైభవాన్ని కూడ ఉంచి ఆనందించటమే కాక గర్వించాలని ఒంగోలు రెడ్డిజనాభ్యుదయ సంఘం భావించింది. ఈ అవకాశం మరొకసారి ఎప్పుడు ఎవరికి కలుగునో చెప్పలేం కనుక ఇచట సముచితంగా నిక్షేపించటమైంది. (ఇది సి.నా.రె. గారి సాహిత్యంపై చర్చా వ్యాసం కాదని గమనించ గోరుచున్నాము).

సి. నారాయణరెడ్డి ఇంటి పేరు "సింగిరెడ్డి". కరీంనగర్ జిల్లా వేములవాడ మండలం హనుమాజీపేటలో ప్రసిద్ధ రైతు కుటుంబంలో 29-7-1931 తేదీన జన్మించాడు. సంతానం కోసం సత్యనారాయణస్వామి వ్రతం చేసిన తర్వాత పుట్టాడని వాళ్ళమ్మ సత్యనారాయణ రెడ్డి అని పేరు పెట్టింది. సిరిసిల్ల మాధ్యమిక పాఠశాలలో చేర్చేటపుడు తండ్రి నారాయణరెడ్డి అని పేరు పెట్టాడు. అదే స్థిరపడింది.

## విద్యాభ్యాసం

ప్రాథమిక విద్య హనుమాజీపేటలో ప్రైవేటు టీచరు నడిపిన వీధిబడి. బాల్యంలోనే హరికథలు, జానపదాలు, జంగం కథలవైపు ఆకర్షితుడైనాడు. ఆయభిలాష ముందుముందు

కావ్య రచనలో, గేయ, గజల్ రచనలో, కావ్యగానంలో, గజల్ గానంలో బాగా ఉపయోగపడ్డది. మాధ్యమిక విద్య సిరిసిల్లాలో ఉర్దూ మాధ్యమం. తెలుగు ఐచ్ఛికంగా సాగింది. ఉన్నత పాఠశాల విద్య కరీంనగర్‌లో జరిగింది. ఇంటర్మీడియట్ హైదరాబాదు ఛాదర్‌ఘాట్ కళాశాలలో జరిగింది. ఈ రోజుల్లో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో సభ్యుడుగా చేరి రాయప్రోలు, గురజాడ, కృష్ణశాస్త్రి, జాషువా వగైరా గారల తెలుగు సాహిత్యం వంటబట్టించుకున్నాడు. బి.ఎ. ఉస్మానియా విశ్వవిద్యాలయం – ఉర్దూ మీడియం. ఎం.ఎ. కూడ ఉస్మానియా విశ్వ విద్యాలయంలోనే చేశాడు. ఎం.ఎ. తరువాత పిహెచ్.డి. అదే విశ్వవిద్యాలయంలో (తెలుగులో) దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి సూచనపై "ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు – ప్రయోగములు" అంశంపై చేశాడు.

హైస్కూలు చదువుల రోజుల్లో రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా "క్విట్ స్కూల్" ఉద్యమంలో పాల్గొన్నాడు. గ్రామంలో "జనతా గ్రంథాలయం" స్థాపించాడు. మద్యపాన వ్యతిరేకోద్యమంలో పాల్గొన్నాడు. హరిజనోద్ధరణోద్యమంలో పాల్గొని

**"మాల మాలయని మచ్చరించి మీ**
**సాలు దువ్వెదవదేలా?**
**మాలడే మహామంత్రియైన పూ**
**మాలవేసెదవదేలా"**

అని కవితలు వ్రాశాడు. ఇవన్నీ రెడ్డిరాజుల నుండి వచ్చిన రెడ్డితనం లక్షణాలే.

కళాశాల విద్యార్థిగా "శోభ" పత్రికకు సంపాదకత్వం వహించాడు. రోచిస్, సింహేంద్ర పేర్లతో కవిత్వం పత్రికలకు పంపేవాడు. విద్యార్థి దశలోనే ప్రహ్లాద చరిత్ర, సీతాపహరణం, రాఘవదేవ రాజీయం, భలేశిష్యులు వగైరా నాటకాలు రాశాడు. సినీ కవి వంటి గ్రంధాలు రాశాడు.

నారాయణరెడ్డి గురువులు : ఆచార్య కె. గోపాలకృష్ణారావు, ఆచార్య పల్లా దుర్గయ్య, ఆచార్య దివాకర్ల వెంకటావధాని.

ఉర్దూ, హిందీ, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రావీణ్యం సంపాదించాడు నారాయణ రెడ్డి. ఆయన పిహెచ్.డి పరిశోధనా గ్రంథం "ఆధునికాంధ్ర కవిత్వము, సంప్ర దాయములు

– ప్రయోగములు” నేటికీ, ఏనాటికీ విశ్వవిద్యాలయాలలో, తెలుగు కవిత్వ పరిశోధనాకారులలో ప్రామాణిక గ్రంథంగా స్వీకరించబడుతుంది. నారాయణరెడ్డి గ్రంథాలు ఇంగ్లీషు, ఫ్రెంచ్, సంస్కృతము, హిందీ, మళయాళం, కన్నడ, ఉర్దూ భాషల లోనికి తర్జుమాలు జరిగాయి.

## ఉద్యోగాలు

ఆరంభంలో సికింద్రాబాదు ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో అధ్యాపకుడుగా చేశాడు. తదుపరి హైదరాబాదు నిజాం కళాశాలలో అధ్యాపకం నిర్వహించాడు. ఆ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రీడరుగా, తదుపరి ప్రొఫెసరుగా చేశాడు.

## సాహితీ ప్రస్థానం

నారాయణరెడ్డి దీర్ఘగేయకావ్యాలు, ఖండకావ్యాలు, గేయనాటికలు, గజళ్ళు, ప్రపంచ పదులు, సినిమా పాటలు దేశంలోనే కాక విదేశాలలోనూ ప్రసిద్ధికెక్కాయి. ఆయన వయసు ఈ 2016కు 86వ సంవత్సరం వచ్చింది. అందుకు సరియగు సంఖ్యలోనే 1954 నుండి ఇప్పటి వరకు 86 గ్రంథాలు రచించి ప్రచురించాడు. “డా॥ సి.నా.రె. సమగ్ర సాహిత్యం” అనే 18 భాగాల సంపుటాలలో ఆయనవి చాలా పుస్తకాలు ముద్రించబడ్డవి. తదుపరి వచ్చిన పుస్తకాలు విడివిడిగా ప్రచురించబడ్డవి.

నారాయణరెడ్డి మాత్రాబద్ధ గేయకవిగా ప్రసిద్ధికెక్కారు. ఒక ప్రత్యేక మాత్రాబద్ధ ఛందస్సుతో కావ్యాలు రచించాడు. విశ్వగీతి, నాగార్జున సాగరం, స్వప్నభంగం, కర్పూర వసంతరాయలు, విశ్వనాథనాయకుడు, ఋతుచక్రం, భూమిక, జాతిరత్నం, జలపాతం, సమదర్శనం, మథనం, మనిషి – ఆకాశం, విశ్వంభర వగైరా కావ్యాలు ప్రసిద్ధి కెక్కినవి. నారాయణరెడ్డి తన “కర్పూర వసంతరాయలు” కావ్యానికి స్వీయగానం చేస్తే అది అమెరికాలో రికార్డయి నేడు భారతదేశంలో సి.డి.లుగా లభిస్తున్నది. నవ్వని పువ్వు, అజంతా సుందరి, రామప్ప తరతరాల తెలుగు వెలుగు; నారాయణరెడ్డి నాటికలు, జాతికి ఊపిరి స్వాతంత్ర్యము, జలపాతం, విశ్వగీతం, దివ్వెల సంగీతం, సంక్రాంతి, గోకుల విహారం, మనిషి – యంత్రం వగైరా గేయ నృత్య నాటికలు ప్రసిద్ధి చెందాయి. రామప్ప చారిత్రాత్మక సంగీత రూపకం భారతీయ భాషలన్నింటిలోకి అనువదించబడి ఏకకాలంలో ఆకాశవాణి కేంద్రాల నుండి

ప్రసారం కాబడింది. నారాయణరెడ్డి తెలుగులో గజళ్ళ ప్రక్రియను వ్రాసి, వాటిని ప్రేయసి కనుసన్నల నుండి బయటకు తెచ్చి ప్రజాపరంచేసి స్వయంగా పాడి, రికార్డు చేయించి మంచి ప్రాపకానికి తెచ్చాడు. ఇపుడు వందల మంది గజళ్ళు రాస్తున్నారు. గజల్ శ్రీనివాస్ దేశవిదేశాల్లో నారాయణరెడ్డి గజళ్ళను ప్రాపకం చేస్తున్నాడు. ప్రపంచ పదులు (ప్ర+పంచపదులు) ను ప్రాపంచిక విషయాలను కూర్చి రాసి, పాడి, రికార్డు చేయించి ఆ ప్రక్రియను ప్రాపకానికి తెచ్చాడు.

ఆయన ప్రతి పుట్టినరోజున ఒక పుస్తకం చొప్పున గేయ కవితా సంపుటులు ప్రచురిస్తున్నాడు. ఇప్పటికి చివరి పుస్తకం – 86వది "నా రణం మరణంపైనే".

భార్య సుశీల పేరుతో (దివంగుతురాలు) శ్రీమతి సుశీలానారాయణరెడ్డి ట్రస్టు స్థాపించి, దానిద్వారా ప్రతి సంవత్సరం ఒక ఉత్తమ రచయిత్రికి రూ. 50 వేలు నగదు పురస్కారం అందజేస్తున్నాడు. ఆమె పేరిట తెలుగు సార్వత్రిక విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు స్వర్ణపతకాలు ఇస్తున్నాడు.

## సత్కారాలు

నారాయణరెడ్డి జైత్రయాత్రను గురించి తెలుసుకోవటం అత్యావశ్యకం.

1977లో భారత ప్రభుత్వం **'పద్మశ్రీ'** యిచ్చి గౌరవించింది. 1978లో ఆంధ్ర విశ్వవిద్యాలయం **'కళాప్రపూర్ణ'** యిచ్చి సత్కరించింది. తదుపరి భారత ప్రభుత్వం **'పద్మభూషణ్'** బిరుదునిచ్చి సత్కరించింది. కాకతీయ, డా॥ బి.ఆర్. అంబేద్కర్, మీరట్, నాగార్జున విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్లు నిచ్చాయి. డా॥ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం 2016లో వచ్చింది.

## గ్రంథ పురస్కారాలు

ఆయన గ్రంథాలకు వివిధ ప్రాంతాల అవార్డులొచ్చాయి. "విశ్వంభర"కు కుమరన్ ఆసన్ (కేరళ), బిల్వారా (కలకత్తా), సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, మోహినీరస్ అవార్డు వచ్చాయి. "ఋతుచక్రం"కు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, "మంటలు–

మానవుడు”కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, “విశ్వంభర” హిందీ అనువాదానికి భారత ప్రభుత్వ అవార్డు, “విశ్వంభర”కు జ్ఞానపీఠ్ అవార్డు లభించాయి.

ఇవికాక

## పదవులు

విద్యాపరంగా, విద్యాపరిపాలనాపరంగా ఈ క్రింది పదవులు నిర్వహించాడు.

1. ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం అధ్యక్షత (1981)
2. డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షత (1985)
3. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షత (1989)
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక వ్యవహారాల సలహాదారు (1992).
5. రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షత - 7 సం॥లు
6. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షత
7. తెలంగాణా సారస్వత పరిషత్తు అధ్యక్షత
8. జ్ఞానపీఠ్ అవార్డు సిఫారసు కమిటీ సభ్యత్వము.

నారాయణరెడ్డి అధికార భాషా సంఘం అధ్యక్ష పదవిని 4-9-1981 నుండి 7-8-1985 వరకు నిర్వహించాడు. ఆ కాలంలో 14 వేల తెలుగు టైపురైటర్లు సేకరించి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ కార్యాలయాలకిప్పించ్చాడు. 40కి పైగా ప్రభుత్వ శాఖల పదకోశాలకు రూపకల్పన చేశాడు. కార్యాలయ పదావళి, నమూనా లేఖలు తయారుచేసి ప్రభుత్వ కార్యాలయాలకిచ్చాడు. ప్రజలలో, అధికారులలో అవగాహనా కార్యక్రమాలు జరిపాడు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవి 8-8-1985 నుండి 20-6-1989 వరకు నిర్వహించారు. ఆ కాలంలో విశ్వవిద్యాలయానికి 54 ఎకరాల స్థలం కేటాయింపు చేయించారు (వికాస్ నగర్). జిల్లాలలో 57 అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్య 50 వేలు దాటించారు.

తెలుగు విశ్వవిద్యాలయం - నేటి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్ష పదవిని 21-6-1989 నుండి 4-11-1992 వరకు నిర్వహించారు. ఈ కాలంలో

విశ్వవిద్యాలయానికి యు.జి.సి. గుర్తింపు సంపాదించారు. పబ్లిక్ గార్డెన్స్‌లో ఇచ్చిన స్థలంలో భవన నిర్మాణం చేయించి 31-1-1990న భవన ప్రవేశం చేయించారు. కూచిపూడిలోని కళాక్షేత్రం ఈ విశ్వవిద్యాలయం క్రిందికి తెచ్చారు. 24-8-1989న తెలుగులోనే స్నాతకోత్సవ నిర్వహణ జరిగింది. అప్పుడు ఛాన్సలర్ ముఖ్యమంత్రి యన్.టి. రామారావు. 30 మంది ప్రముఖులపై వీడియో డాక్యుమెంటేషన్ చేశారు. 150కి పైగా ఉత్తమ గ్రంథాలు ప్రచురించారు. బెంగుళూరులో 1990 మార్చి 10, 11, 12 తేదీలలో మూడవ అఖిల భారత తెలుగు మహాసభలు నిర్వహించారు. సాహిత్యం, కళలు, సంస్కృతి రంగాలలో విశిష్ట పురస్కారాలు ఏర్పాటు చేశారు. 5 ఇతర అకాడమీల కర్తవ్యాలను, కాకతీయ విశ్వవిద్యాలయ బాధ్యతలను నిర్వహించారు.

5-11-1992న భాషా సాంస్కృతిక వ్యవహారాల సలహాదారుగా నియమించబడి పలు భాషా, సాంస్కృతిక వికాసాలపై సూచనలు చేశారు. ఇది ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదా ఉన్న పదవి.

1997 జూలై నుంచి 12-7-2004 వరకు రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షపదవి నిర్వహించారు. ఇది కేబినెట్ మంత్రి హోదా పదవి. పలు సాంస్కృతిక సంస్థలకు విశేష స్ఫూర్తినిచ్చారు. హంస పురస్కారాలు, 30వేల నగదు, స్వర్ణహంస ప్రతిమ, ప్రశంసా పత్రం ప్రవేశపెట్టారు. 8 ప్రక్రియల్లో రచయితల అధ్యయనా శిబిరాలు నడిపారు. లయసంగమం, పద్య నాటకోత్సవాలు జరిపారు. గిరిజన భాషా సాహిత్యాలు ప్రోత్సహించారు.

## విదేశీయానం ప్రభుత్వం తరపున

16-3-2003 మొరాకోలో జరిగిన ఇంటర్ పార్లమెంట్ యూనియన్ మహాసభలో భారత ప్రతినిధి బృందం సభ్యునిగా పాల్గొన్నారు. పారిస్‌లో యునెస్కోలో హైదరాబాదుకు ప్రపంచ వారసత్వ నగర ప్రతిపత్తి ప్రకటించాలని నివేదిక ఇచ్చారు.

వ్యక్తిగతంగా ప్రపంచంలోని అన్ని ఖండాలలో పలుమార్లు పర్యటించారు. అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్స్, జపాను, రష్యా, కెనడా, ఇటలీ, డెన్మార్కు, థాయ్‌లాండ్, యుగోస్లోవియా,

గల్ఫ్ దేశాలు, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, మారిషస్ మొదలైన దేశాలు పర్యటించారు. 1990లో యుగోస్లోవియాలో జరిగిన అంతర్జాతీయ కవిసమ్మేళనంలో భారతదేశ ప్రతినిధిగా పాల్గొన్నారు. 40 దేశాలు పాల్గొన్నాయి.

## సినిమా పాటలు

1962లో గులేబకావళికథ సినిమా నుండి తెలుగు సినిమా పాటల రచయితగా దాదాపు నాలుగు దశాబ్దాలలో 3750 పాటలను రాసి సినిమా పాటలలో సాహిత్యం ఉంటుందని, "కదలే ఊహలకే కన్నులుంటే, పగలే వెన్నెల – జగమే ఊయల" అవుతుందని నిరూపించాడు.

ఇది ఆయన జీవితంలో ఒక ముఖ్యపార్శ్వం కూడా.

## ఇతర సాహితీ సంస్థలు

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆయన మాతృసంస్థ. దీనితో అయిదు దశాబ్దాల అనుబంధం. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి మహనీయులు 1943లో స్థాపించిన ఈ సంస్థను 1994 నుండి అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. ఇపుడు తెలంగాణా సారస్వత పరిషత్తుకు అధ్యక్షులు. రాష్ట్రంలోను, జంటనగరాలలోను వున్న ప్రముఖ సాహితీ సంస్థలన్నింటితో సంబంధం ఉన్నది. రసమయి, వంశి, గజల్ శ్రీనివాస్ సంస్థ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, దక్షిణ భారత హిందీ ప్రచార సభ లాంటి సంస్థలెన్నింటితోనో పరిచయాలున్నవి.

## రాజ్యసభ సభ్యులుగా

సాహిత్యంలోనే కాక ప్రజాప్రతినిధిగా "పెద్దల సభ" (రాజ్యసభ)కు దక్షిణ భారతదేశం నుండి ప్రథమంగా ఎంపికైన కవి సభ్యుడిగా సభకే వన్నె తెచ్చాడు. 1997 నుండి 2003 వరకు తెలుగు కవి పెద్దల సభలో ప్రవేశిస్తే రెడ్డితనం ఎలా సభలో ప్రదీప్తి చెందుతుందో నిరూపించాడు నారాయణరెడ్డి. అలనాటి రెడ్డి రాచరికపు తెలుగు సాహిత్య సభగా వుండేదట రాజ్యసభ. రాజ్యసభలో ఎవరి భాషలో వారు మాట్లాడవచ్చు. కానీ చర్చ + అంశం సభ్యులు అందరూ తెలుసుకొనుటకు వీలుగా అనర్గళంగా తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో రాజ్యసభలో చర్చల్లో పాల్గొన్నాడు. సభలో చర్చల్లో తెలుగు భాషను పాఠశాలల్లో బోధించటం

మానేయటంపై గర్జించాడు. త్రిభాషా సూత్రం అమలుకు పట్టుబట్టారు. అంగన్‌వాడీ వర్కర్ల గౌరవ వేతనాలు, ఆంధ్రప్రదేశ్‌లో కరువు పరిస్థితులు, నకిలీ యూనివర్శిటీలు, మహిళలపై నేరాలు వగైరా విషయాలపై తీవ్రంగా చర్చించాడు సభలో. 624 ప్రశ్నలు, 32 ప్రత్యేక ప్రస్తావనలు సభలో చేశారు. ఎల్.కె. అద్వానీ (ఉప ప్రధాని) అధ్యక్షులుగా వున్న పార్లమెంటరీ అధికార భాషాసంఘంలో నారాయణరెడ్డి సభ్యుడిగా వున్నాడు. ప్రధానమంత్రి వాజ్‌పేయికి ఔటర్ లాబీలో ఉర్దూ గజళ్ళు వినిపించేవాడు. గాంధీ, సుభాష్ చంద్రబోస్, మున్షీ ప్రేమ్‌చంద్‌లు చదివిన, నివసించిన భవనాలను పునరుద్ధరించి జాతి వారసత్వ ప్రదేశాలుగా ప్రకటింప జేయటానికి ప్రయత్నించి సఫలీకృతుడైనాడు. సాంస్కృతిక వికాసానికి సాంస్కృతిక నిధి ఏర్పాటు చేయించాడు. కేంద్ర విశ్వవిద్యాలయాలలో సంస్కృత పీఠాలు ఏర్పాటు చేయించాడు. అధికార భాష, శాస్త్ర సాంకేతిక, పర్యావరణ, అటవీ వ్యవహారాలు, మానవ వనరుల అభివృద్ధి, సమాచార ప్రసార సంబంధ పార్లమెంటు సంఘాలలో సభ్యులుగా ఉన్నారు. కడపలో సి.పి. బ్రౌన్ గ్రంథాలయానికి, కరీంనగర్‌లో సారస్వత భవన్, ఇతర ప్రజోపయోగ కార్యక్రమాలకు రూ. 11.5 కోట్లు యం.పి. ల్యాడ్స్ నిధులను వినియోగించారు.

నారాయణరెడ్డికి అమ్మంటే ప్రాణం. "అమ్మ అక్కున జేర్చుకున్నప్పుడు కలిగే ఆనందం కంటే జ్ఞానపీఠం పెద్దది కాదు" అంటాడు. అమ్మ ఆయనను విడిచి వుండలేక చదువుకు సిరిసిల్లకు వద్దంటే నారాయణరెడ్డి కోపం పట్టలేక బావిలో దూకాడు. తోటి విద్యార్థులు రక్షించారు. కొడుకు కోసం తల్లి రాజీపడి పై చదువులకు పంపింది. ఆయన అమ్మపై ఒక గజల్ రాశాడు. "అమ్మవొకవైపు – దేవతలంతా ఒకవైపు సరితూచమంటే నేను ఒరిగేను అమ్మవైపు" అని రాశాడు. ఈ గజల్‌ను ఆయనే గానం చేశాడు. ఇది బహుళ ప్రచారం పొందింది. అమ్మ నుంచి మమకారం పంచడం నేర్చుకున్నానంటాడు.

తన సిద్ధాంత గ్రంథం "ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు – ప్రయోగములు" తన తల్లి బుచ్చమ్మకు, తండ్రి మల్లారెడ్డికి అంకితమిస్తూ

**"కన్నతల్లి బ్రతికినంత**
**కాలము బంగరు మమతల**

**పొంగించిన పాలవెల్లి**
**సింగిరెడ్డి బుచ్చమకు,**
**కన్నతండ్రి నల్లని రే**
**గళ్ళుదున్ని నా బ్రతుకున**
**రవ్వలు పండించిన క**
**ర్షక మణి మల్లారెడ్డికి"** సమర్పిస్తున్నట్లు రాసుకున్నాడు.

నారాయణరెడ్డి వ్యక్తిత్వం గొప్పది. ఎవ్వరినీ తక్కువగా చూడడు. ఎవరినీ పల్లెత్తి దురుసుగా మాట్లాడడు. మృదుభాషి. సాహితీ ప్రపంచంలో మహావృక్షంగా శాఖోపశాఖలై విస్తరించీ, వేలమంది శిష్యులను సంపాందించుకున్నా లక్షలమంది ఇష్టులను సంపాదించుకున్నా తాను చిగురుటాకునే నంటాడు. నారాయణరెడ్డి ఒక గ్లామరు మనిషి. వీధినుండి విశ్వంభరకు ఎదిగిన వ్యక్తి. "విశ్వం నా ఊరు – శాంతి నా పేరు" ఆయన నినాదం. ఆయనకు ఒకచోట సన్మానం జరిగినప్పుడు, అది చెట్టంతటి పేరొందిన చిగురుకు సన్మానం, హనుమాజీపేటకు సన్మానం, మల్లన్న దున్నిన రేగడి మట్టికి సన్మానం, నాలో తెలుగును మలచిన నాల్కకు సన్మానం, ఏటిపాయలా ఉరికే పాటకు సన్మానం, నా కలానికి సన్మానం అంటూ వినమ్రంగా చెప్పుకుంటూ సన్మానానికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

నా జీవిత ప్రస్థానమే యువతరానికి సందేశం అని చెప్పగలిగిన సాహసి నారాయణరెడ్డి.

ఇంత గొప్ప హృదయంగల రెడ్డి, జ్ఞానపీఠ్ గ్రహీత, రెడ్డి జాతికి గర్వకారణం. రెడ్డిజాతి సంపద.

అట్టి డా॥ సి. నారాయణరెడ్డి తన "కర్పూర వసంతరాయలు" గేయ కావ్యాన్ని ముగిస్తూ కొండవీటిని గూర్చి ఇలా చెప్పాడు.

**"నేటికిని లకుమ అందెల ఝణత్కారములు**
**వినిపించు కొండవీటను వీచు వాయువుల**
**కొమరగిరి చరితమ్ము కొండవీటను శిశిర**
**మును సైతము వసంతముగ రూపుగట్టు**

**కొండవీటను పాదుకొన్నట్టి మట్టిలో**
**సైతము కర్పూర సౌరభమ్ములు వీచు"**

అంటూ కొండవీడును తలచుకొమ్మని, చూచిరమ్మని పురమాయించాడు. వారికి రెడ్డిజాతి శిరస్సు వంచి నమస్కరించవలసిందే.


**పెద్ద చదువు లేదు పేరు బొత్తిగ లేదు**
**బుధులు మెచ్చ దగిన బుర్ర లేదు**
**కాని... కలదు నాకు కనులున్న హృదయము**
**మహిత వినయశీల? మల్లెమాల!!**

**కజ్జికాయ కన్న ఖర్జూరమున కన్న**
**వెలది మోవి కన్న వెన్న కన్న**
**తేనె కన్న నాకు తెలుగు బాసే తీపి**
**మహిత వినయశీల! మల్లెమాల!!**

పాల నీరు క్రమంబువ పరమహంస యెఱుంగు
నీరుపాల క్రమము నెఱుగనేల
అజుడైనవాడు అల శివుని యెరుగునా
విశ్వదాభిరామ వినురవేమ.

# రాచమల్లు రామచంద్రారెడ్డి

**(రా: రా:)**



జననం : 28-2-1922
మరణం : 25-11-1988

రామచంద్రారెడ్డి గారి తండ్రి బయపురెడ్డి, తల్లి ఆదిలక్ష్మమ్మ. కడప జిల్లా సింహాద్రిపురం మండలం పైడిపాలెం గ్రామంలో జన్మించాడు. పులివెందుల డిస్ట్రిక్ట్ బోర్డు హైస్కూలులో చదివాడు. ఇంటర్ అనంతపురం ప్రభుత్వ ఆర్ట్సు కళాశాలలో చదివాడు. 1941లో మద్రాసులో

గిండి ఇంజనీరింగ్ కాలేజిలో చదువుతూ కాలేజి యాజమాన్యం తీసుకున్న చర్యల వల్ల అక్కడ చదువు మాని అంతటితో చదువుకు స్వస్తి చెప్పాడు. 1944లో బెజవాడ నుంచి వెలువడే విశాలాంధ్ర దినపత్రికకు ఉపసంపాదకునిగా కొంతకాలం పనిచేశాడు. తరువాత కడపజిల్లా కొండాపురంలో ఎర్రగడ్డల వ్యాపారం మొదలుపెట్టాడు. కాని వ్యాపారం ఆయన మనస్తత్వానికి  అనుకూలించలేదు.

1941 మద్రాసు గిండీ ఇంజనీరింగు కాలేజిలో చదివేటపుడు జైలులో గాంధీ నిరాహార దీక్షకు మద్దతుగా తాను, తోటి విద్యార్థులు సాగించిన సమ్మెకు క్షమాపణ పత్రం రాసివ్వటానికి నిరాకరించిన కారణంగా చంద్ర పుల్లారెడ్డితో పాటు రామచంద్రారెడ్డిని కూడ కాలేజి నుండి బహిష్కరించారు. దేశం, దేశ స్వాతంత్రం లక్ష్యంగా విద్యార్థి – యువజన సమాఖ్యల ద్వారా ఉద్యమంలో పాల్గొన్నాడు. స్వత్హ కమ్యూనిస్టు భావజాలం. దేశభక్తి మనసులోని కార్యక్రమాల రీతి. 1955 వరకు చంద్ర పుల్లారెడ్డి వగైరా వారితో కలిసి ప్రజా ఉద్యమాల్లో వున్నాడు. 1955 ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ పరాజయం పాలైంది. తన మస్తత్వం కూడ గ్రామీణ ప్రజల్తో భుజం భుజం కలిపి నడవగలిగిన తత్వం కాకపోవచ్చు. నిర్భీతిగా, కఠినంగా, ముక్కుకు సూటిగా నడిచే వ్యక్తి. రాజకీయాలు తనకు పనికిరావని కమ్యూనిస్టు పార్టీకి, రాజకీయాలకు దూరమై సాహిత్యాన్నభిమానించి సాహితీకారులతో పరిచయాలు, సాహిత్య పఠనం తనధ్యేయంగా భావించి నిర్విరామంగా గ్రంథాలు, గ్రంథాలయాలు, సాహిత్యంతో మమేకమైనాడు.

మొదట కథా రచయితగా, అనువాదకునిగా, విమర్శకుడుగా ప్రయాణించి, విమర్శ విభాగంలో ఉన్నత స్థాయికి చేరాడు. రాచమల్లు రామచంద్రారెడ్డి లేకపోయివుంటే తెలుగు సాహిత్య విమర్శ ఈ స్థాయి సాధించి వుండేది కాదేమో అని ఈనాడూ చెప్పుకోవలసిందే. కట్టమంచి రామలింగారెడ్డి, పింగళి లక్ష్మికాంతం వగైరాలు ఒక విధానంలో కవిత్వతత్వ విచారకులైతే, రామచంద్రారెడ్డి మార్క్సిస్ట్ దృక్పథంతో శాస్త్రీయంగా విమర్శను సాగించాడు.

గ్రంథ రచనలో ముందుకు నడిచాడు. "అనువాద సమస్యలు" గ్రంథం బహుళ ప్రజ, సాహితీకారుల ఆదరణ పొందటమేకాక, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కూడ పొందింది. తదుపరి గ్రంథం "సారస్వత వివేచన" రాష్ట్ర సాహిత్య అకాడమి అవార్డు పొందింది.

మాస్కోలో ప్రగతి ప్రచురణాలయంలో తెలుగు అనువాదకునిగా 6 సంవత్సరాలు పనిచేశాడు. విలువైన గ్రంథాలు అనువదించాడు. 1959-63 మధ్య "సవ్యసాచి" రాజకీయ పక్షపత్రిక నడిపాడు. చలం, శ్రీశ్రీ, కొడవగంటి, మహీధర రామమోహనరావు సాహిత్యంపై రా:రా: చేసిన మూల్యాంకనం లోతైనది. వాదోపవాదాలలో దిట్ట.

1950 నుండి మార్క్సిజం వైపుకు మళ్ళాడు. 1962 ప్రాంతాలలో కేతు విశ్వనాథరెడ్డి, బంగోరె, శివరామిరెడ్డి, వగైరాలతో ప్రతి ఆదివారం రా:రా: ఇంట్లో సాహిత్య చర్చలు జరిగేవి.

మాస్కో నుండి తిరిగి వచ్చాక "ఈనాడు" పత్రికకు కొన్నాళ్ళు సంపాదకీయాలు రాశాడు.

రామచంద్రారెడ్డి రా:రా: గా ప్రఖ్యాతి చెందాడు. రా:రా: ను సాహిత్య విమర్శపరంగానే మనం బాగా గుర్తుంచుకోగలం.

సాహితీ విమర్శకు సాహసం అవసరమంటాడు. ఆత్మవిశ్వాసం, సొంత గొంతుక, సమాజ అధ్యయనం, సాహిత్య అధ్యయనం కావాలంటాడు. "సృజనాత్మక శక్తి వాడుకుంటూ వుంటేనే సజీవంగా వుంటుంది. లేకపోతే తుప్పుపట్టిపోతుంది" అన్నాడు రా:రా:.

స్వాతంత్ర పోరాటానికి కొనసాగింపుగా వచ్చిన ఫ్యూడల్ వ్యతిరేక రైతాంగ ప్రజాపోరాటం వెన్నువిరిగిందట. అప్పటికే బూర్జువా క్షీణ విలువల సాహిత్యం వారాంగనల రూపంలో కుచ్చెళ్ళు సవరించుకుంటుందట.

ఒక వ్యక్తిగా తన భావాలను ప్రజల్లోకి, కవుల్లోకి చేర్చాలంటే విధాన క్రమం లేక ఆర్వీఆర్, కేతు విశ్వనాథరెడ్డి, కొత్తపల్లి రవిబాబుల సాన్నిహిత్యంతో "సంవేదన" అనే త్రైమాసిక పత్రికను రా:రా: ప్రారంభించాడు 28-3-1968న శ్రీశ్రీ, కో.కు.ల సమక్షంలో. అది కవుల్లోకి బాగా పోజొచ్చింది. అందులో ఒక సంపాదకీయంలో ఇలా వ్రాసుకున్నాడు. "సమకాలిక

సజీవ రచనల మీద సరైన విమర్శలు సాహిత్య వికాసానికి చాల అవసరం. కాని విమర్శలు మాత్రం రావటం లేదు. ఒక రచనలో దోషం చూపించాలంటే యెంతో ఆత్మవిశ్వాసం ఉండాలి. దీర్ఘవాదోపవాదాలకు సిద్ధమై వుండాలి. సాహసం వుండాలి. యెవరికీ సాహసం లేనప్పుడు రాజకీయ రంగంలో లాగే సాహిత్య రంగంలో కూడ నోరున్నవారిదే రాజ్యం. పదిమంది అభిమానులు కలిసి యెంత చిన్న రచయితకైనా ఒకపెద్ద సన్మానం చేసి తమ పలుకుబడితో పత్రికల్లో పది ప్రశంసా వ్యాసాలు రాయిస్తే ఆ చిన్న రచయిత మరునాటికే పెద్ద రచయిత అయిపోతాడు. ఆ పదిమంది సాహిత్య అకాడమీ సభ్యులో, సభ్యుల ఆప్తులో అయితే యిక ఆ రచయిత కీర్తి పగటి దీపాలే పట్టించుకుంటుంది". అంటూ "సాధారణ ప్రజల నీచాభిరుచులు, స్వార్థపరుల స్వీయస్తోత్ర పాతక బృందాలు నేటి మన సాహిత్య ప్రపంచంలోని రెండు దుష్టశక్తులు. ఈ శక్తులే సంస్థారూపం ధరించి సాహిత్య అకాడమీలైనాయి. "ఆకాశవాణి"ని ఆక్రమించి "రేడియో శతకంతు"లయినాయి. సాహిత్యాన్ని వర్తకంగా మార్చిన "వార" పత్రికలయినాయి. సాహిత్య విమర్శలో ఫ్రాయిడియన్ మనశ్శాస్త్రం ప్రవేశించిన తర్వాత ఈ (వ్యక్తిగత విమర్శ) హద్దులు కూడ చెరిగి పోయాయి. షేక్స్పియర్‌లో Oedipus Complex ఉంది గనుక Hamlet రాసినాడని అనేవాళ్ళ నోళ్ళు ఎవరు మూయగలుగుతున్నారు! మార్క్సు యూదుజన్మ ఫలితంగా వచ్చిన inferiority complex ఆయన సిద్ధాంతాలలోని విప్లవ తీవ్రతగా పరిణమించిందన్న వాదాన్ని (అది నిజమైనా అబద్ధమైనా) ద్వేష పూరితమైన విమర్శ అని అనవలసిన అవసరమేముంది? విశ్వనాథ వారి రచనలకు ఆయన కులానికీ సంబంధం లేదంటే యెవరు నమ్మగలరు". అని సాగింది ఆయన విమర్శ.

రా:రా: ఎప్పుడూ ఉరుములు మెరుపులూ సృష్టిస్తుంటాడు. కటువుగా, మొరటుగా విమర్శ చేస్తుంటాడు. నిర్భీతి, నిష్కపటి. విప్లవ రచయితలను, దిగంబర కవులను, విశ్వనాథ సత్యనారాయణను, ఆ భావజాలం కవులను, శ్రీశ్రీని ఎవరినీ వదలలేదు రా:రా: శ్రీశ్రీ ఒకచోట "రా:రా: హృదయంలేని విమర్శకుడు" అన్నాడట. దిగంబర కవులనైతే నోటి తీటా, ఒళ్ళు తెలియని కుసంస్కారము, బూతూ తప్ప దిగంబర కవిత్వంలో ఏమిలేదని 'దిగంబర కవులు ఆరుగురూ అరిషడ్వార్గాలని, వారు క్రిమిసంతానమని, సమాజం కుళ్ళుకు వారు చిహ్నామని

తిట్టాడని కవి బి. సూర్యసాగర్ అంటాడు. రా:రా: తన సంవేదన పత్రికలో "సమాజం కుళ్ళి పోయిన మాట నిజం. సమాజం పతనమయిన మాటా నిజమే. విప్లవాగ్ని జ్వాలలతో తప్ప సంస్కరించటానికి సాధ్యం కానంతగా పతనమయిన మాట నిజమే .... కానీ ఎంత పతనమయినా ఈ దిగంబరుల పైత్యాన్ని కవిత్వమనుకునేటంతగా పతనమయిందా" అని ప్రశ్నించాడు.

రా:రా: వేడి తగలని అగ్రకవి లేడంటే ఆశ్చర్యం లేదు ఒక్క పుట్టపర్తి నారాయణాచార్యులు తప్ప. రా:రా: గదా ఘాతం నుండి తప్పించుకున్న వాణ్ణి నేనొక్కడినేనని పుట్టపర్తి వారనేవారట.

పెద్దలు చాలమంది రా:రా: ను గూర్చి గొప్పగా చెప్పారు. "A great Philosopher and Humanist" అని, "తెలుగు జాతి గర్వించదగిన రా:రా:" అని ఇంకా మరెన్నో విశ్లేషణలతో చెప్పారు.

ఈనాటి కుహనా మార్క్సిస్ట్ మతస్తులవలె కాకుండా, మార్క్సును చదవకుండా ఆయన తత్వాన్ని సిద్ధాంతీకరించే వ్యాసకర్తలవలె కాకుండా, రా:రా: సాహిత్యంలో మార్క్సిస్ట్ దృక్పథాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి నిరూపిస్తున్నాడు. మార్క్సిజంను సాహిత్యానికి అన్వయించాడు. ఒకరి మెప్పు కోసమో, ఒకరిని తిట్టటం కోసమో రచనలు చేయలేదు. గ్రంధసమీక్ష లెక్కువ చేశాడు. గొప్ప విమర్శకుడిగా పేరు పొందాడు. రా:రా: మీద తక్కోలు మాచిరెడ్డి మోనోగ్రాఫ్ రాశాడు.

మార్క్సు, మరియు ఎంగిల్స్ వ్రాసిన "Communist Manifesto" కమ్యూనిస్టుపార్టీ ప్రణాళిక గ్రంధాన్ని రా:రా: తెలుగులోకి అనువదించాడు. ఆయన మనసంతా మార్క్సిజమే.

కథకుడిగా, విమర్శకుడిగా, అనువాదకునిగా, పత్రికా సంపాదకునిగా, రా:రా: కృషి ఉన్నతమైనది. బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహిత్య విమర్శకు వరవడి వస్తువు, శిల్పంలో, శిల్పానికి అధిక ప్రాధాన్యమిచ్చాడు. వస్తువు కంటె శిల్పం బహుకాలం జీవిస్తుందంటాడు. వస్తు ప్రాముఖ్యతతో రాజకీయ ప్రాముఖ్యతలొచ్చి సాహిత్యానికి నష్టమన్నాడు. కథల్లోనైతే అనుభూతికి శిల్పానికిచ్చేటంతటి ప్రాముఖ్యాన్నిచ్చాడు.

అచ్చమైన సాహిత్యం కాపాడేందుకు ఒంటరి పోరాటం చేసిన పత్రికా సంపాదకుడు రా.రా.. 1968 ఏప్రియల్‌లో మొదలైన "సంవేదన" పత్రిక ఏడు నెలలే నడిచింది. కాని ఏడు దశాబ్దాలైనా ఎవరూ మరువలేదు. దారిద్ర్యాన్ని సైతం బేఖాతరు చేశాడు. కాని ఆర్థిక వత్తిళ్ళలో పత్రికను ఆపివేయవలసి వచ్చింది. మార్క్సిస్ట్ సాహిత్య విమర్శకు ఘాటైన వాసననిచ్చాడు రా:రా:.

రా.రా. విమర్శలోని తీవ్రతను గురించి డా॥ కేతు విశ్వనాధరెడ్డిగారు తన సొంత అనుభవాన్ని చెపుతూ తన కథలను రా.రా. విమర్శిస్తే ఏడు సంవత్సరాలు తాను ఒక్క కథ కూడా వ్రాయకుండా అధ్యయనంలో మునిగిపోయినట్లు చెప్పుకున్నాడు.

చివరకు ఊపిరితిత్తుల వ్యాధితో ప్రాణాలు విడిచాడు. మార్క్సిస్టు సాహితీ విమర్శకునిగా రామచంద్రారెడ్డి, సాంప్రదాయ సాహితీ విమర్శకునిగా కట్టమంచి రామలింగారెడ్డి నేటికే కాదు ఏనాటికైనా మార్గదర్శకులే. రెడ్డిజాతికి సాహితీ విమర్శపరంగా కీర్తి తెచ్చిన ఈ రెడ్డి ప్రముఖులను మరువలేము.

**ప్రతిపడియ సూర్యుడొక్కడె**
**ప్రతి బింబితుడైన యట్లు బహుమత దేవా**
**యతనము లున్నను, దేవుం**
**డతిలోకుండొకడెవెల్గు నంతటమిత్రా.**

# తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి

"పఠాభి"



జననం : 19.2.1919
మరణం : 6.5.2006

పట్టాభిరామిరెడ్డి పుట్టింది నెల్లూరులో. తండ్రి రామిరెడ్డి గొప్పదాత. ధనిక, సంప్రదాయ, రాజకీయ కుటుంబం. స్వాతంత్ర సమరయోధుల కుటుంబం. తల్లిదండ్రులు, తోబుట్టువులు

స్వాతంత్రోద్యమ కాలంలో జైళ్ళ కెళ్ళారు. పట్టాభిరామిరెడ్డి గారింటికి గాంధీ వచ్చినప్పటి నుండి ఆయన స్వాతంత్రోద్యమంలో పనిచేశాడు. బెజవాడ గోపాలరెడ్డి పట్టాభిరామిరెడ్డికి మేనమామ, బావకూడాను. పుచ్చలపల్లి సుందరయ్య ఈయనకు బంధువు.

పట్టాభిరామిరెడ్డి స్కూల్, హైస్కూలు విద్య నెల్లూరులో జరిగింది. ఇంటర్మీడియెట్ ప్రెసిడెన్సీ కళాశాల మద్రాసులో చేశాడు. బి.ఎ.కు కలకత్తా శాంతినికేతన్‌లో చేరాడు. యమ్.ఎ., ఇంగ్లీషు లిటరేచర్ కలకత్తాలో వేరు కాలేజీలో చదివాడు. అమెరికా కొలంబియా విశ్వవిద్యాలయంలో గణితంలో డిగ్రీ పొందాడు. బెంగుళూరులో ప్రవాసాంధ్రుడైనాడు.

రవీంద్రనాధ ఠాగూర్‌పై గురుత్వ భావం. అందుకని తనపేరులోని 'ట్టా'ను తీసివేసి 'ఠా'ను చేర్చుకొని "పఠాభి" అని పెట్టుకున్నాడని కొందరంటారు. పఠాభిగానే సాహితీ లోకానికి, చిత్రపరిశ్రమకు బాగా పరిచయమయాడు.

ప్రముఖకవి శ్రీశ్రీ కంటే ముందే పఠాభి వచన కవిత్వంలో ముందుకొచ్చాడు. ఈయన తిరుగుబాటు కవి. అహంభావ కవి. తన 14వ ఏటనే పద్యం వ్రాయటం మొదలుపెట్టాడు. నెల్లూరు పత్రిక జమీన్‌రైతులో ప్రచురింపబడేవి ఆయన వచన కవితలు.

1939లో "ఫిడేలు రాగాల డజన్" ప్రచురించాడు. దానిలో 12 కవితలుంటవి. ఆధునిక కవిత్వం అనే సాహిత్యపు తాజ్‌మహల్‌కు రాళ్ళెత్తిన మొదటి నలుగురు కూలీలలో పఠాభి ఒకరు. ఆధునిక కవితా సుందరి ఎక్కిన పల్లకిని మోసిన మొదటి బోయీల్లో పఠాభి ఒకరు. ఆయన మరియు శిష్లా, నారాయణ బాబు, శ్రీశ్రీ ఒక కోవలోని వారు.

1937లో శ్రీశ్రీ "శ్మశానాల వంటి నిఘంటువులు దాటి / వ్యాకరణాల సంకెళ్ళు విడిచి/ ఛందస్సుల సర్పపరిష్వంగం వదలి / మాటలు వడివడిగా వెలువడి పరుగిడినా"యన్నాడు.

1938లో పఠాభి తన "ఆత్మకథ" కవితలో నా ఈ వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో/ పద్యాల నడుముల్ విరగదంతాను / చిన్నయ్ సూరి బాలవ్యాకరణాన్ని / చాల దండిస్తాను" అని రాసుకున్నాడు. అంతటితో ఆగక "అనుసరిస్తాను నవీన పంథా, కాని / భావకవిన్మాత్రము

కాన్నేన / హంభావ కవిని” అని చెప్పుకున్నాడు. ఈ పుస్తకంపై పొగడ్తలు, తెగడ్తలు ఎక్కువగానే వచ్చాయి. ఇదొక బాంబు. తెలుగు సాహిత్యంలో ఇది నవ్యకావ్యం. అంత నవ్యకావ్యం అప్పటికి లేదు. దీనిని కన్నడ భాషలోకి ఆర్వీయస్ సుందరం అనువదించాడు. దీని ఖరీదు మొదట్లో డజన్ అర్ధణాలు మాత్రమే.

తరువాతి పుస్తకం “పఠాభి పన్‌చాన్‌గమ్”. దీనిలో ‘PUN’లుంటవి. రెండర్థాల చమత్కార పదాలుంటవి. మాసానికొక శీర్షికతో, ఆమాసంలో ఎన్నిరోజులుంటాయో అన్ని ద్విపదలు వాటిలో పన్‌లుంటాయి. పఠాభిని ఆరుద్ర “పన్నులలో సంపన్నుడ”ని పన్‌లోనే అన్నాడు. ఇదొక విలక్షణ గ్రంథం. చమత్కార గంధం. “తీసినా వేసినా వేధించేవి పన్నులు”, “దంతికన్నా వదంతి గొప్పది” లాంటివి.

తరువాతి పుస్తకం “కవిత నాదయిత”. “వాణి నా రాణి” అని ఒక కవి అంటే “కవిత నాదయిత” అని పఠాభి కావ్యమే ప్రచురించాడు.

ఈయన మళ్ళీ మళ్ళీ చదువుకునే గ్రంధాలు మనుచరిత్ర, పానశాల, శ్రీశ్రీ మహాప్రస్థానం.

అప్పాజోశ్యుల - విష్ణుభొట్ల ఫౌండేషన్ (అమెరికా)వారు తమ ఏడవ పురస్కారాన్ని 2000 సంవత్సరంలో బెంగుళూరులో పఠాభికిచ్చి గౌరవించారు.

చిత్ర నిర్మాతగా అద్భుత కీర్తి గడించాడు. ప్రముఖ తెలుగు చిత్ర దర్శకుడు కె.వి. రెడ్డి గారితో కలిసి జయంతి పిక్చర్స్ సంస్థ స్థాపించి ఆ బ్యానరుపై పెళ్ళినాటి ప్రమాణాలు, శ్రీకృష్ణార్జున యుద్ధం, భాగ్యచక్రం సినిమాలు తీశాడు.

కర్నాటక రాష్ట్రంలో యు.ఆర్. అనంతమూర్తి వ్రాసిన నవల ఆధారంగా “సంస్కార్” చిత్రం తీశాడు. అందులో పఠాభి తన భార్య స్నేహలతారెడ్డిని నాయుకురాలిగా, గిరీష్ కర్నాడ్ నాయకుడుగా సినిమా తీశాడు. దానిని కేంద్రప్రభుత్వం నిషేధించింది. తరువాత ఒంగోలు యం.పి., ప్రముఖ సినీ నటుడు (ఆయన కూడ కవిత్వంలో రవీంద్రనాధ్ ఠాగూర్ అభిమానే) కొంగర జగ్గయ్యగారి సహకారంతో పోరాడగా నిషేధం ఎత్తివేశారు. అంతేకాదు 1970లో

దానికి రాష్ట్రపతి స్వర్ణకమలం అవార్డు వచ్చింది. కన్నడ భాషలో కేంద్రప్రభుత్వం బంగారు పతకం వచ్చిన మొదటి సినిమా అదే. దరిమిలా ఆ సినిమా కొన్ని అంతర్జాతీయ బహుమతులు పొందింది.

తరువాత 'చండ మారుతం' సినిమా తీశాడు. ఇది ఇందిరాగాంధీ ఎమర్జన్సీ దురాగతాలపై తీశాడు. కేంద్రం ముందు నిషేధం విధించి తరువాత ఎత్తివేశారు.

ఆ తరువాత శృంగారమాస, దేవరకాడు, సినిమాలను కన్నడ భాషలో తీశాడు. ఇవి జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన చిత్రాలే.

పఠాభి తల్లి తండ్రులతో విభేదించి స్పానిష్ యువతి స్నేహలతాపావెను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఈమె తమిళ బెంగాలీ దంపతుల బిడ్డ. వీరికి నందన కూతురు, కోణార్క్ కొడుకు, కీర్తన కోడలు, కేయాజుయి మనుమరాలు ఉన్నారు. కుల, మత, భాష, ప్రాంత భేదాలు లేని కుటుంబం.

స్నేహలతారెడ్డి 1977లో ఇందిరా గాంధీ ప్రకటించిన ఎమర్జన్సీకి బలైంది. డా॥ రామమనోహర్ లోహియా, జార్జి పెర్నాండెజ్‌లు పఠాభి కుటుంబానికి మిత్రులు. పఠాభి కూడ సోషలిస్టు భావుకుడు. ఎమర్జన్సీలో జార్జిఫెర్నాండెజ్ అండర్ గ్రౌండ్ కెళ్ళాడు. ఒకరోజు ఆయన పఠాభి ఇంటికి రాగా (స్నేహపూర్వకంగా) స్నేహలతారెడ్డి భోజనం పెట్టిందని, తదుపరి ఆయన ఎక్కడికి వెళ్ళిందీ స్నేహలతారెడ్డి చెప్పలేదని అరెస్టు చేసి జైలులో పెట్టారు. 8 నెలలు జైలులో వుండగా పూర్తి అనారోగ్యం వచ్చింది. చనిపోతుందనే అనుమానంతో ఆమె చనిపోక కొద్దిరోజులు ముందు విడుదల చేయగా అనతికాలంలో ఆమె మరణించింది.

నమ్మిన సిద్ధాంతానికి బద్ధుడైయుండి తండ్రి విభేదించినా, ఆస్తి తీసుకొనకుండా పేదగానే జీవించి ప్రపంచ ఖ్యాతి పొందాడు. చివరికి సొంత ఇల్లు కూడ లేకుండా రికార్డులు మాత్రం మిగిల్చి పరమపదించిన కీర్తిమంతుడు పఠాభి.

రెడ్డి జాతికి కీర్తి తెచ్చిన మహనీయ సంస్కారి.

# కె.వి. రమణారెడ్డి



జననం : 23-3-1927
మరణం : 15-1-1998

కె.వి. రమణారెడ్డి కె.వి.ఆర్.గా సాహితీలోకంలో సుపరిచితుడు.

కె.వి.ఆర్. జన్మస్థలం నెల్లూరు జిల్లాలో రేబాల గ్రామం. మధ్యతరగతి రైతు కుటుంబం. భార్య శారద.

నెల్లూరులో వెంకటగిరి రాజా కాలేజిలో ఇంటర్ చదివి, విశాఖపట్టణంలో బి.ఎ. ఎకనామిక్స్ (ఆనర్సు) చదివాడు. ప్రథమంగా ఒంగోలు సి.యస్.ఆర్. శర్మ కాలేజిలో, తదుపరి కావలి జవహర్ భారతిలో చరిత్ర అధ్యాపకులుగా చేరి కొంతకాలం తర్వాత రాజనీతిశాస్త్రం అధ్యాపకులుగా 1985లో పదవీ విరమణ వరకు చేశాడు

విద్యార్థి స్థాయిలో సుభాష్ చంద్రబోస్ వైపు ఆకర్షితులై ఐ.ఎన్.ఎ. బ్యాడ్జి ధరించి క్లాసులకెళ్ళేవాడు. అయితే క్రమేపి వామపక్ష భావజాలం వైపు ఆకర్షితుడై స్వాతంత్ర్యో ద్యమంలో అతివాద భావాలవైపు మొగ్గాడు.

కాలేజిలో చదివే రోజుల్లో విద్యార్థి రాజకీయాల వైపు వచ్చాడు. విద్యార్థి ఫెడరేషన్ కార్యక్రమాల్లో పాల్గొనటమే కాక నిర్వహించాడు. 'కమ్యూనిస్టు గాంధీ'గా పేరుగాంచిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, ఖండవల్లి కృష్ణారావు వగైరా కమ్యూనిస్టు నాయకుల ప్రభావం కె.వి.ఆర్.ను వామపక్షాలవైపు తిప్పాయి. ఆంధ్ర, ఆంగ్ల భాషా సాహిత్యం లోతుగా అధ్యయనం చేసేవాడు.

కె.వి.ఆర్. విశాఖపట్టణంలో బి.ఎ. (ఆనర్స్) చదివేటపుడు మార్క్సిస్ట్ సిద్ధాంత అధ్యయనం, తెలుగు సాహిత్యంలో కృషి మొదలైంది. విశాఖపట్నం రేవు కార్మికులతో, మున్సిపాలిటి కార్మికులతో సంబంధాలు, సమ్మెలు, ఇంకోవైపు విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనటం, చదువంతటి దినచర్య అయింది. సాహిత్య అధ్యయనం వందల గ్రంథాలకు చేరింది.

1948లో అభ్యుదయ రచయితల సంఘంలో చేరాడు. కవిత్వం రాయటం మొదలుపెట్టాడు. ప్రజాశక్తి పత్రిక ప్రోత్సహించింది.

ఆయన జీవితం ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలతో మొదలై విప్లవ, మార్క్సిస్ట్, లెనినిస్ట్, మావోయిస్టు మౌలిక సిద్ధాంతాలవైపు మారింది. చివరకు విప్లవ రచయితల సంఘం గౌరవాధ్యక్షునిగా చేశాడు.

1955లో కమ్యూనిస్టు పార్టీ ఓడిపోయిన తర్వాత అభ్యుదయ రచయితల సంఘం నీరసించిందని అనుకుంటున్నప్పుడు శ్రీశ్రీ, కొడవగంటి కుటుంబరావులతో కలిసి బెజవాడలో అ.ర.సం. మహాసభలు నిర్వహించాడు.

1955లో సూరంపూడిలో రైతులపై కాల్పులు జరిపినప్పుడు ఆ సంఘటనలు ఆధారంగా 'అన్నపూర్ణ' నాటకం రాశాడు. తర్వాత వేశ్యాజీవితంపై 'రాజీవం' నాటకం రాశాడు. ఈ రెండు నాటకాలు బహుళ ప్రదర్శనలు జరిగాయి. దువ్వూరు రామిరెడ్డి జీవితము, సాహిత్యాలపై 'కవి కోకిల' గ్రంథాన్ని వెలువరించాడు. గురజాడ స్థానాన్ని సుస్థిరం చేస్తూ 1969లో 'మహోదయం' గ్రంథాన్ని వెలువరించాడు. ఆ సమయంలోనే శరచ్చంద్ర ఛటర్జీపై గ్రంథం వెలువరించాడు. 1970లో శ్రీశ్రీ షష్టిపూర్తి సందర్భంగా శ్రీశ్రీ సాహిత్యాన్ని ఆరు సంపుటాలుగా వెలువరించినపుడు వాటికి పీఠికలు రాసి, సంపాదకత్వం వహించాడు. రవీంద్రుడు, శరత్‌లపై గ్రంథాలు ప్రచురించాడు. యాదగిరి, సుద్దాల హనుమంతు, గద్దర్, వంగపండులపై విశ్లేషణా గ్రంథాలు రాశాడు. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల నేపథ్యంలో 4-7-1970 ఏర్పడిన విప్లవ రచయితల సంఘానికి సంస్థాపక కార్యదర్శి అయినాడు. 1983 అక్టోబరులో ఏర్పడ్డ అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితికి సంస్థాపక కార్యదర్శిగా దశాబ్దం కొనసాగాడు. 1974లో ఏర్పడిన భారత్ - చైనా మిత్రమండలికి ప్రధాన కార్యదర్శిగా చేశాడు.

వి.ర.సం. పత్రికలు 'ఎరుపు', 'అరుణతార'లకు సంపాదకత్వం వహించాడు. కె.వి.ఆర్. సంపాదకత్వంలో వచ్చిన కవితా సంకలనం 'ఝంఝ' ప్రభుత్వ నిషేధానికి గురైంది. అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి పత్రిక SPRING THUNDER కు కూడా సంపాదకత్వం వహించాడు.

1974లో సికింద్రాబాదు కుట్ర కేసులో అరెస్టయినపుడు "మూణ్ణెల్ల ముచ్చట" రాశాడు. 1975లో ఎమర్జన్సీలో అరెస్టయినప్పుడు 21 నెలలు జైలు నిర్బంధంలో వుండి "జైలు కోకిల" రాశాడు.

"అడవి", "భువన ఘోష", "అంగారవల్లరి", "ఎఱ్ఱపిడికిలి", "మావోడు సూరీడు" సంకలనాలు రాసి ప్రచురించాడు.

1995లో "ఆధునిక సాహిత్య చరిత్ర", "సాహిత్య లేఖలు", 1997లో "ప్రాచీన భారతీయ సాహిత్యంలో సామాజిక ప్రతిబింబం", "గేయకవులు" రాశాడు. 1998లో "అక్షర తూణీరం", సాహితీ వ్యాసాల సంకలనం వచ్చింది. ఇంకా "జగన్నాధ రథచక్రాలు", "మార్క్సిస్ట్ కళా సాహిత్య సిద్ధాంతాలు", "కవిలోకం", "నన్నెక్కనివ్వండి బోను", "ఆధునిక భారతీయ సాహిత్యకర్తలు", "కవిత్వంలో నిబద్ధత", "అరసం కాయకల్ప చికిత్స", "విమర్శలు – ఆత్మ విమర్శ" FAME OF THE FOREST తదితర గ్రంథాలు వెలువరించాడు.

కె.వి.ఆర్. భార్య శారదాంబ కూడ ఆయనకు అర్ధాంగే కాదు పూర్ణాంగి. అందుకే ఆ యిద్దరి పేర కె.వి.ఆర్. శారదాంబ స్మారక కమిటీ 12–12–2011న ఏర్పడింది. దీనిద్వారా కె.వి.ఆర్. రచనల సంకలనాలు వస్తున్నాయి. కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు వస్తున్నాయి.

ఇట్టి మహోన్నత సాహితీ ఉద్యమకారుడు రెడ్డికులంలో జన్మించడం రెడ్డికులానికే వన్నె వచ్చింది.

**వివిధ మతస్థులు భారత**
**భువి నొకటిగ గలసిమెలసి పొసగినయపుడే**
**యవికలమగు స్వాతంత్ర్యము**
**దవులును; దాస్యావమతియు దప్పును మిత్రా.**

కళాప్రపూర్ణ

# మరుపూరు కోదండరామిరెడ్డి



జననం : 3-10-1902
మరణం : 21-1-2002

కోదండరామిరెడ్డి నెల్లూరు జిల్లా మడనూరు గ్రామంలో కలవారి కుటుంబంలో జన్మించాడు. తండ్రి కొండారెడ్డి, తల్లి కావమ్మ. తండ్రి వేదాంతి. జ్యోతిషం, వాస్తుశాస్త్రం ఆయనకు ప్రాప్తవిద్యలు. కొండారెడ్డి కుమార్తె పొణకా కనకమ్మ ప్రముఖ స్వాతంత్ర యోధురాలు.

నెల్లూరులో ఎస్.ఎస్.యల్.సి. వరకు చదివాడు. అక్కడి నుండి గాంధీ పిలుపుతో చదువు మాని మచిలీపట్నంలో ఆంధ్ర జాతీయ కళాశాలలో చేరాడు. అది జాతీయ వాదులకు పురిటిగడ్డ. బెజవాడ గోపాలరెడ్డి, మోటూరి సత్యం, విశ్వనాథ సత్యనారాయణ ఆయన సమకాలికులు. భోగరాజు పట్టాభిసీతారామయ్య, (త్రివేణి) కృష్ణారావు, కె. హనుమంతరావులతో స్నేహం ఎక్కువ.

జాతీయోద్యమంలో పాల్గొన్నాడు. మంచివక్త. స్వాతంత్ర్యోద్యమానికి తన సాహిత్యంతో ఉత్సాహ ప్రోత్సాహాలిచ్చాడు. స్వయంకృషితో సంస్కృతాంధ్రాలు అధ్యయనం చేశాడు. ఆంగ్లంలో పాండిత్యం సంపాదించాడు. మంచి అనువాదకుడు. గొప్ప విమర్శకుడు. మద్రాసు నుండి వెలువడ్డ 'సమదర్శిని' పత్రికలో పనిచేశాడు. నెల్లూరు నుండి 1931లో 'రంధ్రాన్వేషి', 'మందాకిని', 'జమీన్ రైతు' (ముందు పేరు జమీందారీ రైతు) పత్రికలతో సంబంధాలుండి నిర్వహణ బాధ్యతలు స్వీకరించాడు. "శారద", "దేశబంధు" పత్రికలో "హాలికుడనే" గుప్తనామంతో రచనలు చేశాడు. స్వతంత్ర పత్రికకు రాసిన వ్యాసాలతో ఆంధ్రదేశమంతా కీర్తి గడించాడు. 'బీదలపాట్లు' అనే అనువాద గ్రంధాన్ని రచించారు. పూతలపట్టు శ్రీరాములురెడ్డి గారి 'కంబ రామాయణా"న్ని వచనంలో రాశాడు. నెహ్రూ "ఇందిరకు లేఖలు" అనువాదం చేశాడు. 'ఈసపు నీతికథలు', 'అస్సామీ సాహిత్య చరిత్ర', 'ఆంధ్ర వాఙ్మయం' తదితర రచనలు చేశాడు. తిక్కన నెల్లూరు వారేనని ప్రధానంగా ప్రచారం చేశాడు. నెల్లూరులో రూ. 30,000/–లతో 'తిక్కన విజ్ఞాన కేంద్రం' స్థాపించి ఏటా తిక్కన తిరునాళ్ళు నెల్లూరుకు ప్రతిష్ట తెచ్చునట్లు నడిపించాడు. 'తిక్కన సారస్వతమూర్తి' అనే సుప్రసిద్ధ విలక్షణ గ్రంధాన్ని ప్రచురించాడు. చిన్నప్పటి నుండి ఆంధ్రమహాభారతంపై ప్రీతి. భారతాన్ని ఏడుసార్లు క్షుణ్ణంగా చదివాడు. భారతంపై అవగాహన ఎక్కువ. టాగూర్ రచనలు Fire bliss మరియు Sacrificesను తెలుగులోకి అనువదించాడు. ఈయన రచనలలో "కర్ణుడు" వచన "కంబ రామాయణం", ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన "సామెతలు" మొదలగునవి ప్రసిద్ధములైనవి. "విప్లవ మతప్రవక్త పోతులూరి వీరబ్రహ్మం" వ్యాసం బహుళ ప్రచారం పొందింది. నెహ్రూ తన కుమార్తె ఇందిరకు వ్రాసిన

లేఖలను "ప్రపంచ పుట్టుపూర్వోత్తరాలు" అనే పేరుతో అనువదించాడు. 1940లో ఫ్రెంచ్ నవలాకారుడు విక్టర్ హ్యూగో వ్రాసి Les Miserables అన్న జగద్విఖ్యాత గ్రంథాన్ని "బీదలపాట్లు" అని తెనిగించాడు. 1942లో సావర్కార్ "హిందూ పద పాదుషాహి" గ్రంథాన్ని తెనిగించాడు. అనువాదంలో దిట్ట. జాతీయ నాయకులు దేబర్, పాటిల్, రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్ నారాయణ, మొరార్జీ దేశాయ్, కృష్ణచైతన్య ప్రభుపాదుల వారికి అనువాదకులుగా వుండేవారు. ఆయనకు ఉపన్యాసం ఒక కళ.

ఆయన గ్రంథాలు అసమియ సాహిత్య చరిత్ర (అనువాదం), తమిళకవి కంబరు చరిత్ర (అనువాదం), మాలపల్లి (ఉన్నవ రచనకు సంక్షేపణము), ఆంధ్రవాఙ్మయం (అకాడమి వారి బహుమతి పొందిన గ్రంథం), ఈసబు నీతి కథలు, త్యాగరాజు భక్తి సుధార్ణవము, త్యాగరాజు గేయనాటికలు.

పలువురు ప్రముఖులచే కొనియాడబడిన మహావ్యక్తి. ప్లేటో నుండి కాటయవేముని దాకా తిక్కన నుండి తియొడోర్ రూజ్వెల్టు దాకా, చిత్తరంజన్ దాస్ నుండి సి.ఆర్.రెడ్డి దాకా, కంబన్ నుండి పంబజోళ్ళ దాకా, వేమన నుండి వెంకట్రాయశాస్త్రి దాకా దిట్టంగా మాట్లాడగలిగే వ్యక్తి.

తెలుగు విశ్వవిద్యాలయం వారు ఈయన వ్రాసిన "వేమన" గ్రంధాన్ని 1989లో ప్రచురించారు. "వేమన–పాశ్చాత్యులు" అని నార్లవారు ప్రచురించిన విదేశీయుల ఆంగ్ల వ్యాసాలను తెలుగులోకి అనువదించాడు. ఈయను గద్యవేమన అనేవారు. "ప్రజాకవి వేమనయోగి" గ్రంధాన్ని 1975లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించారు. ఆయనను "Walking literary encyclopedia" అనేవారు. సాహితీ కారులచే 3–2–1986న సహస్ర చంద్రదర్శనోత్సవం చేయించుకోగలిగాడు. రాష్ట్రంలోని అతిముఖ్యులు పాల్గొన్నారు.

కోదండరామిరెడ్డి కృషికి గుర్తింపుగా ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారు 1979లో 'కళాప్రపూర్ణ'తో సత్కరించారు. ఆయనను "Bright star in literary galaxy" అని "A legend

in Telugu literary field" అని పెద్దలు ప్రస్తుతించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో 12 సం॥లు సభ్యుడుగా ఉన్నాడు. కేంద్ర సాహిత్య అకాడమీకి రాష్ట్ర సంఘం సభ్యుడుగా వున్నాడు.

కోదండరామిరెడ్డి విలక్షణమైన విశిష్టవ్యక్తి. తెలుగుతల్లికి అనుంగు పుత్రుడు. మాటలలో తెలుగుదనం, జాతీయం, తిట్టు, కట్టు, నెల్లూరు యాస కొట్టొచ్చినట్లు రెడ్డితనం నిండి వుంటాయి. ఆయన తన స్వగృహానికి అపర్ణ పేరు పెట్టాడు. నిత్యం సాహిత్య సమాలోచనలతో ఇల్లు కళకళలాడేది.

రెడ్డిజాతికి నెల్లూరు ప్రసాదించిన రత్నం కోదండరామిరెడ్డి. ఆయన జాతీయవాది. పత్రికా సంపాదకులు, తెలుగు నుడికారానికి మారుపేరు. దేశంలో నలుమూలలా తెలిసిన రెడ్డి. డా॥ కోదండరామిరెడ్డి సనాతనుల మధ్య అధునాతనుడు. అధునాతనుల మధ్య సనాతనుడు.

**మన దేశము, మనపూర్వులు,**
**మన ధర్మము, వేషభాష, మన చరితంబుల్,**
**మన నాగరకత యని విని**
**మన ముబ్బని చచ్చు దేబె మాన్యుడె? మిత్రా.**

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

# బండి గోపాలరెడ్డి
## (బం.గో.రె.)



జననం : 12-10-1938
మరణం : 31-10-1982

బండి గోపాలరెడ్డి సాహితీ ప్రపంచంలో బం.గో.రె. గా ఎరుగని సాహితీకారుడు లేడంటే ఆశ్చర్యం కలగదు. అంతటి ప్రాపకం గల అసాధారణ మౌలిక పరిశోధకుడు. బం.గో.రె. తండ్రి శంకరరెడ్డి, తల్లి శంకరమ్మ. భార్య సుమిత్ర, కుమారుడు ప్రేమ్ సాగర్.

బం.గో.రె. నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా మినగల్లులో జన్మించాడు. బి.కాం. (ఆనర్స్) మరియు డిప్లొమా ఇన్ కో–ఆపరేషన్ చదివాడు. 1961–63లలో కో–ఆపరేటివ్ బ్యాంకులో ఉద్యోగం చేశాడు. ఆంధ్రజ్యోతిలో స్వల్పకాలం పనిచేశాడు. తరువాత విశిష్ట వ్యక్తిత్వంగల చారిత్రక పరిశోధకులుగా రూపొందారు. కుహనా చరిత్రకారులందరిపై చావుదెబ్బ కొట్టాడు. చారిత్రకాంశాలపై పరిశోధన ఎంత ఆమూలాగ్రంగా, ఎంత అంకితభావంతో, ఎంత త్యాగబుద్ధితో కేంద్రీకరించి చేయాలో బం.గో.రె. నేర్పారు. "చిలక పలుకుల తత్వం, ఎంగిలి మెతుకుల బ్రతుకు, మనలో పోవటం లేదు" అని తీవ్రంగా విమర్శించాడు.

బి.కాం. (ఆనర్సు) చదివేనాటికే జర్నలిజంలో కొంత నైపుణ్యం సంపాదించాడు. 1965–1971లలో నెల్లూరు నుండి వచ్చే జమీన్ రైతు పత్రికలో పనిచేశాడు. 1969లో మొట్టమొదటి కన్యాశుల్కం ఫుట్‌నోట్స్‌తో ప్రచురించాడు. మొదటి కన్యాశుల్కం గ్రంథానికి, రెండవ కన్యాశుల్కం గ్రంథానికి వచ్చిన తేడాలు గురజాడ దృక్పథంలో మార్పులు, పరిణతి మొదలగు విషయాలను తులనాత్మకంగా చర్చించాడు. కన్యాశుల్కంలోని ప్రతి వాక్యాన్ని తడిమాడు. 1971–72లో చెన్నైలోని అమెరికా సమాచారశాఖలో పనిచేశాడు. 1974–75 యూత్ కాంగ్రెస్ (నెల్లూరు) పత్రికకు సంపాదకులుగా వున్నాడు. కందుకూరి వీరేశలింగం జీవితాన్ని తమిళ జాతీయ మహాకవి సుబ్రహ్మణ్య భారతి తమిళంలో 'చంద్రిక కథ' పేరుతో ఒక నవల రాయగా దానిని తెలుగులోనికి అనువదించి 1971లో ప్రచురించాడు. 1975–78 లో సి.పి. బ్రౌన్ ప్రాజెక్టులో పనిచేసి బ్రౌన్ సేకరించిన 23 తాతాచార్ల కథలను ఎమెస్కో ద్వారా ప్రచురింపజేశాడు. 1977 డిసెంబరులో "బ్రౌన్ జాబుల్లో స్థానిక చరిత్ర శకలాలు – కడప జిల్లా జాబుల సంకలనం" అనే పుస్తకాన్ని ప్రచురించాడు. తరువాత "బ్రౌన్ లేఖలు – ఆధునిక కేంద్ర సాహిత్య చరిత్ర శకలాలు", "బ్రౌన్ జాబులు – తెలుగు జర్నలిజం చరిత 1832 – 1857" అనే అపురూప పరిశోధక చారిత్రాత్మక గ్రంధాలు మనకు అందించాడు.

1979లో ప్రచురించిన "మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు" పుస్తకానికి ముందు మాట రాస్తూ మార్క్స్ బోధించిన చారిత్రక సృష్టి మనలో త్వరగా పిల్లెత్తుకుపోతున్నది అనిపించిందని తీవ్రంగా విమర్శించాడు.

1839లో సి.పి. బ్రౌన్ ప్రచురించిన "వేమన పద్యాల సంకలనం" పుస్తకాన్ని ఈయన సంపాదకత్వంలో పునఃప్రచురించాడు.

ఈయన 1981లో రాసిన "వేమన - సి.ఆర్. రెడ్డి" అనే గ్రంధాన్ని సి.ఆర్. రెడ్డి శతజయంతి కమిటీవారు ప్రచురించారు.

1980-81లో హైదరాబాదులోని యోగి వేమన విజ్ఞాన కేంద్రం పరిశోధన అధికారిగా పనిచేశాడు.

తెలుగు సాహిత్య చరిత్ర పరిశోధకులుగా అనన్య సామాన్యమైన కృషిచేసి ప్రగతిశీల సాహిత్య పునాదులకు అవసరమైన రకరకాల సాహిత్య గ్రంధాల పరిశీలన మనకందించి, వీరి వ్యక్తిత్వంలో మొదటినుంచీ కొనసాగిన నిరాశాదృష్టి ఫలితంగా 31-10-1982న భాక్రానంగల్ వద్ద సట్లెజ్ నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబీకులు, మిత్రులు, సాహితీ మిత్రులు తేల్చారు. ఒక లేఖ వ్రాసిపెట్టి చనిపోయాడని కొందరు, నదిలో దొరికిన బట్టలను బట్టి గుర్తించారని కొందరు అనుకున్నారు. కాని ఎందుకు, ఏ సందర్భంలో, ఎప్పుడు సట్లెజ్ నది చెంతకు పోయాడో తెలుసుకోలేని అంశంగా మిగిలిపోయింది.

గురజాడను, వేమనను, సి.పి. బ్రౌన్‌ను, కందుకూరిని, ఉన్నవ వారిని, ఇతర సాహితీకారులను లోతుగా అధ్యయనం చేసి పరిశోధనాత్మక గ్రంధాలు మిగిల్చి పోయిన గొప్ప సాహితీ పరిశోధకుడు బండి గోపాలరెడ్డి అని రెడ్డిజాతి కీర్తిగా చెప్పుకోవలసిందే.

**జనులకు సంఘీ భావమె**
**ఘనశక్తిం గూర్చు; వెంట్రుకల బేనిన త్రా**
**టను మత్తగజము నేనియు**
**బని విన బిగదీసికట్టవచ్చును మిత్రా.**

మతముల పేరట నజ్ఞులు
సతతము పోరాడ దైవ సమ్మతమగునే?
సుతులు పరస్పర కలహ
వ్రతులైనను తండ్రి ముదము వడయునె మిత్రా.

# డా॥ మల్లెమాల సుందరరామిరెడ్డి

## "మల్లెమాల" @ డా॥ యం.యస్. రెడ్డి



జననం : 15-8-1924

మరణం : 11-12-2011

"కృషి నా అనుంగు నేస్తము
కృషి నా అభిమానకేళి, కృషి నా మతమౌ
కృషి నా ప్రియతమ దైవము
కృషి నారాధించునట్టి కేవలుడను నేన్"

– మల్లెమాల

ఇది మల్లెమాల జీవిత సారం. మహిత వినయశీలుడు మల్లెమాల తననుగూర్చి తాను చెప్పుకున్న అక్షరసత్యం.

నెల్లూరు జిల్లా వెంకటగిరి తాలూకాలోని కుగ్రామం అలిమిరి యం.యస్. రెడ్డిగారి స్వగ్రామం. వెంకటగిరి జమీందారు పాలనలోనిది. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. తండ్రి రామస్వామి రెడ్డి, తల్లి రంగమ్మ. తమ్ముళ్ళు రామచంద్రయ్య, బాలకృష్ణయ్య, వేణుగోపాలయ్య, సుబ్బరామయ్య. చెల్లెలు సుశీలమ్మ. వేళకు ఎవరొచ్చినా అన్నం పెట్టే కుటుంబం. భార్య సౌభాగ్యమ్మ. కుమార్తెలు భార్గవి, శారద. కుమారుడు సినీ నిర్మాత, దర్శకుడు శ్యాంప్రసాద్ రెడ్డి.

ఒక సంవత్సరం చదువు పూర్తికాకుండానే కిరాణా దుకాణంలో సహకారిగా చేరాడు. జీతం లేదు. సరుకులు పొట్లాలు కట్టే కాగితాలు చదువుకుంటుండేవాడు. వరదలొచ్చి పొలాలు పంటలు ఊడ్చుకుపోయాయి. ఒక భట్రాజు దగ్గర రచ్చబండ విద్యకు చేరాడు. గుంటక్షరాల చదువు. పంతులు చెప్పిన "కారే రాజులు" పద్యాన్ని రాసుకోకుండా అప్పజెప్పాడు. దేవుడే పలికించాడని అమ్మ నమ్మి బాగా చదువొస్తుందని గూడూరుకు పొమ్మంది. ఖర్చుకు డబ్బులేక విస్తరాకుల కట్ట ఇచ్చింది. అమ్ముకున్నాడు. గూడూరులో ఎవ్వరూ సహకరించలేదు. తిరిగి ఇంటి కొచ్చి వేమన పద్యాలు చదువుకుంటూ ఆ గాడిలోపడి వేమన పద్యాలు లాంటివి కొత్తవి రాశాడు. ఇంటిపేరు "మన్నెమాల" అయితే అది బాగలేదని "మల్లెమాల"గా మార్చుకున్నాడు.

1936లో మహాత్మాగాంధీని చూడటానికి వెంకటగిరి వెళ్ళాడు. గాంధీగారి ఉపన్యాసం తెలుగు అనువాదాన్ని విన్నాడు. వెళ్ళి గాంధీగారి పాదాల్ని కళ్ళకద్దుకున్నాడు.

అప్పటికే కుటుంబం అప్పుల్లో పడి ఆస్తికి మించిపోయాయి. ఆస్తినంతా అమ్మి అప్పులకు దామాషాలు కట్టాడు తండ్రి. తల్లి బోరున ఏడ్చింది. అమ్మమ్మగారి పొలాన్ని సేద్యం చేయ్యటం మొదలుపెట్టాడు. అర్థాకలితో గడిపాడు. రాగిసంగటి, ఎండు చింతాకే భోజనం. వ్యవసాయం సాగలేదు. 1941లో గూడూరు వద్ద నెల్లటూరులో మైకా డిపోలో నెలకు 8 రూపాయల

ఉద్యోగంలో చేర్చింది తల్లి. బాగా పనిచేశాడు. జీతం పెంచమంటే పెంచలేదు రాజీనామా చేశాడు. ఇక ఎవరి క్రిందా పనిచెయ్యనని నిర్ణయం తీసుకున్నాడు.

అపుడు బెంగాల్‌లో కరువు విపత్తు వచ్చింది. సహాయం చెయ్యటానికని గ్రామాలలో బుర్రకథ చెప్పి పదివేలు సంపాదించి బెంగాలుకు పంపాడు. తన భుక్తి కోసం, అమ్మకోసం వడ్డెరవాళ్ళతో కలిసి మట్టిమోసే పనిచేస్తే 36 రూపాయలు కూలి వస్తే, 16 రూపాయలు తల్లికిచ్చాడు. ఆ 20 రూపాయలు పెట్టుబడితో తాటిపీచు కొని అమ్మకం ప్రారంభించాడు. తర్వాత తంగేడు పూలు, చింతకాయలు, మామిడి కాయలు, మిరపకాయలు, పెసలు, కందులు, మినుములు వ్యాపారం చేశాడు. ఆదాయం వచ్చింది. 40వేలు మిగిలాయి. తండ్రి పోగొట్టిన అవే ఆస్తుల్ని తిరిగి కొన్నాడు. చిన్నపాటి ఇల్లుకూడ కట్టించాడు.

మైకా వ్యాపారం చేద్దామని గూడూరు వద్ద 'గోగినేనిపురం'లో గోగినేని వెంకటేశ్వరరావును కలిశాడు. ఆయన సాహిత్యాభిమాని. జతకుదిరింది. పద్యం పాడాడు. వరమైంది. నెలకు ఒక టన్ను వేస్ట్ ఫిలిం ఇచ్చే ఏర్పాటు చేశాడు రావు. దానితో వ్యాపారం వృద్ధైంది. గూడూరులో "యం.యస్. రెడ్డి కో" అని పెట్టాడు. మేడ ఒకటి కొన్నాడు. వ్యాపారంలో భాగర్తను చేర్చుకున్నాడు. లాభాలతో పాఠశాల, పోస్టాఫీసు, ప్రసూతి కేంద్రం నిర్మించాడు.

15-8-1947 స్వాతంత్రం వచ్చిన దరిమిలా 1948లో పదవి పోయిన టంగుటూరు ప్రకాశంగారితో పరిచయం ఏర్పడింది. జమీందార్లకు వ్యతిరేకంగా పాట రాయగా ప్రకాశం పంతులుగారు భేష్ నీవు "సహజకవి"వోయ్ అన్నారు. అప్పటినుండి ఆ మాట ఆయనకు బిరుదైంది.

యమ్.యస్. రెడ్డి గారికి 10-10-1951 విజయదశమి రోజున సౌభాగ్యమ్మతో వివాహమైంది. గ్రామంలో జంతు బలి ఆపేశాడు. మద్యపానం లేకుండా చేశాడు. కుటుంబ పోషణంతా తనదే. 16-9-1952 పెద్దమ్మాయి భార్గవి పుట్టింది. సహజకవిత్వం అన్నిచోట్ల సాగుతూనే వుంది. నీలం సంజీవరెడ్డి గారితో స్నేహం పెరిగింది. ఎ.సి. సుబ్బారెడ్డిగారి ప్రోత్సాహంపై పంచాయితీ ఎన్నికల్లో పోటి చేసి గెలిచాడు. పంచాయితీ సమితి ఎన్నికల్లో ఓడాడు. తల్లి తండ్రిని కోల్పోయాడు.

జీవితం సినిమాల వైపు వెళ్ళింది. గూడూరులో "సుందర మహల్" సినిమా థియేటర్ కట్టి ఎ.సి.సుబ్బారెడ్డి గారిచే 1963లో ప్రారంభం చేయించాడు. ప్రారంభోత్సవ చిత్రం "నర్తనశాల". భార్యను కూడ టిక్కెట్ కొని సినిమా చూడమన్నాడు. పెట్రోలు బంకు వ్యాపారం చేశాడు. ఆహారధాన్యాలు నిల్వచేసే గిడ్డంగుల కాంట్రాక్టు చేశాడు. తమిళ సినిమా 'కుమరిప్పెణ్' డబ్బింగ్ హక్కులు కొని కౌముది ఆర్టు పిక్చర్స్ ప్రారంభించి, డబ్బింగ్ పూర్తిచేసి "కన్నెపిల్ల" పేరుతో విడుదల చేశాడు. శతదినోత్సవం చేసుకొంది. లాభం వచ్చింది. మకాం మద్రాసుకు మారింది. కొంటెపిల్ల, కాలచక్రం డబ్బింగ్ పిక్చర్లు తీశాడు. వచ్చిన లాభం పోయింది. 'భార్య' చిత్రం తీశాడు. ఒకరోజు కౌముది పిక్చర్స్ కాంపౌండ్‌లో వాకింగ్ చేస్తున్నప్పుడు శ్రీశ్రీ వచ్చి ఒకపాట రాయటానికి అవకాశం అడగగా యిచ్చాడు. 'కలసిన మనసులు' తీసి బాగా నష్టపోయాడు. మైకా వ్యాపారం ముగించాడు. 'శ్రీకృష్ణ విజయం' భారీ తారాగణంతో నిర్మించాడు. 'పాండవ వనవాసం' ప్రదర్శన హక్కులు కొన్నాడు. 'ఊరికి ఉపకారి', 'కోడెనాగు' 'రామయ తండ్రి' సినిమాలు తీశాడు. చలనచిత్ర నిర్మాణం కథ మూడడుగులు ముందుకీ ఆరడుగులు వెనక్కు నడిచింది. 'ముత్యాలపల్లకి', 'నాయుడు బావ' బాగా డబ్బు సంపాదించాయి. మాగుంట సుబ్బరామరెడ్డి గారి సలహాతో సహాయంతో  పల్నాటి సింహం' నిర్మాణం చేశారు. కోదండరామిరెడ్డి డైరెక్టరు. డబ్బు వచ్చింది.

హైద్రాబాదుకు సినీరంగం మారింది. హైద్రాబాదులో 'శబ్దాలయ' బిల్డింగ్ నిర్మించాడు

యఫ్.డి.సి.కి ఛైర్మన్ అయాడు. అన్నామలై యూనివర్సిటీ "డాక్టరేట్" యిచ్చి గౌరవించింది.

"రామాయణం" ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికై 1998లో రాష్ట్రపతి చేతుల మీదుగా స్వర్ణపతకం అందుకున్నాడు. నంది అవార్డు కూడ వచ్చింది. ఇందులో జూనియర్ యన్.టి.ఆర్. నటించాడు. తరువాత 'వంశోద్ధారకుడు', 'వెలుగు నీడలు', 'అందం', 'ఆహుతి' నిర్మించాడు. లాభాలొచ్చాయి. 'అంకుశం', 'ఆగ్రహం' 'అమ్మోరు' 'అంజి' తీశాడు. నష్టపోయాడు.

కొడుకు శ్యామ్‌ప్రసాద్ ఎక్కివచ్చాడు. మాగుంట సుబ్బరామరెడ్డి సహకారంతో "అరుంధతి" సినిమా తీశాడు. సంచలనాత్మక విజయం సాధించింది. యం.యస్. రెడ్డి కుటుంబానికి చిరకీర్తి తెచ్చింది.

ఇంతవరకు ఆయన జీవితం ఒక పార్శ్వమైతే ఇంతకు మించినది ఆయన సాహిత్య పార్శ్వము. ఆయనకు అది భగవంతుడు శ్రీరాముడిచ్చిన వరం. ఆయన సహజకవి. వేమనకు అజ్ఞాత శిష్యుడు. 3వ తరగతి కూడ సరిగా చదవని మట్టిమనిషి. వ్యాకరణం, ఛందస్సు చదవకుండా 30వేల పద్యాలు, కవితలు, గీతాలు వ్రాశాడంటే నమ్మలేని నిజం. ఆనాడు బాల్యంలోనే టంగుటూరు ప్రకాశం పంతులు సహజ కవిగా గుర్తిస్తే, 2003 సంవత్సరంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆయనను ఆహ్వానించి 12-1-2003 తేదీన "అభినవ వేమన" బిరుదునిచ్చి సత్కరించింది. అప్పుడాయన మళ్ళీ జన్మంటూ వుంటే కవిగానే పుడతానని, ప్రకాశం జిల్లాలోనే పుడతానని ప్రకటించాడు. ఆయనకు ఎన్ని అవార్డులో, ఎన్ని బిరుదులో చెప్ప సాధ్యంకాదు.

ఇతర దేశాలలో ఆయన కవితాగానం దేశ దేశాలకు పాకింది. ఆయన ప్రయాణంలో ఉండేల మాలకొండారెడ్డి విడదీయరాని మిత్రుడు. అమెరికాలో "ఎంతకమ్మని భాష మనది, ఎదను కదిపే భాష మనది" అని తెలుగును చాటి చెప్పాడు. చైనా, లండన్, థాయ్‌లాండ్, మారిషస్, బర్మింగ్‌హామ్ మొదలైన దేశాలు తిరిగి తెలుగు భాషకీర్తిని చాటాడు. సభలు, సమాఖ్యలు లెక్కేలేదు.

పంచకట్టిన వాల్మీకియా అన్నట్లు 5 సంవత్సరాలు తదేక దీక్షతో శ్రమించి కాలికి చెప్పుకూడ తొడగకుండా భక్తితో 'రామాయణం' పద్యకావ్యాన్ని రచించాడు. దానికి "మల్లెమాల రామాయణం" అని పేరు పెట్టాడు. సాహితీలోకంలో ఇదొక అద్భుతం. పలువురు పెద్దల ప్రశంసలనందుకున్నది. 3వ తరగతి పల్లెటూరు వ్యక్తి రామాయణం వ్రాయటం అద్భుతం కాదని అనలేము. గుంటూరు శేషేంద్రశర్మగారు వాల్మీకి మళ్ళీపుట్టాడు అని సంభావించాడు. ఎంతమంది అడిగినా కాదని పోతనవలె తన రామాయణ గ్రంథాన్ని "నీ కృపతో రూపొందిన / ఈ కావ్యము స్వీకరించి ఇందలి ఫలమున్ / లోకులకు నీవె పంచుము / నాకీ సంతృపి చాలు నళిన దళాక్షా" అంటూ శ్రీరామునకు సమర్పించి అంకితమిచ్చాడు. ఈ గ్రంథాన్ని సప్తగిరి ఛానెల్‌లో తానే వరుసగా అరవై వారాలు స్వీయ పఠనం చేశాడు. అది వినిన హైదరాబాదులోని వాల్మీకి సంఘం వారు "ఆంధ్రవాల్మీకి" బిరుదు నిచ్చి గౌరవించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "కళారత్న" బిరుదునిచ్చి గౌరవించింది. రఘుపతి వెంకయ్య నాయుడు అవార్డు పొందాడు.

తదుపరి "నివేదన" "వృషభపురాణం" "భారతరత్నాలు" "వివేకానందుడు", "ఎందరో మహానుభావులు" "తెనేటీగలు" "రాయాలనివుంది" "వెండితెర నేపథ్యంలో" "భారత స్వాతంత్ర సంగ్రామ చరిత్ర" గ్రంథాలను తన పెళ్ళి అయిన 58వ సంవత్సర సందర్భంగా 2009 అక్టోబరు 10వ తేదీన ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ కొణిజేటి రోశయ్యగారి చేతులమీదుగా విడుదల చేశారు. తెలుగు సాహితీలోకంలో యం.యస్. రెడ్డిగారి నెరుగనివారు లేరు.

యం.యస్. రెడ్డి గారికి మన రాష్ట్రమంత్రులు ముఖ్యమంత్రులందరితోనే కాక, దేశ నాయకులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, నీలం సంజీవరెడ్డి, వి.వి. గిరి, శంకర దయాళ్‌శర్మ, యల్.కె. అద్వాని, కె.ఆర్. నారాయణన్, మర్రి చెన్నారెడ్డి, జి. కృష్ణమూర్తి, రామేశ్వర్ ఠాకూర్, దలైలామ, ఏచూరి సీతారామ్, టి. సుబ్బిరామిరెడ్డి మొదలైన నాయకులందరితో సుపరిచయం పెంచుకున్నాడు. సినిమారంగ ప్రముఖులందరితో మంచి పరిచయాలు పెంచుకున్నాడు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డికి వియ్యంకుడు.

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి. నారాయణ రెడ్డి గారు ప్రియంగా యం.యస్. అని పిలుస్తాడు. వారింటికీ వీరింటికీ మధ్య ప్రహరీగోడే అడ్డం.

రెడ్డిజాతికి మణికిరీటాన్ని తెచ్చిన "మల్లెమాల" సుందర రామిరెడ్డి @ యం.యస్. రెడ్డి గారిని ఎన్నటికీ మరువలేము.

**పసుల వన్నె వేఱు పాలేక వర్ణమౌ**
**బుష్ప జాతి వేరు పూజ యొకటి**
**దర్శనంబు వేరు దైవంబు ఒకటి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# డా॥ యెద్దుల బాలశౌరిరెడ్డి



1-7-1928

బాలశౌరిరెడ్డి గారి తండ్రి గంగిరెడ్డి. తల్లి ఓబులమ్మ. భార్య సుభద్రాదేవి. కుమారుడు వెంకటరమణా రెడ్డి. కుమార్తెలు జ్యోతి, భారతి.

యెద్దుల బాలశౌరిరెడ్డి, మధ్యతరగతి రైతు కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి. ఊరు కడపజిల్లా పులివెందుల తాలూకా గొల్లలగూడూరు. ఆయన నాలుగు సంవత్సరాల వయసులోనే

తల్లి స్వర్గస్తురాలైంది. తండ్రి పునర్వివాహం సంగతి ఆలోచించలేదు. బాలశౌరిరెడ్డి అభివృద్ధి ఒక్కటే ఆయన ఆలోచన.

బాలశౌరిరెడ్డి, కడప, నెల్లూరు, అలహాబాద్, బెనారెస్‌లలో విద్యాభ్యాసం చేశాడు. శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీ (తిరుపతి) నుండి డి.లిట్. పొందాడు. తెలుగు, తమిళం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలను క్షుణ్ణంగా అభ్యసించాడు. భాష, సాహిత్యం, సంస్కృతి, చరిత్ర ఆయనకు అభిమాన విషయాలు. కథానికలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు, వాఙ్మయ చరిత్ర, పఠనము, యాత్రలు, ఆయన అభిరుచులు.

బాలశౌరిరెడ్డి మాతృభాష తెలుగు. బాలశౌరిరెడ్డి తెలుగు సాహిత్య సంపదను హిందీ పాఠకులకు పంచిన ఘనుడు. ఇటు తెలుగులోను అటు హిందీలోను లెక్కకు మించి రచనలు చేసిన సవ్యసాచి. పేరుగన్న హిందీ అనువాదకుడు. హిందీ భాషలోని చందమామ పత్రికకు రెండు దశాబ్దాలు 1966 నుండి 1988 వరకు సంపాదకత్వం వహించి ఆ పత్రికకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన వ్యక్తి.

చిన్నప్పటి నుండి అమరకోశం, ఆంధ్రనామ సంగ్రహం, శతకాలు, సుభాషితాలు బట్టీ పట్టేవాడు. తెలుగులో సాహితీ సృజన చేయాలని కోరుకునేవాడు. కాని 1946లో మద్రాసులో హిందీ ప్రచారసభకు గాంధీగారు హాజరైనప్పుడు ఆయనను చూడటానికి వెళ్ళాడు. గాంధీ హిందీలో ఉపన్యసించాడు. గాంధీ సంతకాన్ని బాలశౌరిరెడ్డి పొందాడు. అదీ హిందీలోనే వుంది. అప్పటి నుండి హిందీ భాష అభ్యసించాలని తన ఇరవయ్యో యేట ఎవ్వరికి చెప్పకుండా కాశీకి వెళ్ళాడు. కాశీలో విద్యార్థిగా వున్న రోజుల్లో సరోజినీ నాయుడు మరణించారు. సంతాప సభలో తాను వ్రాసిన హిందీ కవితను చదివాడు. కమలా త్రిపాఠి ఆ కవితను మెచ్చుకొని హిందీలో కవితలు రాయమన్నారు. అలా తెలుగులోనూ, హిందీలోనూ పుంఖాను పుంఖాలుగా రచనలు చేశాడు. తుదకు హిందీలో 75 గ్రంథాలు, తెలుగులో 13 గ్రంథాలు రాశాడు.

కాశీ నుండి తిరిగి వచ్చాక మద్రాసులో హిందీ ట్రైనింగ్ కళాశాలలో ఉపన్యాసకునిగా చేరాడు. ప్రిన్సిపాల్‌గా చేశాడు. ఆరోజుల్లో ఉద్దండులైన తెలుగు రచయితలతో పరిచయం కలిగింది.

అలా సాగుతున్నపుడు 1954లో హైదరాబాదులోని ఆంధ్ర హిందీ పరిషత్ వారు 'పంచామృత్' గ్రంధాన్ని వ్రాయమన్నారు. దానిలో తిక్కన, పోతన, వేమన, చేమకూర వెంకటకవి గారల పరిచయాలతో పాటు ఒక్కొక్కరివి 125 పద్యాలు వంతున మొత్తం 625 పద్యాలను హిందీలోకి అనువదించాడు. ఆ గ్రంధం బాలశౌరిరెడ్డికి పెద్దపేరు తెచ్చింది. పెద్దలు అభినందించటమే కాక భారత ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు పోటీపడి బహుమతులందించాయి. కడపలో గొప్ప సన్మానం జరిగింది.

బాలశౌరిరెడ్డి హిందీలో 13 నవలలు రాశాడు. వాటిని ఢిల్లీ, అలహాబాదు, పాట్నావారు ప్రచురించారు. అందులో నాలుగు నవలలు ఆంధ్రదేశంలోని పల్నాడు, కొండవీడు, విజయ నగరాల చరిత్రకు సంబంధించినవి. "జిందగీకి రాహ్" అనే నవలకు ఇందిరా గాంధీ చేతుల మీదుగా బహుమతి నందుకున్నాడు. అది "బతుకుబాట" పేరుతో తెలుగులోకి అనువదించ బడింది. అలాగే "లకుమ" నవల హిందీలో రాస్తే ఏడు ముద్రణలు పొందింది. లకుమ కొండవీటిరెడ్డిరాజు కుమారగిరిరెడ్డి ఆస్థాన నాట్యకత్తె. దీనిని పి. రాజగోపాలనాయుడు తెలుగులోకి అనువదించారు. కన్నడం, గుజరాతీ, ఇంగ్లీషు భాషలలోకి అనువదించబడింది. 5 నవలలు గుజరాతీలోకి అనువదించబడ్డవి. కథలు ఉర్దూ, గుజరాతీ, డోగ్రో, మలయాళం భాషల్లో ప్రచురించబడ్డాయి.

1966 నుండి 1988 వరకు హిందీ చందమామకు సంపాదకత్వం వహించినప్పుడు 75 వేల ప్రతులు సర్క్యులేషన్ నుండి లక్షా అరవైఏడువేల ప్రతులు అమ్ముడుపోయే స్థితికి తెచ్చాడు.

1990 నుండి 1994 వరకు కలకత్తాలో భారతీయ భాషా పరిషత్తుకు డైరెక్టరుగా చేశాడు. ఆ సంస్థ ప్రతి సంవత్సరం 12 భాషా గ్రంధాలకు బహుమతులిస్తుంది.ఆ పరంపరలో సి. నారాయణరెడ్డి, పుట్టపర్తి, భరద్వాజ, కేతు విశ్వనాధరెడ్డి వగైరాలున్నారు.

1994లో హిందీ అకాడమీకి అధ్యక్షునిగా ముఖ్యమంత్రి విజయభాస్కరరెడ్డి నియమించారు. 1995-1997లలో "చమకతా సితారా" హిందీ దినపత్రికకు ముఖ్య సంపాదకత్వం వహించాడు. అంతర్రాష్ట్రీయ హిందీ సమితివారి ఆహ్వానంపై అమెరికా,

ఇంగ్లండు, సింగపూరు వగైరా దేశాలు తిరిగి వచ్చేసరికి విజయభాస్కరరెడ్డి ప్రభుత్వం పడిపోగా తానూ రాజీనామా చేశాడు. వద్దని గజ్జల మల్లారెడ్డి వగైరాలెంత చెప్పినా బాలశౌరిరెడ్డి వినలేదు. ఇంతలో తమిళనాడు హిందీ అకాడమీవారి ఆహ్వానంపై ఆ రాష్ట్ర హిందీ అకాడమీకి 1996లో అధ్యక్షుడైనాడు.

హిందీ భాషారంగంలో ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా మాతృభాష తెలుగు మాధుర్యాన్ని హిందీ భాషీయులకు అందిస్తూనే ఉన్నాడు. తెలుగు వాఙ్మయ నిర్మాతలు నన్నయ నుండి నారాయణరెడ్డి వరకు 30 మంది రచయితల రచనలను హిందీలో పరిచయం చేశాడు. అంతేగాక హిందీలో "తెలుగు వాఙ్మయ చరిత్ర"ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంచే ప్రచురింపజేశాడు. 235 తెలుగు కథలను హిందీలోకి అనువదింపజేసి 5 సంపుటాలుగా ప్రచురింపజేశాడు. తెనాలి రామలింగడి కథలు, మర్యాద రామన్న కథలు, తెలుగు ప్రబంధ కావ్యాల సంగ్రహం వగైరా గ్రంధాలను హిందీలోకి అనువదించి తెలుగు సాహిత్యాన్ని, సంస్కృతిని హిందీ పాఠకలోకానికి అందించాడు.

జ్ఞానీ జైల్‌సింగ్, రాజీవ్ గాంధీ, శంకర్‌దయాళ్ శర్మ చేతుల మీదుగా అనేక పురస్కారా లందుకున్నాడు. 2000 సం॥లో ఢిల్లీ సాహిత్య అకాడమీ భవన్‌లో ఘనసన్మానం జరిగి 400 పుటల అభినందన సంచిక "అపనే అపనే బాలశౌరిరెడ్డి" పేరుతో వెలవడింది. అలాగే మద్రాసులో ఆయనకు అమృతోత్సవ సభ (75 సంవత్సరాల వయసుకు జరిగే సభ) జరిపి గౌరవించారు. అలాగే కడప ఉత్సవాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా గౌరవించి మీ సాహిత్యసేవకు మేము గర్విస్తున్నామని ప్రస్తుతించాడు.

"వాఙ్మయ రత్నాకర" బిరుదు పుష్పగిరి పీఠాధిపతుల ద్వారా, "సాహిత్య మార్తాండ", సాహిత్య వారధి" కళాసంస్కృతీ సంస్థాన్ – మధుర (యు.పి.) ద్వారా "విద్యా భాస్కర్" డి.లిట్. విక్రమ శిలా హిందీపీఠ్ – భాగల్‌పూర్, బీహార్ ద్వారా, "సాహిత్య వాచస్పతి", హిందీ సాహిత్య సమ్మేళనం – ప్రయాగ ద్వారా, "హిందీరత్న" ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ – హైదరాబాదు ద్వారా, "శిఖర సమ్మాన్" అఖిల భారత హిందీ సమ్మేళనం ద్వారా, "హిందీ రత్న" రాష్ట్రీయ హిందీ పరిషత్ – మీరట్ ద్వారా, "ఉత్తరరత్న" ఉత్తర భారత యువక్ సమితి

– బొంబాయి ద్వారా, "మానవ భారతి సమ్మాన్" మానవ భారతి శిక్షా సమితి – హిస్సార్ (హర్యానా) ద్వారా, "ద్వివాగీళ్" భారతీయ అనువాద పరిషత్తు – ఢిల్లీద్వారా, అంతర రాష్ట్రీయ హిందీ సమితి ద్వారా హ్యూష్టన్ (టెక్సాస్)లో తామ్రపత్రం, సన్మాన పత్రం పొందాడు. ఇతర దేశాలలో సన్మానాలు పొందాడు.

మొత్తం 53 హిందీ గ్రంధాలు, నవలలు, అనువాదాలు, కథల సంపుటాలు, నాటకాలు, నాటక సంపుటాలు, జీవిత చరిత్రలు, పరిశోధనా వ్యాసాలు రచించాడు. తెలుగులో 2 నవలలు, 5 అనువాదాలు రచించాడు.

అనేక విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంథాల్లో ఈయన రచనలు పాఠ్యభాగాలుగా వున్నవి.

బహుమతులు, సన్మానాలు ఎన్ని పొందుతున్నా, ఎక్కడ నివసిస్తున్నా ఇవన్నీ కడప మట్టికే చెందుతాయని నిర్ద్వంద్వంగా చెప్పాడు.

రచయిత జీవితం, ఇతరులకు ఆదర్శప్రాయం కావాలని, సమాజ కల్యాణానికి గీటురాళ్ళు కావాలని ఆశించాడు.

ఇలా మాతృభాష తెలుగు గొప్పదనాన్ని హిందీ ప్రపంచానికి తెలిపిన అసాధారణ రెడ్డి కావటం రెడ్డిజాతికే గర్వకారణం.

**పొరుగిల్లు గాలుచుండగ**
**పరుగిడి యార్పంగబోక ప్రతిమనుజుండున్**
**బిరబిర దన యిల్లెక్కిన**
**కర మరుదే పల్లెయెల్లగాలుట మిత్రా.**

రైతుల యాకటిమంటలు,
రైతుల నిట్టూర్పుపొగలు, రగిలెడువగలున్,
ఏ తరినొక్కటై పెనుగొను
ఆతరి సామ్రాజ్యమైన నగలును మిత్రా.

# డా॥ పాకాల యశోదారెడ్డి



జననం : 8-8-1929
మరణం : 7-10-2007

యశోదారెడ్డి గారి తల్లిదండ్రులు కాశిరెడ్డి, సరస్వతమ్మగారలు. వారు మహబూబ్‌నగర్ జిల్లా అనగా ప్రస్తుత నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి గ్రామ వాస్తవ్యులు.

యశోదారెడ్డి బాల్యం దుర్భరంగా మొదలైంది. పుట్టిన మూడవ నెలలోనే కన్నతల్లిని పోగొట్టుకున్నది. పాలిస్తున్న మరో యువతి కూడ ఇంకో నాలుగు నెలలకు మరణించింది.

యశోదారెడ్డి దురదృష్ట జాతకురాలన్నారు గ్రామమంతా. తండ్రి కూడ ఆమె తొమ్మిదోయేట పరమపదించారు.

చదువు సొంత పూళ్ళోనే సాగింది. తర్వాత హైదరాబాదుకు చేరింది. నారాయణగూడలో మాడపాటి బాలికల హైస్కూలులో చేరింది. విద్యార్థి దశలోనే ఏకసంతగ్రాహి. అధ్యాపకులకు ఆశ్చర్యం కలిగింది. రావు బహద్దుర్ కొత్వాల్ వెంకట్రామిరెడ్డి ఆమెను రెడ్డి బాలికల హాస్టలులో చేర్చుకొని సహాయం చేశాడు. హాస్టల్ రజతోత్సవం రోజు జరిగిన సభలో విద్యార్థిగా వరకట్నం అంశంపై అద్భుతంగా మాట్లాడి పెద్దలందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె మహిళా కళాశాలలో బి.ఎ. చదివింది. తెలుగులో, సంస్కృతంలో ఎం.ఎ. చేసి ఉస్మానియా యూనివర్శిటీలో పిహెచ్.డి. చేసి డాక్టరేట్ పొందింది. అమె స్నేహితుల ద్వారా అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన చిత్రకళా వైజయంతిని చాటిన ప్రఖ్యాతి చిత్రకారుడు పాకాల తిరుమలరెడ్డి (పి.టి.రెడ్డి)ని వివాహం చేసుకున్నది. అప్పటి నుండి ఆమె జీవితం కొత్తమలుపు తిరిగింది. భర్త ప్రోత్సాహంతో ఎం.ఎ. తెలుగు చదివి, తరువాత "తెలుగులో హరివంశాలు" అంశంపై పరిశోధన చేశారు. డాక్టరేట్ పొందారు. ఆ తర్వాత ఆమె ఎం.ఎ. సంస్కృతం చదివారు. నాచన సోముడు, ఎర్రాప్రగడలపై సమగ్రంగా పరిశోధన చేశారు.

యశోదారెడ్డి తొలుత దక్కన్ రేడియోలో స్క్రిప్ట్ రైటరుగా, అనౌన్సరుగా పనిచేశారు. "ఊరబాయి ముచ్చట్లు", "జర ఇనిపించుకో తల్లి" కార్యక్రమాలు ఆమెకు పెద్ద పేరు తెచ్చిపెట్టాయి. అవి తెలంగాణా మాండలికంలో సాగాయి. "మాలక్ష్మీ ముచ్చట్లు", "మా వూరి కథలు" పేరొందాయి. మాండలికాలు ఎలక్ట్రానిక్ మాధ్యమంలో ప్రవేశపెట్టిన ఘనత యశోదారెడ్డిదే.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1955 నుండి లెక్చరరుగా , ప్రొఫెసరుగా ముప్పై సంవత్సరాలకుపైగా 1989 వరకు బోధనావృత్తిలో ఉన్నారు. ఆమె ప్రతిభ సాహితీ లోకానికి, ప్రభుత్వానికి పాకింది. ఆమెకు ఆగ్రా యూనివర్శిటీ డి.లిట్. ప్రదానం చేసింది. ఆమె జర్మన్ భాషలో డిప్లొమా చేసింది. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ, కన్నడ భాషలలో దిట్ట. ఆమెను ప్రముఖ స్కాలర్‌గా రాష్ట్ర సాహిత్య అకాడమీ, తెలుగు యూనివర్శిటీ, ఆంధ్ర సారస్వత పరిషత్తులు గుర్తించి ఘనంగా సత్కరించాయి. జగద్గురు శంకరాచార్య ఆమెను ధర్మప్రచారికగా

నియమించారు. వేదాంతానిని మహిళా జీవితానికి జోడించి ఉపన్యసించారు. 1990లో అధికార భాషా సంఘం అధ్యక్షురాలిగా పదవి పొంది మూడు సంవత్సరాలు పనిచేసింది. ఆమె ఆ సమయంలో ఆర్డినెన్సులు తెలుగులో తేవటానికి, వాడుక భాషలో ఎం.ఎ. ప్రారంభించటానికి ఆరాటపడ్డారు. పోరాటం చేశారు.

ఆమె పలుగ్రంథాలు రాశారు. "పోతన కవితాసుధ", "మహాభాగవత కల్ప కుసుమమాల" అన్న రెండు రచనలను సాహిత్య అకాడమీ సౌజన్యంతో ప్రచురించారు. ''ఆంధ్ర సాహిత్య వికాసం", "పారిజాతాపహరణ పద్యాలోచన", "భాగవత కల్ప కుసుమావళి", "నారదీయం", "నృసింహ పురాణం", "బాలిక", "ఉగాదికి ఊయల", "భారతంలోని స్త్రీ", "ధర్మశాల", "ఎచ్చమ్మ కథలు" అను ప్రసిద్ధ రచనలు చేశారు. "మావూరి ముచ్చట్లు" తెలంగాణా మాండలికంలో రాశారు. ప్రజాతంత్రలో సామెతలపై శీర్షిక నిర్వహించారు.

తల్లిని చూడలేని యశోదారెడ్డి చదువుల తల్లిలోనే తన తల్లిని చూచుకున్నారు. తెలుగు సాహితీ పరిశోధనా మేటిరత్నాల్లో ఒకరై యశోదారెడ్డి కీర్తి పతాకనందుకున్నది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో "ఇండియా ఇంటర్నేషనల్"కు సభ్యురాలు కావటం, వారు రాజమండ్రిలో నిర్వహించిన సభలో డా॥ యశోదారెడ్డి ప్రసంగం విని ఆ సభను అప్పటి కప్పుడు ఆమెకు కనకాభిషేక సభగా ప్రజలు మార్చేసి ఆ సత్కారం చేయటం జీవితంలో ఆమెకు ఒక తీపిగుర్తు.

కన్నతల్లిని పోగొట్టుకున్నట్లే, ఆమె కన్నతల్లి అదృష్టాన్ని నెలలోపే పోగొట్టుకుంది. నెలలోపే కన్నబిడ్డ విజయ్ పరలోకం చేరాడు.

పి.టి. రెడ్డిగారి అనంతరం ఆయన అపురూప చిత్రాల సమాహారమైన సుధర్మ ఆర్ట్ గ్యాలరీని ఆమె నిర్వహించింది.

ఘనచరిత్ర నిర్మించిన రెడ్డి మహిళ డా॥ యశోదారెడ్డి 7-10-2007 తేదీన తీవ్ర అనారోగ్యానికి గురై స్వర్గస్తులైనారు. తెలుగుజాతి ఒక ఆణిముత్యాన్ని కోల్పోయింది. ఆమెకు తెలుగుజాతి, రెడ్డిజాతి ఘననివాళులర్పించాయి. డా॥ యశోదారెడ్డి మరవరాని వ్యక్తి.

పాలిన యాకులు రాలిన
సాలంబులు లేజివుళ్ళ సమకొనుపోల్కిం,
గాలాను సరణి మార్పులు
వాలాయము సంఘమందు  పనుపడు మిత్రా.

# ప్రొ: జి. సుందర రెడ్డి



జననం : 10-4-1918
మరణం : 30-3-2005

సుందరరెడ్డి గారు నెల్లూరుజిల్లా బత్తులపల్లి గ్రామంలో గుండ్ర చెంచురెడ్డి, రంగమ్మ గార్లకు జన్మించాడు.

ఆయన విద్యాభ్యాసం తన మేనమామ పులకం రామక్రిష్ణారెడ్డి పర్యవేక్షణలో చీరాలలో సాగింది. 1934లో హిందీ సాహిత్యరత్న అభ్యసించుటకు అలహాబాద్ హిందీపీఠ్‌కు వెళ్ళాడు. అక్కడ లాల్‌బహదూర్ శాస్త్రి, పురుషోత్తమదాస్ టాండన్‌లు ఆయనకు అధ్యాపకులు. సహాయ నిరాకరణోద్యమంలో అలహాబాద్ హిందీ విద్యాపీఠ్ మూతపడగా లాల్‌బహదూర్ శాస్త్రి సిఫారసుతో సుందరరెడ్డి కాశీ విద్యాపీఠ్‌లో "శాస్త్రి" పట్టా కోసం ప్రవేశించాడు. తరువాత అదికూడ మూతబడగా ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదివాడు.

1941 ఆగష్టులో మేనమామ కుమార్తె వజ్రమ్మతో వివాహం జరిగింది. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలిగారు.

23-10-1942 తేదీన డా॥ కట్టమంచి రామలింగారెడ్డి గారు సుందరరెడ్డిని ఆంధ్రా యూనివర్శిటీలో హిందీ ట్యూటరుగా నియమించాడు. 1944లో హిందీ పండితునిగా పదోన్నతి పొందాడు. 1965 వరకు ఆంధ్రా యూనివర్శిటీలో సంస్కృతిశాఖ, హిందీశాఖల కొరకు ప్రయత్నాలు చేశాడు. 1965లో హిందీశాఖ ప్రారంభమైంది. తన చొరవతో సుందరరెడ్డి హిందీశాఖకు సొంతభవనం ఏర్పాటు చేయించాడు. తరువాత సుందరరెడ్డి ఆంధ్రా యూని వర్శిటీలో హిందీశాఖ ఉపన్యాసకులుగా, రీడరుగా, ఆ శాఖకు ప్రప్రథమ ఆచార్యునిగా పదోన్నతులు పొందాడు. ఆయన నిర్దేశకత్వంలో సుమారు 50 మంది పరిశోధకులు హిందీలో డాక్టరేట్‌లు, యం.ఫిల్. పట్టాలు పొందారు. ఆయన సాహిత్యంపై కూడ పరిశోధనలు జరిగి డాక్టరేట్ పట్టాలు కొందరు పొందారు. ఆయన దాదాపు 12 ప్రముఖ గ్రంథాలు రాశారు.

ప్రొ. సుందరరెడ్డి హిందీ భాషలో అనేక గ్రంథాలు రాశాడు. తెలుగు, ఇంగ్లీష్ భాషలలో కూడ పలుగ్రంథాలు రాశాడు. ఆయనపై గ్రంథాలు వెలువడ్డాయి.

సుందరరెడ్డి చేసిన హిందీ భాషా సేవలను కొనియాడుతూ వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యా సంస్థలు పలు బిరుదులు, పురస్కారాలను ఇచ్చాయి. 1966లో హిందీ ప్రచార్ సభ హైదరాబాదు శాఖవారు "సాహిత్యాచార్య" (డి.లిట్.) బిరుదు ప్రదానం చేశారు. 1974లో కాశీలోని రామచరితమానస్ వారు తామ్ర పత్రాన్నిచ్చి గౌరవించారు. దక్షిణ భారత హిందీ

ప్రచారసభ మద్రాస్ సంస్థ తరఫున జరిగిన స్వర్ణోత్సవ సభలో భారత ప్రధాని ఇందిరాగాంధీ చేతుల మీదుగా "సర్వశ్రేష్ఠ రచనాకార్" పురస్కారాన్నందుకున్నారు. ఆయన రచించిన "శోధ్ ఔర్ బోధ్"కు 1976లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత పురస్కారమిచ్చి గౌరవించింది. 1984లో ప్రయాగలోని హిందీ సాహిత్య సమ్మేళన్ సంస్థ "సాహిత్య వాచస్పతి" బిరుదునిచ్చి సన్మానించింది. 1988లో బీహార్ ప్రభుత్వం "అ హిందీ భాషీ హిందీ సేవీ సమ్మాన్" బిరుదు నిచ్చింది. 1990లో ఆంధ్ర విశ్వవిద్యాలయం డి.లిట్. నిచ్చి గౌరవించింది. 1993లో ఆంధ్ర ప్రదేశ్ హిందీ అకాడమీ అధ్యక్షుడైనాడు. 1996లో ఆగ్రాలోని కేంద్రీయ హిందీ సంస్థాన్ వారు భారత రాష్ట్రపతి చేతులమీదుగా "సుబ్రహ్మణ్య భారతి" పురస్కారం అందించారు. 1997లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం "సౌహార్ద్" పురస్కారమిచ్చి సత్కరించింది.

సుందరరెడ్డి దేశంలోని పలు విశ్వవిద్యాలయాలలో దాదాపు 200కు పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు.

సుందరరెడ్డి చేస్తున్న హిందీ భాషా సేవను గుర్తించి భారత ప్రభుత్వం ఈయనను వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలలో హిందీ సలహా మండలి సభ్యునిగా నియమించింది. కేంద్ర సలహా మండళ్ళ సభ్యునిగా కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ, రైల్వే మంత్రిత్వశాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖ, కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, తంతి, తపాలా మంత్రిత్వశాఖ మరితర శాఖలు నియమించుకున్నాయి.

1976లో మారిషస్‌లో జరిగిన ప్రపంచ హిందీ మహాసభలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ అధ్యక్షునిగా, ఉత్తర-దక్షిణ భారతదేశంలోని విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, రీడర్ల నియామకాల ఎంపిక సమితి సభ్యునిగా, విశాఖ హిందీ పరిషత్ గౌరవ అధ్యక్షునిగా మరితర హిందీ సంబంధిత, పుస్తక, రచన, ప్రచురణ కమిటీలలో సుందరరెడ్డి సేవ నిరుపమానమైనది.

సుమారు 40 సంవత్సరాలు అధ్యాపక వృత్తిలో కొనసాగి, అపార అనుభవాన్ని గడించి, వేలాదిమంది విద్యార్థులను, పరిశోధకులను, అధ్యాపకులుగా, సాహిత్యవేత్తలుగా తీర్చిదిద్ది నటువంటి ప్రొ. సుందరరెడ్డి 1979 ఏప్రిల్ నెలలో పదవీ విరమణ చేశాడు.

పదవీ విరమణానంతరం న్యూఢిల్లీలోని యు.జి.సి. ఈయనను ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా నియమించింది. తన బోధనాకాలంలో యు.జి.సి. మంజూరు చేసిన నిధులతో మేజర్ రీసెర్చి ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తిచేశాడు. హిందీ భాషాభివృద్ధికి ఆయన చేసిన విశేష సేవలను గుర్తించి ఆయన స్థాపించిన హిందీ భవన్‌ను 10-7-2004 "ప్రొ॥ గుండ్ర సుందరరెడ్డి హిందీ భవన్"గా నామకరణం చేశారు.

30-3-2005న స్వర్గస్తులైన ఆచార్య సుందరరెడ్డి జీవితం నేటి తరం అధ్యాపకులకు ఆదర్శం. ఆయన వ్యక్తిత్వం మరియు రచనలు అనుసరణీయం. దక్షిణ భారత హిందీ సేవకులలో సుందరరెడ్డి సుస్థిరస్థానాన్ని సంపాదించాడు. పట్టుదల, కార్యదక్షత, అంకితభావం పుష్కలంగా గల సుందరరెడ్డి నేడు మన మధ్య లేకపోయినప్పటికి ఆయన రచనలు మరియు హిందీ భాషాభివృద్ధికి దేశమంతటా వివిధ హిందీ భాషేతర రాష్ట్రాలలో ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి.

అట్టి గొప్పవ్యక్తి రెడ్డి కులానికి ఒక ప్రముఖ ఆభరణం.

**జలములు నిలిచిన కొలకుల**
**పలురకముల మురికిచేరు, పాచి చిగుర్చున్;**
**నిలువక పారెడు వాగుల**
**పొలుపారును నిర్మలాంబుపూరము మిత్రా.**

# బద్దం భాస్కరరెడ్డి

**(చెరబండ రాజు)**



జననం : 1944
మరణం : 2-7-1982

చెరబండరాజు 'దిగంబర కవి'గా పుట్టి విప్లవకవిగా రూపుదిద్దుకున్నవాడు. వచన కవితలతో ప్రారంభించి, పాటల పల్లవిగా మారినవాడు. అరెస్టులతో, జైలు జీవితంతో, అనారోగ్యంతో, ఆర్థిక సమస్యలతో ఇబ్బందులెదుర్కొంటున్నా, కవిత్వాన్ని మరింత

పదునెక్కించాడే గాని, ఎక్కడా, ఎప్పుడూ మెత్తబడలేదు. జీవితం పట్ల, సామాజిక పురోగతి పట్ల ఆశావాదమే గాని, నిరాశను దరిజేరనివ్వలేదు.

హైదరాబాదుకు తూర్పు దిక్కున 24 కి.మీ. దూరంలో ఉన్న అంకుశాపురం అనే గ్రామంలో ఒక నిరుపేద రైతు కుటుంబంలో పుట్టాడు చెరబండరాజు. ఈ గ్రామం నల్గొండ జిల్లా భువనగిరి తాలూకాలోది. పుట్టిన తేదీ తెలియదు. 1944లో పుట్టినట్టు రికార్డులలో ఉంది. అప్పటికి ఆ గ్రామం నిజాం ప్రత్యేక పాలన ప్రాంతంలో భాగం.

చెరబండరాజు అసలు పేరు బాలనరసింహ. ముద్దుపేరు బక్కయ్య. బళ్ళో చేరేటప్పుడు ఒక అధ్యాపకుడు భాస్కరరెడ్డిగా పేరు మార్చాడు. ఇంటి పేరు బద్దం. అలా బద్దం భాస్కరరెడ్డి అయ్యాడు. రెడ్డి కుటుంబం 1960లో శ్యామలతో వివాహం. 1961లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశం. హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే కవిత్వం రాసేవాడు. బాల్యం నుండే కళాతృష్ణ ఎక్కువ. శాంతినికేతన్ గురించి విని కలకత్తా వెళ్ళాడు. అక్కడకు వెళ్ళాక అర్థమయింది – అది తనలాంటి వాళ్ళకు కాదని. వెంటనే తిరిగొచ్చాడు. 1962లో నిఖిలేశ్వర్‌తో పరిచయం. 1965 నాటికి ఆరుగురు దిగంబర కవులలో ఒకడయ్యాడు. చెరబండరాజుగా మారాడు.

తెలంగాణా పోరాట ప్రభావంతో రైతు కుటుంబాలలో జానపద గేయాలు బాగా ప్రవేశించాయి. చెరబండరాజు తల్లిదండ్రుల దైనందిన జీవితంలో కూడా అవి భాగమై పోయాయి. "ఏటికేతంబెట్టి, ఎయి పుట్లు పండించి, గంజిలో మెతుకెరుగనన్నా" అనే పాట చెర తండ్రి తరుచుగా పాడుకుంటూ ఉండేవాడు.

దిగంబర కవులు తెలుగు సాహిత్య లోకంలో ఒక పెద్ద సంచలనం. నిశ్చలంగా, నిస్తేజంగా, చైతన్యరహితంగా ఉన్న కవితా ప్రపంచాన్ని అల్లకల్లోలం చేసిన సన్నివేశం. రాచమల్లు రామచంద్రారెడ్డి లాంటి అభ్యుదయ సాహిత్య విమర్శకులు ఇది కవిత్వం కాదన్నారు. శ్రీశ్రీ లాంటి కవులు ఈ కవిత్వాన్ని మనసారా ఆహ్వానించారు. అప్పట్లో సాహిత్య సభల్లో అనుకూలంగానో, ప్రతికూలంగానో దిగంబర కవుల ప్రస్తావన తప్పనిసరి. దిగంబర కవులు అనే మాటకు అర్థం – దిక్కులే వస్త్రాలుగా కలిగిన కవులు అని. అంటే నగ్న కవులు అని. అంటే ముసుగులు లేకుండా ఉన్నదున్నట్టు చెప్పే కవులని.

అప్పటికి రెండు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో దేశంలో అవినీతి, లంచగొండి తనం, హిపోక్రసీ పెరిగిపోయాయి. ఏం చెయ్యాలో తెలియని అనిశ్చిత స్థితిలో దిగంబర కవులు గొప్ప నిరసన వ్యక్తం చేశారు. వీరి కవిత్వంలో బూతుమాటలు ఉండవచ్చుగాని, వారి మనసులలో, ఉద్దేశంలో అవి లేవు. అప్పట్లో వీళ్ళు వివాదాస్పద కవులు. అలాంటి వివాదాస్పద దిగంబరకవులలో చాలావరకు వివాదాస్పదం కాని గొప్ప కవిత్వం రాసినవాడు చెరబండరాజు. "అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది" అని భరతమాతనుద్దేశించి రాసిన 'వందేమాతరం' అనే కవిత దిగంబర కవిగా రాసిందే. ఆనాడు అందరికీ అర్థంగాక పోయినా, ఈనాడు భారతదేశం అంతర్జాతీయ విపణిలో తాకట్టు పెట్టబడుతున్న వైనం సామాన్యులకూ అర్థమవుతున్న విషయమే. సామాన్యుడు సంఘ బహిష్కృతుడై ఈ 'సంక్షేమ' రాజ్యంలో రోజూ చస్తూనే ఉన్నాడని చెరబండరాజు భావించాడు. అందుకే "మరోసారి ఈ దేశం మోసపోగూడదు" అన్నాడు. "ఆగస్టు 15 ద్రోహాన్ని చెప్పకపోతే అన్నం సహించదు నాకు" అన్నాడు. "ప్రపంచ పురోగతి సాంతం శ్రమజీవి నెత్తుటిబొట్టులోనే ఇమిడి వుంది" అన్నాడు. "ఈ సువిశాల ప్రపంచ జీవశాలలో, సిసలైన న్యాయస్థానం ఎక్కడైనా వుంటే, నన్నెక్కనివ్వండి బోను" అన్నాడు.

1970 జూలై 4న విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. చెరబండరాజు అందులో సంస్థాపక సభ్యుడు. 1970 అక్టోబరులో ఖమ్మంలో జరిగిన విరసం మొదటి మహాసభల్లో చెర కవితా సంకలనం 'దిక్సూచి'ని శ్రీశ్రీ ఆవిష్కరించాడు. అప్పట్లో తెలుగులో వచనకవిత ప్రధానంగా ఉంది. అప్పుడే శివసాగర్ 'నరుడో భాస్కరుడా' పాట రాశాడు. అది విప్లవ కవుల్ని పాటల వైపు మళ్ళించింది. జనసేన, చెరబండరాజు లాంటి కవులు ఆ పాటల పల్లవిని అందుకున్నారు. చెరబండరాజు మొదటిపాట "కొలిమంటుకున్నాది, తిత్తినిండా గాలి, పొత్తంగ ఉన్నాది, నిప్పారి పోనీకు రామన్నా, పొద్దెక్కి పోనీకు లేవన్నా" అన్నది. దీన్ని చెర 1970 ఏప్రిల్‌లో రాశాడు. ఆ తర్వాత "కూలికోసం తాను, ఎదురు తిరిగేతేను, నక్సలైటూ వాని, సంపేసిపోనారు, రాయి రప్పకు సెప్పనా – నాగోడు, నేనె రాయైపోదునా" వంటి ఎన్నో పాటలు చెర కలం నుండి వెలువడ్డాయి. "కొండలు పగలేసినం, బండలనూ పిండినం, మా నెత్తురు కంకరగా, ప్రాజెక్టులు గట్టినం, శ్రమ ఎవడిదిరో, సిరి ఎవడిదిరో" అని ప్రశ్నించాడు.

"సోషలిజం స్వప్న సీమ, కానెకాదు నిజం సుమా, ఆకలంత సహజమది, అన్నమంత అవసరమది" అని గుర్తించాడు.

విప్లవ సాహిత్యోద్యమంలో పాటకు బీజం వేసినవాడు సుబ్బారావు పాణిగ్రాహి. దాన్ని మొలకెత్తించినవాడు శివసాగర్. దాన్ని మొక్కగా పెంచినవాడు చెరబండరాజు. దాన్ని మానుగా మార్చినవాడు గద్దర్.

విప్లవకవిగా నిప్పురవ్వలా చెలరేగుతున్న చెరబండరాజుపై ప్రభుత్వం తన నిర్బంధపు ఉక్కుపాదాన్ని మోపింది. 1970 డిసెంబరులో చెర యింటిపై మొదటిసారి దాడి చేశారు పోలీసులు. 1971 ఆగస్టులో చెరబండరాజును జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌లతో కలిపి పి.డి. చట్టం కింద అరెస్టు చేశారు. 1972లో వెలువడ్డ విరసం మొదటి కథా సంకలనం 'ఇప్పుడు వీస్తున్న గాలి'. అందులోని చెరబండరాజు 'చిరంజీవి' కథ వల్ల అది నిషేధింపబడింది. 1973 అక్టోబరు 11న వరవరరావు, ఎం.టి. ఖాన్‌లతో కలిసి మీసా చట్టం కింద అరెస్టయ్యాడు. 1974 మే 18న కె.వి.ఆర్., మధుసూదనరావు, వరవరరావు, ఎం.టి.ఖాన్, రంగనాధంలతో పాటు చెరబడరాజును కూడా సికింద్రాబాద్ కుట్ర కేసులో అరెస్టు చేశారు. 1975 ఏప్రిల్‌లో ఉగాది రోజున ప్రపంచ తెలుగు మహాసభల్ని నిరసించినందుకు శ్రీశ్రీ తదితరులతోబాటు అరెస్టయ్యాడు. 1975 జూన్ 26న ఎమర్జన్సీ విధింపులతో మీసా చట్టం కింద అరెస్టయ్యాడు. చెరబండరాజుతోబాటు మొత్తం 36మంది విరసం సభ్యులు ఎమర్జన్సీలో జైలులో ఉన్నారు. 1976 ఆగస్టులో కలకత్తాలోని ప్రెసిడెన్సీ జైలు నుండి కొందరు నక్సలైట్ ఖైదీలు తప్పించుకుపోయారన్న సాకుతో జైలులో చెరబండరాజుతోబాటు విప్లవ రచయితలకున్న కొన్ని సౌకర్యాలను తొలగించారు. అప్పటినుంచే చెర ఆరోగ్యం దెబ్బతిన్నది. చాలాసార్లు విపరీతంగా తలనొప్పి వచ్చేది. అయితే పాలకవర్గాలు ప్రజలకు కలిగించే తలనొప్పి కన్నా ఇదేం పెద్దది కాదనుకొనేవాడు. చివరికది బ్రెయిన్ ట్యూమర్‌గా మారింది. అయినా సరే అందరితో బాటు 1977 మార్చిలోనే జైలు నుండి విడుదలయ్యాడు. వెంటనే ఉద్యోగంలో చేరాడు గాని, మూడు రోజులలోనే సస్పెండ్ చేశారు. బ్రెయిన్ ట్యూమర్ వల్ల 1977, 79, 81 సంవత్సరాలలో మూడుసార్లు మెదడు ఆపరేషన్ చెయ్యవలసి వచ్చింది. అప్పుడు కూడా – "అనారోగ్య బాధితుణ్ణే, అయితేనేం యోధుణ్ణే" అన్నాడు.

చెరపై సికింద్రాబాదు కుట్ర కేసు కొట్టెయ్యాలనీ, ఉద్యోగంలో చేర్చుకోవాలనీ పెద్ద స్థాయిలో నిరసన ఉద్యమం రావడంతో విధిలేక ఉద్యోగంలో చేర్చుకున్నారు. కానీ మళ్ళీ డిస్మిస్ చేశారు. దేశభద్రత కోసం కారణాలు చెప్పకుండానే ఉద్యోగం నుండి తొలగించవచ్చు అని చెప్పే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 311-2(సి) కింద తొలగించారు. 5 నెలల తర్వాత హైకోర్టు తీర్పుననుసరించి మళ్ళీ ఉద్యోగంలో చేరాడు. చెరబండరాజు తన సర్వీసులో పూర్తి జీతం తీసుకున్నకాలం చాలా తక్కువ. 1979లో కె.వి.ఆర్. ఆధ్వర్యంలో విరసం చెర సహాయనిధిని ప్రారంభించింది. అప్పట్లో 50వేల దాకా విరాళాలు వచ్చాయి. రచయితలు, కళాకారులు, ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, పిల్లలు, గృహిణులు అందరు ఎంతో కొంత ఇచ్చారు. ఆ సమయంలోనే చెరబండరాజు దేశవ్యాప్తంగా పరిచయమయ్యాడు. ఒక సినీ నిర్మాత చెరబండరాజు పాటను కొనుక్కుంటానంటే ఆయన అమ్మలేదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వెయ్యి రూపాయల విరాళం ఇవ్వబోతే తిరస్కరించాడు. ఆరోగ్యం మరీ దెబ్బతిన్నది. గొంతుపోయింది. చూపుపోయింది. మెదడు పనిచెయ్యడం ఆగిపోయింది. 1982 జూన్‌లో చెరపై 'మానవతా దృక్పథం' తో ప్రభుత్వం కేసులు కొట్టివేసింది. 1982 జూలై 2న చెరబండరాజు శాశ్వతంగా కన్ను మూశాడు. ఇక బతకడని తెలిసే ప్రభుత్వం కేసులు కొట్టివేసిందని విడిగా చెప్పనక్కరలేదు.

చెరబండరాజు మరణించిన తర్వాత ఆయన కవితలలో ఇరవయ్యింటిని ఎంపిక చేసి విరసం కె.వి.ఆర్. సంపాదకత్వంలో ఆంగ్లంలోకి అనువాదం చేసి ప్రచురించింది. దాని పేరు “SWORD SONG”.

చెర కవిగానే గాక వచన రచయితగా కూడా తనకో ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నాడు. 4 నవలలూ, 12 కథలూ, 2 నాటకాలూ, 4 నాటికలూ కూడ రాశాడు. మాపల్లె, ప్రస్థానం, నిప్పురాళ్ళు, దారిపొడుగునా అనేవి నవలలు. 'చిరంజీవి' కథల సంపుటి. గ్రామాలు మేల్కొంటున్నాయి, గంజినీళ్ళు నాటకాలు.

చెరబండరాజు వచన సాహిత్యమంతా 1965-74 మధ్య కాలంలో రాయబడింది. 1967-70ల మధ్యకాలం నక్సల్బరీ, శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటాలు విజృంభించిన

కాలం. వ్యవసాయ ప్రధానమైన భారతదేశంలో భూసంస్కరణలు అమలు జరగకుండా దేశం ముందుకు పోలేదనీ, ఈ మౌలిక సమస్యను పరిష్కరించకుండా పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యంకాదనీ నక్సల్బరీ శ్రీకాకుళం పోరాటాలలో పేదరైతులూ, రైతుకూలీలూ చైతన్యవంతులై తిరగబడ్డారు. దాంతో బెంబేలెత్తిన ప్రభుత్వం 'గరీబీ హఠావో' నినాదాన్నిచ్చింది. భూసంస్కరణల్ని అమలు జేస్తున్నట్టు నాటకాలాడింది. ఈ నాటకాల గుట్టు తెలుసుకొనే క్రమంలో ప్రజలు ఉద్యమించడానికి పూనుకొన్న వైనం చెర కథల్లో, నవలల్లో, నాటకాల్లో కనిపిస్తుంది.

ప్రభుత్వం అనే పిచ్చికుక్క కరిచి చెరబండరాజు చనిపోయాడని శ్రీశ్రీ అన్న మాటలు ఎంత సత్యమో ఆయన జీవితాన్ని చూసినపుడు అర్థమవుతాయి. అందుకే "విప్లవ సాంస్కృతిక యోధుడు చెరబండరాజు" అని కె.వి.ఆర్. అన్నా, అతని "ప్రతిగేయం నెత్తుటి దీపం" అని రావిశాస్త్రి అన్నా, "పదునెక్కిన ప్రజాకవి" అని చేకూరి రామారావు అన్నా – అవేవీ అతిశయోక్తులుగా కనబడవు.

*ప్రముఖ రచయిత వి. చెంచయ్య గారి సౌజన్యంతో "కలం యోధుడు చెరబండ రాజు" గ్రంథం నుండి "కలాన్ని కత్తిగా ఝుళిపించిన సాంస్కృతిక యోధుడు" వ్యాసం నుంచి.*

**జీవము గలిగిన దేదియు**
**నేవేళనొ కట్టుబాట్ల నెడపి చరించున్,**
**జీవనదిగట్ల నొరయదె?**
**యావరణము దాటి తీవలల్లవె మిత్రా.**

# ఆచార్య జి.ఎన్. రెడ్డి

## (గోళ్ళ నారాయణస్వామి రెడ్డి)



జననం : 23-12-1927
మరణం : 13-7-1989

జి.ఎన్. రెడ్డి గారి తండ్రి కృష్ణారెడ్డి, తల్లి తులసమ్మ. జి.ఎన్.రెడ్డి చిత్తూరు జిల్లా బంగారుపాళెం తాలూకా, మహాసముద్రం గ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో

జన్మించాడు. గ్రామంలో 4వ తరగతి వరకు చదివి, చిత్తూరులోని గిరింపేట మున్సిపల్ హైస్కూలులో 7వ తరగతి వరకు చదివాడు. బి.జడ్. హైస్కూలులో 8వ తరగతి వరకు చదివాడు. ఎస్.ఎస్.ఎల్.సి. వరకు జిల్లా బోర్డు హైస్కూలులో చదివాడు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. మద్రాసులోని పచ్చయప్పా కళాశాలలో తెలుగు, చరిత్ర, పాఠ్యాంశాలుగా ఇంటర్మీడియట్ చదివాడు. తరువాత తెలుగు భాషపై మక్కువతో బి.డి.ఎల్. (ఆనర్సు) చదివాడు.

1949 జూలైలో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ట్యూటరుగా చేరి ఉద్యోగ జీవితం ప్రారంభమైంది. పరిశోధక రంగంలో ఆసక్తి కలిగింది. మద్రాసు విశ్వవిద్యాలయంలో "తెలుగు సాహిత్యం మీద ఆంగ్ల భాషా ప్రభావం" అనే అంశంపై పరిశోధనచేసి వ్యాసాన్ని సమర్పించి 1955లో ఎం.లిట్. పట్టా పొందారు. అనంతరం "తెలుగులో అర్థ విపరిణామం" అనే అంశంపై పరిశోధన చేసి 1962లో మద్రాసు విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పొందారు. 1962లోనే తెలుగు సెమాంటిక్స్ మీద మద్రాసు విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పొందాడు. 1950–57 వరకు తెలుగు అధ్యాపక వృత్తిలో వున్నాడు. ఎం.ఎ. తరగతులకు సాహిత్య చరిత్ర, సౌత్ ఇండియన్ హిస్టరీ, ఇండియన్ ఫిలాసఫీ బోధించాడు. 1959లో ఎస్.వి. యూనివర్సిటి ప్రారంభంలోనే ఎం.ఎ. శాఖకు తెలుగు అధ్యాపకునిగా చేరాడు. రీడరు కూడ అయాడు. 1962–64 వరకు అమెరికాలోని విస్కాన్సిన్ యూనివర్సిటీలో విజిటింగ్ లెక్చరరుగా పనిచేశాడు. 37 ఏళ్ళ వయసులోనే ప్రొఫెసర్ అయాడు. ఇది ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. 1981లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి సత్కరించింది.

ఎస్.వి. కళాశాల ప్రిన్సిపాల్‌గాను, ప్రాచ్యకళాశాల డీన్‌గాను, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కార్యనిర్వాహక సభ్యునిగాను, కేంద్ర సాహిత్య అకాడమి జనరల్ కౌన్సిల్ సభ్యునిగాను పనిచేసి విశ్వవిద్యాలయరంగంలోను, ప్రభుత్వంలో బాగా గుర్తింపు తెచ్చుకున్నాడు.

1985లో ఎస్.వి. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పదవి స్వీకరించాడు. ఉపాధ్యాయుడైనా నిత్యవిద్యార్థియే. 1987 వరకు వైస్ ఛాన్సలర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశాడు. పదవీ

విరమణానంతరం 1988–89లలో యు.జి.సి. జి.ఎన్.రెడ్డిని ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా నియమించింది.

జి.ఎన్. రెడ్డి పర్యవేక్షణలో 40మంది పరిశోధన విద్యార్థులు పి.హెచ్.డి. చేశారు.

ఇంతవరకేనైతే జి.ఎన్. రెడ్డిని అంత గొప్పగా చెప్పుకోలేము. ఆయన తెలుగుభాషకు సాహిత్యానికి చేసిన సేవ అనుపమానమైనది. ఆయన ఒక నిఘంటుకారుడు. దేశంలో ఏభాషలోనూ ఎవరూ చేయని మహత్కార్యం తెలుగుభాషకు చేశాడు. 54,500 తెలుగు పదాలకు "పర్యాయ పద నిఘంటువు"ను ప్రప్రథమంగా నిర్మించాడు. ఇందుకు ఆయన 10 సంవత్సరాలకు పైగా కృషి చేశాడు. పల్లె పల్లెకూ తిరిగాడు. ఇందు దేశీయ పదాలే కాక అనేక తెలుగు కావ్యాల్లోని పదజాలం కూడ కలిపి, అకారాది క్రమంలో పదాలను 40 వర్గాలుగా విభజించి నిర్మించాడు. ఇందుకు అవిరళ కృషి సలిపాడు. 11 నుంచి 18 శతాబ్దాల వరకు సాహిత్యంలోని పదాలకు పర్యాయపదాలను సేకరించాడు. ఇదే సమయంలో "భాషా విజ్ఞాన పరిచయం", "ద్రవిడ భాషా విజ్ఞాన పరిచయం", కవిత్రయ భారతంలోని 27వేల సమాసాల సేకరణ చేశాడు. కాని ఇవి అసంపూర్తిగా నిలిచి పోయాయి.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సి.పి. బ్రౌన్ ప్రాజెక్టు నెలకొలిపి తన సంపాదకత్వంలో ఆ మహనీయుని మీద అపారమైన పరిశోధన చేయించాడు.

అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పత్ర సమర్పణ చేశాడు. తెలుగు భాషాపరంగా వివిధ దేశాలు పర్యటించాడు.

1973లో తెలుగు నిఘంటువు, 1978లో ఇంగ్లీషు–తెలుగు నిఘంటువు, మాండలిక–వృత్తి పదకోశం (కుమ్మర, వడ్రంగం) లకు సంపాదక వర్గ సభ్యులుగా పనిచేశారు. భాషాశాస్త్రం, సాహిత్యం సంస్కృతులపై వివిధ మౌలిక రచనలు చేశాడు. దాదాపు 50 గ్రంధాలకు పీఠికలు రాశాడు. మహాభారత గ్రంథంలోని శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలకు ఆయన రాసిన పీఠికలు గొప్ప ఖ్యాతిని పొందాయి. "మానవునికి భాష అమూల్యమైన సాధనం. ఆ సాధనాన్ని

మానవాభ్యుదయానికి, విజ్ఞాన ప్రగతికి బలవత్తరమైన సాధనంగా రూపొందించుకోవాలని భాషా శాస్త్రవేత్తలు కృషి చేస్తుండటం, భాషా విజ్ఞానం శాఖోపశాఖలుగా అభివృద్ధి చెందటం ఈనాడు భాషాశాస్త్రంలో ఎన్నదగిన ముఖ్యవిశేషం" అని జి.ఎన్. రెడ్డి తెలుగు భాషాశాస్త్రం, విజ్ఞానంపై సంతృప్తిని వెలిబుచ్చాడు.

కాని దురదృష్టవశాత్తు ఆయన శ్రమించి నిర్మించిన "తెలుగు పర్యాయపద నిఘంటువు" పీఠిక రాసి ప్రచురణ జరిగే లోపల ఆకస్మిక మరణం జి.ఎన్. రెడ్డిని కబళించేసింది. కాని డా॥ పి. నరసింహారెడ్డి, డా॥ ఎం.విజయలక్ష్మి, డా॥ కె. శారద, డా॥ టి. రామకృష్ణ, డా॥ వి. ప్రభాకరరెడ్డి, శ్రీ ఎం. వేణుగోపాల్, శ్రీ ఎం. జాన్సన్ బాబు, శ్రీ ఎం. మునికృష్ణ గారల సహాయంతో ఈ నిఘంటువును విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించారు.

ఈ తెలుగు పర్యాయపద నిఘంటువు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పండితులకే కాదు, సాధారణ పాఠకునికి ఎవరికైనా ఉపయోగపడుతుంది. విద్యార్థులు, రచయితలు, పండితులు ఉపాధ్యాయులు వారి పదశక్తిని సుసంపన్నం చేసుకోవటానికి ఈ నిఘంటువు ఒక రెడీమెడ్ ఆధార గ్రంథం.

ఇట్టి నిఘంటు నిర్మాణం తెలుగులో తొలి ప్రయత్నమన్నది కాదనలేని సత్యం. ఈ గ్రంథం 1990, 1998, 2002 మరియు 2015 సంవత్సరాలలో ముద్రణలు జరిగింది.

**ధనమున్న సర్వవస్తుల**
**గొనవచ్చును పణ్య వీథి కోరినయటులన్;**
**ధనమున్న వలసినప్పుడు**
**కొనవచ్చునె విద్య? చదువుకొనవలె మిత్రా.**

## దూరవిద్యా దిక్సూచి
# జి. రాంరెడ్డి
## (జి. రామిరెడ్డి)



జననం : 4-12-1921
మరణం : 2-7-1995

రాంరెడ్డి "దూరవిద్యా దిక్సూచి", "ఫాదర్ ఆఫ్ ఓపెన్ యూనివర్శిటీ". సమాజ విజ్ఞానిగా, పరిపాలనాదక్షునిగా, రాజకీయ శాస్త్రవేత్తగా, ప్రగతిశీలకుడుగా చిరపరిచితుడు. సార్వత్రిక విద్యకు ఆద్యుడు.

ఈయన కరీంనగర్ జిల్లా మైలారం గ్రామంలో మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు.

ఉస్మానియా యూనివర్శిటీలో (నిజాం కళాశాలలో) ఎం.ఎ. రాజకీయ శాస్త్రంలో చదివి, అక్కడే పిహెచ్.డి. చేసి, అక్కడే 1977 వరకు ప్రొఫెసరుగా చేశాడు. వరంగల్‌లో ప్రొఫెసరుగా చేశాడు. 1977–82 మధ్యకాలంలో అదే యూనివర్శిటీకి రెండుసార్లు వైస్ ఛాన్స్‌లర్‌గా చేశాడు. విద్యారంగానికి, విశ్వవిద్యాలయానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చాడు. కేవలం జ్ఞానాభివృద్ధినే గాక సమాజాన్ని ప్రజాస్వామికం చేయటానికి, ప్రజల్ని విజ్ఞానవంతం చేయటానికి, సమాజశాస్త్రాలు ఉపయోగపడాలంటాడు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్సు దక్షిణప్రాంత విభాగానికి డైరెక్టర్‌గా పనిచేశాడు.

ఎప్పుడూ కొత్తదనంపైనే ఆయన దృష్టి. ప్రగతిశీలి. హైదరాబాదులోని భారత సమాజ విజ్ఞాన పరిశోధనామండలి (దక్షిణ ప్రాంతీయ కేంద్రానికి) డైరెక్టరు.

1980 దశకంలో ఆయన దృష్టి దూరవిద్యవైపుకు మళ్ళింది. విశేష అధ్యయనం చేశాడు. ఆసియా దేశాలలో దూరవిద్యపై ఓనమాలు తెలియని రోజులలో అహరహం కృషిచేసి లక్షలాది వ్యక్తులు విద్యాభ్యాసం గావించేందుకు వెలుతురు మార్గం చూపిన దివిటీ రాంరెడ్డి.

జగద్విఖ్యాతమైన బ్రిటీష్ ఓపెన్ యూనివర్శిటీ గురించి నిశితంగా పరిశీలించాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరికపై సార్వత్రిక విశ్వవిద్యాలయం ఈ రాష్ట్రంలో ప్రారంభించటానికి ముసాయిదా నిచ్చాడు. దీనిని ప్రభుత్వం ఆమోదించింది. 1982లో దేశంలోనే ప్రప్రథమంగా "ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం" ఏర్పడింది. దీనిని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీగా నామకరణం చేశారు. దీనికి తొలి వైస్ ఛాన్స్‌లర్‌కూడా వీరే. తదుపరి భారత ప్రభుత్వం ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీని 1985లో ప్రారంభించి రాంరెడ్డినే వైస్‌ఛాన్స్‌లర్‌గా నియమించుకున్నది. దీనిలో ఈయన కృషి అంతర్జాతీయ ఖ్యాతి పొందినది. కామన్వెల్త్ దేశాల్లో రెండు పెద్ద సార్వత్రిక విద్యాసంస్థలను ఏర్పాటుచేసి ఆ వ్యవస్థలను సుస్థిరం చేసినందున ఆయనను కెనడాలోని "కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్" సంస్థకు ఉపాధ్యక్షులుగా నియమించారు. 1991లో భారత ప్రభుత్వం ఈయనను యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్‌గా నియమించింది.

పదవీ విరమణ తదుపరి సామాజికశాస్త్రాలు పరిశోధనా భారతీయ మండలికి ఎంపిక కాబడ్డ మొదటి తెలుగు వ్యక్తి. సార్వత్రిక వ్యవస్థ నమూనా గూర్చి ఆసియా అభివృద్ధి బ్యాంకు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సులో వివరించాడు. ఈ నమూనా పలుదేశాలలో సార్వత్రిక విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయటానికి తోడ్పడింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం రాంరెడ్డి నమూనాను గుర్తించి తన మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయానికి రాంరెడ్డిని సలహాదారుగా నియమించుకున్నది. రామిరెడ్డి “సార్వత్రిక విద్యాలయాలు తెరిచిన గజదంత గోపుర ద్వారాలు” అనే అంశం పైనే కాకుండా పంచాయత్‌రాజ్ వ్యవస్థ మొదలైన వాటిపై ఉత్తమ గ్రంథాలు వ్రాసి బ్రిటిష్ ఓపెన్ యూనివర్సిటీ నుండి డి.లిట్. పొందిన తొలి తెలుగు వాడేకాదు, ఏకైక భారతీయుడు కూడాను.

స్త్రీ విముక్తికి దూరవిద్యావిధానం ఒక ఆశాకిరణమైంది. తిరుపతిలో మహిళా విశ్వవిద్యాలయ స్థాపనకు కృషిచేసి సాధించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని యూనివర్శిటీలు రాంరెడ్డికి డి.లిట్. డిగ్రీలు ప్రదానం చేశాయి. భారతదేశంలోని పలు విశ్వవిద్యాలయాల నుండి డాక్టరేట్‌లు పొందాడు.

ప్రతిష్ఠాత్మకమైన “రాజాలక్ష్మి అవార్డు” నందుకున్నాడు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో డిస్టెంట్ ఎడ్యుకేషన్ విభాగానికి ఆయన పేరు పెట్టారు.

రాంరెడ్డి 2-7-1995న లండన్‌లో పరమపదించారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజిలో అధ్యాపకుడుగా జీవితాన్ని ప్రారంభించిన రాంరెడ్డి రెడ్డిజాతికి అంతర్జాతీయ ఖ్యాతి నార్జించారు. దూరవిద్యలో ఆయనలేని లోటు దేశం ఎప్పటికి భర్తీ చేయగలదో చెప్పలేము. దూరవిద్యకు ప్రతిరూపంగా రాంరెడ్డి రెడ్డిజాతికి అంకభాగాన ఉంటారు.


**మిణుగురు బురుగుల కాంతుల**
**గలనౌనే కాలిబాట గాఢాంధమునన్ ?**
**మన బ్రతుకుదెరువు చదువులు**
**గనజేయునె మోక్షపదవి ఘనముగ మిత్రా.**

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

పసుల వన్నె వేఱు పాలేక వర్ణమౌ
బుష్ప జాతి వేరు పూజ యొకటి
దర్శనంబు వేరు దైవంబు ఒకటి
విశ్వదాభిరామ వినురవేమ.

# దాచూరి రామిరెడ్డి

**(డి.ఆర్)**



జననం : 15-16-1938
మరణం : 2-5-2016

రామిరెడ్డి గారి తండ్రి పేరారెడ్డి, తల్లి శంకరమ్మ, భార్య అనసూయమ్మ. రామిరెడ్డి స్వగ్రామం నేటి ప్రకాశం జిల్లా పాకల గ్రామం. అతి చిన్న రైతు కుటుంబం(2 ఎకరాలు). వారు ముగ్గురు సోదరులు (ఒక అన్న, ఒక తమ్ముడు) ఇద్దరు సోదరీమణులు.

పాకలలో ఎలిమెంటరీ విద్య. కనిగిరిలో టీచర్ ట్రైనింగ్ చేశాడు.

1958లో సెకండరీ గ్రేడు ఉపాధ్యాయుడుగా ఉద్యోగ ప్రారంభం. 1960 వరకు రాపూరు తాలూకా మద్దూరుపల్లిలో ఉపాధ్యాయునిగా ఉద్యోగం. 1962లో కనిగిరి తాలూకా పి.సి.పల్లి, చినవరిమడుగుల్లో ఉపాధ్యాయ ఉద్యోగం చేశాడు. చినవరిమడుగులో పగళ్ళు విద్యార్థులు పాఠశాలకు రానందున లాంతర్ల వెలుతురులో రాత్రిళ్ళు పాఠాలు చెప్పాడు. తరువాత కర్నూలులో బి.ఇడి. చేశాడు. కరేడు, సింగరాయకొండ, మడనూరు, పొన్నలూరుల్లో బి.ఇడి. ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. 1969లో తెలుగు పండిట్‌గా పదోన్నతి పొంది లింగసముద్రంలో పనిచేశాడు.

1984లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గం నుండి శాసనమండలికి ఎన్నికైనాడు. కాని 1985లో యన్.టి.ఆర్. ప్రభుత్వంలో శాసనమండలి రద్దయింది. తిరిగి 2007లో శాసనమండలి పునరుద్ధరించబడగా తిరిగి శాసనమండలి సభ్యునిగా ఎన్నికై 2011 వరకు కొనసాగాడు. రామిరెడ్డి మండలికి వన్నె తెచ్చిన మాష్టారు. ఏడుగురు సభ్యులతో పి.డి.ఎఫ్. ఎర్పాటు చేసి ఫ్లోర్ లీడరుగా చాలా సమస్యలపై కృషి చేశాడు.

రామిరెడ్డి అభ్యుదయ భావాలు గల వ్యక్తి. పెత్తందారీ తనాన్ని సహించని వ్యక్తి. తక్కువ వయసులోనే ఉప్పు కొటార్లలో, రైతుల తరఫున, కార్మికుల తరఫున పెత్తందార్లపై పోరాటం చేశాడు. విద్యార్థి, యువజన, ప్రజాఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. సాక్షరతా ఉద్యమంలో పాల్గొని, రాత్రి పాఠశాలలు నిర్వహించాడు. 1955లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. జనవిజ్ఞాన వేదిక ద్వారా ప్రజలకు సహకారం అందించాడు. రామాయపట్నంలో స్కూలు భవనం ఏర్పాటుకు, పాకల, రామాయపట్నం, మరితర గ్రామాలలో గ్రంథాలయాల ఏర్పాటుకు రామిరెడ్డే కారణం. పల్లెప్రజలకు సేవచేసే ఉద్దేశంతో డా॥ పుచ్చలపల్లి రామచంద్రా రెడ్డి వద్ద వైద్య శిక్షణ తీసుకొని ఇబ్బందులలోవున్న పల్లె ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలందించాడు.

ఉపాధ్యాయ ఉద్యమనేతగా రామిరెడ్డి రాష్ట్రంలో పేరొందిన ఉపాధ్యాయ నాయకుడు. విరామమెరుగని ఉద్యమ కార్యకర్త స్థాయి నుండి నాయకుడైనాడు. ఉపాధ్యాయుల సమస్యలపై నిర్విరామంగా పోరాటం చేశాడు.

1959లో ఆంధ్రప్రదేశ్ ప్రాధమికోపాధ్యాయ ఫెడరేషన్, రాపూరు తాలూకా విభాగానికి ప్రధాన కార్యదర్శి అయినాడు. 1960-67లలో నెల్లూరు జిల్లా శాఖకు కార్యదర్శి అయినాడు. 1970లో ప్రకాశం జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శిగా పని చేశాడు.

1974లో రాష్ట్రంలో యు.టి.ఎఫ్. ఆవిర్భావానికి తదుపరి నిర్వహణకు రామిరెడ్డి కృషి అమూల్యం; ప్రకాశం జిల్లా యు.టి.ఎఫ్. శాఖకు ప్రథమ ప్రధాన కార్యదర్శి. తదుపరి రాష్ట్ర శాఖకు ప్రధాన కార్యదర్శి. దానికి 1980 నుండి 2000 వరకు అధ్యక్షుడుగా పనిచేశాడు. "ఐక్య ఉపాధ్యాయ" పత్రిక సంపాదకవర్గ సభ్యులై ఉపాధ్యాయ సమస్యలను వెలుగులోకి తెచ్చాడు. "అధ్యాపక దర్శిని" పుస్తకానిని రచించి ప్రచురించాడు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌లో అమరుడైన వ్యక్తి రామిరెడ్డి. ఆయన కరపత్రాలు, వ్యాసాలు, సదస్సులు, సభలు, పుస్తకాలు, ఉపన్యాసాలు ప్రభుత్వానికే కళ్ళు తెరిపించాయి.

ఉపాధ్యాయుల రీగ్రూపింగ్ స్కేళ్ళు, ప్రధానోపాధ్యాయుల స్కేళ్ళు, భాషా పండితుల అప్‌గ్రెడేషన్, బి.ఇడి. అర్హత లేకుండా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు 15సం॥లు టైం స్కేలు, ఎయిడెడ్ టీచర్ల డైరెక్టు పేమెంట్, ఎయిడెడ్ టీచర్ల ఉద్యోగ రక్షణ వంటి అతిముఖ్యమైన ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం జరిపి సత్ఫలితాలు సాధించాడు. ఉపాధ్యాయవర్గం ఎన్నటికీ మరవలేని ఉద్యోగ భద్రతలను సాధించాడు.

ఉద్యమంలో ఉమ్మడి వేదికలు ఏర్పాటు చేశారు. చెన్నైలో అంతర్రాష్ట్రీయ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ స్కూల్ టీచర్సు ఆర్గనైజేషన్ స్థాపించి తొలి కన్వీనరైనాడు. ఎన్.టి.ఎఫ్.ఐకి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శియై తదుపరి అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించి నిర్వహించాడు. 5 1/2 దశాబ్దాల సుదీర్ఘ జీవితం ఉపాధ్యాయ ఉద్యమానికి వినియోగించాడు.

అంతేకాక ఒంగోలులో తనకున్న ఒక ప్లాటు స్థలంను 10లక్షలకు అమ్మి తన భార్య పేరున డిపాజిట్ చేసి, ప్రతియేటా సంస్మరణ కార్యక్రమాలకు వినియోగించటానికి యు.టి.ఎఫ్. సంఘానికిచ్చాడు.

రామిరెడ్డి ఒక గొప్ప దార్శనికుడు. పోరాట యోధుడు. వ్యూహకర్త. ఉద్యమాల్లో ఉప్పొంగే కెరటం. సిద్ధాంతం – నిబద్ధత ఆయన మతం. ఆయన వ్యక్తిత్వం, త్యాగం చిరస్మరణీయం. సంతానం కలిగితే ఉద్యమంలో వేగం తగ్గుతుందన్న ఉద్దేశంతో సంతానం వద్దనుకుని త్యాగం చేసిన వ్యక్తి. భార్య అనసూయమ్మ అంతే త్యాగశీలి. రామిరెడ్డి మంచి వక్త. మంచి శిక్షకుడు. లోతైన అధ్యయన శీలి. వ్యక్తిత్వ వికాస తరగతులూ నడిపాడు. ఏ ఉపాధ్యాయునికైనా ఏ అవసరం వచ్చినా నేనున్నానని ముందుకు వచ్చి, చేయిపట్టి నడిపించిన నాయకుడు. ఆప్యాయానురాగాల కలబోత రామిరెడ్డి మనసు.

రామిరెడ్డి ఒక లెజెండ్. యు.టి.ఎఫ్.కు జీవగఱ్ఱ. ఆయన భార్య మరణానంతరం కుంగిపోయాడు. చివరకు వైద్యం చేయించుకుంటూ ప్రాణం విడిచాడు. రామిరెడ్డి మరణం ఉపాధ్యాయులకే కాదు, ప్రజలకూ తీరని నష్టం.

రాష్ట్రంలో అన్ని జిల్లాలలో అన్ని పార్టీల రాజకీయ నాయకులు, ప్రజలు, ఉపాధ్యాయ సంఘాలు ఆయనకు ఘన నివాళులర్పించారు.

ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఆస్తి, వయసు(కాలం), కుటుంబం, ఆరోగ్యం అన్నింటినీ త్యాగం చేసి రెడ్డితనాన్ని చాటిన రామిరెడ్డిని ఎన్నటికీ మరువలేము.

**ధనికుడు తన గ్రామంబున**
**ననుచరులకు కీర్తనీయుడై తగు, విద్యా**
**ధనమున్న సత్కవీశ్వరు**
**డనిశము లోకైక పూజ్యుడయ్యెడు మిత్రా.**

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

# హెచ్.యం. రెడ్డి

## తెలుగు చలనచిత్ర పితామహుడు



జననం : 12-6-1892
మరణం : 14-1-1960

హెచ్.యమ్. రెడ్డి పూర్తిపేరు హనుమంతప్ప మునియప్పరెడ్డి. పుట్టినది మద్రాసు ప్రెసిడెన్సీలోని కోలారు జిల్లా (ప్రస్తుత కర్నాటక) ఎలహంక (బెంగుళూరు చెంత) గ్రామం.

బెంగుళూరు పోలీసు ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తూ 1920లో రాజీనామా చేసి చిత్ర పరిశ్రమపై మక్కువతో బొంబాయి చేరాడు. ఒక స్టూడియోలో రిఫ్లెక్టర్ బాయ్‌గా చేరాడు. అప్పటికి మూకీ చిత్రాల నిర్మాణం జరుగుతుంది. దర్శకరంగంలో ఉత్సాహం చూపాడు.

హిందీలో ఆలం ఆరా టాకీ చిత్రం తీసిన అర్దేషిర్ ఇరానీకి దగ్గరై రెండు మూకీ చిత్రాల నిర్మాణంలో ఇరానీకి దర్శకత్వంలో సహాయకారిగా వున్నాడు. ఆ చిత్రాలు ఇంపీరియల్ ఫిలిం కంపెనీ పేరిట తీశారు. 14-3-1931న హిందీ టాకీ ఆలం ఆరా విడుదలైంది. తెలుగులో తమిళంలో కూడ టాకీ చిత్రాలను నిర్మించే పట్టుదల పెరిగింది హెచ్.యమ్. రెడ్డికి.

తెలుగులో భక్తప్రహ్లాద, తమిళంలో కాళిదాసు టాకీ చిత్రాలకు దర్శకత్వం మొదలు పెట్టాడు. తెలుగులో టాకీ చిత్రాలకు ఆద్యుడు హెచ్.యమ్. రెడ్డే. తెలుగులో భక్తప్రహ్లాద ఇంపీరియల్ స్టూడియోలోనే నిర్మాణం మొదలైంది. సినిమా బడ్జెట్ 20వేల రూపాయలు. లీలావతి పాత్రధారి సురభి కమలాబాయికి పారితోషికం రూ. 500/-. ప్రహ్లాదుడుగా కృష్ణారావుకు పారితోషికం రూ. 400/-. హిరణ్యకశిపుడిగా వల్లూరి వెంకటసుబ్బారావు. నిర్మాణ సమయం 20 రోజులు. నిడివి 108 నిముషాలు. దీనితోనే తమిళ టాకీ కాళిదాసు చిత్రం దర్శకత్వం జరిగింది. 15-9-1931 తేదీన బొంబాయిలో భక్తప్రహ్లాద విడుదలై 6-2-1932న తెలుగు ప్రాంతంలో విడుదలైంది. అయితే తమిళ టాకీ చిత్రం 31-10-1931న విడుదలైంది. ఇరానీ సహాయంతో నిర్మాతగా దర్శకునిగా నిలదొక్కు కున్నాడు. చిత్రపరిశ్రమలో పాపాజీ అనేవారు. సి.వి. ప్రసాద్ కూడ భక్తప్రహ్లాదలో చిన్నపాత్ర ధరించాడు.

సినిమా పరిశ్రమకు హీరోలను, హీరోయిన్లను, విలన్లను, వాంప్‌లను పరిచయం చేశాడు. ఇతర ఫిలిం కంపెనీలలో కూడ హెచ్.యమ్. రెడ్డి పనిచేశాడు.

1933లో సావిత్రి (తెలుగు), 1933లోనే లంకాదహన్ (హిందీ), 1933లోనే సీతా స్వయంవర్ (హిందీ), 1936 ద్రౌపది వస్త్రాపహరణం (తెలుగు)లకు దర్శకత్వం వహించాడు. ఇవన్నీ టాకీలే.

తర్వాత మద్రాసుకు వచ్చాడు. ఆయన ఆఖరి కూతురు రోహిణిపై ఆయనకు ప్రేమ ఎక్కువ. ఆమె ఎంతో అదృష్టవంతురాలని ఆయన నమ్మకం. బి.ఎన్. రెడ్డి, కన్నాంబ తదితరులతో కలిసి రోహిణీ పిక్చర్స్ లిమిటెడ్ స్థాపించి దానికి మేనేజింగ్ పార్టనరై తరువాత అదే పేరుతో వడపళని ప్రాంతంలో స్టూడియోను నిర్మించాడు. టాకీల పరంపర సాగుతుంది. 1938లో గృహలక్ష్మి మద్యపాన వ్యతిరేకత అంశంగా తెలుగు తమిళ భాషల్లో తీయగా అది తెలుగు ప్రాంతాల్లో విజయం సాధించడమే కాకుండా ఉత్తమ చిత్రంగా ఎన్నిక కాబడ్డది. 1941లో తెనాలి రామకృష్ణ 1942లో సత్యమే జయం సినిమాలకు దర్శకత్వం వహించాడు. అయితే రెండవ ప్రపంచయుద్ధం కారణంగా రోహిణీ సంస్థ మూలబడింది.

హెచ్.యమ్. రెడ్డి తన నివాసాన్ని బెంగుళూరుకు మార్చాడు. 1944లో మైసూరులో స్టూడియో ఆరంభానికి ముఖ్యపాత్ర వహించాడు. తరువాత మళ్ళీ బొంబాయి చేరాడు. హిందీలో జస్టిస్ సినిమాకు దర్శకత్వం చేశాడు.

ఈ మధ్యలోనే మద్రాసుకు వస్తూ పోతూ 1939లో మాతృభూమి (తమిళం), 1946లో సతీసీత (హిందీ) 1951లో నిరపరాధి (తమిళం) నిర్దోషి (తెలుగు) 1953లో ప్రతిజ్ఞ (తెలుగు), 1954లో వద్దంటే డబ్బు (తెలుగు) మొదలైన చిత్రాలకు దర్శకత్వం వహించాడు. మొత్తం 18 చిత్రాలకు దర్శకత్వం వహించాడు.

తెలుగు చలనచిత్రరంగంలో ప్రముఖులైన, ఎల్.వి. ప్రసాద్, కమలాకర కామేశ్వరరావు, భానుమతి, పి.ఎస్. రామకృష్ణ, బి.ఎన్. రెడ్డి, కె.వి. రెడ్డి, చిత్తూరు వి. నాగయ్య, కాంతారావు, రాజనాల, ముక్కామల, అంజలి దాకా పలువురు ఏదో ఒక శాఖలో హెచ్.యమ్. రెడ్డి వద్ద మార్గదర్శకం పొందిన వారే. రచయిత సదాశివ బ్రహ్మం హెచ్.యమ్. రెడ్డి ద్వారా సినిమా రంగానికి రచయితగా పరిచయమైనాడు.

ఆయన 1949లో శాశ్వతంగా మద్రాసుకు తిరిగివచ్చాడు.

హెచ్.యమ్. రెడ్డి దక్షిణ భారత చలనచిత్ర వాణిజ్య మండలికి అధ్యక్షుడైనాడు.

హెచ్.యమ్. రెడ్డి తెలుగు సినిమారంగానికి లైట్ హౌస్ వంటివాడు. తెలుగు సినిమా రంగాన్ని గూర్చి ప్రస్తావించుకునేటపుడు హెచ్.యమ్. రెడ్డిని తప్పకుండా తలచు కోవలసిందే. సాంకేతిక సౌకర్యాలు లేని రోజులలో తెలుగు చిత్రాలకు బీజం వేసి విజయం సాధించాడు.

రెడ్డి ఖ్యాతిని బొంబాయి నుండి దక్షిణ భారత దేశమంతటా ఆవిష్కరించిన చిరస్మరణీయుడు హెచ్.యమ్. రెడ్డి. రెడ్డి జాతికి కిరీటం తెచ్చాడు.

**జలజలమని రసమొల్కెడు**
**కలకంఠరవానుకారి కావ్యము సరసుల్**
**దెలిసికొని కొందు రబ్జము**
**లలరిన గని తేంట్లు తేనెలానవె మిత్రా.**

# బి.ఎన్.రెడ్డి
## (బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి)



జననం : 16.11.1908
మరణం : 08.11.1977

బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి కడపజిల్లా పులివెందుల తాలూకా యెద్దులయ్యగారి కొత్తపల్లి (వై. కొత్తపల్లి)లో ప్రమోదినామ సంవత్సరం మార్గశిర శుద్ధ చవితి/పంచమి ఘడియల్లో (16.11.1908) జన్మించాడు. తల్లి ఎరుకలమ్మ. తండ్రి నరసింహారెడ్డి. తండ్రిపేరు తనయునికీ

పెట్టారు కారణం తెలియదు. భార్య అచ్చుమ్మ. వ్యవసాయదారుల కుటుంబం. అయినా మద్రాసుతో వ్యాపార సంబంధాలున్నై.

మద్రాసు తొండమండలం తిరువెళ్ళూర్ హైస్కూలులో అయిదవ తరగతి చదివాడు. ముత్యాలపేట హైస్కూలులో థర్డ్ ఫారం చదివాడు. పచ్చయప్ప కాలేజిలో చేరాడు. బారిష్టరును చేద్దామని తండ్రి కోరిక. కాని బి.ఎస్. జి.డి.ఎ. (ఆడిటింగ్) కోర్సులో చేరాడు. నాటకాలతో సంబంధాలు కుదిరాయి. ఆంధ్రనాటక సభ సభ్యుడైనాడు.

గాంధీ దండియాత్రలో వున్నప్పుడు బి.ఎస్.రెడ్డి తన తండ్రిగారి తరఫున వ్యాపార అవసరాలకు రంగూన్ వెళ్ళాడు. గాంధీగారి ఉపన్యాసం విన్నాడు. విదేశ వస్తు బహిష్కరణ పిలుపుకు ప్రభావితుడై తన కోట్లు అన్నింటిని తగులబెట్టి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జీవితంలో చివరి క్షణం వరకు ఖద్దరులోనే వున్నాడు.

తన జీవిత ప్రయాణంలో అత్యంత ప్రముఖుడైన హెచ్.యం.రెడ్డి గారితో పరిచయమైంది. రోహిణీ స్టూడియో, వాహినీ పిక్చర్సు, వాహినీ స్టూడియో, విజయ ప్రొడక్షన్స్ ఆవిర్భవించగా అన్నింటిలో బి.ఎన్.రెడ్డికి ఎంతో కొంత ప్రమేయం వుండి సినిమా నిర్మాణం వైపున స్థిరపడ్డాడు. ముందుకు సాగాడు. సామాజిక ఇతివృత్తాలవైపు, సామాజిక సమస్యలవైపు దృష్టి సారించాడు.

గృహలక్ష్మి, వందేమాతరం, మాలపిల్ల, స్వర్గసీమ, పెద్దమనుషులు, సుమంగళి, మల్లీశ్వరి, భాగ్యరేఖ, బంగారు పాప, రాజమకుటం, పూజాఫలం, రంగులరాట్నం, బంగారు పంజరం సినిమాలను తీశాడు. తీయాలనుకున్న లవకుశ (సీత), విప్రనారాయణ, పుణ్యభూమి, కళ్ళతెరు, కర్ణ, రేపు నీదే, భక్తప్రహ్లాద, కొండవీటి రెడ్డిరాజు కుమారగిరి రెడ్డి సినిమాలను తీయలేనని చాలించాడు. సినిమా అంటే బి.ఎన్.రెడ్డి తీసిందే సినిమా అన్న పేరు గాంచాడు. 1958-63 కాలంలో ఆంధ్ర శాసనమండలి సభ్యునిగా ప్రభుత్వం నామినేట్ చేసింది.

దక్షిణ భారతదేశంలో "దాదా సాహెబ్ ఫాల్కే" అవార్డు పొందిన ప్రధమ వ్యక్తి బి.ఎన్.రెడ్డి. 1974లో భారత ప్రభుత్వం ఈ అవార్డు ప్రకటించింది. అంతే కాదు ఈయన కుటుంబం ఎంత గొప్పదంటే ఈయన తమ్ముడు బి. నాగిరెడ్డికి కూడ "దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు" వచ్చింది. ఒకే కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు దేశంలోని అత్యుత్తమ అవార్డు రావటం గొప్ప విషయం. దేశంలో మరే కుటుంబంలోనూ ఇలా జరగలేదు. బి.ఎన్.రెడ్డికి 1975లో భారత

ప్రభుత్వం “పద్మభూషణ్” బిరుదునిచ్చి సత్కరించింది. 1975లోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం “కళాప్రపూర్ణ” బిరుదునిచ్చి సత్కరించింది. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం “గౌరవ డాక్టరేట్” ఇచ్చి గౌరవించింది.

బి.ఎన్.రెడ్డి. కుటుంబం భారతీయ చలనచిత్ర చరిత్రని తిరగరాసింది. బి.ఎన్.రెడ్డి కృషికి ప్రతిభకు చిరునామా. తెలుగు జాతికి దొరికిన రెడ్డి రత్నాలలో బి.ఎన్. ఒకరు. సినీరంగంలో ఆయన జీవితమే ఒక చరిత్ర. మనసున మల్లెలూగించి బ్రతుకులు పండించిన ప్రతిభాశాలి.

సినిమా నిర్మాణంలో బి.ఎన్.రెడ్డి దొక ప్రత్యేక శైలి. దేనితోనూ రాజీపడలేదు. ఆయనకు డబ్బు సంపాదన ముఖ్యం కాదు. సినిమా ఒక శక్తివంతమైన మీడియా అని, తద్వారా సమాజ రుగ్మతలను బట్టబయలు చేసి నిర్దుష్ట సమాజాన్ని నిర్మించాలని ఆయన కోరిక. మానవ విలువల కోసం సినిమాలు తీశాడు తప్ప డబ్బుకోసం తీయలేదు. సినిమాలలో ప్రతి సన్నివేశంలో ఒక సందేశం, ఒక నీతి వుండాలని తపించాడు. కాని తను జీవించి వుండగానే సినిమా పరిశ్రమ దిగజారిపోయింది. సినిమాలు వాస్తవాలను ప్రతిబింబించటం లేదని ఇదొక జూదమైందని చింతించాడు. మార్చలేక మౌనం వహించాడు.

బి.ఎన్.రెడ్డి దైవభక్తుడు. సంప్రదాయ శీలి. ఆదర్శవాది. పెద్దమనిషి.

బి.ఎన్.రెడ్డి 08.11.1977న స్వర్గస్తులైనారు. ఆయన స్మృత్యర్థం భారత ప్రభుత్వం ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది.




బి.ఎన్.రెడ్డి, రెడ్డి కులానికి తలమానికమైన సినీరంగ మేధావి.

మాట నిలువలేని మనుజుడు చండాలు
దాజ్ఞ లేని రాజు యధముండు
మహిమ లేని వేల్పు మంటచూచిన పులి
విశ్వదాభిరామ వినురవేమ.

# బి. నాగిరెడ్డి

## (బొమ్మిరెడ్డి నాగిరెడ్డి)



జననం : 02.02.1912
మరణం : 25.02.2004)

తెలుగు సినీరంగంలో, సామాజిక సేవారంగంలో బి.నాగిరెడ్డి కలికితురాయి. ఈయన చెన్నైలో విజయ, వాహినీ సినిమా స్టూడియోలు నిర్మించాడు. ఇవి ఆసియా ఖండంలోనే

పెద్దవని పేరుపొందాయి. బి.ఎన్.రెడ్డి, నాగిరెడ్డికి అన్న. ఇద్దరూ ఇద్దరే. సినిమా రంగంలో అఖండులు.

తెలుగులో నాగిరెడ్డి నిర్మించిన చిత్రాలు అద్భుతమైనవి. అవి షావుకారు (1950), పాతాళ భైరవి (1951), పెళ్ళిచేసిచూడు (1952), చంద్రహారం (1954), మిస్సమ్మ (1955), మాయాబజార్ (1957), అప్పుచేసి పప్పుకూడు (1958), రేచుక్క పగటి చుక్క (1959), గుండమ్మ కథ (1962), శ్రీ రాజరాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్ (1976). తెలుగు భాషలోనే కాక తమిళం, హిందీ భాషలలోనూ చలన చిత్రాలను నిర్మించాడు.

"దాదా సాహెబ్ పాల్కే అవార్డు" అత్యున్నతమైన సినిమారంగ అవార్డు. అన్న బి.ఎన్. రెడ్డికి 1974లో (ప్రప్రథమంగా దక్షిణ భారతదేశంలో) భారత ప్రభుత్వం ఇస్తే, తమ్ముడు నాగిరెడ్డికి 1986లో భారతప్రభుత్వం ఇచ్చింది. ఒకే కుటుంబంలో వారికిద్దరికి ఈ అత్యున్నత అవార్డు రావడం అరుదు. 1965లో ఈయన కన్నడ భాషలో తీసిన "మదువే మదినోడు"కు జాతీయ అత్యుత్తమ ఫీచర్ సినిమా అవార్డు వచ్చింది. అలానే మాయాబజార్, గుండమ్మ కథ సినిమాలకు ఫిలింఫేర్ బెస్ట్ ఫిలిం అవార్డులొచ్చాయి. 1987లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రతిష్టాత్మక "రఘుపతి వెంకయ్య నాయుడు అవార్డు" నిచ్చి గౌరవించింది. అలానే తమిళనాడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన "కలైమామణి అవార్డు"ను 1972లో ఇచ్చింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్లనిచ్చి గౌరవించాయి.

నాగిరెడ్డి 1980–83 కాలంలో తిరుమల–తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా చేశారు. ఆయన హయంలోనే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కట్టించారు. సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్‌కు నాలుగు పర్యాయాలు, ఆల్ ఇండియా ఫిల్మ్ సమ్మేళన్‌కు రెండు పర్యాయాలు ఛైర్మన్‌గా వ్యవహరించారు.

1945లో ఆంధ్రజ్యోతి పత్రికను ప్రారంభించి నడిపారు. అన్నింటినీ మించి, ప్రపంచం మొత్తంలో 12 భాషలలో మేటిగా ప్రచురించబడి బహుళ ప్రచారం పొందిన బాలలపత్రిక "చందమామ"ను 1947 నుంచీ నడిపాడు.

1972లో ప్రజాసేవే ధ్యేయంగా విజయ మెడికల్ మరియు ఎడ్యుకేషనల్ ట్రస్టును చెన్నైలో ప్రారంభించి పేద ప్రజలకు తోడ్పాటునందిస్తూ వచ్చాడు. ఈ ట్రస్ట్ ఇప్పటికీ పనిచేస్తూనే వున్నది. చెన్నైలోని వీరి విజయ హాస్పటల్ మరువరాని సేవలనందిస్తున్నది.

నాగిరెడ్డి కర్మయోగిగా చరిత్రలో చిరకాలం నిలిచిపోతాడు. నాగిరెడ్డి రెడ్డికులానికి గర్వకారణమైన వ్యక్తి.

**అప్పుడీయ రోత హరిహరాదులకైన**
**మెప్పెతోడ మైత్రి మొదలె రోత**
**తప్పు బలుక రోత తాకట్టు బలు రోత**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఏరుదాటి మెట్టకేగిన పురుషుండు
పుట్టి సరుకు కొనక పోయినట్లు
యోగ పురుషుడేల యొడలు బాటించురా!
విశ్వదాభిరామ వినురవేమ.

# కె.వి. రెడ్డి

## (కదిరి వెంకటరెడ్డి)



జననం : 01.07.1912

మరణం : 16.09.1972

కదిరి వెంకటరెడ్డి – సినిమా రంగంలో కె.వి.రెడ్డిగా ప్రఖ్యాతి చెందిన వ్యక్తి. అనంతపురం జిల్లా, తాడిపత్రి తాలూకా, తేళ్ళమిట్టపల్లెలో జన్మించాడు. తండ్రి కొండారెడ్డి, తల్లి వెంకటరంగమ్మ,

భార్య శేషమ్మ. 1936లో వివాహం జరిగింది. సంతానం ఐదుగురు కూతుళ్ళు, నలుగురు కొడుకులు. మోతుబరి రైతు కుటుంబం.

తండ్రి తను ఏడాది వయసులో వుండగా మరణించగా, తట్టుకోలేని తల్లి కొడుకు కె.వి.రెడ్డిని తిరుపతికి తీసుకొని వెళ్ళి, ఆ పసికందును హుండీలో వేసి "స్వామీ వీడు నీ బిడ్డ నీవే కాపాడుకో" అని, స్వామికి చెప్పుకొని వెళ్ళిపోతుంటే అర్చకులు గమనించి రక్షించి వెనక్కు యిచ్చి పంపారు. తన మేనమామ క్రిష్ణారెడ్డి చదివించి పెద్ద చేశాడు.

చలాకీ కుర్రాడు. లెక్కల్లో దిట్ట. తాడిపత్రి హైస్కూలులో 12వ తరగతి వరకు చదివాడు. మద్రాసులో బి.ఎస్సీ. ఆనర్సు (ఫిజిక్స్) చదివాడు.

కె.వి.రెడ్డికి బిర్లా ఆఫ్ రాయలసీమ అనబడే మూలా నారాయణస్వామితో మంచి స్నేహం. రోహిణి (సినిమా) సంస్థలో క్యాషియర్‌గా చేరాడు. నారాయణ స్వామి, బి.ఎన్. రెడ్డి వాహినీ సంస్థను ప్రారంభించారు. బి.ఎన్.రెడ్డి ఆ సంస్థలో డైరెక్టరుగా చేరాడు. నారాయణస్వామి, బి.ఎన్.రెడ్డి దర్శకత్వం క్రింద సినిమాలలో పని చేశాడు. కె.వి. రెడ్డి నిరాడంబర వ్యక్తి అతిసాధారణంగా వుంటాడు. ఆహార్యం ఎంత నిరాడంబరంగా వుంటుందో, ఆయన ప్రతిభ అంత ఉన్నత శిఖరాలపై వున్నది. తెల్లని పల్చని పంచ, తెల్లని అరచేతుల చొక్కా, అంతే తెల్లని పల్చని పైకండువా, సాధారణ చెప్పులు, గొడుగు, కాలినడక ఇవన్నీ చూస్తే ఆయన ప్రపంచస్థాయి సినిమా దర్శకుడనో, నిర్మాతనో అనిపించదు.

కె.వి.రెడ్డి భక్తపోతన, యోగి వేమన, గుణసుందరి కథ, పాతాళభైరవి (తెలుగు – తమిళం – హిందీ భాషలలో) పెద్దమనుషులు (వాహినీ వారి పెద్దమనుషులు సమాజంలో ఇప్పటికీ ఉన్నారు) దొంగరాముడు, మాయాబజారు, పెళ్ళినాటి ప్రమాణాలు, జగదేకవీరుని కథ, కృష్ణార్జున యుద్ధం, సత్యహరిశ్చంద్ర, ఉమా చండీ గౌరీ శంకరుల కథ, భాగ్యచక్రం, శ్రీకృష్ణ సత్య సినిమాలకు దర్శకత్వం చేశాడు. పాతాళ భైరవి, మాయాబజారు సినిమాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. టెక్నికల్ నాలెడ్జి ఇంతగా లేని రోజుల్లో తీసిన ఆ సినిమాల్లాగా ఈరోజుకూ సినిమాలు తీయలేకపోతున్నారు. అది కె.వి.రెడ్డి ప్రతిభ. పైవాటిలో 6 సినిమాలకు ఆయనే నిర్మాత. కె.వి.రెడ్డి విజయా సంస్థలో పర్మనెంట్ డైరెక్టర్.

తెలుగు చలనచిత్రరంగ పితామహుడుగా, దర్శక మహేంద్రుడుగా పేరు పొందాడు. తెలుగు చలన చిత్రరంగంపై ఆయన ప్రభావం ఎంతో వుంది. ఎన్.టి. రామారావును, యస్వీ రంగారావును వెండితెర దేవుళ్ళుగా, రేలంగిని హాస్యబ్రహ్మగా రూపుదిద్దింది కె.వి.రెడ్డిగారే. రేలంగికి హాస్యనటునిగా స్థానమిచ్చి చిరస్థాయినిచ్చింది కె.వి.రెడ్డి గారే. డి.వి.నరసరాజు, కొసరాజు, సముద్రాల, పింగళి, ఘంటసాల, పెండ్యాల మొదలగువారిని చిత్ర పరిశ్రమకు ప్రసాదించింది, తెలుగు సినిమాకు కొత్త వ్యాకరణం అందించిందీ కె.వి.రెడ్డిగారే. ఏ అవార్డులకూ పాకులాడని వ్యక్తి. ఆయన నిత్యకృషీవలుడు. కర్మయోగి, కష్టజీవి. డబ్బు విలువ, కాలం విలువ తెలిసిన వ్యక్తి. వృత్తి పట్ల శ్రద్ధ, భక్తి, అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధత కె.వి. రెడ్డికి ఆస్తులు.


1955లో వీరి “పెద్దమనుషులు” చిత్రానికి ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా నేషనల్ ఫిల్మ్ అవార్డు వచ్చింది. అలాగే 1958లో వీరి “పెళ్ళినాటి ప్రమాణాలు”కు ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా నేషనల్ ఫిల్మ్ అవార్డు వచ్చింది. అలాగే 1966లో కన్నడలో తీసిన “సత్యహరిశ్చంద్ర”కు ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా నేషనల్ ఫిల్మ్ అవార్డు వచ్చింది. కె.వి. రెడ్డిగారు, చిత్రదర్శకుడుగా, నిర్మాతగా, సంభాషణ చాతురీణుడుగా, నిర్మాణకర్తగా పలు ప్రశంసలు ప్రభుత్వాల నుండి, సినీ పరిశ్రమ నుండి పొందారు. ఈనాటికీ తెలుగు ప్రజల గుండెల్లో స్థానమే ఆయనకు గొప్ప అవార్డు.

రెడ్డికులం సగర్వంగా చెప్పుకోదగ్గ అసామాన్య వ్యక్తి కె.వి.రెడ్డి.

**భయము సుమీ యజ్ఞానము**
**భయముడిగిన నిశ్చయంబు పరమార్థంబే**
**లయము సుమీ యీ దేహము**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ధనమున్న దన్న మదమున
ననయము దుర్వ్యయము సేయ నంతయుదరుగున్,
దినమొక్క యిటిక బెరికిన
ఘనసౌధంబైన నేలగలయదె మిత్రా.

# తిక్కవరపు వెంకట రమణారెడ్డి



జననం : 01.10.1921
మరణం : 11.11.1974

రమణారెడ్డి నెల్లూరుజిల్లా జగదేవిపేటలో జన్మించాడు. సినిమాలలో హాస్యానికి, హాస్య పాత్రలకు, నటులకు ప్రాముఖ్యత చాలా ఉన్నది. చార్లీ చాప్లిన్ మాట్లాడకుండానే మౌనంతోనే హాస్యం పండించి ప్రపంచంలోనే ప్రసిద్ధుడైనాడు. అలా హాస్యపాత్రలలో జీవించి తెలుగు

సినిమా రంగంలో మేటియైన హాస్యనటుడు మన రమణారెడ్డి (తిక్కవరపు వెంకట రమణారెడ్డి). 1951 నుండి 62 సినిమాలలో నటించినట్లు సినిమారంగ సమాచారం.

నేటి పార్లమెంటు సభ్యుడు టి.సుబ్బిరామిరెడ్డి (గాయత్రి గ్రూప్ అధినేత)కి పెదనాన. మిస్సమ్మ సినిమాలో డేవిడ్ పాత్ర, మాయాబజారు సినిమాలో చిన్నమయ్య లాంటివి ఆయన సినిమా జీవితంలో ముఖ్యపాత్రలు.

సినిమాలలో ప్రవేశించక ముందు శానిటరీ ఇన్‌స్పెక్టరుగా మరియు ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేవాడు. మంచి ఐంద్ర జాలికుడు (Magician). స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రదర్శనలిచ్చి ప్రజాసేవలో సంస్థలకు తోడ్పడే వాడు.

సినిమా రంగంలో బి.ఎన్.రెడ్డి, బి.నాగిరెడ్డి, కె.వి.రెడ్డి గారలు ఎంత ప్రసిద్ధి చెందారో రమణారెడ్డి కూడ తన విభాగం ప్రావీణ్యతలో తనకు తానే సాటియై రెడ్డి జాతికి కళారంగంలో కీర్తి తెచ్చారు.

నెల్లూరు యాసకు మారుపేరు రమణారెడ్డి. సన్నగా పొడుగ్గా నవ్వొచ్చే విగ్రహం. ఎముకల పోగులా వుంటాడు.

మొదటి సినిమా 1951లో మాయపిల్ల. బంగారు పాప, మిస్సమ్మ, దీక్ష చిత్రాలు మంచిపేరు తెచ్చాయి. 1960లో రేణుకాదేవి మహత్యంలో చొక్కాతోనే నారద పాత్ర ధరించాడు. మాయాబజారు, గుండమ్మకథ, సువర్ణసుందరి ఆయన గొప్పచిత్రాలు. లవకుశ, రాముడు–భీముడు, ఇద్దరు మిత్రులు చాల స్థానం కల్పించాయి. మామగా, అల్లుడిగా, యజమానిగా, బంట్రోతుగా, రాజుగా, సైనికుడిగా పాత్రలు వేసినా తన ముద్ర వుండేది. సెట్‌లో ఎలావున్నా బయట అందరినీ గొప్పగా గౌరవిస్తాడు. యన్.టి. రామారావు, నాగేశ్వరరావు పాత్రలకు తండ్రిగా వేసేవాడు. "ఈ ఫేసుకి ఈ తృప్తి చాలు" అనేవాడు. మొత్తం మీద 62 సినిమాలలో నటించాడు. చీకటి వెలుగులు చివరి చిత్రంగా కన్నుమూశాడు.

మరపురాని రెడ్డిహాస్యనటుడు రమణారెడ్డి.

# జి.కె. రెడ్డి

## (గునుపాటి కృష్ణారెడ్డి)



జననం : 8-9-1923
మరణం : 18-8-1987

జి.కె.రెడ్డి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన జర్నలిస్టు. క్లిష్ట రాజకీయ సందర్భాలలో కూడ ఆయన వాఖ్య ఎప్పుడూ ఫలితం లేకుండా పోలేదు.

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**

జి.కె.రెడ్డి నెల్లూరు జిల్లా కొత్తూరులో జన్మించాడు. సంపన్న వ్యవసాయ కుటుంబీకుడు. నెల్లూరు వి.ఆర్. కాలేజీలో చదివాడు. విశ్వవిద్యాలయ స్థాయికి సాగలేదు. బ్రతుకు విశ్వ విద్యాలయంలో చేరాడు. పత్రికా రచన రంగంలో చేరి ఆ రంగాన్ని సుసంపన్నం చేశాడు. జి.కె. రెడ్డి రాజకీయ వ్యాఖ్య చేస్తే తు.చ. తప్పకుండా జరిగేదని ప్రపంచ పత్రికారంగానికే తెలుసు. పత్రికా రంగానికే గౌరవం తెచ్చాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లో 1940 దశకంలో కాశ్మీర్ టైమ్స్ పత్రికా సంపాదకులుగా ఉన్నాడు. ఈ పత్రికాధిపతి పాకిస్థాన్ జాతీయుడు అబ్దుల్ రహిమాన్ మిద్దా. ఆ రాష్ట్ర మహరాజా హరిసింగ్ ఈ పత్రికపై ఆంక్షలు విధించాడు. ముజఫరాబాద్ వద్ద జి.కె.రెడ్డిని దాదాపు గ్రామనిర్భంధం చేశారు. తరువాత మిలిటరీ ఎస్కార్ట్‌తో బహిష్కరించారు. 1947-48లలో కాశ్మీరు లోయపై కొండజాతుల వారు దాడి చేసినప్పుడు అక్కడ చిక్కుకొనిపోయి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా గ్రహించి ఏ పత్రికకూ లభించని సమాచారాన్ని సేకరించుకొన్నాడు. కొండజాతులవారి దాడిలో పాకిస్తాన్ ప్రమేయాన్ని సాక్ష్యాధారాలతో సేకరించాడు. అపుడు లాహోర్‌లో పాకిస్తాన్ అసోసియేటెడ్ ప్రెస్ తరఫున పనిచేశాడు. కాశ్మీర్ ప్రభుత్వంలో ప్రజాసంబంధాల డైరెక్టరుగా పనిచేస్తూ పాకిస్తాన్‌లో స్వేచ్ఛగా పర్యటిస్తూ పాకిస్తాన్ చర్యలను ప్రత్యక్షంగా గ్రహించి నమోదు చేసుకున్నాడు. అపుడు ఈయనను గూఢచారిగా భావించారు. అక్కడి నుండి 1948లో తప్పించుకొని ముంబైకు చేరుకొని ఆ సమాచారానిని బ్లిట్జ్ పత్రికకు అందజేశాడు. ఆ పత్రిక ఆ సమాచారాన్ని 1948 జూన్ నుండి ప్రముఖంగా ప్రచురించింది. దేశవిదేశాల్లో సంచలన వార్త అది. ఆయన ఉద్యోగానికే ప్రమాదం వచ్చింది. అలానే ఆ పత్రికలో 1948 నుండి 1951 వరకు పనిచేసి ఆ పత్రిక నుండి మారి 1951-1962 వరకు టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికకు ప్రధాన విదేశ విలేఖరిగా కొరియా, బీజింగ్, లండన్ నగరాలలో పనిచేసి తర్వాత అదే పత్రిక కొత్తఢిల్లీ కార్యాలయానికి 1962లో అధిపతి అయాడు.

1969లో హిందూ పత్రిక కొత్తఢిల్లీ బ్యూరోకు అధిపతియై రెండు దశాబ్దాలు పనిచేసి పతాక శీర్షికలు చివరి వరకూ రాశాడు. విదేశీ పాఠకులకు కూడ నమ్మకమైన, ఆధారపడదగిన పత్రికా ప్రతినిధిగా పేరొందాడు. ఇది జి.కె.రెడ్డి వార్త అని పాఠకులు చదువుకునేవారు. నీలం సంజీవరెడ్డిగారు జి.కె.రెడ్డి పంపిన వార్తకు అధిక ప్రాధాన్యత నిచ్చేవారు. దేశ విదేశీ ఆంగ్ల పత్రికలకు, పరిపాలకులకు మార్గదర్శకుడైనాడు. ఉత్తమ సంప్రదాయాలను నెలకొల్పాడు.

ఒక భారతీయ వార్తాపత్రిక ప్రత్యేక రాజకీయ విలేఖరిగా బీజింగ్‌లో నియమించబడ్డ మొదటి భారతీయుడు ఈయనే. వార్తలు మూలస్థానాన్ని రహస్యంగా ఉంచటంలో విశ్వసనీయుడనే ఖ్యాతి పొందాడు.

1957లో పత్రికా రచనను సుసంపన్నం చేసినందుకు అమెరికాలోని "హార్వర్డ్ నీమన్ ఫెలో" గౌరవం లభించింది.

1973లో శ్రేష్ఠమైన ప్రతికా రచనకు దుర్గారతన్ గౌరవప్రదానం జరిగింది.

విదేశ సంబంధాల గురించి పత్రికా రచనకు ప్రత్యేక గుర్తింపుగా న్యూయార్క్ కౌన్సిల్ ప్రత్యేక ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించింది.

శ్రీవెంకటేశ్వర, ఆంధ్ర విశ్వకళా పరిషత్తులు గౌరవ డాక్టర్ ఆఫ్ లెటర్సు పట్టాలిచ్చి గౌరవించాయి.

1986 ఏడాదికి జి.కె.రెడ్డికి అత్యంత ప్రతిష్ఠాకరమైన రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డునిచ్చారు.

చివరికి కేన్సర్ వ్యాధికిగురై న్యూయార్క్‌లో చికిత్స పొందుతూ స్వర్గస్తులైనారు.

ఆయన పేరుపై జి.కె.రెడ్డి జర్నలిజమ్ అవార్డును టి. సుబ్బిరామిరెడ్డిగారు ఏర్పాటు చేసి హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఇండియా టుడే, ఔట్‌లుక్, న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వగైరా పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఏటా ఇస్తున్నారు.

రెడ్డి కులంలో ఇంతటి అంతర్జాతీయ వ్యక్తిగా పేరొందుట వలన రెడ్డి మేధావి వర్గానికే కీర్తి వచ్చింది.

**బలవంతులతో కలహము**
**బలయుతులకెకా క పేదవారికి దగునా?**
**ములు దాకి యరటి యాకులు**
**చిలుపలు చీరికలుగాగ చినుగవె మిత్రా.**

అలుపునకు నీతి చెప్పిన
దలకెక్కదు, హేళనముగ దలపోసి నగున్;
వెలిగచ్చుటరుగు మీదను
మొలవేసిన విత్తు మోసు పొడుచునె మిత్రా.

# గజ్జల మల్లారెడ్డి



జననం : 1925
మరణం : 5-7-1998

మల్లారెడ్డి కడపజిల్లా పులివెందుల దగ్గరలో అంకాలమ్మ గూడూరు గ్రామంలో జన్మించాడు. పుట్టిన తేదీ ఆయనకే తెలియదు. రైతు కుటుంబం. ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే జరిగింది. హిందీ భాష అధ్యయనం కోసం 1943లో బెనారెస్ వెళ్ళాడు.

అక్కడ రాజకీయ భావాలకు పునాదులు పడ్డాయి. బెనారెస్ నుండి తిరిగివచ్చి భారత కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. భార్య సావిత్రమ్మ. తాను కమ్యూనిస్టునని చెప్పినా సావిత్రమ్మ తండ్రి వదలకుండా అల్లుణ్ణి చేసుకున్నాడు. వారికి ముగ్గురు ఆడపిల్లలు ఒక మగపిల్లవాడు.

1955లో శాసనసభ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయాడు. వీర కమ్యూనిస్టు. భార్య చేతుల గాజులు కూడ కత్తిరించి పార్టీ ఫండుకిచ్చాడు. ఆస్తి కూడాను అమ్మి పార్టీ ఫండుకిచ్చాడు. 4 సం॥లు జైల్లో ఉన్నాడు. బయటకొచ్చాక పేరు మారుమోగింది. ఎలెక్షన్ ఓడిపోయాక సొంతూరు చేరాడు.

అప్పటి నుండి ఈయన కృషి జర్నలిజం వైపుకు పోయింది. 1959లో సమదర్శి పేరుతో వివిధ పత్రికలకు వ్యాసాలు రాశాడు. పదునైన భాష అని పెద్దలే భావించారు. 1963లో మల్లారెడ్డి గేయాలు పేరుతో కవితలు ప్రచురించాడు. వాటిపై ప్రముఖ సాహితీ విమర్శకులు రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.) గారు ఇలా అన్నారు. "తెలుగు జాతి జీవితంలోని ఒక కొత్త చారిత్రక దశకు ప్రతీకగా ఉద్భవించటమే మల్లారెడ్డి కవిత్వంలోని కొత్తదనం. మల్లారెడ్డి గొప్పదనం కూడ అదే. తీక్షణమైన మేధస్సు, సున్నితమైన హృదయమూ, పరిశుద్ధమైన అంత్ణకరణ కలవాళ్ళు మాత్రమే నిత్యజీవితంలోని అల్పాంశాలను అధిగమించి విశాలమైన జాతీయ దృష్టితో నూతన చారిత్రక సత్యాలను అవగాహన చేసుకొని తదనుగుణమైన నూతన కవితా వాక్కును సంతరించుకోగలరని జ్ఞాపకం పెట్టుకుంటే మల్లారెడ్డి గేయాల్లోని కొత్తదనమూ, గొప్పతనమూ స్పష్టమౌతాయి". శ్రీశ్రీ కూడా ఇలా అన్నారు. "గజ్జెల మల్లా! నీ గేయాలు చదివాను. మళ్ళీ చదివాను. మళ్ళీ మళ్ళీ చదివాను. ఈ పాతికేళ్ళలో నేను కూడబెట్టుకున్న కీర్తిని నువ్వు పాతికకన్నా తక్కువ కావ్యాలతో తస్కరించావని నీ మీద నేను కేసు పెడుతున్నా! ఇట్లు మహా మహాకవి శ్రీశ్రీ" అని రాశారు. మల్లారెడ్డి కవిత్వానికి ఇంతకంటె గొప్పమెప్పు ఏముంటుంది. కాని వాస్తవం రాసేవాడు. అందుకని లోకవిరోధి అయాడు. చిన్న పెద్ద కవులంతా విరోధులైనారు. అయినా తొణకలేదు. బెణకలేదు.

1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయినప్పుడు కార్యవర్గంలో సభ్యులుగా వున్నాడు. కాని ఆస్తులు లేవు, ఆదాయం లేదు. కుటుంబం భారమైంది. బెజవాడ పోయాడు.

1970–71లో విశాలాంధ్ర పత్రికకు సంపాదకులుగా పనిచేశాడు.

హృద్రోగం వచ్చింది. వైద్యం చేయించుకున్నాడు.

1978–83 ఈనాడు దినపత్రిక సంపాదకులుగా పనిచేశాడు. కాపురం కుదుటపడింది. పేరొచ్చింది.

1983–89 ఆంధ్రభూమి దినపత్రికకు సంపాదకులుగా పనిచేశాడు.

1989–91 ఉదయం దినపత్రికకు సంపాదకులుగా పనిచేశాడు. తనదైన ముద్రను పత్రికారంగంలో వేశాడు.

ఆయన ఈనాడు దినపత్రికలోని పుణ్యభూమి, ఆంధ్రభూమి దినపత్రికలోని పణ్యభూమి చురకలు, ఉదయం దినపత్రికలోని అక్షంతలు, మాట కచేరి శీర్షికల ద్వారా వచ్చిన కవితాత్మక వ్యాఖ్యానాలు ఉర్రూతలూగించాయి. దాదాపు పాతికేళ్ళపాటు పత్రికారంగంలో గణనీయమైన కృషిచేశాడు. ఈయన రచనలు మల్లారెడ్డి గేయాలు, శంఖారావం, ఇంటర్వ్యూహం, సత్యంవధ ధర్మం చెర, ఎం.ఎల్.ఎ., సందేహకోల, పేరిగాని దర్బారు, దమ్మపదం వగైరాలు పేరుగాంచాయి.

1985లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందాడు. 1993–95లో రాష్ట్ర అధికార భాషా సంఘానికి అధ్యక్షునిగా చేశాడు.

ముందే వీచిక పత్రికను నడిపాడు. 1973లో సోవియట్ రష్యాలో పర్యటించి ఆఫ్రో–ఆసియా రచయితల మహాసభలకు హాజరైనాడు. 1972–77లలో అరసం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాడు.

మల్లారెడ్డి రచించిన "మాట కచేరి", "అక్షింతలు" బహుళ జనాదరణ పొందాయి.

ఇట్టి గజ్జెల ఘల్‌ఘల్‌లను రెడ్డిజాతి మరువలేదు. ప్రపంచమూ మరవదు.

మల్లారెడ్డి 'మనస్సాక్షి' అనే పేరుతో ఆత్మకథ రాసుకున్నాడు. ఏమీ దాచుకోలేదు.

**బలవంతులతో కెడమిచ్చిన**
**మెలమెల్లగ నంతనాక్రమింతురు పిదపన్;**
**బలి మూడడుగుల దానము**
**కులనాశకమయ్యె నసుర కోటికి మిత్రా.**

కడు దుష్టుండగు జాల్ముని
యెడద నొకటిరెండు గుణములేనియునుందున్,
చెడుపేడ దిబ్బనడుమను
పడి మొలవదె బంతిచెట్టు బాగుగ మిత్రా.

## దేశంలో ప్రథమశ్రేణి చిత్రకారుడు

# పాకల తిరుమలరెడ్డి

## (పి.టి. రెడ్డి)



జననం : 4-1-1915

మరణం : 21-10-1996

దేశంలో ప్రథమశ్రేణి కళాకారుడైన హాలికుడు పాకల తిరుమలరెడ్డి. ఆయన పి.టి. రెడ్డిగా దేశంలో కళారంగంలో ప్రసిద్ధుడు. వ్యవసాయ కుటుంబంలో కరీంనగర్ జిల్లా అన్నారంలో జన్మించాడు.

1935–42 మధ్యకాలంలో బొంబాయిలో జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో డిప్లొమా చదివాడు. ప్రధమశ్రేణిలో సర్వప్రధముడుగా ఉత్తీర్ణుడైనాడు. అక్కడే కుడ్య చిత్ర కళాధ్యయనం చేశాడు. 1942లో ప్రప్రథమంగా వ్యష్టి చిత్రకళా ప్రదర్శన నిర్వహించిన భారతీయ కళాకారునిగా ప్రసిద్ధి చెందాడు. బొంబాయి కేంద్రంగా వచ్చి అభ్యుదయ కళోద్యమానికి నాయకత్వం వహించాడు.

1945 నుంచి ఒక దశాబ్ద కాలం లాహోరులో చలనచిత్రాలకు కళాదర్శకుడుగా పని చేశాడు. కాని ఆ రంగం ఆయనకు తృప్తినివ్వకపోగా చిత్రకళ వ్యాపారానికి దాసోహమౌతున్న కారణంచే సినిమా వదిలి కళారంగానికే పరిమితమైనాడు.

ఐదున్నర దశాబ్దాల కళాజీవితంలో సమకాలీన సంఘటనలకు ప్రాణంపోశాడు తిరుమల రెడ్డి. మరియు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వ్యక్తిత్వ వైవిధ్యానిని, ఇందిరాగాంధీ వ్యక్తిత్వ వైవిధ్యానిని, ప్రత్యేక తెలంగాణా పోరాట సంఘటనలను, గ్రామీణ జీవితాలకు అద్దంపట్టే వ్యావసాయిక, కర్షక, కార్మిక జీవితాలను, పాడిపంటలు, పశుపోషణ వగైరా వాస్తవికతలను దేశంలో ప్రధమ కళాకారుని స్థాయిలో చిత్రీకరించి పేరుగాంచాడు.

పి.టి. రెడ్డి ఆర్ట్ మ్యూజియం "సుదర్శ" ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పాడు. దీనిని నేటికీ దర్శించవచ్చు. ఆయన రూపులు దిద్దిన నిశ్చలన చిత్రాలు, ప్రకృతి దృశ్యాలు, సంప్రదాయ చిత్రాలు, నైరూప్యచిత్రాలు మొత్తం ఏడువందల డెబ్బైదాకా ఉన్నాయి.

చిత్రకళకు సంబంధించిన ఐదు వందల గ్రంధాలు, జాతీయ అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శనలు క్యాటలాగులు ఏర్పరచి గ్రంధాలయాన్ని నెలకొల్పాడు. ఈయన కళాఖండాలను ఒక బృహద్గ్రంధంగా తయారుచేసి ప్రదర్శనలకుంచాడు. దేశంలోనే ప్రధమంగా ఈ చిత్రకారునిపైనే ఈ గ్రంధం వచ్చిందని అంటారు. దేశవిదేశాలలో నిర్వహించే పోటీలలో పాల్గొని ప్రశంసలు పొందాడు. డబ్బు సంపాదించుకోవటానికి తన సామర్ధ్యాలను ఉపయోగించు కోలేదు. ఈ కళాకారుడు కళ కోసం జీవించాడు, తపించాడు.

ఈయన సతీమణి ప్రసిద్ధ రచయిత్రి ఆచార్య యశోదారెడ్డి.

ఇట్టి గొప్ప రెడ్డి కళాకారుని ప్రజల దృష్టిలో ఉంచటం అవసరం.

# సద్గురు శ్రీకాశినాయన

## (మున్నెల్లి కాశిరెడ్డి)



6-12-1995న యోగప్రతిష్టులైనారు

కాశిరెడ్డి నెల్లూరు జిల్లా (ఉదయగిరి తాలూకా) సీతారాంపురం మండలం బెడుమిపల్లిలో జన్మించాడు. తండ్రి మున్నెల్లి సుబ్బారెడ్డి, తల్లి మున్నెల్లి కాశమ్మ. పాకనాటి రెడ్లవంశం. వ్యవసాయ కుటుంబం.

కాశిరెడ్డి నాలుగు సంవత్సరాల వయసులో తండ్రి మరణించాడు. తల్లి కాశిరెడ్డిని తీసుకొని తన పుట్టింటికి కొత్తపల్లికి చేరింది. కొంత కాలానికి తల్లికూడ మరణించింది. అవ్వ రక్షణలో పెరిగాడు. అవ్వ కాశిరెడ్డిని చదువు కొరకు వేమూరి రామయ్య వద్ద చేర్చింది. వెలుబూడిదలో అక్షరాలు దిద్దుకునే ప్రాంతం అది. క్రమేపి అమరకోశము, భారతం, రామాయణం, నరసింహ శతకము, విష్ణుసహస్రనామం చదువుకున్నాడు.

16 సం॥ వయసులో చదువు మానేశాడు. మేనమామగారి వ్యవసాయపు పనులు చేశాడు.

ఆధ్యాత్మిక దిశలో అప్పుడప్పుడు కొండా రాఘవరెడ్డి వద్దకు పోయివచ్చేవాడు. సద్గురువును వెతుకుతూనే ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం వెలిగండ్లకు చేరి అతిరాచ గురువయ్య స్వామి వద్ద చేరి శుశ్రూష చేసి ఆయన చెప్పే మహిమలు గమనించాడు. యోగవిద్య కొంత సాధించి 20 సం॥ల వయసులో ఊరి బయట బావిలో దూకి మునిగి పద్మాసనంలో పైకితేలాడు.

గురువయ్యస్వామి ఆజ్ఞతో కాశికి వెళ్ళి అక్కడ 3 సం॥ ఉన్నాడు. తదుపరి దేశయాత్ర మొదలుపెట్టి మైసూరు, చిక్‌మగుళూరు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో యాత్రలు చేశాడు. తిరిగి నాయనపల్లి కొచ్చాడు. ఒక రేగుచెట్టు క్రింద వుంటూ 2 సం॥లు పిల్లలకు చదువు చెప్పాడు.

అహోబిలం వెళ్ళాడు. నవనారసింహులను సేవించాడు. 1964లో జ్యోతి నారసింహుని క్షేత్రంలో బావి తవ్వించాడు.

నల్లమలలో గరుడాద్రికి వెళ్ళి సేవించాడు. గరుడాద్రిలో గోసంరక్షణను ఉద్బోధించాడు. తన కృషిలో కొన్ని మహిమలను చూపగలిగాడు. కొండా వీరారెడ్డి, సిద్దయ్య అను భక్తులు కూడ ఏర్పడ్డారు.

నంద్యాలకు వెళ్ళాడు. సిద్ధేశ్వరం దేవాలయం పునరుద్ధరించాడు. కలుగొట్లలో గాయత్రి ఆశ్రమం నిర్మించాడు. గని బృందారక క్షేత్రం దర్శించాడు.

కాశినాయన పురాతన క్షేత్ర పునరుద్ధరణ, కోనేర్లు, సత్రాలు పునరుద్ధరణ, బావుల పూడికతీత తీయించి నీటిసౌకర్యం కలిగించుట, చెరువుల మరమ్మత్తులు ప్రజలచే చేయించే వాడు. ఆయనకు అదొక దైవకార్యం.

సీతారాంపురం ఆశ్రమం, లింగాలదొన ఆశ్రమం, భైరవకాన, నెమిలిగుండ్ల ఆశ్రమం పునరుద్ధరించాడు.

కాశిరెడ్డి ప్రజలలో కాశినాయన గాను, సద్గురు కాశినాయన గాను పేరుపొందాడు. కడప జిల్లాలో కాశినాయన ఆశ్రమం నిర్మించాడు.

కాశినాయన సర్వజ్ఞుడైనాడు. చూడటానికి వచ్చినవారికి వారి మనసులో మాటలకు సమాధానం చెప్పి వారి జీవిత రహస్యాలను భవిష్యత్తును వెల్లడించిన సర్వజ్ఞుడంటాడు.

"చెప్పి రమ్మన్నారు మాకేల, చెప్పి పోతున్నాము మాకేల" ఇది కాశినాయన సద్గురు తత్వము. ఈయనను ఆ ప్రాంతీయులు అవదూతగా భావించారు, పూజించారు. పూర్వ ముఖ్యమంత్రి శ్రీ కోట్ల విజయభాస్కరరెడ్డి కాశినాయన మాటలేనిది వ్యక్తిగత విషయాలు ఏవీ చేసేవాడు కాదట. అంత నమ్మకం కుదిరిందాయనకు. అలానే ఆ ప్రాంతంలోని ప్రతిపల్లెలో కాశినాయనకు భక్తులున్నారు. ఆయన చెప్పినదే శాసనం అక్కడ.

కారణమేమో తెలియదు కాని, ఆయన భక్తులలో ఎక్కువమంది రెడ్డికులస్తులే కావటం రెడ్డి విశేషం. రెడ్డిజాతికి ఒక అవదూత దీవెనలు దొరకటం అదృష్టం. కొన్ని రాష్ట్రాలలో కాశినాయన ఆశ్రమాలు, అన్నదానాలు జరుగుతుండటం విశేషం. కాశినాయన అందరిపై ప్రేమామృతాన్ని కురిపిస్తాడు. తనను అనుసరించే వారికి నాయనగారు ఇచ్చే క్రమశిక్షణ, వారి పరిరక్షణ అత్యంత అద్భుతంగా వుండేవి.

కాశినాయనకు కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, మహబూబ్‌నగర్, హైదరాబాదు, రంగారెడ్డి, మెదక్ జిల్లాలలో ప్రత్యేక గుర్తింపు, భక్తజనులు కలరు. నాయన గారు భౌతికంగా శరీరం వదలిన తరువాత వెలసిన పెక్కు ఆశ్రమాలు నిరతాన్నదానాలు ఇందుకు తార్కాణము. ఒక మండలానికి ఆయన పేరు పెట్టడం కూడ నాయనగారిపై గల భక్తి, విశ్వాసాలకు ఒక సాక్ష్యమే.

నాయన గారు తన అవతార సమాప్తి సమయాన్ని చాల ముందుగానే సూచించారట. అనంత గురవయ్య, గంగమ్మ తల్లితో ఆ రోజుకు ఆశ్రమంకు జ్యోతికి రమ్మని రెండు నెలలు ముందుగానే తెలిపినాడట.

నాయన గారు జ్యోతిర్మయులైన స్థానం శ్రీజ్యోతి క్షేత్రము నల్లమల అడవులకు చివరి గ్రామమైన కడపజిల్లా కాశినాయన మండలంలోని వరికుంట్ల గ్రామం నుంచి పది కి.మీ. దూరంలో ఒకప్పటి కీకారణ్యంలో చుట్టూ కొండలు ఎత్తైన మామిడి, జువ్వి, మేడి, ఈడుగ చెట్ల మధ్య సెలయేళ్ళతో రమణీయంగా ఉంటుంది. కేవలం కాలిబాట వుండేది. నాయనగారు జ్యోతిర్మయులైన తరువాత సుమారు పది ఎకరాలలో ఆశ్రమం ఏర్పడింది. జ్యోతిర్మయుడైన రోజు 6-12-1995 యువనామ సంవత్సరం మార్గశిర శుద్ధ పౌర్ణమి. ఆరోజు తాను యోగప్రతిష్ఠితులై వేలాదిమందికి అన్నదానం చేయించారు. ఆయన యోగప్రతిష్టులైనపుడు సాక్షాత్తు జ్యోతి లక్ష్మీనారసింహుని భంగిమలో ఉన్నారట. ప్రాణవాయువును నాభి కమలమందు జ్యోతి రూపంలో బంధించి జ్యోతిక్షేత్రంలో యోగసమాధిలో కూర్చున్నారు. తదుపరి ఆయనను పద్మాసనమునకు చేర్చిరి. అప్పటికి 20 రోజుల నుండి వాయుభక్షణములో నుండి కైవల్యము చెందిరి.

ప్రతి పుష్యమాస అమావాస్యనాడు కాశినాయన జన్మదిన కార్యక్రమం, మార్గశిర పౌర్ణమినాడు ఆరాధన, నిరతాన్నదానం జరుగుచున్నది. అచట పూజలు, సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామసేవ జరుగును.

సమర్ధ సద్గురు శ్రీ కాశినాయనను నమ్మినవారికి సకల సౌఖ్యాలు కలుగునని నమ్మకం.

**చనువున నయ్యెడు కార్యము**
**లను గలహముపెంచి తీర్పలాభంబున్నే?**
**కొనగోట బోవుదానికి**
**పనివడి గొడ్డలినబూన పాడియె మిత్రా?**

**రెడ్డి జనాభ్యుదయ సంఘం - ఒంగోలు**

# సంప్రదించిన గ్రంథాలు

| | | |
|---|---|---|
| 1. | రెడ్డి రాజ్యాల చరిత్ర | – మల్లంపల్లి సోమశేఖరశర్మ |
| 2. | రెడ్డిరాజుల చరిత్ర | – డా॥ వి.వి. సుబ్బారెడ్డి |
| 3. | ఆంధ్రుల సాంఘిక చరిత్ర | – శ్రీ సురవరం ప్రతాపరెడ్డి |
| 4. | ఆంధ్రుల చరిత్ర | – డా॥ బి.ఎస్.ఎల్. హనుమంతరావు |
| 5. | తెలుగు వీరగాధా కవిత్వము | – ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు |
| 6. | రేనాటి సూర్యచంద్రులు | – ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు |
| 7. | రెడ్డి సంచిక | – శ్రీ వడ్డాది అప్పారావు సంపాదకీయం |
| 8. | కొండవీటి సామ్రాజ్యము | – శ్రీ మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ |
| 9. | రెడ్ల చరిత్ర – సంస్కృతి | – శ్రీ వై.వై. రెడ్డి యానాల |
| 10. | కొండవీటి రెడ్డిరాజులు | – డా॥ ఈమని శివనాగిరెడ్డి |
| 11. | ప్రజాకవి వేమన | – డా॥ యన్. గోపి |
| 12. | శాంతిదూత నాయకురాలు | – వై. హెచ్.కె. మోహనరావు |
| 13. | చిన్నపరెడ్డి వీరగాథ | – ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు |
| 14. | Peasant ..... The President<br>A Biographical Sketch of Dr. Neelam Sanjeeva Reddy | – కంచి సూర్యనారాయణ |
| 15. | కవికోకిల గ్రంథావళి | – శ్రీ దువ్వూరు రామిరెడ్డి |
| 16. | Works of Narla - Volume II | |
| 17. | రెడ్డిరాజ్య సర్వస్వము | – బి.ఎన్. శాస్త్రి |
| 18. | వేయి వెలుగుల వేమన | – రాచపాళెం చంద్రశేఖరరెడ్డి |

ఇవిగాక 60 దాకా రెడ్డి వైభవ పురుషుల స్త్రీల జీవితగాధలు, వార్తాపత్రికలు, ప్రత్యేక వ్యాసాలు – కొండవీడు, మోటుపల్లి, త్రిపురాంతకం, అద్దంకి, శ్రీశైలం స్థల దర్శనాలు.

**రెడ్డి జనాభ్యుదయ సంఘం – ఒంగోలు**



సాలభంజిక, త్రిపురాంతకం,
క్రీ.శ. 14వ శతాబ్దం



మోటుపల్లిలో వీరభద్ర స్వామి

క్రీ.శ. 14వ శతాబ్ది




# రెడ్డి హాస్టల్ - ఒంగోలు

రెడ్డి జనాభ్యుదయ సంఘం, ఒంగోలులో 1994 సం॥లో కీ.శే. శ్రీ వంగా సుబ్బారెడ్డి, కీ.శే. శ్రీ ఈశ్వరాక బలరామిరెడ్డి, శ్రీ పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, శ్రీ బోణాల రామగోపాలరెడ్డి, డా. డి. కోదండరామిరెడ్డి, శ్రీ దేవరపల్లి కృష్ణారెడ్డి వగైరాల ప్రోత్సాహం, సహకారంతో ఆవిర్భవించింది. 100 గదుల స్థలంతో ప్రారంభమై 197 గదులకు విస్తరించింది. అన్ని ప్రాంతాలలోని పేద రెడ్డి విద్యార్థులకు ఉచిత వసతి కల్పించుటకు 2003 సం॥లో రెడ్డి హాస్టల్ భవనం కట్టడం ప్రారంభించి 02-09-2006 వ తేదీన మంత్రి వర్యులు శ్రీ జె.సి. దివాకరరెడ్డి గారిచే ప్రారంభించబడి వదాన్యులు శ్రీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శ్రీ మాలె వెంకట కృష్ణారెడ్డి, శ్రీ మేకపాటి రాజమోహనరెడ్డి వగైరాల వారి సుమారు కోటి రూపాయల ఆర్థిక సహకారం చేకూర్చింది. 2007 సం॥లో 37 మంది విద్యార్థులతో ప్రారంభమైన హాస్టలు నేటికి 135 మంది అన్ని కోర్సుల విద్యార్థులకు వసతి కల్పించింది. నేటికి శ్రీ బోణాల రామగోపాలరెడ్డి గారి అధ్యక్షతన 315 మంది వదాన్య సభ్యులతో సంఘం పనిచేస్తున్నది.